# చరిత్ర

## ఆధునిక విప్లవాలు

ఖండాలు : I - III

B R A O U

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0116

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
1995

BRAOU

# విషయక్రమం


| | | | పుట నెం. |
|---|---|---|---|
| ఖండం - I : | తొలి స్టూవర్ట్‌లు, ప్యూరిటన్ విప్లవం, తదనంతర పరిణామాలు (1603-1688) | | |
| భాగం - 1 : | స్టూవర్ట్‌లు : ఒకటో జేమ్స్, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు | ... | 3 |
| భాగం - 2 : | ఒకటో ఛార్లెస్ : దీర్ఘకాలిక పార్లమెంట్ | ... | 20 |
| భాగం - 3 : | అంతర్యుద్ధం : కామన్‌వెల్త్ సంరక్షక రాజ్యం | ... | 34 |
| భాగం - 4 : | రెండో ఛార్లెస్, పార్లమెంట్ సంబంధాలు | ... | 51 |
| ఖండం - II : | మహోజ్వల విప్లవం, 1688 | | |
| భాగం - 5 : | రెండో జేమ్స్ పాలనా విధానాలు | ... | 65 |
| భాగం - 6 : | పార్లమెంట్ పాత్ర : విలియం, మేరీల పాలన (1688-1702) | ... | 84 |
| భాగం - 7 : | హక్కుల చట్టం : మహోజ్వల విప్లవ ఫలితాలు | ... | 95 |
| ఖండం - III : | అమెరికా స్వాతంత్ర్య సమరం | | |
| భాగం - 8 : | వలసలు | ... | 110 |
| భాగం - 9 : | అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ కారణాలు | ... | 125 |
| భాగం - 10 : | అమెరికా స్వాతంత్ర్య ప్రకటన : ఫలితాలు | ... | 144 |
| భాగం - 11 : | రాజ్యాంగ నిర్మాణం | ... | 160 |
| | పాఠ్యప్రణాళిక | | |
| | మాదిరి పరీక్షా పత్రం | | |
| | అభ్యాసాలు | | |


BRAOU

BRAOU

# ఖండం-I : తొలి స్టూవర్ట్‌లు, ప్యూరిటన్ విప్లవం, తదనంతర పరిణామాలు (1625-1685)

## పరిచయం

ఇంగ్లాండ్ దేశం ప్రపంచ చరిత్రకు అనేక గొప్ప విషయాలను అందజేసింది. వాటిలో ఒకటి, 17వ శతాబ్ది ప్రథమార్థంలో జరిగిన ప్యూరిటన్ విప్లవం. రాజు దైవాంశసంభూతుడనే సిద్ధాంతాన్ని నిరసిస్తూ, రాజుకన్నా ప్రజాప్రతినిధుల సభైన పార్లమెంట్ ప్రధానమైందని, సార్వభౌమాధికారం పార్లమెంట్ ద్వారా ప్రజాబాహుళ్యానికి చెందుతుందనీ, ఈ విప్లవం నిరూపించింది. 1642-1649 మధ్యకాలంలో, ఈ విప్లవం సంభవించింది.

ఈ ఖండంలోని నాల్గు భాగాల్లో, స్టూవర్ట్ రాజులు ఇంగ్లాండ్ సింహాసనాన్నధిష్టించిన పరిస్థితులు; మొదటి స్టూవర్ట్ రాజైన ఒకటో జేమ్స్ (1603-25) పాలనా విధానాలు; అతని మరణానంతరం, 1625లో అధికారానికి వచ్చిన ఆయన కుమారుడైన ఒకటో ఛార్లెస్ (1625-49) అనుసరించిన పద్ధతులు, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు; ఆలివర్ క్రాంవెల్ నాయకత్వం కింద అంతర్యుద్ధం కొనసాగడం; ఛార్లెస్ ఉరితీతానంతరం, దేశంలో 'కామన్ వెల్త్ స్వేచ్ఛారాజ్య' (1649-60) స్థాపన, క్రాంవెల్ మరణానంతరం, 1660లో రాజరిక పునరుద్ధరణ జరిగి, రెండో ఛార్లెస్ (1660-85) అధికారానికి రావడం, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు చర్చించడం జరిగింది. అంతర్యుద్ధం జరగడానికిగల కారణాలు, యుద్ధగమనం, దీని మూలంగా ఇంగ్లాండ్‌లో సంభవించిన రాజకీయ, రాజ్యాంగ పరిణామాలు ఈ ఖండంలోని ప్రధానాంశాలు.

BRAOU

BRAOU

# భాగం-1 : స్టూవర్ట్‌లు: ఒకటో జేమ్స్, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు

విషయక్రమం


1.0 లక్ష్యాలు

1.1 స్టూవర్ట్‌లకు ముందు ఇంగ్లాండ్ పరిస్థితులు

1.2 స్టూవర్ట్ రాజులు - వారి రాజకీయ సిద్ధాంతాలు

1.2.1 దైవాంశ సిద్ధాంతం

1.2.1.1 ప్యూరిటన్ విప్లవానికి ముందు ఇంగ్లాండ్ పరిస్థితులు (1603-40)

1.2.2 మత పరిస్థితులు

1.3 ఒకటో జేమ్స్ (1603-1625)

1.3.1 మత వర్గాల నిరాశ

1.3.2 తుపాకీ మందు కుట్ర

1.3.3 రాజకీయాలు - రాజ్యాంగం

1.4 సంగ్రహంగా

1.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

1.6 ఉపయుక్త గ్రంథాలు


## 1.0 లక్ష్యాలు

ట్యూడర్ రాజుల (1485-1603) తర్వాత, ఇంగ్లాండ్‌ను పాలించిన రాజులు, స్టూవర్ట్‌లు (1603-1714) . వీరి కాలంలో, రాజ్యాంగ సంక్షోభమేర్పడి, పార్లమెంట్‌కు, చక్రవర్తికి మధ్య వివాదాలు తలెత్తాయి. ఈ పాఠంలో స్టూవర్ట్ రాజులు ఎలా అధికారానికి వచ్చారు, వీరికి ట్యూడర్లకుగల వ్యత్యాసం, వీరి రాజరిక సిద్ధాంతాలు, వీరికి పార్లమెంట్‌కు మధ్య ఏర్పడ్డ విభేదాలను మీరు తెలుసుకోగల్గాలి. మొదటి స్టూవర్ట్ రాజైన ఒకటో జేమ్స్ వ్యక్తిత్వం, అతని అభిప్రాయాలు, అతని కాలంలో పార్లమెంట్‌తో తలెత్తిన సంఘర్షణ గూడా, ఈ పాఠంలో వివరించడం జరిగింది. చక్రవర్తి, పార్లమెంట్‌కూడా వ్యతిరేకంగా తలపెట్టి, పేరుగాంచిన తుపాకి మందు కుట్ర, పూర్వాపరాలను గురించి కూడా, మీరు తెలుసుకోగల్గాలి.

## 1.1 స్టూవర్ట్‌లకు ముందు ఇంగ్లాండ్ పరిస్థితులు

17వ శతాబ్దంలో. రాజ్యాంగ సంక్షోభాన్ని కలిగించిన బ్రిటీష్ విప్లవ సమయంలో ఇంగ్లాండ్‌ను పరిపాలించిన స్టూవర్ట్‌లకు ముందు, సింహాసనాన్ని ఆక్రమించినవారు ట్యూడర్లు. 1485 నుండి 1603 వరకు సాగిన ఈ రాజవంశ పాలనాకాలంలో, ఇంగ్లాండ్ అధినేతలుగా ఏడో హెన్రీ (1485-1509),

ఎనిమిదో హెన్రీ (1509-1547), ఆరో ఎడ్వర్డ్ (1547-1553), మేరీ రాణి (1553-1558), చివరగా ఎలిజబెత్ రాణి (1558-1603) అధికారాన్ని చెలాయించారు.

ట్యూడర్ వంశ పాలకులు పరిపాలనలో మిక్కిలి సమర్థులు. నియంతృత్వులైనా, దేశంలో శాంతిభద్రతలను స్థాపించారు. ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు, రక్షణ కల్పించారు. ప్రజాప్రాతినిధ్యం కన్నా మంచి పరిపాలన ప్రధానమని నమ్మిన ట్యూడర్ ప్రభువులు, అదే సిద్ధాంతాన్ని పార్లమెంట్ సభ్యులకు, దేశంలోని న్యాయాధ్యక్షులకు వివరించారు. ట్యూడర్ రాచరిక పటిష్టతకు దోహదం చేసిన సంస్థైన 'ప్రభుత్వ సలహా సంఘం' నుండి దేశంలోని పలుకుబడిగల ప్రభువులను తొలగించి, తనకు అనుకూలమైన వారిని సభ్యులుగా నియమించాడు, ఏడో హెన్రీ. భూస్వాములను వీరు, ఉన్నత పదవులనుండి తొలగించి, వారి స్థానంలో మధ్యతరగతి వారికి మిక్కిలి ప్రాధాన్యతను కల్గించారు. రాజు సలహా మండలి లాగే, అనేక ఇతర సంస్థలను కూడ వీరు స్థాపించారు. స్టార్ ఛాంబర్ న్యాయస్థానం (Star Chamber Court), వేల్స్ మండలి (Council of Wales), ఉత్తర మండలి (Council of North), హైకమీషన్ న్యాయస్థానం (Court of High Commission) లాంటివి ఏర్పడ్డాయి. అందులోని సభ్యులందరూ రాజుకు మాత్రం బాధ్యులు. తుపాకి మందును కనుగొన్న తర్వాత, ప్రభువులపై ఆధారపడ్డ సామాన్య ప్రజలు సైన్యంలో చేరి, రాజుకు సైనిక సహాయం చేసేవారు. ప్రభువుల పలుకుబడిని తగ్గించిన విధంగానే, ట్యూడర్ ప్రభువులు, మతాధికారుల పలుకుబడిని గూడ తగ్గించారు. పార్లమెంట్‌లో మతాధికారుల సభ్యత్వాన్ని తగ్గించారు. తమకు నచ్చిన మతాధికారులను మాత్రమే పార్లమెంట్‌లోని ఎగువ సభైన ప్రభువుల సభకు ఎంపిక చేశారు. దీనికి తోడు, ఎనిమిదో హెన్రీ కాలంలో జరిగిన మత సంస్కరణోద్యమ ఫలితంగా, ఇంగ్లాండ్ రోమన్ కాథలిక్ మతం నుండి, పోప్ అధికార పరిధి నుండి, విడిపోయింది. అంతర్జాతీయ పరిస్థితులు గూడా, ఇంగ్లాండ్‌లో శక్తివంతమైన రాజరిక స్థాపనకు దోహదం చేశాయి. ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా, హంగేరి దేశాల్లో, పటిష్టమైన నిరంకుశ రాచరిక ప్రభుత్వాలు కొనసాగాయి. వీటి మాదిరిగానే, ట్యూడర్లు గూడ నియంతృత్వ ధోరణిలో కొనసాగగలిగారు.

రాజరిక అధికార స్థాపనలో, ఆర్థిక సంపద మిక్కిలి ప్రధానం. ఈ సత్యాన్ని ట్యూడర్లు గ్రహించారు. ఏడవ హెన్రీ కాలం నుండీ వారు పన్నులను సక్రమంగా వసూలు చేయించి, ఖర్చును తగ్గించగలిగారు. స్టార్ ఛాంబర్ న్యాయస్థానం విధించిన అపరాధాల మూలంగా, అమిత ధనం వచ్చేది. ఎలిజబెత్ రాణి స్పెయిన్ దేశపు నౌకలను కొల్లగొట్టడానికి, తన వద్దగల సముద్ర శునకాలుగా *(sea dogs)* గా పేరు పొందిన డ్రేక్, హాకిన్స్ అను నావికా యోధుల నుపయోగించింది. మత సంస్థల అధీనంలోని భూములను, ధనాన్ని, ట్యూడర్లు ఆక్రమించారు. పన్నుల వసూలు విషయంలో, పార్లమెంట్‌పై ఆధారపడక, తమ అధికారాన్ని చెలాయించారు.

ట్యూడర్ పాలనను సామాన్య ప్రజలు సమర్థించారు. ఆ రాజు లందరిని వీరు అభిమానించారు. 1588 లో స్పెయిన్ ఇంగ్లాండ్‌పై నౌకాదళాన్ని పంపినపుడు, ప్రజలు తమ రాణియైన ఎలిజబెత్‌కు అందించిన సహాయసహకారాలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ప్రభుత్వం ఉన్ని పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేసి, వ్యాపారవాణిజ్యాలను అభివృద్ధిపరచిన కారణంగా, మధ్యతరగతి ప్రజలు మిక్కిలి లాభాలు పొంది, ప్రభుత్వానికి పూర్తి మద్దతునివ్వగలిగారు.

ట్యూడర్ రాజులు స్థాపించిన నిరంకుశ పాలన ప్రజావ్యతిరేకమైంది కాదు. ప్రజోపయోగ స్థాపిత పాలన మాత్రమే. పార్లమెంట్ సైతం వారికి అడ్డురాకుండా, తోచిన విధంగా పాలనను కొనసాగించే వీలు కల్పించింది. వారికి గొప్ప సైనిక బలం లేకపోయినా, సామాన్య ప్రజలు అవసరమైనపుడల్లా సైనిక సహాయం చేయడానికి వెనకాడలేదు. సామాన్య ప్రజల సహాయసహకారాలు, ట్యూడర్ రాజులకు ఇచ్చిన వరాలు.

BRAOU

ట్యూడర్ రాజులు పార్లమెంట్‌ను సదా సంప్రదించి, తమకు అనుకూలంగా మలచుకొన్నారు. చట్టాలను రాజే జారీ చేసినా, పార్లమెంట్ అనుమతి నామమాత్రమే. ప్రభుత్వ చట్టాలను రాజు నియమించిన న్యాయవేత్తలే రూపొందించేవారు. కాని, వాటిని పార్లమెంట్ అమలుపరచేది.

ట్యూడర్ పాలనా కాలంలోని విశేషాల్లో ప్రధానమైంది రాజరిక అధికార పెరుగుదల. దానికి ఒక రకంగా భూస్వామ్య విధాన క్షీణత, తుపాకి మందు ఉపయోగానికి రావడం కారణమనవచ్చు. ఈ కాలంలో సంభవించిన సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, వాటివల్ల సామాన్య ప్రజల్లో చైతన్యం ఏర్పడ్డం, ఇదే కాలంలో భౌగోళిక విజ్ఞానం పెరగడం గూడ గమనించ దగ్గది. తూర్పుదేశాలకు సముద్రమార్గాన్ని కనుగొనడం, అమెరికా ఖండాన్ని కనిపెట్టడంతో బాటు, శాస్త్రీయ విజ్ఞానం పెంపొందింది. అనేక శాస్త్రీయ పరికరాలను కనుగొన్నారు. మధ్యధరా తీరానికి మాత్రమే పరిమితమైన విదేశీ వ్యాపారం, అట్లాంటిక్, పసిఫిక్ తీరాలకు మారింది. నౌకా బలంలో ఇతర దేశాలతో బాటు, ఇంగ్లాండ్ కూడా ముందంజ వేయగలిగింది. 1600ల్లో, తూర్పు ఇండియా కంపెనీ స్థాపితమైంది. ఇది ఉత్తరోత్తర, భారతదేశంలో బ్రిటీష్ పరిపాలనా స్థాపనకు దారితీసింది.

ట్యూడర్ రాజులు తమ అధికార విస్తరణకు, వైవాహిక సంబంధాలను గూడా, ఉపయోగించగలిగారు. ఏడో హెన్రీ తన కుమార్తె మార్గరెట్‌ను, స్కాట్‌లాండ్ రాజుకిచ్చి, వివాహం చేశాడు. తన మొదటి కుమారుడైన ఆర్థర్‌కు, స్పెయిన్ రాకుమార్తైన కాథరిన్‌తో వివాహం చేయించాడు. 16 ఏండ్ల ఆర్థర్, వివాహమైన కొద్ది నెలల్లోనే మరణించగా, స్పెయిన్‌తో సంబంధాలను కొనసాగించాలనే ఉద్దేశంతో, కాథరిన్‌ను తన రెండో కుమారుడైన ఎనిమిదో హెన్రీతో పునర్వివాహం జరిపించాడు. తర్వాతి తరంలో, స్పెయిన్ రాజైన రెండో ఫిలిప్, ఎనిమిదో హెన్రీ కుమార్తైన మేరీని వివాహమాడాడు. ఆమె మరణానంతరం ఫిలిప్, మేరీ చెల్లెలైన ఎలిజబెత్ రాణిని వివాహమాడదలచాడు కాని, ఎలిజబెత్ దీని కంగీకరించలేదు. అంతర్జాతీయంగా, ఇంగ్లాండ్ పేరుప్రతిష్టలు పెంపొందడానికి, ట్యూడర్లు దృఢ లక్ష్యంతో కృషిచేశారు.

ట్యూడర్ రాజుల పాలనాకాలం, భాషా వాఙ్మయాల అభివృద్ధికి గూడా పేరుగాంచింది. వీరు దేశానికి శాంతిని ప్రసాదించి, ఆర్థిక ప్రగతికి దోహదం చేసిన కారణంగా, ఆంగ్ల వాఙ్మయం వికాసాన్ని పొందగలిగింది. ట్యూడర్‌ల కాలం ఒక విధంగా ఆంగ్ల వాఙ్మయాభివృద్ధికి స్వర్ణయుగమని చెప్పవచ్చు. మొదటి ఎలిజబెత్ కాలంలోని విలియం షేక్‌స్పియర్ ఆంగ్ల భాషకు ఎనలేని కీర్తిప్రతిష్ఠల్ని తెచ్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, ట్యూడర్ రాజుల కాలంలో ఇంగ్లాండ్ దేశం, సర్వతోముఖాభివృద్ధిని సాధించింది. ప్రజలకు ఆ రాజవంశం గర్వకారణమైంది.

## 1.2 స్టూవర్ట్ రాజులు - వారి రాజకీయ సిద్ధాంతాలు

ట్యూడర్ వంశం తర్వాత అధికారానికి వచ్చిన రాజ వంశం, స్టూవర్ట్. వీరు స్కాట్‌లాండ్‌కు చెందినవారు. వీరి పాలనాకాలానికి, ట్యూడర్ కాలానికి ఎంతో వ్యత్యాసముంది. ట్యూడర్ల కాలంలో సహాయసహకారాన్నందించిన పార్లమెంట్‌తో స్టూవర్ట్ రాజులు ఢీకొని, కడపటికి యుద్ధానికి దిగారు. జరిగిన అంతర్యుద్ధంలో పార్లమెంట్ నెగ్గడం, ప్రజాస్వామ్య విలువలు పెరగడం, రాజు నిరంకుశాధికారం తరగడానికి దారితీసింది. పార్లమెంట్ విజయం ప్రజల విజయమే.

స్టూవర్ట్ రాజుల పాలనా కాలంలో బ్రిటీష్‌వారు విదేశీ ప్రమేయం లేకుండా, తమంత తాముగా ఒక ప్రత్యేక పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని అభివృద్ధి చేసుకోగలిగారు. స్థానిక పరిపాలనా విధానాన్ని

ఉద్యమం చేసుకొని, [illegible], వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గౌరవించ గలిగారు. ఇది అప్పటి సమకాలీన యూరోపా ఖండంలోనే, ఊహించలేనంత [illegible] ఇతరులకు ఆదర్శప్రాయమైంది. ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ వంటి దేశాల్లో [illegible] కొనసాగిన సమయంలో, ఇంగ్లాండ్‌లో పార్లమెంట్, అందులోనూ [illegible] సభ (House of Commons), దేశాన్ని పాలించే అధికారాలు అన్నింటినీ పొందగలిగింది. [illegible] పద్ధతిని అవలంబించి, రాజరిక వ్యవస్థ అధికారం నుంచి క్రమేణా [illegible], వ్యక్తి [illegible] సిద్ధింపజేసింది.

[illegible] (Thirty Years' War, 1618-1648), [illegible] అభివృద్ధి చెందింది. [illegible] ఇంగ్లాండ్ [illegible] (U.K) రూపొందడం జరిగింది. [illegible] అమెరికాలో బ్రిటిష్ వలస [illegible]

స్టువర్ట్‌ల పాలనాకాలం [illegible] ప్రసిద్ధి చెందింది. 17వ శతాబ్దం [illegible] 1603 నుంచి 1714 వరకు [illegible] పరిపాలనా కాలాన్ని, [illegible] ప్రధాన కారణం, పార్లమెంట్ అధికార [illegible] పార్లమెంట్ కొంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. పార్లమెంట్ [illegible] ఇంగ్లాండ్ [illegible] నాలను తెగతెంపులు చేసుకొంది. [illegible] పార్లమెంట్ [illegible] తిరస్కరించింది. పార్లమెంట్ [illegible] (Act of Uniformity), [illegible] (Act of Supremacy)ను [illegible] పార్లమెంట్ [illegible] పార్లమెంట్, స్టువర్ట్‌ల [illegible] పార్లమెంట్‌కు [illegible] పార్లమెంట్‌ను [illegible] పార్లమెంట్ [illegible] స్టువర్ట్ రాజులు [illegible] ఫలితంగా, [illegible]

## 1.2.3 దైవాంశ సిద్ధాంతం

[illegible]

[illegible] చెప్పలేదు [illegible]. అందుకే ప్రజల ప్రమేయం లేదు. దానికి దృష్టాంతంగా [illegible], [illegible] మరణానంతరం మార్గరెట్ [illegible] బ్రిటిష్ సింహాసన వారసత్వానికి [illegible], [illegible] 1603లో ఇంగ్లండ్ సింహాసన [illegible]. [illegible]

ఒకటో జేమ్స్, అతని కుమారుడు ఒకటో ఛార్లెస్, రాజరికాన్ని విస్తరించి, దాన్ని [illegible] నాశనం చేశారు. [illegible] ఒకటో జేమ్స్ [illegible] ఒకటో జేమ్స్ [illegible] "[illegible] ప్రకారం నడుచుకోవాలి. [illegible]" [illegible] పార్లమెంటు [illegible] అని గర్వంగా [illegible].

ఆనాటి సమకాలీన బ్రిటిష్ రచయితలు కొందరు, [illegible] సమర్థిస్తూ రచనలు చేశారు. ఫిల్మర్ అనే రచయిత, [illegible] అన్నాడు: "[illegible] దేవుని [illegible] ఉంటారు". [illegible] స్వేచ్ఛా [illegible] వారి [illegible], [illegible] స్వాతంత్ర్యాలను కూడా [illegible]. [illegible] ఉన్న కొత్త అర్థాలను ప్రజలు వర్తింపచేశారు. రాజు నిరంకుశత్వాన్ని విడిచి ప్రశ్నించ నారంభించారు. ఇది విప్లవానికి దారితీసింది.

పార్లమెంట్‌తో స్టూవర్ట్ రాజులు తగాదా పడ్డానికి మరొక కారణం, వ్యాపార విషయాల్లో [illegible] అధికారం. రాజు దేశీయ, విదేశీయ వ్యాపారంపైన అధికారం ప్రత్యేకంగా తనదేనని [illegible]. వ్యాపార సుంకాలను విధించడం [illegible]. దేశం లోని వర్తకులు వ్యతిరేకించినా, స్టూవర్ట్ రాజులు సుంకాలను వసూలు చేయడాన్ని కొనసాగించారు. [illegible] సమర్థించారు. ప్రజలు కూడా, ప్రైవేట్ [illegible] గుత్తాధిపత్య నిర్ణయాన్ని [illegible]. కాని, ఒకటో జేమ్స్ దీన్ని ఖాతరు చేయలేదు. ఈ విధంగా చాలా పలుకుబడిగల వ్యాపారి వర్గంతో స్టూవర్ట్ రాజులు [illegible], వారి సహాయసహకారాలను కోల్పోయారు. వ్యాపార వర్గం వారు రాజుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌తో చేతులు కలిపి, విప్లవ సమయంలో రాజుకు బద్ధ [illegible].

[illegible] స్టూవర్ట్ రాజులు ప్రజల ఆగ్రహానికి [illegible]. [illegible]

జరిగింది. ఆది వారాల ప్రార్థనా సమయాల్లో, రాజు దైవాంశసంభూతుడనే సిద్ధాంతాన్ని బాహ్యంగా ప్రచారం చేసేవారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రభువుకు పన్నులు చెల్లించి, ఊడిగం చేయాలనేవారు. ఇది సామాన్య ప్రజలకు అమిత అసంతృప్తిని కల్గించింది. కాని, ఆ సమయంలో ప్రజలు దాన్ని ఎదిరించలేక, సమయం కోసం వేచి ఉండడం జరిగింది.

స్టూవర్ట్ రాజులు అనుసరించిన విదేశీ విధానాన్ని కూడా, బ్రిటీష్ పార్లమెంట్, ప్రజలు ఎదిరించారు. కొన్ని సందర్భాల్లో బ్రిటీష్‌వారి జాత్యభిమానాన్ని కించపర్చే విధంగా కూడా రాజులు నడచుకోవడం జరిగింది. ఒకటో జేమ్స్ రాజు, స్పెయిన్ పట్ల రాజీ ధోరణికి దిగాడు. 1604 లో స్పెయిన్‌తో యుద్ధాన్ని నిలుపుజేసాడు. అంతవరకు పరవాలేదు. కాని, 1618లో ముప్పదేండ్ల సంగ్రామం (Thirty Years' War) చెలరేగగా, బ్రిటీష్ ప్రజలు, అల్లుడైన ఫ్రెడరిక్‌కు సహాయపడి, స్పెయిన్‌ను ఓడించడానికి, తమ రాజు ఒకటో జేమ్స్ ప్రయత్నించాలని కోరారు. కాని, దీనికి భిన్నంగా, అతడు స్పెయిన్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోడానికి తయారయ్యాడు.

మొదటి ఛార్లెస్ అధికారానికి వచ్చిన తర్వాత, పార్లమెంట్ అతనికి టన్నేజ్, పౌండేజ్ సుంకాల వసూలుకు అనుమతి నిరాకరించింది. అతడు పార్లమెంట్ నియమావళిని పాటిస్తానని వాగ్దానం చేసినా, హక్కుల పత్రాన్ని (Petition of Rights) అతడు ఉల్లంఘించాడు. 1629లో అతడు తన మూడో పార్లమెంట్‌ను రద్దుపర్చి, దాదాపు పదకొండు ఏండ్ల పాటు, దాన్ని సమావేశపర్చలేదు. ఆకాలంలోనే అతడు, తన వ్యక్తిగత పాలనలో, పార్లమెంట్ అనుమతి లేకుండా పన్నులు విధించాడు. పాత పన్నులను పునరుద్ధరించాడు. జరిమానాలు విధించి, కర్కశంగా వసూలు చేయించాడు. స్టార్ ఛాంబర్ కోర్ట్, హింసించే సాధనంగా రూపొందింది. ఓడ పన్ను (Ship Money) అనే పన్ను మూలంగా, అమిత మొత్తాలను వసూలు చేశాడు.

ఒకటో ఛార్లెస్, స్కాట్‌లాండ్‌పై ఇంగ్లాండ్ చర్చి అధికారాన్ని స్థాపింప చేశాడు. ఇది నచ్చని స్కాట్‌లాండ్ ప్రజలు ఇంగ్లాండ్‌ను ఎదిరించి, రాజు ఛార్లెస్‌ను ఓడించారు. ఛార్లెస్ పెద్ద మొత్తాలను స్కాట్‌లాండ్‌కు చెల్లించేట్లు వాగ్దానం చేశాడు. వాగ్దానం చేశాడేగాని, చాలినంత ధనం తన వద్ద లేక, పన్నుల మూలంగా వసూలు చేయాల్సి వచ్చింది. అందుకై, పార్లమెంట్‌ను సమావేశపర్చడమైంది. 1640లో ఆ విధంగా సమావేశమైన పార్లమెంట్, రాజ్యాంగ కలతలకు గురై, రాజుతో ఘర్షణకు దిగింది. దేశంలో అంతర్యుద్ధం ప్రబలి, 1649 లో ఒకటో ఛార్లెస్ శిరచ్ఛేదనకు దారితీసింది.

### 1.2.1.1 ప్యూరిటన్ విప్లవానికి ముందు ఇంగ్లాండ్ పరిస్థితులు (1603-1640)

ఇంగ్లాండ్ దేశం ఒక దీవి. 16, 17 శతాబ్దాల్లో దీని భౌగోళిక స్వరూపం, దేశ చరిత్రపై గొప్ప ప్రభావాన్ని చూపింది. విప్లవానికి ముందు దాదాపు ఒకటిన్నర శతాబ్ది కాలం, ఐరోపా అశాంతి, అలజడులకు ఆలవాలమైంది. కాని, ఇంగ్లాండ్‌లో శాంతి నెలకొంది. దేశ రక్షణ, పటిష్టతకు, నౌకాదళం ఉపయోగమైంది. 1603 తర్వాత, స్కాట్‌లాండ్‌తో సంబంధం ఉన్న సరిహద్దును సంరక్షించాల్సిన అవసరం లేకపోయింది. దేశంలో జలమార్గాలు అనేకం ఉండేవి. అందుచే లండన్‌లాగే యార్క్, నాటింగ్‌హామ్, ష్రూస్‌బరీ, స్ట్రాట్‌ఫోర్‌ఆన్, పీటర్‌బరో, హెర్ట్‌ఫోర్డ్, బెడ్‌ఫోర్డ్, కేంబ్రిడ్జ్ వంటి నగరాలన్నీ, ప్రధాన రేవు పట్టణాలుగా వెలిశాయి. కాని, ప్రభుత్వ విధానాలు, సాంఘిక వ్యత్యాసాలు కలసి, ఇంగ్లాండ్‌కు గల ప్రకృతిసిద్ధమైన సౌకర్యాలను పోగొట్టాయి. 1627 లో ఉదాహరణకు, గ్లాసెస్టర్ (Gloucester) నగరం తన రేవులో ప్రవేశించిన ప్రతి నౌకపై సుంకాలను విధించే అధికారాన్ని, ప్రభుత్వం నుండి పొందింది. పలుకుబడిగల ప్రభువులు స్వప్రయోజనాల దృష్ట్యా, జలమార్గాల అభివృద్ధిని నిరోధించ గలిగారు. 1640 తర్వాత, ప్రభువుల ప్రాముఖ్యం తగ్గనారంభించిన తర్వాతనే, దేశంలోని రాకపోకల సౌకర్యాలు అభివృద్ధిచెందాయి.



BRAOU

1640 ముందు గల శతాబ్దంలో, ద్రవ్యోల్బణం పెచ్చు పెరిగింది. గోధుమల ధర దాదాపు ఆరింతలైంది. దేశంలో అధిక సంఖ్యాకులు వ్యవసాయంపై ఆధారపడేవారు. మంచి నేర్పుతో వ్యాపారం కొనసాగించినవారు, గొప్ప ధనవంతులైనారు. న్యాయవాదులు గూడా ధనవంతులుగా, పలుకుబడిగలవారిగా కొనసాగారు. రాజు అధీనంలోను, చర్చి అధీనంలోను గల భూములు, క్రమంగా ప్రజల హస్తగతమౌతూ వచ్చాయి. అందుచేత, మధ్యతరగతి వర్గం ఆర్థికంగా బాగా ఎదిగి, అనేక ఉన్నత పదవులేగాక, పార్లమెంట్ లో గూడ అనేకులు సభ్యులయ్యారు. మారుతున్న పరిస్థితులను వివరించడానికి 1628లో ఒక మత ప్రతినిధి " పార్లమెంట్‌లోని కామన్స్ సభ, ఎగువ సభను మూడింతలతో కొనగలదు" అని చెప్పిన మాటలు మనకీ సందర్భంలో పరమ ప్రమాణం.

దేశంలో ఎన్‌క్లోజర్ (Enclosure) ఉద్యమం కొంత తగ్గుముఖం పట్టినా, ఇది విస్తృతంగానే కొనసాగింది. ఉన్ని ఉత్పత్తికై, గొర్రెల పెంపకం అవసరం. భూములను మేత భూములుగా (grazing fields) మార్చడం మూలాన, కౌలుదార్లు జీవనోపాధి కోల్పోతారు. కాబట్టి, జన క్షీణత జరుగుతుందని, ఎన్‌క్లోజర్‌ను నిరుత్సాహపరచాలని అనేకులు వాదించారు. కాని, ప్రభుత్వం దాని గురించి అంతగా పట్టించుకోలేదు. అడవి భూములు గూడ విరివిగా వ్యవసాయ యోగ్యం అయ్యాయి. రాజు అధీనంలోని అడవులపై, ఆక్రమణలు గూడ కొనసాగాయి. ప్రొఫెసర్ ట్వానీ (Twany) "దేశంలో పెట్టుబడిదారీ వ్యవసాయం పెరిగినందుకే, అడవులపై పోరాటం పెరిగింది" అన్నాడు. బంజరు భూముల స్వాధీనం కూడా, క్రాంవెల్ తర్వాత విరివిగా కొనసాగింది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకంగా మార్పులు వచ్చేంతవరకు, ఇంగ్లాండ్ ఆర్థికంగా ఒక వెనుకబడ్డ దేశంగానే కొనసాగింది.

దేశంలో పరిశ్రమలు త్వరితంగా అభివృద్ధి చెందాయి. బాగా ఉత్పత్తి పెరగడం, దీనికి ప్రధాన కారణం. దీనికి తోడు, మంచి జలమార్గాలున్న కారణంగా, 1640 నాటికి ఐరోపాలో ఉత్పత్తైన మొత్తం బొగ్గు కన్న, మూడింతల బొగ్గు, ఇంగ్లాండ్‌లోనే ఉత్పత్తి అయ్యేది. బొగ్గు సరసమైన ఇంధనం కాబట్టి, దేశంలో పారిశ్రామిక ప్రగతి త్వరితంగా విస్తరించింది. పరిశ్రమలకు పెద్ద మొత్తాల పెట్టుబడి అవసరమైంది. బొగ్గు గనుల తవ్వకమే అధిక పెట్టుబడులపై ఆధారపడింది. ఇటుకలు, సబ్బులు, గాజు, పంచదార, సారా మొదలైన వాటిని తయారుచేయడం, పెట్టుబడిదారీ వ్యవస్థ భాగమే. ఒకటో జేమ్స్ పాలనా కాలంలో, ఒక లండన్ సారా ఉత్పత్తి సంస్థ, 10వేల పౌన్ల పెట్టుబడి పెట్టింది. (ప్రస్తుతం ఒక పౌను ముప్పైయైదు రూపాయలకు సమానం). చిన్న చిన్న చేతిపనివారు, గని కార్మికుల స్థాయినుండి, పరిశ్రమలు ఎదిగిపోయాయి. లండన్ పెట్టుబడిదారుడు లేక ఔత్సాహికుడైన భూస్వామి, ప్రధాన పాత్ర వహించాడు. ఈ మార్పుల వల్ల, లండన్ అమిత లాభాన్ని పొందింది. దేశీయమైన మార్కెట్లు పెంపొందిన కారణంగా, 1600 నాటికి లండన్ నగరం, ఎనిమిదింట ఏడువంతుల బ్రిటీష్ వ్యాపారాన్ని కొనసాగించింది. తర్వాత నలభై ఏండ్లలో బట్టల ఎగుమతి దాదాపు ఐదింతలు పెరిగింది. దేశంలోని పరిశ్రమల అభివృద్ధికి, లండన్ పెట్టుబడిదారులు అధిక మొత్తాలను అందజేశారు. నగరం ఈ విధంగా, యిదే సమయంలో, అతి త్వరగా, బాగా విస్తరించింది. 1605 - 1661 మధ్య కాలంలో, లండన్‌లో ఆహార ధాన్యాల వినియోగం రెండింతలైంది. 1640 నాటికి దేశంలోని అధిక సంపన్ను లందరూ దాదాపు లండన్ నగరవాసులే. లండన్ నగర ఆర్థిక ప్రాధాన్యత, ఐరోపాలోనే ఒక ప్రత్యేకతను సంపాదించుకుంది. ఆర్థిక ప్రాధాన్యత మూలంగా, లండన్ రాజకీయంగా కూడా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. అంతకుముందే దేశంలో సంచార న్యాయస్థానాలు, శాశ్వతంగా లండన్‌లో నిల్చిపోయాయి. అన్ని పాలనా విభాగాలు, లండన్ లోని వైట్ హాల్ (White Hall శ్వేత భవనం) లో ఏర్పాటయ్యాయి. లండన్ నగరంలోని ముద్రణాలయాలు, దేశమంతటికి తమసేవల నందించాయి. లండన్ వ్యాపారులు తమ సొంత ప్రాంతాల్లో పాఠశాలలను స్థాపించి, ఉపకార చేతనా లిప్పించి, మత ప్రచారాన్ని సాగించారు. అక్కడి వారి, విద్యా, వైజ్ఞానిక స్థాయిలను

పెంపొందించ ప్రయత్నించారు. రాను రాను పెట్టుబడికి, మార్కెట్లకు, ఖరీదైన విదేశీ వస్తువులకు, లండన్ పై అందరి దృష్టి పడింది. అంతర్యుద్ధ సమయంలో, లండన్‌లోని పెద్ద పెట్టుబడిదార్లు, వర్తక ప్రముఖులు, ప్రధాన పాత్ర వహించడం గమనించ దగ్గది.

### 1.2.2 మత పరిస్థితులు

బ్రిటీష్ విప్లవాన్ని "ప్యూరిటన్ విప్లవమని" గూడ పిలవడానికి, మతం వహించిన పాత్ర ప్రధాన కారణం. ఈ నాటి చరిత్రకారులు, సాంఘిక, రాజకీయ కారణాలకు ప్రాధాన్యతనిచ్చినా, సమకాలీన కాలంలో మతం మిక్కిలి ప్రధాన పాత్ర వహించిన మాట వాస్తవం. ప్రొఫెసర్ టౌనే (Towney) రచించిన "మతం - పెట్టుబడిదారీ ఆవిర్భావం" ( Religion And the Rise of Capitalism) అనే గ్రంధం, ప్యూరిటన్ మత ఆలోచనాసరళి, పెట్టుబడిదారీ వ్యవస్థ పెంపుదలకు దోహదం చేసిన విషయాన్ని నిరూపిస్తుంధి. 17వ శతాబ్దంలో మతం ప్రజా జీవన విధానాల్లో, ఈనాడు మనం ఊహించలేనంతగా ప్రభావం చూపింది. ప్రతి ఒక్కరు ఆదివారం చర్చికి హాజరై, ప్రార్థనల్లో పాల్గొనాలి. అలా చేయకపోతే, అపరాధ రుసుము చెల్లించాల్సి తీరాలి. మతపరమైన సుంకాన్ని (Tithe) తప్పని సరిగా చెల్లించాలి. ఇది, ఫలసాయంలో దాదాపు పదవ వంతు. మత న్యాయస్థానాలకు అన్ని అధికారాలు ఉండేవి. దేశంలోని ధనవంతులు అధిక మొత్తాలను చెల్లించి, ఈ న్యాయస్థానాల బారినుండి కాపాడుకొనేవారు. కాని, సామాన్య ప్రజలు అనేక బాధలకు గురయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లో చర్చి కేవలం, మరే విషయాలకూ పరిమితం గాకుండా సాంఘిక జీవన విధానంలోని అన్ని విషయాలలోను జోక్యం చేసుకునేది. ఆ ప్రాంతాల పరిరక్షణకై, తగిన రక్షక దళానికి, సైనిక శిక్షణ చర్చి ఆవరణలో కొనసాగేది. భూమికి సంబంధించిన పత్రాలను, చర్చిలో భద్రపర్చేవారు. మతాధికార్లే గ్రామ పాలకులు. కరువు కాటక సమయాల్లో ఉపాధి కల్పన వారే చేసేవారు. అపరాధులను శిక్షించడంగూడ, వారి వంతే. 1620లో ఒకటో జేమ్స్ కాలంలో దేశం లోని స్త్రీలు వెడల్పైన టోపీలను ధరించడాన్ని, తమ జుట్టును కురచగా కత్తిరించుకోడాన్నీ నిరసిస్తూ, ప్రచారం చేయువలసిందిగా లండన్ బిషప్‌ను కోరారు. ఒకటో ఛార్లెస్ కాలంలో మత ప్రవచనాలతో బాటు, రాజకీయ ప్రయోజనాల సూక్తులు గూఢ, ప్రజలకు బోధించడం జరిగేది. ఉదాహరణకు, 1626 లో ప్రజలు రాజుకు ఆర్థిక మద్దతును నిరాకరించడం మహాపరాధమనే విషయాన్ని మత గురువులను బోధించమని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇంగ్లాండ్‌లో ప్రబలిన ప్రొటస్టెంట్ మతంలో ఒక భాగం, ప్యూరిటన్ మతం. భూత వైద్యం, బాణామతి అద్భుతాలు చేయడం వంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ప్యూరిటన్ మతస్థులు శాస్త్రీయాలోచనల మూలంగా, సద్గుణ ప్రధానమైన నడవడిక ఆవశ్యకతను చాటి చెప్పారు. సనాతన మతంలో చోటుచేసుకున్న దుస్సంప్రదాయాల ఊబినుంచి గట్టెక్కి, పారిశుద్ధ్యం పొందిన వారిగా పరిగణితులైనందువల్లే వీరికి 'ప్యూరిటన్' అనే పేరువచ్చింది. వీరు ఆడంబరాలను గర్హించి, పౌర స్వాతంత్ర్యాన్ని గాఢంగా కాంక్షించారు. ఆనాడు పేరు పొందిన పిమ్, మిల్టన్ (Milton), కార్ట్‌రైట్ (Cartwright) క్రాంమ్‌వెల్ (Cromwell) మొదలైన వారందరూ, ప్యూరిటన్ భావ ఉద్యమానికి చెందినవారే. ప్యూరిటన్‌లు బైబిల్ పఠనానికి ప్రాముఖ్యాన్నిచ్చారు. దీన్ని జాతీయ విద్యగా ఎంపికచేశారు. వ్యక్తిగత బైబిల్ పఠనం, దానికి అనువైన వ్యాఖ్యను తామే ఇవ్వడానికి ఉత్సాహం చూపినందువల్ల, ఇంగ్లాండ్‌లో శతాధిక విభాగాలు, వేల సంఖ్యలో సిద్ధాంతాలు రూపొందాయి. ఇది, బ్రిటీష్‌వారి భావ స్వేచ్ఛకు దారితీసింది. బైబిల్ ఇంగ్లాండ్‌లో వ్యక్తిగత భావ వ్యాప్తిని, ఆచరణను ప్రోత్సహించింది.

ప్యూరిటన్ మతాన్ని కేవలం ఒక మత విధానమనడానికి వీల్లేదు. 1600 నుండి 1640 వరకు, పార్లమెంట్‌లోని నాయకులు, దేశం లోని కుటిల రాజకీయాలను ఎదిరించి, ఆనాటి దురాచారాలను దుయ్యబట్టి, సామాన్య ప్రజాప్రతినిధులుగా నీతి నిజాయితీలకు ప్రాధాన్యతనిచ్చి, రాజుకు ఎదురు తిరిగారు. అట్టి నాయకులైన, ఇలియట్, హేంప్‌డన్, పిమ్ వంటి వారందరూ, ప్యూరిటన్‌లే. ప్రజలు తమకు తాము అశ్లీలతకు దూరంగా ఉండాలని, సదా మత గ్రంథాల పఠనం అవసరమనీ, బోధించిన ప్యూరిటన్ మతం, జాతీయక్రీడల్ని, ఉత్సవాలను ప్రోత్సహించింది. వీటి మూలంగా, దేశంలో నూతన చైతన్యం వెల్లివిరిసింది. అట్టి ఉత్సవాల నిర్వహణ, వాటి స్థల నిర్ణయం, ప్రజలకు స్థానికంగా పాలనా విషయాల్లో తర్ఫీదు నివ్వడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదం చేశాయి.

ప్యూరిటన్‌లకు ఉదాత్తమైన నిజాయతీ ఉంది. వారు నీతిబద్ధమైన జీవిత విధానాలకు, నిస్వార్థ సంఘసేవకు ప్రాముఖ్య మిచ్చారు. వీరి మత గురువులు ఆధ్యాత్మిక సమానతను బోధించారు. ఒక మంచి వ్యక్తికి మరో వ్యక్తికి వ్యత్యాసం లేదు. ఒక పెద్ద మతాధికారో, లేక ఒక రాజుకన్న గూడ, అతడు మిన్న. మానవులు నిజాయితీతో మత సూక్తులను పాటించినట్లైతే చెడు మార్గాలను అనుసరించలేరని, దేవుని ఎడ, దీనికన్న పెద్ద త్యాగాలు లేవనీ, వారు చాటారు. ఆచార్య హల్లర్ (Haller) అన్నట్లు వీరి సిద్ధాంతాలు, ప్రజలకు అన్యాయాన్ని నిర్మొహమాటంగా ఎదుర్కొనేందుకు తగు సత్తాను, ధైర్యాన్ని ప్రసాదించాయి. ప్యూరిటన్ మతం పోరాటాన్ని కొనసాగించేందుకు స్ఫూర్తిని కలిగించింది. సాంఘిక అవగాహనగలవారికి, ఆనాటి దుస్థితులను చక్కబెట్టాలని గాఢ వాంఛగల వారందరికీ, ప్యూరిటన్ మత విధానాలు బాగా ఉత్తేజాన్ని కల్గించాయి.

అంతర్యుద్ధానికి కొన్ని దశాబ్దాల ముందుగా, ఆర్థికరంగంలోలాగే వాఙ్మయాభివృద్ధి విషయంలో కూడా, మార్పు గోచరిస్తుంది. జార్జిహెర్బర్ట్, నికొలస్ ఫెర్రర్ (Nicholas Ferrar) వంటి రచయితలు, రాబోయే దుమారాన్ని పసిగట్టి, తమ పరిపాలనా పదవుల నుండి తప్పుకున్నారు. సంఘంలో మేధావులకు కలిగిన జుగుప్సను, బెర్టన్ (Berton) అనే రచయిత తన రచనల్లో ఎత్తిచూపాడు. రాజకీయాలు, మతానికి మధ్య పొడసూపిన పరోక్ష వివాదాలను సూచన ప్రాయంగా మిల్టన్, తన కోమస్ *(Comus)* లోనూ, లిసిడస్ *(Lycidas)* అనే గ్రంథంలోనూ వివరించాడు. 1641 నాటికి అతడు బహిరంగంగా రాజకీయ విధానాలను విమర్శించాడు. రచయితల పట్ల విధించిన నిషేధాలు, "దేశంలోని శాస్త్రీయ దృక్పథాన్ని, నిష్పాక్షిక విమర్శనా దృష్టిని బందీ చేశాయి" అని కొద్దిమంది రాశారు. దీని కారణంగా, అనేక ఆంగ్లేయ రచయితలు ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. విప్లవం సమీపించే కొద్దీ, ప్రభుత్వ నిఘా (Censorship) విధానాలు మరింత కట్టుదిట్టం అయ్యాయి. నాటకాలు ప్రదర్శించడానికి గూడా, నిషేధాజ్ఞలుండేవి. మతాన్నీ, ప్రభుత్వాన్నీ, కించబర్చే ఏనాటకాన్నీ, అనుమతించేవారు కాదు.

1641 ముందు పరిస్థితులు ఎలా ఉన్నాయో, 1660 తర్వాత కూడా, అలాగే ఉన్నాయి. దేశీయ వార్తలు ఎటువంటివైనా సరే ప్రచురించడం, చట్టబద్ధంగా నిషేధించడం జరిగింది. ఆరోజుల్లో వార్తా పత్రికలు లేవు. ప్రత్యేక పంపిణీకై, కొన్ని వార్తాపత్రాలుండేవి. కాని, అవి మిక్కిలి ఖరీదైనందువల్ల, ఉన్నత వర్గాలవారికి మాత్రమే అందుబాటులో ఉండేవి. అందుచేత, మత ప్రచార వేదికలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 1637 లో ఒక ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం లండన్ నగరంలోని ముద్రణాలయాలు ఇరవైకి తగ్గించడం జరిగింది. విదేశాలనుండి దిగుమతైన గ్రంథాలను మత గురువులు పరీక్షించినగాని, వాటిని విక్రయించేందుకు అనుమతించేవారుగాదు. వార్తాపత్రికలు, సాహిత్యం విషయాల్లోనేగాక, సంగీతం, చిత్రలేఖనం, వాస్తుశాస్త్రం వంటి కళలు గూడ, రాజరిక అధికారాన్ని ప్రజలపై రుద్దడానికి, ప్రజలను మభ్యపెట్టడానికి, ఉపయోగమయ్యాయి. ఆనాటి రాజులు, రాణులు, వారి కుటుంబ సభ్యుల చిత్రపటాలను, లేని అందాలను ఆపాదించి, ఎంతో వ్యయంతో వేయిం

చారు. రాజరిక నిరంకుశ అధికారాలు కొట్టవచ్చేట్లుగా భవన నిర్మాణాన్ని చేసేవారు. ప్రజలపై అపరాధ రుసుములను విధించి, ఆ ధనంతో భవనాలు నిర్మించి, చర్చిలను బాగుచేయించేవారు. ఒకటో ఛార్లెస్ రాజు నాటి అనేక భవనాలు, వసూళ్ల మూలంగా నిర్మించినవే. అలాంటి ప్రభుత్వ చర్యలు, విప్లవానికి ప్రత్యక్ష కారణాలయ్యాయి.

## 1.3 ఒకటో జేమ్స్ (1603 - 1625)

1603 మార్చి 24వ తేదీ వేకువ జామున, బ్రిటీష్ రాణి ఎలిజబెత్ మరణించింది. ఆమెతో ట్యూడర్ వంశం అంతరించింది. ఆమె తర్వాత ఇంగ్లాండ్‌ను పాలించినవారు, స్టూవర్ట్‌లు. స్కాట్ లాండ్ రాజైన ఆరో జేమ్స్ (James VI), ఇంగ్లాండ్‌కు ఒకటో జేమ్స్‌గా పట్టాభిషిక్తుడైనాడు. అతని తల్లి మేరీ, ఇంగ్లాండ్‌లో మొదటి ట్యూడర్ రాజైన ఏడో హెన్రీ కుమార్తె మార్గరెట్ సంతతికి చెందింది. తండ్రి డార్న్లీ ప్రభువు (Lord Darnley). అతనితో, స్టూవర్ట్ వంశ పాలన ప్రారంభమైంది. మొదటి నలుగురు స్టూవర్ట్ రాజులైన ఒకటో జేమ్స్, ఒకటో ఛార్లెస్, రెండో ఛార్లెస్, రెండో జేమ్స్ పాలనాకాలాన్ని, ఇంగ్లాండ్ చరిత్రలో అతి ముఖ్యమైందిగా పరిగణింపవచ్చు. రెండో జేమ్స్ రెండో కుమార్తె ఆని రాణి (1702-1714), కడపటి స్టూవర్ట్ రాజ్యాధినేత.

ఇంగ్లాండ్‌కు రాజైన నాటికి, ఒకటో జేమ్స్ వయసు ముప్పై ఆరేండ్లు. గొప్ప అందగాడుకాదు గాని, కురూపి మాత్రం కాదు. అతని కాళ్లు మరీ సన్నగా ఉండడంచేత, నిటారుగా నిలువలేక పోయేవాడు. ఎప్పుడూ ఒక సన్నిహితుని వెంటబెట్టుకొని, ఊతకోసం తిప్పుకొనేవాడు. అయితే, గుర్రపు స్వారీలో ఆరితేరిన జేమ్స్, గుర్రంపై హుందాగా కనిపించేవాడు. అతడు మాట్లాడేటప్పుడు, మాట తడబడేవాడు. ఏదో పెద్ద నాల్కను నోటిలో అణచుకొన్నట్లు, ఇతరులకు కనిపించేది కానీ; మంచి తర్కం చేయడం అతని అలవాటు. అతిగా మద్యం త్రాగినా, తాగుబోతుగా ప్రవర్తించే వాడుగాదు. వేటపై ఆసక్తి ఎక్కువ. అతడు తన ఉడుపులను గూర్చి అంతగా శ్రద్ధవహించే వాడుకాదు. కానీ, ఆత్మరక్షణకై ఛాతీపై మంచి కవచాన్ని మాత్రం తప్పనిసరిగా ధరించేవాడు. రాజు బొత్తిగా స్నానమే చేయడనే ఒక వదంతి, ప్రజల్లో ఉండేది. అతని భోజనపు అలవాట్లు కొన్ని సందర్భాల్లో మరీ అసహ్యంగా కూడా ఉండేవి.

చాలా చిన్న తనంలోనే స్కాట్‌లాండ్ రాజైన జేమ్స్, కాల్విన్ సిద్ధాంతాల ప్రాతిపదికపై, విద్య, క్రమశిక్షణను పొందాడు. ఇంగ్లాండ్ రాజైన తర్వాత గూడా, ఇది అతని వ్యక్తిగతమైన నడవడికపై, ప్రభావాన్ని చూపింది. అతడు బాగా చదువుకున్న వ్యక్తి. అతని మాటలు కొన్ని, ప్రజల్లో సూక్తులుగా కూడా ప్రచారమైనాయి. భూతవైద్యం, మతంతో సహా, అనేక విషయాలపై అతడు బాగా అధ్య యనం చేశాడు. వాటిపై అధికారికంగా మాట్లాడగలడు కానీ, తానే సర్వం తెలిసినవాడని, ఇతరులు కేవలం దద్దమ్మలనే దురభిప్రాయం ఉండడంవల్ల, ఎన్నో చిక్కుల్లో పడ్డాడు. కానీ, జేమ్స్ మంచి హాస్యప్రియుడు. క్రౌర్యాన్ని, యుద్ధాలను నిరసించాడు. సన్నిహితులు స్నేహితుల ఎడ, ప్రేమాదరాలు చూపినా, మానవగుణ విచక్షణా జ్ఞానం లోపించినవాడు. తన ప్రజల మనోభిలాషను తెలుసుకోలేక పోయాడు. ఇలాంటి గుణాలు ఉన్నందువల్లే, అతని బంధువు, సమకాలీనుడైన ఫ్రెంచి రాజు నాల్గో హెన్రీ, అతన్ని "క్రైస్తవ ప్రపంచంలోకెల్లా, బుద్ధిరహితుడైన సుజ్ఞాని" *(Wisest fool in Christendom)* అని చమత్కరించాడు. అతడు పద్య, గద్య రచనలు గూడా చేశాడు. ఉదాహరణకు, భూతవైద్యం పై ది మొనొలొగి *(De monologic)* అనే గ్రంథాన్ని, ధూమపానాన్ని నిరసిస్తూ, కౌంటర్‌బ్లాస్ట్ టు టొబాకో *(Counterblast to Tobacco)* అనే గ్రంథాన్ని; అదే విధంగా, రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతాన్ని వ్యక్తీకరిస్తూ, ది ట్రూలా ఆఫ్ ఫ్రీ మొనార్కీ *(The True Law of Free Monarchy)* అనే గ్రంథాన్ని రచించాడు.

### 1.3.1 మత వర్గాల నిరాశ

ఒకటో జేమ్స్ ఇంగ్లాండ్ రాజైన మూడేండ్ల లోపలనే, రాబేయే శతాబ్దంలో సంభవించిన ప్రధాన సమస్యలన్నింటికీ, అంకురార్పణ జరిగింది. 1604 లో, ప్యూరిటన్ మతస్థులకూ, పార్లమెంట్‌కూ వ్యతిరేకంగా అతడు తన సిద్ధాంతాలను రూపొందించాడు. అనాదిగా ఇంగ్లాండ్‌కు బద్ధశత్రువైన, కాథలిక్ దేశమైన స్పెయిన్‌తో, అతడు మైత్రిని ప్రకటించాడు. ఇది అల్ప సంఖ్యాకులైన కాథలిక్కులకు ఊరట కల్గించినా, బ్రిటీష్ ప్రజలందరికీ ఆగ్రహం కలిగించింది. దాదాపు ఒక శతాబ్దం, స్టూవర్ట్‌లపై తమ కోపాన్ని కొనసాగించి, రెండు మారులు స్టూవర్ట్ రాజులను సింహాసనం నుండి తొలగించడం జరిగింది. స్కాట్‌లాండ్‌లో రాజుగా ప్రకటించుకొని, ఇంగ్లాండ్‌కు ప్రయాణమైన జేమ్స్‌ను, దారిలోనే కొంతమంది ప్యూరిటన్ మతాధికార్లు కలిసి, మిల్లినరీ పిటీషన్ *(Millenary Petition)* అనే ఒక కోరికల పత్రాన్ని సమర్పించారు. దీనిపై, వేయి మంది మతాధికార్లు సంతకాలు చేశారట. అందుకే దీన్ని మిల్లినరీ పిటీషన్‌గా పిలిచారు. అందులో వారు కొన్ని మతాచారాలను తొలగించడానికి అనుమతి నిమ్మని అడిగారు. ఉదాహరణకు, వివాహ సమయంలో అంగుళీయకాన్ని బహూకరించడం, శిలువ మూలంగా పుట్టిన బిడ్డకు బాప్టిజం చేయడం, జీసెస్ పేరు వినగానే, నమ్రతతో వంగడం లాంటి వాటిని తొలగించమన్నారు. ప్యూరిటన్ మత ప్రచారకులు ఎటువంటి శిరోధారణ చేయాలనేది వారికే వదిలివేయాలని, ప్రార్థనాగ్రంథంపై ప్రమాణం చేసే నియమాన్ని తొలగించాలని కోరారు. ప్రార్థనా సమయాల్లోని సంగీతం, కలసి పాడడం వంటివి తగ్గించి, ప్రార్థనలకు ప్రాధాన్యాన్నివ్వాలని కోరారు. శాంతిని కోరే ప్యూరిటన్‌లు వెల్లడించిన యీ కోరికలన్నిటిని, రాజు ఎటువంటి ఆటంకము లేకుండా సరియైనవని, అనివుండొచ్చు. కాని, అట్లా కాకుండా, ప్యూరిటన్ మత గురువులను తనతో చర్చించడానికి "హాంప్టన్ కోర్ట్" సమావేశానికి ఆహ్వానించాడు.

1604 జనవరిలో జరిగిన హాంప్టన్ కోర్ట్ సమావేశానికి, రాజే అధ్యక్షత వహించాడు. ప్యూరిటన్‌లతోబాటు, ఆంగ్లికన్‌లను గూడ సమావేశానికి ఆహ్వానించారు. ప్రారంభంలో జేమ్స్, అనుకోని విధంగా నిష్పక్ష వైఖరిని అవలంబించాడు. కానీ, చర్చల మధ్య ఎవరో తనకు నచ్చని "ప్రెస్బిటేరియన్" మతాన్ని ఉదహరించడంతో, ఆగ్రహం కల్గి ప్యూరిటన్‌ల నందరిని వెళ్ళిపొమ్మని ఆదేశించాడు. వెళ్లకపోతే, దేశం నుండే తరిమేస్తానన్నాడు. దాని తర్వాత, ప్యూరిటన్‌లనందరినీ అనేక హింసలకు గురిచేశాడు. స్కాట్‌లాండ్‌లోని ప్రెస్బిటేరియన్‌లు, తనను చిన్నప్పుడు ఎదిరించి ముప్పతిప్పలు పెట్టారు. కాబట్టి, వారితో పొత్తుగలదని భావించి, ఆ విధంగా ప్యూరిటన్‌ల ఎడ ఆగ్రహం చూపాడు. ఇంగ్లాండ్‌లోని ఆంగ్లికన్ చర్చికి అధ్యక్షుడుగా వ్యవహరించిన జేమ్స్, ఇతర మత పద్ధతులను సహించలేక పోయాడు.

జేమ్స్ విచక్షణారహితంగా ప్రవర్తించిన తీరుపట్ల ప్యూరిటన్‌లకు ఆగ్రహం కల్గింది. రాజు కొంత లౌకిక జ్ఞానంతో వ్యవహరిస్తే, ప్యూరిటన్‌లు మత విషయాలకే పరిమితమై వుండేవారు. తనకు శత్రు పక్షం వహించి వుండేవారు కాదు. 1604 లో పార్లమెంట్ సమావేశమైనప్పుడు, కామన్స్ సభవారు ప్యూరిటన్‌ల "మిల్లినరీ పిటీషన్" ను సమర్థించారు. దీంతో మరీ ఆగ్రహించిన జేమ్స్, పార్లమెంట్ సమావేశం ముగిసిన తర్వాత, ప్యూరిటన్ లందరు మతాచారాలన్నిటిని ఆచరించాల్సిందని, దీనికి అంగీకరించని మతాధికార్ల నందరినీ, ఇంగ్లాండ్ చర్చి నుండి బహిష్కరించాలని తీర్మానించాడు. దాదాపు మూడు వందల ప్యూరిటన్ మతాధికార్లను, ఆవిధంగా తొలగించడం జరిగింది. "మూగవోయిన సోదరులు" గా పరిగణింపబడ్డ ఆనాటి నాయకులు తమ అభిమానుల సహాయాన్ని పొంది, రహస్యంగా సభలు, సమావేశాలు జరిపి, పలుకుబడి పెంపొందించుకున్నారు. రాజకీయాలతో ప్రమేయం కల్పించుకోడం, వారికి తప్పనిసరైంది.

BRAOU

## 1.3.2 తుపాకి మందు కుట్ర

ప్యూరిటన్‌లవలె, కాథలిక్ మతస్థులు కూడా, మతపరమైన కొన్ని సౌకర్యాలు కోరారు. రాజు తల్లైన మేరీ, కాథలిక్ మతస్థురాలిగా మరణించింది. జేమ్స్ కూడా మొదట, కాథలిక్‌ల పట్ల సాను భూతి చూపాడు. ఎలిజబెత్ కాలంలో విధించిన అపరాధాలను, కొన్ని సుంకాలను రద్దు చేయించాడు. కాథలిక్ మతాచార్యులు తమకు తోచిన విధంగా ప్రార్థనలు జరపడానికి, వీలు కల్పించడం జరిగింది. కాని, కాథలిక్‌లు అసంతృప్తిచెంది, ప్రవర్తించిన తీరు గమనిస్తే, జేమ్స్ వారి పట్ల దురుసుగా వ్యవహరించాడని తెలుస్తుంది. జి. ఎమ్. ట్రెవెలియన్ అన్నట్లు, "వారి సొంత మతం, ఇంగ్లాండ్ పీడించిన వారి మతస్థులను, స్పెయిన్ రక్షకభటులచే రక్షించి, జేమ్స్‌ను పారదోలి, ఒక కాథలిక్ మతస్థుని రాజుగా చేయడం, ఏ విధంగానూ దేశద్రోహం గానేరదని, కాథలిక్‌లు నమ్మారు. వారు అనేక వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకున్నారు.

జేమ్స్ కాథలిక్‌ల ఎడ, తన వైఖరిని మార్చుకొన్నాడు. రాబర్ట్ సిసిల్ అనే తన అనుచరునికి అధికారాలు అప్పజెప్పి, కాథలిక్‌లను బహిష్కరించవలసిందని, వారిపై అపరాధాలను విధించి, వసూలు చేయాలని ఆదేశించాడు. దీంతో ఆగ్రహించిన కాథలిక్ నాయకులు, జేమ్స్‌కు వ్యతిరేకులైరి. అనేక రహస్య కుట్రలు పన్నారు. 1603 లో జేమ్స్ ఇంగ్లాండ్ చేరిన వెంటనే వాట్సన్ అనే ఒక మతాచార్యుడు జేమ్స్‌ను అపహరించడానికి ఒక కుట్ర పన్నాడు. అయితే, ఇది ప్రొటస్టంట్ మతాన్ని తొలగించడానికో, లేక జేమ్స్‌ను చంపడానికో ఉద్దేశించింది కాదు. ఈ కుట్ర, ఆచరణకు గూడ అనూహ్యమైంది. అందుచేత, వారిలో వారు దీన్ని ఉపసంహరించుకుని, రాబర్ట్ సిసిల్‌కు వర్తమానం పంపారు. కాని, కాథలిక్‌లు నిర్వహించిన రహస్య కుట్రల్లో చాలా ప్రధానమైంది, 1604 లో జరిపిన మందుపాత్ర కుట్ర. దాన్నే *గన్ పౌడర్ ప్లాట్ (Gun Powder Plot)* అంటారు. జేమ్స్ కాథలిక్‌ల ఎడ అనుసరించిన విధానాన్నే, పూర్తిగా మార్చి వేసింది. ఈ కుట్ర ఫలించలేదుగాని, గొప్ప ప్రమాదాల్లో ఒకటిగా చరిత్రకెక్కింది.

మందుపాత్ర కుట్రనేది, రాబర్ట్ కాట్స్‌బి (Robert Catsby) పన్నిన పథకం. నల్లమందును రహస్యంగా ఉంచి, పేల్చి, తమకు నచ్చనివారిని చంపించడమనేది, ఆనాడు ఇంగ్లాండ్‌లో తరచుగా జరిగే హింసాత్మక చర్య. కాట్స్‌బి, అతని సన్నిహిత అనుచరులు, రాజును మాత్రమే చంపినందువల్ల ప్రయోజనం లేదని, పార్లమెంట్‌లోని ప్రొటస్టంట్ నాయకులందరూ మరణిస్తే, కాథలిక్ మతానికి మంచి భవిష్యత్తు కలుగుతుందని భావించి, పార్లమెంట్ సభ్యులను, వారితోపాటు రాజును చంపడానికై, యీకుట్ర పన్నారు. కాట్స్‌బిగాని, అతని ఆంతరంగికులుగాని, గొప్ప పేరు ప్రతిష్ఠలు ఉన్నవారే. కుట్రమూలంగా రాజును హతమార్చి, నాయకులందరినీ చంపి, స్పెయిన్ సహాయంతో, తమ అభీష్టం మేరకు, కాథలిక్ పాలనను పునరుద్ధరించాలని తలచారు. కుట్రదారులు పార్లమెంట్ భవనానికి చేరువగా, ఒక భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఆభవనం అడుగుభాగాన్నుండి, పార్లమెంట్ భవనానికి, ఒక రహస్య సొరంగాన్ని తవ్వారు. ఈ తవ్వకాలు కాట్స్‌బి నాయకత్వంలో ప్రారంభమైనా, కొద్ది కాలంలోనే, సైన్యంలో పనిచేసిన గైఫాక్స్ ( Guy Fawkes) వారిలో చేరాడు. అతడు సొరంగాలు తవ్వడంలో మందుగుండు పేల్చడం వంటి పనుల్లో, సిద్ధహస్తుడు. యార్క్‌షైర్‌కు చెందిన కాథలిక్ అతడు. స్పానిష్ సైన్యంలో పనిచేసి వచ్చినవాడు. కొద్ది దూరం తవ్విన తర్వాత, పార్లమెంట్ భవనం కింద ఒక లంబర్ గది ఉందని, అందులో బొగ్గు, వంటచెరకు నిల్వఉందని గైఫాక్స్ కనిపెట్టాడు. ఆ లంబర్ గదివైపు సొరంగాన్ని, కుట్రదార్లు రహస్యంగా తమకు తామే స్వయంగా తవ్వసాగారు. వంట చెరకు నిల్వవుండడంచేత, కింద సొరంగం ఎవరికీ కనిపించదు. సొరంగంలో గైఫాక్స్, దాదాపు 36 నల్లమందు పీపాలను నింపాడు. పార్లమెంట్ భవనాన్ని కూల్చడానికి తగినన్ని ఇనుప తండోలాలను కూడ, అందు పరిచేశాడు. సొరంగం పని పూర్తైన తర్వాత, కుట్రదారులందరూ ఎవరికీ అనుమానం

కలగకుండా, తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ రహస్యాన్ని తమకు తామే ఉంచుకున్నట్లైతే, కుట్ర విజయవంతమై ఉండేది.

కుట్రదారుల్లో ఒకడు, పార్లమెంట్ సభ్యుల్లో తన బంధువు ఒకడుండడంచేత, అందులోనూ అతడు కాథలిక్ అయినందువల్ల, మందుగుండ్లు పేలినప్పుడు, అతడు గూడ తక్కిన అందరితోపాటు మరణిస్తాడేమోనని, రహస్యంగా అతనికి మాత్రం ఒక జాబు మూలంగా వర్తమానం పంపాడు. అతని జాబులోని సారాంశం ఇలా ఉంది: "వెంటనే నీ సొంత ప్రాంతానికి తరలి పోవలసింది. అక్కడ నీవు సురక్షితంగా ఉండగలవు. ఇక్కడ పెద్ద అలజడి సూచనలు లేకపోయినా, ప్రస్తుత పార్లమెంట్ సభ్యులు ఒక పెద్ద విపత్తును చవిచూడబోతున్నారని తెలియజేస్తున్నాను. ఎవరు హానిచేస్తున్నారో తెలుసుకోడానికి గూడా వారెవరూ మిగలరు". ఈ జాబును ప్రభుత్వ దృష్టికి తేగా, రహస్యం బయటపడింది. కాట్స్‌బి, అతని సన్నిహితులందరూ, లండన్ నగరం నుండి పారిపోయారు. కాని, గైఫాక్స్ మాత్రం, ధైర్యంతో నగరంలో ఉండిపోయాడు. పార్లమెంట్ సమావేశమయ్యేది, నవంబర్ అయిదవ తేది. భవనాన్ని పేల్చడానికి గూడా, అదే తేదీ నిర్ణయించడం జరిగింది. కానీ, దానికి ముందు రోజు రాత్రి పదకొండు గంటలకు, సారంగపు రహస్యాన్ని కనుగొన్నారు. గైఫాక్స్‌ను వెంటనే బంధించి, టవర్ ఆఫ్ లండన్ లో కొంత కాలం చిత్రహింసలకు గురిచేశారు. తర్వాత అతడ్ని 1606 ఫిబ్రవరి నెల ఒకటో తేదీ, ఉరితీశారు. అప్పటికే, కుట్రలో పాల్గొన్న వారినందరినీ, ప్రభుత్వం పట్టి చంపింది.

మందుపాత్ర కుట్ర తదనంతరం, ప్రభుత్వానికీ, దేశంలోని కాథలిక్‌లకు, ఎలాంటి సయోధ్య కుదరలేదు. ఈ కుట్ర మూలంగా కాథలిక్ మతం, ప్రజల సానుభూతిని పోగొట్టుకుంది. విదేశీయులను ఆహ్వానించడానికై, రాజును కూడ చంపడానికై వెనుదీయని దేశద్రోహులుగా, వారిని చూశారు. ఇంగ్లాండ్‌లో కాథలిక్‌లకు వ్యతిరేకంగా, చాలా చట్టాలు రూపొందించారు. దీని తర్వాత, ఇంగ్లాండ్ దేశంలో కాథలిక్ మతానికి ఎట్టి భవిష్యత్తు లేక పోయింది.

BRAOU

### 1.3.3 రాజకీయాలు - రాజ్యాంగం

బ్రిటీష్ పార్లమెంట్ ఆవిర్భావం, దాదాపు మధ్య యుగంలోనే ప్రారంభమైంది. ట్యూడర్ల కాలంలో పార్లమెంట్ నిర్మాణ విధానం, పాత పద్ధతిగా కొనసాగినా, వారు పార్లమెంటరీ సంస్థల ప్రాధాన్యతను మార్చగలిగారు. ఎగువ సభలోని భూస్వాముల, పెద్ద పెద్ద ధనవంతుల అధికారాన్ని తగ్గించి, దిగువ సభైన కామన్స్ సభ సభ్యుల సహాయాన్ని పొందారు. వారు, రాజుకు మత, సాంఘిక విషయాల్లో గూడ సహకరించారు. కాని, జేమ్స్ అధికారానికి వచ్చిన పిదప, కామన్స్ సభ్యులు రాజకీయ ప్రతిఘటన గావించి, కొత్త తరగతి నాయకత్వం కింద, రాజకీయ సంక్షోభాన్ని కల్గించారు. ఒకదానికొకటి పొత్తుకుదరని విభిన్న భావాలోచనలు ఉన్నందువల్ల, ఒకటో జేమ్స్‌కు, పార్లమెంట్‌తో సత్సంబంధాలకు ఆస్కారం లేకుండింది. జేమ్స్, రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతాన్ని నమ్మినవాడు. కాని పార్లమెంట్, అనాదిగా ఉన్న అధికారాలను, హక్కులను పునరుద్ధరించుకోడానికి నిర్ణయించింది. రాజరికానికి తక్కువ గాని విధంగా అధికారాలు ఉండడానికి, పార్లమెంట్ చాలా కృషి చేసింది. రాజు సమావేశపరచిన మొదటి పార్లమెంట్, 1604-1611 మధ్య కొనసాగింది. కామన్స్ సభ్యులు, ప్రతి రాజకీయ నిర్ణయం పార్లమెంట్‌లో జరగాలని, రాజు గూడా పార్లమెంట్ పరిధిలో అధికారాలను చెలాయించాలనీ, బాహాటంగా అభిప్రాయపడ్డారు. కాని, జేమ్స్ సలహాదారులైన శాలిస్‌బరీ, బేకన్, స్ట్రాఫోర్డ్ మొదలైనవారు, రాజుకు విస్తృతమైన అధికారాలున్నప్పుడే, జాతీయైక్యత సాధ్యమని తెలియజేశారు.

CM-0116
Dr BRAOU LIBRARY
Acc. No:
Class No:

జేమ్స్ కాలంలో ఇంగ్లాండ్ స్కాట్‌లాండ్‌ల విలీన సమస్య ఎదురైంది. జేమ్స్ మొదట స్కాట్ లాండ్ రాజుగా ఉండినందువల్ల, ఈ రెండు దేశాలు ఐక్యం కావాలని తలచాడు. పురాతన కాలంనుండి గూడ, ఇంగ్లాండ్ ప్రజలు, స్కాట్‌లాండ్ ప్రజల మధ్య సద్భావన లేనందువల్ల, అటువంటి భౌగోళిక విలీనాన్ని కామన్స్ సభ్యులు వ్యతిరేకించారు. ఈ విషయంగా, జేమ్స్ అన్న కింది మాటలు, అతని నియంతృత్వ ధోరణిని నిరూపిస్తున్నాయి.

"నేను బ్రిటీష్ దీవు లన్నింటికీ ప్రభువును. ఒక క్రైస్తవ రాజైన నన్ను, బహు భార్యావంతుడు కావడాన్ని కాదనలేరు. ఇద్దరు భార్యలకు (ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్‌లకు) నేనే భర్తను."

1607లో కామన్స్, అటువంటి విలీనాన్ని తోసిపుచ్చారు. కాని, ఒక శతాబ్దం తర్వాత, 1707లో, ఈ రెండు దేశాలు, మారిన పరిస్థితుల దృష్ట్యా, ఒకటిగా ఏర్పడి, దాని తర్వాత వేల్స్ కలవడంతో, 'యునైటెడ్ కింగ్‌డమ్'గా రూపొందాయి.

ఆర్థిక విషయాలపై గూడ, పార్లమెంట్‌లో రాజుకు సమస్యలు ఎదురయ్యాయి. జేమ్స్ దుబారాగా ఖర్చు చేసేవాడు. అతని సాలుసరి వ్యయం, ఐదారు లక్షల పౌన్లుండేది. దీని కారణంగా, అతడు వీలైనన్ని పన్నులను ప్రజలనుండి వసూలు చేయడానికి యత్నించాడు. దేశంలో వ్యాపారం విస్తరిస్తున్నం దువల్ల, అతడు వాణిజ్య పన్నులను పెంచదలచాడు. "బుక్ ఆఫ్ రేట్స్" ను విడుదలచేసి, దిగుమతి సుంకాలను పెంచినట్లు తెలియజేసాడు. 1606 లో బేట్ (Bate) అనే వ్యాపారి రాజు విధించిన అధిక సుంకాలకు వ్యతిరేకంగా, దావాను వేసినా, పార్లమెంట్ దీన్ని వదిలిపెట్టదలచలేదు. తమ అనుమతి లేకుండా రాజు సుంకాలను విధించడం, వసూలు చేయడం, పార్లమెంట్ అధికారాలకు విఘాతకమని భావించింది. బేట్ దావా, రాజుకు పార్లమెంట్‌కు మధ్య, గొప్ప వివాదాన్ని సృష్టించింది. ఎంతకూ సమస్య పరిష్కారం కాకపోగా, 1611 లో జేమ్స్ కోపంతో పార్లమెంట్‌ను రద్దుపర్చి, చాలాకాలం తిరిగి సమావేశపరచలేదు. జేమ్స్ ప్రవర్తన పట్ల అనేకులు తీవ్రమైన అసంతృప్తిని ప్రకటించారు. ఎలిజబెత్ రాణి అవసాన కాలంలో 'హామ్లెట్' (Hamlet) ను రాసిన షేక్స్పియర్, జేమ్స్ కాలంలో మాక్‌బెత్, కింగ్‌లియర్ మొదలైన నాటకాలను రాశాడు. కాని, 1611 లో పార్లమెంట్‌ను రద్దుచేసిన సంవత్సరం, తన రచనా వ్యాసంగాన్ని ముగించుకొని, నిస్పృహతో షేక్స్పియర్ తన స్వస్థలమైన స్ట్రాట్‌ఫోర్డ్‌కు చేరుకున్నాడు. 1616లో మరణించేదాకా ఒక్క గీత కూడా అతడు రాయలేదంటే, జేమ్స్ ప్రవర్తన ప్రజలను ఏవిధంగా నిరుత్సాహపరచిందో, ఊహించవచ్చు.

1611లో రద్దుపర్చబడిన పార్లమెంట్, 1621 వరకు సమావేశపరచబడలేదు. 1614లో రెండు నెలలు మాత్రమే సమావేశమైంది. కానీ, దానివల్ల ఎట్టి కార్యమూ సిద్ధించలేదు. పార్లమెంట్ ప్రమేయం లేకుండా దాదాపు పదేండ్లు స్వీయపాలన గావించిన జేమ్స్ ఆస్థానం, అవినీతికి ఆలవాలమైంది. ఎలిజబెత్ రాణి యుద్ధాలకై వెచ్చించిన మొత్తాల కన్నా ఎక్కువగా, జేమ్స్ శాంతి సమయంలోనే ఖర్చు పెట్టాడు. లండన్‌లో అతడు అనేక మొత్తాలను అప్పుగా తీసుకొన్నాడు. ప్రజలనుండి నిర్బంధ డిపాజిట్లను వసూలు చేశాడు. ప్రభు బిరుదాలను ఎక్కువ మొత్తాలకు అమ్మి, ధనం కాజేశాడు. పొగాకు వంటి వస్తువుల ఉపయోగంపై నిర్బంధంగా పన్నులు వసూలు చేశాడు. ఈ డబ్బును సేకరించిన పద్ధతులు, పార్లమెంట్ కన్నా రాజు అధికారవంతుడనే విషయాన్ని నిరూపణ చేయకపోగా, రాజు ప్రజల దృష్టిలో చులకనయ్యాడు.

BRAOU

1621లో జేమ్స్ పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సొచ్చింది. అతని వైదేశిక విధానం కామన్స్ సభలో విమర్శకు గురైంది. పార్లమెంట్ సభ్యులకు విదేశీ వ్యవహారాల అవగాహన పూర్తిగా లేదని, అందులోని మెలకువలు వారికి అర్థంగాలేదని, విదేశీ విధానం కొద్ది మందికి మాత్రమే తెలిసిన ఒక కళ అనీ, అందులో ప్రజల ప్రమేయమేమీ లేదనీ, జేమ్స్ బహిరంగంగా చెప్పేవాడు.

కామన్స్ సభలోని సభ్యులు, స్పెయిన్‌తో యుద్ధం ప్రకటించి, ఐరోపాలోని ప్రొటస్టాంట్ మత స్థులకు మద్దతు నివ్వాలని అభిప్రాయపడ్డారు. కానీ, జేమ్స్ వారిని వారించాడు. పార్లమెంట్ సభ్యులుగా వారి అధికారాలన్నీ రాజు అనుగ్రహంచేత సంక్రమించినవేనని చాటాడు. కామన్స్ దీన్ని ఎదిరించి, 'ప్రొటస్టేషన్' *(Protestation)* అనే ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టి, అందులో, పార్లమెంటరీ హక్కులన్నీ పురాతన కాలాన్నుండి బ్రిటీష్ ప్రజలకు సంక్రమించినవని వివరించారు. ఇంగ్లాండ్‌కు సంబంధించిన అన్ని విషయాలు చర్చించడానికి, హక్కు, స్వేచ్ఛ పార్లమెంట్ కుందని, పార్లమెంట్‌లో గల సభ్యులకు పూర్తి వాక్స్వాతంత్ర్యముందనీ, స్పష్టంచేశారు. జేమ్స్ మండిపడి, కామన్స్ సభ చట్టాలున్న గ్రంథాన్ని తెమ్మని చెప్పి, ప్రీవీకౌన్సిల్ సమక్షంలో, ఆ చట్టాలు ఉల్లేఖించబడ్డ పేజీలను, కోపంతో చింపిపారేశాడు. పార్లమెంట్‌ను వెంటనే రద్దుపర్చి, కామన్స్ సభలోని న్యాయవేత్త కోక్, సర్‌రాబర్ట్ ఫిలిప్స్, పిమ్ మొదలైన నాయకులందరినీ, ఖైదు చేయించాడు.

జేమ్స్ కాలంలో కడపటిదైన నాల్గో పార్లమెంట్ 1624లో సమావేశమైంది. ఎలిజబెత్ మరణానంతరం, సుహృద్భావంతో సమావేశమైన పార్లమెంట్ ఇదే అనవచ్చు. జేమ్స్ స్పెయిన్‌తో యుద్ధం కొనసాగించడానికై తగిన వనరులను చేకూర్చడానికి, ఈ సమావేశం అనుమతినిచ్చింది. యుద్ధంలో పోరాడుతారనే ఉద్దేశంతో, యువరాజైన ఛార్లెస్, అతని అనుచరుడైన డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ కు, యీ పార్లమెంట్‌లో సానుభూతి గూడ లభించింది. కానీ, నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంపై, కార్న్‌ఫీల్డ్ (Cornfield) అనే ఆర్థికవ్యవహారాల మంత్రిని (Lord Treasurer) విమర్శించారు. గుత్తాధిపత్యాలు (Monopolies) వంటి సుంకాల వసూలును నిషేధిస్తూ, చట్టాలను చేశారు.

BRAOU

జేమ్స్ కాలంలో పార్లమెంట్ పైవిధంగా, తన అధికారాలను విజయవంతంగా పునరుద్ధరించుకోగల్గింది. మంత్రులపై అభిశంసనా తీర్మానాన్ని తేవడానికీ, కొత్త సుంకాలను రద్దు చేయడానికీ, దేశానికి సంబంధించిన అన్ని విషయాలను కూలంకషంగా చర్చించడానికీ, పార్లమెంట్ వెనుకాడలేదు. కాని, క్రమం తప్పకుండా సమావేశమయ్యే హక్కు మాత్రం, పార్లమెంట్‌కు లేదు. జేమ్స్ రాజుకు తన పార్లమెంట్‌తో గల సంబంధాలను పరిశీలించినట్లైతే, అప్పటికే ఇద్దరి మధ్య తగాదా బాగా పెరిగింది. హింసాత్మక చర్యలేవీ లేకపోయినా, ఆదిశగా పరిస్థితులు మారుతున్నాయని మాత్రం, కొట్టొచ్చినట్లు కన్పించింది. అతని కుమారుడైన ఒకటో ఛార్లెస్ కాలంలో తప్పనిసరైంది.

విదేశీ విధానంలో జేమ్స్ శాంతిని కోరుకునేవాడు. యుద్ధాలంటే అతనికి గిట్టదు. యుద్ధాలు చేయడం కన్నా, దౌత్యంతో మిక్కిలి లాభాలు పొందవచ్చనేవాడు. 1604 లో స్పెయిన్‌తో సంధి చేసుకున్నాడు. కాని, డచ్ వారికి సహాయాన్ని అందజేసి, వారు స్పెయిన్‌తో పోరాడడాన్ని ఆక్షేపించలేదు. అతని కుమార్తె ఎలిజబెత్‌ను, జర్మనీలోని పేలటినేట్ (Palatinate) ఎలక్టారైన ఫ్రెడరిక్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఫ్రెడరిక్ బోహీమియా రాజుగా ఆహ్వానితుడైనాడు. కాని, కాథలిక్ మతస్థుడైన పవిత్ర రోమన్ చక్రవర్తి (Holy Roman Emperor) ప్రొటస్టంట్ నాయకుడైన ఫ్రెడరిక్ పేలటినేట్ రాజు కావడం సహించలేక, ఆస్ట్రియా, స్పానిష్ సేనలను రప్పించి, అతనిని, ఆతని ఇంగ్లీష్ రాణిని,

బోహిమియా నుండి తరిమివేశాడు. ఆ విధంగా, 1618లో జర్మనీలో, ముప్పైఏండ్ల సంగ్రామం ప్రారంభమైంది. జేమ్స్ తన కుమార్తెకు సహాయం చేయనెంచాడు. కానీ, ఇంతలో తన కుమారుడికి స్పెయిన్ రాకుమార్తెతో వివాహం జరిపించ తలచి, అప్పటికే వివాహమైపోయిన కూతురు, అల్లుడు అవసరాలను విస్మరించాడు. పార్లమెంట్ సమావేశమైనప్పుడు, సభ్యులందరూ గూడ, ప్రొటస్టెంట్‌ల నాయకుడైన ఫ్రెడరిక్‌కు, ఇంగ్లాండ్ సహాయపడాలనే అభిప్రాయపడ్డారు. కాని, జేమ్స్ విదేశీ విషయాలన్నీ తనకు మాత్రమే గుత్తాధికారమని, పార్లమెంట్ సభ్యులంతా అనవసరంగా జోక్యం చేసుకోరాదనీ ఆగ్రహించాడు. కాని, నిజానికి, అప్పుడు ఐరోపాలో యుద్ధాన్ని కొనసాగించేటంత సైన్యం, తగిన సాధనసంపత్తి, ఇంగ్లాండ్‌కు ఉండేవి కావు.

స్పెయిన్‌తో సత్సంబంధాలు నెలకొనడానికీ, అటువంటి సంబంధాలకు శాశ్వత రూప మివ్వడానికీ, వైవాహిక సంబంధం సరైందని భావించిన జేమ్స్, తన కుమారుడైన ఛార్లెస్‌కు, స్పానిష్ రాకుమార్తెతో వివాహం జరిపించే ప్రణాళిక వేశాడు. కాని, బ్రిటీష్ ప్రజలకు గాని, పార్లమెంట్‌కుగానీ, ఇది ఏమాత్రం నచ్చలేదు. కాథలిక్ రాకుమార్తెను పెండ్లాడిన, భవిష్యత్తులో కాథలిక్ రాజు తమను పాలించడాన్ని, ప్యూరిటన్ ప్రధానమైన ఇంగ్లాండ్ ప్రజలు భయపడ్డారు. కాని, జేమ్స్ తన అనుచరులైన జార్జి మిల్లర్, డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్, స్పెయిన్ రాయబారైన గొండోమర్ (Gondomar) వంటి వారి సలహాల మేరకు, స్పెయిన్‌తో సంబంధాలకు కృషిచేస్తూనే వచ్చాడు.

ఛార్లెస్ రాకుమారుడు, అతని సన్నిహితుడు, దాదాపు అదే వయస్కుడైన డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్, ఒక పథకం ప్రకారం, 1623లో రహస్యంగా దేశం వీడి, ఫ్రాన్స్ మీదుగా మారు వేషాలతో స్పెయిన్ చేరుకున్నారు. ఛార్లెస్, స్పెయిన్ రాకుమారిని పెళ్లాడటానికి ఎటువంటి త్యాగానికైనా సిద్ధమయ్యాడు. తమ రాకుమార్తె పాణిగ్రహణానికై, మారు వేషాలతో పయనించి, మాడ్రిడ్ చేరిన ఛార్లెస్‌ను చూడగానే, స్పానిష్ ప్రజలు ఆత్మగౌరవాన్ని కించపరచేదిగా ఉందని భావించారు. "మా రాకుమార్తెను తలకిందులుగా ఒక బావిలో నైనా పడవేస్తామేగాని, ఇటువంటి కొంటె తరహా ఛార్లెస్ చేతుల్లో పెట్టడానికి అంగీకరించం" అని స్పానిష్ ప్రజలు తెలియజేశారు. స్పెయిన్ చేతుల్లో పరాభవం పొందిన ఇద్దరు స్నేహితులు లండన్ తిరిగి రాగా, అక్కడి వారందరూ పెళ్లి విఫలమైనందుకు సంబరపడ్డారు. పగ తీర్చుకోడానికై బకింగ్‌హామ్, పెళ్లిపోతేపోయింది, కనీసం స్పెయిన్‌తో ఒక యుద్ధాన్నైనా చేయాలనే ఉద్దేశంతో 1624 లో ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోవడమైంది.

దాదాపు అన్ని వర్గాలకు నిరాశను మాత్రమే మిగిల్చిన జేమ్స్, 1625 మార్చి 27 వతేదీన, ఇరవై అయిదేండ్ల పరిపాలనానంతరం మరణించాడు. ఇంగ్లాండ్‌ను అందరి ముందు, నవ్వుల పాలు చేశాడు. తాను దైవాంశ సంభూత సిద్ధాంతాల ననుసరించి, స్టూవర్ట్ రాజరికాన్ని పెడతోవ పట్టించాడు. అతని తర్వాత అధికారానికి వచ్చిన ఛార్లెస్ కాలంలో సంభవించిన అంతర్యుద్ధానికి, జేమ్స్ కూడ చాలావరకు కారణభూతుడనడంలో అతిశయోక్తి లేదు.

## 1.4 సంగ్రహంగా

17వ శతాబ్దారంభానికి, ఐరోపా లోని ఇతర దేశాలతో పోల్చిన, ఇంగ్లాండ్ అనేక విధాల భిన్నంగా గోచరిస్తుంది. ఇంగ్లాండ్‌లో ప్రభుత్వం, సైన్యాలు, మతం, అన్నీ, స్థానిక సంస్థలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాయి. నగరాలకు, స్థానిక ప్రాంతాలతో తగాదాలు లేవు. రాజు, దేశ రక్షణ విషయంలో ప్రజల విధేయతపై ఆధారపడ్డాడు. ఎలిజబెత్ రాణి తర్వాత స్టూవర్ట్ రాజులు అధికారానికి రావడంతో,

BRAOU

ప్రజలకు, పార్లమెంట్‌కు, రాజకీయాల్లో మున్నెన్నడూ లేనంతగా ఆసక్తి కల్గింది. విదేశాలతో పెద్దగా యుద్ధాలు లేని కారణంగా కూడ, అంతరంగిక శాంతి, రాజ్యాంగ విషయాలకు ప్రజల ఆసక్తి మళ్లింది. జేమ్స్ రాజు కావడం, దైవాంశ సంభూత సిద్ధాంతాన్ని అనుసరించ ప్రయత్నించడం, ప్రజలకు ఆగ్రహాన్ని కల్గించింది. ప్రజాప్రతినిధులైన పార్లమెంట్ సభ్యులు తమ అధికారాలు, హక్కులను అమలు చేయ యత్నించడమే, రాజుకు, పార్లమెంట్‌కు మధ్య ఏర్పడ్డ ప్రతిష్టంభనకు కారణం. అటువంటి ప్రతిష్టంభన, జేమ్స్ తర్వాత రాజైన ఒకటో ఛార్లెస్ కాలంలో పరాకాష్టకు చేరుకొని, అంతర్యుద్ధానికి దారితీసింది.

## 1.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. స్టూవర్ట్‌లకు ముందు నెలకొన్న ఇంగ్లాండ్ పరిస్థితులెట్టివి?
2. స్టూవర్ట్ రాజుల రాజకీయ సిద్ధాంతాలను విశ్లేషించండి.
3. ప్యూరిటన్ విప్లవానికి ముందు ఇంగ్లాండ్‌లో నెలకొన్న పరిస్థితుల స్వరూప, స్వభావాలను తెల్పండి.
4. ఒకటో జేమ్స్, ఆయన పార్లమెంట్ మధ్య నెలకొన్న సంబంధాలు, వాటి రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించండి.

**II. కింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. తుపాకి మందు కుట్ర
2. ఒకటో జేమ్స్ వైదేశిక విధానం

## 1.6 ఉపయుక్త గ్రంథాలు


J. R. Jones : **The Revolution of 1688 in England,** 1988

J. R. Western : **Monarchy and Revolution,** 1992

G. M. Trevelyan : **England under the Stuarts**

S. R. Gardiner : **History of England, 1603-1642.**

Clarendon : **History of the Great Rebellion.**

G. B. Adams : **Constitutional History of England Since 1485**


BRAOU

# భాగం-2 : ఒకటో ఛార్లెస్ : దీర్ఘకాలిక పార్లమెంట్

విషయక్రమం

2.0 లక్ష్యాలు

2.1 ఒకటో ఛార్లెస్, 1625-1649

2.1.1 హెన్రియట్టా మేరియా Henrietta Maria)

2.1.2 డ్యూక్ ఆఫ్ బకింగ్ హామ్ (Duke of Buckingham)

2.2 బకింగ్‌హామ్ మరణం

2.3 ఛార్లెస్ మత విధానాలు

2.4 పార్లమెంట్‌తో సంబంధాలు

2.5 హక్కుల పత్రం Petition of Right)

2.6 ఛార్లెస్ వ్యక్తిగత పాలన, 1629-1640

2.7 స్కాట్‌లాండ్ సమస్య

2.8 దీర్ఘకాలిక పార్లమెంట్ (Long Parliament), 1640

2.9 సంగ్రహంగా

2.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

2.11 ఉపయుక్త గ్రంథాలు

## 2.0 లక్ష్యాలు

రాజును ఓడించి, పదవీచ్యుతుని గావించి, అతడిని బంధించి, విచారణ కొనసాగించి, మరణ దండన విధించి, బహిరంగంగా శిరచ్ఛేదన గావించిన ఏకైక ఉదంతం, బ్రిటీష్ చరిత్రలో మొదటి ఛార్లెస్ కాలంలో మాత్రమే జరిగింది. ఒకటో ఛార్లెస్ అనుసరించిన మత విధానం, అతని రాజకీయ ఉద్దేశాలు, విదేశీ విధానం, పార్లమెంట్‌తో ఆయన కేర్పడ్డ విభేదాలు, ఈ పాఠంలో చర్చించడం జరిగింది. కాథలిక్ మతాభిమానైన రాజు, ఆంగ్లికన్ మతంతో పోటీ పడ్డం, ఇందులో తెలిపాం. పార్లమెంట్‌ను సమావేశపరచడం, తన కోరికల కనుకూలంగా తనకు ధనాన్ని మంజూరు చేయకపోతే రద్దుచేయడం, తత్కారణంగా పార్లమెంట్ ప్రమేయం లేకుండా పాలించాలని రాజు చేసిన ప్రయత్నాలు గూడ, ఇందులో చర్చించడం జరిగింది. దేశంలో రాజు వర్గమని, పార్లమెంట్ వర్గమని, రెండు పక్షాలు ఏర్పడ్డం, దీంతో అంతర్యుద్ధానికి రంగం సిద్ధం కావడాన్ని వివరించడం, ఈ పాఠ్య ముఖ్య లక్ష్యం.



B R A O U

## 2.1 ఒకటో ఛార్లెస్, 1625 - 1649

మానవ చరిత్రలో పరిపాలకుల నిరంకుశత్వ విధానాలు, ప్రజాపీడన, విచక్షణారహిత ప్రవర్తన ప్రధాన లక్ష్యాలు. సాధారణంగా ఇవే తిరుగుబాట్లకు, అలజడులకు ప్రధాన కారణాలు. ప్యూరిటన్ విప్లవమనే అంతర్యుద్ధం, ఒకటో ఛార్లెస్ కాలంలో జరిగింది. ఛార్లెస్ కొంత లౌకిక జ్ఞానం, నేర్పుతో వ్యవహరించి ఉన్నట్లైతే, బహుశా ఈ ప్రమాదం నుండి తప్పించుకొని ఉండేవాడు. కాని, దురదృష్టవశాత్తు, స్టూవర్ట్ రాజుల్లో రెండోవాడైన ఛార్లెస్, వధ్య శిల ఎక్కాల్సిన దుస్థితి కలిగింది. ఈ విప్లవంలో (1642-49) రాజును, ప్రజాప్రతినిధులైన పార్లమెంట్ నాయకులు ఏర్పాటుచేసిన జాతీయ, సైన్యం ఓడించి, పదవీచ్యుతుని చేసి, చంపటం జరిగింది. రాజరికం అంతమై, ప్రజాస్వామ్యం ముందుకొచ్చింది. 1660లో రెండో ఛార్లెస్‌ను రాజుగా ప్రకటించి, రాజరికాన్ని పునరుద్ధరించే వరకు, ఇంగ్లాండ్ ప్రజాస్వామిక దేశంగా, కామన్‌వెల్త్‌గా కొనసాగింది. బ్రిటీష్ సుదీర్ఘ చరిత్రలో, రాజరికం లేని సమయం మిదొక్కటే.

1625లో జేమ్స్ మరణించిన తర్వాత, అతని కుమారుడు ఒకటో ఛార్లెస్ అధికారానికి వచ్చాడు. జేమ్స్ మొదటి కుమారుడు హెన్రీ, చిన్న తనంలోనే మరణించడం చేత, రెండో కుమారుడైన ఛార్లెస్ సింహాసనానికి వచ్చాడు. తన తండ్రి లాగా గాక, ఛార్లెస్ మంచి అందగాడు, స్ఫురద్రూపి, రాజరికం ఉట్టిపడే హుందాకల విగ్రహం. ఛార్లెస్‌కు ఒక కాలు కుంటి, కొంత నత్తి గూడ ఉండేది. అతని రాజ రీవికి ఇది అడ్డు తగలకపోగా, తన హోదాను ఇనుమడించడానికి ఉపయోగపడ్డాన్ని గమనించవచ్చు. గుఱ్ఱపు స్వారి, ఈత, టెన్నిస్ ఆటల్లో అతనికి అభిమాన మెక్కువ. వ్యక్తిగతంగా, ఛార్లెస్ దయాదాక్షిణ్యాలున్న వాడు; దానశీలి. విశ్వాసపాత్రుడైన భర్తగా, వాత్సల్యంగల తండ్రిగా పేరుపొం దాడు. కళాత్మక వస్తువులను అభిమానించేవాడు. క్రైస్తవ మత పిపాసి. చిన్న తనం నుండే, మత విషయాలపట్ల ఆసక్తి చూపాడు. తన అన్న చనిపోకపోయినా, ఛార్లెస్ బహుశా, కాంటర్‌బరీ ఆర్చిబిషప్ (Archbishop of Canterbury) హోదాగల మతాధికారి అయ్యే వాడని, అందరూ చెప్పుకునేవారు.

ఎన్ని మంచి గుణాలు ఉన్నా, ఛార్లెస్‌లో కొన్ని లోపాలు కూడా లేక పోలేదు. తాను దేవుని తరపున రాజుగా వచ్చాననే భావనతో, ఛార్లెస్ అన్ని చట్టాలకు తాను అతీతుడనని భావించుకున్నాడు. చట్టాలు సామాన్య మానవుల కేనని, అతని ఉద్దేశం. ఛార్లెస్, ఆడిన మాటలు నిలబెట్టుకోవాలనే కాంక్ష లేనివాడు. మిత్రులకుగాని, శత్రువులకుగాని చెప్పిన మాటపై, శ్రద్ధ చూపేవాడు గాదు. చేసిన వాగ్దానాలను విస్మరించేవాడు. అందుచేత, క్రమంగా రాజు మాటలు ప్రజల దృష్టిలో నీటి మూటలే. జేమ్స్ లాగా ఛార్లెస్‌కు, వాక్చాతుర్యం ఉండేది కాదు. అతడు చాలా తక్కువగా మాట్లాడేవాడు. మితభాషిత్వం వల్ల, అతని మనో భావాలను ఇతరులు పూర్తిగా అంచనా వేయడానికి వీలుండేది కాదు. తన మొదటి పార్లమెంట్ సమావేశమైనప్పుడు, కామన్స్ సభ్యుల నుద్దేశించి, గంభీరంగా ఇలా అన్నాడు: "నేటి పాలనా విషయాలకు సుదీర్ఘ ఉపన్యాసాలు అవసరం లేదు. అది నా వల్లకాదు కూడ. అదీ గాక, మాటలనేర్చి, కూర్చి, ఉపన్యసించడం, కేవలం కాలహరణం." ఇతరుల మనో భావాలను అవగాహన చేసుకొని, కాలానుగుణంగా మారడం, అతనికి తెలియదు. అందుచేతనే, అతని వైఖరిలో మార్పు తేలేని ప్రజలు, పార్లమెంట్, విప్లవాన్ని తేవాల్సొచ్చింది. కాని, నైతికంగా, నీతి, న్యాయం తన పక్షమే ఉందని గాఢంగా భావించాడు. పార్లమెంట్‌కు, రాజుకు, ఘోరంగా తగాదాలు ఉత్పన్నమైన సమయంలో, కడపటికి సింహాసనం కోల్పోయే సమయంలో కూడా, అతని ప్రవర్తన న్యాయమనే భావన అతనిలో తగ్గలేదు. స్టూవర్ట్ అధికార పతనానికి ఛార్లెస్ చాలవరకు కారణమనవచ్చు.

BRAOU

### 2.1.1 హెన్రియట్టా మేరియా (Henrietta Maria)

స్పెయిన్‌తో వివాహ సంబంధాలు విజయవంతం కాకపోయినందువల్ల, బకింగ్‌హామ్ వెంటనే రాజుకు ఒక ఫ్రెంచి సంబంధాన్ని తెచ్చాడు. ఫ్రాన్స్ రాజైన పదమూడో లూయీ (Louis XIII) చెల్లెలు, పదిహేనేండ్ల హెన్రియట్టా మేరియాతో, ఛార్లెస్ వివాహం 1625 లో, తాను రాజైన కొద్ది నెలల్లోనే జరిగింది. ఫ్రెంచి రాకుమార్తె గొప్ప అందగత్తెకాని, తన చిలిపి ప్రవర్తనతో ప్రజల గౌరవాన్ని చూరగొనలేదు. భర్తకు మిక్కిలి విధేయతతో పెరిగిన హెన్రియట్టా, ఎట్టి కుట్రలు, కుతంత్రాలకు సలహాలనివ్వడానికి, వెనుకంజ వేసేదికాదు. పార్లమెంట్ కూడ, దాని ప్రమేయం లేకుండా జరిగిన యీ వివాహం మూలాన, కాథలిక్ మతంలో పెరిగిన రాణి, తన పిల్లలను అదే మత పద్ధతుల్లో పెంచి, తమకు భవిష్యత్తులో కాథలిక్ రాజు పాలనను ప్రసాదిస్తుందని ఆగ్రహపడ్డారు. తన ప్రభావంచేత, రాజును గూడ కాథలిక్ మత పక్షపాతిగా చేస్తుందని భావించారు. కాని, ఛార్లెస్ ఈ విషయంలో, వారికి ఆశాభంగాన్నే కల్గించాడు. కాథలిక్ మతస్తురాలిని వివాహమాడడాన్ని, ప్రజలు కూడా హర్షించలేదు. దీనికై రాజు, పార్లమెంట్ అనుమతిని కూడ పొందలేదు. వివాహానంతరం, ఇంగ్లాండ్-ఫ్రాన్స్ సంబంధాలు ఆశించిన మేరకు, మెరుగు కాలేదు. కడపటికి, రెంటి మధ్య యుద్ధం గూడ అనివార్యమైంది. ఛార్లెస్, తన అనుచరుడైన డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ నాయకత్వంలో, బ్రిటీష్ సైన్యాలను పంపి, ఫ్రాన్స్‌లో "హ్యూజినాట్" అని (Huguenots) పిలవబడే ప్రొటస్టంట్‌లకు, సహాయపడమని ఆదేశించాడు. లారోషెల్ అనే ప్రాంతంలో నిర్బంధిత ప్రొటస్టంట్లను రక్షించడానికై, బకింగ్‌హామ్ ప్రయత్నించాడు. కాని, చివరకు విజయం పొందలేక, రిక్త హస్తాలతో తిరిగి వచ్చాడు. దాదాపు ఎనిమిది వేల సైన్యంతో వెళ్ళిన డ్యూక్, అందులో సగం మందిని పోగొట్టుకున్నాడు.

### 2.1.2 డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ (Duke of Buckingham)

BRAOU

ఛార్లెస్ పరిపాలనా ప్రారంభంలో డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ ఇంగ్లాండ్ వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకొని, దాదాపు తానే రాజనే భావనతో మెలిగాడు. యువరాజుగా ఉన్న సమయాన్నుండి ఛార్లెస్, బకింగ్‌హామ్‌కు అత్యంత సన్నిహితుడు. స్పానిష్ రాకుమార్తెతో ఛార్లెస్‌కు వివాహం జరిపించడానికై, జేమ్స్ అనుమతితో మారు వేషంలో స్పెయిన్‌కు వెళ్ళి, పరాభవం పొందిన తర్వాత, ఆదేశంపై అతను యుద్ధాన్ని జరిపించాడు. అతని ప్రభావం ఒకటో ఛార్లెస్‌పై ఎక్కువగా ఉండేది. ఛార్లెస్ పాలనా తొలి రోజుల్లో , బకింగ్‌హామ్ జోక్యం కలిగించుకోని రాచకార్యం ఏదీ ఉండేదికాదు.

బకింగ్‌హామ్ అసలుపేరు జార్జి విల్లియర్స్ (George Villiers). మంచి దేహదార్ఢ్యం కల్గి, అన్ని సైనిక విద్య లభ్యసించి నాతడు, ఒకటో జేమ్స్ దృష్టికి వచ్చాడు. మంచి తెలివితేటలు, ధైర్య సాహసాలు, పరిపాలనా దక్షత, ఉన్నందున త్వరగా ఉన్నత పదవులను చేపట్టగల్గాడు. అతనిలో అకుంఠిత ఆత్మ విశ్వాసం ఉండేది. స్వలాభాపేక్ష, సమస్తమూ సాధించాలనే వాంఛ, అతనిలో అధికం. జేమ్స్ కాలంలోనే పలుకుబడి పొందిన బకింగ్‌హామ్, ఛార్లెస్‌కు మిత్రుడిగా, సన్నిహితుడిగా, మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాడు. ఛార్లెస్ రాజైన తర్వాత, అతనికి, పార్లమెంట్‌కు, పెట్టని గోడలాగా అడ్డునిల్చాడు. బకింగ్‌హామ్ సలహాలను పాటించిన ఛార్లెస్, పార్లమెంట్‌తో మాటిమాటికీ, తగాదా పడ్డాడు. రాజీపడే ఆస్కారమే లేకుండా పోయింది. పార్లమెంట్ అతన్ని ఏవగించుకుంది. ప్యూరిటన్లు ద్వేషించారు. సామాన్య ప్రజలు అసహ్యించుకున్నారు. కాని, చక్రవర్తి అండగల బకింగ్‌హామ్, తన అనవసర జోక్యాన్ని తగ్గించలేదు. పార్లమెంట్ సభ్యులు అతనిపై అభిశంసన తేగా, ఛార్లెస్ ఆ పార్లమెంట్‌నే రద్దుచేసి, తన మిత్రుని రక్షించాడు.

## 2.2 బకింగ్‌హామ్ మరణం

1628లో ఫ్రెంచి ప్రొటస్టంట్ల సహాయానికై, లారోషెల్‌ను ఆక్రమించడానికై, డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ మరో దండయాత్రను కొనసాగించడానికై, పోర్ట్స్‌మౌత్ చేరుకున్నాడు. ఫెల్టన్ అనే సేనాని, బకింగ్‌హామ్‌ను ద్వేషించి, గదిలోకి ప్రవేశించి, కత్తితో పొడిచి చంపాడు. బకింగ్‌హామ్ మరణవార్త తెలియగానే, ఇంగ్లాండ్‌లోని ప్రజలందరూ సంబరపడ్డారు. లండన్ వీధుల్లో ప్రజలు బాగా త్రాగి, సంబరంగా నాట్యం చేశారు. ఫెల్టన్ సాహసకృత్యాన్ని శ్లాఘిస్తూ, పాటలు కూడా రాశారట. డ్యూక్ శవాన్ని రహస్యంగా తెప్పించి, ప్రభుత్వం వెస్ట్‌మినిస్టర్ ఆబెలో, ఆడంబరాలు లేకుండా ఖననం చేయించింది.

రాజుకు అత్యంత సన్నిహితుడైన బకింగ్‌హామ్, తన దుష్ప్రవర్తనతో, హ్రస్వదృష్టితో, తప్పుడు సలహాలనిచ్చి, అనవసర జోక్యంతో పార్లమెంట్‌లో తగాదాలు తెప్పించి, రాజు, ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించినందువల్లనే, ఛార్లెస్‌ను ప్రజలు ద్వేషించారు. విప్లవానికి దారితీసిన కారణాలను ఊహించగల్గితే, బకింగ్‌హామ్ నిర్వహించిన పాత్ర, అట్టి విప్లవానికి దోహదం చేసిందని చెప్పవచ్చు.

## 2.3 ఛార్లెస్ మత విధానాలు

జేమ్స్ కాలంలో మత సామరస్యం ఉండేది కాదు. బహిరంగంగా మత పక్షపాత వైఖరులు లేవనే చెప్పాలి. అతని కాలాన్ని మతపరంగా, "శాంతి సమయం"గా అభివర్ణించారు. ఒకటో ఛార్లెస్ అధికారానికి రావడంతో, మతరంగంలో గల శాంతి అంతమైంది. రాజు "ఇంగ్లాండ్ చర్చి" అనుచరుడు. మత విషయాల్లో అతనికి, ఆర్చిబిషప్ లాడ్ (Archbishop Laud) సన్నిహిత సలహాదారు. ఇంగ్లాండ్‌లో ఏర్పడ్డ 'హైచర్చి' పార్టీకి, లాడ్ నాయకుడు. ఈ హైచర్చి పార్టీ రోమన్ కాథలిక్ మతాన్ని పోలి ఉండేది. దీని అనుచరులు "ఇంగ్లాండ్‌లో కాథలిక్ మత వర్గాన్ని" స్థాపించడానికి ప్రయత్నించారు. రాజు ఈ వర్గాన్ని సమర్థించిన కారణంగానే, వారు కూడ అతని రాజకీయ కార్యక్రమాలన్నిటినీ సమర్థించారు. వారు ప్రార్థనాపీఠాన్ని, మత ప్రచారానికి గల ముద్రణా సాధనాలను, రాజకీయాలకై వినియోగించారు. పార్లమెంట్‌లో వచ్చే విమర్శలను లెక్కచేయకుండా, రాజు హైచర్చికి సంబంధించిన వారికి, ఉద్యోగాల్లో ప్రమోషన్లు ఇప్పించాడు. మాంటేగ్, లిసెస్టర్‌కు బిషప్‌గా నియమితుడయ్యాడు. లాడ్ మొదట లండన్ బిషప్‌గాను, తర్వాత కాంటర్‌బరీ ఆర్చిబిషప్‌గాను, నియమితుడైనాడు. ఛార్లెస్ పాలనా కాలంలో, రాజకీయాలకు, ఇంగ్లాండ్ చర్చికి, దగ్గర సంబంధం నెలకొన్నది. తాను 1649 లో మరణ శిక్ష పొందడానికి ముందు, "ఇంగ్లాండ్ చర్చి" కై నేను ప్రాణాలు వదులుతున్నాను" అని ఛార్లెస్ ప్రకటించాడు.

ఛార్లెస్‌కు సన్నిహిత సలహాదారుడైన ఆర్చిబిషప్ కూడ, దేశంలోని ప్యూరిటన్‌లను, రాజుకు వ్యతిరేకులుగా చేశాడు. చాల తెలివితేటలు కల్గిన లాడ్, మంచి వక్త. మత విషయంగా, కొత్త పన్నులు, జైలు శిక్షలు విధించి, దేశ బహిష్కరణలు గావించాడు. ప్యూరిటన్‌ల పలుకుబడిని తగ్గించటానికి, దృఢ నిశ్చయుడైనాడు. ఇంగ్లాండ్ చర్చి నాయకుడైనందున, దానిలో క్రమశిక్షణను ఏర్పర్చాడు. అనేక మంచి పద్ధతులను ప్రవేశపెట్టాడు. చర్చి లోపల మాట్లాడటం, పొడుగాటి హేట్‌లతో అలంకరించు కోవడం లాంటి వాటిని రద్దుచేశాడు. లండన్‌లో ప్రభుత్వ సెయింట్ పాల్ చర్చిని, ఉబుసుపోకకై, సోమరులందరుచేరి, ఉపయోగించుకోడాన్ని నిలుపుచేశాడు. ప్యూరిటన్‌లకు ఆగ్రహం కల్గించే విధంగా, చర్చిలో గల ప్రార్థనావేదికలను, తూర్పుభాగం చివరకు మార్పించాడు. లాడ్ తీసుకున్న ఈ

చర్యల మూలంగా, దేశవ్యాప్తంగా చర్చి పరిధి ప్రాంతాలను (Parishes) తనిఖీ చేయడం, అచ్చటి మత వ్యాపక పరిస్థితులను పరిశీలించడం జరిగింది. పుస్తకాలు, నోటీస్‌లు, కరపత్రాలు మొదలైనవన్నీ నిషిద్ధాలు. హైచర్చికి వ్యతిరేకంగా కృషిచేసిన వారందరికి, కఠిన శిక్షలను విధించడం జరిగింది.

లాడ్ ప్రవేశపెట్టిన మత చట్టాలను భరించలేక, దాదాపు వేయి మంది ప్యూరిటన్‌లు తమ గృహాలను వదలి, అట్లాంటిక్ సముద్రాన్ని దాటి, అమెరికా వెళ్ళారు. చాల పేరు పొందిన మత ప్రచారకులైన ప్రిన్ని (Prynne), బాస్ట్‌విక్ (Bastwick), బర్టన్ (Burton) మొదలైనవారిని, బిషప్‌లకు ఎదురు మాట్లాడిన కారణంగా, చెవులను కోయించి, చెరసాలలో పడవేశారు. ప్యూరిటన్‌లు తమ సాధారణ దుస్తులతో, పవిత్ర జీవన విధానాలతో, గంభీర వదనాలతో, కొందరికి చులకనగా కన్పించినా, వారి మత విధానాలకు, వారి జీవితాలతో దగ్గరి సంబంధం ఉన్నట్లు భావించేవారు. వారు మతోన్మాదులైనారంటే, అది కేవలం, వారు పాపానికి భయపడ్డం చేతనే. వారికి మరణమంటే, దేశ బహిష్కరణంటే, భయంలేదు. పాపానికి భయపడ్డవారు మిక్కిలి ధైర్యవంతులైరి. నిజాయితీ పరులుగా, ఇతరులకు లొంగని స్వాతంత్ర్య భావాల్ని వారు అలవర్చుకున్నారు. అందనేకులు ఉన్నత కుటుంబాలకు చెందినవారు. పెద్ద చదువులు చదివినవారు కూడ. దేశంలో సామాన్యులు, బీద ప్రజానీకం గూడ, ప్యూరిటన్ మతాన్నవలంబించారు. వారికి రాజు ఆజ్ఞల కన్నా, బైబిల్ లోని వాక్యాలు ప్రధానం.

రాజకీయాల్లో డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్, రాజు, ప్రజల మధ్య, అగాధాన్నేర్పర్చిన విధంగా, మత విషయాల్లో రాజు, ప్యూరిటన్‌ల మధ్య విభేదాలను, ఆర్చిబిషప్ లాడ్ సృష్టించాడు.

BRAOU

## 2.4 పార్లమెంట్‌తో సంబంధాలు

ఛార్లెస్ మొదటి నాలుగేండ్ల పాలనలో, పార్లమెంట్‌ను మూడు సార్లు సమావేశపర్చాడు. ప్రతిసారి పోట్లాడి, రద్దుచేశాడు. మొదటి పార్లమెంట్ జూన్, 1625లో ఎంతో ఉద్రిక్తతతోనే, సమావేశమైంది. పార్లమెంట్‌తో ప్రమేయం లేకుండా ఫ్రెంచి రాకుమార్తెను వివాహమాడటం, స్పెయిన్‌పై యుద్ధాన్ని ప్రకటించడం లాంటి విషయాలు, సభ్యులకు ఆగ్రహాన్ని కల్గించాయి. బకింగ్‌హామ్‌ను తొలగించినకాని, కొత్త పన్నుల వసూలును అనుమతించరాదని తీర్మానించారు. కామన్స్ సభలోని అనేకులు, వర్తక ప్రముఖులు. అమెరికాలో, వెస్టిండీస్ దీవుల్లో వారికి, వర్తకవాణిజ్యాల లావాదేవీలుండేవి. వారు స్పెయిన్ పై నౌకాయుద్ధాన్ని కొనసాగించాలని కోరారు. కాని, తన ప్రియమిత్రుని తొలగించమని కోరడం, తన పథకాలను విమర్శించడం సహించలేని ఛార్లెస్, వెంటనే (ఆగస్ట్, 1625) పార్లమెంట్‌ను రద్దుచేశాడు. అప్పటికి వారు, రాజు వసూలు చేయదల్చిన టన్నేజి, పౌండేజీకి కూడ, అనుమతిని ప్రకటించలేదు. (ఇంగ్లాండ్‌లో ప్రాచీన కాలాన్నుండి రాజు, ప్రతి పీపా మద్యానికి, ప్రతి పౌను వర్తక సరకులకు, సుంకాలను వసూలు చేసేవాడు. వీటికే, "టన్నేజ్, పౌండేజ్" అని పేరు).

ధన అవసరాల దృష్ట్యా, కొత్త పన్నుల వసూలుకై తగు అనుమతిని పొందడానికని, వెంటనే, (ఫిబ్రవరి, 1626) ఛార్లెస్ రెండో పార్లమెంట్‌ను సమావేశపరచాడు. ఆగ్రహంతో ఉన్న ఈ పార్లమెంట్‌కు, సర్‌జాన్ ఇలియట్ (Sir John Eliot) నాయకుడు. బకింగ్‌హామ్ కార్యకలాపాలను విమర్శించిన పార్లమెంట్ నాయకులు, అతనిపై అభిశంసన తీర్మానాన్ని తేవడానికి ప్రయత్నించినందున, ఛార్లెస్ యీ పార్లమెంట్‌ను గూడ, వెంటనే (జూన్, 1626) రద్దుచేసి, ఇలియట్‌ను లండన్ టవర్‌లో ఖైదు చేశాడు.

ఫ్రాన్స్‌తో పోరాడి, లారోషెల్ ప్రాంతాన్ని కైవసం చేసుకోవడానికై, బ్రిటీష్ సేనలను పంపాల్సిన సందర్భంలో, యుద్ధ ఖర్చులకై కావాల్సిన మొత్తాలను వసూలు చేయడానికై, ఛార్లెస్ "నిర్బంధ అప్పు"లను (Forced loans) వసూలు చేయ నారంభించాడు. అప్పులను ఇవ్వాల్సిందని ప్రజలను నిర్బంధించి, మొత్తాలను వసూలు చేయడానికి, అధికార్లను నియమించాడు. నిరాకరించిన ధనవంతులు, భూస్వాములు, ప్రభుత్వ ఆగ్రహానికి గురైనారు. అనేకులు జైలు శిక్షలను గూడ అనుభవించారు. అయినా, కావాల్సిన మొత్తాలు రానందున, 1628, మార్చిలో మూడో పర్యాయం పార్లమెంట్‌ను సమావేశపర్చాడు.

## 2.5 హక్కుల పత్రం (Petition of Right), 1628

మూడో పార్లమెంట్ సమావేశం కావడంతోటే, సభ్యులందరూ జాన్ ఇలియట్, థామస్ వెంట్‌వర్త్ వంటి నాయకులు కలసి, ఒక వినతి పత్రాన్ని తయారుచేశారు. దీన్ని, కోరికల పత్రమనడానికి లేదు. ఇందులో ప్రాచీన కాలం నుండి బ్రిటీష్ ప్రజలకు గల చట్టాలను, హక్కులను, రాజు విస్మరించరాదని మాత్రం గుర్తు చేశారు. వారి ప్రకారం, ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా కొన్ని హక్కులు, పార్లమెంట్‌కున్నాయి. పార్లమెంట్ అనుమతి లేకుండా వసూలు చేసే పన్నులు, విచారణ లేకుండా ఖైదులో ఉంచడం, నిర్బంధంగా సైనికులిగా తీసుకోవడం, సైనిక పాలనను ప్రవేశపెట్టడానికి సంబంధించిన హక్కులను, ఆపత్రంలో వారుదహరించారు. ధనంకై కక్కుర్తిగల ఛార్లెస్, పత్రంపై ఆమోదముద్ర వేసినగాని, తనకు పన్నుల వసూలు వీలుకల్పించరని, దానికి ఒప్పుకున్నాడు. ప్రజలు దీన్ని తమ విజయంగా భావించి, దేశంలో చాలచోట్ల "నెగిడి మంటలు" (Bonfire) వేసి, సంతోషాన్ని వెలిబుచ్చారు. కాని, దైవాంశచే పాలిస్తున్నానన్న ధోరణి కల్గిన ఛార్లెస్, సామాన్య మానవుల కెచ్చిన అభయాన్ని, పూర్తిగా ఆచరించాలనే నియమాన్ని పాటించలేదు.

1629 లో పార్లమెంట్ మరో దఫా సమావేశమైంది. ఈ సారి రాజుతో, మరిన్ని వైషమ్యాలు కల్గాయి. దేశంలో మత విషయాలకు కూడ తానే ఉన్నతాధికారైనందున రాజు, పార్లమెంట్ సభ్యులు మత విషయాలేవీ చర్చించ నవసరం లేదని భావించాడు. ప్రభుత్వ విషయాల్లో తమ పాత్ర లేకుండా రాజు స్వయాన పాలించడ మిష్టంలేని పార్లమెంట్ సభ్యులు, టన్నేజ్, పౌండేజ్ సుంకాలను ఒక సంవత్సరానికి మాత్రం వసూలు చేసే అనుమతినిచ్చారు. కాని, ఛార్లెస్ ఇది తన జీవిత కాలమంతా ఉండాలని కోరాడు. కోపంతో రాజు, పార్లమెంట్‌ను రద్దు చేయమని తన వార్తాహరుని పంపాడు. కాని, ఆ భటుడు కామన్స్ సభలో ప్రవేశించడానికి ముందు, కామన్స్, వారి సిద్ధాంతాలను తీర్మానాలుగా వెల్లడి చేయడానికి నిర్ణయించారు. స్పీకర్ దీని నంతను రద్దు చేయాలని ప్రయత్నించాడు. కాని, అప్పటికే కొందరు సభ్యులు, స్పీకర్‌ను ఆయన కుర్చీలోనే అదిమిపట్టుకోగా, సర్ జాన్ ఇలియట్ సభ్యుల మూడు తీర్మానాలను, అందరకు చదివి విన్పించాడు. అవి: 1. ఎవ్వరూ కూడ, హైచర్చికి మద్దతు నివ్వరాదు. 2. ఇంగ్లాండ్‌లోని ప్రొటెస్టంట్ మతాన్ని మార్చడానికి ప్రయత్నించరాదు. 3. ఎవ్వరూ కూడా, పార్లమెంట్ అనుమతి లేకుండా, టన్నేజ్, పౌండేజ్ సుంకాలను వసూలు చేయరాదు. వీటిని వ్యతిరేకించిన ప్రజలు, దేశ శత్రువులు, దేశ స్వాతంత్ర్యాన్ని హరించేవారుగా పరిగణన పొందుతారు. తన కుర్చీలో స్పీకర్ విల విల లాడుతుంటే, రాజ భటులు తలుపులు మోదుతూఉంటే, పైమూడు తీర్మానాలను పార్లమెంట్ ఆమోదించింది. దీని తర్వాత రద్దైన పార్లమెంట్ దాదాపు 11 ఏండ్ల వరకు, తిరిగి సమావేశం కాలేదు.

## 2.6 ఛార్లెస్ వ్యక్తిగత పాలన, 1629-1640

పార్లమెంట్‌ను రద్దుపర్చిన ఛార్లెస్, తన తండ్రివలె, పార్లమెంట్‌తో ప్రమేయం లేకుండా పాలించడానికి నిర్ణయించుకున్నాడు. అతని ప్రధాన సమస్య, తగినంత ధనాన్ని వసూలు చేయడం. విదేశాలతో మైత్రి చేసుకొని, ఆంతరంగికంగా అధిక వ్యయం లేకుండా, అతి తక్కువ ఖర్చు చేయసాగాడు. పార్లమెంట్‌లో ప్రధాన పాత్ర వహించిన నాయకులను ఖైదులో ఉంచి, అక్రమంగా పన్నులు వసూలు చేయనారంభించాడు. స్టార్ ఛాంబర్ కోర్ట్, హైకమీషన్ కోర్ట్‌లనే ప్రత్యేక న్యాయస్థానాలను పునరుద్ధరించాడు. స్టార్ ఛాంబర్ కోర్ట్‌లో ప్రీవీ కౌన్సిలర్లు, ఇద్దరు ఇతర న్యాయవేత్తలు, సభ్యులుగా ఉండేవారు. వీటికి దేశంలోని ఎవరినైనా హాజర్ పర్చి, అపరాధాలను వేయడం, లేదా, జైలు శిక్ష విధించే అధికారముండేది. వీటి చట్టాలు, ఇతర న్యాయస్థానాలకు అతీతంగా కూడ ఉండేవి. ఈ కోర్టులు ఏడో హెన్రీ కాలంలో ఆచరణలో ఉండేవి. కాని, తర్వాత ప్రజలు వీటిని రాజ నిరంకుశత్వానికి సాధనాలుగా భావించి, నిరసించేవారు. ఛార్లెస్ అట్టివాటిని పునరుద్ధరించి, తన వ్యక్తిగత పరిపాలనను పటిష్టం చేసుకున్నాడు. హై కమీషన్ న్యాయస్థానం మతపరమైన అపరాధాలను వసూలుచేసి, బిషప్‌లను, మత పద్ధతులను విమర్శించినవారికి కఠిన శిక్షలను విధించేది.

పాత కాలం నాటి ఫ్యూడల్ చట్టాలను తిరిగి ప్రవేశపెట్టాడు. విధేయులైన న్యాయవాదులను నియమించి, పాత పత్రాలను తిరగవేయించి, ధనవంతులపై కొత్త పన్నులు విధించే పథకాలను తయారు చేశాడు. మధ్యయుగంలో సాలుసరి 40 పౌన్ల ఆదాయంగల భూములున్న వారందరు, యోధుడు (Knight) బిరుదుతో, రాజును సేవించే ఆచారం ఉండేది. అయితే, దీన్ని నిర్వర్తించలేనని, అట్టివారి వారసులందరినీ, అపరాధాలను చెల్లించాల్సిందిగా ఆదేశించాడు. బంజరు భూములన్నీ, ఒకప్పుడు "రాజు అడవులు" (Royal Forests) గా పరిగణించేవారు. కాని, అవి శతాబ్దాల తరబడి, సాగులో కొనసాగాయి. రైతుల నుండి, పది నుండి ఇరవైవేల పౌన్ల వరకు, "అడవి భూముల" నాక్రమించినందుకు, అపరాధాలను వసూలు చేశాడు. వర్తక సంస్థల నుండి "గుత్తాధికార" (monopolies) సుంకాలను రాబట్టాడు. ఇది చట్టవిరుద్ధమైందిగా, లోగడ పార్లమెంట్ చెప్పినా ఖాతర్ చేయలేదు. "ఓడ పన్ను" (Ship money), ఛార్లెస్ నిరంకుశ పాలనలో విధించిన అన్ని సుంకాల్లోను, బాగా గణనకొచ్చింది. "ఓడ పన్ను" (Ship money) కింద, ప్రాచీన కాలంలో సముద్ర తీరంలో గల నగరాలు, యుద్ధ సమయాల్లో కావాల్సిన నౌకలను రాజుకు పంపే ఆచారం ఉండేది. కాని, ఈ పద్ధతి ఎప్పుడో మూల పడింది. అయితే, ధనాన్ని అధికంగా రాబట్టే కార్యక్రమంలో భాగంగా, ఛార్లెస్ యీ "ఓడ పన్ను"ను తిరిగి ప్రవేశపెట్టి, తీర ప్రాంతాలవారే గాక, దేశంలోని అన్ని ప్రాంతాలవారికి రక్షణ బాధ్యతలున్న కారణంగా, అందరూ "నౌకలకై" యీ సుంకాన్ని కట్టాలని ఆదేశించాడు. ఆరోజుల్లో సముద్రపు దొంగలు ఇంగ్లీష్ ఛానల్‌లో వచ్చే బ్రిటీష్ నౌకలను దోచుకుంటూ ఉండేవారు. వారిని ఎదుర్కొనడానికి, ఛార్లెస్ తలచినట్లు, కొత్తనౌకలు అవసరమైనాయి. కాని, అట్టి కొత్త పన్నును పార్లమెంట్ అనుమతి లేకుండా వసూలు చేయడం, న్యాయానికి విరుద్ధం. జాన్ హాంప్డెన్ (John Hampden) బకింగ్‌హామ్‌షైర్ కు చెందిన సంపన్న ప్రభువు. ప్యూరిటన్ నాయకుడు. అతడు లోగడ పార్లమెంట్ సభ్యుడు కూడ. ఇతడు "ఓడ పన్ను" సుంకాన్ని చెల్లించడానికి నిరాకరించాడు. న్యాయస్థానంలో విచారణ జరిగింది. మొత్తం పన్నెండుగురు న్యాయమూర్తుల్లో ఐదుగురు, హాంప్డెన్‌ను సమర్ధించారు. ఏడుగురు రాజుకు మద్దతును ప్రకటించి, "ఓడ పన్ను"ను కట్టాల్సిందని ఆదేశించారు. హాంప్డెన్, కేస్‌ను పోగొట్టుకున్నా,

BRAOU

అతడు రాజును వ్యతిరేకించడం, ఇతరులకు గొప్ప మార్గదర్శకమైంది. వ్యక్తి స్వాతంత్ర్యానికై రాజును ఎదిరించడం సాధ్యమేనని, దీనివల్ల స్పష్టమైంది.

ఓడ పన్ను ఉదంతం తర్వాత, రాజు ఆర్థికంగా పొందిన స్వేచ్ఛను, ప్రజలు హర్షించలేదు. ఆ పన్ను వసూలును సవ్యంగా జరగనివ్వలేదు. ప్రతిపక్ష నాయకులు లండన్ నగరంలో అప్పుడప్పుడు సమావేశాలు జరిపి, భవిష్యత్తులో తాము నిర్వహించాల్సిన పాత్ర గురించి, చర్చించేవారు. హాంప్టన్ కేస్‌ను వాదించిన ఆలివర్ సెంట్ జాన్ అనే ప్యూరిటన్ న్యాయవాది, జాన్ పిమ్ (John Pym) మొదలైన నాయకులందరు, అట్టి సమావేశాల్లో ప్రధాన పాత్ర వహించారు. ముప్పై సంవత్సరాల యుద్ధం పట్ల, రాజు వహించిన ఉదాసీనతను, వారు ఖండించారు. ఇంగ్లాండ్ ఆ యుద్ధంలో పాల్గొని, ప్రొటస్టెంట్లకు సహాయపడాలని వారు భావించారు.

ఛార్లెస్ పరిపాలనా కాలంలో, ఆర్చిబిషప్ విలియం లాడ్ మత విషయాల్లో సలహాదారుగా ఉండి, ప్యూరిటన్‌ల ద్వేషాన్ని చూరగొన్న విధంగానే, థామస్ వెంట్‌వర్త్ అనే అంతరంగికుడు, ఐర్లాండ్‌లో ఛార్లెస్‌కు వ్యతిరేకులను సృష్టించాడు. వెంట్‌వర్త్ అనేక సంవత్సరాలు ఐర్లాండ్‌లో క్రూరంగా పాలన సాగించాడు. అచ్చటి అధిక సంఖ్యాకులైన కాథలిక్‌లు, ప్రొటస్టెంట్ ప్రతినిధైన వెంట్‌వర్త్‌కు ఎదురుతిరిగేవారు. అచ్చటి కొంతమంది కాథలిక్ భూస్వాములున్నా, అధిక సంఖ్యాకులు పేదవారు. ఛార్లెస్ ప్రతినిధిగా వెంట్‌వర్త్, వారినందరిని నిర్దాక్షిణ్యంగా అణచి, అనేక పన్నులు వసూలుచేసి, అతని కెదురైన ప్రతిపక్షాలవారిని నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. ఐరిష్ పార్లమెంట్‌ను ఖాతర్ చేయకుండా అతడు ప్రవర్తించిన తీరుతో, అచ్చటి ప్రజలు ఛార్లెస్ పాలన పట్ల, అసమ్మతిని ప్రకటించారు. వెంట్‌వర్త్ ఎక్కడ ఇంగ్లాండ్‌కు బదిలీ అవుతాడోనని, ఇంగ్లాండ్ ప్రజలు భయపడేవారు.

## 2.7 స్కాట్‌లాండ్ సమస్య

ఛార్లెస్, పార్లమెంట్ ప్రమేయం లేకుండా కొనసాగించిన నిరంకుశ పాలన సవ్యంగా సాగినా, తాను చేసిన తప్పిదాల మూలంగా, ఎట్టకేలకు పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది, స్కాట్‌లాండ్ విషయంగా తలెత్తిన సమస్య.

ఛార్లెస్ ఎప్పుడూ స్కాట్‌లాండ్‌లో నివసించలేదు. స్కాట్ ప్రజల మనస్తత్వాలను తెలుసుకోవాలని గాని, ప్రత్యేక పాలనా వ్యవస్థ ఉండాలనే దృష్టిగాని, వారి ప్రెస్బిటేరియన్ మతం ఎడ గౌరవంగాని, అతనికి లేదు. 1637లో ఛార్లెస్, విలియం లాడ్‌లు, స్కాట్‌లాండ్ ప్రజలు జాన్‌నాక్స్ (John Knox) తయారుచేసిన "కామన్ ఆర్డర్" *(Common Order)*కు బదులుగా, బ్రిటీష్ పద్ధతిలోని ప్రార్థనా గ్రంథాన్ని నుసరించాలని ఆదేశించారు. దీన్ని అమలు జరపడానికి ప్రయత్నించగా, ఎడింబరోలో స్కాట్ ప్రజలు పెద్ద తిరుగుబాటును లేవదీశారు. వేలాది ప్రజలు తమ ప్రెస్బిటేరియన్ మతాన్ని రక్షించుకోవాలని, స్కాట్‌లాండ్ అంతటా ప్రదర్శనలు జరిపారు. క్రొత్త ప్రార్థనా పద్ధతులను ఎవరూ అంగీకరించలేదు. స్కాట్ ప్రజలు చర్చి ఆవరణలల్లో చేరి, తమ జాతీయ మతాన్ని సంరక్షించుకోడానికై శపథాలు చేసి, సంతకాలు చేశారు. మరెవరైనా అయితే, తమ తప్పులను తెలుసుకొని స్కాట్ ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని సరిదిద్దుకొని ఉండేవారు. ఛార్లెస్ స్కాట్‌లాండ్ ప్రజలను తన ఉక్కు హస్తాలతో అణచివేయ నిర్ణయించాడు.

పెద్ద సైన్యాల నుంచడానికి, ఛార్లెస్ వద్ద తగిన ధనం లేదు. అందుచే, తన అనుయాయులైన భూస్వాములను సైన్యాన్ని తయారుచేయుమని ఆదేశించాడు. వారు తమ అధీనంలోని రైతులను గూడ, సైనికులుగా రప్పించారు. వారికి తగిన తర్ఫీదులేదు. వారివద్ద ఆయుధాలు లేవు. కాని, స్కాట్‌లాండ్‌కు అదృష్టవశాత్తు, మంచి సైనిక నాయకులున్నారు. వారనేకులు ముప్పై సంవత్సరాల యుద్ధంలో పాల్గొని, హాలండ్, స్వీడన్, జర్మనీ దేశాల్లో పనిచేసి, మంచి తర్ఫీదును పొందారు. స్కాట్‌లాండ్ సేనలు బ్రిటీష్ సేనలను పూర్తిగా ధ్వంసం చేసి ఉండేవి. ఇది తెలుసుకున్న ఛార్లెస్, స్కాట్‌లాండ్‌తో సంధిచేసుకున్నాడు. వివాదగ్రస్తమైన అన్ని విషయాలను, కొత్త స్కాటిష్ పార్లమెంట్‌కు అప్పజెప్పడానికి, అదే విధంగా కొత్త స్కాటిష్ చర్చి సమాఖ్య ఏర్పడ్డానికి, రాజు అంగీకరించాడు. దీన్నే బెర్విక్ సంధి (Treaty of Berwick) అంటారు. యుద్ధానికి బిషప్‌ల యుద్ధమని పేరు.

కాని, తర్వాత, స్కాటిష్ పరాభవాన్ని తొలగించుకోడానికి, తన అపజయాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించని ఛార్లెస్, స్కాట్‌లాండ్‌పై దృష్టిని మరల్చాడు. ఐర్లాండ్‌లో ప్రజలకు భీతి గల్గించే పాలకుడుగా పేరు పొందిన, తన అనుచరుడు వెంట్‌వర్త్‌ను రప్పించాడు. అతన్ని స్ట్రాఫర్డ్ ప్రాంతానికి ప్రభువుగా ప్రకటించాడు (Earl of Strafford). స్కాట్‌లాండ్ విషయాలను పరిష్కరించాల్సిందిగా ఆదేశించాడు. రాజును అత్యంత అధికారయుక్తమైన ప్రభువుగా చేయడానికి, తన శాయశక్తులా కృషిచేయడానికి వెనుకాడనివాడు, వెంట్‌వర్త్. అతడు పార్లమెంట్‌కు భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పి, పార్లమెంట్‌ను సమావేశపర్చే సలహా ఇచ్చాడు. అతని సలహామేరకు, చార్లెస్ దేశంలో ఎన్నికలు జరిపించి, పార్లమెంట్‌ను ఏర్పాటుచేశాడు.

పదకొండు ఏండ్ల తర్వాత, 1640 లో సమావేశమైన పార్లమెంట్, అతి తక్కువ కాలం మాత్రమే కొనసాగింది. ఇరవై మూడు రోజులు మాత్రమే ఉన్న యీ పార్లమెంట్‌లోని సభ్యులు, జాన్‌పిమ్ నాయకత్వంలో రాజుకు వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన వర్గం ఏర్పడిందన్న విషయాన్ని తెలుసుకున్నారు. స్కాట్‌లాండ్‌లో యుద్ధానికై అవసరమయ్యే కొత్త పన్నుల నంగీకరించడంకన్న, జాన్‌పిమ్, అతని అనుచరులు, తమ కోర్కెలను ఏకరువు పెట్టడం చేత ఆగ్రహించిన ఛార్లెస్, పార్లమెంట్‌ను రద్దుచేశాడు.

లండన్‌లోను, పరిసర ప్రాంతాల్లోను, మొట్టమొదటిసారిగా తిరుగుబాట్లు, అల్లర్లు జరిగాయి. కార్మికులు ఎదురుతిరిగి, ఆర్చ్‌బిషప్‌ను బెదిరించారు. కనబడ్డ బిషప్‌ల నందరిని అటకాయించారు. ఇది అదనుగా భావించి, స్కాట్ ప్రజలు ఇంగ్లాండ్‌పై యుద్ధాన్ని ప్రకటించారు. వెంట్‌వర్త్ ఒక సైన్యాన్ని సమీకరించాడు. కాని, ఇది ఎక్కువగా ప్యూరిటన్‌లు గల సైన్యమైనందున, స్కాట్‌లాండ్ ప్రజలతో పోరాడ నిరాకరించింది. అంతలో, స్కాట్ సైన్యాలు ఇంగ్లాండ్ సరిహద్దును దాటి, లోపల ప్రవేశించాయి. న్యూకాజిల్ (Newcastle) పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఛార్లెస్ వెంటనే స్కాట్‌లాండ్‌తో సంధిచేసుకున్నాడు. సంధి ప్రకారం ఛార్లెస్ స్కాట్‌లాండ్‌కు అమిత మొత్తాలను చెల్లించాల్సొచ్చింది. అది చెల్లించే వరకు, వారు ఇంగ్లాండ్ సరిహద్దుల్లో దాదాపు ఆరు ప్రాంతాలను ఆక్రమించుకొన్నారు. అంచేత, ఛార్లెస్ మరోసారి పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సొచ్చింది. స్కాట్‌లాండ్‌తో జరిగిన ఈ యుద్ధాన్ని, రెండో బిషప్‌ల యుద్ధమని పేరు.



BRAOU

## 2.8 దీర్ఘకాలిక పార్లమెంట్ (Long Parliament)

1640 లో సమావేశపర్చిన పార్లమెంట్‌కు, దీర్ఘకాలిక పార్లమెంటని పేరు. దీన్ని దాదాపు 20 ఏండ్లవరకు రద్దు పర్చలేదు. ఈ పార్లమెంట్ కాలంలోనే అంతర్యుద్ధం చెలరేగిన కారణంగా, రాజును పదవీచ్యుతుని చేయడం, రాజరికాన్ని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగాయి. ఎన్నికల్లో పిమ్ (Pym), హాంప్డన్ (Hampden) దేశమంతా తిరిగి, ప్యూరిటన్‌లకు ఓటు వేయమని ప్రజల్లో ప్రచారం చేసినందు వల్ల, పార్లమెంట్ సమావేశం కాగానే, రాజు నిరంకుశ పాలనను శాయశక్తులా ఎదిరించ నిశ్చయించారు. సభ్యులు చాలా వరకు ముందున్న వారే. వారందరు స్ట్రాఫోర్డ్‌ను ఏదో విధంగా తొలగించడానికి గూడ, నిర్ణయించుకున్నారు. స్టూవర్ట్ రాజులు సింహాసనానికి వచ్చినప్పటినుండి, జాతీయవాదులు, ప్యూరిటన్ నాయకులు కేవలం హక్కుల పరిరక్షణకు తగిన చట్టాలన్నీ చదివేవారు. కాని, సుదీర్ఘ పార్లమెంట్ సమావేశం తర్వాత, పార్లమెంట్‌లోని ప్రధాన పార్టీలైన "రౌండ్ హెడ్స్" (Round heads: వీరు గుండు గీయించుకొనేవారు) "కవాలియర్లు" (Cavaliers) సైన్యాలను సమీకరించడాన్ని గూర్చి ఆలోచించసాగారు. అంటే, దేశంలో అంత గొప్ప మార్పు సంభవించిందన్నమాట. నాయకత్వం వహించడంలో అతడు నేర్పరి. ఈ పార్లమెంట్‌ను ముందువాటిలాగే రద్దుచేయనీయకూడదని, ప్రజల్లో ప్రచారం చేశాడు. ప్రజా సంఘాలను కలిసి, నచ్చచెప్పాడు. అందువల్ల, 1640లో సమావేశమైన దీర్ఘకాలిక పార్లమెంట్, కేవలం రాజు చెప్పుచేతల్లో లేదు. ప్రజలు దీనికి అండగా నిల్చారు.

దీర్ఘకాలిక పార్లమెంట్‌లో మరో ప్రత్యేకత, కొన్ని రాజకీయ పార్టీల ఆవిర్భావం. చార్లెస్ పదకొండేళ్ల నిరంకుశ పాలనలో, ఎట్టి రాజకీయ పార్టీలు లేకపోయినా, పార్లమెంట్ సభ్యులు కొన్ని సందర్భాల్లో ఒకటిగా కలిసి, కొన్ని నెలలపాటు ఒక ఇంట్లోచేరి, రహస్యంగా గడుపుతూ, క్రియాత్మక రాజకీయాలను చర్చించేవారు. ఇది రాజకీయ పార్టీల ఆవిర్భావానికి నాంది అయింది. అందులోని సభ్యుల్లో ప్రధానులు, పిమ్, హాంప్డన్, సెంట్ జాన్, బెడ్‌ఫోర్డు ప్రభువు, లార్డ్ సేయి, లార్డ్ మాండవెల్లి మున్నగువారు. వీరంతా 1640లో సమావేశమైనప్పుడు, దాదాపు ఒక సంవత్సరం లోపునే, పార్లమెంట్ ఒక చారిత్రక పాత్రను నిర్వహిస్తుందని ఊహించనుగూడ లేదు.

పార్లమెంట్ సభ్యులందరు, రాజుకు దుష్ట సలహాదారుడైన స్ట్రాఫర్డ్‌ను తొలగించడానికి సన్నద్ధులయ్యారు. కాని, ఎవరికీ భయపడని మనస్తత్వంగల స్ట్రాఫర్డ్, రాజుకు కావాల్సిన సైన్యాలను సంసిద్ధం చేయడంలో నిమగ్నమైనాడు. పార్లమెంట్‌లో పిమ్, అతని అనుచరులు అతనిపై అభిశంసన తీర్మానాన్ని తెచ్చారు. కామన్స్ సభలో నెగ్గిన తీర్మానం, ఎగువ సభైన లార్డ్స్ సభకు వెళ్ళింది. 1640 నవంబర్ 11వ తేదీ, స్ట్రాఫర్డ్‌ను బంధించి, లండన్ టవర్‌లో ఖైదు చేశారు. ఇద్దరు స్టూవర్ట్ రాజుల కాలంలో అధికంగా పన్నులు వసూలు చేయడానికి, పార్లమెంట్‌ను నిర్లక్ష్యం చేయడానికి సలహాలిచ్చిన రాజు అంతరంగికుడు, గొప్ప సైనిక నాయకుడైన స్ట్రాఫర్డ్, ఆవిధంగా పార్లమెంట్ చేత పరాభవాన్ని పొందాడు. ఊహించని విధంగా, అతన్ని నిర్బంధించడం జరిగింది. రాజు ఏ సమయంలోనైనా స్ట్రాఫర్డ్‌ను రక్షిస్తాడేమోనని భయపడి, అతనిపై "బిల్ ఆఫ్ అటైన్‌డర్" (Bill of Attainder) ను జారీ చేయించారు. దీనివల్ల, దేశద్రోహం అని చేసిన అభియోగాన్ని, ఎవరూ కాదనలేరు. దీనికి ఎగువ సభ ఆమోదం తెలిపిన తర్వాత, రాజు అంగీకారానికై వెళ్ళింది. కాని, రాజు సందేహించాడు. అంతకు ముందే, స్ట్రాఫర్డ్‌కు ఒక లేఖ రాస్తూ, తాను ఏ విధంగానూ అతన్ని కష్టాలపాలు చేయనని వాగ్దానం చేశాడు. అప్పుడు ఉత్తర ప్రాంత సేనలతో స్ట్రాఫర్డ్‌ను రక్షించడానికై,

రాజు పథకాన్ని వేస్తున్నాడన్న వదంతులు బయల్దేరాయి. దీంతో, లండన్ ప్రజలు ఆగ్రహించి, రాజ ప్రాసాదం (White Hall) చుట్టూ గుమికూడి, ప్రదర్శనలు చేయసాగారు. మర్రోజు చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి గూడా, అధిక సంఖ్యలో ప్రజలు గుమికూడి, ప్రదర్శనలు జరిపారు. ప్యూరిటన్ ప్రచారకుల ప్రమేయంలో పిమ్ ఇచ్చిన పిలుపుతో, ప్రదర్శనలు తీవ్రతరమైనాయి. రాజప్రాసాదంలో గొప్ప అలజడి ప్రారంభమైంది. అందులోని స్త్రీలు, పిల్లలు వాపోయారు. రాణి హెన్రియట్టా, రాజును పత్రంపై సంతకంచేసి, స్ట్రాఫర్డ్‌ను పార్లమెంట్ వధించడానికి, ఒప్పుకొమ్మని బతిమాలింది. కడపటికి, గత్యంతరం లేక, ఛార్లెస్ ఒప్పుకొని, 1641 మే 9 వతేది సంతకం చేశాడు. తనకు మిక్కిలి విశ్వాసపాత్రుడు, సన్నిహితుడైన స్ట్రాఫర్డ్‌కు, ముందిచ్చిన వాగ్దానాన్ని, ఛార్లెస్ నిలబెట్టుకోలేదు.

తన మరణదండనకు రాజు అంగీకరించాడన్న వార్తను, మొదట స్ట్రాఫర్డ్ నమ్మలేదు. కాని, తర్వాత ఇలా అన్నాడట: 'రాజుల మాటలపై ఎప్పుడూ విశ్వాసముంచొద్ద'ని. మూడు రోజుల తర్వాత, జైల్లోనే బంధితుడైన థామస్ లాడ్‌చే ఆశీర్వాదం పొంది, టవర్ ఆఫ్ లండన్‌లో దాదాపు రెండు లక్షల ప్రజలు చూస్తుండగా, శిరచ్ఛేదన సమయంలో మిక్కిలి ధీమాతో కనిపించాడట. ప్రజలు స్ట్రాఫర్డ్ మరణానికి సంతోషించారు. కామన్స్ సభ్యులు సంబరపడ్డారు. పిమ్ అన్నాడట. 'రాజు స్ట్రాఫర్డ్‌ను మనకిచ్చాడు. ఇక ఏదీ కాదనడ'ని.

స్ట్రాఫర్డ్ మరణంతో, లాడ్ అప్పటికే ఖైదులో ఉండడంచేత, అనేక పార్లమెంట్ సభ్యులు చాల సంతృప్తి పడ్డారు. దీంతో, రాజు గూడ సక్రమంగా వర్తిస్తాడని అందరూ తలచారు. కాని, పిమ్ దీంతో సంతృప్తి పడలేదు. వారు, రాజు అధీనంలోని అనేక అధికారాలను తొలగించ దలచారు. టన్నేజ్, పౌండేజ్ సుంకాలు, 'ఓడ పన్ను' ఇతర అనేక నిర్బంధ వసూళ్ళను రద్దుచేశారు. పార్లమెంట్ సభ్యుల అనుమతి లేకుండా రద్దుపర్చగూడదని నిర్ణయించారు. స్టార్ ఛాంబర్ కోర్ట్, హైకమీషన్ కోర్ట్ మొదలైన వాటిని వెంటనే తొలగించారు. 'మూడేండ్ల చట్టాన్ని' ( Triennial Act) ప్రవేశపెట్టి, ఎట్టి పరిస్థితుల్లోను మూడేళ్లలోపు పార్లమెంట్‌ను తప్పనిసరిగా సమావేశపర్చాల్సిందిగా, ఏర్పాటైంది. వీటన్నిటినీ, ఛార్లెస్ వేరుమార్గం లేక, ఒప్పుకున్నాడు. రాజకీయ విషయాల్లో పార్లమెంట్ సభ్యులు చేసిన ఈ చట్టాలు, శాశ్వతంగా నిల్చిపోయాయి. దీర్ఘకాలిక పార్లమెంట్ పై విధంగా, దేశంలో మొదటి సారిగా, తన ఆధిక్యాన్ని నిరూపించగల్గింది.

కాని, మత విషయాల్లో, పార్లమెంట్ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లేకపోయింది. కొంత మంది "చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్' సక్రమంగా ఉందని, అందులోని లాడ్ "ఆర్మీనియన్" ఉద్దేశాలను తొలగించిన, అదే అందరి అవసరాలకు సరిపోతుందని భావించారు. కాని, మరికొందరు చర్చిని స్కాట్‌లాండ్‌లోని ప్రెస్బిటేరియన్ పద్ధతిలో పూర్తిగా మార్చాలని భావించారు. పిమ్, హాంప్డన్, ఇతర అనుచరులు, "రూట్ అండ్ బ్రాంచ్ బిల్లు"ను ప్రవేశపెట్టి, ఆర్చిబిషప్‌లను, బిషప్‌లను, ఇతర మతాధికారులనందరిని మూకుమ్మడిగా తొలగించదల్చారు. కాని, ఇతరుల ప్రతికూలతవల్ల, దీన్ని ఉపసంహరించుకోవడం జరిగింది.

ఇదే సందర్భంలో, రాజు స్కాట్‌లాండ్‌ను సందర్శించాడు. అక్కడ, అతనికి మంచి ఆహ్వానం లభించింది. కాని, పార్లమెంట్‌కు ఇది నచ్చలేదు. పిమ్, రాజు అధికారాలను ఇంకా తగ్గించడానికి ప్రయత్నించాడు. రాజు అధీనం నుండి సైన్యాన్ని, నౌకాబలాన్ని తప్పించజూచాడు. తన కౌన్సిల్ సభ్యులను, ప్రభుత్వ ఉద్యోగులను నియమించే అధికారాన్ని గూడ రాజుకు లేకుండా చేయదల్చాడు. వీటన్నిటికి గూడ, ఛార్లెస్ అంగీకరించేవాడే. కాని, అంతలో, ఐర్లాండ్‌లో తిరుగుబాటు చెలరేగింది.

ఆకలి, నిరాశకు తోడు, మతకల్లోలాలవల్ల తిరుగుబాటు జరిగింది. దాదాపు నాలుగైదు వేలమంది ప్రొటెస్టంట్లను నిర్దాక్షిణ్యంగా చంపడం జరిగింది. అనేకులు బాధలకు గురయ్యారు. ఐరిష్ కాథలిక్‌లు, ప్రొటస్టంట్లను హింసించి నట్టి భయానక కథలు, ఇంగ్లాండ్ చేరగా, ప్రజలు కోపోద్రిక్తులైరి. కాథలిక్ తిరుగుబాటుదార్లను కఠినంగా అణచివేయాలని, ప్రతి ఒక్కరు భావించారు. ఒక క్రొత్త సైన్యాన్ని వెంటనే తయారు చేయాల్సిన అవసరమేర్పడింది. కాని, ఆకొత్త సైన్యం ఎవరి నాయకత్వంలో ఉండాలన్నది ప్రశ్న. తిరుగుబాటును అణచడానికి కొత్త సైన్యం అవసరమే. ఐర్లాండ్‌లో తిరుగుబాటును అణచిన తర్వాత, అదే సైన్యాన్ని ఉపయోగించి, రాజు పార్లమెంట్‌ను అణచివేయుడానికి గూడ వెనుకాడడని తలచడమైంది. అందుచే, సైన్యంపై అధికారం రాజుకు గాక, పార్లమెంట్ ఎవరిపై నమ్మకముంచుతుందో అట్టివారికివ్వాలని పిమ్ వాదించాడు. అతడు 'గ్రాండ్ రిమాన్‌స్ట్రెన్స్' (Grand Remonstrance) అనే ఒక పత్రాన్ని తయారుచేసి, అందులో రాజరికం, రాజు, మత విషయాలకు సంబంధించి చాలాకాలంగా ఉన్న తప్పులన్నీ వివరించాడు. ఇది రాజుకు, బిషప్‌లకు గల అధికారాలను చాలావరకు హరించే విధంగా, రాజరికాన్ని కించపర్చే విధంగా ఉంది. దీన్ని కామన్స్ సభలో చర్చించి, తమ ఆమోదాన్ని తెల్పారు. కొంత మంది మితవాదులు, రాజరికాన్ని అవమానపర్చేదిగా ఉందని వాదించారు. కాని, కొద్ది ఆధిక్యతతో, "గ్రాండ్‌రిమాన్‌స్ట్రెన్స్" కు ఆమోదముద్రపడింది. కామన్స్ సభలోని తీవ్రవాదులు నెగ్గారు.

స్కాట్‌లాండ్ నుండి రాజు, 1641 నవంబర్‌లో, లండన్‌కు తిరిగివచ్చాడు. పార్లమెంట్ లోపల, వెలుపల, రాజాభిమానుల సంఖ్య కూడ పెరిగింది. జార్జి డిగ్బె (George Digbey) అనే యువకుడు, రాజు మద్దతుదార్లను ప్రోత్సహించాడు. రాణి హెన్రియట్టా కూడా, రాజు ప్రత్యర్థులపై చర్యతీసుకొమ్మని, ప్రోత్సహిస్తూ వచ్చింది. స్ట్రాఫర్డ్ రూపొందించిన సైన్యంలోని అధికారులు, యువకులనేకులు, రాజుకు మద్దతు ప్రకటించి, "రక్తం చిందించే" కార్యక్రమాలను గూర్చి, బహిరంగంగా మాట్లాడజొచ్చారు. రాజు మద్దతుదార్లంతా రక్షకభటసేనగా ఏర్పడ్డారు. వారిని కెవాలియర్ (Cavaliers) అని పిలువడం జరిగింది. ప్రొటస్టంట్లకు వ్యతిరేకులని, దీని అర్థం. వారికి ప్రత్యర్థులై, పార్లమెంట్‌కు అనుయాయులుగా ఉన్న ప్యూరిటన్‌లకు, "రౌండ్‌హెడ్"లని పేరు. తమ పొడుగాటి జుట్టును నున్నగా దువ్వుకొన్నందుకై, ఈ పేరు వారికి సార్థకమైంది. రాజు మద్దతుదార్లు, గొప్ప దోపిడి దొంగలుగా, హత్యలు, గృహదహనాలు, బలాత్కారాలు చేసే తుంటరులుగా, రౌండ్‌హెడ్‌ల విమర్శలకు గురయ్యారు. రౌండ్‌హెడ్‌లు నీతిని బోధిస్తూ, అత్యాశ, గర్వం ఉట్టిపడే విధంగా నడుచుకుంటూ, తిరుగుబాటును ప్రోత్సహించేవారని, కెవాలియర్లు తప్పుపట్టేవారు. దేశంలో రాజు మద్దతుదార్లు, పార్లమెంట్ మద్దతుదార్లుగా, ప్రజలు రెండు పక్షాలయ్యారు. లండన్ నగరంలో పరిస్థితి విషమించింది. ప్రజాసందోహాలు "బిషప్‌లు వద్దు" అంటూ నినాదాలు లేపారు. కాని, వారినందరినీ కెవాలియర్లు తమ ఖడ్గాలతో బెదరించి, తరమగొట్టేవారు.

1642 జనవరిలో రాజు ఛార్లెస్, అశాంతికంతకు కారకులు కామన్స్ సభలోని నాయకులని, వారిని దేశద్రోహ నేరం కింద, నిర్బంధించ నిర్ణయించాడు. కాని, దానికి ముందు, లార్డ్స్ సభలో పిమ్, హాంప్డన్ మొదలైన వారందరిపై, అభిశంసనా తీర్మానాన్ని చేయించాడు. మరు దినం, దాదాపు 400 మంది కెవాలియర్లతో, (తన మద్దతుదార్లు), ఛార్లెస్ సరాసరి నాయకులను నిర్బంధించడానికై స్వయంగా కామన్స్ సభలో ప్రవేశించాడు. నాయకులైన పిమ్, మొదలైన వారిని "చెవులు బట్టి బయటికి లాగగలనని" చెప్పిన ఛార్లెస్‌కు, ఆశాభంగమే జరిగింది. ఈ విషయాన్ని ముందుగా పసిగట్టి, హాంప్డన్, హేజిల్‌రిగ్ (Hazelrigg), హోల్స్ (Holles), స్ట్రోడ్ (Strode), అందరూ ఎక్కడో

వెళ్లిపోయారు. పిమ్ మాత్రం రాజు వచ్చేవరకుండి, రహస్యంగా పార్లమెంట్ భవనాల వెనక ఉండే థేమ్స్ నదిలో వేచిఉండే పడవను జేరి, తప్పించుకున్నాడు.

ఛార్లెస్ నిశ్శబ్ద వాతావరణంలోవున్న కామన్స్ సభలో ప్రవేశించాడు. అక్కడ అధ్యక్షుడైన "విలియం లెంథాల్" William Lenthall) ను "పిమ్ ఎక్కడ?" అని కోపంతో ప్రశ్నించాడు. లెంథాల్ తన మోకాళ్ళపై వంగి, సభ ఆదేశం లేందే, నేనేదీ చూడగూడదు, వినగూడదని, సవినయంగా చెప్పకున్నాడు. అక్కడున్న వారినందరిని పరీక్షించి, బెంచీలన్నీ గమనించి, 'నాకండ్లు ఇతరుల కళ్ల కన్నా తక్కువేం కాదనుకుంటా. అన్ని పక్షులు ఎగిరిపోయాయి" అని, అన్నాడట.

ఇది, రాజు చేసిన తెలివిలేని చర్య. దీని తర్వాత, రాజు ప్రజల అంచనాల్లో చులకన గావడం జరిగింది. ఛార్లెస్ పార్లమెంట్‌ను నాశనం చేయడానికి కంకణం కట్టుకొన్నాడని భావించారు. అతడు చేసిన వాగ్దానాలన్నీ, కాలహరణం కోసం వేసిన పథకాలని నమ్మారు.

పార్లమెంట్‌లోని తీవ్రవాదులు, రాజుకు గల అధికారాలను మరింత తగ్గించ ప్రయత్నించారు. సైన్యం పైన అధికారాన్ని తొలగించడానికై, ఒక ప్రత్యేక బిల్లును ఆమోదించారు. ఇదిగాక, పార్లమెంట్, అనేక సూచనలున్న ఒక కొత్త పత్రాన్ని రూపొందించి, రాజుకు సమర్పించింది. దీని ప్రకారం ప్రభుత్వాధికార్లందరూ, ప్రీవీకౌన్సిల్ సభ్యులు మొదలైనవారందరు, పార్లమెంట్ అనుమతితో మాత్రమే నియమితులవాలి. రాజు బిడ్డల విద్య, వివాహ విషయాలు, పార్లమెంట్ విషయాల పరిధిలో ఉండాలి. కాథలిక్ మతానికి వ్యతిరేకమైన చట్టాలన్నీ, తు.చ. తప్పకుండా అమలు జరపాలి. ఇటువంటి కోరికలకు, ఛార్లెస్ ఆమోదం తెల్పి నిరాకరించాడు. దీనిపై, పార్లమెంట్ మద్దతుదార్లు లండన్‌లో మంతనాలను ప్రారంభించారు. చాలమంది నావికులు, సైనికులు, పార్లమెంట్‌కు బహిరంగంగా మద్దతును ప్రకటించారు.

ఛార్లెస్ తన రాణి హెన్రియట్టాతో, ఉన్నట్టుండి తన వైట్‌హాల్ రాజ ప్రాసాదాన్ని వీడి, హాంప్టన్‌కోర్ట్ చేరి, అక్కడనుండి లండన్‌కు 20 మైళ్ళ దూరంలో గల, విండ్‌సోర్ రాజప్రసాదం చేరుకున్నాడు. ఛార్లెస్‌కు అప్పటికి, లండన్ నగరాన్ని శాశ్వతంగా పోగొట్టుకున్నట్లు తెలియదు. ముఖ్య నగరానికి మళ్లీ అంతర్యుద్ధ సమయంలో ఖైదీగా మాత్రమే తిరిగొచ్చాడు, ఛార్లెస్. రాజు పార్లమెంట్ ఎడ, ప్రజల ఎడ, తీసుకున్న నిర్ణయాల వల్లనే, అంతర్యుద్ధం అనివార్యమైందని చెప్పవచ్చు.

## 2.9 సంగ్రహంగా

ఒకటో జేమ్స్ మరణానంతరం అధికారానికి వచ్చిన ఒకటో ఛార్లెస్‌కు వ్యక్తిగతంగా అనేక మంచి గుణాలు ఉన్నా, ప్రజాభిమానాన్ని మాత్రం చూరగొనలేక పోయాడు. కాథలిక్ మత పక్షపాతిగా, ప్రొటస్టంట్ మతస్థులైన ప్రజలకు దూరమైనాడు. తనకు తోచిన విధంగా పన్నుల వసూలుకై చేసిన ప్రయత్నాలను, పార్లమెంట్ నమ్ము చేసింది. విసుగుచెందిన రాజు, పార్లమెంట్ ప్రమేయం లేకుండా పాలించ ప్రయత్నించాడు. దాదాపు పదకొండేళ్ల నిరంకుశ పాలనను కొనసాగించాడు. కాని, ఇది ప్రజల సహనాన్ని నశింపజేసింది. పార్లమెంట్ తిరిగి సమావేశం కాగానే, అనేక నాయకులు తీవ్రవాదులై, రాజుకు వ్యతిరేకంగా ఉద్యమించారు. దేశంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఇరు వర్గాలు సైన్యాలను సమీకరించారు. ప్రత్యర్థుల నెదుర్కొనడానికి రాజు తన సైన్యాలతో లండన్ నగరాన్ని వీడి వెళ్లాడు. దీంతో, దేశంలో అంతర్యుద్ధం మొదలైంది.

## 2.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఒకటో ఛార్లెస్‌కు పార్లమెంట్‌తో గల సంబంధాలను విశ్లేషించండి.
2. 1629-40 మధ్య కొనసాగిన మొదటి ఛార్లెస్ వ్యక్తిగత పాలనా విశేషాలెట్టివి?
3. అంతర్యుద్ధానికి ముందు, దీర్ఘకాలిక పార్లమెంట్ కార్యకలాపాల రాజ్యాంగ ప్రాముఖ్యతను తెల్పుతూ, అవి అంతర్యుద్ధానికి ఎంతవరకు దోహదమైనాయో పరిశీలించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. ఒకటో ఛార్లెస్ గుణగణాలు
2. డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్
3. ఒకటో ఛార్లెస్ మత విధానాలు
4. హక్కుల పత్రం
5. స్కాట్‌లాండ్ సమస్య పూర్వాపరాలు

## 2.11 ఉపయుక్త గ్రంధాలు


| | |
|---|---|
| T. B. Macaulay | : **History of England, 6. Vols.** |
| Q.R.D. Skinner | : **History and idealogy in the English Revolution** |
| Ivan Roots | : **The Great Rebellion, 1640-1660** |
| David Mathew | : **The Age of Charles I** |
| C.V. Wedgewood | : **The King's peace, 1637-1641** |
| J.R. Western | : **Monarchy and Revolution** |
| G.M. Trevelyan | : **England under the Stuarts** |
| Barry Coward | : **The Stuart Age** |
| G.B. Adams | : **English Constitutional History Since 1485** |


BRAOU

# భాగం-3 : అంతర్యుద్ధం : కామన్‌వెల్త్ సంరక్షక రాజ్యం

విషయక్రమం


3.0 లక్ష్యాలు

3.1 పార్లమెంట్ అసంతృప్తి

3.2 స్కాట్‌లాండ్‌తో తగాదా

3.3 అంతర్యుద్ధం-తొలి దశ (1640-42)

3.3.1 రాజు - పార్లమెంట్ పోరాటం (1642-49)

3.4 తిరుగుబాటుకు కారణాలు: సమీక్ష

3.5 యుద్ధ గమనం

3.6 అంతఃకలహాలు

3.7 ఛార్లెస్ ఓటమి

3.7.1 ఛార్లెస్ విచారణ : మరణదండన

3.8 ఆలివర్ క్రాంవెల్ : ప్రొటెక్టరేట్ (1649-60)

3.9 డచ్ యుద్ధం (1652-54)

3.10 ఐర్లాండ్ వ్యవహారాలు

3.11 స్కాట్‌లాండ్

3.12 రంప్ పతనం : కొత్త రాజ్యాంగం

3.13 రెండేళ్ల కల్లోలం (1658-60)

3.14 17వ శతాబ్దంలో వాఙ్మయ వికాసం

3.15 సంగ్రహంగా

3.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

3.17 ఉపయుక్త గ్రంథాలు


## 3.0 లక్ష్యాలు

ఒకటో ఛార్లెస్ కాలంలో జరిగిన అంతర్యుద్ధం, ప్రపంచ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతానికి గొడ్డలిపెట్టుగా పరిణమించిన ఈ అంతర్యుద్ధం, రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థ స్థాపనకు, పార్లమెంటరీ సంస్థల విజయానికి దోహదం చేసింది. 1642 లో ప్రారంభమైన ఈ అంతర్యుద్ధంలో, ఏఏ శక్తులు ఎటువంటి లక్ష్యాల సాధనకై పోరాడాయనే చర్చ, బహుశా ఇరు పక్షాలు పోరు ప్రారంభించే సమయానికే ఉత్పన్నమైందని చెప్పవచ్చు. హైడ్, హారింగ్‌టన్, హాబ్స్

మొదలైన వారి నుండి, కారల్ మార్క్స్ వరకు, టాని (Tawney), ట్రెవోర్ మొదలైన రచయితలు గూడ, విప్లవానికి కారణాలు, వ్యక్తులకు బదులుగా సంఘంలోనే ఉన్నాయని తలచారు. క్రిస్టఫర్ హిల్ రచించిన "విప్లవ శకం" (Era of Revolution) అన్న గ్రంథంలో, 17వ శతాబ్దపు ఆర్థిక, సాంఘిక పరిస్థితులు ఏ విధంగా రాజకీయ మార్పులకు దోహదం చేశాయో, చక్కగా వివరించాడు రచయిత. దేశంలో అప్పటి పరిస్థితులు అమిత ఉద్వేగంతో మారుతూరావడం, నిర్వివాదాంశం. ఇందు, వర్గ పోరాటాలు స్పష్టంగా గోచరిస్తాయి. భౌగోళికంగా కూడా, విభజనలు కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. ఆక్స్‌ఫర్డ్, చెస్టర్ నగరాలు తప్ప, తక్కిన మత ప్రభావం గల నగరాలన్నీ, పార్లమెంట్‌ను సమర్థించాయి. అయితే పారిశ్రామిక వాడలు, రేవు పట్టణాలు, ఆర్థికంగా ముందడుగు వేసిన తూర్పు, దక్షిణ ప్రాంతాలు కూడ, పార్లమెంట్‌కు మద్దతునిచ్చాయి. దీనికి భిన్నంగా, గ్రామీణ ప్రాంతాలన్నీ రాజును సమర్థించాయి. వెనుకబడ్డ ఉత్తర, పశ్చిమ ప్రాంతాలుగూడ, ఒకటో ఛార్లెస్ పక్షం వహించాయి.

17వ శతాబ్ది ఇంగ్లాండ్ చరిత్ర, మధ్య యుగంలోని నిరంకుశాధికారాలు గల్గిన రాజరికం, రాజ్యాంగబద్ధమైనదిగా మారిన విధానాన్ని తెలియజేసేది మాత్రమే. ఇది, ఒకటో ఛార్లెస్ కాలంలో చెలరేగిన అంతర్యుద్ధంతో ప్రబలింది. సార్వభౌమాధికారం రాజుకా, లేక ప్రజా ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుకా, అన్న సమస్యతో, ఈ అంతర్యుద్ధం ప్రబలిందని చెప్పవచ్చు. అంతర్యుద్ధంలో, ప్రజలు ప్రధానమని, పార్లమెంట్‌కు మాత్రమే అట్టి సార్వభౌమాధికారం ఉండాలని కూడా స్పష్టమైంది.

## 3.1 పార్లమెంట్ అసంతృప్తి

రాజు వ్యక్తిగత పాలన ముగిసే విధంగా, 1640లో పార్లమెంట్‌ను సమావేశపర్చమని, స్ట్రాఫర్డ్ ప్రభువు, రాజుకు సలహోఇచ్చి, ఐర్లాండ్ వెళ్లాడు. 1640 మార్చి, 16వ తేదీ, ఐరిష్ పార్లమెంట్ రాజుకు సహాయంగా, 1,80,000 పౌన్ల ధనాన్ని మంజూరు చేసింది. దీని తర్వాత, మతాధికారుల సమాఖ్య కూడ, రాజుకై కొంత మొత్తాన్ని ప్రోగుచేయ నిశ్చయించింది. కాని, ఈ మొత్తాలు రాజు అవసరాలకు సరిపోయేవి కావు. ఛార్లెస్‌కు దాదాపు 8 లక్షల పౌన్లు అవసరమనిపించింది. ఏప్రిల్ 13 న సమావేశమైన బ్రిటీష్ పార్లమెంట్, తన కోర్కెలను నెరవేర్చడానికి ముందు, అంత పెద్ద మొత్తాన్ని మంజూరు చేయడానికి నిరాకరించింది.

లండన్ నగరానికి పరిచయస్తుడు కాని స్ట్రాఫర్డ్, కొంతవరకు తప్పుడు అంచనా వేశాడనవచ్చు. సనాతన శత్రువులైన స్కాట్‌లాండ్ ప్రజలను అణచడానికై, పార్లమెంట్ సభ్యులు తమ రాజును సమర్థిస్తూ, పెద్ద మొత్తాలను అతనికి సమకూర్చుతారని తలపోశాడు. కాని, పదకొండేళ్ల నిరంకుశ పరిపాలనానంతరం సమావేశమైన పార్లమెంట్ సభ్యులు, వారి అసంతృప్తిని ప్రకటించడానికి ఏ విధంగాను వెనకాడలేదు. దీనికితోడు, వారికి గొప్ప నాయకుడు దొరికాడు గూడ. చాల కాలం పార్లమెంట్ లేని కారణంగా, 1640 లో సమావేశమైన పార్లమెంట్‌లో దాదాపు అందరూ కొత్తవారే. కాని, వారిలో అరవైయేళ్ల వయసులో ప్రజాసేవాదృక్పథం గల్గిన "జాన్ పిమ్" మంచి అనుభవంగల్గిన వ్యక్తి. ఇరవై ఏళ్లకు ముందే, అతడు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నుకొనబడ్డవాడు. లార్డ్ కీపర్ ఫించ్ మొదలైన సభ్యుల తర్వాత పిమ్ ప్రసంగిస్తూ, స్కాట్‌లాండ్ ప్రజలకు వ్యతిరేకంగా రాజు చేసే యుద్ధాలకై సహాయ మందించ రాదని కోరుతూ, షుమారు రెండు గంటలు ప్రసంగించాడు. అతడు మితవాది. అప్పటివరకు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తూ, "ఓడ పన్ను" వంటి సుంకాలను, నిర్బంధ రుణాలను సక్రమంగా చెల్లించాడు. కాని, పార్లమెంట్ అతనికి మిక్కిలి అనువైన సాధనం. తనకు



BRAOU

స్వతహాగా ఉండే నైపుణ్యాన్ని, అనుభవాన్ని వినియోగించి, మతపరంగా, రాజకీయంగా సభ్యుల్లో నెలకొన్న అసంతృప్తిని ఆసరాగా తీసుకొని, వారు రాజుకు ఏ విధమైన ఆర్థిక సహాయాన్ని అందించకుండా, తగు చర్యలు గైకొన్నాడు. ఇంగ్లాండ్‌కు తిరిగొచ్చిన స్ట్రాఫర్డ్, ఎగువ సభైన ప్రభువుల సభకు స్వయంగా వెళ్ళి, వారి సహాయాన్ని అర్థించవలసిందని, రాజుకు సలహా ఇచ్చాడు. అదే విధంగా రాజు స్వయంగా ప్రసంగించిన ఫలితంగా, ప్రభువుల సభ కొన్ని మొత్తాలను మంజూరు చేయడం ఖాయం. కాని, దీనివల్ల కామన్స్ సభ రెచ్చిపోవడం, మరీ ఖాయం. సభ్యులకు మాత్రమే అధికారముంది. సెక్రటరీ ఆఫ్ స్టేట్ అయిన "సర్ హెన్రీ వేన్", మేనెల 4వ తేదీ కామన్స్ సభకు వెళ్లి, రాజుకు తగిన నిధులనుమతించిన, "ఓడ పన్ను" సుంకాన్ని రద్దుచేయడానికి సుముఖత తెలిపాడు. కామన్స్ సభ్యుల్లో ఏకాభిప్రాయం లేదు. కొంత మంది మాత్రం, "ఓడ పన్ను"ను తొలగించిన, ఏదో కొన్ని మొత్తాలను రాజుకు సమకూర్చడానికి ఇష్టపడ్డారు. కాని, రాజు పక్షంగా వేన్ సమాధానమిస్తూ, కామన్స్ సభ్యుల రాజీ పద్ధతిని నిరసించాడు. ఇచ్చినట్లైతే, రాజుకు కావాల్సిన అన్ని మొత్తాలను ఇవ్వవలసిందేగాని, తగ్గించడానికి వీలులేదన్నాడు. పైగా పార్లమెంట్ సభ్యులు స్కాట్‌లాండ్‌తో సంధిచేసుకోవడం మేలని భావించారు గూడ. మరుదినం, రాజు ప్రీవీకౌన్సిల్‌ను సమావేశపర్చాడు. అది ఉదయం ఆరుగంటలకే సమావేశమైన కారణంగా, స్ట్రాఫర్డ్, అతని సన్నిహితుడైన "ఆర్చిబిషప్ లాడ్" ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. వారు వచ్చేసరికి, రాజు, కౌన్సిల్‌లోని అధిక సంఖ్యాకులు, పార్లమెంట్ నుండి ఎట్టి సహాయాన్ని ఎదురు చూడ్డం అనవసరమని నిర్ణయించుకున్నారు. స్ట్రాఫర్డ్‌కు ఇష్టం లేకపోయినా, సమావేశమైన మూడు వారాల లోపునే, పార్లమెంట్ ఉభయ సభలను రద్దు పర్చ నిర్ణయించారు. "స్వల్పకాలిక పార్లమెంట్" (Short Parliament) ఆ విధంగా కోపోద్రేకాల మధ్య రద్దయింది.

## 3.2 స్కాట్‌లాండ్‌తో తగాదా

ఇంతలో స్కాట్‌లాండ్‌తో యుద్ధం తప్పనిసరైంది. అవసరమైన మొత్తాలను సేకరించడానికై, అనేక చర్యలను తలపెట్టారు. లండన్ నగర వాసులు కొన్ని రుణాలను అందజేయడం తప్పనిసరైంది. నిర్దాక్షిణ్యంగా వ్యవహరించమని సలహాయిచ్చిన స్ట్రాఫర్డ్, లండన్ నగరంలో కొంతమంది నాయకులను ఉరితీసినట్లైతే, అభయంతో ప్రజలు పన్నులు, రుణాలను చెల్లిస్తారని సూచించాడు. కాని, నగర పాలక సంస్థ రాజుకు రుణాలు సేకరించడానికి, నిరాకరించింది. విదేశాలనుండిగాని, లేదా పోప్ నుండి గాని, రాజుకు ఎట్టి సహాయం వచ్చే సూచనలులేవు. స్పెయిన్ నుండి తెచ్చిన బంగారాన్ని లండన్ టవర్‌లో నిల్వచేయడం, లేక అధిక మొత్తాలను చెలామణినుండి తొలగించడం, మొదలైన అనేక పథకాలను పరిశీలించడం జరిగింది. కాని, ప్రయోజనం లేక పోయింది. దీనికి తోడు, ప్రధాన సైన్యాధ్యక్షుడు జబ్బు పడ్డాడు. అతనికి సహాయకుడిగా నియమితుడైన స్ట్రాఫర్డ్ కూడా, అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా, రాజు మిక్కిలి దయనీయమైన పరిస్థితిలో కొనసాగాల్సిన అవసరమేర్పడింది.

స్కాట్‌లాండ్ సైన్యాలు ఇంగ్లాండ్ సరిహద్దులను ఎటువంటి ప్రతిఘటన లేకుండా దాటాయి. న్యూబర్న్ వద్ద జరిగిన స్వల్పమైన యుద్ధం తర్వాత, రాజు సైన్యాలు పారిపోయాయి. ఆగస్ట్ 29 నాటికి, న్యూకాజిల్ గూడ స్కాట్ సైన్యాల వశమైంది. వెంటనే రాజు, వారితో సంధి మంతనాలు జరపడానికై, ఒక కౌన్సిల్‌ను ఏర్పర్చాడు. అక్టోబర్‌లో రాజప్రతినిధులు స్కాట్‌లను "రిప్పన్" నగరంలో కలిసి, వారి షరతులను వివరించారు. ఇంగ్లాండ్ ప్రాంతంలోని డర్హామ్, నార్తంబర్‌లాండ్‌లను స్కాట్‌లు ఆక్రమించుకోవచ్చని, తర్వాత పార్లమెంట్ సమావేశమయ్యేవరకు స్కాట్ సైన్యాల పోషణకై తగు మొత్తాలను తాము చెల్లించునట్లు వాగ్దానం చేశారు. ఇంగ్లాండ్ ఉత్తర ప్రాంతాలను

అప్పటికే స్కాట్ సైన్యాలు ఆక్రమించుకున్నందువల్ల, ఒకటో ఛార్లెస్‌కు పార్లమెంట్ పై ఆధారపడ్డం కన్నా గత్యంతరం లేక పోయింది. కాని, తన ఆలోచనలను ఆచరణలో పెట్టడంలో, రాజుకు నైపుణ్యం లోపించింది. పిమ్, ఆతని ఇతర అనుచరులు, వారి పక్షాన్ని బలపర్చుకోగల్గారు. ప్రజలు గూడ రాజు మద్దతుదార్లను తమ ప్రతినిధులుగా ఎన్నుకోడానికి నిరాకరించారు. దేశంలోని ధనికులందరూ రాజుకు వ్యతిరేకతను ప్రకటించారు. అంతకు ముందు కొద్దికాలం మాత్రమే కొనసాగిన "పార్లమెంట్" లోని సభ్యులనేకులు మళ్లీ ఎన్నికైనారు. నవంబర్ 3వ తేది 1640లో సమావేశమైన "దీర్ఘకాలిక పార్లమెంట్" (Long Parliament) బ్రిటీష్ చరిత్రలో మిక్కిలి ప్రసిద్ధి చెందింది. కొత్త పార్లమెంట్ సంస్కరణలకు గాక, విప్లవానికై కృషి చేసింది.

## 3.3 అంతర్యుద్ధం - తొలి దశ (Civil War) 1640-42

దీర్ఘకాలిక పార్లమెంట్ సమావేశం గావడం, దేశంలో చెలరేగిన దుమారంగా, రాజుకు వ్యతిరేకంగా మొదలైన పెద్ద తిరుగుబాటుగా, పేర్కొనవచ్చు. పిమ్ ఎంతో సామరస్యంతో, తన గాఢ నమ్మకాలను తెలియజేసేటట్లు, కింది విధంగా ప్రకటించాడు. "మానవ శరీరానికి ఆత్మ ఎలా ముఖ్యమో, జన బాహుళ్యం ఉన్న దేశానికి పార్లమెంట్ అంత ప్రధానం. అందుచేత, ఆత్మను అణగారనీయకుండా ఉంచాల్సిన అవసరం ఉంది." ప్యూరిటన్ మతస్థులకు శరీరంలో చాల ప్రధానమైంది ఆత్మ కాబట్టి, దేశంలో పార్లమెంట్ వ్యవస్థ వారి దృష్టిలో మిక్కిలి ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. దీర్ఘకాలిక పార్లమెంట్ ప్రారంభ సమావేశంలోనే, పిమ్ సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ, స్ట్రాఫర్డ్‌తో సహా అందరు మంత్రులు, రాజు సహచరులు దేశంలోని అన్ని ప్రామాణిక చట్టాలను నిర్లక్ష్యం చేసిన కారణంగా, వారందరు శిక్షననుభవించాలని ప్రకటించాడు. స్ట్రాఫర్డ్‌కు దేశద్రోహ నేరం కింద మరణశిక్ష విధించడానికి, పిమ్ పార్లమెంట్‌లో చేసిన సుదీర్ఘ ప్రసంగం, చాల ముఖ్యమైంది. 1641 మే 1వ తేదీ, స్ట్రాఫర్డ్ టవర్ ఆఫ్ లండన్‌లో శిరచ్ఛేదనకు గురయ్యాడు. సంతోషంతో కామన్స్ సభ్యులు "రాజు స్ట్రాఫర్డ్‌ను ప్రసాదించాడు. ఇక మనల్ని ఎవరినీ కాదనడు" అని గంతులేశారట.

అదే విధంగా, ఆర్చిబిషప్ లాడ్‌ను టవర్‌లో బంధించి, కడకు 1645లో ఉరితీశారు.

### 3.3.1 రాజు-పార్లమెంట్ పోరాటం (1642-49)

1642 ఆగస్ట్‌లో ప్రారంభమైన అంతర్యుద్ధానికి అసలు కారణం, ఇంగ్లాండ్ రాజైన ఒకటో ఛార్లెస్ పార్లమెంట్‌ను కాదని, ప్రజల హక్కులను పూర్తిగా అణచివేయడానికి ప్రయత్నించడం మాత్రమే. అప్పటికే పార్లమెంట్‌లో, రాజు పక్షం, ప్రజల పక్షం అని రెండు వర్గాలు బహిర్గతమయ్యాయి. 1641 అక్టోబర్‌కే, ఇరు వర్గాలు రాజకీయ ఆధిక్యతకై పోటీపడజొచ్చాయి. వీటిని కొన్ని సందర్భాల్లో 'కెవాలియర్స్' (Cavaliers), 'రౌండ్ హెడ్స్' (Round heads) అని పిలవడం జరిగింది. వీరే చివరకు టోరీ (Tori), విగ్ (Whig) లుగా వ్యవహరించబడి, రెండు రాజకీయ పార్టీలుగా ఏర్పడ్డాయి. ఇంగ్లాండ్‌లో ఏర్పడిన రెండు రాజకీయ పక్షాల మధ్యగల వ్యత్యాసాలు గమనించ దగ్గవి. కొంత మంది రాజు పక్షం వహించి, రాజ్యంలోని అన్ని చట్టాలను రాజు వశం చేయడానికి అభిలషించారు. మరి కొంతమంది అట్లుగాకుండా, రిపబ్లిక్ స్థాపనకు మనస్కరించి, ప్రజాపాలనను సమర్థించారు. కాని, రాజును సమర్థిస్తూ అతనికై అంతర్యుద్ధంలో పాల్గొన్న అనేకులు గూడ, నిరంకుశ రాజరికాన్ని అభిలషించిన వారుకాదు. అదే విధంగా, పార్లమెంట్ పక్షం వహించి, ప్రజాపాలనా స్థాపనకు పోరాడిన నాయకులు గూడా, అరాచకాన్ని కోరిన వారు కాదు. ఈ రెండు పక్షాలు గూడ, 17వ శతాబ్దంలో

BRAOU

దాదాపు రెండుసార్లు వారి మధ్యగల విభేదాలను విస్మరించి, ఒకటైనారుగూడా. మొదటిసారి ఒకటై నప్పుడు, వంశపారంపర్య రాజరికాన్ని పునరుద్ధరించారు (1660 లో). రెండోసారి, రాజ్యాంగబద్ధమైన పరిమిత రాజరికాన్ని స్థాపించగలిగారు (1688 లో).

స్ట్రాఫర్డ్‌ను ఉరితీసి, లాడ్‌ను బంధించి, ఇతర అనేక మంత్రులను శిక్షించిన తర్వాత, రాజు (ఒకటో ఛార్లెస్) స్థితి కొంత బలహీనమైంది. ప్రభుత్వంలో జరిగే సంస్కరణలు, వేడివేడి విందులాగ ఉందని, కామన్స్ సభలో ఒక సభ్యుడు సంబర పడ్డాడు. సభ్యులు అనేక కొత్త చట్టాలను ప్రవేశపెట్టారు. ప్రతి మూడేళ్ల కొకసారి పార్లమెంట్‌ను తప్పనిసరిగా సమావేశపర్చాలనే చట్టం, అప్పటికే విడుదల అయింది. రాజుకు మద్దతునిస్తూ వచ్చిన "స్టార్‌ఛాంబర్ న్యాయస్థాన" (Star Chamber Court) తొలగింపు జరిగింది. పార్లమెంట్ అనుమతి లేకుండా విధించబడిన అన్ని పన్నులు న్యాయ విరుద్ధమైనవిగా ప్రకటితమైనాయి. రాజు చేసిన ఒప్పందాన్ని తోసివేసి, స్కాట్‌లాండ్‌తో పార్లమెంట్ కొత్త ఒడంబడిక చేసుకొని, సైన్యాలను ఉపసంహరింపజేసింది. ఆగస్ట్‌లో సైన్యాలను ఉపసంహరించిన వెంటనే రాజు ఇంగ్లాండ్ వీడి, స్కాట్‌లాండ్‌చేరి, తనకు అనుయాయులైన వారి సహాయంతో, ఎంతో విధేయతగల సైన్యాన్ని ఏర్పాటుచేయ తలచాడు. కాని, రాజు ప్రయత్నాలు అప్పుడుగల పరిస్థితులకు భిన్నమైనవి మాత్రమే. విధేయతగల సైన్యం అతనికి కావల్సింది ఇంగ్లాండ్‌లోకాని, స్కాట్‌లాండ్‌లోకాదు. దీనికి తోడు, స్ట్రాఫర్డ్ మరణానంతరం, ఐర్లాండ్‌లో చెలరేగిన తిరుగుబాటు, దాన్ని అణచడానికై పార్లమెంట్ రాజుకు ప్రత్యేకమైన సైన్యాన్ని ఏర్పర్చడానికి నిరాకరించడం, మొదలైన కారణాలు, రాజు, పార్లమెంట్‌కు మధ్యగల విబేధాలను మరింత ఎక్కువ చేశాయి.

స్కాట్‌లాండ్ నుండి తిరిగి వచ్చిన ఛార్లెస్, కామన్స్ సభ్యులు ఎదురుతిరిగి వ్యవహరించినా, అనేకులు తన పక్షం ఉన్నట్లు గమనించాడు. అందువల్లనే, కామన్స్ అడిగిన విధంగా, మతాధికార్లకు పార్లమెంట్‌లో ఓట్లు నిరాకరించడానికి వీలు లేదన్నాడు. పార్లమెంట్ సమర్పించిన గ్రాండ్ రిమాన్‌స్ట్రెన్స్ (Grand Remonstrance)ను, తోసిపుచ్చాడు గూడ. సభ్యుల రక్షణకై పార్లమెంట్ భవనం చుట్టూ నియమితులైన రక్షక భటులను తొలగించి, రాజు కామన్స్‌కు మరీ ఆగ్రహాన్ని కల్గించాడు.

దీనికి తోడు, పార్లమెంట్‌లో ప్రభువులుగూడ, కామన్స్ తలపెట్టిన మార్పులను ప్రతిఘటించారు. రాజుకు వ్యతిరేకంగా సైన్యాలను సమీకరించారు. కాని, కామన్స్ సభ్యులు లండన్ వాసుల సహాయంతో, కాథలిక్ మతాధికార్లను ఎదిరించడానికి నిశ్చయించారు. వారు ప్యూరిటన్ మతస్థుల విరోధులని వర్ణించారు. లండన్ వీధుల్లో గుంపులుగా కదులుతూ, బిషప్‌ల అధికారాన్ని తొలగించాలని నినాదాలు చేశారు. దాదాపు పదమూడు బిషప్‌లపై, కామన్స్ సభ్యులు అభిశంసన తీర్మానాన్ని తెచ్చారు. రాణిని కూడ అభిశంసింప వచ్చనే వదంతులు వినవచ్చాయి. అందుచేత, రాజు కామన్స్ సభ్యుల్లో ప్రధానమైన వారి నందరినీ నిర్బంధించడానికి ప్రయత్నించాడు. కాని, ఇది వీలు పడలేదు. దేశంలో రాజుకు, ప్రజాప్రతినిధులకు మధ్య అంతర్యుద్ధం తథ్యమని మాత్రం గోచరించింది.

1642 జనవరిలో, రాజు ఒకటో ఛార్లెస్ లండన్ నుండి కెంట్‌కు వెళ్లి, ఫ్రాన్స్‌కు వెళ్లవలసిందని తన రాణిని సాగనంపాడు. మార్చిలో యార్క్ వెళ్లి, అక్కడి న్యాయస్థానాలను మూసివేయాలని ఆదేశించాడు. ఇంతలో పార్లమెంట్, స్థానిక సంస్థలకు కొత్త పాలకులను నియమించి, రాజ్యం తన పక్షమని ప్రకటించింది. వారు "పందొమ్మిది సూచనలు" గల ఒక పత్రాన్ని తయారుచేసి, అందులో పార్లమెంట్‌కు అత్యున్నత అధికారాలుండాలని, ప్రీవీ కౌన్సిల్ మంత్రులు, కడపటికి రాకుమారుల సంరక్షణ కర్తలు గూడ, పార్లమెంట్ అనుమతితో మాత్రమే నియమితులవాలని, నిర్ణయించారు. న్యాయాధ్యక్షులను పార్లమెంట్ నియమించాలి; పార్లమెంట్ పూర్తి అధీనంలో సైన్యం కొనసాగాలి;

దేశంలోని మత విషయాలన్నీ పార్లమెంట్ మాత్రమే పర్యవేక్షించాలన్నవి, ఆ పత్రంలోని మిగిలిన ప్రధానాంశాలు. ఇది ఒక విధంగా, యుద్ధానికి ముందు ప్రజలు ప్రకటించిన హెచ్చరిక. దీన్ని రాజుతోసిపుచ్చిన వెంటనే, పార్లమెంట్ రెండు సభలు ఒక 'రక్షణ సంఘాన్ని' ఏర్పర్చాయి. దాదాపు 10వేల సైన్యాన్ని ఎసక్స్ ప్రభువు నాయకత్వం కింద ఏర్పాటుచేశారు. రాజు "అక్రమణదారుడని" ప్రకటించారు. ఆగష్టు 22 వ తేది, తన కుమారులను, ఇతర సన్నిహిత బంధువులను వెంటబెట్టుకొని, ఒకటో ఛార్లెస్ లండన్ వదలి, నాటింగ్‌హామ్ చేరుకున్నాడు. అంతర్యుద్ధం ఆరంభమైంది.

## 3.4 తిరుగుబాటుకు కారణాలు : సమీక్ష

ఇంగ్లాండ్‌లో సంభవించిన అంతర్యుద్ధానికి గల కారణాలను తర్కిస్తూ, మొట్టమొదట్లో ఆలివర్ క్రాంవెల్, దీనికి మతం ప్రధాన కారణమనడానికి వీలులేదన్నాడు. కాని, తర్వాత, మతం మిక్కిలి ప్రధాన కారణమని తానే ఒప్పుకొన్నాడు. నిశితంగా పరిశీలించినట్లైతే, మత విభేదాలు ప్రతి విషయంలోను ఎదురుగావడం విశేషం. ఒకటో ఛార్లెస్, ఆర్చిబిషప్ లాడ్ ఇద్దరూ కలిసి, ప్రార్థనా గ్రంథాన్ని నిర్బంధంగా ప్రవేశపెట్టక పోయినట్లైతే, స్కాట్‌లాండ్‌లో మతాధికారుల ప్రభావాన్ని ఎక్కువ చేయకపోయినట్లైతే, దీర్ఘకాలిక పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సిన అవసరం, అప్పుడు ఉండేదిగాదు. స్కాట్ మతాధికారులు ఇంగ్లాండ్‌ను జయించకుండా ఉన్నట్లైతే పిమ్‌గాని, ఆయన అనుచరులుగాని, స్ట్రాఫర్డ్‌పై కత్తిగట్టి ఉండేవారు కాదు. ఆ విధంగా రాజుకు బద్ధ విరోధులుగా మారేవారుకాదు. ఐర్లాండ్‌లో స్థానిక కాథలిక్కులు అనుమానితులవడం, రాజు పార్లమెంట్ సభ్యులను వారి హక్కుల కంచుకోటైన పార్లమెంట్‌లోనే ఎదిరించడానికై ప్రయత్నించడం, మొదలైనవిగూడ అట్టి విభేదాలకు దారితీసాయి. దీనికి తోడు, ఆర్చిబిషప్ లాడ్ మత విషయాల్లో ఎన్నో మార్పులు తేవడానికి తీసుకొన్న దురుసుతన చర్యలుగూడ, అసంతృప్తికి దారితీశాయి.

అంతర్యుద్ధానికి, దేశంలోని వర్గాల మధ్య, ఆర్థిక అధికారం మారడం చాల ప్రధాన కారణం. 1603 లో ఎలిజబెత్‌రాణి మరణానికి ముందే, దేశంలో కొత్త ధనిక వర్గం తలెత్త ప్రారంభించింది. ట్యూడర్ల తర్వాత ఏర్పాటైన పార్లమెంట్‌లో, సభ్యులు రాజకీయ అధికారాలకై చేసిన ప్రసంగాలు, దీనికి తార్కాణం. 1615 లో సర్‌వాల్టర్‌ర్యాలీ (Sir Walter Raleigh) సాంఘిక శక్తుల్లో నూతన చైతన్యం ఏర్పడిందనీ, దాంతోబాటు రాజకీయ చైతన్యం గూడ ఉత్పన్నమౌతుందని ప్రకటించాడు. అంతర్యుద్ధానికి ముందు, దేశంలో ధనిక వర్గీయులు తమ అధికారాలను క్రమంగా చెలాయించ ప్రారంభించారు. సనాతన భూస్వాముల అధికారాలను వీరు హరించడానికి ప్రయత్నించారు. అందు చేత, రాజరికం క్రమేణ ధనహీనమౌతూ, బలహీనతకు గురైంది. స్టూవర్ట్ రాజుల పన్ను వసూలు ప్రయత్నాలను ధనవంతులైన విమర్శకులు ఆక్షేపించారు. పార్లమెంట్ వెలుపలగూడ, రాజకీయ మార్పులకు ప్రజలు మొగ్గు చూపారు. అంతర్యుద్ధానికి ముందు, ఇరుపక్షాలు గూడ తీవ్ర ప్రచారాలకు సంసిద్ధమయ్యాయి. ఉదాహరణకు జాన్‌హట్చిన్‌సన్ అనే నాటింగ్‌హామ్‌కు చెందిన పెద్ద మనిషి, ప్రభుత్వ పక్షంలో ఉండి, స్టార్‌చాంబర్ కోర్ట్‌లో సభ్యత్వం గూడ కోరి, కడపటికి పార్లమెంట్‌వారు ఇచ్చిన ప్రకటనలు చదివి, పార్లమెంట్ పక్షం వహించాడు. క్లారన్‌డన్ రాసిన 'తిరుగుబాటు చరిత్ర' లోని ప్రథమ సంపుటిలో, రాజు, రాజును సమర్థించిన వారందరూ, ఏ విధంగా రచనలు చేయించి, పంచిపెట్టారో ప్రస్ఫుటంగా ఉంది. కాని, ఇట్టి ప్రచారాలకు ప్రభావితులైనవారు, కేవలం ఉన్నత వర్గీయులు, బాగా చదువుకొన్న వారు మాత్రమే. రాజకీయంగా దేశమంతా ఒకే వర్గానికి చెందిన సంఘమనవచ్చు. దేశంలోని సామాన్య ప్రజానీకం, ఆర్థికంగా బడుగు వర్గాలు, లేక రాజు వ్యక్తిగత పాలనా కాలంలో బాగా గుర్తించుకోదగ్గ ఉన్నత వర్గీయులు, అంతర్యుద్ధంలో పాల్గొనలేదు. మార్స్టన్

మూార్‌వద్ద జరిగిన యుద్ధ సందర్భంలో, ఒక సైనిక గుంపు పొలంలో పనిచేసుకుంటున్న ఒక వ్యక్తిని గమనించి, అతని దగ్గరకు వెళ్లి, పార్లమెంట్, ప్రభువు యుద్ధం చేస్తున్నారని, వెంటనే అచ్చటి నుండి వెళ్లి పొమ్మన్నారట. ఆశ్చర్యంతో అతడు అడిగాడట. "ఏం వారిద్దరూ శత్రువులయ్యారా" అని.

ఆర్థిక, సాంఘిక పరమైన విషయంగా, అంతర్యుద్ధం నగరాలకు, గ్రామాలకు, మధ్య జరిగిన పోరాటమనవచ్చు. అన్ని రేవు పట్టణాలు, మార్కెట్‌లు, బట్టలు తయారుచేసే పట్టణాలు, పార్లమెంట్‌పక్షం వహించాయి. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యులైన ప్రభువులందరు రాజును సమర్థించారు. భూస్వాముల్లో అధిక సంఖ్యాకులు రాజు పక్షం వహించారు. మధ్య తరగతివారు పార్లమెంట్‌కు మద్దతు నిచ్చారు. పన్ను వసూలు చేసే అధికార్లు, ప్రభుత్వ ఇతర అధికార్లు, రాజుకు సహాయ పడ్డారు. దేశంలో తక్కిన తరగతులు, పార్లమెంట్ విజయానికై పాటుపడ్డాయి.

ఇరు పక్షాల ఆర్థిక వనరులను పరిశీలిస్తే, పార్లమెంటరీ పక్షానికి లండన్, ఇతర ప్రధాన రేవు పట్టణాలైన హల్, ప్లీమౌత్ మొదలైనవి, ఆర్థికంగా సహాయాన్ని అందజేశాయి. లండన్ తమ అధీనంలో ఉన్నందువల్ల, పరిపాలనా యంత్రాంగాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొనేందుకు వీలు ఏర్పడింది. నౌకాబలం పార్లమెంట్‌ను సమర్థించింది. కాని, తమ దీర్ఘకాలిక ప్రయోజనాల సాధన విషయంలో, పార్లమెంట్ సభ్యుల్లో ఏకాభిప్రాయంలేదు. కాని, ప్రభు పక్షంలో, రాజు అధీనంలోని నాయకత్వానికి ఎదురులేదు. రాజు పట్లగల గౌరవ మర్యాదలు, అవర్గీయుల విధేయతకు దోహదం చేశాయి. ఆరోజుల్లో అశ్విక దళానికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నందువల్ల, రాజసైన్యాలు పార్లమెంట్ సేనలకన్న మిక్కిలి పాటవం గల్గి ఉండేవి. కాని, ఒకటో ఛార్లెస్ సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోడంలో జాప్యం చేసినందువల్ల, అనేక అవాంతరాలు ఏర్పడినాయి. తన అనుచరుల మాటను అతడెప్పుడూ ఖాతరు చేసేవాడుకాదు. అందువల్ల ఛార్లెస్‌కు మొదటి శత్రువు అతడే, అనే సామెత గూడ ప్రచారంలోకి వచ్చింది.

## 3.5 యుద్ధ గమనం

అంతర్యుద్ధం 1642 అక్టోబర్‌లో ప్రారంభమైంది. దేశంలో తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు, పార్లమెంట్ మద్దతుదార్ల పక్షంలో పాల్గొనగా, పశ్చిమతీరం, వేల్స్ ప్రాంతాలు, రాజు పక్షం వహించాయి. యుద్ధ ప్రారంభ దశలో, పోరాటం దేశం మధ్య, ఉత్తర ప్రాంతాల్లో ప్రధానంగా కొనసాగింది. రాజు నాటింగ్‌హామ్ నుండి వేల్స్‌లో ప్రవేశించాడు. ఎసక్స్ ప్రభువు నార్తంప్టన్ నుండి, వర్సెస్టర్‌షైర్ చేరాడు. మొదటి పోరాటం, ఎసక్స్ సైన్యాలకు, రూపర్ట్ సేనలకు మధ్య, వార్విక్‌షైర్ ప్రాంతంలోని 'ఎడ్జిహిల్' వద్ద జరిగింది. ఇందులో జయాపజయాలు తేలకపోయినా, రాజు సైన్యాలది పైచేయిగా తేలింది. కాని, ఇరు సైన్యాలకు అపార నష్టం వాటిల్లింది. ఎసెక్స్ సైన్యాలు వెంటనే లండన్‌ను ఆక్రమించుకున్నాయి. రాజు సేనలు ఆక్స్‌ఫర్డ్‌ను స్వాధీనం చేసుకొని, యుద్ధం కొనసాగిన తక్కిన కాలమంతా దాన్నే తమ ప్రధాన కేంద్రంగా చేసుకొన్నాయి. అదే సంవత్సరాంతంలో రాజు సేనలు లండన్ నగరాన్ని సమీపించాయి. కాని, రూపర్ట్ తన సైన్యంతో బ్రెంట్‌ఫోర్డ్‌ను ముట్టడించాడు. దీనికి తోడు, లండన్ ప్రజాసందోహం ఎసక్స్ ప్రభువుకు సహాయాన్ని అందజేసి, ఛార్లెస్ సైన్యాలను త్రిప్పికొట్టింది.

తాము అనుకొన్నట్లు వెంటనే విజయం సాధించలేని పార్లమెంటరీ పక్షం, 1643లో రాజుతో మంతనాలు చేయడానికి సుముఖత చూపింది. కాని, వారి కోరికలు మిక్కిలి కఠినంగా తోచినందువల్ల, రాజు వాటికి సుముఖత చూపలేదు. యుద్ధ సమయంలో విజయావకాశాలు, ఇరు పక్షాల మధ్య కొట్టు

మిట్టాడుతూ, యుద్ధ కాలాన్ని కొనసాగిస్తూవచ్చాయి. ప్రభు వర్గీయులు కార్న్‌వాల్, గ్లాసెస్టర్ షైర్ వంటి ప్రాంతాల్లో విజయం సాధించగా, ఎసెక్స్ ప్రభువు ఆక్స్‌ఫర్డ్‌కు దగ్గర గల రీడింగ్ పట్టణాన్ని, థామస్ ఫేర్‌ఫాక్స్, వేక్‌ఫీల్డ్‌లను (పార్లమెంటు పక్షానికి) ఆక్రమించాడు. ఫేర్‌ఫాక్స్‌కు "Black Tom" అనే బిరుదుండేది. 1643 సంవత్సరాంతానికి, దేశంలో దాదాపు నాలుగింట మూడు వంతులు, రాజు పక్షానికి చేరింది. పార్లమెంట్ పక్షం తమ అధికార స్థాపనకు గట్టిగా కృషిచేయ ప్రారంభించింది. అధిక ధన సేకరణకై, రెండు కొత్త సుంకాలను విధించింది. ఒకటి భూమి శిస్తు, రెండోది ఎక్సైజ్ సుంకం. సెప్టెంబర్ నెల్లో జాన్ పిమ్ స్కాట్‌లాండ్ ప్రజలతో సంధి కుదుర్చుకోగలిగాడు. దీని ప్రకారం, ఇంగ్లాండ్‌లో ప్రెస్బిటేరియన్ మతం స్థాపితమైంది. ప్రతిగా, స్కాట్‌లాండ్ 20 వేల సైనికులను, పార్లమెంటేరియన్‌లకు సహాయంగా పంపాలి. స్కాట్‌లాండ్‌తో కుదిరిన ఒప్పందం, వెంటనే మంచి ఫలితాలనిచ్చింది. 1644 జూలై 2 వ తేదీ, మార్స్టన్‌మూర్ వద్ద గొప్ప యుద్ధం జరిగింది. అలెగ్జాండర్ లెస్లీ నాయకత్వంలోని స్కాట్ సైన్యాలు సరిహద్దు దాటి, ఇంగ్లాండ్‌లో ప్రవేశించాయి. ఫేర్‌ఫాక్స్, ఆలివర్ క్రాంవెల్‌ల నాయకత్వం క్రింద పార్లమెంట్ సేనలు, స్కాట్ సేనలను కలుసుకోడానికై, ఉత్తరంగా బయలుదేరాయి. కాని, ఇరుసేనలు కలియడానికి ముందుగా, వారిపై దెబ్బతీయడానికై, రాజు సేనలు రూపర్ట్ రాకుమారుని ఆధ్వర్యంలో, వాటిని ఎదిరించాయి. ఎంతో ధైర్యసాహసాలతో యుద్ధం కొనసాగించిన రూపర్ట్, విజయం సాధించి ఉండేవాడు. కాని, క్రాంవెల్, ఫేర్‌ఫాక్స్‌ల ఆధ్వర్యంలోని పార్లమెంటరీ సేనలు, రాజు సేనలపై గొప్ప విజయాన్ని సాధించాయి. 'ఐరన్‌సైడ్స్' గా పేరొందిన క్రాంవెల్ అశ్వికదళం, యీ విజయానికి దోహదం చేసింది. ఇది, అంతవరకు జరిగిన యుద్ధంలో అతిగొప్ప పోరాటమని భావించవచ్చు. దాదాపు ఉత్తరదేశాన్ని పూర్తిగా, రాజు సైన్యాలు కోల్పోయాయి. తర్వాత, యార్క్ పట్టణం విప్లవకారులకు లొంగిపోయింది. కాని, రాజు పక్షం పూర్తిగా దెబ్బతినలేదు. కారన్‌వాల్‌లో రాజు సైన్యాలు, కొన్ని విజయాలను సాధించాయి.

పార్లమెంటరీ పక్షంలోని సైనిక నాయకులు కొందరు, ఇంగ్లాండ్‌లో రాజు సైన్యాలను పూర్తిగా నాశనం చేయడంలో కొంత జాప్యం చేశారు. పార్లమెంట్ సేనలో ప్రధాన నాయకుడైన మాంచెస్టర్ ప్రభువు, ఉదాహరణకు, మార్స్టన్‌మూర్ తర్వాత, రాజు సంధి షరతులకు తప్పని సరిగా వస్తాడని వాదించాడు. కాని, మాంచెస్టర్ ప్రభువు కింద పనిచేసిన క్రాంవెల్ మాత్రం, యుద్ధానికి దిగిన తర్వాత, విజయం సాధించేవరకు తిరుగు ఉండరాదని తెలియజేశాడు. క్రాంవెల్ బహిరంగంగా తన ఉన్నతాధికారి సమర్థతను విమర్శించాడు. దీంతో, పార్లమెంట్‌లోని ఉభయ సభల సభ్యుల్లో తగాదాకూడ ఏర్పడింది. పార్లమెంట్ సభ్యుల్లో సైనిక నాయకులుగా ఉన్న వారందరూ పదవులను త్యజించాలని నిర్ణయించడం జరిగింది. కొత్త పద్ధతిలో సైన్యాన్ని సమీకరింప జేశారు (New Model Army). దీనికి, జనరల్ ఫేర్‌ఫాక్స్ నాయకుడు. ఎసెక్స్, మాంచెస్టర్ ప్రభువులు, సైన్యం నుండి విరమించుకున్నారు. క్రాంవెల్ గూడ సైన్యం నుండి వైదొలగడానికి సిద్ధపడ్డాడు. కాని అప్పటికే ప్రిన్స్ రూపర్ట్, ఒకటో ఛార్లెస్ తమ తమ సైన్యాలతో సమీపిస్తున్నారని తెలిసినందువల్ల, వారి నెదుర్కోడానికై, క్రాంవెల్‌ను ఆక్స్‌ఫర్డ్ వైపు పంపారు. ఆక్స్‌ఫర్డ్‌ను క్రాంవెల్ మే నెల్లో ముట్టడించాడు. జూన్‌లో అతడు, ఫేర్‌ఫాక్స్ కింద లెఫ్టినెంట్ జనరల్‌గా నియమితుడైనాడు. జూన్ 14న ఫేర్‌ఫాక్స్ సైన్యాలు, రాజు సేనలు నార్తంప్టన్‌షైర్‌లోని నెస్బీవద్ద, ఘోర యుద్ధానికి తలపడ్డాయి. అంతర్యుద్ధాల్లో కెల్ల ఇది మిక్కిలి పెద్ద పోరుగా పేర్కొనవచ్చు. ఇక్కడ కూడ, ఎంతో నేర్పుతో క్రాంవెల్ అశ్వికదళం రాజు సేనలను తిప్పికొట్టగలిగింది. సెప్టెంబరర్ 11వ తేదీన బ్రిస్టల్ వద్ద, ప్రిన్స్ రూపర్ట్ తన సేనలతో లొంగిపోయాడు. మర్రోజు మాంట్రోస్‌ను గూడ రాజు సైన్యాలు పోగొట్టుకున్నాయి. 1646 జూన్ 14వ తేదీన ఆక్స్‌ఫర్డ్ పార్లమెంట్ పక్ష సైనికు

లకు లొంగిపోయింది. ఒకటో ఛార్లెస్ తన అనుచరులతో స్కాట్‌లాండ్‌కు పారిపోయాడు. కాని, స్కాట్ ప్రజలు అతని రాకను హర్షించలేదు. నాలుగు లక్షల పౌన్లు చెల్లించినట్లైతే, ఇంగ్లాండ్ నుండి తమ సైన్యాలను ఉపసంహరించు కొంటామని, రాజును గూడ ఇంగ్లాండ్ కమీషనర్లకు అప్పజెప్తామని, వారు తమ సమ్మతిని తెలిపారు. విజయం సాధించిన తర్వాత, పార్లమెంట్ పక్షం వారు వారిలో వారు కొన్ని తగాదాలకు పాల్పడ్డారు.

## 3.6 అంతఃకలహాలు

యుద్ధ సమయంలో పార్లమెంట్ పక్ష విజయాలకు కారణమైన 'న్యూమోడల్ ఆర్మీ', స్కాట్‌లాండ్ వారి సహాయంతో, క్రాంవెల్ అధీనంలో రూపొందిన సైన్యం. ఇందలి సైనికులు ప్యూరిటన్లు. స్కాట్‌లాండ్ నుండి వచ్చిన సైనికుల్లో అధిక సంఖ్యాకులు, ప్రెస్బిటేరియన్లు. కొన్ని మతాచారాల్లో, ఇరు వర్గాల మధ్య తగాదాలుండేవి. కాని, యుద్ధ సమయంలో స్కాట్‌లాండ్ సహకారం అవసరమైనందువల్ల, క్రాంవెల్ ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్‌ల్లో అనుసరించుచున్న మత ఆచారాల విషయంలో, కొంత ఐక్యతను సాధించ తలచాడు. ఈ విషయాన్నే, క్రాంవెల్ నిస్బే యుద్ధానంతరం, స్పీకర్‌కు లేఖ రాస్తూ, తెలియజేశాడు. ఇందులో 'తన దేశ స్వేచ్ఛ కోసం, తన ప్రాణాల నొడ్డడానికి వెనుదీయని సైనికుడు, తనకు నచ్చిన మత సిద్ధాంతాలను నమ్మడానికి అధికారం ఉంది." అని వ్రాయబడింది. క్రాంవెల్ వ్రాసిన జాబును తర్వాత ముద్రించినపుడు, పై వాక్యాన్ని తొలగించి ముద్రించారు.

ఆ విధంగా, సనాతన వాదులతో నిండిన న్యూమోడల్ ఆర్మీకి, ప్రెస్బిటేరియన్‌లు అధిక సంఖ్యలో ఉన్న పార్లమెంట్‌కు మధ్య, ఒక అగాధమేర్పడింది. మత స్పర్థలకు తోడు, ఆర్థికమైన తగాదాలు కూడ తోడైనాయి. పార్లమెంట్ సైనికుల సంఖ్యను తగ్గించి, ఉన్న సైనికులకు బకాయీలులేకుండా జీతాలిప్పించ తలపెట్టింది. 1647 ప్రారంభంలో, ఇంగ్లాండ్‌లోని సేనలను తగ్గిస్తూ, పార్లమెంట్ చట్టాన్ని చేసింది. ఫేర్ ఫాక్స్‌కు తప్ప, తక్కిన వారెవరూ కల్నల్ కన్న పై హోదాలో వుండరాదని, నిర్ణయించింది. ఇది, క్రాంవెల్‌కు అవమానంగా తోచింది. ఇదే గాకుండా, ఐర్లాండ్‌కు పంపిన సైన్యం, ఇద్దరు ప్రెస్బిటేరియన్‌ల అధీనంలో ఉంచడం జరిగింది. కామన్స్ సభ్యుల ప్రతినిధులు కొంతమంది ఎసెక్స్‌కు వెళ్లి, న్యూమోడల్ ఆర్మీలోని వారిని, ఐర్లాండ్‌కు స్వచ్ఛందంగా పంపాలని సూచించినప్పుడు, వారిలో అసంతృప్తి చెలరేగింది. సైనికాధికార్లు యీ కొత్త చర్యల పట్ల అసంతృప్తిని తెలిపారు. ఇతర సైనికులు గూడ అధికారులను అనుసరించి, తమ కోరికలను తీర్చాల్సిందని పార్లమెంట్‌కు అర్జీ పెట్టారు. దాదాపు ఎనిమిది అశ్విక దళాలు తమ ప్రతినిధులను నియమించి, వారి అభీష్టాలను తెలియజేయండని అడిగారు. క్రాంవెల్ అప్పటికే పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నందున, ఇతర అధికార్లతో పాటు, విషయాలను పరిశీలించడానికై, సఫ్రాన్ వాల్డెన్‌కు వెళ్లాడు. సైనికుల్లో చెలరేగిన అసంతృప్తికి కారణాలను తెలుసుకోడానికై ప్రయత్నించాడు. వారితో ఒప్పందం కుదుర్చుకొని, తాత్కాలికంగా శాంతిని కుదిర్చాడు. క్రాంవెల్ కృషికి, పార్లమెంట్ అతనికి కృతజ్ఞతలను గూడ తెలియజేసింది.

ఆర్థిక సమస్యలు తొలగిన వెంటనే, మత సంబంధమైన తగాదాలు ఉత్పన్నమైనాయి. పార్లమెంట్‌కు దాదాపు బందీయైన రాజు, ప్రెస్బిటేరియన్ మతాన్ని జాతీయ మతంగా మూడేళ్లు కొనసాగించడానికి, తన సుముఖతను ప్రకటించాడు. పార్లమెంట్‌లోని ప్రెస్బిటేరియన్ నాయకులు దీనికి సంతసించారు. కాని, ఇది సైన్యానికి ఇష్టంలేదని వాళ్లకు తెలుసు. అందుచేత, వారు స్కాట్‌లాండ్ వారితో, వారి సైన్యాల నుండి రక్షించుకోడానికై, సంప్రదింపులకు దిగారు. అదే సమయంలో, 'న్యూమోడల్ ఆర్మీ' ని తొలగించడానికి గల షరతులను కామన్స్ సభ్యులు వెంటనే అంగీకరించకుండా, కొంత కాలయాపన చేశారు. సైన్యంలో అసంతృప్తి బాగా కల్గింది. సైనికుల

తొలగింపు చర్యలను ఎదిరించారు. ముద్రణాలయాలను స్థాపించి, సైనికుల దృక్పథాలను కరపత్రాల రూపంలో ప్రచురించి, పంచిపెట్టారు. సైన్యంలో ఒక విభాగం, బహిరంగంగా తిరుగుబాటు చేసింది. కాని, దీన్ని అతికష్టంతో అణచడం జరిగింది. 1647 జూన్ నాటికి, పార్లమెంట్, దాని అధీనంలోని సైన్యం, పరస్పర విరోధంతో ఉన్నాయి.

పార్లమెంట్ పక్షంలో ఏర్పడ్డ కలతలకు, నార్తంప్టన్ లోని రాజు ఒకటో ఛార్లెస్, కొంత సంతోషించాడు. కాని, తమ ఆధిక్యాన్ని తెలుపడానికా అన్నట్లు, సైనికులు రాజును తమ బందీగా చేసుకోదలచి, ఒక దళాన్ని జాయిసీ నాయకత్వం కింద, రాజు ఉనికిని మార్చడానికై పంపింది. జాయిసీ, రాజును న్యూమార్కెట్ పట్టణానికి తరలించాడు. రాజు, తమ విరోధుల్లో గల కలతలు తనకు అనుకూలమని భావించి, జాయిసీతో బాటు న్యూమార్కెట్టుకు పయనించాడు. వెంటనే సైన్యం, కామన్స్ సభలోని వారిపై ధ్వజమెత్తి, తమతో సహకరించని వారిని తొలగించడం ప్రారంభించింది. క్రాంవెల్ అల్లుడైన హెన్రీ ఐరిటన్, ఒక ప్రత్యేకమైన ఒప్పందాన్ని రూపొందించాడు. దీని ప్రకారం, రాజు, అధికారులు, పార్లమెంట్‌కు అణగి ఉంటారని, పార్లమెంట్ గూడ దాని నియోజక వర్గాలకు అతీతంగా ఉండడానికి వీలు లేదని తేలింది. ఈ నియమాలు, సైన్యానికి మద్దతు ఇచ్చేవిగా ఉన్నాయి. క్రాంవెల్, ఐరిటన్ వంటి భూస్వాములకు గూడ, ఇవి నచ్చాయి. కాని, సైన్యంలోని కొందరు తీవ్రవాదులు, 'ప్రజల ఒప్పందం' అనే కొత్త సూచనలను గావించారు. వీటి ప్రకారం, ప్రజలకు ఓటు హక్కును ప్రసాదించాలని, ప్రతి ఏటా కొత్త పార్లమెంట్ ఎన్నిక కావాలనీ, కోరారు. అందులో, రాజును గూర్చిగానీ, పార్లమెంట్‌లోని ప్రభువర్గాన్ని గూర్చిన ప్రసక్తే లేదు.

రాజు, సైనికాధికార్లతో సంప్రతింపులు కొనసాగిస్తూ, రహస్యంగా స్కాట్ నాయకులతో మంతనాలు కొనసాగించాడు. వారి మత షరతులకు రాజు ఒప్పుకున్నట్లైతే రాజును అధికారంలో పునఃప్రతిష్ఠ చేసేటట్లు, అంతవరకు అతడు తప్పించుకోడానికై, సహాయం చేయడానికి అంగీకరించారు. అదే విధంగా, 1647 నవంబర్‌లో, రాజు, సైనికదళం బారినుండి తప్పించుకొని, "ఐల్ ఆఫ్ వెయిట్" కు పారిపోయాడు. దాదాపు సంవత్సర కాలం, క్రిస్‌బ్రూక్ కాజిల్‌లో గడిపాడు. ఇంతలో ఒక సైన్యం లండన్ నగరం ప్రవేశించి, శాంతికి ప్రయత్నించిన వారిని పారిపొమ్మని ఆదేశించింది. పార్లమెంట్‌తో, రాజుతో ఒప్పందానికై, సైన్యం ప్రయత్నించింది. ఇంగ్లాండ్‌లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్యుద్ధంలో, రెండో దశ ప్రారంభమైంది.

## 3.7 ఛార్లెస్ ఓటమి

రాజకీయ సంక్షోభం, దీర్ఘకాలిక పార్లమెంట్ పట్ల పెరిగిన అసంతృప్తి, దీనికి తోడు, స్కాట్‌లాండ్‌తో రాజు నెరపిన రహస్య మంతనాలు, అన్నీ రాజు అనుయాయులకు వ్యతిరేకంగానే పరిణమించాయి. యుద్ధం నిజానికి, వారికి వ్యతిరేకంగానే పరిణమించింది. రాజు పక్షంగా వేల్స్, కెంట్, ఎసెక్స్, ఏక పక్షంగా వ్యవహరించలేక పోయాయి. 'న్యూమోడల్' సేనలు చెక్కు చెదరకుండా ఉండి పోయాయి. క్రాంవెల్ గూడా, రాజుతో ఎట్టి ఒప్పందమూ కుదరదని చెప్తూ, సైన్యంలో అత్యధిక స్థానాన్ని పొందగలిగాడు. వేల్స్‌లో తిరుగుబాట్లను అణచి, ఉత్తరం వెళ్లి, స్కాట్‌లను, వారి అనుయాయులను ఓడించ గలిగాడు. రెండో అంతర్యుద్ధం ఆవిధంగా కొనసాగుతున్న సమయంలో, పార్లమెంట్‌లోని శాంతి పక్షం, ఐల్ ఆఫ్ వెయిట్‌లో నిర్బంధంలో ఉన్న రాజుతో, రహస్యంగా సంప్రదింపులు జరపడం ప్రారంభించింది. అప్పటికే, సైన్యాలు విసుగుచెంది ఉన్నాయి. ఐరిటన్ ఒక పత్రాన్ని రూపొందించి, రాజును విచారించాల్సిందిగా, గణతంత్రాన్ని స్థాపించవల్సిందిగా కోరాడు. 1647 నాటికే గూడ,

రాజరికాన్ని ఏదో విధంగా కొనసాగించాలన్న క్రాంవెల్, ఒకటో ఛార్లెస్ అన్ని విపత్తులకు కారకుడని, అతన్ని తొలగించడమే మేలని నిర్ణయించాడు. 1648 డిసెంబర్‌లో, కల్నల్ థామస్ ప్రైడ్, సైనికుల ప్రతినిధిగా, పార్లమెంట్‌లో సహకరించని సభ్యులను తొలగించడం ప్రారంభించాడు. పాత వారిని మినహాయించి, ఇతరులపై దురుసుగా వ్యవహరించి తొలగించాడు. మిగిలిన వారు "రంప్" (Rump) గా గుర్తింపు పొంది, తర్వాత పార్లమెంట్‌ను 'రంప్ పార్లమెంట్' గా వ్యవహరించారు. రంప్ పార్లమెంట్ ఒక ఉన్నత న్యాయస్థానాన్ని స్థాపించడానికి, దాని ద్వారా రాజును విచారించడానికీ, నిర్ణయించింది. దిగువ సభలో ఈ చట్టానికి, అధిక సంఖ్యాకులు మద్దతును ప్రకటించారు. ఎగువ సభ సభ్యులను, వారు సంప్రదించనే లేదు. క్రాంవెల్ మాత్రం, ఛార్లెస్ రక్తపాతకుడని, అతడు చేసిన తప్పిదాలకు శిక్షార్హుడని, తన తోటి కమీషనర్లతో చెప్పాడట.

### 3.7.1 ఛార్లెస్ విచారణ : మరణదండన

క్రాంవెల్ వలె ఇతర సైనికాధికార్లు గూడ, ఛార్లెస్‌ను విచారణ చేయాలని అభిప్రాయపడినందువల్ల, ఒక ప్రత్యేక కోర్టును ఏర్పర్చారు. దీనికై, 135 కమీషనర్‌లను నియమించారు. కాని, దాదాపు 50 మంది అందు పనిచేయడానికి నిరాకరించారు. జాన్‌బ్రాడ్‌షా అనే అతడు ప్రధాన న్యాయాధికారిగా నియమితుడైనాడు. కాని, ఛార్లెస్ అటువంటి న్యాయస్థానం అసమంజసం అని, దాన్ని గుర్తించడానికి నిరాకరించాడు. పార్లమెంట్ భవనానికి చేరువగా ఉన్న వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో, 1649 జనవరి 20 వ తేదీన విచారణ ప్రారంభమైంది. ఛార్లెస్‌ను కోర్టులో హాజర్‌పర్చగా, అతడు తన్ను తాను సమర్థించుకోడానికి నిరాకరించాడు. "రాజును మరే ఇతరులు విచారించరాదు". అని సూటిగా చెప్పాడు. దాదాపు 32 సాక్షులను ఐదు రోజులపాటు ప్రశ్నించి, కడపటికి న్యాయస్థానం, రాజు క్రూరుడు, దేశద్రోహి, హంతకుడు, దేశానికి విరోధియని, అతనికి మరణదండన విధించింది. కావల్సినంతమంది కమీషనర్లు తీర్పుపై సంతకాలు చేయనిరాకరించినా ఆలివర్ క్రాంవెల్ ఏదో విధంగా వారి సంతకాలను సేకరించాడు. లార్డ్ ఫేర్‌ఫాక్స్, రాజు మరణదండనను ఎదిరించాడు. అతని భార్య, తీర్పు విన్న వెంటనే మూర్ఛ పోయిందట. 1649 జనవరి 30వ తేది, రాజ ప్రాసాదమైన వైట్ హాల్ ఎదుట, అమర్చిన ఎత్తైన వేదిక మీద, వేలాది మంది చూస్తూ ఉండగా, ఒకటో ఛార్లెస్‌కు శిరచ్ఛేదన చేశారు. సుదీర్ఘ బ్రిటీష్ చరిత్రలో, ప్రజలు, తమ రాజును విచారించి, మరణ శిక్షకు గురిచేయడం, ఇదే మొదటిది, కడపటిది కూడా.

ఒకటో ఛార్లెస్‌కు లోపాలు ఉన్నప్పటికీ, అతన్ని నిర్దాక్షిణ్యంగా చంపడం, అనేకులను స్పందింప జేసింది. పార్లమెంట్ అట్టి చర్య గైకొనడం, ప్రజలు హర్షించలేదు. మరణదండన సమయంలో రాజు చూపిన తొట్రుబాటులేని హుందాతనం, ప్రజలను కదల్చివేసింది. అనేకులు అతనిని, దేశం కోసం, మతం కోసం, ప్రాణాలు కోల్పోయిన త్యాగిగా వర్ణించారు. మరికొందరు దేశంలోని చట్టాలకు, ప్రజల స్వాతంత్ర్యానికై, త్యాగం చేశాడన్నారు. ఒక విధమైన సనాతన వాదం, దేశంలో వ్యాప్తి చెందింది. సైన్య నియంతృత్వం, రాజు నియంతృత్వానికి ఏ విధంగా తీసిపోతుందని ప్రశ్నించారు. వారి దృష్టిలో, సైన్యం పోరాడుతుందేకాని, సంఘాన్ని ఏ విధంగానూ నిర్మించలేదు.

## 3.8 ఆలివర్ క్రాంవెల్ : ప్రొటెక్టరేట్ (1649-60)

1629 నుండి 1640 వరకు - దాదాపు పదకొండేళ్లు - ఇంగ్లాండ్‌లో పార్లమెంట్ లేకుండానే, పాలన జరిగింది. 1649 నుండి 1660 వరకు - పదకొండు సంవత్సరాలు - రాజు లేకుండా

పాలన జరిగింది. ఒకటో ఛార్లెస్ మరణానంతరం, రాజరికం రద్దైంది. పార్లమెంట్‌లో ఎగువ సభైన ప్రభువుల సభను తొలగించడం జరిగింది. ఇంగ్లాండ్ 'కామన్‌వెల్త్'గా, అంటే, స్వేచ్ఛా రాజ్యంగా (Free State) ప్రకటితమైంది. పాలనా వ్యవహారాలను చూడ్డానికై, నలభై మంది సభ్యులతో ఒక కౌన్సిల్ ఏర్పడింది. అందు సభ్యులను ప్రతి ఏటా ఎన్నుకొనేవారు. చట్టాలను రూపొందించడానికై, దాదాపు తొంభై మంది సభ్యులుగల రంప్ పార్లమెంట్ కొనసాగింది. ఆ విధంగా కొత్త ప్రభుత్వం అల్ప సంఖ్యాకుల ప్రభుత్వం మాత్రమే. ఇంగ్లాండ్‌లో జరిగిన విప్లవాన్ని బయటి ప్రపంచం శ్లాఘించలేదు. తర్వాత జరిగిన ఫ్రెంచి విప్లవంలో, లాగ ప్రజల్లో ఆనందోత్సాహాలు దీని విషయంలో సమకాలీన కాలంలో లోపించాయి. రాజ్యాంగ పరంగా ఎలా ఉన్నా, నిజానికి అన్ని అధికారాలు సైన్యానికి చెందాయి. విజయం సాధించిన రౌండ్‌హెడ్స్‌లో అసంతృప్తి, వెంటనే చోటుచేసుకుంది. క్రాంవెల్‌ను విమర్శించిన వారిని శిక్షించారు. లిల్ బర్న్ అనే అతడ్ని ఆ విధంగా టవర్‌లో బంధించి, చంపారు. క్రాంవెల్, అతని అల్లుడు ఐరిటన్, దేశంలో ఎటువంటి సాంఘిక, ఆర్థిక సంస్కరణలను అంగీకరించలేదు. ప్రజలందరికి ఓటు హక్కు ఉండి, వారు ఎన్నుకొన్న పార్లమెంట్ పాలన స్థాపితమైతే, నిరుపేదలు ధనవంతులను పాలిస్తారని, వ్యక్తి ఆస్తి అంతమౌతుందని అభిప్రాయపడ్డారు. కొద్దిమంది 'ట్రూలెవలర్స్' (True Levellers) అని పిలుచుకుంటూ, వ్యక్తి ఆస్తులకు, ధనవంతులకు వ్యతిరేకంగా, ఒక సంఘంగా 'సర్రె' (Surrey) నగరంలో ఏర్పడ్డారు. వారు కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని, అక్కడ కొంత సాగుచేసి, అందరి ఫలసాయాన్ని అందరూ పంచుకోబోతారని ప్రకటించారు. బ్రిటీష్ చరిత్రలో వారు మొదటి కమ్యూనిస్టులని చెప్పవచ్చు. కాని, అమాయకులైన వారి ప్రయోగం నచ్చని ధనవంతులు ఒకటిగా చేరి, ఆక్షేత్రాన్ని నాశనం చేశారు.

ఇదే సమయంలో సైన్యంలో గూడ అసంతృప్తి ప్రబలి, అనేక పర్యాయాలు తిరుగుబాట్లకు దారితీసింది. బాన్‌బ్యూరిలో ఒక 'లెవలర్' తిరుగుబాటు లేవదీసిన కారణంగా, క్రాంవెల్, ఫేర్‌ఫాక్స్‌లు రాత్రికి రాత్రే వెళ్లి, అతణ్ణి బంధించాల్సి వచ్చింది. ఈ తిరుగుబాట్ల తర్వాత, క్రాంవెల్ ఐర్లాండ్‌కు వెళ్లి, రాజు మద్దతుదార్లు, కాథలిక్కుల సంఘటిత శక్తిని ఎదిరించాల్సి వచ్చింది. కొత్త రిపబ్లిక్ దేశంలోనేగాక, ఐర్లాండ్, స్కాట్‌లాండ్, తక్కిన ఐరోపాదేశాల్లో గూడ, విరోధుల నెదుర్కోవాల్సి వచ్చింది. స్పెయిన్, కొత్త రిపబ్లిక్‌ను సమర్థించిన మొదటి రాజ్యం. అనేక విదేశీయులు రాజును చంపారని విని, నిర్ఘాంత పోయారు. రూపర్ట్ రాకుమారుడు విప్లవం తర్వాత, తన దగ్గరి అనుచరులతో పోర్చుగల్ చేరి, తలదాచుకొన్నాడు. ఫ్రాన్స్, డచ్ నెదర్లాండ్స్, రష్యా దేశాలు మొదట, రాజును సమర్థించాయి. స్కాట్‌లాండ్‌లో ప్రెస్బిటేరియన్‌లు, ఇంగ్లాండ్ సేనల మతపరమైన అఘాయిత్యాలను నిరసించి, దేశ బహిష్కృతుడైన రెండో ఛార్లెస్‌ను సమర్థించారు. అప్పటికి పందొమ్మిదేళ్ల వయసుగల రెండో ఛార్లెస్, తన తండ్రి సింహాసనాన్ని ఆక్రమించుకోడానికై, తగు సమయం కోసం వేచి ఉండడానికే, నిశ్చయించుకొన్నాడు.

అంతర్యుద్ధ సమయంలో స్వాధీనపర్చుకొన్న మత సంబంధమైన ఆస్తులు, రాజుకు సంబంధించిన భూములు, పంపిణీ అయిన కారణంగా, దేశంలో ఆస్తి హక్కుల విషయాల్లో, అమితంగా మార్పులు సంభవించాయి. కొత్త ధనిక వర్గాలు తలెత్తాయి. వ్యాపారులు, ఉత్పత్తిదార్లు, సైన్యంలో, నౌకాదళంలో పనిచేసేవారు, సనాతనుల స్థానంలో గొప్ప పలుకుబడిని పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో పలుకుబడిగల భూస్వాముల అధికారం అంతరించింది.

రంప్ పార్లమెంట్ దేశం నౌకాబల ఆవశ్యకతను, మొట్టమొదటిసారిగా గుర్తించింది. పూర్వంలా గాకుండా, నౌకా విషయాల్లో సమర్థత, ప్రవేశముండేవారిని మాత్రమే, నౌకావిషయాలు పరిశీలించడానికి, పర్యవేక్షణ చేయడానికి నియోగించారు. ఆ విధంగా, అడ్మిరల్ బ్లేక్‌ను (Blake) ఇంగ్లాండ్

BRAOU

నౌకాదళానికి నియోగించారు. మధ్యధరా సముద్రంపై బ్రిటీష్ నౌకా అధికారాన్ని మొదట ప్రవేశపెట్టిన వాడు, బ్లేక్ మాత్రమే. రంప్ పార్లమెంట్, విదేశీ వ్యాపారం, బ్రిటీష్ వలస సామ్రాజ్య స్థాపన వంటి విషయాలక్కూడా ప్రాధాన్యత నిచ్చింది. 1651 లో నౌకా చట్టాల్ని ప్రవేశపెట్టింది. వీటి ప్రకారం, ఆసియా, అమెరికా, ఆఫ్రికా దేశాల నుండి వచ్చే వస్తువులన్నీ , బ్రిటీష్ నౌకల్లో మాత్రమే రవాణా అవాలని నిర్దేశించడమైంది. హాలండ్‌కు గల నౌకాప్రాబల్యాన్ని అంతరింప చేయడమే, ఇందులోని ప్రధాన లక్ష్యం. ఇటువంటి చర్యల కారణంగా, 1652లో డచ్ వారితో ఇంగ్లాండ్‌కు యుద్ధం అనివార్యమైంది.

## 3.9 డచ్ యుద్ధం, 1652 - 54

రంప్ పార్లమెంట్ విదేశీ విధానంలో, డచ్‌వారితో జరిపిన యుద్ధం ప్రధానమైంది. ఇంగ్లాండ్ అనుసరించిన నౌకా చట్టాల మూలంగా, డచ్ వారికి నష్టం వాటిల్లింది. డచ్ నౌకలను ఇంగ్లాండ్ సోదా చేయడం కూడ, వారికి నచ్చలేదు. 1566 ప్రాంతంలో డచ్‌వారు స్పెయిన్‌కు ఎదురుతిరిగి, స్వాతంత్ర్య సంగ్రామాన్ని కొనసాగించిన రోజుల్లో, వారికి ఇంగ్లాండ్ సహాయం చేసింది. కాని, ఇంగ్లాండ్‌లోని అంతర్యుద్ధ సమయంలో, నెదర్లాండ్ రాజు మద్దతుదార్లకు సహాయం చేయడాన్ని, ఇంగ్లాండ్ ప్రజలు ద్వేషించారు.

1652 లో యుద్ధం ప్రారంభమైంది. మొదట బ్రిటీష్ నౌకాదళాధిపతి బ్లేక్, డచ్‌వారి చేతుల్లో ఓటమిని పొందాడు. కాని, వెంటనే అతడు 1653 ఫిబ్రవరిలో పోర్ట్‌లాండ్ వద్ద, మూడు నెల్ల తర్వాత గబ్బార్డ్ వద్ద, డచ్ నౌకాదళాన్ని చిత్తుగా ఓడించగలిగాడు. దాదాపు ఏడు నెలలపాటు, ఇంగ్లాండ్ హాలండ్‌ను దిగ్బంధించగల్గింది. దీంతో, శాంతి ఒప్పందం కుదిరింది. హాలండ్, బ్రిటీష్ వారి నౌకా చట్టాలను అంగీకరించింది. 1623లో అంబాయనా దీవిలో బ్రిటీష్‌వారిని చంపినందుకు, నష్టపరిహారం చెల్లించడానికి అంగీకరించింది. ఈ యుద్ధం వల్ల, డచ్‌వారి నౌకాబలం పూర్తిగా ధ్వంసం కాకపోయినా, బ్రిటీష్ నౌకాదళానికి సమానమైనదిగా మాత్రం గుర్తించడం జరిగింది.

## 3.10 ఐర్లాండ్ వ్యవహారాలు

అంతర్యుద్ధ సమయంలో, ఐర్లాండ్‌లో గూడ కొన్ని తిరుగుబాట్లు జరిగాయి. కాని, రాజుకు, పార్ల మెంట్‌కు మధ్య చాలా కలతలుండిన కారణంగా, ఈ తిరుగుబాట్లను అణచలేదు. కొన్ని సందర్భాల్లో ఛార్లెస్, పార్లమెంట్‌కు వ్యతిరేకంగా ఐర్లాండ్ నుండి సహాయాన్ని పొందడానికి ప్రయత్నించాడు. ఛార్లెస్ మరణానంతరం, ఐర్లాండ్ వ్యవహారాల్లో పెద్ద మార్పులు సంభవించాయి. 1647 లో పార్ల మెంట్‌కు తలొగ్గిన ఆర్మాండ్, రాయలిస్ట్ పక్షాన్ని పునరుద్ధరించాడు. అక్కడ ఉండే కాథలిక్కులతో సంధి కూడ చేసుకొన్నాడు. ఐర్లాండ్‌లో కామన్‌వెల్త్ బలహీనమైంది. అనేక ప్రాంతాల నుండి ఇంగ్లీష్ వారిని తరిమికొట్టడం ప్రారంభించారు. అందుచేత, క్రాంవెల్ ఐర్లాండ్‌ను తిరిగి ఆక్రమించుకోవాల్సిన అవసరమేర్పడింది. పదివేల సైన్యంతో క్రాంవెల్, ఆర్మాండ్‌ను 1649 ఆగస్ట్‌లో ఓడించాడు. అక్కడ ప్రజలను అతి క్రూరంగా చంపి, వేలాది మందిని నిరాశ్రయులను చేశాడు. క్రాంవెల్ అనుసరించిన దమన కాండను అందరు గర్హించారు. కాని, 1650 నాటికి, దాదాపు నాల్గింట మూడువంతులు, ఐర్లాండ్‌ను తన అధీనానికి తేగలిగాడు. మిగిలిన భాగాన్ని ఆక్రమించే బాధ్యత, అతని అల్లుడైన ఐరిటన్‌కు వదలి వేయడం జరిగింది. 1652 నాటికి, ఐర్లాండ్ పూర్తిగా ఇంగ్లాండ్ వశమై ది.

## 3.11 స్కాట్‌లాండ్

క్రాంవెల్ అధీనంలోని కామన్‌వెల్త్, స్కాట్‌లాండ్ వ్యవహారాలను గూడ గమనించాల్సొచ్చింది. ఛార్లెస్‌ను చంపిన ఒక వారం రోజుల్లో, అతని కుమారుడు రెండో ఛార్లెస్ స్కాట్‌లాండ్ రాజుగా ప్రకటితమైనాడు. నెదర్లాండ్ నుండి స్కాట్‌లాండ్ చేరుకొన్న రెండో ఛార్లెస్, అక్కడి ప్రజల సానుభూతిని పొందాడు. స్కాట్ ప్రజలు అతనికి తగు సహాయం చేయడానికి గూడ సిద్ధమయ్యారు. మాంట్రోజ్, ఒకటో ఛార్లెస్‌కు విధేయులైన నాయకుల్లో ఒకడు. తన అనుచరుల సహాయంతో, అతడు పెద్ద తిరుగుబాటును లేవదీశాడు. కాని, క్రాంవెల్ పంపిన సైన్యాలు అతన్ని ఓడించాయి. ఆర్గైల్ ప్రభువు కూడ, అదే విధంగా తిరుగుబాటు చేశాడు. కాని, క్రాంవెల్ అతన్ని గూడ ఓడించగలిగాడు. 1651లో స్కాట్ సేనలను వర్సెస్టర్ వద్ద ఓడించి, దాదాపు పదివేల మంది స్కాట్‌లను ఖైదుచేశాడు. రెండో ఛార్లెస్ స్కాట్‌లాండ్ వీడి, ఫ్రాన్స్‌కు తప్పించుకొని వెళ్లాడు. క్రాంవెల్ పై విధంగా డచ్ నెదర్లాండ్స్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్ విషయాల్లో చాల విజయవంతంగా దండయాత్రలు జరిపి, ఇంగ్లాండ్ ఆధిపత్యాన్ని చాటాడు.

## 3.12 రంప్ పతనం : కొత్త రాజ్యాంగం

రంప్ పార్లమెంట్‌కు, క్రాంవెల్ అధీనంలోని సైన్యానికి మధ్య, తగాదాలు మొదలైనాయి. ఐరిటన్ వంటి కొద్దిమంది మినహా, తక్కిన రంప్ పార్లమెంట్ సభ్యులు అవినీతి, లంచగొండితనంతో, ప్రజాదరణను కోల్పోయారు. అందుచే, క్రాంవెల్ 1653 లో రంప్ పార్లమెంట్‌ను రద్దుపర్చాడు. దాంతోబాటు, మంత్రుల సభయైన "కౌన్సిల్ ఆఫ్ స్టేట్" గూడ రద్దయింది. ప్రజాస్వామిక సంస్థలన్నీ రద్దైనాయి.

BRAOU

రంప్ పార్లమెంట్‌ను రద్దుపర్చిన తర్వాత, క్రాంవెల్ ఏర్పర్చిన కొత్త కౌన్సిల్ ఆఫ్ స్టేట్, పార్లమెంట్‌ను సమావేశపర్చమని, సలహా ఇచ్చింది. అందుచేత క్రాంవెల్ కొత్తపార్లమెంట్‌ను సమావేశపర్చాడు. దీనికి, "బేర్‌బోన్ (Barebone) పార్లమెంట్" అని పేరు. ఇందులో అనేక మత నాయకులుండిన కారణంగా, దీనికి 'పార్లమెంట్ ఆఫ్ సెయింట్స్' అని గూడ పేరు. కొత్త పార్లమెంట్ పలు నూతన చర్యలను ప్రవేశపెట్టగల్గింది. కాని, ఇవన్నీ వివాహచట్టాలకు, జనన మరణాల రిజిస్టర్ చట్టాలకు మాత్రమే పరిమితమైనాయి. క్రాంవెల్ కొద్దికాలంలోనే, కొత్త పార్లమెంట్‌పట్ల అసంతృప్తిని పొందాడు. మితవాదు లనేకులు పార్లమెంట్‌ను విమర్శించడం ప్రారంభించారు. అందుచేత, క్రాంవెల్ కొత్త పార్లమెంట్‌ను రద్దుపర్చి, అన్ని అధికారాలను స్వయంగా స్వీకరించాడు.

క్రాంవెల్, "అభీష్టం లేని నిరంకుశుడుగా" కొత్త పాలనను సంస్కరించాడు. 'ప్రభుత్వ యంత్రాంగం' (Instrument of Government) అనే రాజ్యాంగాన్ని రూపొందించాడు. ఇది ప్రధానంగా లాంబర్ట్ కృషి. బ్రిటీష్ చరిత్రలో ఇది లిఖిత పూర్వకమైన ఏకైక రాజ్యాంగం. దీని ప్రకారం క్రాంవెల్ జీవితాంతం 'లార్డ్ ప్రొటెక్టర్' (Lord Protector) గా ప్రకటితమైనాడు. అతనికి తగిన సలహాల నివ్వడానికై 'కౌన్సిల్ ఆఫ్‌స్టేట్' ఏర్పడింది. ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, ఐర్లాండ్ - మూడు ప్రాంతాలు - కామన్‌వెల్త్‌గా రూపొందాయి. పార్లమెంట్ మూడేళ్ల వ్యవధిలో ఏర్పాటైంది. పార్లమెంట్‌ను సమావేశపర్చడం, దాన్ని రద్దుచేయడం వంటి అధికారాలన్నీ, లార్డ్ ప్రొటెక్టర్‌కు మాత్రమే ఉంచబడ్డాయి. ఈ కొత్త రాజ్యాంగం కింద క్రాంవెల్ 1653 నుండి, 1658 సెప్టెంబర్‌లో చనిపోయేవరకు, నిరంకుశ పాలనను సాగించాడు.

## 3.13 రెండేళ్ల కల్లోలం (1658-60)

క్రాంవెల్ 1658లో మరణించిన తర్వాత, దేశం అస్తవ్యస్త పరిస్థితుల్ని ఎదుర్కొంది. సంస్కరణాభిలాషులు, దేశం ప్రజాస్వామిక గణతంత్రం కావాలని, అభిప్రాయపడ్డారు. సామాన్య ప్రజలు పాలించాలని, అందులో ప్రభువులకు, మతాధికార్లకు, స్థానం లేదని భావించారు. దేశంలో మరికొంతమంది, మత ప్రాతిపదికపై మతైక రాజ్యం ఏర్పడాలన్నారు.

క్రాంవెల్ మరణానికి ముందు, తన కొడుకైన రిచర్డ్ క్రాంవెల్ (1626-1712)ను, తర్వాతి వారసుడుగా ప్రకటించాడు. కాని, దేశం ఎదుర్కొన్న పరిస్థితులను చక్కబర్చదగ్గ నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు, అతనికి లేవు. అతని దృష్టిలో, సైన్యం స్వేచ్ఛగల సంస్థ. కాని, సైన్యం రిచర్డ్ క్రాంవెల్ అధీనంలో కొనసాగడాన్ని గర్హించింది. సైన్యంలో పౌర పాలనను అభిలషించిన వారి సంఖ్య, ఎక్కువౌతూ వచ్చింది. రిచర్డ్ సైన్యాధ్యక్షుడుగా ఎవరినీ నియమించలేదు. అతనికి, సైన్యానికి మధ్య విభేదాలు ఎక్కువవుతూ వచ్చాయి. అతడు సమావేశపర్చిన కొత్త పార్లమెంట్, సైన్యాన్ని ద్వేషించింది. 1659 ఏప్రిల్‌లో, ప్రొటెక్టరేట్ పార్లమెంట్ రద్దై, 'రంప్' పార్లమెంట్ పునరుద్ధరించడం జరిగింది. రిచర్డ్ దేశ పరిస్థితులపట్ల విసుగెత్తి, పదవికి రాజీనామా చేసి, ఫ్రాన్స్‌కు వెళ్లి, పారిస్ నగరంలో నివసించసాగాడు. 1680 ప్రాంతంలో, ఇంగ్లాండ్‌కు తిరిగి వచ్చాడు. 1712 లో రిచర్డ్ తన 86వ ఏట, మరణించాడు.

రిచర్డ్ క్రాంవెల్ పదవినుండి వైదొలగడానికి నిర్ణయించుకొన్న తోడనే, జనరల్ మాంక్ ఆధ్వర్యంలో, రంప్ పార్లమెంట్ రద్దై, కన్వెన్షన్ పార్లమెంట్ ఏర్పాటైంది. కొత్త పార్లమెంట్ రాజరిక పునరుద్ధరణకు, రెండో ఛార్లెస్‌ను ఆహ్వానించడానికి తీర్మానించింది.

## 3.14 17వ శతాబ్దంలో వాఙ్మయ వికాసం

ఎలిజబెత్ ట్యూడర్ పాలనాకాలంలో, ఆంగ్లభాషా వాఙ్మయాలు అమిత ప్రోత్సాహంతో, వ్యాప్తి చెందాయి. షేక్‌స్పియర్ (Shakespeare) వంటి నాటక కర్తలు, రచయితలు, ఆ భాషకు ఎంతో దోహదం చేశారు. అదే విధంగా, 17వ శతాబ్దంలో రాజుకు, పార్లమెంట్‌కు మధ్య రాజ్యాంగ వివాదాలు జరుగుతున్నా, అంతర్యుద్ధం కొనసాగుతున్నా, ఆంగ్ల భాషా వికాసం బహుళంగా కొనసాగింది. ఆ సమయంలోనే, కొన్ని మత ప్రాముఖ్యత గల రచనలు వెలువడ్డాయి. పద్య రచనలో జాన్ మిల్టన్ (John Milton), గద్య రచనలో జాన్ బన్యన్ మిక్కిలి ప్రసిద్ధ రచయితలు. వారిద్దరు ప్యూరిటనిజమ్‌ను తమ రచనల్లో పరిపూర్ణంగా ప్రతిబింబింపజేశారు.

1608 లో జాన్ మిల్టన్ లండన్‌కు చెందిన ఒక సనాతన ప్యూరిటన్ కుటుంబంలో జన్మించాడు. ప్రాథమిక విద్యను సెయింట్ పాల్ పాఠశాలల్లో కొనసాగించిన మిల్టన్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నభ్యసించాడు. 1629లో పట్టాపుచ్చుకొన్న మిల్టన్, అదే సంవత్సరం తన మొదటి గ్రంథం "ఓడ్ టు నేటివిటి"ని రచించాడు. 1633లో "కోమస్" "లిసిడాస్" లను రాశాడు. 1640 ప్రాంతంలో మిల్టన్, పద్య రచన నుండి వచన రచనకు మళ్ళాడు. రాజకీయ స్ఫూర్తితో కూడుకొన్న రచనలను గూడ చేపట్టాడు. తన గ్రంథం 'అరియోపెజిటిక' ( Areopagitica) లో, రాజకీయ, మతస్వాతంత్ర్యాలకై పిలుపు నిచ్చాడు. రిపబ్లిక్‌ను స్థాపించిన సమయంలో, మిల్టన్ ప్రభుత్వంలో సెక్రటరీగా నియమితుడైనాడు. 1660 లో రెండో ఛార్లెస్ పునరుద్ధరణ వరకు, ఆ పదవిలో

కొనసాగాడు. ఇదే సమయంలో మిల్టన్ చూపు కోల్పోయాడు. ఉద్యోగం విరమించుకొన్న మిల్టన్, తన పద్య రచనా ప్రాభవంతో, మత సంబంధమైన ఉద్గ్రంధాలను రాయుచూశాడు. దృష్టిలోపంతోబాటు, బీదరికం కలసి, అతన్ని గొప్ప వేదాంతిగా, తాత్వికవాదిగా మార్చివేసింది. 1663-67 మధ్య కాలంలో అతడు, ప్రసిద్ధి పొందిన 'పారడైజ్ లాస్ట్' (Paradise Lost)ను పూర్తిచేశాడు. 1671లో "పారడైజ్ రిగైన్డ్" (Paradise Regained) ను రాశాడు. ఇవి, ప్రపంచ వాఙ్మయాల్లోనే మిక్కిలి ప్రధానమైన పద్య రచనలు.

జాన్ బన్యన్ (1628-1688), మిల్టన్ వలె గొప్ప రచయిత. 1678లో అతడు మిక్కిలి ప్రసిద్ధి చెందిన "పిల్గ్రిమ్ ప్రోగ్రెస్" (Pilgrim Progress) అనే గ్రంథాన్ని రాశాడు. అందులో రచయిత ఒక మత విధేయుడైన యాత్రికుడు. ఈ గ్రంథంలో యాత్రికుడు స్వర్గానికి చేసే ప్రయాణం, దారి మధ్యలో అతని సాహసోపేత కార్యాలు, వర్ణితమైనాయి. అభూత కల్పనలతో చేసినా, రచయిత వర్ణనలు నిజంగా జరిగినట్లు, కళ్ళకు కట్టినట్లు చేసిన వర్ణనలు, చదువరులను గొప్పగా ఆకర్షించాయి. తన ఈ గద్య రచన మూలంగా, ప్రజల నైతిక, మత, బాధ్యతలను గుర్తుచేస్తూ, వారికి ఆధ్యాత్మిక జీవన అవసరాలను పరోక్షంగా బోధించాడు.

## 3.15 సంగ్రహంగా

అంతర్యుద్ధం ముగింపుకు వచ్చిన సమయంలో, సైన్యాలకు నాయకత్వం వహించిన ఫేర్‌ఫాక్స్ (Fairfax) గొప్ప పేరు పొందాడు. అయితే, క్రాంవెల్ అంతర్యుద్ధ విజయానికి కారకుడు. క్రాంవెల్‌కు జ్ఞాపికగా, అతని జీవిత కాలంలోనే, అతడు రక్షించిన పార్లమెంట్‌కు వెలుపల, అతని శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. 1658 లో క్రాంవెల్ మరణించిన పిదప, 1660లో రెండో ఛార్లెస్ రాజుగా పునరుద్ధరణ జరిగే వరకు, ఇంగ్లాండ్ సైనికాధికారులకు వశమైంది. ప్రాచీన కాలంలో రోమన్ సైనిక వీరులు రాజకీయాల్లో జోక్యం కల్గించుకొనేవారు. ప్రభుత్వాలను ఏర్పర్చడం, తొలగించడం వారి వంతే. అట్లే, ఇంగ్లాండ్‌లో సైనిక నాయకులు రాజకీయాల్లో తలమునకలయ్యేట్లు తలలు దూర్చేవారు. ఈ సమయంలో, ఆలివర్ కొడుకైన రిచర్డ్ క్రాంవెల్‌ను (Richard Cromwell) కూడ, సైనిక నాయకులు 1659 మే నెలలో తొలగించారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు, వర్తకులు, ప్రెస్బిటేరియన్లు, రిపబ్లికన్లు, అందరినీ సైనిక నాయకులు ఎదిరించారు. సైన్యంలో గూడ అంతరంగిక తగాదాలు లేకపోలేదు. 1660 లో పార్లమెంట్ రాజరికాన్ని కాంక్షించిందంటే, దీనికి దేశంలో సైనిక నాయకుల్లో ఏర్పడ్డ అంతరంగిక స్పర్ధలను అరికట్టడం గూడా కారణమే. క్రాంవెల్ సైన్యాన్ని ఉపయోగించుకొని, ప్రజల ఆస్తిని కాపాడి, శాంతిని ప్రసాదించాడు. కాని, అతని తర్వాత సైన్యాన్ని సద్వినియోగం చేయించడానికి, మళ్లీ 1660 లో రాజరిక పునరుద్ధరణే మార్గంగా తోచింది.

## 3.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. అంతర్యుద్ధానికి దారితీసిన ప్రధాన కారణాలను వివరించండి.

2. 1642-49 మధ్య జరిగిన అంతర్యుద్ధంలోని ప్రధాన ఘట్టాలను పరిశీలించండి.

3. అంతర్యుద్ధానంతరం ఆలివర్ క్రాంవెల్ ఇంగ్లాండ్‌లో స్థాపించిన కామన్వెల్త్ పాలనా రాజ్యాంగ ప్రాముఖ్యతను చర్చించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. పార్లమెంట్ అసంతృప్తి
2. స్కాట్‌లాండ్‌తో తగాదా
3. పార్లమెంట్ పక్షంలో ఏర్పడ్డ అంతఃకలహాలు
4. క్రాంవెల్ వైదేశిక విధానం
5. రంప్ పార్లమెంట్ పతనం
6. 17వ శతాబ్దంలో వాఙ్మయ వికాసం

## 3.17 ఉపయుక్త గ్రంధాలు


| | | |
|---|---|---|
| G.M. Yonny | : | **Charles I and Cromwell** |
| M. Ashley | : | **The Greatness of Oliver Cromwell** |
| John Bercham | : | **Oliver Cromwelt** |
| C.H. Firth | : | **The last years of Protectorate** |
| S.R. Gardiner | : | **Cromwell's Place in History** |
| G.M. Trevelyan | : | **History of England** |
| J.P. Kenyon | : | **Stuart England** |
| G.M. Trevelyan | : | **England under the Stuarts** |
| Barry Coward | : | **The Stuart Age** |
| తెలుగు అకాడమి ప్రచురణ | : | బ్రిటీష్ రాజ్యాంగ చరిత్ర, 1485-1949 |


BRAOU

# భాగం-4 : రెండో ఛార్లెస్, పార్లమెంట్ సంబంధాలు

విషయక్రమం

4.0 లక్ష్యాలు

4.1 రాజరిక పునరుద్ధరణకు దారితీసిన పరిస్థితులు

4.1.1 రాజరిక పునరుద్ధరణ (1660) : స్వభావం, రాజ్యాంగ ప్రాముఖ్యత

4.2 రెండో ఛార్లెస్

4.3 కన్వెన్షన్ పార్లమెంట్, 1660-1661

4.4 కెవాలియర్ పార్లమెంట్, 1661 - 1678

4.5 కాబాల్ (CABAL) మంత్రివర్గం, 1667 - 1673

4.6 డన్బీ ముఖ్య మంత్రి, 1673-78

4.7 హేబియస్ కార్పస్ (Habeas Corpus) చట్టం, 1679

4.8 మినహాయింపు ప్రతిపాదన (Exclusion Bill)

4.9 రాజకీయ పక్షాల ఆవిర్భావం

4.10 విదేశీ సంబంధాలు

4.11 సుస్థిర రాజరిక అధికారం

4.12 సంగ్రహంగా

4.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

4.14 ఉపయుక్త గ్రంథాలు

## 4.0 లక్ష్యాలు

రెండో ఛార్లెస్‌ను 1660 లో రాజుగా ప్రకటించి, ఇంగ్లాండ్‌లో రాజరికాన్ని పునరుద్ధరించడం, ఆదేశ చరిత్రలో ఒక నూతనాధ్యాయానికి నాంది పల్కింది. ఇది, దేశ ప్రజల్లో గూడ, మారిన మనోభావాలకు నిదర్శనం. అంతవరకు చరిత్ర గతిని ప్రభావితం చేసిన భావాలు, సంస్థలు, మత విధానాలు, అన్నీ గూడ ప్రజానీకంపై తమ పూర్వపు ప్రభావాన్ని కోల్పోయాయి. మత సంస్కరణో ద్యమం, రాజరిక సిద్ధాంతాలు, మధ్యయుగం నాటి ఫ్యూడల్ విధానాలు, సనాతన పద్ధతులు, అన్నీ నిరసించబడినాయి. కాని, రాజ్యాంగ సమతౌల్యం గూర్చిగాని, రాజుకు పార్లమెంటులోని సభ్యులతో,



B R A O U

లేదా మత సంస్థలతోను, ఎటువంటి సంబంధాలుండాలనే విషయాలపై, ఎట్టి పరిష్కారాలు ఇందులో కనిపించవు. రెండో ఛార్లెస్‌కు మొదట ముఖ్యమంత్రిగా వ్యవహరించిన క్లారన్‌డన్ (Clarendon) సనాతన పద్ధతిలోనే పరిపాలన కొనసాగించాడు. కాని, 1667 లో అతడు అధికారం నుండి తొలగిన పిదప, రాజు క్లారన్‌డన్ ప్రత్యర్థులనే సమర్థించాడు. అదేవిధంగా, కాబాల్ (CABAL) మంత్రివర్గ సభ్యులను సమర్థించడానికి గూడ, ఎట్టి ప్రయత్నం చేయలేదు. 1660 లో జరిగింది కేవలం రాజరిక పునరుద్ధరణ మాత్రమే కాదు. పార్లమెంట్, ఆంగ్లికన్ మతం, చారిత్రాత్మక న్యాయస్థానాలు, వాటితో బాటు దేశవ్యాప్తంగా గల స్థానిక పాలనా సంస్థలన్నీ, పురాతన వైభవ స్థితికి పునరుద్ధరించడం జరిగింది. పునరుద్ధరణ, రెండో ఛార్లెస్ పరిపాలనను, ఈ భాగంలో వివరించడం జరిగింది.

## 4.1 రాజరిక పునరుద్ధరణకు దారితీసిన పరిస్థితులు

ఆలివర్ క్రాంవెల్ మరణానంతరం, దేశ పరిస్థితులు సక్రమంగా లేని కారణంగా, 1660 నాటికి రాజరిక పునరుద్ధరణకు దారితీశాయి. బలహీనుడైన క్రాంవెల్ కుమారుడు రిచర్డ్ క్రాంవెల్ సైన్యంతో తగాదాపడి, రంప్‌ను పునరుద్ధరించి, సంరక్షక పార్లమెంట్‌ను రద్దుచేసి, తాను 1659 ఏప్రిల్‌లో పదవినుండి తప్పుకొన్నాడు. అప్పటికి, సైన్యంలో ఐకమత్యం లోపించింది. సైన్యాధ్యక్షుడైన లాంబర్ట్, ఆలివర్ క్రాంవెల్‌కు రాజకీయ వారసునిగా భావించాడు. ఆలివర్ జీవించి ఉన్నప్పుడే, అనేకులు అతని తర్వాత, లాంబర్ట్, రిచర్డ్ క్రాంవెల్‌లలో ఎవరు ఇంగ్లాండ్‌కు వారసులనే విషయాన్ని చర్చించేవారు. ఆలివర్ క్రాంవెల్, ఇతర రాజవంశస్థుల వలె, తన వంశ కీర్తిప్రతిష్ఠలకని, పెద్ద కుమారుడైన రిచర్డ్‌ను వారసుడిగా ప్రకటించాడు. రెండో కొడుకైన హెన్రీ, నిజానికి ఆలివర్ అంతటి వాడు. కాని, అతడు ఐర్లాండ్‌కు గవర్నరర్‌గా నియమితుడైనాడు. 1659 అక్టోబర్‌లో జాన్ లాంబర్ట్ పార్లమెంట్‌ను ముట్టడించి, రంప్‌ను తొలగించాడు. 'రక్షణ సంఘం' అను ఒక కమిటీని నియమించి, కొత్త ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించాల్సిందిగా ఆదేశించాడు. ఒక రకంగా, దేశం సైనిక నియంతృత్వానికి దారితీసేటట్లు కనిపించింది. ప్రజాస్వామిక విధానంపై ప్రజలకు విశ్వాసం సడలింది. అంతవరకు, దేశ బహిష్కృతుడైన రెండో ఛార్లెస్‌ను ఏ విధంగానూ అభిమానించనివారు గూడ, రాజరిక పునరుద్ధరణ ఆవశ్యకతను గూర్చి చర్చించడం ప్రారంభించారు.

ఇటువంటి సందర్భంలో దేశంలో మరొక అంతర్యుద్ధం చెలరేగే పరిస్థితులు ఏర్పడ్డాయి. సైన్యాధ్యక్షుడైన జనరల్ లాంబర్ట్‌కు, స్కాట్‌లాండ్‌లో సైనిక నాయకుడైన జనరల్ మాంక్ (Monck)కు, తగాదాలు పెరిగాయి. మాంక్ గొప్ప నిజాయితీగల దేశభక్తుడు. 1654 నుండి స్కాట్‌లాండ్ పాలకుడిగా గొప్ప పేరు సంపాదించాడు. ఆలివర్ క్రాంవెల్‌కు, ఒకప్పుడు నమ్మకమైన అనుయాయి. లాంబర్ట్ అధికారానికి రావడం నచ్చని మాంక్, తన పటిష్టమైన సైన్యాన్ని స్కాట్‌లాండ్ సరిహద్దు ప్రాంతమైన కోల్డ్‌స్టార్మ్ (Cold Storm) వద్ద సమీకరింప జేశాడు. 1660 జనవరిలో ఎముకలు కొరికే చలిని గూడ లెక్కచేయకుండా, తన సైన్యాలను లండన్ నగరం పైకి నడిపాడు. దారి పొడుగునా, అతనికి ప్రజల సహకారం లభించింది. రాజకీయ సుస్థిరత అత్యావసరమని, సైనిక పాలనను అందరూ ఎదిరించాలని, ప్రజలకు చెప్పాడు. స్వతంత్రమైన పార్లమెంట్‌ను సమావేశపర్చడం, తన అభిమతమని తెలియజేశాడు. అంటే, రాజరిక పునరుద్ధరణకు తన అంగీకారాన్ని పరోక్షంగా ఎరుకపర్చాడు. లార్డ్ ఫేర్‌ఫాక్స్ వంటి అనేక మంది పార్లమెంట్ సభ్యులు, మొదటినుండి గణతంత్ర వ్యవస్థకు సుముఖులుకారు. వారు నియమబద్ధమైన రాజరికాన్ని అభిలషించారు. రెండో ఛార్లెస్ సింహాసన మధిష్ఠించడం, వారికి సబబుగా తోచింది. దీర్ఘకాలిక పార్లమెంట్‌లో సభ్యులుగా నుండిన కొంతమంది, జనరల్ మాంక్‌ను కలిసి, అతన్ని అత్యున్నత అధికారిగా గుర్తించారు. అతడు వెంటనే కొత్త

ఎన్నికలకు ఉత్తర్వులు జారీ చేశాడు. 1660 లో ఏర్పాటైన కొత్త పార్లమెంట్‌కు "కన్వెన్షన్ పార్లమెంట్" అని పేరు. అది సమావేశమైన వెంటనే, రెండో ఛార్లెస్‌కు వర్తమానం పంపి, అతన్ని ఇంగ్లాడ్‌కు వచ్చి తన తండ్రి సింహాసనాన్ని ఆక్రమించుకోవాల్సిందిగా ఆహ్వానించింది. అప్పుడు హాలండ్‌లో నివసిస్తున్న రెండో ఛార్లెస్, 1660 ఏప్రిల్ 4వ తేదీ ఆహ్వానాన్ని అంగీకరిస్తూ, తన షరతులను తెలియజేస్తూ, ఒక ప్రకటన చేశాడు. దీనికి 'బ్రెడా డిక్లరేషన్' (Declaration of Breda) అని పేరు. దాని ప్రకారం, రాజు సైన్యాన్ని తన అధీనంలో ఉంచుకొంటానని, అంతకు ముందు రాజు మరణానికి కృషిచేసిన రౌండ్‌హెడ్ నాయకులను వేధించడం జరగదని, పార్లమెంట్ అనుమతి ప్రకారం అట్టివారిని శిక్షించడం జరుగుతుంది; కామన్‌వెల్త్ కాలంలో సంపాదించుకొన్న ఆస్తిపాస్తులు, రాజరిక పునరుద్ధరణ తర్వాత గూడ కొనసాగుతాయని స్పష్టం చేశాడు. అనంతరం, పార్లమెంట్ ప్రతినిధులు హాలండ్ వెళ్లి స్వయంగా రెండో ఛార్లెస్‌ను దేశం తిరిగి రావలసిందిగా, ఆహ్వానించారు. 1660 మే 29వ తేదిన అనేక సంవత్సరాల కాందిశీక జీవనం గడపిన రెండో ఛార్లెస్, లండన్ ప్రవేశించాడు.

## 4.1.1 రాజరిక పునరుద్ధరణ (1660) : స్వభావం, రాజ్యాంగ ప్రాముఖ్యత

రెండో ఛార్లెస్ లండన్ నగరాన్ని ప్రవేశించిన సంఘటన తెచ్చినంత మార్పు, ఇంగ్లాండ్ ప్రజల ప్రవర్తనా విధానంలోగాని, వారి మనసుల్లోగాని, అది వేసిన చెరగని ముద్ర, మరే ఇతర సంఘటనా తేలేదు. దీంతో, ఆధునిక ఇంగ్లాండ్ ప్రారంభమైందని చెప్పవచ్చు. అంతవరకు దేశ చరిత్రను మలచిన, మత సంస్కరణోద్యమ ప్రభావం, కొత్త రాజరిక వ్యవస్థ స్థాపనా ప్రభావాలు, మధ్య యుగం నాటి ఫ్యూడల్ పద్ధతులు, దాంతోబాటు ఇతర సనాతన ఆచార వ్యవహారాలు, ఒక్క సారిగా ప్రజల మస్తిష్కం నుండి తొలగిపోయాయి. అప్పటినుండి బలమైన ఆలోచనా సరళి, శాస్త్రీయ దృక్పథాలు, రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంస్థల యెడగల నిర్దుష్ట అభిప్రాయాలు, ప్రచారంలోకి రాసాగాయి.

రాజరిక పునరుద్ధరణ, రెండో ఛార్లెస్‌ను, లండన్‌లో అప్పటి రాజ ప్రాసాదమైన వైట్‌హాల్‌కు చేర్చింది. రాజును తిరిగి సింహాసన మధిష్టింప చేయడంతో, అనేక ఇతర సంస్థలను గూడ పునరుద్ధరించటానికి అవకాశ మేర్పడింది. పార్లమెంట్ అంతకుముందు కోల్పోయిన ప్రాధాన్యతను, తిరిగి పొందగల్గింది. ఆంగ్లికన్ చర్చి, న్యాయస్థానాలు, దేశ వ్యాప్తంగా స్థానిక సంస్థలు, అన్నీ పునరుద్ధరించబడినాయి. రెండో ఛార్లెస్‌ను ఆహ్వానించినప్పుడు, అతనికి ఎట్టి షరతులను విధించలేదు. కాని, అతనికి అప్పజెప్పిన రాజరికం, ఎలిజబెత్ కాలంలో వలె, సర్వాధికారంగల రాజరికమని చెప్పడానికి వీల్లేదు. సింహాసనాన్ని అధిష్టించడానికి అంగీకరించిన రెండో ఛార్లెస్‌కు, ఈ విషయం స్పష్టంగా తెలుసు.

రాజరిక పునరుద్ధరణతో, ఒకటో ఛార్లెస్ అంతర్యుద్ధానికి ముందు పార్లమెంట్ ద్వారా జారీ అయిన అన్ని చట్టాలను పునరుద్ధరించడం జరిగింది. అందుచేత, పార్లమెంట్‌ను సంప్రదించకుండా, కొత్త పన్నులు విధించడం వంటి అధికారాలను రాజు కోల్పోయాడు. 1641 లో జారీయైన "మూడేళ్ల చట్టం" అమల్లోకి వచ్చింది. ఫలితంగా, రాజు మూడేళ్ల లోపు పార్లమెంట్‌ను తప్పనిసరిగా సమావేశపర్చి తీరాలి. రాజాధికారాలు కొనసాగే స్టార్ ఛాంబర్ న్యాయస్థానం, హైకమీషన్ న్యాయస్థానం, కౌన్సిల్ ఆఫ్ నార్త్ వంటివి పునఃస్థాపించబడలేదు. రాజ్యాంగ విరుద్ధమైన 'ఓడ పన్ను' నిర్బంధ రుణాల వసూలు వంటి వన్నీ, నిషేధించడం జరిగింది. ప్రీవీ కౌన్సిల్ క్రిమినల్ న్యాయాధికారం హరించి పోయింది. తగిన కారణాలు లేకుండా, పార్లమెంట్ సభ్యులను రాజు నిర్బంధించడానికి వీల్లేదు. పార్లమెంట్ రెండో ఛార్లెస్‌ను రాజుగా చేయడంలో ఉండే ప్రధానోద్దేశం, అది అతన్ని ఆ పదవి నుండి తొలగించగలదన్న అభిప్రాయం ఉండడమే, అతి ముఖ్యం. రాజు దైవాంశసంభూతుడనే

సిద్ధాంతం, పూర్తిగా తొలగిందనే చెప్పాలి. ఇంగ్లాండ్‌లో రెండో ఛార్లెస్ పునరుద్ధరణతో, రాజ్యాంగ బద్ధ రాజరికం స్థాపితమైంది.

పార్లమెంట్‌ను ముందులాగే పునరుద్ధరించడం జరిగింది. కామన్స్, లార్డ్స్ సభ్యులతో రెండు సభలు ఏర్పడ్డాయి. రెండో ఛార్లెస్ అనేక సంస్కరణలను తలపెట్టాడు. నియోజక వర్గాలను మార్చాడు. ఓటింగ్ హక్కుల విషయంలో మార్పులు తెచ్చాడు. సభ్యులు ఇంగ్లాండ్ నుండే కాకుండా, స్కాట్‌లాండ్, ఐర్లాండ్ నుండి గూడ ఎన్నికైనారు. ఓటు హక్కు విషయంలో, 17వ శతాబ్దంలో ఎట్టి మార్పులు జరగలేదు. స్కాట్‌లాండ్‌తో విలీనం, 1707 నాటికి గాని కాలేదు; ఐర్లాండ్‌తో మాత్రం, 1801లో విలీనం జరిగింది.

మత విషయాల్లో "చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్", పూర్వ ఔన్నత్యంతో పునరుద్ధరించబడింది. ముందు లాగే, బిషప్‌లు, డీన్‌లు కొనసాగారు. కాని, చాలామంది ప్యూరిటన్లు అందులోనుండి తొలగించబడ్డ కారణంగా, అది సమగ్రమైందిగా లేదని చెప్పవచ్చు. దేశంలోని ఇతర పరిస్థితులవలె, మతం గూడ ప్యూరిటన్ ప్రభావాన్ని పూర్తిగా పోగొట్టుకోలేదు. పార్లమెంట్ 1661లో క్లారండన్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. ఇందు, దాదాపు నాలుగు విభిన్న చట్టాలుండేవి. కార్పొరేషన్ చట్టం (1661) ప్రకారం, కార్పొరేట్ నగరాల్లో గల అధికారులు, రాజుకన్న మించిన మతాధికారి లేడని, ఒక ప్రమాణం చేయాల్సి ఉండేది. యూనిఫార్మిటీ చట్టం (1662) ప్రకారం, అందరూ ఆంగ్లికన్ ప్రార్థనా గ్రంథం ప్రామాణికమైందిగా గుర్తించారు. కన్వెంటికల్ చట్టం (1664), ఆంగ్లికన్ మతేతర ప్రార్థనా సమావేశాలను నిషేధించింది. అదే విధంగా, ఐదు మైళ్ల చట్టం (1665) ప్రకారం, ఆంగ్లికన్ మతాన్ని అనుసరించని మతాధికార్లు, ఏనగరంగాని, బరోకుగాని ఐదు మైళ్లకు వెలుపలనే ఉండాలని నిర్ణయించడం జరిగింది. సివిల్, మిలిటరీ అధికార్లు, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన వారుగానే ఉండాలి. ప్రతి పార్లమెంట్ సభ్యుడు గూడ, ఆంగ్లికన్ మతేతరుడుగా ఉండ వీల్లేదని, శాసించడం జరిగింది. అందువల్ల, ఆంగ్లికన్ మతం ప్రభుత్వ మతంగా గుర్తింపు పొందింది. దీనికి అధ్యక్షుడు, కేవలం రాజు గాకుండా, "పార్లమెంట్ ద్వారా రాజు" అన్నది విశదమైంది.

BRAOU

## 4.2 రెండో ఛార్లెస్

రెండో ఛార్లెస్‌కు అనేక సద్గుణాలున్నాయి. మంచి వాక్చాతుర్యంతో తెలివితేటలు కల్గి, ఇతరులకు అందుబాటులో ఉండేవాడుగా పేరు గాంచాడు. చిన్న తనంలో ఎన్నో ఇబ్బందుల పాలయ్యాడు. యువకునిగా నిలువనీడలేక, దేశాలబడి తిరిగినవాడు, రెండో ఛార్లెస్. అతడు 1640 నుండి 1660 వరకు, కాందిశీకుడుగా హాలెండ్‌లో నివసించాడు. 1660 లో తన 30వ ఏట, సింహాసన మధిష్ఠించాడు. అతని తల్లి ఫ్రెంచి రాకుమారి. అతడు చిన్నతనంలో అనేక దేశాలు తిరిగిన కారణంగా, రాజైన తర్వాత అటువంటి ప్రయాణాలు మళ్లీ చేయాల్సిన అవసరం లేకుండా, జాగ్రత్తతో మెలగసాగాడు. స్టూవర్ట్ వంశస్థుల్లో కెల్లా, రెండో ఛార్లెస్ మిక్కిలి సమర్థుడైన రాజుగా గుర్తింపు పొందాడు. అతడు కాథలిక్ మతాన్ని అభిమానించాడు. కాని, ప్రజలకు తాను కాథలిక్ అని, ఎప్పుడూ బాహ్యంగా ప్రకటించలేదు. తన మంత్రులను, పార్లమెంట్‌ను, కడపటికి తన ప్రజలను కూడా, తప్పుదోవ పట్టించడానికి వెనుకాడేవాడు కాదు.

రెండో ఛార్లెస్ ముఖ్యమంత్రి, ఎడ్వర్డ్ హైడ్ అనే క్లారండన్ ప్రభువు. అతడు మంచి సమర్థుడైన పాలకుడు, నిరాడంబరుడు. అతని కుమార్తెను రాజు తమ్ముడైన జేమ్స్ వివాహమాడాడు. రాజుకు సలహాల నివ్వడానికి, ప్రీవీ కౌన్సిల్ ఉండేది. ప్రభుత్వ యంత్రాంగం దాదాపు ట్యూడర్ యంత్రాంగాన్ని

పోలి ఉండేది. విదేశీ సైన్యాల ప్రమేయం లేకుండా, రెండో ఛార్లెస్ పునరుద్ధరణను సాధించడం, క్లారండన్ వ్యక్తిగత విజయమనే చెప్పవచ్చు. దీనికి ఎరగా, అతడు బ్రెడా ప్రకటనలో, ప్రతి వివాదాస్పద విషయాన్ని పార్లమెంట్ మాత్రమే పరిశీలిస్తుందని, రాజు చేత అంగీకరింపచేశాడు.

## 4.3 కన్వెన్షన్ పార్లమెంట్ (1660-61)

రిచర్డ్ క్రాంవెల్ అధికారాన్నుండి తప్పుకొన్న తర్వాత, జనరల్ మాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్వెన్షన్ పార్లమెంట్ మూలంగానే, రెండో ఛార్లెస్ రాజుగా ఆహ్వానితుడైనాడు. ఇది, రాజు అనుమతి లేకుండా సమావేశపర్చబడమైన కారణంగా, కన్వెన్షన్ పార్లమెంట్ అని పిలవడం జరిగింది. ఇది, అంతర్యుద్ధంలో పాల్గొన్న వారందరి తప్పిదాలను క్షమించింది. కాని, రాజు ఒకటో ఛార్లెస్ శిరచ్ఛేదనకు కారకులైన దాదాపు పది మందికి మాత్రం, మరణదండన విధించింది. ఆలివర్ క్రాంవెల్, అతని అల్లుడైన ఐరిటన్‌ల సమాధులను త్రవ్వి, వారి కళేబరాలను వెలికి తీసి, వారి తలలను తెగ గొట్టారు. పార్లమెంట్ సైనికుల బకాయిలను చెల్లించింది. రాజు మద్దతుదార్ల భూములను తిరిగి అప్పజెప్పారు. ఫ్యూడల్ శిస్తులను రద్దు చేశారు. రాజుకు ప్రతిగా, ఎక్సైజ్ సుంక వసూలుకు అనుమతి నివ్వడం జరిగింది. పూర్వపు నౌకాచట్టాన్ని పునఃప్రవేశపెట్టారు. ఇది బ్రిటీష్ వ్యాపారాభివృద్ధికి దోహదాన్ని కల్గించింది. కన్వెన్షన్ పార్లమెంట్‌లో రాజరిక పునరుద్ధరణకు కృషిచేసిన ప్రెస్బిటేరియన్లు అనేకులుండిన కారణంగా, రెండో ఛార్లెస్ నుండి కొన్ని సౌకర్యాలు కల్గుతాయని ఆశించారు. కాని, అంతలో కొత్త కెవాలియర్ పార్లమెంట్ సమావేశం కావడంతో, అందులో ప్రెస్బిటేరియన్ల సంఖ్య చాలా తక్కువైనందువల్ల, రాజు వారి అవసరాలను పట్టించుకోకుండా, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ అధికారానికై కృషిచేశాడు.

## 4.4 కెవాలియర్ పార్లమెంట్, 1661-1678

కన్వెన్షన్ పార్లమెంట్ రద్దైన తర్వాత, 1661లో కొత్త కెవాలియర్ పార్లమెంట్ సమావేశమైంది. ఇది రాజకీయంగా, రాజుకు మద్దతును తెల్పింది. మతపరంగా, ఆంగ్లికన్ మత ప్రమేయం గలది. ప్యూరిటన్లను ద్వేషించి, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు మద్దతును ప్రకటించింది. ప్రెస్బిటేరియన్‌లకు వ్యతిరేకంగా, ఎన్నో కొత్త చట్టాలు అమలు జరిగాయి. 1661-65 మధ్య ప్రవేశపెట్టిన అనేక మతపరమైన చట్టాలకు, క్లారండన్ కోడ్ అనిపేరు. క్లారండన్ రెండో ఛార్లెస్‌కు ఆంతరంగికుడు, ముఖ్యసలహాదారుడు, ముఖ్యమంత్రి. అతడు కెవాలియర్ పార్లమెంట్‌లో ప్రధాన సభ్యుడు గూడా. రెండో ఛార్లెస్ నిరాశ్రయుడుగా ఫ్రాన్స్, హాలాండ్ దేశాల్లో తిరిగిన సమయంలో, అతనితో నిల్చాడు. 1667లో జరిగిన డచ్ యుద్ధంలో ఇంగ్లాండ్ అపజయం పొందడానికి, అంతకుముందు సంభవించిన ప్లేగ్, లండన్ అగ్ని ప్రమాదం, మొదలైన వాటికి గూడ, క్లారండన్ కారకుడనే భావం అందరిలోనూ ప్రబలింది. అందుచే, రాజు క్లారండన్‌ను దేశం నుండి తప్పించుకొని పొమ్మని, సలహానిచ్చాడు. ఒకటో ఛార్లెస్ కాలంలో స్ట్రాఫర్డ్‌ను టవర్‌లో బంధించి, మరణ దండన విధించిన పార్లమెంట్ చర్యలు, అందరికీ గుర్తున్న కారణంగా, క్లారండన్ వెంటనే ఫ్రాన్స్‌కు వెళ్లిపోయాడు. 1674 నుండి మరణించే వరకు, అచ్చటనే నివసించాడు.

కెవాలియర్ పార్లమెంట్ అనుసరించిన అన్ని మతపరమైన ప్రణాళికలను, రెండో ఛార్లెస్ హర్షించలేదు. అతడు మత సహనాన్ని కోరాడు. కాథలిక్ మత పక్షపాతి కనుక, అటువంటి మతసహనమే మేలని భావించాడు. కాని, దేశంలో అధిక సంఖ్యాకులు ప్యూరిటన్‌లను, కాథలిక్‌లను ద్వేషిం

చారు. బ్రెడా ప్రకటనలో, మత సామరస్యం, స్వేచ్ఛ, మొదలైన విషయాల్లో చేసిన వాగ్దానాలను నిలుపుకోడానికి, రెండో ఛార్లెస్ ఎట్టి ప్రయత్నమూ చేయలేదు.

## 4.5. కాబాల్ (CABAL) మంత్రివర్గం, 1667-1673

క్లారండన్‌ను తొలగించిన తర్వాత, రెండో ఛార్లెస్ పరిపాలనా విషయాల్లో, ఐదుగురు నాయకులతో కూడిన ఒక కమిటీ సహాయపడింది. వారు క్లిఫర్డ్ (Clifford), ఆర్లింగ్‌టన్ (Arlington), బకింగ్‌హామ్ (Buckingham), ఆష్‌లే (Ashley), లాడర్‌డేల్ (Lauderdale). ఈ ఐదుగురు పేర్ల మొదటి అక్షరాలతో, ఈ కమిటీకి కాబాల్ (CABAL) అనే పేరు వచ్చింది. మొదటి ఇద్దరు కాథలిక్కులు. మూడో , నాల్గవ మంత్రులు ప్రొటస్టెంట్లను ప్రోత్సహించారు. కడపటి వాడు, ప్రెస్బిటీరియన్ మతస్థుడు. వారందరు ఆంతరంగికంగా, మత సామరస్యాన్ని, విదేశీ విధానంలో శాంతిని కోరారు. మొదట రెండో ఛార్లెస్ మిక్కిలి జాగ్రత్తగా నుండినా, క్రమంగా తన అధికారాన్ని నిరూపించ ప్రయత్నించాడు. క్రమేణ, తన సైన్యాలను విస్తృతపర్చాడు. ఫ్రాన్స్ రాజైన పద్నాల్గవ లూయీ పెరుగుతున్న అధికారాన్ని అణచడానికై, కాబాల్ మంత్రులు ఇంగ్లాండ్, స్వీడన్, హాలాండ్‌లతో కలసి, ఒక త్రైపాక్షిక సంధిని కుదుర్చుకోడానికి ప్రయత్నించారు. కాని, ఫ్రాన్స్‌తో సత్సంబంధాలు ఉండాలని కాంక్షించిన ఛార్లెస్‌కు, ఇటువంటి సంధి నచ్చలేదు. దీనికితోడు, ఇంగ్లాండ్ నౌకలను దగ్ధం చేసిన డచ్‌వారితో స్నేహం గూడ, రాజుకు ఇష్టంలేదు. తన మంత్రుల్లో కాథలిక్‌లైన క్లిఫర్డ్, ఆర్లింగ్‌టన్‌ల సహాయంతో, రహస్యంగా రెండో ఛార్లెస్ ఫ్రాన్స్‌తో రహస్య సంధి కుదుర్చుకొన్నాడు. దాని ప్రకారం, లూయీ డచ్ వారితో చేసే యుద్ధంలో, సహాయపడడానికి అంగీకరించాడు. తాను కాథలిక్ మతస్థుడుగా ప్రకటించుకోడానికి, ఇంగ్లాండ్‌లో కాథలిక్ మత స్థాపనకు అంగీకరించాడు. లూయీ ప్రతిగా, పెద్ద మొత్తాల రుణ సహాయం చేయడానికి అంగీకరించాడు.

రెండో ఛార్లెస్ స్వతహాగా కాథలిక్ మతస్థుడైనందువల్ల, దేశంలో కాథలిక్‌లకు రక్షణ కల్పింప దల్చాడు. అందుచేత, 1672లో ఒక చట్టం మూలంగా, తన అనుయాయులకు అనుకూలంగాలేని మత చట్టాలను, నిలుపుదలచేశాడు. కాని, పార్లమెంట్ దీనికి అంగీకరించలేదు. 1673లో పార్లమెంట్ టెస్ట్ చట్టాన్ని (Test Act) పెట్టింది. దీని ప్రకారం ప్రభుత్వాధికార్లు తప్పని సరిగా చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు మాత్రమే చెందాలని నిర్దేశించడం జరిగింది. దీనితో, కాబాల్ మంత్రివర్గం పతనమైంది. కాబాల్ పడిపోడానికి, డచ్ యుద్ధం గూడ ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇంతలో, రెండో ఛార్లెస్ సర్ థామస్ ఆస్బర్న్ అనే కొత్త సలహాదారుని వైపు, దృష్టి మళ్లించాడు. ఇతడే లార్డ్‌డన్బీ (Danby) గా పేరుపొందిన కొత్త మంత్రి.

## 4.6 డన్బీ ముఖ్య మంత్రి, 1673 - 78

రెండో ఛార్లెస్ పరిపాలనా కాలంలోని ఉత్తరార్థంలో, ఇంగ్లాండ్ రాజకీయాలు, మతానికి, రాజుకు విధేయతగల నాయకులచేత, అధికారయుక్తంగా కొనసాగాయి. ఇట్టి ఆస్థాన పక్షానికి చెంది నవాడు, లార్డ్ డన్బీ. అతడు ప్రొటస్టెంట్ల ప్రాభవానికి పాటుబడి, డచ్ వారితో స్నేహంచేసి, ఫ్రెంచి వారి అధికారాన్ని అణచాలని తలపోశాడు. కామన్స్ సభను అతడు తన రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోడానికై, కావాల్సినంత ధనాన్ని, సభ్యులకు లంచాలుగా ఇచ్చి, తన పలుకుబడి కింద ఉంచుకున్నాడు. రాజకీయ జీవితంలో ఎంత అన్యాయాలకు తలపడ్డా, లార్డ్ డన్బీ తన వ్యక్తిగత జీవితంలో మచ్చలేనివాడుగా పేరు పొందాడు. డచ్ వారితో సన్నిహితుడవటానికి అతడు ఒక వివాహ

సంబంధాన్ని కుదిర్చాడు. దాని ప్రకారం, 1677లో రెండో ఛార్లెస్ తమ్ముడైన జేమ్స్ కుమార్తె మేరీని, హాలాండ్ రాకుమారుడైన విలియం ఆఫ్ ఆరంజ్ వివాహమాడాడు. ఈ వివాహం, తర్వాతి చరిత్రలో గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. 1688 లో జేమ్స్ దేశం వీడి, పారిపోగా, మేరీ విలియంలను ఇంగ్లాండ్ సింహాసన మధిష్టించడానికై ఆహ్వానించడం జరిగింది.

రెండో ఛార్లెస్‌కు మంత్రిగా లార్డ్ డన్బీ, ఫ్రెంచి చక్రవర్తి పదునాల్గో లూయీ నుండి, అతడు రహస్యంగా వాగ్దానం చేసిన పెద్ద మొత్తాలను వసూలు చేశాడు. కాని, డన్బీ గావించిన రహస్య లావాదేవీలు పార్లమెంట్‌కు తెలియగానే, అతనిపై అభియోగం తెచ్చారు. డన్బీను రక్షించడానికై, రెండో ఛార్లెస్ కెవాలియర్ పార్లమెంట్‌ను, రద్దు చేయాల్సొచ్చింది. కాని, తర్వాత సమావేశమైన కొత్త పార్లమెంట్ గూడ, ముఖ్యమంత్రిపై అభిశంసన తీర్మానాన్ని చేపట్టింది. ఇదే సందర్భంలో, రోమన్ కాథలిక్‌ల ఆధిక్యం పెరుగుతుందనే భయంతో, ఇద్దరు విశ్వవిద్యాలయ వైద్యులు, రాజుపై కొంత మంది రహస్యంగా కుట్రపన్నుతున్నారనే అభియోగం చేశారు. టైటస్ ఓట్స్, ఇస్రాయిల్ టాంగ్ అనే ఇద్దరు డాక్టర్లు, దేశంలోని కాథలిక్ నాయకులు కొంతమంది రాజును చంపి, అతని సోదరుడైన డ్యూక్ ఆఫ్ యార్క్ అయిన జేమ్స్‌ను రాజును చేయతల్చారని, రహస్యంగా పెద్ద కుట్ర పన్నారని, మంత్రి డన్బీకి తెలియజేశారు. వారు సేకరించిన సమాచారాన్ని, ఒక లండన్ మేజిస్ట్రేట్ైన సర్ ఎడ్మండ్ గాడ్‌ఫ్రే ఎదుట గూడ, ప్రకటించారట. కాని, వెంటనే గాడ్‌ఫ్రేను ఎవరో హత్య చేశారు. కుట్రను గురించిన నిజానిజాలు తేలడం కష్టమైంది.

## 4.7 హేబియస్ కార్పస్ చట్టం (Habeas Corpus Act), 1679

1679 లో జరిగిన ఎన్నికలు చాలవరకు పార్టీ ప్రాతిపదికపై జరిగాయి. రాజుకు వ్యతిరేకంగా ఏర్పడిన పార్లమెంట్ కావడం చేత, పార్లమెంట్ అనేక చర్యలను గైకొనగలిగింది. రాజు, తమ్ముని విదేశాలకు ప్రవాసానికై పంపాల్సొచ్చింది. తన సైన్యంలో అధిక భాగాన్ని తొలగించాడు. కొత్త పార్లమెంట్‌లో అమిత పలుకుబడి సంపాదించిన లార్డ్‌షాఫ్ట్స్‌బరీ (Shaftsbury), తన అనుచరుల సహాయంతో ఒక ప్రతిపాదనను ప్రవేశపెట్టి, రెండో ఛార్లెస్‌కు కుమారులు లేనందున, అతని తమ్ముడైన జేమ్స్ తర్వాతి వారసుడుగాకుండా, తక్కిన ఎవరైనా ప్రొటస్టంట్ నాయకుడు ఇంగ్లాండ్‌కు రాజు కావాలని ప్రకటించాడు. ఇది పార్లమెంట్‌లో చట్టంగాక ముందే, రాజు తన రెండో పార్లమెంట్‌ను రద్దు చేశాడు. కాని, రద్దుగావడానికి ముందుగానే, ఈ పార్లమెంట్‌లో హేబియస్ కార్పస్ చట్టం అమల్లోకి రావడం విశేషం.

హేబియస్ కార్పస్ అంటే, భౌతికంగా హాజర్ పర్చడమని అర్థం. దీనివల్ల, ఖైదు అయిన ఎవరైనా, న్యాయస్థానంలో హాజర్ పర్చమని కోరితే, అతనిని న్యాయస్థానం ముందుకు తేవాల్సిన బాధ్యత, ప్రభుత్వానికి అప్పజెప్పడం జరిగింది. కాని, రాజకీయ ఖైదీలను ఏదో విధంగా న్యాయస్థానాలకు తేకుండా చేయడానికి, తగిన పన్నాగాలు పన్నారు. ఉదాహరణకు, జేమ్స్ హారింగ్‌టన్ అనే గొప్ప వేదాంతి, అతని సోదరి, హేబియస్ కార్పస్ రిట్ వేయగా, అతడిని లండన్ టవర్ నుండి తరలించి, హేబియస్ కార్పస్ చట్టాన్ని అమలుపర్చలేని దూర దీవిలో బంధించారు. కొత్త చట్టం మూలంగా, ఖైదుచేసిన వారిని విచారణ చేయించాల్సిన బాధ్యతను, గుర్తుచేసినట్లైంది. ఏదైనా నేరం మీద, ఖైదు చేసిన వారి తరపున హేబియస్ కార్పస్ రిట్ నమోదైన, అతనిని నిరవధికంగా జైల్లో పెట్టడానికి వీల్లేదు. అతనికి జామీను ఇచ్చి, విడుదల చేయాలి, లేదా తొందరగా నేర విచారణ చేయాలి. ఈ హేబియస్ కార్పస్ చట్టం, ఇప్పటికీ ఆచరణలో ఉండడం గమనార్హం.

## 4.8 మినహాయింపు ప్రతిపాదన (Exclusion Bill)

పార్లమెంట్‌లో గ్రామీణ పక్ష నాయకుడైన లార్డ్ షాఫ్ట్స్‌బరీ, మినహాయింపు బిల్లును ప్రవేశపెట్టాడు. దీని మూలంగా, రెండో ఛార్లెస్ మరణానంతరం, అతని తమ్ముడైన జేమ్స్‌కు సింహాసన మధిష్ఠించడానికి వీలుండదు. కాని, తనకు సంతానం లేని కారణంగా, తన తమ్మునికి సింహాసనం సంక్రమించాలని భావించిన రెండో ఛార్లెస్, ఆ పార్లమెంట్‌నే రద్దు చేశాడు. కాని, తర్వాత వచ్చిన పార్లమెంట్‌లోని దిగువ సభలో, మినహాయింపు ముసాయిదా ఆమోదాన్ని పొందింది. కాని, ఎగువ సభలో అది వీగి పోయింది. 1681లో ఛార్లెస్ పార్లమెంట్‌ను, లండన్ నుండి 60 మైళ్ల దూరంలో గల ఆక్స్‌ఫర్డ్‌కు మార్చాడు. రాజు అనుయాయులు అధిక సంఖ్యలోగల ప్రాంతమైనందున, దేశంలో మరొక అంతర్యుద్ధం జరుగుతుందన్న భయంతో, షాఫ్ట్స్‌బరీని ద్వేషించారు. ఆక్స్‌ఫర్డ్‌లోని విద్యార్థుల గుంపొకటి, అతడు తన బసైన బల్లియోల్ కళాశాలకు వెళ్తుండగా, నినాదాలు చేశారు. అదను గమనించి, రాజు పార్లమెంట్‌ను రద్దు చేశాడు. లండన్‌లో అయితే, అంత సులువుగా రద్దై ఉండేది గాదు. షాఫ్ట్స్‌బరీ వెంటనే తప్పించుకొని, హాలండ్‌కు పారిపోయాడు. అక్కడే మరుసటి సంవత్సరం మరణించాడు.

## 4.9 రాజకీయ పక్షాల ఆవిర్భావం

మినహాయింపు ప్రతిపాదనల అలజడి సమయంలో, రాజకీయ పార్టీల ఆవిర్భావం గోచరిస్తుంది. రాజు పార్లమెంట్‌ను రద్దుపర్చగా, ప్రజలు అతనికి కొత్త పార్లమెంట్‌ను సమావేశపర్చమని, మహజర్లను పంపేవారు. కాని, దానికి వ్యతిరేకంగా రాజు పక్షంవారు, రాజుపై ఒత్తిడి తేరాదని, అట్టి మహజర్లకు, ప్రతిమహజర్లను సమర్పించేవారు. మొదటి రకం వారు పిటీషనర్లని, రెండో వర్గం వారిని అబ్‌హోరర్స్ (Abhorers) అని పిలిచేవారు. ఈ పేర్లు క్రమంగా విగ్ (Whig) అని, టోరీ (Tory) అని, మార్పుచెందాయి. ఐర్లాండ్‌లో గజదొంగలకు 'టోరీ' (Tory)లని పేరు. అదే విధంగా 'విగ్'లని స్కాట్‌లాండ్‌లో దోపిడీదార్లకు పేరు. కాని, ఈ పేర్లు పార్లమెంట్‌లో ఇరు పక్షాలకు, గౌరవప్రదమైనవిగా చెలామణిలోకి వచ్చాయి. 1681 నుండి 1685 లో మరణించేవరకు, రెండో ఛార్లెస్ పార్లమెంట్‌ను సమావేశపర్చలేదు. దీని కారణం, అతనికి ఫ్రెంచి ప్రభువైన పదునాల్గో లూయీ నుండి, అమిత ధనం లభించింది. ఈ సమయంలో ఛార్లెస్ కొత్త న్యాయాధ్యక్షులను నియమించాడు. తన మద్దతుదార్లను నగర పాలకులుగా (Mayors), మతాధికార్లుగా నియమించాడు. పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించాడు. తన విగ్ ప్రత్యర్థుల ప్రాభవాన్ని అణచడానికై, అనేక చర్యలను గైకొనగల్గాడు.

## 4.10 విదేశీ సంబంధాలు

ఆక్స్‌ఫర్డ్ పార్లమెంట్‌ను రద్దుపర్చడానికి కొద్ది రోజులు ముందు, ఫ్రెంచి చక్రవర్తైన పదునాల్గో లూయీతో రెండో ఛార్లెస్ సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం, పెద్ద మొత్తాల్లో ధన సహాయం చేయడానికి, లూయీ ఒప్పుకున్నాడు. రహస్యంగా చేసుకున్న ఈ ఒప్పందం వల్ల, దేశంలో గల విగ్ ప్రత్యర్థులను సులభంగా ఎదుర్కోడానికి వీలుంటుందని ఛార్లెస్ భావించాడు. ఛార్లెస్ తన విదేశీ విధానంలో, స్పెయిన్‌తో విరోధిగా వున్నా, ఫ్రాన్స్ దేశంతో మాత్రం సఖ్యంగా కొనసాగాడు.

BRAOU

హాలాండ్ అధికారాన్ని అణచడానికి ఫ్రాన్స్‌తో మైత్రిగా ఉండడం గూడ అవసరమని, ఛార్లెస్ భావించాడు. దీనికై అతడు రెండు వివాహ సంబంధాలను గూడ కుదిర్చాడు. అందులో ఒకటి, తన సోదరి హెన్రియట్టాను, పద్నాల్గో లూయీ సోదరుడైన డ్యూక్ ఆఫ్ ఆర్లియన్స్ కిచ్చి వివాహం చేయడం; మరొకటి, తానే పోర్చుగల్ రాకుమార్తైన కాథరిన్‌ను వివాహమాడడం. ఆ సమయంలో పోర్చుగల్, ఫ్రాన్స్‌కు సన్నిహిత దేశం. వివాహ సమయంలో కాథరిన్ కట్నంగా, దాదాపు 80 వేల పౌన్ల ధనంతో పాటు, భారతదేశంలో పోర్చుగీస్ వారి అధీనంలోని బొంబాయి దీవిని గూడ, ఛార్లెస్‌కు ఇవ్వడం జరిగింది. ఛార్లెస్ తర్వాత, బొంబాయిని ఏటా 10 పౌన్ల ప్రతిఫలానికై తూర్పు ఇండియా కంపెనీకి ఇచ్చివేశాడు. భారతదేశంలో బ్రిటీష్ వర్తకాభివృద్ధికి, బొంబాయి ఎంతగానో దోహదం చేసింది. అమెరికాలో గూడ ఛార్లెస్ కాలంలో అనేక వలసలు స్థాపితమైన కారణంగా, వలస పాలన బహుముఖంగా అభివృద్ధి చెందింది.

ఫ్రెంచి చక్రవర్తి పదునాల్గవ లూయీ డచ్ నెదర్లాండ్‌ను, ప్రత్యేక ప్రతిపత్తిగల ఏకైక ప్రదేశంగా ఉంచాలని, ప్రయత్నిస్తూ వచ్చాడు. అక్కడి వర్తకుల అధికారాన్ని అణచడానికి, స్పెయిన్ రాజు ఛార్లెస్ (Charles the Sufferer) మరణిస్తే, అతని అధీనంలోని డచ్ ప్రాంతాలను ఆక్రమించుకోడానికి ప్రయత్నించాడు. అందుచే, ఇంగ్లాండ్ రాజైన రెండో ఛార్లెస్ గూడ, హాలాండ్‌కు విరోధిగా ఉండాలని, ఫ్రెంచి చక్రవర్తి తలచాడు. ఫ్రెంచి ధన సహాయం తనకున్న కారణంగా, ఛార్లెస్‌కు హాలాండ్‌తో వైరం తప్పనిసరైంది. ఇద్దరు రాజులూ, హాలాండ్‌ను ఎదిరించడానికి నిర్ణయించుకున్నారు.

ఇంగ్లాండ్‌కు, హాలాండ్‌కు వలస స్థావరాల విషయంలో, నౌకాయాన విషయాల్లో పోటీ పెరిగింది. అప్పటికే ఉన్న నౌకా చట్టాలను ఇంగ్లాండ్ విస్తృతపర్చింది. ఇంగ్లాండ్, డచ్ దిగుమతులపై, సుంకాలను అధికం చేసింది. ఇంగ్లాండ్, డచ్ నెదర్లాండ్ నౌకాదళాలు, చాలా చోట్ల పోరాటానికి పూనుకున్నాయి. ప్రధానంగా, ఉత్తర అమెరికాలో అటువంటి పోరాటాలు విశేషంగా జరిగాయి. అందువల్ల, 1665లో ఇంగ్లాండ్ హాలాండ్‌పై యుద్ధాన్ని ప్రకటించింది. యుద్ధ సమయంలో ఫ్రాన్స్ నామమాత్రంగా హాలాండ్ పక్షం వహించింది. కాని, యుద్ధంలో పాల్గొనలేదు. మొదటి నుండి, ఇంగ్లాండ్ నౌకాదళం, డచ్ నౌకాదళం కన్న, పైచేయిగానే ఉంది. రాజు సోదరుడైన డ్యూక్ ఆఫ్ యార్క్, మాంక్, రూపర్ట్ మున్నగువారు, తమ అసాధారణ నావికా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

బ్రిటీష్ నౌకాదళం డచ్ దళాన్ని అనేక సందర్భాల్లో ఓడించింది. డచ్ నౌకాదళ నాయకుడైన డి రూటర్ (De Ruyter) ను ఎదిరించి, న్యూజెర్సి, న్యూ ఆంస్టర్‌డామ్‌లను ఆక్రమించుకున్నారు. ఇంగ్లాండ్ తీరంలోని ఉత్తర ఫోక్‌లాండ్‌వద్ద, హోరాహోరీగా, నాల్గు రోజులు జరిగిన ఘోర యుద్ధంలో, బ్రిటీష్ దళ శక్తిసామర్థ్యాలు విదితమైనాయి. 1665లో ప్లేగ్ వల్ల, ఆ మరుసటి సంవత్సరం సంభవించిన అగ్ని విపత్తువల్ల, తగిన ఆహారపదార్థాలు, తగినంత ధనం, నౌకా దళానికి చేరలేదు. దీన్ని ఆసరాగా తీసుకొని, డచ్ నౌకా దళం 1667లో డి రూటర్ నాయకత్వం కింద ఇంగ్లీష్ నౌకలను ధ్వంసంచేసి, థేమ్స్ నది ముఖద్వారం వరకు చేరుకున్నాయి. లండన్‌నగరాన్ని గూడ, డచ్‌వారు భయపెట్టగల్గారు. కాని, ఇంగ్లాండ్ బ్రెడా సంధికి అంగీకరించినందువల్ల, డచ్ యుద్ధం ముగిసింది. అప్పటి వరకు ఆక్రమించుకున్న ప్రాంతాలు, ఆయాదేశాలకు చెందుతాయని నిర్ణయించడం జరిగింది. అందువల్ల, న్యూ ఆమ్‌స్టర్‌డామ్ ఇంగ్లాండ్ అధీనంలోకి వచ్చింది.

ఫ్రెంచి చక్రవర్తి లూయీ, స్పెయిన్ అధీనంలోని నెదర్లాండ్ (తర్వాతి బెల్జియం)ను ఆక్రమించుకోవడానికి సిద్ధపడ్డాడు. దీనివల్ల, ప్రక్కనగల తమకు ప్రతిబంధకమౌతుందని, డచ్‌వారు లూయీ పథకాలను నిరోధించ దలచారు. అప్పటికే సంధి చేసుకున్న కారణంగా, ఇంగ్లాండ్ తనకు సహాయపడుతుందని

హాలాండ్ భావించింది. కాని, రెండో ఛార్లెస్ లూయీతో రహస్య సంధి కుదుర్చుకొన్నందువల్ల, ఫ్రాన్స్‌కు సహాయం చేసి, హాలాండ్‌ను ఎదిరించడానికే నిర్ణయించాడు.

మూడో ఆంగ్లో-డచ్ యుద్ధం, 1672 మార్చిలో ప్రారంభమైంది. రెండో ఛార్లెస్ పెద్ద మొత్తాల్లో ధనాన్ని పోగుచేశాడు. ప్రొటస్టెంట్‌లకు అనేక సౌకర్యాలను ప్రకటించాడు. కాని, డచ్‌వారు కూడా యుద్ధానికి బాగా సిద్ధపడ్డారు. విలియం ఆఫ్ ఆరంజ్ నాయకత్వంలో వారు, బ్రిటీష్ వారి, ఫ్రెంచి వారి ఉమ్మడి సైన్యాలను ఎదుర్కొనడానికి తయారయ్యారు. పదునాల్గో లూయీ తన సైన్య నాయకులైన టురేన్, కాండెల ఆధ్వర్యంలో, ఫ్రెంచిసేనలను హాలాండ్ పైకి పంపాడు. డచ్‌వారు మొదట కొంత తొట్రుపాటు చెందారు. కాని, వెంటనే విలియం నాయకత్వం కింద వారు, తమ నీటి కట్టలను త్రెంచి, పల్లపు ప్రాంతాలను జలమయం చేసి, ఫ్రెంచి సైన్యాలను ముప్పతిప్పలు పెట్టారు. దీనితో, లూయీ తన సైన్యాలను హాలాండ్ నుండి విరమింప జేశాడు. ఇది ఇంగ్లాండ్‌కు కూడా ప్రతికూలంగా పరిణమించింది. కాని, 1678 వరకు యుద్ధం కొనసాగిన తర్వాత, నిమ్‌వెజిన్ సంధిని కుదుర్చుకొన్నారు. ఇందు, ఫ్రెంచి చక్రవర్తికి ఎటువంటి లాభం లేక పోయింది. ఈ యుద్ధంలో రెండో ఛార్లెస్ దాదాపు ఆరు మిలియన్ పౌన్ల ఖర్చు పెట్టాడు. హాలాండ్‌తో అంతకు ముందు జరిగిన యుద్ధం తర్వాత, క్లారండన్ పదవీచ్యుతుడయ్యాడు. 1678 లో డచ్ యుద్ధం ముగియగానే, కాబాల్ మంత్రివర్గం పడిపోయింది.

## 4.11 సుస్థిర రాజరిక అధికారం

రెండో ఛార్లెస్ కాలంలో, ముఖ్యంగా 1680 తర్వాత, ఇంగ్లాండ్‌లో రాజరికం మిక్కిలి అధికారయుక్తంగా పెరిగింది. ఐరోపాలోని జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాల్లో లాగే, ఇంగ్లాండ్‌లో సుస్థిర రాజరిక వ్యవస్థ స్థాపితమైందని చెప్పవచ్చు. 1685 లో కాథలిక్ మతస్థుడైన రాజు అధికారానికి రావడాన్ని, ప్రొటస్టెంట్ ఇంగ్లాండ్ ప్రజలు అధిక్షేపించలేదు. 1681 తర్వాత రెండో ఛార్లెస్ పార్లమెంట్‌ను సమావేశపర్చకుండా పరిపాలన కొనసాగించాడు. 1683 లో ఛార్లెస్‌ను హత్య చేయడానికి, రేహౌస్ కుట్ర (Rye House Plot) జరిగింది. రాజు న్యూమార్కెట్ పందేలు చూచి తిరిగి వచ్చే సమయంలో, రేహౌస్ వద్ద అతనిని హత్య చేయడానికి, రంబోల్డ్ అనే అతని నాయకత్వం కింద, పథకాలన్నీ సిద్ధమయ్యాయి. కాని, రాజు తన ప్రయాణ మార్గాన్ని మార్చుకొన్నందువల్ల, కుట్ర విఫలమైంది. రహస్యం అందరికీ తెలిసి, కుట్రదారులను నిర్బంధించారు. రాజు మద్దతుదార్లు ఇదే అదనుగా భావించి, దేశంలోని అనేక విగ్ నాయకులపై కుట్ర మోప నారంభించారు. ప్రభుత్వ చర్యలకు భయపడి, డ్యూక్ ఆఫ్ మన్‌మౌత్ వంటి కొంతమంది, దేశం వీడి, పారిపోయారు. లార్డ్‌రసెల్, సిడ్నీ మొదలైన వారిని ఉరితీయడం జరిగింది. ఛార్లెస్ తర్వాత జేమ్స్ సింహాసనానికి రావడాన్ని వ్యతిరేకించిన వారందరిని తొలగించడం జరిగింది. రేహౌస్ కుట్ర విఫలం చెందిన తర్వాత, రాజు రెండో ఛార్లెస్‌కు గల ప్రతిష్టం, పూర్తిగా నశించింది. అతడు టోరీల సహాయంతో, తన అధికారాన్ని సుస్థిరం చేసుకోగల్గాడు. తన తమ్ముడైన జేమ్స్‌ను వారసుడుగా గుర్తించడానికి, ముందుండిన వ్యతిరేకత నశించింది. ఇవన్నీ, రెండో ఛార్లెస్ సుస్థిరమైన అధికారాన్ని చాటాయి.

తన చివరి దశలో ఛార్లెస్ చాల విలాసాలతో గడప సాగాడు. యాభై ఆరేండ్లనాటికే అతడు బయటికి దృఢంగా కన్పించినా, విచ్చలవిడిగా గడపిన భోగవిలాసాల వల్ల అతని ఆరోగ్యం దెబ్బతిన్నది. అతని జీవితం కూడ అనేక బాధలకు గురైంది. తన చిన్న తనంలో తండ్రికి కల్గిన దుర్ఘటనలను కళ్లారా చూచిన ఛార్లెస్, దేశం వీడి, తన యౌవనమంతా కాందిశీకుడుగా దేశాల వెంట తిరిగాడు.

పునరుద్ధరణ తర్వాత ఇరువైదేండ్లు రాజుగా, అనేక రాజకీయ ఒడుదుడుకుల నెదుర్కొని, లెక్కలేనన్ని హత్యా ప్రయత్నాలు, కుట్రలు, విపత్తులను చవిచూచిన ఛార్లెస్, తన కడపటి దినాల్లో మిక్కిలి అనుభవంగల, హుందాతనం ఉట్టిపడే విధంగా మెలిగాడు. విన్‌స్టన్ చర్చిల్, (A History of the English People) అన్న గ్రంథంలో రాసినట్లు, "ఇంగ్లాండ్‌లో మంటలన్ని చిన్నవై పోయాయి. కాని, వాటి నిప్పుల నుండి ప్రసరించే వెలుగుతో, రెండో ఛార్లెస్ రాజు తన చేతులను వెచ్చపర్చుకున్నాడు."

లార్డ్‌హాలిఫాక్స్ (Lord Halifox) మళ్లీ కొత్త పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సిందని, రాజుకు సలహా ఇచ్చాడు. ఛార్లెస్ దానికి అంగీకరించేవాడు. కాని, 1685 ఫిబ్రవరి 5వ తేది, రాజు హఠాత్తుగా మరణించాడు. అతని తర్వాత, అతని తమ్ముడు, డ్యూక్ ఆఫ్ యార్క్ అయిన జేమ్స్, ఇంగ్లాండ్‌కు రాజుగా ప్రకటితమైనాడు. అతడు రెండో జేమ్స్‌గా సింహాసనమధిష్ఠించాడు.

## 4.12 సంగ్రహంగా

రెండో ఛార్లెస్ కాలంలో అవినీతి, విలాస జీవితాలు, ప్రజల్లో మితిమీరి కన్పించిన మాట వాస్తవం. కాని, ఈ కాలంలో మానవతావాదం, నాగరికతా పెంపు గూడ గోచరించడం, గమనార్హం. ఫ్రాన్స్ చక్రవర్తైన పద్నాలుగవ లూయీ పాలనా ప్రభావం, బ్రిటీష్ ప్రజలపై గూడ పరోక్షంగా కన్పిస్తుంది. దేశంలో వాఙ్మయం, శాస్త్రీయ అధ్యయనం, వాస్తుశాస్త్రం వంటివన్నీ అభివృద్ధి చెందాయి. భూ ఆకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఐసాక్ న్యూటన్ (Issac Newton) ఈ కాలానికి చెందినవాడు. బ్రిటీష్ సమకాలీన సంఘాన్ని ప్రభావితం చేసిన వారిలో, రెన్ (Wren), బోయల్ (Boyle), హేలి (Halley), శామ్యూల్ పెపీస్ (Samuel Pepys) మొదలైన వారున్నారు. లండన్ నగరంలో అనేక కాఫీ క్లబ్‌లు గూడ వెలిశాయి. రాజకీయ నాయకులు, కవులు, విమర్శకులు అటువంటి కాఫీ క్లబ్‌లను పోషించేవారు.

## 4.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. ఇంగ్లాండ్‌లో రాజరిక పునరుద్ధరణకు దారితీసిన పరిస్థితులను తెల్పండి.
2. రాజరిక పునరుద్ధరణ స్వభావ, రాజ్యాంగ ప్రాముఖ్యతలెట్టివి?
3. రెండో ఛార్లెస్, పార్లమెంట్ మధ్య కొనసాగిన సంబంధాలను విశ్లేషించండి.
4. మంత్రివర్గ ఏర్పాటు, రాజకీయ పక్షాల ఆవిర్భావానికి, రెండో ఛార్లెస్ పాలనా కాలం ఏ విధంగా, ఎంతవరకు దోహదమైంది?
5. రెండో ఛార్లెస్ వైదేశిక విధాన లక్ష్యాలు, ఫలితాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయుండి.**

1. కాబాల్ (CABAL)
2. హేబియస్ కార్పస్ చట్టం
3. సుస్థిర రాజరిక అధికారం

BRAOU

## 4.14 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| D.T. Witecombe | : Charles II and the Cavalier House of Commons, 1663-67 |
| Osmund Airy | : Charles II |
| Barry Coward | : The Stuart Age |
| G.M. Trevelyan | : History of England, Vol-IV |
| J.P. Kenyon | : Stuart England, 1982 |
| G.M. Trevelyan | : England under the Stuarts, rpt. 1965 |
| D. Ogg | : England in the reign of Charles II |
| T. Stone | : England under the Restoration |
| Sir Winston Churchill | : A History of the English people |
| J.R. Green | : A Short History of the English People, Vol.II |


BRAOU

# ఖండం-II : మహోజ్వల విప్లవం, 1688

## పరిచయం

ఇంగ్లాండ్‌లో 1688 లో సంభవించిన విప్లవానికి, మహోజ్వల విప్లవం (Glorious Revolution), లేక రక్తపాతరహిత విప్లవం (Bloodless Revolution) అని పేరు. ఇది ఐరోపాలో అప్పుడు కొనసాగుతూన్న రాజకీయ పరిస్థితులు మార్పు చెందేందుకు దోహదమైంది. బ్రిటీష్ ప్రజలు తమ హక్కులను, మతస్వేచ్ఛను, ప్రయోజనాలను పరిరక్షించుకోవాలనే గాఢ వాంఛతో, ప్రభుత్వ నిర్మాణ విధానాన్ని తమకు అనుకూలమైందిగా మలచుకోగలిగారు. తమ పార్లమెంట్ ద్వారా నిర్మించుకొన్న నూతన విధానంలో, సామర్థ్యంతో మిళితమైన స్వేచ్ఛ, జాతీయ సమైక్యతకు దోహదం చేసే స్థానిక హక్కులను పొందడంతో బాటు, ప్రజాభిప్రాయంతో పాలన కొనసాగించే రాజరికాన్ని రూపొందించుకోగల్గారు.

ఈ ఖండంలో రెండో జేమ్స్ పరిపాలన; విలియం, మేరీలు బ్రిటీష్ సింహాసనాన్ని ఉమ్మడిగా అధిష్టించడం; పార్లమెంట్‌తో వారి సంబంధాలు; పార్లమెంట్ ప్రతిపాదించిన హక్కుల చట్టం; దాని షరతులు; మహోజ్వల విప్లవ ఫలితాలను చర్చించడం జరిగింది. ప్రపంచ చరిత్రలో సంభవించిన ఆధునిక విప్లవాలకన్నిటికీ, మహోజ్వల విప్లవం మాతృకగా ఏవిధంగా పరిగణితమైందో, మానవ హక్కుల పరిరక్షణకై విప్లవం ఎట్లు విజయవంతంగా పోరాడిందో, వివరించడం జరిగింది.

BRAOU

BRAOU

# భాగం- 5: రెండో జేమ్స్ పాలనా విధానాలు

విషయక్రమం

5.0 లక్ష్యాలు

5.1 రెండో జేమ్స్

5.2 జేమ్స్ పథకాలు

5.3 మాన్‌మౌత్ (Monmouth) వారసత్వ పోటీ

5.4 పార్లమెంట్ వ్యవహారాలు

5.5 రెండో జేమ్స్ కాథలిక్ విధానాలు

5.6 మహోజ్వల, రక్తపాతరహిత విప్లవం, 1688

5.7 ఫ్రాన్స్ అనుసరించిన మత విధానాలు

5.8 విప్లవారంభం

5.9 ఏర్పడిన పక్షాలు

5.10 జేమ్స్ మత చట్టాలు

5.11 పుత్ర జననం

5.12 విలియంకు వర్తమానం

5.13 రాజు కడపటి ప్రయత్నాలు

5.14 అనుచరుల సలహాలు

5.15 విలియం రాక

5.16 సైనికుల తిరుగుబాట్లు

5.17 జేమ్స్ పలాయనం

5.18 సంగ్రహంగా

5.19 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.20 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 5.0 లక్ష్యాలు

1688-89 లో జరిగిన విప్లవం, "మహోజ్వల" (Glorious) విప్లవంగా పరిగణన కెక్కింది. రాజు రెండో జేమ్స్ కాథలిక్ పరిపాలనను స్థాపించాలనే సంకల్పం విఫలమైంది. ప్రసిద్ధ చరిత్రకారుడు మెకాలే అన్నట్లు, "దాదాపు ఒకటిన్నర శతాబ్ది తర్వాత అమలు జరిగిన ఉదార భావాలకు, సామాజిక న్యాయ చట్టాలకు, ఈ విప్లవంలో బీజాలు నాటుకున్నాయి." మహోజ్వల విప్లవ ఫలితాలు, కేవలం ఇంగ్లాండ్‌కు మాత్రం పరిమితం కాలేదు. అమెరికా సంయుక్తరాష్ట్రాల రాజ్యాంగాన్ని గమనించినట్లైతే, అది ఎంతవరకు ఈ విప్లవం మూలంగా ప్రభావితమైందో, అందులో జాన్‌లాక్ (John Locke) వంటి వారి రచనల ప్రభావం ఎంతవరకుందో, స్పష్టంగా తెలుస్తుంది. ఈ విప్లవం మూలాన, రెండో జేమ్స్ మొండిగా ప్రయత్నించిన కాథలిక్ మతాధికారం, దేశానికి తప్పిపోయింది. బ్రిటీష్ వారి సంప్రదాయక పార్లమెంటరీ ప్రభుత్వ పాలన, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు సంరక్షితమైనాయి. నిరంకుశ రాజరికాన్ని, రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతాన్ని, కాథలిక్ మతాధిక్యతను, శక్తివంతంగా నిరోధించి, పార్లమెంటరీ విలువలను పునరుద్ధరించడానికి, దోహదం చేసిందీ మహోజ్వల విప్లవం. ఆధునిక ఇంగ్లాండ్ చరిత్రలోనేగాక, ప్రపంచ చరిత్రలోనే 1688 మహోజ్వల విప్లవం గొప్ప చారిత్రాత్మక సంఘటనగా నిల్చింది.

## 5.1 రెండో జేమ్స్

ఆధునిక కాలంలో జరిగిన అన్ని విప్లవాల్లోకెల్లా, 1688 లో జరిగిన విప్లవం అనేక విధాల భిన్నమైంది. తక్కిన వాటివలె, ఇందులో సాంఘిక, ఆర్థిక సమస్యలు కన్పించవు. ఆర్థికంగా దేశం సుసంపన్నంగా కొనసాగిన సమయంలో, సామాజికపరంగా కూడ కలతలు లేకుండా, శాంతియుతంగా ఉన్న సమయంలో, ఈ మహజ్వల విప్లవం జరిగింది. అందుకే దీన్ని, రక్తపాతరహిత విప్లవ మనడం గూడ, సమంజసం. ఈ విప్లవం మత విద్వేషాలపైన జరిగినదనడానికి గూడ, 1642లో కనిపించినంత మత వైవిధ్యం కన్పించదు. ఒక రకంగా, 1688 లోని రాజకీయ పరిస్థితులు, మతంలోని పక్షాల మధ్య అగాధాన్ని తొలగించడానికై కృషిచేశాయని చెప్పవచ్చు. విప్లవం దాదాపు పూర్తిగా, రాజుకు, ఉన్నత వర్గాలకు గల సంబంధాలపై, రాజ్యానికి, మతానికి మధ్య ఉత్పన్నమైన సమస్యల ప్రాతిపదికతో సంభవించింది.

రెండో జేమ్స్ కాలంలో జరిగిన మహోజ్వల విప్లవం, అంతకు ముందు 1642-49 కాలంలో జరిగిన అంతర్యుద్ధానికి తుది మెరుగులు దిద్దిందిగా చెప్పవచ్చు. సార్వభౌమాధికారం కడపటికి ప్రజల సొత్తని, పార్లమెంట్ రాజరికానికన్నా మిన్న అని నిరూపించిందీ విప్లవం. రాజరికానికి, పార్లమెంట్‌కు మధ్య ఒకటో జేమ్స్ కాలంలో తలెత్తి, దాదాపు ఎనభై ఏళ్లు ఇంగ్లాండ్ రాజకీయాలను ప్రభావితంచేసి, మళ్లీ మొదటికి చేరుకొంది. అనేక భయంకరమైన ఒడుదుడుకుల తర్వాత, ఇంగ్లాండ్‌లోని రాజరికం, మళ్లీ ట్యూడర్ల కాలంలోని నిరంకుశ పద్ధతికి చేరుకొంది. మార్‌స్టన్ మూర్, నెస్బే యుద్ధాల పిదప, రాజును దారుణంగా చంపిన అనంతరం, క్రాంవెల్ సైనిక పాలనానంతరం, రాజకీయ పునరుద్ధరణ తర్వాత, పోపిష్ ప్లాట్, (Popish plot) వంటి అనేక కుట్రలు, హత్యాప్రయత్నాలు జరిగిన పిదప గూడ, రెండో ఛార్లెస్ దాదాపు మూడేళ్లు పార్లమెంట్‌ను సమావేశపర్చకుండా, పాలించగల్గాడు. అధిక సంఖ్యాకులుగా ప్రొటస్టాంట్లుగల దేశాన్ని, అతడు ఒక రోమన్ కాథలిక్ వారసునికి అప్పజెప్పూ మరణించాడు. మత వైషమ్యాలను కూడ లెక్కచేయకుండా, వారసత్వ హక్కును నిలుపుకోడానికి పడే తాపత్రయాన్ని, దేశ ప్రజలు ప్రత్యక్షంగా చూచారు.

రెండో ఛార్లెస్ పాలనా కాలంలోని కడపటి రెండేండ్లు, అతని సోదరుడు జేమ్స్ పరిపాలనా విషయాల్లో ప్రధాన పాత్ర వహించాడు. స్టూవర్ట్ రాజకుటుంబానికి ఛార్లెస్ సంపాదించిన విదేశీ విధానంలోని విజయాలు, పేరుప్రతిష్ఠలు, జేమ్స్ తనకు అనుకూలంగా మల్చుకోగల్గాడు. 1685 లో అతడు సింహాసనాన్ని అధిష్ఠించడం, తనకు గల ఉద్దేశాల విజయమని భావించాడు. పద్నాల్గో లూయీ లాగే మహోన్నత స్థాయికి చేరుకోడానికి, రాజరిక అధికారాలను సుస్థిరం చేయడానికి, తనకు కావలసింది విధేయతగల నౌకాదళం, బాగా తర్ఫీదైన సర్వసిద్ధ సైన్యం మాత్రమే. యుద్ధ కార్యక్రమాలను అతడు సదా అభిలషించేవాడు. పేరు గాంచిన ఫ్రెంచి సైనిక నాయకుడైన టురేన్ ఆధ్వర్యంలో, యుద్ధాలను చేశాడు. అనేక నౌకా ముట్టడుల్లో పాల్గొన్నాడు. రాజుకు విధేయత గల్గి, మద్దతునిచ్చే సైన్యాన్ని, నౌకాదళాన్ని రూపొందించడమే, అతని ప్రప్రథమ లక్ష్యం. ఇంగ్లాండ్ రాజుకు బలమైన, వాడియైన ఖడ్గం చెంత ఉంటే, అలజడి కల్గించగల పార్లమెంట్, రాజకీయంగా తయారైన ప్రభు వర్గం, విజయోత్సాహంగల మత సంస్థ, శక్తిని పుంజుకొన్న విగ్ పక్షం, మందగతిలో ప్యూరిటన్లు, అందరూ తమ తమ స్థానాల్లోకి తిరోగమించడం ఖాయం. ఫ్రాన్స్‌లో కొనసాగిన నిరంకుశ రాజరికం, ఇంగ్లాండ్‌లో అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. దేశంలోని అంతఃకలహాలను అణచివేసి, తమ రాజు ఆధ్వర్యంలో, ఫ్రాన్స్ దేశపు అధికారాన్ని అభివృద్ధి పథంలోకి తేవడం, ఇతర ఐరోపా దేశాలకు మార్గదర్శకమైంది. ఇంగ్లాండ్ కూడ అదే విధమైన అధికార స్థాపనకు ఎందుకు కృషి చేయరాదు?

తన దేశస్థుల్లో మత వైషమ్యాలను మాన్పించి, ప్రాచీన మతాన్ని పునరుద్ధరించి, అనేక తరాలుగా క్రైస్తవుల్లో ఉన్న విభేదాన్ని తొలగించడానికి గూడ, జేమ్స్ శక్తివంతమైన రాజరికాన్ని కోరాడు. అతడు మత సామరస్యాన్ని అభిలషించాడా, లేదా, అన్న విషయంపై, చరిత్రకారుల్లో భేదాభిప్రాయాలున్నాయి. లార్డ్ మెకాలేగాని, తర్వాతి విగ్ చరిత్రకారులైన ఆష్లీ (King James II and Revolution), R.L. Ballard (Historical Essays, 1600-1775), Miller ( Popery and Politics), Jones (Revolution of 1688) మొదలైన వారంతా, జేమ్స్‌ను ఒక క్రూర 'విలన్' గా, ప్రతినాయకునిగా అభివర్ణించారు. కాని, నిజానికి, ప్రొటస్టెంట్ మతాన్ని తొలగించి, కాథలిక్ మతాన్ని పునరుద్ధరించాలనేది, అతని ప్రధాన ధ్యేయంగా అనిపించదు. కానీ, అతడు కాథలిక్ మత అనుయాయి. తన మతాభిమానంతో, ఎట్టి త్యాగాన్ని చేయడానికి గాని, అతడు వెనుకాడడు. అందుకే తన సింహాసనాన్ని పోగొట్టుకున్నాడు. దాని మూలంగా మాత్రమే, తర్వాత ఆయన కుమారుడు యుద్ధాలు కొనసాగించాల్సి వచ్చింది. కాథలిక్ మత పునరుద్ధరణకు, సామరస్య సాధన మొదటి సోపానం మాత్రమే. కాథలిక్ మతస్థులను ఎట్టి పరిస్థితుల్లోను పీడించరాదని, అతని ప్రగాఢ వాంఛ. తర్వాత దీన్నే, కొన్ని స్వప్రయోజనాలకై, ఇతర మతస్థులకు గూడ విస్తరింపజేశాడు. అందుకే అతడు, మత సామరస్య సాధన కృషికి అంకితమైన వాడుగా తన ప్రజానీకానికంతా పితృతుల్యుడుగా కీర్తింపబడాలని వాంఛించాడు.

## 5.2 జేమ్స్ పథకాలు

జేమ్స్ మనస్సులో చాలా చాలా గొప్ప పథకాలు చోటుచేసుకున్న కారణంగా, దేశంలోని ప్రొటస్టంట్లు భయపడ్డారు. అతని రాజకీయ అధికారం నిలదొక్కుకున్నట్లైతే, లూయీ వలె తాను నమ్మిన మతాన్ని ప్రజలపై రుద్దడానికి వెనుకాడడని వారి అభిప్రాయం. 1685 లో జేమ్స్ రాజైన సంవత్సరం, ఫ్రాన్స్‌లో లూయీ నాన్ట్స్ (Nantes) చట్టాన్ని రద్దుచేసి, ప్రొటస్టంట్‌ల కంటూఉన్న అన్ని మత, రాజకీయ సౌకర్యాలను హరించాడు. ఫ్రెంచి ప్రొటస్టంట్లైన హ్యూజినాట్లను హింసించే సమయంలో, అటువంటి చర్యలను సమర్థిస్తూ, లూయీకి ప్రోత్సాహకరంగా జేమ్స్ రాసిన జాబులు, ఇప్పటికే నిల్వచేసినవి ఎన్నో ఉన్నాయి. అతని పరిపాలనా కాలంలో, మత సామరస్య పరిధిని అధిగమించిన

BRAOU

విషయం గూడ, గమనార్హం. కాని, తన మొదటి పాలనాధ్యాయం కూడ ముగియక ముందే, తన సింహాసనం నుండి అతడ్ని తొలగించారు. దాని తర్వాత, ప్రవాస జీవితంలో ఉన్న సమయంలో, అతడు మతాధికారైన రాన్స్ (Rance) కు రాసిన దాదాపు అరవై ఉత్తరాల్లో, అతని కాథలిక్ మతపిపాస, మత సామరస్యంతో మిళితమై ఉన్నట్లు, స్పష్టంగా గోచరిస్తుంది. కాని, తాను వాంఛించిన విధంగా, నిరపేక్ష రాజరికాన్ని పొంది ఉండినట్లైతే, అతడు తర్వాత ప్రవచించిన విధంగా, సామరస్యాన్ని అనుసరించి ఉండడనే నగ్న సత్యం, ఇంగ్లాండ్ ప్రజలెరిగిందే. మత సామరస్యం పేర, జేమ్స్ చేపట్టిన అన్ని చర్యలను ప్రజలు ఆసక్తితో గమనించారు. అతని ప్రవర్తన, అతనికి గల దృఢాభిప్రాయాల మూలంగా, కాథలిక్ మత విధానాల ద్వారా అతడు తన అధికారం చెలాయించ బూనుకొన్నట్లైతే, ఇక దేశానికి గత్యంతరం లేదని నమ్మారు.

## 5.3 మాన్‌మౌత్ (Monmouth) వారసత్వ పోటీ

రెండో జేమ్స్ సింహాసనానికి వచ్చిన వెంటనే ఎదుర్కొన్న సమస్య, వారసత్వ తగాదా. రెండో ఛార్లెస్ హఠాన్మరణం గూర్చి విన్న, అతని అక్రమ సంతానమైన మాన్‌మౌత్ డ్యూక్, వెంటనే హాలండ్ నుండి తన సైన్యంతో ఇంగ్లాండ్ బయల్దేరాడు. మొదట అతడు తన తండ్రి మరణానికి దారితీసిన కారణాలను, ఒక పార్లమెంట్ కమిటీ ద్వారా విచారణ చేయించాల్సిందని కోరాడు; తర్వాత, సింహాసనానికి తానే సరియైన వారసుడనని గూడ, ప్రకటించుకున్నాడు. అంతకుముందు, ఛార్లెస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్ని, దేశ బహిష్కరణ పొందిన అనేకులు, మాన్‌మౌత్ అనుచరులు. వారంతా, సింహాసనానికి అతనికి గల హక్కులన్నిటినీ పునరుద్ధరించుకొమ్మని ప్రోత్సహించారు. హాలండ్ రాజైన విలియం ఆఫ్ ఆరంజ్ ఇచ్చిన ఆతిథ్యంలో, తన భార్యైన లేడీ వెంట్‌వర్త్‌తో సదా నాట్యం చేసుకుంటూ కాలం గడుపుతుండిన మాన్‌మౌత్‌ను, ప్రొటస్టెంట్‌ల ప్రతినిధిగా, ప్రజల దృష్టికి తెచ్చారు. ఆర్గిల్ అధీనంలో కొంత నౌకాదళం స్కాట్‌లాండ్‌కు; షాఫ్ట్స్‌బరీ అనుయాయుల సహాయంతో మాన్‌మౌత్ ప్రయాణించారు.

జేమ్స్ సింహాసనాన్ని సునాయాసంగా ఆక్రమించుకున్నాడు. అతడు ఇతరులపై కసి తీర్చుకునే పద్ధతులేవీ చేపట్టలేదు. "ఈ దేశ అవసరాలకై, నేను ఇంతకాలం నా జీవితంలో కష్టాల నెదుర్కొన్నాను. దీని హక్కులు, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించేందుకై, నేను మరి ఎవరితోనూ తీసిపోకుండా, ఏ చర్య తీసుకోడానికైనా ఎట్టి త్యాగం చేయడానికైనా, వెనుదీయను" అని ప్రకటించాడు. రాజకీయాల్లోను, మత విషయాల్లోను, న్యాయబద్ధమైన పరిపాలన కొనసాగించడానికి, తాను నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. "ఇంగ్లాండ్‌లోని చట్టాలు రాజును అధికార యుక్తంగా చేయడానికి, తగినన్ని గలవు" అని, అన్నాడు. రాజరిక అధికారాలను సంరక్షించి, ఇతరుల భూభాగంపై అనవసర జోక్యం కలిగించుకోనన్నాడు. మత విషయంలో ఇతరులకు ప్రమేయం లేదని, బహిరంగంగా అతడు కాథలిక్ మతాన్ని అనుసరించాడు.

రెండో జేమ్స్ కాథలిక్ మత పక్షపాతం వెంటనే, ప్రొటస్టెంట్ మతస్థులైన ఆంగ్లికన్‌లను కలవర పెట్టింది. కాని, ప్రజల్లోని అసంతృప్తి దేశ వ్యాప్తం కావడానికి, కొంత వ్యవధి పట్టింది. రాజు ప్రకటనలను అందరూ వెంటనే సమ్మతితో స్వీకరించారు. రెండో ఛార్లెస్ మరణించిన తర్వాత, కొన్ని పన్నుల వసూలు కోసం అవసరమైన అంగీకారం పొందడానికి, పార్లమెంట్‌ను సమావేశపర్చడం తప్పనిసరైంది. ఎన్నికల్లో ప్రజలు గూడ, రాజుకు ఇష్టులైన పార్లమెంట్ సభ్యులనే ఎంపిక చేశారు. పార్లమెంట్, రాజుకు అవసరమైన ధనరాసులను సేకరించడంలో, సహాయపడింది. సంవత్సరానికి 20

లక్షల పౌన్ల అదనపు పన్నులను మంజూరు చేసింది. టోరీ నాయకుడైన సర్ ఎడ్వర్డ్ సెమోర్ (Seymour) వంటి వారి వ్యతిరేకతను పాటించక, పార్లమెంట్ అటువంటి సౌకర్యాలను అందజేసింది. పార్లమెంట్ ఉదారత్వానికి తగ్గట్లు, జేమ్స్ మొదట రాజ్యాంగ పద్ధతులను అనుసరించాడు. మంత్రుల నియామక పద్ధతుల్లో, గొప్ప మార్పులేమీ చేయలేదు. లార్డ్ హాలిఫాక్స్ కొంతకాలం ప్రధాన సలహాదారుగా కొనసాగాడు. అందరూ మిక్కిలి అపేక్షతో, జేమ్స్ పరిపాలనా విధానాలకై ఎదురుచూశారు.

అట్టి సందర్భంలో 1685 జూన్ 11వ తేదీన, మాన్‌మౌత్ హాలాండ్ నుండి ఊడిపడ్డట్లు, ఇంగ్లాండ్ చేరుకున్నాడు. దాదాపు ఇరవై రోజులు సముద్ర యానం చేసి, ఇంగ్లీష్ యుద్ధ నౌకల నుండి తప్పించుకొని, లిమ్‌రీజిస్ అనే నౌకా స్థావరం చేరాడు. ప్రజలతన్ని వెంటనే ఆహ్వానించారు. అతడు ఒక ప్రకటన చేస్తూ, తన తల్లిని న్యాయబద్ధంగా రెండో ఛార్లెస్ వివాహమాడాడని, రెండో జేమ్స్ తన తండ్రిని "హత్య చేసి" సింహాసనాన్ని అక్రమంగా కాజేశాడని, ఆరోపించాడు. ఒక్క రోజులో దాదాపు 15 వేల మంది అతని సైన్యంలో చేరడానికి అంగీకారం తెల్పుతూ, సంతకాలు చేశారు. కాని, వార్తాహరులు మాన్‌మౌత్ రాకను వైట్‌హాల్ రాజప్రాసాదం లోని రెండో జేమ్స్‌కు తెలియజేయడంతో, అతడు తిరుగుబాటును శక్తివంతంగా అణచడానికి నిర్ణయించాడు. అతని వద్ద పెద్దగా సైన్యాలు లేవు. అశ్విక దళం మాత్రం మంచి తర్ఫీదుతో ఉంది. దేశవ్యాప్తంగా వున్న సైన్యాలన్నీ, రాజుకు మద్దతును ప్రకటించాయి. పార్లమెంట్ కూడ రాజుకు పూర్తి సహకారాన్ని అందిస్తూ, 'బతకడం, చావడం అతనితోనే' అని ప్రకటించింది. మాన్‌మౌత్‌ను దేశ విరోధిగా పరిగణించారు. అతని శిరస్సుపై పెద్ద మూల్యం ప్రకటితమైంది. అమిత ధనాన్ని పార్లమెంట్ కేటాయించింది. దేశీయ సైన్యాలను ఆయత్తం చేశారు. లూయీ డ్యురాన్ అనే ఫ్రెంచి దేశస్థుడు, ఇంగ్లాండ్‌లో స్థిర నివాసమేర్పర్చుకున్నాడు. అతడు అప్పటికే, ఫెవర్‌షామ్‌కు ప్రభువుగా నియమితుడైనాడు. అతన్ని జేమ్స్ తన సైన్యాధ్యక్షునిగా నియమించాడు. మాన్‌మౌత్ తన సైన్యాలతో బ్రిస్టల్ నగరం వైపు వెళ్లాడు కాని, ఆ నగర ప్రజలు అతనికి ఎదురుతిరిగారు. అప్పటికే అతని అనుచరులైన ఆర్గిల్, రంబోల్డ్, స్కాట్‌లాండ్‌లు ఓడించబడ్డారు. వారిద్దరినీ ఉరితీయడం ఖాయం అని, మాన్‌మౌత్‌కు తెలుసు. అతని అనుచరులందరినీ రాజు సైన్యాలు వధించాయి. మాన్‌మౌత్‌ను కూడా వారే వధించారు. "నేను చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన ప్రొటస్టంట్‌గా మరణిస్తున్నానని" మాన్‌మౌత్ బలిపీఠం పైన ప్రకటించాడట.

తనకు ఎదురుతిరిగిన వారిపై, జేమ్స్ చాలా కఠినంగా వ్యవహరించాడు. వారి నందరిని వెదకి, తరిమిపట్టుకొని, నిర్బంధించమన్నాడు. బంధితులైన వారిని విచారించడానికై, తన ప్రధాన న్యాయాధికారి జెఫ్రిస్ (Jeffreys)ను, పశ్చిమ ప్రాంతాలకు పంపాడు. అతడు ఒక కౌంటీ నుండి మరొక కౌంటీకి ప్రయాణిస్తూ, తన విచారణలను కొనసాగించాడు. చాల మందిని ఉరితీయించాడు. వందలాది మందిని పశ్చిమ ఇండియా దీవైన బార్బడోస్ (Barbados)కు, ద్వీపాంతర శిక్షపై పంపివేశాడు. ఆవిధంగా వెళ్లిన వారి వారసులు, ఇప్పటికీ అక్కడ ఉన్నారట. జెఫ్రిస్ స్థాపించిన ఈ న్యాయస్థానానికి "Bloody Assize" (రక్తపు న్యాయస్థానం) అని పేరు. జేమ్స్ సంతసించి, అతడ్ని ప్రభువుగా గుర్తించి, లార్డ్ ఛాన్స్‌లర్‌గా నియమించాడు. జేమ్స్ తనకు గల వ్యతిరేకుల నందరినీ తొలగించాలనే నియమాన్ని పాటించాడు. ఫ్రెంచివారి సహాయంతో ఫ్రాన్స్ నుండి వచ్చిన పెద్ద మొత్తాల ధనంతో, అతడు ఈ విధమైన చర్యలను కొనసాగించాడు. అతని జీవితంలో ప్రధాన ఆశయాలు రెండు: 1. తన నిరంకుశ అధికార స్థాపన 2. రోమన్ కాథలిక్ మత పునఃస్థాపన.

హాలాండ్ రాజు విలియం ఆఫ్ ఆరెంజ్ ప్రవర్తన, అతని దౌత్య విధానానికి ప్రతీక. జేమ్స్‌కు సొంత అల్లుడైనందున, సైనిక సహాయం అందజేయడానికి అంగీకరించాడు. తన వాగ్దానాన్ని అతి

BRAOU

త్వరగా నిలువుకొన్నాడు. ఆ సైన్యాలకు స్వయంగా తాను వచ్చి సారథ్యం వహిస్తానని కూడ ముందుకొచ్చాడు. కాని, తన దేశంలో తలదాచుకొంటున్న మాన్‌మౌత్, జేమ్స్‌పై దండయాత్ర చేయగా, దాన్ని నివారించడానికి, ఎట్టి చర్య తీసుకోలేదు. అతని దృష్టిలో, మాన్‌మౌత్ విజయం సాధిస్తే, ఇంగ్లాండ్‌కు ఒక ప్రొటెస్టంట్ రాజౌతాడు. తనతో చేతులు కలిపితే, ఫ్రాన్స్ దేశపు పద్నాల్గో లూయీకి వ్యతిరేకి అవుతాడు. లేక ఓడితే, తానూ, తన భార్య మేరీ, జేమ్స్ మరణం తర్వాత, ఇంగ్లాండ్ సింహాసన మెక్కడం ఖాయం. రెండు విధాల, తనకు లాభమే అనుకొన్నాడు.

మాన్‌మౌత్ తిరుగుబాటు విఫలం కావడంతో, మరీ బలవంతుడైన జేమ్స్, తక్కిన తన విరోధుల నణచడానికి పూనుకున్నాడు. తన అన్న కాలంలో పోపిష్ కుట్రతో సంబంధంగల వారి నందరినీ శిక్షించాడు. టైటస్ ఓట్స్‌కు 3400 కొరడా దెబ్బలు శిక్షగా విధించడం జరిగింది. వాటి నతడు, మూడు రోజుల వ్యవధిలో స్వీకరించాడు.

## 5.4 పార్లమెంట్ వ్యవహారాలు

ఆంతరంగిక వ్యతిరేకతల నణచిన పిదప, జేమ్స్ దాదాపు ఒక అంతర్యుద్ధాన్ని ఆపివేసినవాడుగా, ప్రజలు భావించారు. అతనికి తమ అభిమానాన్ని అందజేశారు. జెఫ్రీస్ న్యాయవేత్త ద్వారా తన శిక్ష సాధింపు చర్యలు పూర్తైన వెంటనే, జేమ్స్ తన కౌన్సిల్ సభ్యులతో "టెస్ట్ చట్టం", "హేబియస్ కార్పస్" చట్టాలను రద్దు చేయడం గురించి, చర్చించాడు. పై రెండు చట్టాలు, తన అన్న రెండో ఛార్లెస్ కాలంలో ప్రవేశపెట్టడం జరిగింది. ఇవి రాజరిక నిరంకుశత్వాన్ని ప్రశ్నించేవిగా ఉన్న కారణంగా, రాజు మద్దతుదార్లు వీటిని నిరసించారు. అత్యవసర పరిస్థితిలో అనేక ప్రధాన ఉద్యోగాలను, జేమ్స్ కాథలిక్‌లకు ఇచ్చాడు. వారినందరిని అలాగే కొనసాగించ నిర్ణయించాడు. హాలిఫాక్స్ కౌన్సిల్ అధ్యక్షుడుగా, రాజును వారించబోయాడు. అందుచే, హాలిఫాక్స్‌ను పదవి నుండి తొలగించాడు. లార్డ్ నార్త్ మరణించగా, అతని స్థానంలో న్యాయమూర్తి జఫ్రీస్‌ను లార్డ్ ఛాన్సలర్‌గా నియమించాడు. సందర్‌లాండ్ ప్రభువైన రాబర్ట్ స్పెన్సర్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ గా నియమితుడైనాడు. అంటే, జేమ్స్‌కు ప్రధానమంత్రిగా కొనసాగాడు. అతడు, ఏ గాలికి ఆ తెరచాప పట్టగల సమర్థుడు. ఛార్లెస్‌కు, జేమ్స్‌కు, తర్వాత మూడో విలియంకు కూడ, తన సేవల నందించాడు. జేమ్స్ కాలంలో పోపిస్ట్‌గా, కాథలిక్ మతాన్ని సమర్థించాడు. దేశంలోని ప్రధాన కుటుంబాలకు సంబంధించిన రాజకీయాలు, వారి మనోభావాలు, అతనికి తెలిసినంత క్షుణ్ణంగా మరెవరికీ తెలియవు. అందుచేత, అతడు ప్రతి రాజుకు తప్పనిసరిగా అవసరమైనాడు.

BRAOU

1685 నవంబర్ 9వ తేదీ, పార్లమెంట్ రెండోసారి సమావేశమైనప్పుడు, రాజు తన అవసరాలను పార్లమెంట్ ముందుంచాడు. తన నైజం ప్రతిబింబించే విధంగా, జాతీయ సైన్యం ఎందుకూ పనికిరాదని, మాన్‌మౌత్ అధీనంలోని పనికిమాలిన సైన్యంతో కూడ పోటీపడలేని అట్టి సైన్యాన్ని తొలగించి, దాని స్థానంలో బలమైన సర్వసిద్ధ సైన్యాన్ని రూపొందించాలని అన్నాడు. తన కాథలిక్ మతస్థులను ఉద్యోగాల నుండి తొలగించే ఉద్దేశం లేదని గూడ, విశదం చేశాడు. ఈ రెండు ప్రకటనలు, పార్లమెంట్ ఎట్టి స్థితిలోను ఊహించనట్టివి. రాజుకు అంతవరకు సహకారిగానున్న పార్లమెంట్‌కు, ఇవి విద్యుద్ఘాతంగా తోచాయి. పార్లమెంట్ చాలవరకు ప్రొటస్టంట్ మతాభిమానం గలది. సర్వసిద్ధ సైన్యం, పార్లమెంట్‌కు సుతరామూ ఇష్టం లేదు. తమ ఆంగ్లికన్ చర్చి, వారికి అత్యంత ప్రీతిపాత్రమైంది. అందుచే, పార్లమెంట్ సభ్యులందరు తమతమ మనస్సుల్లో భయాందోళనలు చెందసాగారు. అంతవరకు పార్లమెంట్ జారీచేసిన చట్టాలను తొలగించరాదని, ప్రొటస్టంట్ మతాన్ని

నిర్లక్ష్యం చేయకూడదని, రాజును ప్రత్యేకంగా కోరారు. అందుకై, మరో 7 లక్షల పౌన్ల మొత్తాన్ని రాజుకు మంజూరు చేశారు కూడ. కాని, రాజు దీనికి వెంటనే తన అంగీకారాన్ని తెల్పలేదు.

ఎగువ సభలో గూడ, విగ్ పక్షం నాయకుడైన డేవన్ షైర్ ప్రభువు, పూర్వ మంత్రి హాలిఫాక్స్, లండన్ బిషప్ హెన్రీ క్రాంప్టన్ మొదలైన వారందరు, దేశ ప్రజల పక్షం కృషిచేశారు. రాజు చర్యల గురించి చర్చించేందుకై, అనేకులు, న్యాయవేత్తలు, రాజకీయ నాయకులతో కలిసి, ఒక సదస్సును నిర్వహించేందుకు, ఒక రోజును నిర్ణయించారు. కాని, అప్పటికే జేమ్స్ న్యాయస్థానాలన్నింటిని తన అనుయాయులతో నింపే కార్యక్రమాన్ని చేపట్టాడు. అందుచే, జేమ్స్ అటువంటి సదస్సు తనకు ప్రతికూలంగా ఉంటుందని భావించి, 1681 లో రెండో చార్లెస్ పార్లమెంట్‌ను రద్దుచేసిన విధంగా, నవంబర్ 20 వ తేదీ రాజు ఉన్నట్లుండి, ప్రభువుల సభలో ప్రవేశించి, కామన్స్‌ను గూడ సమావేశపర్చి, పార్లమెంట్‌ను రద్దుచేశాడు. తాను రాజుగా కొనసాగిన తర్వాత కాలంలో, పార్లమెంట్ మళ్లీ సమావేశం కాలేదు.

## 5.5 రెండో జేమ్స్ కాథలిక్ విధానాలు

జేమ్స్ మత పద్ధతులతో జోక్యం కలిగించుకోకపోతే, అతడు అనేక ఏళ్లు పరిపాలన కొనసాగించే వాడు. కాని, ఇంగ్లాండ్‌లో కాథలిక్ మత పునరుద్ధరణకై అతడనుసరించిన విధానాలు, అతని పతనానికి దారితీశాయి. తనకు మిక్కిలి విధేయత చూపిన మొదటి పార్లమెంట్ 1685లో సమావేశమైనప్పుడే, జేమ్స్ టెస్ట్ చట్టాన్ని రద్దుచేయ ప్రయత్నించాడు. పై చట్టం ప్రకారం, ప్రభుత్వంలో ఎటువంటి ఉద్యోగంలో చేరదల్చుకున్నా, వారు ప్రొటస్టంట్ మతానికి, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందినవారై ఉంటామని ప్రకటించాలి. కాని, రెండో జేమ్స్ అలాంటి ప్రతిజ్ఞ తీసుకోని వారందరికి గూడ, సైన్యంలోనూ, పరిపాలనా విభాగంలోను ఉన్నతోద్యోగాలిచ్చాడు. కాథలిక్‌లను విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా నియమించాడు. దీన్ని ప్రజలు సహించలేకపోయారు. జేమ్స్‌ను గాఢంగా అభిమానించిన వారు కూడా, అతని మత విధానాలను నిరసించారు. జేమ్స్ అనుసరించిన కాథలిక్ పక్షపాత వైఖరికి, హేల్స్ (Hales) కేస్ ఒక నిదర్శనం. హేల్స్ అనే కాథలిక్ నాయకుడు, పోర్ట్స్‌మౌత్ (Portsmouth) కు గవర్నర్. కాని, గోడన్ అనే అతని రథ చోదకుడు, కాథలిక్ మతస్థుని ఉన్నతోద్యోగానికి నియమించడం టెస్ట్ చట్టానికి విరుద్ధమని, న్యాయస్థానంలో ఫిర్యాదుచేసి, ఆ విషయాన్ని బహిర్గతం చేసినందుకుగాను, ఐదువందల పౌన్ల ప్రతిఫలాన్ని కోరడం జరిగింది. రాజును తన దావాలో ప్రతివాదిగా అతడు సూచించాడు. ప్రీవీ కౌన్సిల్‌లో కూడా, కాథలిక్ మతస్థులు సభ్యులుగా నియమితులైనారు. రాజు ఒక మత సంఘాన్ని (Ecclesiastical Commission) నియమించాడు. అది, దీర్ఘకాలిక పార్లమెంట్ తొలగించిన హైకమీషన్ న్యాయస్థానాన్ని పోలి ఉండేది.

రోమన్ కాథలిక్‌లకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో, జేమ్స్ 1687, ఏప్రిల్ లో మొదటి మత చట్టాన్ని (First Declaration of Indulgence) ప్రకటించాడు. దాని మూలంగా, రోమన్ కాథలిక్‌లపై గల అన్ని నేరారోపణలను, ఉపసంహరించడం జరిగింది. దీనివల్ల వారంతా బహిరంగంగా ప్రార్థనలు జరుపుకోడానికి, మత ప్రచారం చేయడానికి వీలైంది. దేశంలోని టోరీ నాయకులు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన వారు కావడం చేత, రాజు ప్రకటించిన మత చట్టాన్ని ఎదిరించారు. వారి ఉద్దేశంలో, అటువంటి చట్టాలు కేవలం, కాథలిక్ మత పునరుద్ధరణకు తగిన అవకాశాన్ని కల్గించడానికి మాత్రమే. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, తాను సూచించిన కాథలిక్ మత నాయకునికి గౌరవ డాక్టరేట్ బిరుదు ప్రదానం చేయడానికి నిరాకరించిన కారణంగా, అతన్ని జేమ్స్ తొలగించాడు.

BRAOU

1688 లో జేమ్స్ రెండో మత చట్టాన్ని (Declaration of Indulgence) ప్రకటించాడు. దీని మూలంగా, కాథలిక్‌లపై గల ఆంక్షలను తొలగించడమేగాక, ఈ చట్టాన్ని ఆంగ్లికన్ చర్చి నాయకులను తమ ప్రార్థనా మందిరాల్లో, అందరికీ చదివి వినిపించమన్నాడు. దీన్ని అవమానంగా భావించిన ప్రొటస్టంట్ ఆంగ్లికన్ మత నాయకులు, ఎదిరించ పూనుకున్నారు. ఏడుగురు ప్రొటస్టంట్ బిషప్‌లు తమ చర్చిల్లో కొత్త చట్టాలను చదివి వినిపించే విధులనుండి మినహాయించమని కోరుతూ, విజ్ఞాపన పత్రాన్నొకటి, రాజుకు సమర్పించారు. కాని, రెండో జేమ్స్ ఉద్దేశంలో, బిషప్‌లు రాజుకు విజ్ఞప్తి చేయడానికి అర్హులు కారు. కోపంతో వెంటనే వారిని టవర్‌లో ఖైదు చేయించి, విచారణ జరిపించాడు. విచారణలో వారు, రాజుకు, వారిని నిర్బంధించే అధికారాలు రాజ్యాంగపరంగా లేవని వాదించారు. సుదీర్ఘ విచారణానంతరం, ఏడుమంది బిషప్‌లు నిర్దోషులుగా నిర్ణయమై, విడుదల అయినారు. దేశవ్యాప్తంగా ప్రజలు, వీరు విడుదల అయిన వార్త విని, సంతసించారు. ఏడుగురు బిషప్‌లు ప్రజాభిమానం పొందిన గొప్ప నాయకులుగా కీర్తించబడ్డారు. జేమ్స్ దేశంలో కాథలిక్ మత స్థాపనకు కృషిచేస్తున్న విషయం, అందరికీ అవగాహనకు వచ్చింది. టోరీలు, విగ్‌లు తమ రాజకీయ విభేదాలను గూడా విస్మరించి, రాజు మత విధానాలను ఎదిరించసాగారు. తన సోదరుని ఎదిరించిన పక్షంతో, అండగా నిల్చిన పక్షాన్ని ఒకటిగా చేశాడు, రెండో జేమ్స్.

1687లో, తన ప్రభుత్వంలోని చాలమంది పలుకుబడిగల నాయకులను తొలగించడం ప్రారంభించాడు, జేమ్స్. క్లారండన్, అతని తమ్ముడు హైడ్‌ను, పదవి నుండి తొలగించడం జరిగింది. అదే నెల్లో రోబస్టర్ ను ఆర్థిక మంత్రి పదవినుండి తొలగించాడు. స్కాట్‌లాండ్‌లో గూడ తన కాథలిక్ అనుయాయులను నియమించాడు. నిజానికి, రోబస్టర్‌ను తొలగించిన నాటినుండి, జేమ్స్‌కు వ్యతిరేకంగా విప్లవ బీజాలు మొలకెత్తాయని చెప్పవచ్చు.

ఇంతలో జేమ్స్ తన సైన్యాన్ని సిద్ధం చేస్తూ వచ్చాడు. రెండో ఛార్లెస్‌కు తన ఏడు వేల సైన్యానికి ఏటా దాదాపు రెండు లక్షలకు మించిన ఖర్చుండేది, 1686 ఫిబ్రవరి నాటికి, మూడు రెజిమెంట్ల ఆత్మరక్షణ దళం, పది అశ్విక దళాలు, ఇవి గాక రిజర్వు దళాలను, సిద్ధం చేశాడు. ప్రతి వేసవిలో లండన్ సమీపంలోని "హౌన్స్" వద్ద, నగరవాసులను మెప్పించేందుకై, సైనిక విన్యాసాలను జరిపించేవాడు. 1686లో అట్టి విన్యాసాలకు, దాదాపు పదివేల సైనికులను నియమించాడు. ఒక సంవత్సరం తర్వాత ఫైవర్ ఫామ్ పదిహేను వేలమందిని సమావేశపర్చగల్గాడు. రాజు తరచుగా ఆ విన్యాసాలు చూడ్డానికై వెళ్లి, సైనికులతో సన్నిహితుడవడానికి ప్రయత్నించాడు. కాథలిక్ మతస్థులందరిని సైన్యంలో ఉన్నత పదవుల్లో నియమించాడు. బెర్విక్ ప్రభువు పద్దెనిమిదేండ్లు కూడా నిండకముందే, పోర్ట్స్‌మౌత్‌కు గవర్నర్‌గా నియమితుడైనాడు. హల్, డోవర్, మొదలైన కీలక రేవు పట్టణాలన్నీ, కాథలిక్ సైన్యాధ్యక్షులకు అప్పజెప్పాడు. ఇంగ్లీష్ ఛానల్‌ను రక్షించడానికై నియోగించిన నౌకాదళం గూడ, కాథలిక్ నాయకుల అధీనంలోనే కొనసాగింది.

## 5.6 మహోజ్వల, రక్తపాతరహిత విప్లవం, 1688

హాలాండ్ లో విలియం ఆఫ్ ఆరంజ్, రెండో జేమ్స్ విధానాలను ఆసక్తితో పరిశీలిస్తూ వచ్చాడు. హైడ్స్‌ను పదవీచ్యుతుని చేసిన వెంటనే, డైక్‌వెల్ట్ (Dykevelt) అనే ఒక డచ్ దేశీయుడు, ఇంగ్లాండ్‌కు వచ్చాడు. విలియం నుండి దూతగా వచ్చిన అతడు, ఒక రకంగా జేమ్స్‌ను ప్రొటస్టంట్‌ల ఎడ సద్భావంతో ఉండాల్సిందని కోరుతూ, మరో విధంగా జేమ్స్‌కు ప్రతిపక్ష నాయకుల పట్లగల

అభిప్రాయాలను రహస్యంగా తెలుసుకుంటూ వచ్చాడు. డైక్‌వెల్ట్, లండన్‌లో అందరు నాయకులు రాజుకు వ్యతిరేకులన్న విషయాన్ని గమనించాడు. వారందరి కతడు, విలియం, మేరీల మద్దతు లభిస్తుందని విశదం చేశాడు. అంతకు ముందు కొన్ని నెలలుగా, జేమ్స్ తన రెండో కుమార్తె ఆనీ రాకుమార్తెను, తన తర్వాతి వారసురాలిగా ప్రకటించడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. దానికై ఆమెను కాథలిక్ మతాన్ని పుచ్చుకోవాల్సిందని షరతు పెట్టాడు. ఆనీ రాకుమారి ప్రొటస్టంట్ గృహ వాతావరణంలో కొనసాగుతూ, ఆమతాన్ని మిక్కిలి గాఢంగా అభిమానించింది. ఆంగ్లికన్ చర్చ్ బిషప్ కాంప్టన్, ఆమెకు ఆధ్యాత్మిక బోధకుడు; జాన్‌చర్చిల్ అనే ప్రొటస్టంట్ సైనికాధికారి, ఆమెకు నమ్మకమైన సలహాదారు. అతని భార్య సారా, ఆమెకు అత్యంత సన్నిహిత స్నేహితురాలు. జేమ్స్ ఉద్దేశాలు తెలిసిన వెంటనే, వారందరు ఒకటిగా దీన్ని వ్యతిరేకించ దలచారు. మత విషయంగా గాఢ అభిప్రాయాలుగల ఆని, ప్రొటస్టంట్ మతానికై, తన ప్రాణాలు కూడ ఒడ్డడానికి సిద్ధమైంది. 'ఆని' రాకుమారి చుట్టూ ఏర్పడ్డ చిన్న సహకార కూటమి "కాక్‌పిట్" గూడ, పూర్తిగా ప్రొటస్టంట్ భావాలు కలది. విధేయత గల్గి, ఆమెకు పూర్తి సహకార మందించిన ఈ కూటమి సభ్యులు, ఉత్తరోత్తరా అమిత ప్రధాన పాత్రను వహించారు.

ప్రభుత్వ విధానాలు మిక్కిలి రెచ్చగొట్టే విధంగా కొనసాగాయి. మొదటి మత చట్టాన్ని విడుదల చేయడం జరిగింది. జేమ్స్ మొదట వద్దన్నా దాన్ని, పార్లమెంట్ ఖచ్చితంగా అమలు పర్చింది. రాజుకు మత విషయంలో అత్యంత ఉన్నతాధికారాలు కొనసాగాయి. ఇంతలో ఆక్స్‌ఫర్డ్‌లోని మెగ్దాలన్ కళాశాల అధ్యక్షుడుగా, ఒక కాథలిక్‌ను నియమించడానికి ప్రయత్నించడం, దాన్నెదిరించిన అందరు ఆచార్యులను తొలగించడంతో, అసంతృప్తి మరీ పెరిగింది. జూలై నెల్లో జేమ్స్ రాజు, ఇటలీ నుండి వచ్చిన పోప్ దూత, నన్సిమోడికి గొప్ప పౌర సన్మానాన్ని ఏర్పర్చాడు. ఆ ఉత్సవ నిర్వహణకై 'డ్యూక్ ఆఫ్ సోమర్‌సెట్'ను ఆదేశించగా, అతడు పోప్ దూతలు ఇంగ్లాండ్‌లో మత సంస్కరణోద్యమ (Reformation) కాలం నుండి గుర్తింపును కోల్పోయారని గుర్తు చేశాడు. అందుకు జేమ్స్, "నేను చట్టాలకు అతీతుడ" నన్నాడు. దానిపై సోమర్‌సెట్, "ఘనత వహించిన మీరు అతీతులు గావచ్చు. కాని, నేను కాదు", అన్నాడట. వెంటనే జేమ్స్, సోమర్‌సెట్‌ను పదవీచ్యుతుని చేశాడు.

రాజు రాజకీయ వేదిక నొకదాన్ని రూపొందించుకున్నాడు. దీంతో, రాజకీయ పక్షాల యంత్రాంగాన్ని నడపగలిగాడు. దాని మూలంగా, తనకు అనుకూలమైన పార్లమెంట్‌ను సమావేశపర్చి, తనకు వ్యతిరేకంగా ఉన్న అన్ని చట్టాలను తొలగించదలచాడు. ఎన్నికల్లో పాల్గొను ఓటర్లు చాల తక్కువ పరిధిలో ఉండడం మూలాన, మిలిటరీ అధికార్లు, న్యాయాధికార్లు, భూస్వాములు, గ్రామీణ ప్రాంతాల్లోను, వర్తక వాణిజ్య ప్రముఖులు నగరాల్లోను, తమకు నచ్చిన రీతిలో దేశ రాజకీయాలను మలచ గలిగారు. రాజరికమైన పలుకుబడిని వీటిపై మళ్లించడం జరిగింది. నగర పాలక సంస్థలు, న్యాయాధిపతుల ధర్మాసనాలు, పూర్తిగా పునర్వ్యవస్థీకరించబడినాయి. పోప్ అనుయాయుల సహకారాన్ని పొందే విధంగా, అవి మార్చబడినాయి. ప్రాంతీయ భూస్వాములు, సైనికాధికార్లు, అనువైన విధంగా పార్లమెంట్‌ను మలచడానికి అంగీకరించని వారందరిని తొలగించడం జరిగింది. ప్రాంతీయ అధికార్లందరూ రాజు సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా పాటిస్తామని, ప్రభుత్వానికి అభయ మివ్వాల్సొచ్చింది. ఆంగ్లికన్, కెవాలియర్ మతస్థుల స్థానంలో రోమన్ కాథలిక్‌లను నియమించే పద్ధతి వల్ల, మతసంస్కరణోద్యమ కాలంలో జరిగిన సాంఘిక మార్పులన్నిటినీ విస్మరిస్తారని భావించడం జరిగింది. మిక్కిలి ధనవంతులైన ప్రభువర్గమే గాక, అధిక సంఖ్యాక సామాన్య ప్రజలు

గూడ, దీని మూలంగా బాధపడ్డారు. రాజరిక అధికారానికి అడ్డుతగలడంలో, సంపన్న వర్గాలన్నీ ఓటు గూడలేని సామాన్య ప్రజానీక ప్రతినిధులుగా భావించుకున్నారు.

జేమ్స్ రాజు ప్రవర్తనను సమర్థించే వారందరూ, ఇంగ్లాండ్‌లోని కాథలిక్‌ల సంఖ్యను గొప్పగా ప్రకటించారు. అనేక తరాల పాటు కొనసాగిన ఊచకోత తర్వాత గూడ, కాథలిక్ మతస్థులు దాదాపు ఎనిమిదింట ఒక భాగం దేశవ్యాప్తంగా కొనసాగారని అంచనా. ఇంగ్లాండ్‌లోని సనాతన కాథలిక్ కుటుంబాలు రాజు వైపరీత్య విధానాలు తమకు ఎట్టిహానిని కలిగిస్తాయోనని భయపడ్డారు కూడ. పోప్ కూడ, జేమ్స్ యొక్క మితిమీరిన కాథలిక్ పక్షపాతం, విపరీత పరిస్థితులకు దారితీయవచ్చని హెచ్చరించాడు. కాని, జేమ్స్ గుండె దిటవుతో సైన్యాన్ని బాగా విస్తరింపజేసుకున్నాడు.

అనేక మాసాలు దీర్ఘ చర్చలు కొనసాగాయి. మతాధికార్లు కాథలిక్ మతాన్ని నిరసిస్తూ, ప్రచారాన్ని కొనసాగించారు. లార్డ్ హాలిఫాక్స్, జేమ్స్ మత విధానాలకు ప్రతిగా, ఒక కరపత్రాన్ని విడుదల చేశాడు. బార్నెట్ (Barnet) అనే బిషప్, హాలాండ్ నుండి ఒక ప్రకటన చేస్తూ, ఇంగ్లాండ్‌లోని ఆంగ్లికన్ మతస్థులందరూ కలసికట్టుగా ఉండాలని, ఐకమత్యంతో జేమ్స్‌ను ఎదిరించాలని సూచించాడు. డచ్ రాజైన విలియం ఆఫ్ ఆరంజ్ గూడ, తన మనోభావాలను స్పష్టంగా తెలియజేశాడు. దీనికి తోడు, ఫ్రాన్స్ దేశంలో పద్నాల్గవ లూయీ కాథలిక్ పక్షపాత వైఖరి వల్ల బాధలకు గురైన ప్రొటస్టంట్లు (ఫ్రాన్స్‌లో వారికి హ్యూజినాట్లనిపేరు) ప్రతి రోజు అధిక సంఖ్యలో ఇంగ్లాండ్ తీరాన్ని చేరుతూవచ్చారు. దీని వల్ల, కాథలిక్ మతంపైన దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరగజొచ్చింది. దేశంలోని అన్ని పక్షాలకు, అన్ని వర్గాలకు, ఫ్రాన్స్ రాజుకు, ఇంగ్లాండ్ రాజుకు ఉన్న దగ్గర సంబంధాలు తెలిసినవే. వారి ఉద్దేశంలో, వారికి ఇష్టమైనవన్నీ రాజుల అధీనంలో ఉండిపోయాయి. అందుచేత, మూకుమ్మడిగా వారు రాజు వ్యతిరేకోద్యమాన్ని, తిరుగుబాటును కాంక్షించారు.

## 5.7 ఫ్రాన్స్ అనుసరించిన మత విధానాలు

1678 లో నిమ్‌వెజిన్ (Nimwegin) సంధి కుదిరిన తర్వాత, దాదాపు పదేండ్ల కాలంలో, ఫ్రాన్స్ చక్రవర్తి పద్నాల్గో లూయీ అధికారం పతాక స్థాయి నందుకొంది. ఇంగ్లాండ్, ఆంతరంగిక సంక్షోభాల మూలంగా, ఐరోపాలో తన ప్రగతిని కోల్పోయింది. హేప్స్‌బర్గ్‌ల (Hapsburgs) సామ్రాజ్యం కూడ, ఆటోమన్‌ల, హంగేరియన్‌ల దండయాత్రల మూలంగా, అధికారాన్ని కోల్పోయింది. లూయీ తన అధికార ప్రాభవాన్ని ఇనుమడించే విధంగా, ప్రాచీన ఛార్లెమన్ ( Charlemagne) సామ్రాజ్యాన్ని పునరుద్ధరించ దలచాడు. అటువంటి ఐరోపా సామ్రాజ్యానికి తాను సారథ్యం వహించాలని ఊహించాడు. ఇంతేగాక, స్పెయిన్, దాని అమెరికా వలసలకు, ఒక ఫ్రెంచి రాకుమారుని అధిపతిగా చేసి, ఆ దేశాన్ని తన అధీనం చేసుకోడానికి పథకాలు పన్నాడు. తన పక్క రాజ్యాలపై కొనసాగించిన అతిక్రమణలు అనేకం. 1681లో రైన్ నదిని దాటి, స్ట్రాస్‌బర్గ్‌ను ఆక్రమించుకున్నాడు. 1684లో జినోవాను, లక్సంబర్గ్‌ను ఎదిరించి, స్పెయిన్ సరిహద్దు ప్రాంతాల్లో సైన్యాలను మోహరించాడు. జర్మనీ దేశపు వాయవ్య ప్రాంతాలన్నిటినీ తనవని ప్రకటించాడు. పక్క రాజ్యాధినేతలందరూ లూయీ అధికార విస్తరణకు భయకంపితులయ్యారు. తన దేశంలోని హ్యూజినాట్ల నందరిని, అణచివేశాడు. కాని, కాథలిక్ మతాధినేతైన పోప్‌తోగూడ, అతడు పేచీపడ్డాడు. కాథలిక్ మతానికి తానే రక్షకుడన్నట్లు, "మతానికి పెద్ద కొడుకు" (Eldest Son of the Church) అనే బిరుదు గ్రహించాడు. తన సైన్యాలను తర్ఫీదు చేసిన విధంగా, ఫ్రాన్స్‌లోని కాథలిక్‌లను తన విధానాల మీదుగా తర్ఫీదు చేయదలచాడు. మతపరంగా

BRAOU

ఉన్న అన్ని పన్నులు, అన్ని రకాల ఆదాయాలను అతడే కాజేశాడు. రాజకీయ అధికారాలతోబాటు, రాజుగా అతడు మత సంబంధ విషయాలపై గూడ, ఆధిపత్యాన్ని ప్రకటించాడు. ఫ్రాన్స్ దేశంలోని గాలిషియన్ చర్చి, దేశభక్తి ప్రభావంతో పోప్‌కు గాక, చక్రవర్తికి తన విధేయతను ప్రకటించింది. ఇలా లొంగని వారందరు, హ్యూజినాట్లలాగే రాజు ఆగ్రహానికి లోనై, సర్వనాశన మయ్యారు.

పోప్‌ల్లో పదకొండో ఇన్నొసెంట్ మిక్కిలి గొప్పవాడుగా పరిగణన పొందాడు. అతడనేక మంచి గుణాలను గల్గి, గొప్ప మత నాయకుడుగా పేరు పొందాడు. సామాన్య సైనికుడుగా తన జీవితాన్ని ప్రారంభించిన ఇన్నొసెంట్, ఎంతో గొప్ప వ్యక్తి. అంత గొప్ప వ్యక్తి, పోప్‌గా చాలకాలం కొనసాగలేక పోయాడు. ఉదాత్తమైన నడవడి, గొప్ప సహనం, మానవతాతత్వం ఉట్టిపడే విశాల దృక్పథం, గట్టి పట్టుదల, సత్కార్యాల ఎడ ధైర్య గుణాలు గల్గినవాడు. ఐరోపాలోని రాజకీయ పరిణామాలను, ఇతర రాజకీయ కోవిదుల కన్న, మిన్నగా అతడు లెక్కగట్టగల్గాడు. ఫ్రాన్స్ దేశంలో ప్రొటస్టంట్లకు గల్గిన కష్టాలను అతడు నిరసించాడు. నిర్బంధ మత మార్పిడులను అతడు గర్హించాడు. అతడిలా అనేవాడు: 'ఏసు క్రీస్తు తన అనుచరులుగా సాయుధులను నియమించి, తన ప్రవచనాలను వ్యాప్తి చేయలేదు. మనుషులను ఆలయాలకు స్వచ్ఛందంగా వెళ్లనివ్వాలిగాని, వారిని నిర్బంధంగా నెట్టలేం''. ఫ్రాన్స్ దేశంలోని మతాధికారాలన్నీ పోప్‌కు మాత్రం సంక్రమిస్తాయని, రాజుకు ఉన్న ఆ అధికారాలను ఉపసంహరింప జేశాడు. బహిష్కరణ (Excommunication) లాంటి మతపరమైన కఠిన శిక్షలను విధించే అధికారాలను, ఫ్రెంచి రాజు నుండి తొలగించాడు. క్రమేణా, ఐరోపాలో ఫ్రెంచి రాజు అధికారానికి వ్యతిరేకంగా ఏర్పడిన వర్గంలో ఒకడుగా చేరాడు, పోప్. ఒకవైపు కాథలిక్ చక్రవర్తి తన మద్దతు కొనసాగించినా, మరొకవైపు ఫ్రెంచి రాజుకు వ్యతిరేకంగా, కాల్విన్ మత అనుయాయైన విలియం ఆఫ్ ఆరంజ్‌తోకూడ, అతడు చేతులు కలిపాడు. ఆ విధంగా, క్రమక్రమంగా, జాతి, వర్గ, స్వలాభాపేక్షవంటి విభేదాలు సమసిపోయి, ఐరోపావాసుల్లో అందరి అవసరాల సాధనకై, సంఘటిత భావం ఉత్పన్నమైందని చెప్పవచ్చు.

B R A O U

## 5.8 విప్లవారంభం

1688 ఆరంభంలో, ఇంగ్లాండ్‌లో 1642 నాటిలాగే పరిస్థితులు ఒక విప్లవారంభాన్ని సూచించాయి. కాని, ఆనాడు నాటింగ్‌హామ్ వద్ద ఒకటో ఛార్లెస్ సేనలను సమీకరించిన పద్ధతికి, వీటికి ఎంతో వ్యత్యాసముంది. జేమ్స్‌కు అతి పెద్ద సైన్యముంది. మంచి ఆయుధాలుగల్గిన సర్వసిద్ధ సైన్యం, శక్తివంతమైన ఫిరంగి దళముంది. అంత గొప్పది కాక పోయినా, నైపుణ్యం గలిగిన నౌకాదళం కూడా అతని అధీనంలో ఉంది. ఫ్రాన్స్ నుండి, ఐర్లాండ్ నుండి అతడు కావలసినప్పుడల్లా , శక్తివంతమైన సైనిక సహాయాన్ని కోరగానే, పొందేవాడు. మిక్కిలి విధేయులైన తన కాథలిక్ గవర్నర్ల అధీనంలో, ప్రధాన నౌకాశ్రయాలు, ఆయుధ కర్మాగారాలు కొనసాగినాయి. అతనికి చెప్పుకోతగ్గ ఆదాయముంది. అతని దృష్టిలో, ఇంగ్లాండ్‌లోని కాథలిక్ మతం, ఎదురుతిరిగే పద్ధతులు అనుసరించని కారణంగా, నిర్వీర్యమైంది. ఎట్టి ఆటంకమూ లేని విధంగా, అతడు పార్లమెంట్‌ను సమావేశపర్చకుండా, జాగ్రత్త పడుతూ వచ్చాడు. అతన్ని వ్యతిరేకించిన వారు, కేవలం విగ్ పక్షం వారే గాక, పూర్వం రాజును సమర్థించిన వారందరు గూడా. రాజరిక పునరుద్ధరణకు సర్వవిధాల సహకరించినవారు, మార్స్‌టన్ మూర్, నెస్బీవంటి చోట్ల తన తండ్రికై పోరాటం కొనసాగించిన వారి కొడుకులు; రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతానికై పీడితులైన మత నాయకులు; బిషప్‌లు; ఒకటో

Dr BRAOU LIBRARY
Acc. No: CM - 0116
Class No:

ఛార్లెస్ నుండి పెద్ద మొత్తాలకై విజ్ఞప్తులు చేసిన విశ్వవిద్యాలయాధికార్లు; తమ విద్యార్థులను అధిక సంఖ్యలో సైన్యంలోకి పంపిన విద్యా సంస్థలు; ప్రభువులు; భూస్వాములు, అందరూ వ్యథతో తమ రాజును వ్యతిరేకించడానికి నిశ్చయించారు. దేశంలో ధనిక వర్గీయులు, మతాధికార్లు, ఎప్పుడూ లేనంత విధంగా 1688లో క్లిష్ట పరీక్ష నెదుర్కొని, దేశ అవసరాలకై కృషి చేయ నిశ్చయించారు. వెనుదిరగకుండా, లేశమైన సంకోచించకుండా, ఎంతటి క్లేశాన్నైనా సరుకు చేయక, బాధల్ని సహించి, వారు రాజుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపారు.

## 5.9 ఏర్పడిన పక్షాలు

దేశంలోని పరిస్థితులు రెండు వర్గాల ఆవిర్భావానికి దారితీశాయి. హాలిఫాక్స్, నాటింగ్ హేమ్ వంటి వారి నాయకత్వంలోని మితవాద వర్గం, నెమ్మదిగాను, మిక్కిలి సంయమనంతోను మెలగాలని సూచించింది. వారి దృష్టిలో, మంత్రివర్గం కూలిపోవడం ఖాయం. జేమ్స్ ఊహించిన విధంగా, పెద్ద ఎత్తున కాథలిక్ మతానికి ప్రజలు మార్పిడి చెందడం లేదు. రాజు అనుకున్న విధంగా, ఆయనకు అనుకూలమైన పార్లమెంట్ ఏర్పడ్డం కూడా, కల్ల. దేశద్రోహంగా పరిగణించే ఎట్టి ఫిర్యాదులు, అప్పటికి రాలేదు. పోరాటం ప్రారంభమైతే, సర్వసిద్ధ సైన్యం ఏ విధంగా నిరాటంకంగా పోరాడుతుందో వారికి తెలుసు. రెండో పక్షం డాన్బే నాయకత్వం లోంది. హాలండ్ రాజైన విలియంను, అతనితోబాటు విదేశీ సైన్యాన్ని ఆహ్వానించిన వారిలో ప్రథముడు అతడు. డాన్బేతోబాటు, ష్రూస్‌బరి, దేవాన్‌షైర్, ఇంకా అనేక ఇతర విగ్ నాయకులు, రాజుకు వ్యతిరేకులు. 1688 ప్రారంభంలోనే వారందరూ కలిసి, విలియంను ఇంగ్లాండ్ చేరుకోవాల్సిందిగా కోరారు. దానికి విలియం, తగిన విధంగా ఇంగ్లాండ్ నాయకుల నుండి సెప్టెంబర్ లోపల ఆహ్వానం వచ్చినట్లైతే, తప్పనిసరిగా రాగలనని తెలియజేశాడు. మేనెల అంతానికే, దేశవ్యాప్తంగా కుట్ర కొనసాగింది. చాల విస్తృతమైన రహస్య పథకాలు కొనసాగాయి. దేశంలో ఎక్కడ విన్నా, అనేక వదంతులు, కట్టు కథలు విరివిగా వినిపించాయి.

దేశంలో సైన్యం అమిత భారాన్ని మోయాల్సి వచ్చింది. రాజు ఆదేశించిన విధంగా సైన్యం అతనితో సహకరించి, అతనికై పోరాటం కొనసాగిస్తే, దేశంలో అంతర్యుద్ధం ప్రజ్వరిల్లి, అయోమయ స్థితి ఏర్పడ్డం తథ్యం. కాని, ఆవిధంగా కాకుండా, రాజు ఆజ్ఞలను త్రోసిపుచ్చి, అతనికి సహాయంగా పోరాడ్డానికి నిరాకరిస్తే, ప్రధాన సమస్యలన్నీ రక్తరహితంగా పరిష్కారం కాగలవు. ఖచ్చితమైన రుజువు లేక పోయినా, సైన్యంలోని విప్లవాత్మకమైన తిరుగుబాటు స్వభావం, బాగా అలముకొన్నది. రాజకీయ నాయకుల్లోని అసంతృప్తి, సైన్యంలోని ఉన్నత వర్గాల్లో బాగా వ్యాప్తి చెందింది. సివిల్, మిలిటరీ అధికార్లు, రాజును ఎట్టి నిర్బంధం లేకుండా తమ దారికి తేవడానికే ఉద్దేశించారు.

## 5.10 జేమ్స్ మత చట్టాలు

ఏప్రిల్ మాసాంతంలో, జేమ్స్ రెండో మత చట్టాన్ని విడుదల చేశాడు. తన చట్టాన్ని, ప్రకటనలుగా ప్రతి చర్చిలోను చదివి వినిపించాలని ఆదేశించాడు. మేనెల 18వ తేది, ఏడు మంది బిషప్‌లు తమ నాయకుడైన విలియం శాన్‌క్రాఫ్ట్ ఆధ్వర్యంలో, రాజు అధికారాన్ని ప్రతిఘటించారు. సామాన్య మతాచార్యులు తమ మత నాయకుల అభిమతాన్ని గౌరవించి, రాజ ప్రకటనను చదవడానికి నిరాకరించారు. తన మాటకు ఎదురు తిరిగినందుకు ఆగ్రహం వహించిన జేమ్స్, అటువంటి మతాచార్యులందరికీ క్రమశిక్షణారాహిత్యం అనే నేరం క్రింద, తగిన దండనలు విధించాలని కోరాడు.

తన మంత్రి సండర్లాండ్, అటువంటి కఠిన చర్యలు వద్దని వారించాడు. ఇతర సన్నిహిత సలహాదార్లు గూడ, రాజు కఠిన చర్యలను వలదని వారించారు. కాని, దృఢ నిశ్చయుడైన జేమ్స్ వారందరిని కాదని, తాను అనుకొన్న విధంగా, బిషప్‌ల విచారణను ఆదేశించాడు. ఆ బిషప్‌లు, మూకుమ్మడిగా 'జామీన్' ను నిరాకరించిన కారణంగా, అందరూ లండన్ టవర్‌లో నిర్బంధితులైనారు.

## 5.11 పుత్ర జననం

దేశానికి ఏర్పడ్డ విపరీత పరిస్థితులన్నీ జేమ్స్ రాజుతో అంతమౌతాయని అందరూ భావించారు. అతని వారసురాలిగా అతని కుమార్తె 'మేరీ'గాని, 'ఆని'గాని, కాథలిక్ రాజుకు, ప్రొటస్టెంట్ ప్రజలకు మధ్య, దేశంలో జరుగుతున్న పోరాటాన్ని అంతం చేయగలరని వారు భావించారు. శాంతియుతమైన సామాన్య ప్రజలు నిరంకుశ పాలన అంతమౌతుందని సహనంతో వేచిచూడదలచారు. ఎదురుతిరగకూడదన్న సిద్ధాంతం, నిరాశ, నిస్పృహలు సమయానికి పనికిరావని తేలిపోయింది. ఏడు మంది బిషప్‌ల విచారణ జరుగుతున్న సమయంలో, జూన్ 10వ తేదీన రాణి ఒక కుమారుడిని ప్రసవించింది. అందుచేత, ఇంగ్లాండ్ ప్రజలకు కాథలిక్ వారసుడు లభించే ఆస్కారం ఎదురైంది. దీంతో, భవిష్యత్తులో ఒకరి తర్వాత మరో కాథలిక్ వారసత్వానికి దారితీసే అవకాశం లేక పోలేదు.

పూర్వం అసహ్యించుకున్నా, ప్రజల దూషణలను పొందినా, బిషప్‌లను రాజు వేధించిన కారణంగా, జాతీయ నాయకులుగా పరిగణన పొందారు. టవర్‌లో బంధితులై, విచారణలోనున్న బిషప్‌లు, రాజకీయ సానుభూతిని, ప్రజల అపార అభిమానాన్ని, గౌరవమర్యాదలన్నిటినీ పొందారు. మొట్టమొదటి సారిగా, ఇంగ్లాండ్ దేశంలో మత సిద్ధాంతపరులు, సామాన్య ప్రజలతో అన్యోన్యంగా మెలగడం గోచరించింది. అటువంటి దృశ్యాలు, ఆ ఏడు మందిని జూన్ 15వ తేది వెస్ట్‌మినిస్టర్ హాలుకు తోడ్కొని వెళ్లినపుడు, తర్వాత జూన్ 29వ తేదీ వారి విచారణ జరిగిన సమయంలో గూడ, స్పష్టమైంది. బిషప్‌ల విచారణ రోజంతా కొనసాగింది. మరు దినం, ధర్మాసనం బిషప్‌లను "నిర్దోషులు" గా తీర్మానించింది. వారి తీర్పును ప్రజలు అత్యంత ఆనందోత్సాహంతో ఆహ్వానించారు. బిషప్‌లను ఆశీర్వదించమని వేడుకొన్నారు. కాని, సైన్య ఆలోచనా విధానం చాల ప్రధానమైంది. హౌన్‌స్లో వద్ద సైన్యాన్ని పరిశీలించడానికై జేమ్స్ వెళ్లాడు. అక్కడ నుండి తిరిగి వచ్చు సమయంలో, సంతోషంగా చేసే చప్పట్ల శబ్దం వినిపించిందట. "ఏమిటా సంబరం" అని అడిగాడట రాజు. "ప్రభూ! ఏమీ లేదు; సైనికులందరు బిషప్‌లు నిర్దోషులుగా ప్రకటితమైనందుకై సంతోషంతో ఉన్నారు." అనే సమాధానం విని, "దాన్ని ఏమి లేదంటావా?" అన్నాడట జేమ్స్.

అదే రోజు రాత్రి, ప్రజల పక్షం నాయకులు, ఫిరంగుల ధ్వనుల మధ్య ష్రూస్‌బరి ఇంటి వద్ద సమావేశమై, విలియంకు తమ చరిత్రాత్మక విజ్ఞాపన పత్రాన్ని రూపొందించి, దానిపై సంతకాలు చేసి, అతనికి పంపారు. ఆ పత్రం, ఇంగ్లాండ్ ప్రజల అభీష్టాన్ని తేటతెల్లం చేసేటట్లు రాయడం జరిగింది. "వెంటనే మీకు వీలున్న, మాదేశం చేరుకోవాల్సింది. మీరు ఇక్కడ చేరుకోగానే, మీకు మా అందరి సహాయ సహకారాలుంటాయి" అన్నది. ఆ పత్రం సారాంశం. దానిపై సంతకాలు చేసినవారు; ష్రూస్‌బరి, డన్బీ, రసెల్, బిషప్ కాంప్టన్, డెవాన్‌షైర్, హెన్రీ సిడ్నీ మొదలైనవారు. పైజాబును రహస్యంగా హెర్బర్ట్ అనే అతడు, సామాన్య నావికుడుగా మారు వేషంతో హాలాండ్‌చేరి, హేగ్ నగరంలో విలియంకు అందజేశాడు. సంతకాలు చేసిన వారంతా వెంటనే, ఇంగ్లాండ్‌లో దేశం నలుమూలలకు వెళ్లారు. ఒక వేళ రాజుతో కూడగట్టుకోడానికి వీలౌతుందని భావించి, అలా వెళ్లడం

BRAOU

జరిగింది. ష్రూస్‌బరి తన ఎస్టేట్ల నమ్మి, దాదాపు 40 వేల పౌన్ల ధనాన్ని పోగుచేశాడు. డన్బీ యార్క్‌షైర్ ప్రాంతంలో కృషిచేశాడు. కాంప్టన్ ఉత్తరాది ప్రాంతాల్లో పర్యటించాడు. డెవాన్‌షైర్ తన వద్ద గల రైతులందరి సహాయంతో, ఒక అశ్విక దళాన్ని రూపొందించాడు. హాలాండ్ రాజు విలియం, జేమ్స్‌కు పుత్ర సంతానం కల్గిన విషయం విన్నతోడనే, "ఇది ఎప్పుడో కాదు, ఇప్పుడే పరిష్కారం కావాలి" అనుకొన్నాడు. వెంటనే, ఇంగ్లాండ్‌పై దండయాత్రకు సన్నద్ధమయ్యాడు.

రాకుమారుడు జన్మించాడనేవార్త, ఇంగ్లాండ్ దేశవాసుల ఆశలపై ఎంత అశనిపాతంగా పడిందంటే, ఆ వార్తను వారు శంకించడానికి, లేదా ఖండించడానికి గూడ వెనుదీయలేదు. మధ్య వయస్సు దాటిన రాణి గర్భవతి అయిన విషయాన్ని, మొదటి నుండి అందరూ శంకించారు. కాథలిక్ మతాధికార్లు చర్చీల్లో ప్రార్థనలు జరపడం, దీని వల్ల తప్పనిసరిగా తమ రాణికి పుత్ర సంతానం కలుగుతుందని ఖచ్చితంగా ముందుగానే చెప్తూ రావడం చేత, ఏదో చిదంబర రహస్యం గలదని అందరూ అనుమానించారు.

పుత్ర జననాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఆడంబరంగా లండన్ నగరంలో వేడుకలు ఒక ప్రక్క జరుగుతున్న సమయంలోనే, రాజ ప్రాసాదానికి ఒక పసికందును రహస్యంగా తేవడం జరిగిందని, రాణికి పుత్ర జననం ఏమీ జరగలేదనే వదంతులు వినిపించాయి. కొడుకు పుట్టిన సమయంలో అక్కడ ఉన్నవారంతా కాథలిక్ మత అనుయాయులు, రాజ సన్నిహితులు మాత్రమే. ఆర్చ్‌బిషప్ ఆఫ్ కాంటర్‌బరి అక్కడ లేడు. రాజు బావమరదులైన హైడ్ సోదరులు లేరు. రాజుకు అసలు వారసులైన కుమార్తెలు 'మేరీ' 'ఆని'కి సంబంధించిన వారెవ్వరూ లేరు. హాలాండ్ రాయబారి, విలియంకు సన్నిహితుడైనప్పటికీ, అతనిని పిలువలేదు. ముఖ్యంగా రెండో కుమార్తె 'ఆని' ఇంగ్లాండ్‌లోనే, బాత్‌నగరంలో ఉన్నా, ఆమెకు వర్తమానం పంపలేదు. పుట్టిన శిశువు రాణి పుత్రుడు కాడని, సింహాసనానికి నిజమైన వారసుడుకాడని, దేశ ప్రజలు రక రకాలుగా వ్యాఖ్యానించారు. ఈ సమయంలో తాము జాప్యం చేస్తే, భవిష్యత్తులో కాథలిక్ రాజు తమను పాలించడం తథ్యమని, ప్రొటస్టంట్లందరు భావించారు. ఎక్కడో పుట్టిన పసికందును రాజప్రాసాదానికి రహస్యంగా తెచ్చారనే వదంతికి, వారు అమిత ప్రాధాన్యత నిచ్చి, ప్రచారం చేశారు. ఈ వదంతి, అనేక సంవత్సరాల తర్వాత గూడ, బహుళ ప్రచారంలో ఉంది.

'ఆని' రాకుమారికి అత్యంత సన్నిహితుడైన జాన్ చర్చిల్, విలియంకు తన అభ్యర్థనను మళ్లీ పునరుద్ఘాటించాడు. తన స్వదస్తూరితో రాసిన ఆ జాబులో, తాను విలియంకు సహాయం చేయడానికి సర్వసన్నద్ధంగా ఉన్నట్లు తెలియజేశాడు. సైన్యంలో మిక్కిలి పలుకుబడిగల జాన్ చర్చిల్, ఆ సైన్యాన్ని జేమ్స్ రాజుకు వ్యతిరేకంగా ఉపయోగించడానికి నిశ్చయించాడు. ఆ విధంగా, రాజును లొంగదీయడానికి, లేదా అతడు ఎదురుతిరగడానికి వీలులేకుండా చేయడానికి, ప్రయత్నించాడు. అతనికి కార్యసాధన విషయాలపై గల ఆసక్తి, ఎట్టి పద్ధతుల ననుసరించినా ఫరవాలేదనిపించేట్లు చేసింది. ఏదో ఒక సైనిక చర్య కొనసాగించినంత వేగంగా, అతడు అన్నిటినీ రూపొందించాడు. కుట్రలో మోసమనేది సదా అంతర్భాగం మాత్రమే.

## 5.12 విలియంకు వర్తమానం

సముద్రానికి ఆవల, ఇంగ్లాండ్‌లోని పరిస్థితులను ఆసక్తిగా కనిపెడుతూ, హాలాండ్ రాజు విలియం తన సైన్యాలను, నౌకాదళాన్ని ఆయత్త పరచాడు. తన అధీనంలో, స్కాట్‌లాండ్‌కు, ఇంగ్లాండ్‌కు

చెందిన దాదాపు ఆరు రెజిమెంట్ల సైన్యాలున్నాయి. ఇది, తన దండయాత్రకు మూలకందమైన సైన్యం. కాని, ఇంగ్లాండ్‌పై దాడిచేయడానికి ముందు, తన పార్లమెంట్ అనుమతిని పొందాలి. జర్మనీలోని ఇతర ప్రొటస్టెంట్ రాకుమారుల సహాయంగూడ, అతనికి అవసరం. ఇంగ్లాండ్‌కు సహాయం చేయడానికై, అప్పటికే ఫ్రాన్స్ తన సైన్యాలను మోహరించి ఉన్నందువల్ల, జర్మన్ రాజులు ఆసక్తిని కనబర్చారు. బ్రాండన్‌బర్గ్ రాజు వెంటనే తన సైన్యాలను పంపడానికి అంగీకరించాడు. ఇతర జర్మన్ రాకుమారులు బ్రాండన్‌బర్గ్ ఉదాహరణను అనుసరించ నిర్ణయించారు. స్పెయిన్ గూడ మత విషయంగా గాక, రాజకీయంగా పరిస్థితులను పరిశీలించి, ఇంగ్లాండ్‌లో కాథలిక్ రాజును వైదొలగించడానికే నిర్ణయించింది. పోప్ గూడ అదే సమయంలో, రాజుకుగల మతాధికారాలను తొలగించాడు. ఆ విధంగా, అన్ని వర్గాల విభిన్న అవసరాలు, విభిన్న ప్రయోజనాలు, విశాల దృక్పథంతో ఏకమై, అందరికీ ఏర్పడ్డ విపత్తును తొలగించుకోడానికై, ఏకోన్ముఖులైనారు. జేమ్స్‌ను ఎదిరించడమే అందరి ధ్యేయమైంది.

అందరు ఫ్రాన్స్‌పై సైనిక చర్యకు ఆసక్తిని చూపారు. ఫ్రెంచి సైన్యాలు హాలాండ్‌పై దండయాత్ర కొనసాగిస్తే, విలియం తన పూర్తి డచ్ సేనలతో ఫ్రెంచివారిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అట్లాగాక, ఫ్రెంచి సైన్యాలు జర్మన్ ఐక్యకూటమిని ఎదుర్కొన్నట్లైతే, విలియం తన దండయాత్రను కొనసాగించవచ్చు. పద్నాల్గవ లూయీ కడపటి దాక తన పథకాలను రహస్యంగా ఉంచాడు. ఫ్రెంచి సహాయాన్ని జేమ్స్ కోరి ఉంటే, లూయి ఖచ్చితంగా హాలాండ్‌ను జయించి వుండేవాడు. కాని, జేమ్స్ దేశాభిమానం, మత దురభిమానం, ఫ్రెంచి సహాయాన్ని కోరడానికి అడ్డు తగిలింది. అతడు కడపటి వరకు తాత్సారం వహించిన కారణంగా, హాలాండ్ ప్రజలు అతడు ఫ్రాన్స్ పక్షంలో ఉన్నాడని, ఫ్రెంచి వారు అతడు హాలాండ్ పక్షం వహించాడనీ, ఊహించారు. అందుచే, ఇంగ్లాండ్ అంతర్యుద్ధం మూలాన బలహీనంగా ఉండాలని కాంక్షించారు. 1688 సెప్టెంబర్‌లో లూయి సైన్యాలను రైన్ నది నుండి ఉపసంహరింప జేశాడు. అప్పటి నుండి విలియంకు ఫ్రెంచిసేనల భయం తొలగింది. డచ్ పార్లమెంట్, ఇంగ్లాండ్‌పై దండయాత్రకు అనుమతించింది. జేమ్స్‌కు ఇక చుక్కెదురైంది.

## 5.13 రాజు కడపటి ప్రయత్నాలు

దేశంలో సైనికులు సమీకరించబడడం, హాలాండ్ సైనికులు యుద్ధానికి సిద్ధం కావడం, ఇవన్నీ ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. జేమ్స్, తనకై ఐర్లాండ్‌లో రూపొందిన రోమన్ కాథలిక్ సైన్యాలను రప్పించడానికై చేసిన ప్రయత్నాలు, విఫలమైనాయి. ఇంగ్లాండ్ ప్రజలు, కాథలిక్‌లకు, ఐరిష్ ప్రజలకు తమ వ్యతిరేకతను వ్యక్తం చేసే విధంగా నాటకాలను రూపొందించి, ప్రదర్శించారు. అనేక పాటలు, పద్యాలను కూర్చి, ప్రొటస్టంట్‌లను దుయ్యబట్టారు. అదే సమయంలో విలియం రాజును పొగడుతూ, అతన్ని నాయకుడుగా వర్ణిస్తూ వచ్చిన రచనలు, బహుళ ప్రచారాన్ని పొందాయి. అనేక వదంతులు, పుకార్లు విన్పించాయి. 'ఐరిష్ సైనికులు వస్తున్నారు; ఫ్రెంచి వారొస్తున్నారు; దేశంలో ప్రొటెస్టంట్ల నందరిని మూకుమ్మడిగా చంపివేయడానికి, కాథలిక్‌లు పథకాలను వేస్తున్నారు; ఎవరినీ నమ్మలేం; చట్టాలు, రాజ్యాంగం అన్నీ వమ్ముఅయినాయి; కాని, వీటన్నిటిని తొలగించడానికి, నాయకుడు రాగలడు; సముద్రాలకు అవతల నుండి అధికారాన్ని అలముకొని, ఇంగ్లాండ్‌ను కాథలిక్ మతాన్నుండి, బానిసత్వం నుండి రక్షించడానికై, రాగలడు' అని, ఎవరికి తోచినట్లు వారు చెప్పుకోడం జరిగింది. ప్రజల్లో ప్రచారంలో ఉన్న ఒక పాట, ఇలా ఉండేది;

BRAOU

"అతడెందుకంత తొందరగా రావడం లేదు?
ఇంకా ప్రొటస్టెంట్ గాలి తోలడం లేదు."

ప్రొటస్టంట్ గాలి ప్రజల హృదయాల్లో బయల్దేరి పెద్దదై, తుఫానుగా మారింది. అది వెంటనే, ఉత్తర సముద్రం వెంట, (North Sea) నెదర్లాండ్ వైపు ఉధృతంగా వీచింది.

## 5.14 అనుచరుల సలహాలు

విలియం దండయాత్రకై చేస్తున్న సన్నాహాలు, ఇంగ్లండ్‌లో ప్రజల ప్రతిఘటన భావాల తీరు, జేమ్స్ అనుచరులను కలవరపరచింది. మంత్రులైన సండర్లాండ్, జఫ్రీస్ లిద్దరూ, తన పద్ధతులను మార్చుకోవాల్సిందని, పార్లమెంట్‌ను సమావేశపరచాల్సిందని సలహా ఇచ్చారు. వివాదాస్పదమైన చర్యల నుపసంహరించి, ప్రొటస్టంట్లతో మైత్రిని జరపడం మేలని, వారు భావించారు. అక్టోబర్ 3వ తేదీన జేమ్స్, మత విషయాల కమీషన్‌ను ఉపసంహరించడానికి, రోమన్ కాథలిక్ పాఠశాలలను మూసివేయడానికి, మాగ్డలిన్ కళాశాలలో ప్రొటస్టంట్ ఆచార్యులను కొనసాగించడానికి, కాథలిక్‌లకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలను అమలు చేయడానికి అంగీకరించాడు. గ్రామీణ ప్రాంతాల్లో తొలగించిన పాలకులు, మళ్లీ అధికారంలో కొనసాగించబడినారు. బిషప్‌లు, తమపై జరిగిన అఘాయిత్యాలను విస్మరించాల్సిందిగా కోరబడినారు. టోరీ పక్ష ప్రముఖులను మళ్లీ న్యాయాధికార వృత్తులను స్వీకరించాల్సిందిగా కోరడం జరిగింది. జేమ్స్ తన పరిపాలనా కాలంలోని కడపటి దినాలలో, తన దైనందిన జీవన విధానాల్లోని ఆర్భాటాలను కూడా విడనాడి, ప్రజలకు అంతవరకు ఆగ్రహం కలిగించిన పద్ధతుల నన్నింటిని వదలిపెట్టాడు. కాని, అప్పటికే ఎంతో ఆలస్యమైంది.

## 5.15 విలియం రాక

1688 అక్టోబర్ 19వ తేదీన, విలియం హాలండ్ నుండి తన నౌకాదళాన్ని కదిలించాడు. అతనికిగల సైన్యం చిన్నదైనా, అది ప్రొటస్టంట్ ఐరోపా కంతటికీ ప్రాతినిధ్యం వహించింది. హాలండ్ స్వీడన్, డెన్మార్క్, ప్రష్యా, ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్ దేశాల సైనికులే గాక, దాదాపు 14 వేల మంది ఫ్రెంచి ప్రొటస్టంట్‌లు గూడ, అతనితో చేరారు. షుమారు ఐదు వందల పడవలతో, అరువది యుద్ధ నౌకలతో విలియం సైన్యం ఆయత్తమైంది. విలియం మొదట, ఇంగ్లాండ్ ఉత్తర ప్రాంతంలో తన సేనలతో దిగడానికి నిర్ణయించాడు. అక్కడ డన్బీ ఉండడంచేత, అక్కడకు చేరుకోడం మేలని తలచాడు. కాని, ఉధృతమైన గాలి మూలాన, విలియం నౌకలన్నీ డోవర్ జలసంధి మీదుగా ఇంగ్లీష్ ఛానల్ సమీపించాల్సి వచ్చింది. ఇటు ఇంగ్లాండ్, అటు ఫ్రాన్స్ తీర ప్రాంతాలను చూస్తూ, తన నౌకలు ఇంగ్లాండ్‌ను సమీపించి, నవంబర్ 5వ తేదీన, డెవాన్ ప్రాంతంలోని టార్బే వద్దకు చేరాయి. విలియం తన సైన్యంతో ఇంగ్లాండ్ తీరం చేరాడు. (ఆ రోజు నల్లమందు కుట్ర జరిగిన దినోత్సవాన్ని, దేశవ్యాప్తంగా పాటించిన దినం.)

విలియం రాక, రాజు జేమ్స్‌కు మొదట పెద్ద కలవరాన్ని కలిగించలేదు. సముద్ర మార్గంగా వర్తమానాలకు అంతరాయం కలిగించి, విలియం రాకను ప్రతిఘటించడానికై ప్రయత్నించాడు. యార్క్ షైర్ కు పంపిన సైన్యాలను ఉపసంహరింపజేశాడు. రాజ సైన్యాలకు నాయకత్వం వహించడానికై, శాలిస్‌బరీని సిద్ధం చేశాడు. ఆ సందర్భంలో జేమ్స్ అధీనంలో, ముందు ఆలివర్ క్రాంవెల్ కున్నంత సైన్యం ఉంది. దాదాపు నలభై వేల సైన్యం రాజుకుంది. నాలుగు వేల స్కాట్ సేనలు కార్లైల్ చేరారు. ఐరిష్ సైన్యాలు చెస్టర్ వరకు మాత్రమే వచ్చాయి. లండన్ నగరాన్ని రక్షించడానికి,

మరో ఏడు వేల సైనికులు అవసరం. ఐనా, మిగిలిన దాదాపు ఇరవై ఐదు వేల సైనికులతో, రాజు శాలిస్‌బరీతో సహా, నవంబర్ 19వ తేదీన, విలియంను ఎదుర్కోడానికి బయల్దేరాడు, ఇంగ్లాండ్ చరిత్రలో అంతవరకెప్పుడూ, అంత పెద్ద సైన్యం ఒక్క సారిగా సమీకరించబడలేదు.

## 5.16 సైనికుల తిరుగుబాట్లు

అప్పటికే ప్రజల సంపూర్ణ సహకారాన్ని కోల్పోయిన జేమ్స్ పక్షంలోని సైనికులు, పెద్ద ఎత్తున పదవులను వదలిపెట్టారు. క్లారండన్ కుమారుడు, లార్డ్ కార్న్‌బరీ, తన అధీనంలోని మూడు అశ్విక దళాల సైన్యంతో, రాజు పక్షాన్ని వదలి, విలియంతో చేరాడు. రాజు సైన్యాల్లో మిక్కిలి పలుకుబడి కల జాన్ చర్చిల్, గ్రాఫ్టన్ డ్యూక్ మొదలైనవారు, రాజును వదలివెళ్లారు. అదే సమయంలో, సారా చర్చిల్ సహాయంతో, 'ఆని' రాకుమారి రాజ ప్రసాదం నుండి తప్పించుకొని, ఉత్తరం వైపు వెళ్ళింది. దేశ వ్యాప్తంగా తిరుగుబాట్లు జరిగాయి. యార్క్‌షైర్ ప్రాంతంలో డన్బీ, డెర్బీషైర్‌లో డెవాన్‌షైర్, చెషైర్‌లో డిలామేర్ మొదలైనవారు, తగు సైన్యంతో సిద్ధంగా ఉన్నారు. ప్లిమౌత్ ప్రాంతాన్ని బాత్ ప్రభువు విలియంకు అప్పజెప్పాడు. బింగ్ (Byng) అనే నౌకాదళాధిపతి విలియం వద్దకు చేరి, ఇంగ్లాండ్ నౌకాదళం, పోర్ట్స్‌మౌత్ రేవు పట్టణం అతని అధీనంలో ఉన్నాయని తెలియజేశాడు. ఒకదాని తర్వాత ఒకటి, అన్ని నగరాలు రాజుకు ఎదురుతిరిగాయి. ఉప్పెన లాంటి ఉద్వేగంతో, ఒక్క సారిగా ఇంగ్లాండ్ ప్రజలు జేమ్స్‌కు ఎదురుతిరిగారు.

## 5.17 జేమ్స్ పలాయనం

ప్రజలను ప్రతిఘటించడం లాభం లేదనుకున్నాడు జేమ్స్. లండన్ నగరంలో ఉన్న మతాధికార్లను, మంత్రులను సమావేశపర్చి, వారితో సమాలోచనలు కొనసాగించి, వారి సలహామేరకు విలియంతో సంప్రదింపులకు దిగాడు. ఇంతలో దండెత్తుతున్న సైన్యాలు లండన్‌వైపు చొచ్చుకొని వచ్చాయి. జేమ్స్ తన భార్యను, కుమారుని, సురక్షితంగా ఇంగ్లాండ్ నుండి పంపివేశాడు. డిసెంబర్ 11వ తేదీ రాత్రి, వైట్‌హాల్ రాజప్రాసాదాన్ని రహస్యంగా వీడి, నదిని దాటి, తీరప్రాంతానికి తన గుర్రం పై చేరుకున్నాడు. తన రాజ్యాన్ని అరాచకం పాలు చేయడానికి వెనుదీయని జేమ్స్, రాజముద్రను థేమ్స్ నదిలో పారవేశాడట. సైనిక నాయకుడైన ఫెవర్‌షామ్ (Fever Sham)ను సైన్యాన్ని రద్దు చేయవల్సిందని ఆదేశించాడు. డార్ట్‌మౌత్ అను మరొక అధికారిని, ఐర్లాండ్‌కు తప్పించుకొని పొమ్మన్నాడు. ఐర్లాండ్‌లో మతకలహాలు చెలరేగాయని, అనేకులను వధిస్తున్నారనే వదంతులు చెలరేగాయి. లండన్‌లో అనేక మూకలు విదేశీ దౌత్యకార్యాలయాలను ధ్వంసం చేసి, కాల్చారు. రాజధానీ నగరంలో భయంకర వాతావరణం ఏర్పడింది. ఆరాత్రి "ఐరిష్ రాత్రి" (Irish Night) గా ప్రసిద్ధి పొందింది. రాజు చెంతగల కౌన్సిల్, కొంత రాజకీయ చతురతతో వ్యవహరించకపోతే, పరిస్థితి దిగజారిపోయి, దేశంలో నిజంగా అరాచక పరిస్థితులేర్పడి ఉండేవి. రాజు నగరాన్ని వీడినా, లండన్‌లోనే సమావేశమైఉన్న కౌన్సిల్, దేశవ్యాప్తంగా చెలరేగిన అలజడిని అణచి, విలియం అధికారాన్ని గుర్తించి, లండన్‌కు చేరుకోవలసిందిగా ఆహ్వానాన్ని అందజేసింది. జేమ్స్ తాను తప్పించుకునే ప్రయత్నంలో ఒక పడవ ఎక్కాడు. కాని, అది అనువైన గాలిలేక పోవడంతో, కదలలేక పోయింది. అక్కడ బెస్తవారికి, మరికొంతమంది పురజనులకు పట్టుబడిన జేమ్స్‌ను, లండన్‌కు తీసుకొచ్చారు. కాని, కొద్ది రోజుల తర్వాత, ఇంగ్లాండ్ భూభాగాన్నుండి తప్పించుకోగలిగాడు. అంతే, అతడు మళ్లీ తిరిగి రాలేదు. పారిపోవడం చాల అవమానకరమైన పని అయినా, చరిత్ర అతనికి హుందాతనాన్ని, రాజసాన్ని

BRAOU

గొప్పగానే ఆపాదించింది. విన్‌స్టన్ చర్చిల్ "A History of the English Speaking Peoples అన్న గ్రంథంలో అన్నట్లు, "మతంకై అతడు చేసిన త్యాగం చేత, కాథలిక్ మతాన్నుండి శాశ్వతమైన గౌరవాన్ని పొందగలిగాడు. అతడు తన జీవితాంతం ప్రవాసంలోనే గడపుతూ, మర్యాదపూర్వకమైన, రాజసం ఉట్టిపడే గంభీర ప్రవర్తనను, తనతోబాటు తీసుకెళ్లాడు."

## 5.18 సంగ్రహంగా

1685 లో జేమ్స్ సింహాసనానికి వచ్చిన సమయంలో, నిజానికి అతని మద్దతుదార్లు, అభిమానులు, దేశంలో కొల్లలు. అంతకు ముందు మినహాయింపు చట్టాన్ని (Exclusion Bill) ప్రవేశపెట్టి, జేమ్స్‌ను సింహాసనానికి రాకుండా చేయాలనే ప్రయత్నాల మూలంగా, అతనిపై అనేకులకు అభిమానం ఏర్పడింది. అందుచే, 1685 రాజరికం అమిత శక్తివంతమైందిగా కనిపించింది. కాని, రాజు అన్ని వర్గాల వారికి ఆగ్రహపాత్రుడైనాడు. 1685 ఫిబ్రవరి 6వ తేదిన రాజుగా ప్రకటితమైన రెండో జేమ్స్, నాలుగేళ్లు కూడా నిండక ముందే పదవీచ్యుతుడై, ఫ్రాన్స్‌లో దేశాంతర వాసం గడపాల్సిన అవసరం ఏర్పడుతుందని, ఎవరూ ఊహించలేదు.

జేమ్స్ పారిపోవడం, అతని నిరంకుశ విధానానికి సంభవించిన అపజయానికి నిదర్శనం. తన్ను తాను రక్షించుకోడానికే గాక, తన తర్వాత స్వేచ్ఛాయుత పార్లమెంట్ సమావేశమై, ముందులాగే రాజుపై గట్టి చర్య గైకొంటుందని కూడా, జేమ్స్ భావించాడు. తన తర్వాత ప్రభుత్వం సవ్యంగా కొనసాగకుండా చేయడానికై, ఎన్నికలకు సంబంధించిన పత్రాలను చించివేయడం, రాజముద్రను లండన్ నగరంలో ప్రవహించే థేమ్స్ నదిలో పారవేయడం, చేశాడు.

అట్టి ప్రవర్తనవల్ల, జేమ్స్‌ను విగ్ నాయకులు కూడా ఏవగించుకున్నారు. దేశం వీడి పారిపోవడమే, జేమ్స్‌కు శ్రేయస్కరమనిపించింది.

B R A O U

## 5.19 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. 1688 విప్లవానికి రెండో జేమ్స్ అనుసరించిన విధానాలు ఎంతవరకు కారణమైనాయి?
2. 1688 విప్లవం ఏ విధంగా తీసికొనిరాబడింది?
3. అంతర్యుద్ధ సమయంలో అంకురించిన ప్రజల రాజకీయ ఆశయాలు, 1688-89 విప్లవంతో సిద్ధించినాయనడంలో, ఎంత నిజం కలదో వివరించండి.
4. రెండో జేమ్స్‌కు పుత్ర జననం ఎటువంటి పరిణామాలకు దారితీసింది?
5. మహోజ్వల విప్లవ ప్రధాన ఫలితాలను విశ్లేషించండి.

**II. కింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. మాన్‌మౌత్ వారసత్వపు పోటీ

2. రెండో జేమ్స్, పార్లమెంట్ మధ్య సంబంధాలు

3. ఫ్రాన్స్ అనుసరించిన మత విధానాలు

## 5.20 ఉపయుక్త గ్రంథాలు


Hilaire Bellock : **James II**

F.M.G. Higham ; **King James II**

F.W. Maitland : **Constitutional History of England**

G.M. Trevelyan : **England Under the Stuarts.**

John Miller : **The Glorious Revolution**

J.P. Kenyon : **Stuart England**

J.R. Jones : **The Revolution of 1688 in England, rpt., 1988**

T.B. Macaulay : **History of England , 6 vols.**

Q.R.D. Skinner : **History and Idealogy in the English Revolution**

R.G. Richardson : **The debate on the English Revolution, London, 1976**


BRAOU

# భాగం-6 : పార్లమెంట్ పాత్ర : విలియం, మేరీల పాలన (1688-1702)

విషయక్రమం

6.0 లక్ష్యాలు

6.1 విలియం, మేరీల ప్రాధాన్యత

6.2 విప్లవ పరిసమాప్తి

6.3 స్టూవర్ట్ రాజుల వంశ వృక్షం

6.4 మూడో విలియం : కాబినెట్ పద్ధతి

6.5 పార్లమెంట్ ద్వారా కొత్త శాసనాలు

6.6 పన్నుల వసూళ్లు

6.7 నాణేల సంస్కరణ

6.8 స్కాంట్‌లాండ్‌తో సంబంధాలు

6.9 ఐర్లాండ్ : మూడో విలియం

6.10 విలియం : ఫ్రాన్స్‌తో యుద్ధం (1690-97)

6.11 స్పానిష్ వారసత్వ యుద్ధం

6.12 సంగ్రహంగా

6.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

6.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 6.0 లక్ష్యాలు

రెండో జేమ్స్ ఇంగ్లాండ్‌ను విడిచి, పారిపోయిన పిదప, కొద్దికాలం దేశంలో ఏర్పడ్డ అస్తవ్యస్థ పరిస్థితి, అంతకుముందు అంతర్యుద్ధంలో ఏర్పడ్డ పరిస్థితిని పోలిఉంది. ఇంగ్లాండ్ ప్రజలు తమ ఆశలన్నీ, జేమ్స్ పెద్ద కుమార్తె మేరీ వారసత్వంపై పెట్టుకొన్నారు. కాని, ఐరోపా దేశాలకు, మేరీ సింహాసనానికి రావడానికన్నా, ఆమె రాక మూలంగా ఆమె భర్తైన విలియంకు సంక్రమించే అధికారం, ముఖ్యం. ఐరోపా రాజ్యాలన్నీ ఫ్రాన్స్ పాలకుడైన పద్నాల్గో లూయితో పోరాడే సమయంలో, ఇంగ్లాండ్‌లోని విప్లవం ఐరోపా రాజకీయాల్లో మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకొంది. విలియం, మేరీలు ఇంగ్లాండ్

సింహాసనానికి రావడం, రాజ్యాంగపరంగా కూడ అత్యధిక ప్రాధాన్యత గలది. వారు సింహాసనాన్ని ఆక్రమించుకోవడం, "సైనిక విజయం" మూలంగా గాక, "పార్లమెంట్ నిర్దేసించినందు చేత" గాన, విలియం కాలంలో జాతీయ ఆర్థిక వనరులపై పార్లమెంట్ అధికారాన్ని నెరపుకోవడం కూడ, ముఖ్య విషయమే. ఈ పాఠంలో, విలియం, మేరీలు ఇంగ్లాండ్ సింహాసనానికి రావడం, వారి పాలనా కాలంలో పార్లమెంట్‌తో సంబంధాలు, విలియం సాధించిన మత, రాజకీయ సామరస్యం, మొదలైన వాటిని చర్చించడం జరిగింది. ఇంగ్లాండ్ విలియం నాయకత్వం కింద అనుసరించిన విదేశీ విధానం గూడ, ఇందలి ప్రధానాంశం.

1688 సంవత్సరాంతానికి, ఇంగ్లాండ్ ఎంతో పలుకుబడి గల దేశంగా పరిగణన చెందింది. అంతర్యుద్ధం అంతమైందని రుజువు చేసుకోగలిగింది. విలియం, మేరీలు ఇంగ్లాండ్ రావడానికి విగ్‌లు, టోరీలు, ఇరు పార్టీలు కారణమైనందున, అధిక సంఖ్యాకులైన ప్రజలు వారి రాకను హర్షించారు. సింహాసనాన్ని వారిరువురికి ప్రదానం చేశారు. సుదీర్ఘమైన ఇంగ్లాండ్ చరిత్రలో, సింహాసనాన్ని సమానంగా ఇద్దరు పంచుకోవడం, విలియం, మేరీల కాలంలో మాత్రమే జరిగింది. 1694లో మేరీ మరణించిన తర్వాత, విలియం మాత్రమే ఇంగ్లాండ్ రాజుగా, తాను 1702 లో మరణించేవరకు కొనసాగాడు. విలియం తర్వాత, మేరీ సోదరైన ఆని, రాణిగా ప్రకటితమైంది. 1702 నుండి 1714 వరకు పరిపాలించి, ఆని మరణించింది. ఆమెకు సంతానం లేని కారణంగా, జర్మనీలోని హనోవర్‌కు చెందిన జార్జి, ఇంగ్లాండ్‌కు రాజైనాడు. దీంతో, హనోవరియన్ వంశ పాలన మొదలైంది.

## 6.1 విలియం, మేరీల ప్రాధాన్యత

మూడో విలియం, మేరీలు ఇంగ్లాండ్ సింహాసన మధిష్టించడానికి, రాజ్యాంగ ప్రాముఖ్యం ఎంతైనా ఉంది. వీరు అధికారానికి రావడంతో, పార్లమెంట్ ప్రాధాన్యం పెరిగింది. వీరిద్దరు, దేశాన్ని జయించడం కాదు. సింహాసనాన్ని ప్రజాభిమానంతో అధిష్టించారు. అందుచేత, రాజరికానికి గౌరవం, మర్యాదలు ఏర్పడ్డాయి. అంతేకాదు, మూడో విలియం పాలనా కాలంలో జాతీయ ఆర్థిక విధానాలపై పార్లమెంట్ పూర్తి ఆధిక్యతను స్థాపించుకొంది. ప్రతి సంవత్సరం తగిన నిధులను కేటాయించడం, ఆదాయ వ్యయాల పద్దులను పరిశీలించడం వంటి కీలక కార్యాలను, పార్లమెంట్ నిర్వర్తించడం ప్రారంభించింది. దీని మూలంగా ప్రతి సంవత్సరం పార్లమెంట్‌ను సమావేశపర్చడం, ఆదాయవ్యయ బడ్జెట్‌లు ఆమోదం పొందడం, పరిపాటి అయింది. సంవత్సరానికిపైన పార్లమెంట్‌ను సమావేశపర్చక పోయినట్లైతే, రాజుకు కావాల్సిన నిధులు లభ్యం కావు. అందువల్ల, రాజు తప్పని సరిగా ప్రతి సంవత్సరం పార్లమెంట్‌ను సమావేశపర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదేగాక, 'మ్యూటినీ' చట్టాన్ని ప్రవేశపెట్టి, రాజు సర్వదా ఒక సర్వసిద్ధ సైన్యాన్ని రూపొందించి, సైనిక పాలనతో క్రమశిక్షణను పాటించడానికి వీలైంది. ఇది ఒక సంవత్సరానికి మాత్రమే పరిమితమైన కారణంగా, దీన్ని ఏటేటా పొడిగించడానికై, పార్లమెంట్ ప్రమేయం అవసరమయ్యేది. ఈ విధంగా, పార్లమెంట్ అధికారాలను విస్తరించడం జరిగింది. మూడో విలియం కాలంలో పత్రికా స్వాతంత్ర్యం గూడ గుర్తింపు పొందింది. ఇంగ్లాండ్‌లో పత్రికా రచయితలు దేన్ని గురించైనా విమర్శనాత్మక రచనలు చేయవచ్చుని కాని, అట్టి విమర్శలు రుజువైతే, పర్యవసానంలో క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా, శాసించడం జరిగింది.

విలియం ఇంగ్లాండ్ సింహాసనమాక్రమించుకొన్న తర్వాత, ఐరోపా రాజకీయాల్లో ఇంగ్లాండ్ ప్రధాన పాత్ర వహించింది. ఇంగ్లాండ్‌కు రాక పూర్వం, మూడో విలియం హాలాండ్ రాజుగా ఫ్రాన్స్‌కు విరోధులైన అన్ని ఐరోపా శక్తులకు నాయకత్వం వహించాడు. దీంతో, ఐరోపా రాజకీయాల్లో ఫ్రాన్స్ ఆధిక్యతను తగ్గించి, సమతౌల్యాన్ని స్థాపించడానికి ఇంగ్లాండ్ ప్రయత్నిస్తూ వచ్చింది. మత విషయాల్లో గూడ, విలియం రాకతో కొత్త అధ్యాయం ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రొటెస్టంట్ నాయకుడైనా, విలియం మత సామరస్యాన్ని పాటించాడు. ప్రొటెస్టంట్‌లను ఎదిరించిన వారికి గూడ, ఇంగ్లాండ్‌లో ప్రార్థనా స్వేచ్ఛను కల్పించాడు. అందువల్ల, కొన్ని వర్గాలు విలియంను విమర్శించాయి గూడా. అట్టి విమర్శకులను విలియం ప్రభుత్వ ఉద్యోగాలనుండి తొలగించాడు. అట్టి వారు 'జాకోబైట్' అనే పేరుతో, దేశం వీడి పోయిన జేమ్స్‌కు, మద్దతుదార్లుగా మారారు.

## 6.2 విప్లవ పరిసమాప్తి

దేశంలోని ప్రజల అభీష్టాలు ప్రతిబింబించే విధంగా, పార్లమెంట్‌లోని రెండు సభలూ ప్రవర్తించాయి. అనేక చర్చల అనంతరం, 1689 ఫిబ్రవరి 13వ తేదీన, విలియం, మేరీలను ఉమ్మడిగా సింహాసనాన్ని అధిష్ఠించాల్సిందని, కోరడం జరిగింది. మరుసటి దినం దీన్ని నిర్ణయిస్తూ, ప్రకటన వచ్చింది. పార్లమెంట్ చేసిన ఈ ప్రకటన, ఒక విధంగా రాజీ పడ్డ విధ మనవచ్చు. ప్రభువుల సభలోని సభ్యులందరు, జేమ్స్ సింహాసనాన్ని వీడి వెళ్లినందున, ప్రత్యేకమైన ఒక చట్టం అవసరమని భావించారు. అంతకు ముందు, 1654 లో స్వీడన్ రాణి క్రిస్టీనా సింహాసనాన్ని వదలిపెట్టిన దృష్టాంతాన్ని, వారు ఉటంకించారు. కామన్స్ సభ్యులు సింహాసనాన్ని "త్యజించాడు" అన్న పదం చట్ట విరుద్ధమని, నిరాకరించారు. పార్లమెంట్‌లోని ఇరు సభలలోని సభ్యులు, విలియం, మేరీలను వారసులుగా ప్రకటిస్తూ, ప్రకటనల్లోని పదజాలం భవిష్యత్తులో ఏవిధమైన సమస్యలను సృష్టించకుండా, జాగ్రత్త వహించారు. మేరీ తనకన్న ముందు మరణించిన, మూడో విలియం రాజుగా కొనసాగడానికి, వారికి సంతానం లేకపోతే వారి తర్వాత మేరీ సోదరైన ఆని ఇంగ్లాండ్ సింహాసనానికి వారసురాలిగా ప్రకటితమైంది. ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌ను నిర్లక్ష్యం చేశారు. 1688 లో జన్మించిన రెండో జేమ్స్ కుమారుడు గూడ, సింహాసనానికి ఏ పరిస్థితుల్లోను అర్హుడు కాడని నిర్ధారించడం జరిగింది. పార్లమెంట్ రూపొందించిన సుదీర్ఘ ప్రకటనలో, "జేమ్స్" ప్రభుత్వాన్ని త్యజించినందువల్ల, సింహాసనానికి తద్వారా ఖాళీ ఏర్పడింది" అన్న వాక్యం మూలాన, చట్టబద్ధమైన, పరస్పర విరుద్ధ నిర్వచనాలకు తావులేకుండా పోయింది.


సింహాసనంతోబాటు, విలియం, మేరీలకు ఒక హక్కుల పత్రాన్ని (Declaration of Rights) కూడ సమర్పించారు. ఇది ఎంతో తొందరగా కామన్స్ సభలో రూపొందించబడి, ఎగువ సభ ఆమోదాన్ని పొంది, రాజ దంపతులకు అందించబడడం జరిగింది. ఇందు ప్రారంభంలో, రెండో జేమ్స్‌కు ఇంగ్లాండ్ జాతి ఏ విధంగా ఎదురుతిరిగిందో తెలియజేస్తూ, అతని చేతలు అన్నీ గూడ చట్టవిరుద్ధమైనవని, రాజ్యాంగ విరుద్ధమైనవని ప్రకటించడం జరిగింది. అందులో భవిష్యత్ కార్యక్రమాలను గూడ ఉదహరించారు. వీటిని అంగీకరించడం, తనకు పెట్టిన షరతులుగా విలియం భావించక పోయినా, అతడు తన సమాధానంలో వీటిని అంగీకరించినట్లుగా తెలియపర్చాడు. తదనంతర పరిస్థితులను పరిశీలిస్తే, విలియం అట్టివాటిని అతి వేగంగానే చట్టబద్ధం గావించడానికి ప్రయత్నించాడని చెప్పవచ్చు. కొంత చర్చ కొనసాగిన తర్వాత, రాజుకు హక్కుల పత్రాన్ని సమర్పించిన సమాఖ్య (Convention), తానే న్యాయబద్ధమైన ప్రజాప్రతి నిధుల సభ యని ప్రకటించుకొని, అంతవరకు తీసుకొన్న చర్యలన్నీ చట్టబద్ధమైనవిగా గుర్తించి,



BRAOU

విలియం మేరీలకు సింహాసనాన్ని అర్పించడం, తమ అధికార పరిధిలోనిదని ప్రకటించి, 1689 మే నెల్లో రద్దైంది. ఆగస్ట్ నెలలో ఈ హక్కుల ప్రకటన (Declaration of Rights), హక్కుల చట్టంగా (Bill of Rights) అమల్లోకి వచ్చింది.

## 6.3 స్టూవర్ట్ రాజుల వంశ వృక్షం




## 6.4 మూడో విలియం : కాబినెట్ పద్ధతి

మూడో విలియం కాలంలో కాబినెట్ పద్ధతికి అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. ఇంగ్లాండ్‌లోని టోరీ, విగ్ పక్షాలకు చెందినవారు పార్టీ విభేదాలను విస్మరించి, అతనికి ఆహ్వానం పంపారు. అందుచేత, విలియం ప్రారంభంలో తన మంత్రులను ఇరు పక్షాల నుండి ఎన్నుకొన్నాడు. విలియం విదేశీ విధానం, ముఖ్యంగా యుద్ధ విధానాలను, టోరీలు విమర్శించారు. అందుచేత, క్రమేణా విలియం తన మంత్రులను విగ్ పార్టీ నుండి మాత్రమే ఎన్నుకొనసాగాడు. ఒకే పార్టీ నుండి మంత్రులను నియమించడంచేత, వారిలో ఐక్య భావం, రాజు ఎడ ఉమ్మడి బాధ్యత పెరిగింది. కామన్స్ సభలో అధిక సంఖ్యాకులైన పార్టీ నుండి మాత్రమే మంత్రులను నియమించడం, ఆ మంత్రులు పార్లమెంట్‌కు బద్ధులై ఉండడం, పరిపాటి అయింది. విగ్‌లు మెజారిటీని కోల్పోయి, టోరీలు అధిక సంఖ్యాకులైన సమయంలో, మూడో విలియం తన విగ్ మంత్రులను తొలగించి, వారి స్థానే టోరీ మంత్రులను నియమించాడు. ఆ విధంగా విలియం కాలంలో, పార్లమెంట్ దిగువ సభలోని మెజారిటీ పార్టీ మంత్రివర్గం తీరును నిర్ధారించింది. అందుచేత, ఇంగ్లాండ్‌లో విలియం కాలంలోనే మంత్రివర్గం ఏర్పడిందని చెప్పవచ్చు.

## 6.5 పార్లమెంట్ ద్వారా కొత్త శాసనాలు

మూడో విలియం అధికారానికి వచ్చిన తర్వాత, వెంటనే ఆయన దృష్టిని ఆకర్షించిన సమస్యలు రెండు. ఒకటి సైన్యం; రెండోది, ఆర్థిక విధానం. రాజు సైన్యాన్ని రూపొందించుకోవచ్చు. కాని, పార్లమెంట్ దానిపై అధికారాన్ని వహించి, సైనిక ప్రవర్తనా నియమావళి వంటి అన్ని విషయాలను సమీక్షించాలి. సైన్యం లోని క్రమశిక్షణా విషయాల ప్రత్యేక నియమావళికి "మార్షల్‌లా" అని పేరు. దీనికి పార్లమెంట్ అనుమతి మిక్కిలి అవసరం. అదే విధంగా, అనేక ఇతర చట్టాలు గూడ అవసరమైనాయి. 1689 నాటి మ్యూటినీ చట్టం, సైనిక చట్టం (Army Act) గా పరిగణనకు వచ్చింది. సైనిక ఖర్చులకు పార్లమెంట్ ప్రతి సంవత్సరం, అవసరమయ్యే మొత్తాలను మంజూరు చేసేది. అందుచేత, దేశంలోని సైన్యం "రాజు సైన్యం" అనడానికన్న, పార్లమెంట్ మీద ఆధారపడ్డ జాతీయ సైన్య మనడం ఎంతో సమంజసం.

మహోజ్వల విప్లవం, అంతకు ముందు పునరుద్ధరణ కాలంలో వలె, ఇంగ్లాండ్‌లోని ప్రొటస్టంట్‌ల పలుకుబడి పెరగడానికి దోహదం చేసింది. కాల్విన్ సిద్ధాంతాల ననుసరించిన మూడో విలియం, రాజకీయ నియామకాల్లో మతానికి ప్రాముఖ్యతను ఇవ్వలేదు. ఇంగ్లాండ్ చేరుకున్న వెంటనే, దేశంలోని ప్రధాన మత నాయకులతో విలియం సంప్రదింపులు కొనసాగించి, మత విషయంలో సమగ్ర అవగాహనకు ప్రయత్నించాడు. ఆంగ్లికన్‌లల్లో మిక్కిలి ప్రధాన నాయకులు గూడ, ప్రొటస్టంట్‌లు అందరూ ఐక్యంగా ఉండాలని విశ్వసించారు. కాథలిక్‌లను అదుపులో ఉంచడానికి, ప్రొటస్టంట్ల ఐక్యత ఒక్కటే మార్గమని వారు భావించారు. ఈ ఉద్దేశంతోనే, పార్లమెంట్‌లో 1689 లో రెండు చట్టాలను ప్రవేశపెట్టడం జరిగింది. అవి 1. కాంప్రహెన్షన్ బిల్ ( Comprehension bill ) 2. టాలరేషన్ బిల్ (Toleration Bill). 1680 లో ప్రవేశపెట్టబడిన చట్టాల్లాగా, ఇవి మత సహనాన్ని ప్రాతిపదికగా గుర్తించాయి.

ఇంగ్లాండ్‌లో ఆంగ్లికన్ మతాన్ని అనుసరించని ఇతర ప్రొటస్టంట్ అనుయాయులు, కాథలిక్ మతస్థుల లాగే, అనేక సమస్యల నెదుర్కొన్నారు. 1689 లో మూడో విలియం అధికారానికి వచ్చిన తర్వాత అమలుపర్చిన మత సహన చట్టం (టాలరేషన్ ఆక్ట్) వల్ల, అట్టి సమస్యలను తొలగించడం జరిగింది. అంతకు మునుపు అమల్లో ఉన్న క్లారండన్ కోడ్, టెస్ట్ ఆక్ట్ వంటి చట్టాల మూలాన ఏర్పడే ప్రతిబంధకాలన్నీ తొలగిపోయాయి. రాజకీయంగా, ఆంగ్లికన్ మతేతరులకు సమాన హక్కులు లేవు. వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. టాలరేషన్ చట్టం, దాని పరిధిలో నుండి కాథలిక్‌లను మినహాయించింది. కాథలిక్కులు తప్ప తక్కిన అన్ని వర్గాల వారు తమకు నచ్చిన మతాన్ని అవలంబించు అవకాశాన్ని పొందినా, కాథలిక్‌లకు మాత్రం ఇట్టి సౌకర్యం నిరాకరించడం జరిగింది. ప్రొటస్టంట్లందరికీ రాజకీయ ఉద్యోగాలు నిర్వహించే అవకాశాన్ని కల్పించారు. టెస్ట్ ఆక్ట్, కార్పొరేషన్ ఆక్ట్ వంటివి, 1828లో అధికారికంగా రద్దు చేయబడినా, అవి 1689 నుండి నామమాత్రంగా మాత్రమే కొనసాగినాయి. 1694లో ట్రియన్నియల్ చట్టం ప్రవేశపెట్టబడింది. దీని మూలంగా, ఏ పార్లమెంట్‌గూడ మూడేళ్ల కన్న ఎక్కువకాలం కొనసాగడానికి వీల్లేదు. అదే విధంగా, ఒక పార్లమెంట్, మరో పార్లమెంట్ సమావేశానికి మధ్య, మూడేళ్ల కన్న ఎక్కువ కాలవ్యవధి ఉండరాదు. ఒకటో ఛార్లెస్ పార్లమెంట్ ప్రమేయం లేకుండా పరిపాలన కొనసాగిస్తే, రెండో ఛార్లెస్ దీర్ఘకాలిక పార్లమెంట్‌కు అదేవిధమైన అవాంతరాలను కల్గించాడు. ఒకసారి అతని కాలంలో పార్లమెంట్ 18 ఏండ్లు కొనసాగింది. మూడో విలియం వచ్చిన తర్వాత, అటువంటి అవాంతరాలు జరగకుండా తగిన జాగ్రత్త తీసుకొని, పార్లమెంట్ అట్టి ట్రియన్నియల్ చట్టాన్ని అమలుపర్చింది.

## 6.6 పన్నుల వసూళ్లు

మూడో విలియం, తనకు అవసరమైన నిధులను పార్లమెంట్ మంజూరు చేయాలనే భావించాడు. కాని, దానికి భిన్నంగా, పార్లమెంట్ అటువంటి అధికారాన్ని తన పరం చేసుకుంది. కాని, అంతకు ముందు సంభవించిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, పార్లమెంట్ జీవితాంతం తనకు నచ్చిన విధంగా పన్నులు వసూలు చేసుకొనే అధికారాన్ని రాజుకు ఇవ్వడానికి, సుముఖత చూపలేదు. కాని, అదే సమయంలో "దేశాన్ని రక్షించిన" మూడో విలియంకు, అటువంటి సౌకర్యాన్ని ఏవిధంగా నిరాకరించగలదు? అందుచేత, దేశంలో శిస్తు వసూలు విధానాల్లో తులనాత్మకంగా మార్పులు తీసుకొని రావాలని సూచించింది. అంతవరకు, రాజుకు అయ్యే ఖర్చులకై, రెండో జేమ్స్‌కు ఇచ్చిన మొత్తాలను మంజూరు చేసింది. 1660 కాలంలో మాదిరి, రాజుకు ఖజానా నుండి వచ్చే ధనం చాలక పోయింది. రెండో జేమ్స్‌కు సంవత్సరానికి 20 లక్షల పౌన్లు మంజూరయ్యేది. కాని, ఈ మొత్తాన్ని అధికంగా భావించిన కామన్స్ సభ, మూడో విలియంకు తగ్గించడానికి సూచించింది. వారి అంగీకారం లేందే, కొత్త పన్నులను విధించరాదని భావించారు. హక్కుల పత్రంలో సూచించిన విధంగా, కొత్త పన్నులు పార్లమెంట్ అనుమతి లేనిదే విధించరాదనేది, అందరూ ఎరిగిందే. 1689 నవంబర్‌లో, జేమ్స్ కాలంలో అనుమతించిన మొత్తాన్ని మంజూరుచేస్తూ, మరో 20 లక్షల పౌన్లు యుద్ధం కొనసాగించడానికని ప్రత్యేకంగా విలియంకు మంజూరుచేసింది. యుద్ధ ఖర్చులు దీనికన్న ఎక్కువగా ఉండాలనే విషయం తెలిసిగూడ, ఈ మొత్తాన్ని మాత్రమే సూచించింది. దానివల్ల, విలియం పదేపదే పార్లమెంట్‌ను కొత్త మొత్తాల కోసం ఆశ్రయించాలన్నది ధ్యేయం. ఆర్థిక పద్దులు గూడ, డిసెంబర్ నాటికి సమగ్రంగా తయారుచేయేబడేవి గాని, అవి గూడ ఒక సంవత్సరానికి మాత్రమే పరిమితం అయినాయి.

## 6.7 నాణేల సంస్కరణ

మూడో విలియం కాలంలో, ఇంగ్లాండ్‌లోని నాణేల చెలామణీ తీరు, సంతృప్తికరంగా ఉండేది కాదు. నాణేల్లోని విలువైన లోహాల కోసమై, నాణేలను అక్రమంగా కరగించే పద్ధతి, విస్తృతంగా కొనసాగింది. దీనివల్ల, నాణేల మీద నమ్మకం తగ్గింది. 1697 లో ప్రభుత్వం పాత నాణేలన్నిటిని ఉపసంహరించింది. ప్రతిగా, ప్రజలకు కొత్త నాణేలను ప్రవేశపెట్టింది. ఇవి శాస్త్రీయ పద్ధతిలో ముద్రింపబడిన కారణంగా, అక్రమంగా కరగించడానికి వీల్లేకపోయింది. కొత్త ద్రవ్యవిధానం దేశంలో వర్తక వాణిజ్యాలకు మంచి ప్రోత్సాహాన్ని కల్గించింది.

విలియం కాలంలోనే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (Bank of England) స్థాపనకు పునాది పడింది. 1694 లో ప్రారంభమైన యీ బ్యాంక్, ప్రభుత్వానికి గూడ తగిన రుణాలను ఇవ్వడంతోబాటు, సంపన్న వర్తకుల నిధులతో డిపాజిట్లను ప్రోత్సహించింది. కాలక్రమేణ, ఇది పెట్టుబడిదార్ల మొత్తాలకు మంచి రక్షణ గల్పించి, పెద్ద లాభాలను ఆర్జించగల్గింది. ప్రభుత్వానికి గూడ, దీని నుండి అమిత సౌకర్యాలు లభించాయి.

మూడో విలియం పరిపాలనా కాలంలోనే, ఇంగ్లాండ్‌లో "జాతీయ రుణ వికాసం" ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆర్థిక విషయాల మంత్రైన చార్లెస్ మాంటేగ్, ప్రభుత్వ జామీనుపై పెద్ద మొత్తాలను రుణంగా పొందే విధానాన్ని ప్రవేశపెట్టాడు. దీనివల్ల, ప్రజలు రాజుకు వ్యక్తిగతంగా రుణాలను

అందజేయు నవసరం లేదు. కాని, వారు దేశానికి అప్పు అందజేయవచ్చు. అటువంటి రుణాలపైన వడ్డీ చెల్లించే ఏర్పాట్లు జరిగాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ స్థాపన, దీంతోపాటు జాతీయ రుణ పద్ధతిని ప్రవేశపెట్టడం మూలాన, మూడో విలియం అధికారం విస్తృతంగా పెరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు, రాజుకు, రుణాలను అందజేసినవారు, విలియంకు సన్నిహితులుగా, మంచి మద్దతుదార్లుగా పరిగణన పొందారు.

## 6.8 స్కాట్‌లాండ్‌తో సంబంధాలు

ఇంగ్లాండ్‌లో విప్లవం రక్తరహితమైందిగా ఉన్నా, స్కాట్‌లాండ్, ఐర్లాండ్‌ల్లో దీనికి భిన్నంగా పరిణమించింది. రెండో జేమ్స్ ఇంగ్లాండ్ వీడి వెళ్లిన తర్వాత, విలియం, మేరీలను స్కాట్‌లాండ్ ప్రజలు తమ నాయకులుగా అంగీకరించారు. కాని, విస్కౌంట్ డండీ (Dundee) అనే అతని నాయకత్వంలో, కొన్ని ప్రాంతాల్లో జేమ్స్‌కు మద్దతును ప్రకటించి, మూడో విలియంకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. 1689లో కిల్లిక్రాంకి (Killecrankie) వద్ద జరిగిన యుద్ధంలో, జనరల్ మాకె (Mackay) నాయకత్వంలోని ఇంగ్లాండ్ సైన్యాన్ని, డండీ ఓడించాడు. కానీ, విజయం సాధించిన డండీని, చంపడం జరిగింది. నాయకుడు మరణించిన తర్వాత, స్కాట్ తిరుగుబాటుదార్లు యుద్ధం కొనసాగించడానికి వీల్లేక, తిరుగుముఖం పట్టారు.

స్కాట్‌లాండ్ ప్రజలతో రాజీపడడం మేలని తలచిన మూడవ విలియం, 1691 సంవత్సరానికి తిరుగుబాటుదార్లందరూ తనకు విధేయులుగా ఉండాలని ప్రకటిస్తూ, వారందరూ ప్రమాణం చేయాలని నిర్దేశించాడు. తిరుగుబాటు నాయకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, గ్లెన్‌కో (Glencoe) అనే తెగకు చెందిన నాయకుడు మెక్డొనాల్డ్, అట్టి ప్రమాణాన్ని చేయడానికి నిరాకరించాడు. ఈ విషయం తెలిసిన మూడో విలియం, వెంటనే మెక్డొనాల్డ్‌ను, అతనితోబాటు గ్లెన్‌కో తెగకు చెందిన అందరినీ రూపుమాపవలసిందిగా, ఉత్తరువు జారీ చేశాడు. ప్రత్యేకమైన సైనికాధికారులను అందుకై నియమించాడు. కాంప్‌బెల్స్ అని పిలువబడే సైనికాధికార్లు, మెక్డొనాల్డ్‌తో బాటు గ్లెన్‌కో తెగకు చెందిన అందరినీ నిర్దాక్షిణ్యంగా వధించారు. దీనికే "గ్లెన్‌కో హత్యాకాండ" అని పేరు. దీనివల్ల, ఇంగ్లాండ్‌కు స్కాట్‌లాండ్‌కు మధ్య ఉన్న సంబంధాలు, పూర్తిగా దిగజారిపోయాయి. ఈ కారణంచేత, ఇరు దేశాల మధ్య భవిష్యత్తులో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

## 6.9 ఐర్లాండ్ : మూడో విలియం

ఐర్లాండ్‌లో పరిస్థితులను చక్కబరచడం, మూడో విలియంకు అంత సులభంగా లేదు. విప్లవం నిజంగా యుద్ధ రూపం దాల్చడం, ఐర్లాండ్‌లోనే అనవచ్చు. ఐర్లాండ్‌లో అధిక సంఖ్యాకులైన ప్రజలు, రోమన్ కాథలిక్‌లు. వారు రెండో జేమ్స్‌ను సమర్థించినవారు. వారిని మూడో విలియం మద్దతుదార్లుగా మార్చడం కష్టతరమైంది. ఈ పరిస్థితిని గమనించి, దేశం వీడిన రెండో జేమ్స్, కొంత మంది ఫ్రెంచి సైనికుల సహాయంతో, ఐర్లాండ్ చేరాడు. అక్కడ, ప్రొటస్టెంట్లు అధిక సంఖ్యలో ఉన్న లండన్‌డెర్రీ (Londonderry) అనే ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. ఐరిష్ ప్రజల అకుంఠిత దీక్షతో, ప్రొటస్టెంట్‌లు అధిక సంఖ్యలో ఐర్లాండ్ నుండి తరిమివేయబడినారు. లైన్‌స్టర్, మున్స్టర్, కన్నాట్, అల్‌స్టర్ మొదలైన ప్రాంతాలన్నీ, రెండో జేమ్స్‌కు మద్దతును ప్రకటించాయి. కాని, వెంటనే ఇంగ్లాండ్ సైన్యాలు లండన్‌డెర్రీని పునరాక్రమించుకోగలిగాయి. దీంతోబాటు, ఇన్నిస్‌కిల్లన్



BRAOU

వంటి ప్రాంతాలు కూడ, ఇంగ్లాండ్ సైనికుల వశమైనాయి. రెండో జేమ్స్ తిరుగుముఖం పట్టాడు. ప్రొటస్టంట్ సేనలు కాథలిక్ సైన్యాలను న్యూటన్‌బట్లర్ యుద్ధంలో ఓడించాయి.

యుద్ధంలో విజయం సాధించినా, మూడో విలియం స్వయంగా ఐర్లాండ్ వెళ్లి, పరిస్థితులను చక్కబెట్టదలచాడు. 1690 లో తన సైన్యంతోబాటు, ఐర్లాండ్ బయల్దేరాడు. దారిలో ఒక ఫ్రెంచి నౌకాదళం బాయెన్ (Boyne) వద్ద ఓడిపోయింది. దీంతో, రెండో జేమ్స్ గత్యంతరం లేక, డబ్లిన్ వీడి, ఫ్రాన్స్‌కు పారిపోయాడు. నాయకుడు లేని ఐరిష్ సైన్యాలు, ఔఘ్రిమ్ (Aughrim), లిమరిక్ (Limerick) వంటి చోట్ల ఓడాయి. గత్యంతరం లేక, ఐరిష్ ప్రజలు విలియం, మేరీలను తమ పాలకులుగా గుర్తించాల్సి వచ్చింది. ఐర్లాండ్‌లో తిరుగుబాటు అణగిన తర్వాత, అచ్చట ప్రొటస్టంట్లు కాథలిక్‌లకు వ్యతిరేకంగా అనేక చట్టాలను ప్రవేశపెట్టించారు. ఆ చట్టాల మూలంగా, ఐర్లాండ్‌కు చెందిన కాథలిక్‌లు రాజకీయ అధికారాలను కోల్పోయి, భూములను పోగొట్టుకొని, పేదవారయ్యారు. వారి వర్తక వాణిజ్యాలపై గూడ, ఆంక్షలు విధించడం జరిగింది.

## 6.10 విలియం : ఫ్రాన్స్‌తో యుద్ధం (1690-97)

మహోజ్వల విప్లవానంతరం, దాదాపు ఆనీ రాణి 1714 లో మరణించేవరకు, ఇంగ్లాండ్ చాల సుదీర్ఘమైన ఐరోపా యుద్ధంలో జోక్యం కలిగించుకొని, ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా పోరాడడం, స్టూవర్ట్ రాజుల పాలనలోని కడపటి రెండు దశాబ్దాల్లోని ప్రధానాంశమైంది. ఈ విప్లవానికి చెందిన ఒక ముఖ్య ఫలితం, ఇంగ్లాండ్ విషయాలకైగాక, సకల ఐరోపా పరిస్థితులపై ఆసక్తి కల రాజు సింహాసనాన్ని ఆక్రమించుకోడం. మూడో విలియం ప్రధానంగా ఐరోపాకు చెందిన రాజు. ఐరోపా ఖండంలో శాంతి స్థాపన, అతని ప్రధాన ధ్యేయం. మిక్కిలి పలుకుబడిగల హేప్స్‌బర్గ్, బూర్బన్ వంశాల మధ్య, తుల్యప్రాబల్యాన్ని స్థాపించడం, అతని వాంఛ. ఫ్రెంచి చక్రవర్తైన పద్నాల్గో లూయీ రాజరికాధికారం బాగా పెరిగినందువల్ల, ఫ్రెంచి వారి బారి నుండి ఐరోపాను రక్షించడానికై, అతడు ఫ్రాన్స్‌తో యుద్ధానికి దిగాడు. ఫలితంగా, అతడు ఇంగ్లాండ్‌ను ప్రపంచంలో కొత్త శక్తిగా రూపొందించాడు. అందుచేత, హేప్స్‌బర్గ్‌లకు చేరువై, బూర్బన్లకు శత్రుదేశంగా, ఇంగ్లాండ్ చాలా కాలం కొనసాగింది.

మూడో విలియం తన జీవితాంతం ఫ్రెంచి చక్రవర్తైన పద్నాల్గో లూయీని ఓడించడానికై ప్రయత్నిస్తూ వచ్చాడు. హాలండ్‌కు రాజుగా ఉన్నప్పుడు కూడా, అదే చేస్తూవచ్చాడు. 1689 లో ఇంగ్లాండ్‌కు రాజైన పిదపగూడ, అదే ప్రయత్నాన్ని కొనసాగించాడు. లూయీ, ఆల్సాస్ వంటి అనేక సరిహద్దు ప్రాంతాలను దురాక్రమణతో స్వాధీనపరచుకొన్న కారణంగా, మూడో విలియం అనేక ఇతర ఐరోపా దేశాలతో ఒక "ఆగ్స్‌బర్గ్ సమాఖ్య' (League of Augsburg) ను రూపొందించి, ఫ్రాన్స్‌తో యుద్ధాన్ని కొనసాగించాడు. ఆ సమయంలో లూయీ రెండో జేమ్స్‌కు సహాయం జేసి, అతనికి ఆతిథ్యమిచ్చాడు. అందుచేత, ఇంగ్లాండ్‌కు, ఫ్రాన్స్‌కు మధ్య, యుద్ధం కొనసాగింది. బ్రిటీష్ నౌకాదళాధిపతి రసెల్ ఫ్రెంచి నౌకాదళం పై హేగ్ (Hague) వద్ద విజయాన్ని సాధించాడు. కాని, భూమి మీద ఇంగ్లాండ్ సైన్యాలు ఫ్రెంచివారి మీద విజయాన్ని సాధించలేక పోయాయి. స్టీన్‌కిర్క్ (Stein Kirk), లండన్ వద్ద జరిగిన పోరాటాల్లో, ఫ్రెంచి సేనలుపైచేయిగా ఉన్నాయి. కాని, 1695లో విలియం, ఫ్రాన్స్‌కు చెందిన నామూర్ (Namur) అనే బలమైన దుర్గాన్ని ముట్టడించి, ఆక్రమించాడు. దాని తర్వాత గూడ, దాదాపు రెండేళ్లు యుద్ధం కొనసాగింది. ఇరు పక్షాల వారు తుదకు విసిగి, 1697లో రిస్విక్ (Ryswick) సంధి కుదుర్చుకొని, యుద్ధాన్ని నిలిపివేశారు. ఈ సంధి షరతుల ప్రకారం, పద్నాల్గో లూయీ యుద్ధకాలంలో ఆక్రమించుకొన్న ప్రాంతాలన్నిటినీ, విలియంకు

స్వాధీనం చేయటానికి అంగీకరించాడు. దీంతోబాటు, మరో ప్రధానమైన షరతు, మూడో విలియంను లూయీ ఇంగ్లాండ్ రాజుగా గుర్తించాడు. రిస్విక్ సంధివల్ల లూయీ నిరంకుశ రాజరికాధికారానికి కళ్ళెం పడినట్లైంది. రిస్విక్ సంధి తర్వాత, విలియం, లూయీలు పరస్పర గౌరవంతో మెలగసాగారు. ఇంగ్లాండ్ ఎడ, ఫ్రాన్స్ మర్యాదను చూపింది. విన్‌స్టన్ చర్చిల్ తన "A History of the English Speaking people" అనే గ్రంథంలో అన్నట్లు, "ఫ్రాన్స్‌కు ఐరోపాలో ఉన్న అత్యధికారాలను రిస్విక్ సంధి తగ్గించ గలిగింది".

1694 లో మేరీ రాణి మశూచి కారణంగా మరణించిన తర్వాత, విలియం మాత్రమే ఇంగ్లాండ్‌కు రాజుగా కొనసాగాడు. విలియం, హాలాండ్‌కు కూడ రాజైన కారణంగానే, అతని దృష్టి హాలాండ్ వ్యవహారాలపై ఎక్కువగా ఉందని, ఇంగ్లాండ్ విషయాలను విస్మరిస్తున్నాడనీ, పార్లమెంట్‌లో కొంతమంది సభ్యులు విమర్శించేవారు. 1698 లో ఏర్పాటైన పార్లమెంట్‌లో, టోరీలు అధిక సంఖ్యలో ఎన్నికైనారు. ఇంతలో, మూడో విలియం ఐరోపాలో జరిగిన మరొక గొప్పయుద్ధంలో జోక్యం కలిగించుకోవాల్సొచ్చింది.

## 6.11 స్పానిష్ వారసత్వ యుద్ధం

స్పెయిన్ రాజైన ఛార్లెస్‌కు సంతానం లేదు. అతడు తన అవసాన దశలో మంచం పట్టిన సమయంలో, అతని తర్వాత స్పెయిన్ సింహాసనానికి వారసులెవరన్న విషయంలో భేదాభిప్రాయాలు వచ్చాయి. ఫ్రెంచి రాజైన పద్నాల్గో లూయీ, ఆస్ట్రియా రాజైన లియోపాల్డ్, తమ తమ రాణుల మూలంగా స్పెయిన్ రాజుకు దగ్గరి బంధువులు. వారిద్దరు స్పెయిన్ సింహాసనాన్ని ఆక్రమించుకోడానికి మక్కువ చూపారు. 1698 లో లూయీ, ఇంగ్లాండ్ రాజైన విలియంలు, మొదటి విభజన సంధిని కుదుర్చుకొన్నారు. దాని ప్రకారం, బవేరియా రాకుమారుడు స్పెయిన్‌కు తర్వాతి రాజుగా గుర్తింపు పొందాడు. ప్రతిగా, ఫ్రాన్స్, ఆస్ట్రియాలు ఇటలీలో నష్టపరిహారంగా కొన్ని ప్రాంతాలు ఆక్రమించుకోవాలి. కాని, మరు సంవత్సరమే బవేరియా రాకుమారుడు మరణించిన కారణంగా, రెండో విభజన సంధి అవసరమైంది. దీని ప్రకారం, ఆస్ట్రియా రాకుమారుడు ఛార్లెస్ స్పెయిన్‌కు వారసుడుగా ప్రకటితమైనాడు. కాని, దీనికి స్పెయిన్ ప్రజలు తమ వ్యతిరేకతను తెల్పారు. 1700 సంవత్సరంలో రెండో ఛార్లెస్ మరణించాడు. తన మరణానికి ముందు ఒక వీలునామా రాస్తూ, అందులో తన మరణానంతరం స్పెయిన్ సింహాసనం ఫ్రాన్స్ రాజైన లూయీ కుటుంబానికి చెందుతుందని ప్రకటించాడు.

వెంటనే లూయీ తన మనుమడైన ఫిలిప్‌ను (Duke of Anjou) స్పెయిన్ రాజుగా ప్రకటించి, అతడు మాడ్రిడ్‌కు వెళ్లేముందు, "పిరనీస్ పర్వతాలు ఇక లేవు" అన్నాడట. (పిరనీస్ పర్వత శ్రేణి ఫ్రాన్స్‌ను స్పెయిన్నుండి వేరు చేస్తుంది.) అయితే, స్పెయిన్, ఫ్రాన్స్‌లు ఉత్తరోత్తరా ఏకమైతే, అటువంటి శక్తిని ఎదుర్కోడం కష్టమౌతుందని, ఐరోపాలో రాజకీయంగా తుల్యప్రాబల్యం తప్పుతుందని భావించి, ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌కు అడ్డు తగలడానికి నిశ్చయించింది. రిస్విక్ సంధి తర్వాత పరస్పర సన్నిహిత భావన నశించి, ఫ్రాన్స్ ఆధిక్యతను తగ్గించడానికై, ఇంగ్లాండ్ ఇతర ఐరోపా దేశాలతో కలిసి, యుద్ధానికి కృషి చేసింది. ఇంగ్లాండ్, హాలాండ్, ఆస్ట్రియా, బ్రాండెన్‌బర్గ్ మొదలైన దేశాలతో కలసిన కూటమి ఏర్పడి, ఫ్రాన్స్‌పై యుద్ధం మొదలైంది. స్పానిష్ వారసత్వ యుద్ధం కొనసాగుతున్న సమయంలో, 1702 లో మూడో విలియం మరణించాడు. అతని తర్వాత 'ఆని' రాణి ఇంగ్లాండ్ సింహాసనాన్ని అధిష్ఠించి, యుద్ధాన్ని నివారించడం జరిగింది. ఈ సంధి మూలంగా, ఇంగ్లాండ్‌కు

BRAOU

మిక్కిలి కీలకమైన అనేక ప్రాంతాలు దక్కాయి. జిబ్రాల్టర్, మైనార్కా, మిజోర్కా, న్యూఫౌండ్‌లాండ్, నావస్కోషియా, హడ్సన్‌బే మొదలైనవి ఇంగ్లాండ్‌కు దక్కిన ముఖ్యమైన ప్రాంతాలు. అటువంటి ప్రయోజనాలున్న స్పానిష్ వారసత్వ యుద్ధంలో ఇంగ్లాండ్ కీలకమైన పాత్ర వహించడానికి, మూడో విలియం అనుసరించిన విదేశీ విధానమే ప్రధాన కారణం.

రక్తరహిత విప్లవానంతరం 1688 లో ఇంగ్లాండ్‌కు రాజుగా ప్రకటితమైన మూడో విలియం, దేశంలో సుస్థిర పరిస్థితులను ఏర్పరచి, జాతి ప్రజలకు ఊరట గల్పించాడు. హాలాండ్‌కు రాజుగా కొనసాగుతూ, ఇంగ్లాండ్ పరిస్థితులను నిర్లక్ష్యం చేయకుండా, ఐరోపా రాజకీయ విషయాల్లో చొరవ చూపి, దేశ ప్రాభవాన్ని నెరపగలిగాడు. తన విరోధి దేశమైన ఫ్రాన్స్‌తో పోటీపడి, ఐరోపా ఖండంలో రాజకీయ తుల్యప్రాబల్యం నశించకుండా, ఫ్రాన్స్ అధికారానికి అడ్డుతగల గలిగాడు. విలియం జీవితాంతం, ఆంతరంగిక పరిపాలనా విషయాలకు, విదేశీ వ్యవహారాలకు మాత్రమే, తన సమయాన్నంతా వినియోగించాడు. తన సొంత ఆట, పాటలకు, సుఖ సంతోషాలకు ఎప్పుడూ ప్రాముఖ్యత నివ్వలేదు. నిర్విరామంగా దేశానికి మాత్రమే కృషి చేశాడు. ఇంగ్లాండ్‌లో ప్రజలకు పౌరస్వేచ్ఛను కల్పించి, ఇతర దేశాలనుండి కలిగే భయాందోళనలను తొలగించ గలిగాడు.

చర్చిల్ అన్నట్లు, మూడో విలియం నిజ జీవితంలో ప్రేమానురాగాలను చూరగొన్నవాడుకాదు. తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తనకు బిడ్డలు లేరు. అతని వివాహం రాజకీయాలతో ముడిపడిన కారణంగా, అది విజయవంతమైందని అనలేం. గడుసురాలైన అవ్వగారి లాలన, పాలనలో పెరిగిన విలియం బాల్యం, బాధలతో కూడుకొన్నది. సరైన ఆరోగ్యం లోపించింది. క్షయ వల్ల ఒక ఊపిరితిత్తి దెబ్బతింది. అతనికి ఉబ్బస వ్యాధి (Asthma) ఉండేది. దేహ దార్ఢ్యం లోపించినా, అతనిలో రాజకీయ చతురత, పోరాట జ్వాలలు లోపించలేదు. తాను ఇరవై ఏళ్ల వయసు చేరుకొనేటప్పటికే, గొప్ప పేరు సంపాదించిన విలియం, కొద్ది కాలంలోనే డచ్ వ్యవహారాలేగాక, ఇంగ్లాండ్, దాంతోపాటు సకల ఐరోపా విషయాలను కూలంకషంగా నిర్వహించగల్గాడు. దాదాపు నాలుగేళ్లు అతని మామగారైన రెండో జేమ్స్‌కు వ్యతిరేకంగా కొనసాగిన ఇంగ్లాండ్ ప్రజల ఉద్యమానికి మార్గదర్శకుడు, మూడో విలియం. అమితంగా తన్ను అభిమానించిన తన భార్య మేరీ ఎడ, మొదట నిర్లక్ష్యంతో మెలగినా, తర్వాత ఇంగ్లాండ్ వ్యవహారాల్లో ఆమె అందజేసిన సహాయం, ఇచ్చిన సలహాలు, అతనికి ఎంతో మేలు చేకూర్చాయని బాహాటంగా చెప్పుకొనేవాడు.

మత విషయాల్లో మూడో విలియం కాల్విన్ మతానుయాయి. కాని, ఈ మతం నుండి ఆధ్యాత్మికంగా అతడెట్టి సంతృప్తినీ పొందినట్లు లేదు. రాజుగా, సైనికాధికారిగా అతడే మతానికన్నా, ఎక్కువగా ప్రాధాన్యమిచ్చినట్లనిపించదు. ప్రొటస్టంట్లు, కాథలిక్‌లు, అనే వ్యత్యాసం లేకుండా పాలించాడు విలియం; ఇంగ్లాండ్, ఐర్లాండ్‌ల్లో ప్రొటస్టంట్ నగారాను వాయించినా, విలియం పోప్‌తో ఎట్టి తగాదాకు దిగలేదు. సమర్థులైన కాథలిక్‌లను ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడానికి అతడు వెనుదీయలేదు. ఫ్రాన్స్ అధికారాన్ని తగించడానికి తమకు రాజుగా ప్రసాదితమైన వాడని, ఇంగ్లాండ్ ప్రజలు మూడో విలియంను తలచుకొని మురిసిపోయేవారు.

## 6.12 సంగ్రహంగా

మొవాట్ (Mowat) అనే చరిత్రకారుడన్నట్లు, విలియం "నిశితమైన పద్ధతులు, వీరోచిత ధైర్యం గల డచ్ నాయకుడు". దేశంలో రాజకీయ నాయకుల కుతంత్రాలను ఒక వైపు, ఐరోపాలో

ఆధిక్యతకై పన్నాగాలు పన్నిన పద్నాల్గో లూయికి వ్యతిరేకంగా మరోవైపు, అతడు పెద్ద పోరాటాన్ని కొనసాగించాడు. రాజకీయ వ్యవహారాలకై తన జీవిత కాలాన్నంతా వెచ్చించి, కృషిచేశాడు విలియం.

1689 లో విలియం రాకమూలంగా రాజరికంలో జరిగిన మార్పు, తర్వాతి తరంలో మిక్కిలి ప్రధానమైనదిగా గుర్తించడం జరిగింది. ఈ సంఘటన తర్వాత రెండేళ్లకు జాన్ లాక్ (John Locke) ప్రచురించిన "ప్రభుత్వ రెండు ప్రవచనాలు" (Two Treatises of Government), ఈ విప్లవాన్ని సమర్థించాయి. లాక్ రచనలు విప్లవాన్ని సదవగాహనచేసుకోడానికి పనికి వచ్చాయి. విగ్ రాజకీయ ఆలోచనలకు విప్లవం ఒక దృష్టాంతం. విలియం పాలన, టోరీల "దైవాంశ" సిద్ధాంతాలను పూర్తిగా తోసిరాయుగల్గింది. అదే విధంగా, వంశపారంపర్యంగా మాత్రమే రాజ్యాధికారం సంక్రమించాలనే భావన గూడ తొలగిపోయింది. దేశంలో నిజమైన రాజ్యాంగబద్ధ రాజరికం విలియం, మేరీల కాలం నుండి ఏర్పడిందని చెప్పొచ్చు.

## 6.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. మూడో విలియం కాలంలో చేయబడిన పార్లమెంట్ శాసనాలను విశ్లేషించండి.
2. మూడో విలియం అనుసరించిన విదేశాంగ విధాన లక్ష్యాలు, ఫలితాలను విశ్లేషించండి.

II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. విలియం, మేరీల ప్రాధాన్యత
2. విప్లవ పరిసమాప్తి
3. స్కాట్‌లాండ్, ఐర్లాండ్‌ల్లో మూడో విలియం అనుసరించిన విధానాలు

## 6.14 ఉపయుక్త గ్రంథాలు


Sir Winston Churchill : **A History of the English Speaking Peoples, Vol. III**

G. N. Clark : **The Later Stuarts, 1660 -1714**

John Miller : **The Glorious Revolution, 1983**

H. Horwitz : **Parliament, Policy and Politics in the reign of William III**

J. R. Jones : **The Revolution of 1688 in England**

J. P. Kenyon : **Stuart England**

J.R. Green : **Short History of the English People, Part IV., 1917**

D. Ogg : **England in the reigns of James II and William III., 1955**

L.B. Pinkham : **William III and the Respectable Revolution**

G.B. Adams : **Constitutional History of England**


BRAOU

# భాగం-7 : హక్కుల చట్టం: మహోజ్వల విప్లవ ఫలితాలు

విషయక్రమం

7.0 లక్ష్యాలు

7.1 1688 విప్లవం, హక్కుల చట్ట ప్రాముఖ్యతాప్రత్యేకతలు

7.2 వారసత్వ పరిష్కారం

7.3 హక్కుల చట్టం (Bill of Rights)

7.4 సర్వసిద్ధ సైన్యం (Standing Army)

7.5 నిరంకుశ రాజరికానికి ఆటంకం

7.6 ఆర్థిక విషయాల పరిష్కారం

7.7 మత విషయాల పరిష్కారం

7.8 యుద్ధాలు : విజయాలు

7.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.10 సంగ్రహంగా

7.11 ఉపయుక్త గ్రంథాలు

## 7.0 లక్ష్యాలు

రెండవ జేమ్స్ దేశం వీడి పోవడంతో, అతని కుమార్తె మేరీ, అల్లుడు విలియం, నెదర్లాండ్ నుండి ఆహ్వానితులై, ఇంగ్లాండ్‌కు ఉమ్మడిగా అధిపతులయ్యారని మనం గమనించాం. ఇందులో పార్లమెంట్ ప్రధాన పాత్ర నిర్వహించింది. కొత్త ప్రభువులు ప్రజా హక్కులను పరిరక్షించేందుకు, రాజరికాన్ని దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త తీసుకొని, పార్లమెంట్ హక్కుల పత్రాన్ని (Petition of Right) రూపొందించింది. దీన్నే, పార్లమెంట్ ఆమోదాన్ని పొందిన పిదప, హక్కుల చట్టం (Bill of Rights) గా పరిగణించారు. దీని మూలంగా రాజరిక అధికారాలను క్రమబద్ధం చేయగల్గారు. మహోజ్వల విప్లవం కొనసాగిన తీరుకన్న, విప్లవానంతరం జరిగిన రాజకీయ, ఆర్థిక, మత విషయాల పరిష్కారాలు మిక్కిలి ప్రధానమైనవి. విప్లవ ఫలితాలు చాల ముఖ్యమై, తర్వాతి చరిత్ర గతిని ప్రభావితం చేశాయి. హక్కుల చట్టం ప్రాముఖ్యత, దీంతో బాటు, విప్లవ ఫలితంగా రాజ్యాంగ, ఆర్థిక, మత సమస్యలు పరిష్కరించబడిన విధానాన్ని, ఈ పాఠ్యభాగాధ్యయనం ద్వారా తెలిసికోగల్గుతారు.

B R A O U

## 7.1 1688 విప్లవం, హక్కుల చట్టం ప్రాముఖ్యతాప్రత్యేకతలు

1688 విప్లవం, మిగిలిన విప్లవాలతో పోల్చి చూస్తే, అతి త్వరితంగా కొనసాగిన విప్లవమని తెలుస్తుంది. ఇందులోని ప్రధాన సంఘటనలన్నీ, కొద్ది వారాల్లోనే కొనసాగి, పూర్తైనాయి. విలియం, మేరీలు, 1688 నవంబర్ 5వ తేదీన టార్బే (Torbay) వద్ద దిగడం, డిసెంబర్ 23వ తేదీన రెండో జేమ్స్ దేశం వీడి పారిపోవడం, 1689 ఫిబ్రవరి 13వ తేదీన విలియం, మేరీలు సింహాసన మధిష్ఠించడం జరిగింది. విప్లవ గమనం తీరు, రక్తరహితమైన ఈ విప్లవ ప్రభావాన్ని పరిశీలించిన, దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలైన విగ్‌లు (Whigs), టోరీ (Torys) లకు మధ్య, కొంతవరకు ఏకీభావం కూడ గోచరిస్తుంది. అంతకు ముందు, ఈ ఇరు వర్గాలు సదా రాజకీయ వైషమ్యాలతో కొనసాగినవే. రెండో జేమ్స్ పారిపోయిన తర్వాత దేశంలో ఏర్పడ్డ పరిస్థితి, 1660 లో రెండో ఛార్లెస్ సింహాసనంపై పునఃప్రతిష్టితం కావడానికి కొనసాగిన పరిస్థితికీ, సన్నిహిత పోలికలు కన్పిస్తాయి. 1660 లో ఛార్లెస్‌తో పోటీపడి, అనేకులు సింహాసనానికి చేతులు చాపారు. కాని, పార్లమెంట్ రెండో ఛార్లెస్‌ను మాత్రమే వారసుడిగా గుర్తించి, సింహాసనాన్ని అప్పజెప్పింది. కాని, 1688 లో ఇంగ్లాండ్ సింహాసనాన్ని విలియం, మేరీలు తప్ప, మరెవ్వరూ ఆశించినవారు లేరు. విలియం మేరీల నియామకం, బ్రిటీష్ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం.

విలియం లండన్ నగర ప్రవేశ సమయంలో ప్రజలు చూపిన సంతోష సంబరాలు, అట్టే ఎక్కువ కాలం నిలువలేదు. అతడు ఇంగ్లాండ్ తీరం చేరిన తర్వాత, ఫిబ్రవరి 13న సింహాసన మధిష్ఠించే వరకు ఉన్న కొన్ని వారాల వ్యవధిలో జరిగిన రాజకీయ మార్పులు, తర్వాత నెలకొన్న పరిస్థితులకు ఏవిధంగానూ పోలిక లేదు. ఈ ప్రారంభ సమయంలో, అనేక ప్రధాన విషయాలకు పరిష్కార మార్గాలను కనుగొనడంలో, ముఖ్య నిర్ణయాలను తీసుకోడంలో రాజకీయ నాయకులు, ప్రధాన రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం, గమనార్హం. అట్టి పరిష్కారాలకు ప్రధాన ప్రాతిపదిక, పార్లమెంట్ ప్రవేశపెట్టిన హక్కుల చట్టం.

## 7.2 వారసత్వ పరిష్కారం

1689 ప్రారంభం నాటికి, విలియం ఇంగ్లాండ్ రాజుగా అన్ని ముఖ్య కార్యాలను నిర్వహించసాగాడు. తన డచ్ సేనలతో బాటు, రెండో జేమ్స్‌కున్న సైన్యాలు కూడ ఆయన అధీనమైనాయి. కాని, దేశంలో అతని అధికార స్థాపన రాజ్యాంగబద్ధం కావాలి. ఈయన తల్లి స్టూవర్ట్ రాకుమార్తె; భార్య మేరీ, స్టూవర్ట్ వంశస్థుడైన రెండో జేమ్స్ కుమార్తె. ఈతడు ఇంగ్లాండ్ రాజుగా ప్రకటితమవడంతో, కొన్ని రాజకీయ సమస్యలు ఎదురయ్యాయి. 1680 ప్రాంతంలో విగ్‌లు, టోరీల మధ్య, అతి తీవ్ర వివాదాలుండేవి. కాని, రెండో జేమ్స్ ప్రవర్తన, అతని పరిపాలనాతీరు మూలంగా, అతన్ని ఎదిరించిన ఇరు పక్షాల మధ్య, ఐక్యత ఏర్పడింది.

విప్లవానంతర పరిస్థితుల పరిష్కారంలో ప్రథమ ఘట్టం, ప్రతినిధుల సభను సమావేశపర్చడానికి సంబంధించింది. దాదాపు అరవై మందిగల ప్రభువుల సభ, 1688 డిసెంబర్ 21వ తేదీన సమావేశమైంది. మూడు రోజుల తర్వాత విలియంకు ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించడం జరిగింది. అందులో పరిపాలనా విషయాలను చేపట్టి, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఉత్తర్వులను జారీచేయాల్సిందని కోరడానికి, తీర్మానించారు. ఈ పత్రాన్ని మరుసటి దినం, ప్రభువుల సభలోని ఆరుగురు సభ్యులు, విలియంకు అందజేశారు.

దిగువ సభలోని సభ్యులు సమావేశవడానికి, మరికొంత వ్యవధి కావాల్సొచ్చింది. కాని, సమావేశమైన పిదప, ఎగువ సభ సభ్యులు రూపొందించిన విజ్ఞాపన పత్రంలోని విషయాలకు ఆమోదాన్ని తెల్పి, విలియం బ్రిటీష్ ప్రజల అభీష్టం మేరకు రాజు అవడంపై, తమ కృతజ్ఞతలను తెలియజేశారు. డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో కామన్స్ సభ్యులు, తమ ప్రసంగాలను కొనసాగించారు. దాదాపు 300 మందిగల దిగువ సభ, అందు ప్రధాన పక్షంగా గల విగ్‌ల ఆధిక్యతను పరోక్షంగా తెలియజేసింది. అందు, రెండో ఛార్లెస్ కాలం నాటి సభ్యులందరూ కొనసాగారు.

విలియం ఆదేశం మేరకు, కన్వెన్షన్ పార్లమెంట్ జనవరి 22 వతేదీన సమావేశమైంది. దానికి ముందు జరిగిన ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల సమయంలో సైన్యాలన్నీ నగరాల్లోను, పట్టణాల్లోను లేకుండా ఉపసంహరింపజేసి, విలియం ఒక మంచి కొత్త ఆచారాన్ని ప్రవేశపెట్టాడు. దీంతో, ఎన్నికలు సుహృద్భావ వాతావరణంలో జరగడానికి ఆస్కారం మేర్పడింది. కన్వెన్షన్ పార్లమెంట్ అనేక ప్రధాన సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాల్సొచ్చింది. వారసత్వ సమస్యతోబాటు, రాజు అధికారాలను నిర్ణయించడం, పార్లమెంట్ స్వతంత్రాన్ని పరిరక్షించడం, జాతీయ మత విధాన ప్రకటన, అల్ప సంఖ్యాకులకు తగిన రక్షణ కల్పించడం, మొదలైన అన్ని విషయాలను పరిశీలించాల్సిన అవసర మేర్పడింది. పై సమస్యలను పరిష్కరించదల్చిన పార్లమెంట్ సభ్యులందరికి, అంతకు పూర్వం 1642 నుండి 1660 వరకు జరిగిన విఫల ప్రయత్నాలన్నీ, గుర్తులేక పోలేదు. అందుకే, 1689లో అన్ని పక్షాలు, అందరు రాజకీయ నాయకులు, తమ మధ్యగల విభేదాలను కొంతవరకు విస్మరించారు.

రెండో జేమ్స్ దేశం వీడి పోవడంతో, కేంద్రంలోను, గ్రామీణ ప్రాంతాల్లోను, అనేక ఉద్యోగాలను రాజకీయ నాయకులందరు తమ బంధుమిత్ర సన్నిహితుల నియామకాలకై, ప్రయత్నాలను కొనసాగించారు. దేశంలో ఎటువంటి ప్రభుత్వం ఏర్పడుతుందో అన్న విషయంపై గూడ, ఊహాగానాలు కొనసాగాయి. రెండో జేమ్స్‌ను మళ్లీ ఆహ్వానించి, ఒక కౌన్సిల్ ఏర్పాటై, రాజప్రతినిధి సహాయంతో పరిపాలన కొనసాగుతుందని కొందరు భావించారు. విలియం, మేరీకి కేవలం ప్రతినిధిగా మాత్రం కావచ్చని కొందరన్నారు. విలియం రాజు కావచ్చని, మేరీని రాణిగా ప్రకటించవచ్చని, లేక విలియం, మేరీలు ఉమ్మడిగా అధికారానికి రావచ్చని, అనేక రకాలుగా ప్రచారమౌతూ వచ్చింది.

విగ్ పక్షానికి చెందిన సభ్యులందరూ, విలియం మాత్రమే రాజుగావడానికి సుముఖత చూపారు. దాదాపు వారందరు, రాజరికంపై నమ్మకం గల్గిన వారే. వారి దృష్టిలో, విలియం రాజైన ప్రొటస్టాంట్లకు తగు రక్షణ ఏర్పడుతుందని, రెండో జేమ్స్ తిరిగి రాకుండా తగిన చర్యలు తీసుకోవచ్చని భావించారు. టోరీలు, జేమ్స్ పాలనా కాలంలో అతన్ని సమర్థించినా, అతడు ఆంగ్లికన్ చర్చికి అధికారాల నివ్వక పోవడం, టోరీ అధికార్లను తొలగించిన తీరు, ఆశాభంగాన్ని కల్గించింది. అదే సమయంలో విలియం రావడం, స్వేచ్ఛాగత పార్లమెంట్‌ను స్థాపించనున్నట్లు వాగ్దానం చేయడం, వారికి నచ్చింది. ఇంగ్లాండ్ లోని ఆనాటి రాజకీయ పరిస్థితి, సర్ ఎడ్వర్డ్ సేమూర్ (Sir Edward Seymour) రాసిన కింది వాక్యాల్లో వెల్లడవుతుంది.

"నిజాయితిగల ప్రతి ఒక్కరు తమ దేశంలోని రాజులు ఒకరి తర్వాత ఒకరిని పంపివేయడం పట్ల విస్మయం చెందారు. ఇంగ్లాండ్ దేశస్థులు స్వేచ్ఛా పార్లమెంట్‌ను నెలకొల్పుతానన్న విలియం వద్దకు చేరారు."

కన్వెన్షన్ పార్లమెంట్ సమావేశమవగానే ఎదుర్కొన్న సమస్యల్లో ప్రధానమైంది, వారసత్వ పరిష్కారం. జేమ్స్ మద్దతుదార్లు సాన్‌క్రాఫ్ట్ (Sancroft) నాయకత్వం కింద, విధేయతా వర్గానికి

BRAOU

ప్రాతినిధ్యాన్ని వహించారు. తన అధికారాలను కుదించిన పునఃప్రతిష్ఠాపనకు అంగీకరించనని స్పష్టంగా తెలియజేసినప్పటికీ, తిరిగి జేమ్స్‌ను ఆహ్వానించాలనే వారు లేక పోలేదు. విలియం సంరక్షకుడిగా కొనసాగాలనే ప్రతిపాదనను ఎవరూ అంగీకరించనందుకే, అది వీగిపోయింది. వారసత్వ విషయంలో విగ్‌లు పూర్తి ఐక్యత గల్గినవారు. వారి దృష్టిలో రాజరికం, ఎంపిక మూలంగా గాక, వంశపారం పర్యంగా మాత్రమే ఉండాలని విశ్వసించారు. నిరంకుశ రాజరికాన్ని నిరసించడం, విగ్ రాజకీయ తత్వంలో ఒక ప్రధాన అంశం.

1689లో టోరీలు, విగ్‌లు ఉమ్మడి రాజరికాన్ని కాంక్షించారు. ఐర్లాండ్, స్కాట్‌లాండ్‌లు, పక్క దేశమైన ఫ్రాన్స్‌లోగల పరిస్థితుల దృష్ట్యా, శక్తివంతమైన రాజరిక ఆవశ్యకతను అందరూ గుర్తించారు. టోరీ నాయకులైన డన్బీ, బాత్, సేమూర్ వంటి వారికి, ప్రభుత్వంలో ప్రధాన పదవులను తమ అనుయాయులకు పంచిపెట్టాలనే ఉద్దేశం లేక పోలేదు.

ఫిబ్రవరి 2, 1689 తేదీన విగ్ సభ్యులు విలియంను రాజుగా ప్రకటించడానికి తీర్మానించారు. కొంత మంది దానికి వ్యతిరేకత తెల్పినా, కామన్స్ సభలో అధిక సంఖ్యాకుల మద్దతు మూలంగా, ఇది నెగ్గింది. ముందు రాజైన జేమ్స్, "సింహాసనాన్ని త్యజించినాడని" ప్రకటించారు. సింహాసనం అందుచేత ఖాళీ అయిందని, విలియం - మేరీలు ఉమ్మడిగా సింహాసనాన్ని ఆక్రమించుకోవాలని తీర్మానించడం జరిగింది. విలియం ఎటువంటి పరిస్థితుల్లోను మేరీ కంటే తక్కువ స్థానాన్ని ఆక్రమించడానికి సమ్మతించడని తెలిసి, పై విధంగా సింహాసనాన్ని ఇద్దరికీ ఉమ్మడిగా అప్పజెప్పడానికే, అంగీకరించారు. మరుసటి వారం, హాలాండ్‌నుండి మేరీ రాకకై నిరీక్షించారు.

## 7.3 హక్కుల చట్టం (Bill of Rights)

వారసత్వ విషయాల పరిష్కారంతో బాటు, పార్లమెంట్ కొత్త రాజరికం కింద, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ విషయాలకు కూడ ప్రాముఖ్యత నిచ్చింది. ఫిబ్రవరి 2వ తేదీన కామన్స్ సభలోని కొంతమంది సభ్యుల సాధారణ ఫిర్యాదులతో ఉన్న ఒక ప్రకటనను సమర్పించడం జరిగింది. రెండు సభల్లోను చర్చ జరిగి, 12వ తేదీన ఆమోదితమైంది. కాని, ఈ ప్రకటనలోని మత సంబంధమైన, న్యాయవిషయాలకు సంబంధించిన అనేక విషయాలు, పార్లమెంట్‌లో చర్చ సమయంలో ఆక్షేపించిన కారణంగా, తొలగించడం జరిగింది. మరు దినం, ఇది హక్కుల ప్రకటన (Declaration of Rights)గా, మేరీ, విలియంలకు సింహాసన ప్రదానోత్సవ సమయంలో సమర్పించారు. వారు ఈ పత్రాలన్నిటిని స్వీకరించడంతో, అంతవరకు ఏర్పడ్డ రాజకీయ సంక్షోభం తొలగిందని చెప్పవచ్చు.

హక్కుల ప్రకటనను విప్లవ సారాంశమని చెప్పవచ్చు. కాని, ఈ పత్రంలో రాజ్యాంగ అధికారం అంత స్పష్టంగా తెలియజేయబడలేదు. అందులోని పదాలను, వాక్యాలను క్రోడీకరించడంలో పార్లమెంట్ చూపిన ఆసక్తిని గమనించినట్లైతే, అది విలియం, మేరీలు సింహాసనానికి రాకముందే, దీన్ని స్వీకరించాల్సిన షరతును నిర్దేశించారా అనిపిస్తుంది. విలియం కూడ ఈ ప్రకటన ప్రకారం తు.చ. తప్పక నడుచుకొంటానని వాగ్దానం కూడ చేయలేదు. పార్లమెంట్‌ను ఉద్దేశించి అతడన్న మాటల్లో ఇది మనకు గోచరిస్తుంది.

"నేను ఇక్కడికి రావడంలో మీమతం, చట్టాలు, పౌర హక్కులను పరిరక్షించడం తప్ప, ఏ ఇతర ఉద్దేశం లేని కారణంగా, వాటినన్నిటిని నేను సర్వదా శ్రమించి, రక్షిస్తానని మీరు నమ్మండి" అని, అన్నాడు. అందుచే, కొత్త హక్కుల పత్రం కేవలం రాజదంపతులకు సమర్పించిన సమాచార పత్రం

మాత్రమే గాని, ఎట్టి షరతులను ప్రతిపాదించలేదని చెప్పవచ్చు. అందులో ఛార్లెస్, జేమ్స్, ఏ విధంగా అధికార దుర్వినియోగం చేశారో, తెల్పడం జరిగింది. విలియం, మేరీలను అటువంటి దుర్వినియోగం చేయవద్దని, పరోక్షంగా కోరడం జరిగింది. పార్లమెంట్, రాజుకు మధ్య, ఎటువంటి నిర్దిష్టమైన షరతులు ఇందులో కన్పించవు. 1689 లో దీన్ని ఒక "చట్టం" (Bill) గా మార్చిన పిదప, రాజ్యాంగపరమైన గుర్తింపును పొందింది. ఇది ఒక షరతుల పత్రంగా ప్రకటించబడిఉన్నట్లైతే, తిరిగి చట్ట రూపంలో వచ్చే అవసరం లేదు. మొదటిసారి ప్రవేశపెట్టినపుడు, పార్లమెంట్‌లో కొనసాగిన వాదోపవాదాల మధ్య, వీగిపోయింది. రెండో దఫా ప్రవేశపెట్టిన పిదప, నెగ్గింది. ఆమోదించిన చట్టం, హక్కుల ప్రకటన ముసాయిదాకు, కొంత భిన్నంగా ఉంది.

విలియం హక్కుల చట్టాన్ని (Bill of Rights) ఆమోదించడంతో, దాదాపు ఒక సంవత్సరం ముందు తనకు చదివి వినిపించిన హక్కుల ప్రకటన (Declaration of Rights) అంశాలను అంగీకరించినట్లైంది. కాని, ఈ సూత్రాలు ఎంతవరకు రాజు అధికారాలపై శక్తివంతమైన అదుపు ఉంచగలవు? ఇందులో అనేక అంశాలు, 1680 ప్రాంతంలో కొనసాగిన నిరంకుశ రాజ్యాధికారాలను ఉదహరించాయి. కాని, అటువంటి అధికారాలను ఆక్షేపించలేదు. కొన్ని సూత్రాలు ఛార్లెస్ పాలనకు సంబంధించినవి కాగా, కొన్ని జేమ్స్ పాలనకు సంబంధించినవి. తమ కోర్కెలను మహజరులుగా సమర్పించే హక్కు, న్యాయపాలన విషయాల్లోని లోపాలను ఎత్తిచూపు అధికారాలు అందుగలవు. పార్లమెంట్ తరచు సమావేశం కావాలని, ఎన్నికలుగాని, చర్చలుగాని స్వేచ్ఛగా, నిర్భయంగా జరగాలనీ, కాంక్షించింది.

## 7.4 సర్వసిద్ధ సైన్యం (Standing Army)

హక్కుల చట్టంలో మరో ప్రధాన అంశం, సర్వసిద్ధ సైన్యం (Standing Army) గురించింది. సిద్ధ సైన్యాన్ని శాంతి సమయాల్లో దేశంలో ఏ భాగంలోనైనా ఏర్పరచాలన్న, పార్లమెంట్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఇందు తెలియజేయడం జరిగింది. సైన్యపు చట్టబద్ధమైన అధికారాన్ని స్పష్టంగా ఇందు నిర్వచించలేదు. మొట్టమొదటిసారిగా, సర్వసిద్ధ సైన్యం రెండో ఛార్లెస్ కాలంలో ఏర్పాటైంది. దీన్ని, గార్డ్స్ అండ్ గారిసన్స్ (Guards and Garrisons) అని పిలిచేవారు. ఇది, చాల పెద్దదిగాదు. కాని, 1673 లోను, 1678 లోను సైన్యాన్ని విస్తరించిన తర్వాత, పార్లమెంట్ గాఢంగా ఆక్షేపణ తెలిపి, దేశంలో ప్రబలిన సైనిక పాలనను వ్యతిరేకించింది. ఛార్లెస్ కాలంలో పెద్ద సైన్యాలు ఏర్పడడాన్ని, పార్లమెంట్ వ్యతిరేకించింది. నిరంకుశత్వానికి అది ప్రతీకగా భావించబడింది. దేశంలోని సామాన్య న్యాయవాదులు గూడ, సైనిక విస్తరణకు వ్యతిరేకతను చూపారు. సైన్యంలో తిరుగు బాట్లు (Mutinies), సైన్యం నుండి పారిపోవడం వంటి క్రమశిక్షణారహిత చర్యలను, వారు గొప్ప తప్పిదాలుగా భావించలేదు. జేమ్స్ తన సైన్యాలను విస్తరింపజేసిన పిదప, రాజు నిరంకుశాధికారాలను వ్యతిరేకించడానికి అటువంటి సూచన చేయాల్సిన అవసరం ఏర్పడింది. పార్లమెట్ అనుమతి లేకుండా రాజు ఎటువంటి శాశ్వత సేనలను ఉంచుకోరాదని, హక్కుల ప్రకటనలో విశదం చేయడమైంది. అదిగాక, 1689 లో సైనిక తిరుగుబాటు చట్టం (Mutiny Act), క్రమశిక్షణను ధిక్కరించిన సైనికులను శిక్షించడానికి, రాజుకు నిర్ణీత కాలానికి మాత్రమే అనుమతి నిచ్చింది. అట్టి చట్టాలు ప్రతి ఏటా ఆమోదాన్ని పొందాల్సిన కారణంగా, రాజు పార్లమెంట్‌పై ఆధారపడాల్సొచ్చింది. అందుచే, పార్లమెంట్ ఏ సమయంలోనైనా, సైనిక న్యాయస్థానాలను గూడ రద్దు చేసే అధికారాన్ని పొందింది. పై కారణాల మూలంగా, పార్లమెంట్‌కు దేశంలోని సైనిక విషయాలపై పూర్తి అధికారం ఏర్పడింది. హక్కుల చట్టంలోని రాజ్యాంగపరమైన అంశాలన్నటిలోకి, సైనిక విషయాలకు సంబంధించిన అంశాలు మిక్కిలి నూతనమైనవి. తక్కిన వన్నీ గూడ, ప్రజలు సాధారణంగా రాజ్యాంగ సంస్కరణలని

BRAOU

భావించే సూత్రాలను పునఃశ్చరణ చేయడం మాత్రమే. కొన్ని సర్వసాధారణ మైనవి. ఉదాహరణకు, "పార్లమెంట్‌కు జరిపే ఎన్నికలు స్వేచ్ఛగా ఉండాలి" అని తెలియజేశారు. కాని, ఈ స్వేచ్ఛను నిర్వచించినా, ఎన్నికలు స్వేచ్ఛగా ఏవిధంగా జరగాలనేది, అందు వివరించలేదు. అదే విధంగా, మరికొన్ని అంశాలుగూడ నిర్దుష్టంగా లేవు. అయినా, హక్కుల చట్టం ఒక ప్రధాన రాజ్యాంగ చట్టం. చరిత్ర ప్రసిద్ధిగాంచిన మాగ్నాకార్టా (Magnacarta) తో పోల్చ తగింది. 1690లో ఒక పార్లమెంట్ సభ్యుడు దీన్ని "మన తొలి ఒప్పందం" అని వ్యాఖ్యానించాడు. ఇది అమెరికా సంయుక్తరాష్ట్రాల రాజ్యాంగ రచయితలను ఎంతగానో ప్రభావితం చేసింది. "ఆయుధాలను ధరించే అధికారం," "అసాధారణ శిక్షల నిషేధించే అధికారం" వంటివి, ఆరాజ్యాంగంలో సవరణలుగా రూపుదిద్దుకున్నాయి.

## 7.5 నిరంకుశ రాజరికానికి ఆటంకం

హక్కుల చట్టంలోని ప్రధాన ఆశయం, భవిష్యత్తులో నిరంకుశ రాజరికాన్ని పరోక్షంగా అరికట్టడం. అందుచే, దీనిలోని ఒక ముఖ్యాంశం, టెస్ట్ చట్టానికి (Test Act) సంబంధించింది. దీని ప్రకారం, కాథలిక్ మతాన్ని అవలంబించిన వారు గాని, కాథలిక్ మతస్థులను వివాహం చేసుకొన్నవారుగాని, సింహాసనానికి అనర్హులు. రాజు తన అధికారాలను పరిరక్షించుకోడానికై, లోగడ స్థాపించుకొన్న మత న్యాయస్థానాలు (Eclesiastical Courts) రద్దైనాయి. సైనిక పాలన, రెవిన్యూ వసూళ్లు మొదలైనవి, పార్లమెంట్ అనుమతి లేకపోయిన చెల్లవు. న్యాయస్థానాలను ఏదో విధంగా తన చేతుల్లో ఉంచుకోవాలనే జేమ్స్ కాలంనాటి రాజరిక విధానాలకు స్వస్తి జరిగింది.

విలియం, మేరీలను ఇంగ్లాండ్ సింహాసనానికి ఉమ్మడి పాలకులుగా నియమించడమే, నిజానికి సనాతన రాజ్యాంగ విధానాలకు భిన్నమైంది. అదే విధంగా, వారి తర్వాత సింహాసనానికి వారసత్వ నిర్ణయంలో గూడ, మార్పు గమనించ తగ్గది. హక్కుల చట్టం ప్రకారం, ఉమ్మడి పాలన, వారిలో ఒకరు మరణించేంతవరకు కొనసాగుతుంది. తర్వాత, మిగిలినవారు ఏకైక పాలకులుగా కొనసాగుతారు. వారి తర్వాత, వారి సంతానానికి సింహాసనం చెందుతుంది. సంతానం లేని పక్షంలో, మేరీ చెల్లెలైన 'ఆని' (Anne) రాణీగా ప్రకటితమౌతుంది. ఆమె తర్వాత, ఆమె సంతానికి సింహాసనం వర్తిస్తుంది. ఈ వారసత్వ నిర్ణయాన్ని తొలగింపు ప్రమాదం (Exclusion crisis) గా పిలిచేవారు. దీనివల్ల జేమ్స్‌గాని, అతని కుమారుడుగాని, సింహాసనానికి ఎటువంటి పరిస్థితుల్లోను రావడానికి వీలులేకుండా చేయడం జరిగింది. 1660లో వలె, పునరుద్ధరణ పేరుతో వారిలో ఏ ఒక్కరైనా తిరిగి సింహాసనానికి వస్తే, విప్లవ సమయంలో సాధించిన హక్కులన్నీ నిరుపయోగమౌనని, పార్లమెంట్ భావించింది. అందుచేత, హక్కుల చట్టం ద్వారా రాజుకు గల నిరంకుశాధికారాలను చెలాయించడానికి వీల్లేకుండా చేసింది. రాజు అధికారాలను కుదించడంలో, పార్లమెంట్ కొంత విజయాన్ని సాధించిందంటే, అది కేవలం చట్టం మూలంగానేగాక, పార్లమెంట్, రాజరికానికి మధ్య ఏర్పడ్డ రాజ్యాంగ పరమైన తగాదాలు, దీంతోబాటు విప్లవానంతర ఆర్థిక పరిస్థితుల సర్దుబాట్లు కూడ, కారణాలనవచ్చు.

## 7.6 ఆర్థిక విషయాల పరిష్కారం

స్టూవర్ట్ రాజుల పాలనా ప్రారంభంనుండే, పార్లమెంట్ సభ్యుల్లో కొందరు, దేశంలో రాజుకు గల ఆర్థిక వనరులు అన్ని విభేదాలకు మూలకారణమని వాదిస్తూ వచ్చారు. 1660 లో రాజు సాలీనా ఖర్చు, 12 లక్షల పౌన్లుగా అంచనా వేయటం జరిగింది. (ఇది, దేశంలోని సైనిక, నౌకాదళాల ఖర్చుతో చేరి). 1680 నాటికి విదేశీ వ్యాపారం అభివృద్ధి చెందిన కారణంగా, ప్రభుత్వ ఆదాయం

బాగా పెరిగింది. రెండో ఛార్లెస్, తర్వాత రెండో జేమ్స్ కూడ, పార్లమెంట్‌పై ఆధారపడకుండా, సుంకాల రూపంలో అనేక పన్నులు విధించి, మంచి ఆదాయంతో కొనసాగారు. కాని, 1689లో పార్లమెంట్, ఇటువంటి పరిస్థితిని కొనసాగింపదల్చలేదు. విలియం సాచివిరెల్ (William Sachiverell) అనే పార్లమెంట్ సభ్యుడు తన ప్రసంగంలో ఇలా అన్నాడు. "పార్లమెంట్ సరైన విధంగా ఎన్నుకోబడి, ఏర్పాటైంది. అదను దొరికినప్పుడెల్ల, అమిత మొత్తాలను ప్రజల నుండి వసూలుచేసి, రాజు పార్లమెంట్‌ను కాలరాయకుండా రక్షించు కొనాలి" అని, అన్నాడు. ఫిబ్రవరి ప్రారంభంనుండి సభ్యులందరు ప్రభుత్వ నిధుల విషయాలను గూర్చి చర్చించ పూనుకొన్నారు. విలియం తన నిధుల కేటాయింపు విషయంలో కామన్స్ సభ్యుల సహకారం కోసం, తనకు అప్పటికే ఉన్న పన్ను వసూలు చేసే అధికారాలను త్యజించడానికి సిద్ధమయ్యాడు. మార్చి 20 వ తేదీన, కామన్స్ సభ్యులు రాజుకు సాలీనా 12 లక్షల పౌన్లు వసూలు చేయడానికి అనుమతిచ్చారు. ఇది కేవలం ఏక పక్షంగా, ఏ విధమైన నిశిత పరిశీలన లేకుండా, నిర్ణయమైంది. శాంతి సమయాల్లో గూడ ఈ మొత్తం, రాజు అవసరాలకు సరిపోదని, తరవాత తేలింది. ఐర్లాండ్‌లోని ప్రొటెస్టెంట్లకు మద్దతుగా సైన్యాలను పంపాల్సివచ్చిన సమయంలోను, తర్వాత ఫ్రాన్స్‌తో యుద్ధం ప్రకటించాల్సొచ్చినపుడు, ఈ మొత్తాలు ఎక్కడా సరిపోవని రుజవైంది. పార్లమెంట్ మంజూరు చేసిన నిధులు సరిపోని కారణంగా, విలియం అమిత ధనాన్ని అప్పుగా సేకరించాల్సొచ్చింది. తన ఆదాయ వ్యయాలకు సంబంధించిన లెక్కలను చూపడానికి గూడ సిద్ధమేనని, విలియం పార్లమెంట్‌కు తెలియజేశాడు. అయినా, పార్లమెంట్ తన వైఖరిని మార్చుకోలేదు.

నిధుల కేటాయింపు విషయంలో పార్లమెంట్ వైఖరి, విలియంకు కోపాన్ని కల్గించింది. పార్లమెంట్‌లో సైతం, తొలుత కనిపించిన ఏకాభిప్రాయ ఘట్టం ముగిసింది. టోరీ నాయకులు విలియంను "సింహాసనాన్ని అక్రమంగా ఆక్రమించుకొన్న వానివలె" చూచారు. విగ్ నాయకులు కొందరు, తమకు ఉన్నతాధికారాలు ఇవ్వనందున, విలియం ఎడ ఆగ్రహం చెందారు. రాజుకు తగు ఆర్థిక వనరులను కల్పించాలనే ఆసక్తికన్న, టోరీలు, విగ్‌లు తమ తగాదాలను పరిష్కరించుకోడానికి, ఎక్కువ ఆసక్తిని చూపారు. అందుచేత, 1690లో విలియం కన్వెన్షన్‌ను రద్దుచేసి, కొత్త పార్లమెంట్‌ను సమావేశపర్చాడు.

BRAOU

రాజుకు నిధుల కేటాయింపు విషయాల చర్చ, పార్టీ విభేదాల మధ్య కొనసాగింది. కామన్స్ సభ్యులు, ప్రభుత్వ అధికార్ల దుర్వినియోగంపై నిందమోపుతూ, రాజుకు జీవిత పర్యంతం ఒకేసారి నిధులు కేటాయించడానికి నిరాకరించారు. మొదట 1694 వరకు, వాణిజ్య సుంకాల వసూలుకు అనుమతిచ్చారు. దాన్ని తర్వాత అంచెలుగా, 1706 వరకు కొనసాగేటట్లు పొడిగించారు. ఎక్సైజ్ సుంకాలు మాత్రం జీవిత పర్యంతానికి మంజూరైనాయి. కాని, యుద్ధం కారణంగా, సాధారణ శిస్తు రాజుకు శాశ్వతంగా వచ్చే ఆదాయమనే భావన తొలగిపోయింది. 1695 లో కామన్స్ సభ్యులు ప్రభుత్వ వ్యయానికై, దాదాపు 5 లక్షల పౌన్లు రుణంగా పొందడానికి అనుమతిచ్చారు. 1698లో, విలియం తన జీవితాంతం వసూలు చేసుకోడానికి కొన్ని పన్నులను కేటాయించారు. దాని మూలంగా, ఏట ఏడు లక్షల పౌన్ల ఆదాయం వచ్చింది. ఈ కొత్త ఏర్పాట్లవల్ల, విలియం కొంత సంతృప్తిని చెందాడు.

సివిల్ వ్యవహారాలకు, మిలిటరీ ఖర్చులకు గల వ్యత్యాసాన్ని గమనించిన పార్లమెంట్, మిలటరీ, నౌకాదళాల ఖర్చులను భరించడానికి వెనుదీయలేదు. కాని, యుద్ధాలు కొనసాగినందుచేత, సాధారణ వ్యయానికి, మిలిటరీ ఖర్చులకు గల తేడా, అట్టే నిలువలేదు. మిలిటరీ విషయాలకు మాత్రం, పార్లమెంట్ ప్రతి ఏటా చర్చించి, నిధులను నిర్ణయించింది. రాజు సివిల్ ఖర్చులకు జీవిత పర్యంతం సరిపడే నిధులను, శిస్తు మూలంగా సేకరించే వీలును కల్గజేసింది. విలియం తర్వాత, అని పాలనా కాలంలో, రాజరికానికయ్యే ఖర్చులపై పార్లమెంట్ దాని అధికారాన్ని కొంత సడలించిందని తెలుస్తుంది.

1689-90 లో విలియంకు కావాల్సిన ఆదాయాన్ని కల్పించక పోవడానికి ముఖ్య కారణం, పార్లమెంట్ ఆధిక్యతను నిరూపించుకోడానికి మాత్రమే. రాజుకు అవసరమైన నిధులు సమకూరుస్తూ వచ్చినట్లైన, రాజుకు పార్లమెంట్‌తో పని ఉండదు." అని, ఒక పార్లమెంట్ సభ్యుడు పాల్ ఫోలె (Paul Foley) అన్నాడట. "మనల్ని ఎన్నుకొన్నవారికి మనం అన్యాయం చేసిన వారమౌతాం" అని, మరికొందరన్నారు. విప్లవం ప్రసాదించిన ఆర్థిక అధికారాలను, పార్లమెంట్ రాజు చేతిలో పెట్టక పోవడానికి మరో కారణం, విలియం మీద పూర్తి నమ్మకం అప్పటికి లేకపోవడం గూడ. రాజు అధికారాలను కుదించడమే, ప్రధాన ఆశయం కాదు. మంత్రుల ప్రవర్తనను గమనించి, వారి అకృత్యాలను అరికట్టడం గూడ, పార్లమెంట్ ఉద్దేశం. ఏది ఏమైనా, రాజరిక స్వతంత్ర ఆదాయం అదృశ్యమవడం, పార్లమెంట్‌తో రాజుకు గల సంబంధాల్లో మార్పుకు దారితీసింది. పార్లమెంట్ సభ్యులు అనుకొన్నట్లైతే, అతనికి నిధులను ఆపివేసి, తమ అభీష్టానుసారం అతనిని తమ దారికి నడపించగలరు. విప్లవ ఫలితంగా ఉత్పన్నమైన రాజ్యాంగ మార్పు, ఆ విధంగా ఆర్థిక విషయాల పరిష్కారానికి ఉపయోగపడింది. రాజు మారడానికన్నా గూడ, ఇది ప్రధానమైందని చెప్పవచ్చు.

## 7.7 మత విషయాల పరిష్కారం

విప్లవానికి ముందు 1640 లో, దేశం మొత్తానికి కాథలిక్ మతస్థులు తప్ప, మిగిలిన అందరికీ ఒకే మత సంస్థ (చర్చి) అమల్లో ఉండేది. కాని, 1660 నాటికి, అటువంటి జాతీయ చర్చిలో ఉండకూడదనే వారి సంఖ్య, బాగా అభివృద్ధి చెందింది. చర్చి ఏ విధంగా కొనసాగాలనే విషయంపై, రెండు ప్రధాన అభిప్రాయాలుండేవి. అందులో మొదటి వర్గీయులు ప్యూరిటన్‌లు. వీరినే ప్రెస్బిటీరియన్లు అనికూడ అంటారు. రెండో వర్గీయులు ఆంగ్లికన్‌లు. ఈవర్గాన్ని హైచర్చి (High Church) అని కూడ పిలిచేవారు. మత విషయాల్లోగల భేదాభిప్రాయాలు, అంతర్యుద్ధానికి చాలవరకు కారణం గూడ. దీర్ఘకాలిక పార్లమెంట్ (Long Parliament) బిషప్‌లను తొలగించడం గూడ, ఇటువంటి మత వైషమ్యాల కారణంగా మాత్రమే. కాని, ఇంగ్లాండ్‌లోని ప్రెస్బిటీరియన్‌లకు, ఆంగ్లికన్ మతాధికార్ల పట్ల సహనం లేకుండేది. 1660 నాటికి, ఆంగ్లికన్‌లు, ప్రెస్బిటీరియన్‌లు, జాతీయ మత విధానం పట్ల కలతలు పడ్డారు. పునరుద్ధరణానంతరం కామన్స్ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు ఆంగ్లికన్‌లైన కారణంగా, ప్రెస్బిటీరియన్ లకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా చేశారు. వారిని అసమ్మతి వర్గీయులని (Dissenters), మతంపై నమ్మకం లేని వారని (Non-Conformists), విమర్శించారు. రాజకీయాల్లో పాల్గొనడానికి, స్వేచ్ఛగా మత ప్రచారం చేసుకోడానికి వీల్లేకుండా పోయింది. కాని, రెండో జేమ్స్ కాలంలో, ఆంగ్లికన్‌లకు వ్యతిరేకంగా అసమ్మతిపరులను (Dissenters) సమర్థించడంలో, సమస్యలు మళ్లీ తలెత్తాయి. జేమ్స్ మత సహన విధానం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని కొందరు భావించి, ప్రొటస్టాంట్లందరు ఏకం కావాలని కోరారు. అట్లు కాకుంటే, కాథలిక్‌ల అధికారం పెరుగుతుందని వారి వాదన.

విలియం, మేరీలు అధికారానికి వచ్చే సమయానికి, ఆంగ్లికన్‌లకు, ప్రెస్బిటీరియన్లకు మధ్యగల వైషమ్యాలు తొలగాయి. ప్రొటస్టాంట్లందరు తమలో తాము తగాదాలు పడరాదనే అభిప్రాయం ఏర్పడింది. వారి నాయకులు, పక్షాలు, దాదాపు ఏభై ఏండ్ల సమయంలో విసిగి వేసారారు. 1689లో మత నాయకులు కలసి, విలియంకు సమర్పించిన కోరికల పత్రంలో "ప్రొటస్టాంట్ మతస్థులు తమ మత అనుసరణ విషయాల్లో అన్ని సౌకర్యాలను కల్గి ఉండాలి" అని, కోరారు. పార్లమెంట్‌లోని ఎగువ సభలో విపులీకరణ బిల్లు (Comprehension Bill), మతసహన బిల్లు (Toleration Bill)ను

ప్రవేశపెట్టడం జరిగింది. అంతకుముందు అమల్లో ఉన్న పరీక్షా చట్టం (Test Act), కార్పొరేషన్ చట్టం (Corporation Act) వంటివి, ఆంగ్లికనేతరులను మినహాయించిన కారణంగా, విలియం వాటిని రద్దు చేశాడు. ప్రెస్బిటేరియన్‌లు గాని, తదితరులు గాని, విపులీకరణ బిల్లుపై ఆసక్తి చూపలేదు. వారికి కావలసిందల్లా మత సహనం కాబట్టి, మత సహన చట్టాన్ని సమర్థించారు. విపులీకరణ బిల్లుపై, పార్లమెంట్‌లో కూడ, విగ్ నాయకులకు గాని, టోరీలకుగానీ, ఆసక్తిలేదు. అందుచే బిల్లు వీగిపోయింది.

మత సహనానికి సంబంధించిన మత సహన చట్టాని (Toleration Act)కి, పార్లమెంట్‌లో పెద్ద వ్యతిరేకత లేదు. ఆంగ్లికన్‌లు, ప్రెస్బిటేరియన్‌లు దాన్ని సమర్థించారు. అందుచే, ఇది సులభంగా 1689 లో రూపొందింది. దీని మూలంగా, దేశంలో ప్రార్థనా స్వాతంత్ర్యం స్థాపితమైంది. ఇంగ్లాండ్‌లో మరెప్పుడూ లేనంతగా, విప్లవ సమయంలో ఆంగ్లికన్ చర్చి, మిక్కిలి శక్తివంతమైందిగా తయారైంది. అసమ్మతి వర్గీయులతో రాజీపడ్డం మూలాన, మరింత శక్తివంతమైంది. మత సహన చట్టం మూలంగా, ఆంగ్లికన్ మతాన్ని ఎదిరించే పక్షాలు గూడ, దేశంలో పురోగాభివృద్ధికి దోహదం చేయడానికి సందేహించలేదు. ఇతర ఐరోపా దేశాల్లో, మత శక్తులకు, రాజకీయ అభివృద్ధికి కల్గిన ప్రతిష్టంభన, ఇంగ్లాండ్‌లో జరగలేదు. "రాజు దైవాంశ సంభూతుడనే అభిప్రాయం చర్చి నాయకుల్లో కొనసాగినా, మతసహన చట్టం మూలంగా, రాజుకు పూర్తి విధేయత ఉండాలని గాని, లేదా కొత్త రాజుకు తమ విధేయత తెలియజేసే ప్రతిజ్ఞ చేయడం (Oath of allegiance), తొలగించడం జరిగింది. ఆనాటి కాంటర్‌బరీ అర్చిబిషప్ అయిన సాంక్రాఫ్ట్ (Sancroft) అట్టి విధేయతా ప్రతిజ్ఞ చేయడానికి నిరాకరించడమేగాక, తన అనుయాయులెవ్వరూ అటువంటి ప్రతిజ్ఞ చేయ నవసరం లేదని ప్రకటించాడు. వారందరిని నాన్‌జ్యూరర్స్ (Non-Jurors) అనే పిలవడం జరిగింది.

మతసహన చట్టం కాథలిక్‌లను, యూదులను (Jews), సోషియన్‌లను (Sociations) వెలివేయడానికి ఉద్దేశితమైంది. చర్చిని విమర్శించిన వారిని సోషియన్లని పిలిచేవారు. దేశంలో కాథలిక్‌ల సంఖ్య తక్కువే. కాని, ఉదాహరణకు, ప్రొటస్టంట్లలో అసమ్మతిపరులుగా ( Dissenters) పరిగణించబడిన వారందరూ, ఆంగ్లికన్‌లతో సమానంగా అధికారాలను పొందలేదు. వారందరు, మత సుంకాలను చెల్లిస్తూ వచ్చారు. మునిసిపాలిటీల వంటి స్థానిక సంస్థల రాజకీయాల్లో పాల్గొనడానికి వారికి ఆస్కారం లేక, రెండో తరగతి పౌరులుగా కొనసాగారు. విలియం అటు స్పెయిన్‌కు, ఇటు ఆస్ట్రియాకు సన్నిహితుడైన కారణంగా, ఇంగ్లాండ్‌లోని కాథలిక్‌లకు సంరక్షణ కలిగించాల్సిన అవసరముంది. చట్ట ప్రకారం కాథలిక్‌లను వెలివేసినా, విలియం మనస్తత్వంచేత, ఇంగ్లాండ్ దేశానికి ఐరోపాదేశాలతో గల దౌత్య సంబంధాలచేత, శాస్త్రీయ మానవతావాద ప్రాబల్యం మూలంగా, దేశంలోని కాథలిక్‌లు ఏ విధంగాను మతపరంగా ఇబ్బందులకు గురిగాక పోవడం, గమనార్హం.

## 7.8 యుద్ధాలు : విజయాలు

రాజ్యాంగపరంగా విలియం, మేరీలు, పార్లమెంట్ సూచనల మేరకు ఉమ్మడి పాలకులుగా సింహాసన మధిష్ఠించినా, పూర్వ రాజు జేమ్స్ ఐర్లాండ్, స్కాట్‌లాండ్‌ల్లో తన సైన్యాలను సమీకరించి, కొత్త రాజదంపతులకు (కూతురు, అల్లుడైనా సరే) సమస్యలను కలిగిస్తూ వచ్చాడు. అందుకే, 1690 జూలైలో, విలియం స్వయంగా తన సైన్యాలను ఐర్లాండ్‌కు నడిపించాడు. ఫ్రెంచి సేనల సహాయంతో, ఐర్లాండ్ సేనలు పోరాడాయి. కాని, విలియం ఔగ్రిన్ (Aughrin) వద్ద, ఐరిష్ సేనలను ఓడించాడు. ఐర్లాండ్‌లోని కాథలిక్ నాయకులను అణచివేయడం జరిగింది. రాజకీయ అధికారాలను పొందిన

పార్లమెంట్, ఐర్లాండ్‌లో ప్రొటస్టాంట్ల ఆధిక్యతకు తగిన చర్యలను గైకొన్నది. ఇంగ్లాండ్‌లో అమల్లో ఉన్న మత సహన చట్టం (Toleration Act) ఐర్లాండ్‌కు అన్వయించబడలేదు. విలియం స్కాట్‌లాండ్ పై గూడ, తన ఆధిక్యతను నెరపుకోగలిగాడు. ఉత్తర ప్రాంతంలోని ఒక తెగవారు రాజుకు విధేయుల మనే ప్రతిజ్ఞ చేయడంలో జాప్యం చేశారనే నేరం కింద, వారిననేకులు చిత్రహింసచేసి, చంపివేసారు. విలియం అనుయాయులు చేసిన అట్టి కిరాతక కృత్యాలతో, స్కాట్‌లాండ్ కూడ విలియంకు ఎదురు తిరగడానికి వెనుకాడింది.

ఇంగ్లాండ్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్‌ల మీద పూర్తి అధికారాన్ని స్థాపించుకొన్న మూడేళ్లలో, విలియం బ్రిటీష్ సైన్యాలను సముద్రాలు దాటించి, విదేశీ యుద్ధాల్లో పాల్గొన్నాడు. డచ్, ఆస్ట్రియా, స్పెయిన్, సెవాయ్, ప్రష్యా సైన్యాలు, ఫ్రాన్స్ రాజైన పద్నాల్గో లూయికి వ్యతిరేకంగా, ఆగ్స్‌బర్గ్ సమాఖ్య యుద్ధం (War of the League of Augsburg)లో పాల్గొన్నాయి. విలియం ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా మిత్ర పక్షాల వైపు చేరి, స్పానిష్ నెదర్లాండ్స్‌ను లూయి బారి నుండి రక్షించగలిగాడు.

1694 డిసెంబర్‌లో మేరీ మరణించింది. విలియం ఇంగ్లాండ్ రాజుగా, కొనసాగి, 1697లో ఫ్రాన్స్‌తో రిస్విక్ సంధి (Treaty of Ryswick)ని, కుదుర్చుకొన్నాడు. ఈ సంధి షరతుల్లో భాగంగా, విలియంను ఇంగ్లాండ్ రాజుగా ఫ్రాన్స్ గుర్తించింది. ఆవిధంగా, ఇంగ్లీష్ విప్లవాన్ని ఐరోపా దేశాలన్నీ గుర్తించాయని చెప్పొచ్చు. 1702 మార్చి, 8వ తేదీన, విలియం మరణించాడు. హక్కుల చట్టంలో ఉదహరించిన విధంగా, మేరీ సోదరైన 'ఆని' (Anne) ఇంగ్లాండ్ సింహాసనాన్ని అధిష్టించింది. విలియం మరణ సమయానికి, ఇంగ్లాండ్ ఐరోపాలో శక్తివంతమైన ప్రొటస్టాంట్ దేశంగా పరిగణనకు వచ్చింది. స్కాట్‌లాండ్, ఐర్లాండ్ ప్రాంతాలపై గూడా, ఇంగ్లాండ్ రాజు తిరుగులేని అధికారాన్ని నెరపుకోగలిగాడు.

## 7.9 సంగ్రహంగా

రాజరికంలో మార్పు, హక్కుల చట్టం, ఆర్థిక, మత పరిస్థితుల పరిష్కారం, మత సహన చట్టం మొదలైన ఘట్టాలను పరిశీలించినట్లైతే, ఇది మహోజ్వల విప్లవమనడానికి చాలదేమోననిపించక మానదు. కాని, నిజానికి ఈ విప్లవం, తర్వాత సంభవించిన అమెరికన్, ఫ్రెంచి విప్లవాలకు మార్గదర్శకమైంది. ఈ విప్లవాలన్నిటికి జాన్‌లాక్ (John Locke) రచనలు జీవం పోశాయి. ఇంగ్లీష్ విప్లవాన్ని "జాతీయ విప్లవం" లేదా "బూర్జువా విప్లవ" మనడానికి బహుశా అభ్యంతరాలుండవచ్చు కాని, ఇది, దేశంలో సనాతన సిద్ధాంతమైన రాజు దైవాంశసంభూతుడనే భావనకు గొడ్డలిపెట్టు. 1688 తర్వాత, ఇంగ్లాండ్‌లోని ప్రభుత్వ విధానం, పరిపాలనా పద్ధతులు, అక్కడి సమానత్వం, సమకాలీన ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. అంతరంగికంగా సమర్థవంతమైన పరిపాలన, విదేశీ విధానంలో విజయవంతమైన యుద్ధాల మూలంగా, ఇంగ్లాండ్ మిక్కిలి శక్తివంతమైందిగా గుర్తింపు పొందింది.

1688 లో జరిగిన మహోజ్వల విప్లవానికీ, అంతకుముందు 1642-49 లో సంభవించిన 'ఆంగ్లేయ విప్లవానికి' (British Revolution), చాల సామ్యం ఉంది. 1688 విప్లవం అతి త్వరితంగా ముగిసింది. నూతనోత్తేజంతో కొత్త భావాలకు, ప్రయోగాత్మక రాజ్యాంగ విధానాల అమలుకు, మతపరమైన సుదీర్ఘ తగాదాలకు, ఇందు ఆస్కారం లేకపోయింది. 17వ శతాబ్ది మధ్యలో జరిగిన విప్లవంతో పోలిస్తే 1688 విప్లవానికి స్పష్టంగా, కొట్టొచ్చినట్లు కన్పించే ఫలితాలు, జాతీయంగానేగాక, అంతర్జాతీయంగాకూడ,



BRAOU

మిక్కిలి ప్రధానమైన వని తోస్తాయి. ఆధునిక యుగంలో ఏర్పడ్డ బ్రిటీష్ అధిక్యతకు, ఐరోపాలో బ్రిటన్ నాయకత్వానికీ, 1688 విప్లవం నాంది అని చెప్పవచ్చు.

## 7.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. హక్కుల చట్టంలో బ్రిటీష్ సింహాసనానికి వారసత్వ పరిష్కారం ఏ విధంగా నిర్ణీతమైందో వివరించండి.

2. హక్కుల చట్టంలోని ప్రధాన అంశాలను తెల్పి, అవి దేశ చరిత్రలో ఎట్టి మార్పులకు దారితీశాయో పరిశీలించండి.

3. మహోజ్వల విప్లవానంతరం, ఇంగ్లాండ్‌లో రాజ్యాంగ, ఆర్థిక, మత విషయాల పరిష్కార మెలా జరిగింది?

4. 1642-49 మధ్యకాలంలో జరిగిన అంతర్యుద్ధానికి, 1688లో సంభవించిన మహోజ్జ్వల విప్లవానికి, లక్ష్యాలు, సాధన, ఫలితాలు, ప్రాముఖ్యతలోగల వ్యత్యాసాలను పరిగణించండి.

**II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. 1688 విప్లవం, హక్కుల చట్టం ప్రాముఖ్యతాప్రత్యేకతలు

2. మతసహన చట్టం

B R A O U

## 7.11 ఉపయుక్త గ్రంథాలు

J.P. Kenyon : **Stuart England, London, 1978**

John Carswell : **From Revolution to Revolution, 1688-1776**

J.R. Western : **Monarchy and Revolution**

Lucille Pinkham : **William III and the Respectable Revolution**

Maurice Ashley : **The Glorious Revolution of 1688**

G.B. Adams : **Constitutional History of England**

G.M. Trevelyan : **England under the Stuarts**

BRAOU

# ఖండం-III : అమెరికా స్వాతంత్ర్య సమరం

## పరిచయం

ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. ఈ నాలుగు భాగాలు అమెరికా స్వాతంత్ర్య సమరాన్ని గూర్చి, స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో, అటు తర్వాత జరిగిన రాజ్యాంగ నిర్మాణాన్ని గూర్చి తెలుపుతాయి. ఆంగ్లేయులు 17 వ శతాబ్దంలో ఉత్తర అమెరికా ఖండంలో అట్లాంటిక్ తీరం వెంబడి స్థాపించిన 13 వలసలను గూర్చి, ఈ ఆంగ్ల వలసలకు మాతృదేశమైన బ్రిటన్‌లోని ప్రభుత్వంతో తమ రాజకీయ, సాంఘిక, ఆర్థిక హక్కుల, ప్రయోజనాల విషయమై ఏర్పడ్డ అభిప్రాయ భేదాలను గూర్చి తెలుపుతాయి. ఈ అభిప్రాయ భేదాలు చివరకు అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి కారణాలుగా మారిన విధానాన్ని వివరిస్తాయి. అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, యుద్ధ గమనం, యుద్ధాన్ని పరిసమాప్తి గావించిన ప్యారిస్ సంధిని గూర్చి తెలుపుతాయి. యుద్ధ కాలంలో, అటు తర్వాత వలసల్లో, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో రాజ్యాంగ నిర్మాణానికై జరిగిన ప్రయత్నాలను సమీక్షిస్తాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ ప్రధాన లక్షణాలను విశదీకరిస్తాయి.

ఉత్తర అమెరికా ఖండంలోని 13 ఆంగ్లేయ వలసలు 1775 ఏప్రిల్ 19న స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రారంభించాయి. ఈ 13 వలసలు 1776 జూలై 4న బ్రిటీష్ పరిపాలనను నిరాకరిస్తూ చేసిన స్వాతంత్ర్య ప్రకటన ద్వారా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనే నూతన రాజ్యం ఆవిర్భవించింది. అమెరికా స్వాతంత్ర్య సమరం 1763 ప్యారిస్ సంధితో అంతమైంది. 1787లో అమెరికా సంయుక్త రాష్ట్రాలు నేడు అమల్లో ఉన్న నూతన రాజ్యాంగాన్ని రూపొందించుకొని, 1789 నుండి దాన్ని అమల్లోకి తెచ్చింది.

BRAOU

అమెరికన్ విప్లవానికి గల కారణాలేమి? అనే సూటి ప్రశ్నకు చరిత్రకారులందరూ ఏకగ్రీవంగా అంగీకరించిన సమాధానం లేదు. వీరు దీనికి సమాధానంగా పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు చెప్పారు. వ్యాఖ్యలు చేశారు. ఈ అభిప్రాయాల నుండి, వ్యాఖ్యల నుండి, చరిత్ర విద్యార్థి తన సొంత సమాధానాన్ని, లేక అభిప్రాయాన్ని, రూపొందించుకోవలసిన అగత్యం ఏర్పడుతున్నది. కొందరు చరిత్రకారుల అభిప్రాయంలో, బ్రిటీష్ పౌరులైన వలస ప్రజల మానవ హక్కులకు సంబంధించిన సమస్యమాత్రమే, ఈ పోరాటానికి కారణం కాజాలదు. వలస ప్రజల మధ్య, ఇంగ్లాండ్ మధ్య, రాజకీయమైన, రాజ్యాంగపరమైన భేదాలు ఉన్నప్పటికీ, ఈ భేదాల వెనక వాటికి అతీతమైన, వాటికి దారితీసిన ఆర్థిక లేదా సాంఘిక కారణం వేరొకటి ఉందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం; వారి అభిప్రాయంలో ఈ కారణాన్ని లేదా కారణాలను తొలగించి ఉంటే, ఈ భేధాలు సమసిపోయి ఉండేవి; బహుశా, విప్లవం జరిగి ఉండేది కాదు. ఈ అభిప్రాయానికి ప్రతిగా, ప్రజాస్వామిక స్వయంపాలనను గూర్చి వలస ప్రజలకు గల అభిప్రాయాలు విప్లవ పోరాటానికి దారి తీయటంలో అత్యంత ప్రాధాన్యం వహించాయని కొందరు చరిత్రకారుల దృఢాభిప్రాయం; వారి ఉద్దేశంలో విప్లవకారుల రాజకీయాభిప్రాయాలను వారు ఆచరించిన భౌతిక (ఆర్థిక) ప్రయోజనాల చేతగాని, మరే ఇతర అంతర్గత తర్కం చేతకాని, మనం పూర్తిగా వివరించలేం.


ప్రతి చారిత్రక పరిస్థితికి మౌలికంగా కొన్ని ఆర్థిక కారణాలు, గతి తార్కిక కారణాలు ఉంటాయని, కార్ల్‌మార్క్స్ పంథాలో విశ్వసించిన చరిత్రకారులు, అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి ఆర్థికపరమైన కారణాలు ప్రధానమని భావించారు. చార్లెస్ బియర్డ్, లూయిస్ హ్యాకర్ మొదలైన రచయితలు

ఈ ఆర్థికపరమైన కారణాలను చర్చించారు. పోరాటానికి ప్రధానమైన కారణం, వలస ప్రజల రాజకీయాదర్శమే అనే విశ్వాసం వీరి తీవ్ర విమర్శకు గురైంది.

పైన చెప్పిన దాన్ని బట్టి, అమెరికా స్వాతంత్ర్య పోరాట స్వభావాన్ని గూర్చి, దానికి గల కారణాలను గూర్చి, చరిత్రకారుల్లో ప్రధానంగా రెండు విధాలైన దృక్పథాలు ఉన్నాయి. 1) పోరాటానికి ప్రధాన కారణం వలసలకు, మాతృదేశానికి మధ్యగల ఆర్థిక పరమైన భేదాభిప్రాయాలు. 2) వలసలకు, మాతృదేశానికి మధ్య, రాజకీయాదర్శాలను గూర్చి ఏర్పడ్డ భేదాభిప్రాయాలు. లూయీ యం. హ్యాకర్ మొదలైన చరిత్రకారులు ఆర్థికపరమైన కారణాలను ప్రధాన కారణాలుగా సమర్థించగా, కార్ల్ బెకర్, క్లాడ్. హెచ్. వ్యాన్ టైన్ మొదలైన చరిత్రకారులు రాజకీయాదర్శపరమైన, భావపరమైన కారణాలను ప్రధాన కారణాలుగా సమర్థించారు. ఈ రెండు అభిప్రాయాలేగాక, నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాద రాజకీయాలు, బ్రిటన్‌కు ఫ్రాన్స్‌తోగల వైరం, దాని పరిణామాలు మొదలైనవి, అమెరికన్ విప్లవ పోరాటానికి దారితీసినట్లు చెప్పిన చరిత్రకారులు కూడా ఉన్నారు. అట్లే పోరాటానికి ఒక ప్రధాన కారణంగా భావించిన 1763 తర్వాతి బ్రిటీష్ వలస విధాన స్వభావాన్ని గూర్చి కూడా విభిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వలస ప్రజలలోని వివిధ వృత్తి వర్గాల వారికి ఆర్థికపరమైన, రాజకీయాదర్శపరమైన సమస్యలను గూర్చి ఎట్టి అవగాహన ఉండింది, వారు ఆ సమస్యలకు ఎట్లు స్పందించారు అనే విషయాలుకూడా చర్చనీయాంశాలే.

అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి గల కారణాలవలెనే, అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ నిర్మాణంలో కూడా, రాజ్యాంగ నిర్మాతల ధ్యేయాన్ని గూర్చి ఏకాభిప్రాయం లేదు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలో ప్రవచించిన ప్రజాస్వామ్య ఆశయాలను, సిద్ధాంతాలను, 1787 రాజ్యాంగం ఎంతవరకు పునరుద్ఘాటించింది, లేదా ఎంత వరకు వాటిని నిరాకరించింది అనేది ఆ రాజ్యాంగ స్వభావానికి సంబంధించిన ప్రధాన చర్చనీయాంశం. ఆ రాజ్యాంగం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ధనిక, కులీన వర్గాలు తమ 'ప్రయోజనాలను సాధించుకోవటానికి రూపొందించినదేకాని, సామాన్య ప్రజల ప్రయోజనాలను, ప్రజాస్వామ్య ఆశయాలను సాధించటానికి రూపొందించింది కాదని, జాన్ సి. మిల్లర్, మెరిక్లజెన్‌సెన్, చార్లెస్. ఎం. బియర్డ్ మొదలయిన చరిత్రకారులు భావించారు. దీనికి ప్రతిగా, పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవాలనే ఉద్దేశం 1787కు ముందు చాలా కాలం నుండే అమెరికన్లకు ఉండిందని, అందువల్ల రాజ్యాంగ నిర్మాతలు వారి సొంత ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోవటానికి రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పటం భావ్యం కాదని, ఇ.యస్. కార్విన్, చార్లెస్ వ్యారెన్ మొదలయిన చరిత్రకారుల అభిప్రాయం. రాల్ఫ్ బార్టన్ పెర్రీ, ఎ.సి. మెక్‌లాఫ్లిన్‌లు కూడా తమ రచనల్లో, రాజ్యాంగం చాలా వరకు స్వాతంత్ర్య ప్రకటనలో ప్రవచించిన ప్రజాస్వామ్య ఆశయాలను, సిద్ధాంతాలను ప్రతిబింబించిదని భావించారు.

అమెరికా స్వాతంత్ర్య సమరం, సమానత్వం, స్వేచ్ఛ, మొదలుగాగల ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు స్ఫూర్తినిచ్చి, తర్వాతి ఫ్రెంచి విప్లవానికి ప్రేరణ నిచ్చింది. ప్రపంచంలోని ప్రజా విప్లవాలకు అమెరికా స్వాతంత్ర్య పోరాటం మొదటి శంఖారావమైందని చెప్పటంలో అతిశయోక్తి లేదు. ఫ్రెంచి విప్లవ తాత్త్వికుడు వోల్టేర్ చెప్పినట్లు, "అమెరికా అరణ్యాల్లో వెలిగించిన (విప్లవ) జ్యోతి ఐరోపానంతా ప్రజ్వరిల్ల చేసింది." ['A torch lighted in the forests of America set all Europe in conflagration' - VOLTAIRE]




ఉత్తర అమెరికా ఖండంలోని తూర్పు ప్రాంతంలో ఐరోపీయ వలసలు

# భాగం-8 : వలసలు

విషయక్రమం

8.0 లక్ష్యాలు

8.1 నూతన ప్రపంచ ఆవిష్కరణ

8.2 స్పెయిన్ వలసలు

8.3 ఫ్రెంచి వలసలు

8.4 ఆంగ్లేయ వలసలు

8.5 స్వాతంత్ర్య పోరాటకాలం (1775) నాటికి వలసల ప్రగతి

8.5.1 రాజకీయ పరిణామాలు

8.5.2 సాంఘిక సిద్ధాంతాలు

8.5.3 ఆర్థిక దృక్పథాలు

8.6 సంగ్రహంగా

8.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.8 ఉపయుక్త గ్రంథాలు

## 8.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- కొలంబస్ నూతన ప్రపంచాన్ని (అమెరికా ఖండాన్ని) కనుగొన్న తర్వాత, అక్కడ వివిధ ఐరోపా దేశాలు, లేదా జాతులు ఏర్పరచిన వలసలు.
- వలసలను స్థాపించడంలో ఇంగ్లీషువారు అనుసరించిన విధానాలు
- ఇంగ్లీషువారు స్థాపించిన మొదటి 13 వలసలు.

## 8.1 నూతన ప్రపంచ ఆవిష్కరణ

1492 లో క్రిస్టఫర్ కొలంబస్ నూతన ప్రపంచమని పిలిచిన అమెరికా ఖండాన్ని కనుగొన్నాడు. ఇటలీ దేశ నావికుడైన కొలంబస్, స్పెయిన్ దేశ రాజు ఫెర్డినాండ్, రాణి ఇసబెల్లా అందించిన ఆర్థిక సహాయంతో, 1492లో ఆసియాకు నూతన మార్గాన్ని అన్వేషించడానికి, స్పెయిన్ నుండి బయలుదేరి, అట్లాంటిక్ సముద్రం మీద పశ్చిమ దిశగా పయనించాడు. మార్గంలో ఎన్నో కష్టాలను అధిగమించి, అనుచరులతో ఆ సముద్రాన్ని దాటి, 1492 అక్టోబర్ 12 న బహామా దీవుల్లో ఒక టైన వాట్లండ్స్ దీవిని చేరాడు. అటు తర్వాత, కొలంబస్ మూడు సార్లు అట్లాంటిక్ సముద్రాన్ని దాటి,

అమెరికా తీరాన్ని అన్వేషించాడు. ఒక ప్రయాణంలో హైతీ దీవులను చేరాడు. ఈ విధంగా, అమెరికా ఖండాన్ని కనుక్కునే ప్రయత్నంలో స్పెయిన్ ముందంజవేయడం జరిగింది.

నూతన ప్రపంచ ఆవిష్కరణ కొలంబస్ ప్రయత్నంవల్ల జరిగినా, దానికి, 'అమెరిగో వెస్పూచ్చి' అనే ఇటలీ దేశస్థుని పేరు మీదుగా, అమెరికా ఖండమనే పేరు ఏర్పడింది. అమెరిగో వెస్పూచ్చి 1501 లో బ్రెజిల్ తీరంలో పర్యటించి, అక్కడ తాను చూచిన విశేషాలను గూర్చి, కొన్ని లేఖలు రాసి, ప్రకటించాడు. ఈ నూతన ప్రపంచానికి ఏదో ఒక పేరు పెట్టవలసి వచ్చినపుడు, నాటి భౌగోళిక శాస్త్రజ్ఞులు అమెరిగో వెస్పూచ్చి పేరుమీదుగా, దాన్ని అమెరికా అని పిలవాలని సూచించారు. నాటి నుండి నూతన ప్రపంచానికి అమెరికా అనే పేరు నిల్చిపోయింది.

## 8.2 స్పెయిన్ వలసలు

క్రిస్టఫర్ కొలంబస్ తర్వాత స్పెయిన్‌కు చెందిన హెర్నాండో కార్టెస్, 1521లో నౌకాబలంతో మెక్సికోకు వెళ్లి, స్థానికులైన అజ్‌టెక్‌లను జయించి, నిర్మూలించి, మెక్సికోను ఆక్రమించాడు. 1531-1535 సంవత్సరాల మధ్య, ఫ్రాన్సిస్కో పిజరో, పెరూలో, వెండి బంగారులతో తులతూగు తున్న ఇన్కాల నాగరితను నిర్మూలించి, వారి సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. స్పెయిన్‌వారు నూతన ప్రపంచంలో తమ వలసల స్థాపనను, మధ్య, దక్షిణ అమెరికాలలో, పశ్చిమ ఇండియా దీవులలో ఎక్కువగా కేంద్రీకరించారు. దీనికి ముఖ్య కారణం, ఈ ప్రాంతాలలో వెండి, బంగారాలు ఎక్కువగా లభించడమే. ఈ సంపదను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలనే ఆశతో, వారు తమ ఆధిపత్యాన్ని ఈ ప్రాంతాలకే ఎక్కువగా పరిమితం చేసుకున్నారు. నేడు అమెరికా సంయుక్తరాష్ట్రాలని పిలుస్తున్న ప్రాంతంలో, వారు ఎక్కువగా వలసలను స్థాపించలేదు. స్పెయిన్ వారు 1565 లో సెయింట్ అగస్టిన్ వద్ద స్థాపించిన వలస, నేటి, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తెల్లవారు స్థాపించిన మొట్టమొదటి వలస.

1493 లో పోప్ (Pope) ఈ నూతన ప్రపంచాన్ని, స్పెయిన్, పోర్చుగల్ దేశాల మధ్య పంచాడు. పోప్ ఈ రెండు దేశాల మధ్య ఏర్పరచిన సరిహద్దు రేఖను, 1494లో జరిగిన టార్డెసిల్లాస్ ( Tordesillas) సంధి ద్వారా కొంత మార్చారు. ఈ సంధి మేరకు, అమెరికా ఖండంలో అత్యధిక భాగం స్పెయిన్‌కు చెందగా, బ్రెజిల్ పోర్చుగల్ స్వాధీనమైంది. పదిహేనో శతాబ్దం చివరకు, స్పెయిన్ ఉత్తర, మధ్య, దక్షిణ అమెరికాలలో విస్తరించిన ఒక విశాల సామ్రాజ్యాన్ని స్థాపించింది. ఈ సామ్రాజ్యం ఉత్తరంలో రియోగ్రాండ్‌నది, కాలిఫోర్నియా సింధు శాఖలతో మొదలై, దక్షిణంలో బ్యూనాస్ ఎయిర్స్ (Buenos Aires) సాంటియాగోల వరకు, ఉత్తరం నుండి దక్షిణానికి దాదాపు 10,000 కిలోమీటర్లు విస్తరించి ఉండింది. ఇంత విస్తారమైన సామ్రాజ్యంతో తృప్తిచెందక, బ్రెజిల్‌ను మినహాయించి, మిగిలిన పశ్చిమార్ధగోళం మీద అంతా తనకు సంపూర్ణ అధికారం ఉందని స్పెయిన్ ప్రకటించింది. అయితే, 1600 తర్వాత స్పెయిన్, నూతన ప్రపంచంలోని కొత్త ప్రదేశాల్లో వలసలను స్థాపించి, తన అధికారాన్ని విస్తరింపచేయలేదు. నాటికే ఆక్రమించిన సామ్రాజ్యంలో స్పెయిన్ వారు స్థిరపడి, ఆసామ్రాజ్య సంపదను అనుభవించసాగారు. 1600 నాటికి, నేటి ఫ్లొరిడాకు ఉత్తర ప్రాంతాల్లో, తెల్లవారు (ఐరోపీయులు) ఎవ్వరూ ప్రవేశించలేదు.

## 8.3 ఫ్రెంచి వలసలు

నూతన సముద్ర మార్గాల అన్వేషణను, ఫ్రెంచివారు కూడా కొనసాగించారు. జాక్వెస్ కార్టియర్ 1585లో సేంట్‌లారెన్స్ నది ముఖద్వారం ద్వారా ఎగువకు ప్రయాణించి, ఇప్పటి కెనడాలోని

మాంట్రియల్ ప్రాంతాన్ని, అన్వేషించాడు. శామ్యూల్ డి చాంప్లేన్ (Samuel de Champlain) క్విబెక్ (Quebec) వలసను స్థాపించి, ఆ ప్రాంతాన్ని 'న్యూఫ్రాన్స్' అని పేర్కొన్నాడు. ఇతడే మొదటి ఫ్రెంచి గవర్నర్. ఈ వలస సామ్రాజ్య స్థాపనా ప్రయత్నం, హ్యూజినో ఉన్ని వ్యాపార కంపెనీ (Fur Trading Company) వల్ల జరిగింది. 1682లో, లూయీ సాల్ అనే ఫ్రెంచి అన్వేషకుడు మిసిసిపీ నది మీద, దాని ముఖద్వారం వరకు పయనించి, దాని లోతట్టు మైదాన ప్రాంతానికంతా, ఫ్రెంచి రాజైన 14వ లూయీ పేరున 'లూసియానా' అని పేరుపెట్టాడు. ఫ్రాన్స్‌లో కోల్బర్ట్ మంత్రిగా అధికారానికి రావడంతో, 1663 నుండి ఫ్రెంచి వలసలపై కంపెనీ యాజమాన్యం అంతరించి, ఫ్రెంచి రాజు పాలన ప్రారంభమైంది. 1700 నాటికి ఉత్తర అమెరికాలోని ఫ్రెంచి వలసలు, అకాడియా, సేంట్‌లారెన్స్, సింధుశాఖల నుండి మెక్సికో సింధుశాఖ వరకు వ్యాపించాయి. ఫ్రెంచి వలసలు విస్తరించిన ప్రాంతాని కంతా 'లూసియానా' అనే పేరు స్థిరపడింది.

కొలంబస్ అమెరికాను కనుగొన్న తర్వాత వంద యేండ్లకు పైబడి, అమెరికా ఖండంలో ఒక్క స్పెయిన్ దేశస్థులు మాత్రమే శాశ్వతమైన వలసలను స్థాపించారు. ఈ నూతన ప్రపంచంలోని విస్తారమైన సంపదను స్పెయిన్ మాత్రమే అనుభవించటం, మిగిలిన ఐరోపీయ జాతులకు, ముఖ్యంగా ఫ్రెంచివారికి, ఇంగ్లీషువారికి ఏమాత్రం ఇష్టంలేదు. అయితే, వారు చాలాకాలం అమెరికా ఖండంలో వలసలను స్థాపించే ప్రయత్నాలు ఏమీ తలపెట్టక, చేయక, అమెరికాలోని స్పెయిన్ సామ్రాజ్యంతో రాకపోకలు జరిపే స్పెయిన్ నౌకలను దోచి, దానితో తృప్తిపడ్డారు. దీనికి ప్రధాన కారణం, అమెరికాలో వెండి, బంగారు గనులు ఉండి, మిక్కిలి సంపన్నమైన భూభాగాన్నంతా స్పెయిన్ ఆక్రమించి, తన సామ్రాజ్యాన్ని నెలకొల్పటమే. స్పెయిన్ ఆక్రమించక వదలిన ఉత్తర ప్రాంతాల్లో, వెంటనే లాభాలు చేకూర్చగల ఇట్టి వనరులు (Resources) లేవు. కాని చివరకు, కొన్ని విఫల ప్రయత్నాల తర్వాత, ఉత్తర అమెరికా భూఖండంలో పదిహేడో శతాబ్దం మొదటిలో ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు శాశ్వతమైన వలసలను స్థాపించారు. వారిని వెంబడించి, డచ్చివారు, స్వీడన్ దేశస్థులు కూడా పరిమితంగా కొన్ని వలసలను స్థాపించారు.

## 8.4 ఆంగ్లేయ వలసలు

ఉత్తర అమెరికాలో విస్తారమైన భూభాగాల మీద తమకు స్వామ్యమున్నట్లు, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ప్రకటించాయి. చట్టం దృష్టిలో ఈ భూభాగాల మీద ప్రథమ స్వామ్యం రాజుకు చెందుతుంది. రాజు అనుమతి పొంది, అక్కడ వలసలను, చట్టరీత్యా, స్థాపించవచ్చు. బ్రిటీష్ ప్రభుత్వం నూతన ప్రపంచంలో తానుగా పూనుకొని వలసలను స్థాపించే ప్రయత్నాన్ని పెట్టుకోలేదు. వలసలను స్థాపించటానికిగాను, ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాలను రాజు, పెట్టుబడి పెట్టి వలసలను స్థాపించి, లాభాలను ఆర్జించాలనుకునే కొన్ని వ్యాపార సంస్థలకు, లేదా వ్యక్తిపరంగా కొందరు యజమానులకు దత్తం చేస్తాడు. ఈ కంపెనీలు లేదా యజమానులు, తాము స్థాపించిన వలసల్లో స్థిరపడ్డవారికి అక్కడి భూములను పంపకం చేస్తారు. వలసల్లో స్థిరపడ్డవారికి, అక్కడి భూముల మీద హక్కు, చట్ట రీత్యా, ఈ విధంగా లభిస్తుంది. కాని, ఆచరణలో వలసల్లో ఒక వలసదారు (Colonist) ఎవ్వరి అనుమతి లేక, తాను ఆక్రమించిన భూమి మీద తన స్వామ్యాన్ని, లేక హక్కులను నిలదొక్కుకొనేవాడు; ప్రభుత్వం అతనిని ఆభూమినుండి తొలగించలేకపోయేది. ఇట్లా భూమి దురాక్రమణ చేసిన వారికి (Squatters), భూమి మీద చట్ట రీత్యా హక్కును పొందినవారికి, మధ్య ఏర్పడ్డ సంఘర్షణ, దాదాపు రెండున్నర శతాబ్దాల ఉత్తర అమెరికా అభివృద్ధిలో ఒక ప్రధానాంశంగా ఉండింది.

అమెరికాలో ఆంగ్లేయులు ప్రధానంగా రెండు విధాలైన వలసలను స్థాపించారు. (1) కంపెనీ వలస: ప్రభుత్వం నుండి అనుమతి పొందిన ఒక వ్యాపార సంస్థ (Chartered Trading Company), ప్రధానంగా లాభాల నార్జించే దృష్టితో స్థాపించిన వలస; 2) యాజమాన్య వలస (Proprietary Colony) : ప్రభుత్వం నుండి అనుమతి పొందిన ఒక యజమానో, లేక కొందరు యజమానులో, లాభాలు ఆర్జించటానికి గాని, లేక కొన్ని ఉదార ఆశయాలతోగాని, స్థాపించిన వలస. రాజు ఒక భూప్రాంతాన్ని ఒక కంపెనీకికాని, లేదా ఒక యజమానికిగాని ఇచ్చినప్పుడు, ఆ భూమితోపాటు దాన్ని పరిపాలించే అధికారం కూడా వారికి ఇచ్చేవాడు. అందువల్ల, ఆప్రాంతంలో వలసలను స్థాపించటానికి పెట్టుబడి పెట్టిన వ్యక్తులకు, ఆవలసల మీద రాజకీయ అధికారం ఉండేది. వీరు సామాన్యంగా ఐరోపాలోని తమ తమ మాతృదేశాలలో ఉండి, తాము స్థాపించిన వలసల పాలనకై గవర్నర్లను నియమించేవారు. ఈ గవర్నర్లు నిరంకుశాధికారాలతో పాలించేవారు. ఫ్రెంచి, డచ్చి వలసల్లోని ప్రజలు ఇట్టి నిరంకుశాధికారానికి తీవ్ర నిరసన తెలపక, కొనసాగేవారు. కాని, ఆంగ్లేయ వలసల్లో, ఇట్టి నిరంకుశాధికారం ప్రజలకు ఆమోదయోగ్యం కాలేదు. పదిహేడో శతాబ్దానికి ఆంగ్ల ప్రజలు కొన్ని స్వేచ్ఛలకు అలవాటుపడి ఉన్నారు. ఈ స్వేచ్ఛలకు ప్రభుత్వం భంగం కలిగిస్తే, వారు నిరసన వ్యక్తం చేసేవారు. అమెరికా వలసల్లో స్థిరపడ్డ ఆంగ్లేయులు కూడా, ఈ స్వేచ్ఛలను వదులుకోదల్చుకోలేదు. ఆంగ్లేయ 'కామన్‌లా' (Common Law, సాధారణ న్యాయం) దానికి ఒసగిన రక్షణ, వలసల్లో కూడా కొనసాగాలన్నారు. అట్లే ప్రభుత్వంలో, ప్రజలు ఎన్నుకొన్న శాసనసభ అధికారానికి లోబడి, కార్యవర్గ అధికారం ఉండాలని వాదించారు. మాతృ దేశం (ఇంగ్లాండ్)లో ఆంగ్లేయులు అనుభవించే రాజకీయ హక్కులు, చట్టపరమైన హక్కులు, అన్నీ తమకు ఉండాలని వలస ప్రజలు వాదించారు. ఈ హక్కులు ఇవ్వడానికి అంగీకరిస్తేకాని, ప్రజలను వలసల్లో స్థిరపడటానికి ఆకర్షించలేమని, వలసల యజమానులు గ్రహించారు.

పదిహేడో శతాబ్దంలో ప్రారంభించి, ఉత్తర అమెరికా ఖండంలో ప్రధానంగా వలసలను స్థాపించిన దేశాలు, ఇంగ్లాండ్, ఫ్రాన్స్. స్పెయిన్ అప్పటికే, పూర్తిగా తన అదుపులో ఉంచుకోలేనంత విశాల సామ్రాజ్యాన్ని దక్షిణ అమెరికాలో ఏర్పరచుకుంది. డచ్చివారికి, స్వీడన్ దేశస్థులకు, పెద్ద ఎత్తున అమెరికాలో వలసలను స్థాపించటానికి చాలినంత జనాభాగాని, ఆర్థిక వనరులుకాని లేవు. ఫలితంగా, నేడు అమెరికా సంయుక్తరాష్ట్రాలు (U.S.A, అ.సం.రా.లు) అని పిలుస్తున్న భూఖండంలో, ఫ్రెంచి వారు, ఆంగ్లేయులు మాత్రమే విశాల ప్రాంతాలను ఆక్రమించి, వలసలను స్థాపించారు. ఈ భూఖండం మీద ఆధిపత్యం చివరకు ఎవరికి చెందుతుందో అనే విషయం, చాలా కాలం సందేహాస్పదంగా, చర్చనీయాంశంగా ఉండింది. ఫ్రెంచివారు, సెయింట్ లారెన్స్ నది మీదుగా, మహాసరస్సుల (Great Lakes) ను దాటి, అపలేషియన్ పర్వతాలకు ఆవల పడమటగా ఉన్న ఉత్తర అమెరికా భూఖండంలో, దాని మధ్య భాగం, కీలక స్థానం అయిన ఒహియో, మిసిసిపి- మిస్సోరీ నదిలోయల మధ్య మైదానాన్ని (Central Basin) ఆక్రమించారు. ఆంగ్లేయులు అపలేషియన్ పర్వతాలకు తూర్పుగా, ఆ పర్వతాలకు, అట్లాంటిక్ సముద్రానికి మధ్య ఉన్న మైదాన భూములను ఆక్రమించారు. పద్దెనిమిదో శతాబ్ది మధ్య భాగంలో కాని, బ్రిటిష్‌వారు అపలేషియన్ పర్వతాలను దాటి, మధ్య మైదానం (Central Basin) లో ప్రవేశించటం జరగలేదు. కాని, చివరకు బ్రిటీష్ వారే ఉత్తర అమెరికా ఖండంలో నిలదొక్కుకొని, తమ ఆధిపత్యాన్ని స్థాపించారు+. దీనికి ప్రధాన కారణం, వలసల స్థాపన ప్రారంభమైన నాటి నుండి, ఆంగ్ల ప్రజలు, ఫ్రెంచివారికన్నా అత్యధిక సంఖ్యలో తమ మాతృదేశాన్ని వదలి, వలసల్లో స్థిరపడ్డారు.

---

\+ ప్రపంచ వ్యాప్తంగా, వలసల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటానికై, ఫ్రెంచివారికి, బ్రిటీష్‌వారికి మధ్య జరిగిన యుద్ధాల్లో మూడో యుద్ధమైన సప్తవర్ష సంగ్రామం **(1756-63)**, **1763** ప్యారిస్ సంధితో ముగిసింది. ఈ సంధి షరతుల మేరకు, ఫ్రెంచివారు, మిసిసిపినది, అపలేషియన్ పర్వతాల మధ్యగల భూభాగాన్ని, కెనడాను, ఇంగ్లీష్ వారికి ఇచ్చివేశారు.

BRAOU

ఫ్రెంచివారిలో చాలామంది రైతులు; ఫ్రాన్స్‌లోని తమ వ్యవసాయ భూములను వదలి, వలసల్లో స్థిరపడటానికి వారు సుముఖత చూపలేదు. ఇంగ్లాండ్‌లో అట్లాకాక, నాటి ఆర్థిక పరిస్థితులు, సంవిధానం సృష్టించిన అనేక కారణాలవల్ల, చాలామంది ప్రజలు చాలినంత జీవనాధారం లేకుండా ఉండేవారు. జీవనాధారాన్నేకాక, సుఖవంతమైన జీవనాన్ని కూడా అమెరికా కల్పించగలదనే ఆశతో, ఆంగ్లేయులు మాతృ దేశాన్ని వదలి, వలసలకు పోయి, స్థిరపడటానికి ఉద్యుక్తులైనారు.

ఎలిజబెత్ రాణి (1558-1603) పరిపాలనా కాలంలో, 1570ల నాటికి, ఇంగ్లాండ్‌లో పరిశ్రమలు, వ్యాపారం అభివృద్ధి చెంది, దేశంలో సంపద పెంపొంది, లాభాపేక్షతో ఉత్తర అమెరికాలో వలసలను స్థాపించటానికి కావలసిన మూలధనాన్ని పెట్టుబడిగా పెట్టడానికి ఆసక్తిగల సంపన్నులు, చాలామంది ఉన్నారు. నాటివరకు ఆంగ్లేయులు స్పానిష్ నౌకలను దోచటంతో, కరీబియన్ దీవుల్లోని, దక్షిణ అమెరికా ఖండంలోని కొన్ని స్పానిష్ స్థావరాలను దోచటంతో తృప్తిచెందారు. ఈ దోపిడీయే, కాల క్రమంలో వారికి ఉత్తర అమెరికాలో వలసలను స్థాపించి, లాభాలను పొందాలనే వ్యాపారపరమైన ఆసక్తిని రేకెత్తించింది. వ్యాపారం ప్రధాన కారణమైనా, అదొక్కటే, బ్రిటీష్ వారు వలసలను స్థాపించటానికి కారణం కాదు. స్పానిష్ నౌకల దోపిడి మాత్రమే బ్రిటీష్ వారి ఔన్నత్యానికి ప్రాతిపదిక కాలేదని వారు గ్రహించారు. దూరదృష్టిగల కొందరు ఆంగ్లేయులు బ్రిటీష్ అధికారాన్ని నూతన ప్రపంచంలో ప్రతిష్ఠించటానికి, అక్కడ శాశ్వతమైన వలసలను స్థాపించటమొక్కటే మార్గమని గ్రహించారు. రాజాస్థానంలో పలుకుబడి గల పెద్ద మనుషులు కొందరు, వలసలను స్థాపించటాన్ని సమర్థించారు. ఇట్టివారిలో ప్రజ్ఞాధురీణులైన రిచర్డ్ హాక్‌ల్యుత్ (Richard Haklyut) అనే ఒకే పేరు గల ఇద్దరు, ఒకరితో ఒకరు బంధుత్వం కలవారు, వలసల స్థాపనను సమర్థించే తమ వాదనలను ప్రచురించి, ప్రజల దృష్టికి తెచ్చారు. వీరిలో చిన్న హాక్‌ల్యుత్, సామ్రాజ్య నిర్మాణంలో ఆంగ్ల ప్రజల ఆసక్తిని రేకెత్తించటానికై, తన వాదలనంతా 'Principal Navigations, Voyages, Traffiques, and Discoveries of The English Nation' అనే గ్రంథంగా ప్రకటించాడు. హాక్‌ల్యుత్ వాదన ప్రకారం, అమెరికాలోని వలసలు ఆసియా ఖండానికి వాయువ్య మార్గాన్ని కనుక్కోవటానికి, ఆ ఖండాన్ని చేరటానికి ఆధారమౌతాయి. స్పెయిన్ నౌకల మీద, దీవుల మీద, దాడులు ఇతోధికం చేయడానికి సౌలభ్యాన్ని కల్పిస్తాయి. అంతేగాక, ఇంగ్లాండ్‌లో వేల సంఖ్యలో జీవనాధారం లేకుండా ఉన్నవారికి జీవనాధారం కల్పించి, ఇంగ్లాండ్ ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక సమస్యలను చాలా వరకు పరిష్కరిస్తాయి. నేటివరకు స్పెయిన్ నుండి కొనుగోలు చేస్తున్న చక్కెర, ద్రాక్షసారాయి, ఆలివ్ నూనె, పట్టు, రంగులు మొదలైన అనేక వస్తువులు వలసల్లో ఉత్పత్తి అవుతాయి. ఎదుగుతున్న ఇంగ్లీష్ పరిశ్రమలకు, ముఖ్యంగా వస్త్ర పరిశ్రమలకు, వలసలు విపణులు (Markets) గా రూపొందుతాయి. ఇంగ్లీష్‌వారు స్థాపించే ఈ వలస సామ్రాజ్యం, ఇంగ్లాండ్ ఆర్థికంగా విదేశాల మీద ఆధారపడకుండా చేసి, దానికి ఆర్థిక సౌభాగ్యాన్ని, భద్రతను చేకూరుస్తుంది. హాక్‌ల్యుత్ ప్రతిపాదించిన ఈ వాదనలే, తర్వాత రెండు వందల యేండ్లు ప్రపంచ వ్యాప్తంగా బ్రిటీష్ ప్రభుత్వ వలస విధానంలో ప్రధాన సూత్రాలైనాయి.

బ్రిటీష్ ప్రభుత్వం తానుగా ధనాన్ని ఖర్చుచేసి, అమెరికాలో వలసలు స్థాపించటానికి సుముఖత చూపించలేదు. కాని, వ్యక్తులుగాని, సంస్థలుగాని చేసే అట్టి ప్రయత్నాలకు తగిన ప్రోత్సాహాన్నిచ్చింది. ఉత్తర అమెరికా ఖండంలో మొట్టమొదటి ఇంగ్లీష్ వలసైన వర్జీనియాను, 1584లో స్థాపించినవాడు, ఎలిజబెత్‌రాణి ఆస్థాన సభికుడైన సర్‌వాల్టర్‌ర్యాలీ (Sir Walter Raleigh). ఇతడు తన ప్రయత్నంతో, చెసాపీక్ సింధుశాఖకు దక్షిణంగా, ఉత్తర కెరోలినా తీర సమీపంలో ఆ తీరాని కెదురుగా ఉన్న రోనోక్ ద్వీపం (Roanoke island) లో, ఒక ఇంగ్లీష్ వలసను స్థాపించాడు. ఎలిజబెత్ రాణి, తన అభిమాన నామమైన (Virgin Queen, కన్యగా ఉన్న రాణి) పేరు మీద, ఈ ప్రాంతానికి వర్జీనియా, (Virginia) అని నామకరణం చేసింది. కాని, సర్‌వాల్టర్ ర్యాలీ స్థాపించిన వలస,

అందరి ప్రజలు, 1591 నాటికి అదృశ్యమైపోయారు. దీనికి కారణాలు నేటికీ తెలియవు. ఆ విధంగా, మొత్తంమీద, 1603 లో ఎలిజబెత్ రాణి పాలన అంతమయ్యే సమయానికి, అమెరికా ఖండంలో ఇంగ్లీష్ వలస ఒక్కటీ లేదనే విషయాన్ని గమనించాల్సి ఉంది.

పదిహేడో శతాబ్దం మొదటి దశాబ్దం నాటికి, ఫ్రెంచివారు అమెరికా సంయుక్తరాష్ట్రాలకు ఉత్తర సరిహద్దుగా ఉన్న మహాసరస్సులకు ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో, వలసలను స్థాపించారు. కాని, ఈ వలసలు అభివృద్ధి చెందలేదు. వీటిలో మొత్తం జనాభా 2500 మాత్రమే ఉండింది. వీరిలో చాలామంది, ఉన్ని వ్యాపారస్తులు (Fur traders) , మత గురువులు, ప్రభుత్వాధికారులు. 1624 లో డచ్చివారు నేటి న్యూయార్క్ ప్రాంతంలో, మన్‌హట్టన్ దీవి (Manhattan Island) లో ఒక వలసను స్థాపించి, దానికి 'న్యూనెదర్‌లాండ్' అని పేరుపెట్టారు. ఆ దీవి దక్షిణపు చివర, దానికి రాజధానిగా, న్యూ ఆమ్‌స్టర్‌డామ్ (New Amsterdam) అనే పట్టణాన్ని నిర్మించారు. క్రమక్రమంగా, లాంగ్ ఐలండ్ (Long Island), న్యూజెర్సీ, హడ్సన్ నది లోయను ఆక్రమించినప్పటికీ, న్యూనెదర్‌లాండ్ వలస అభివృద్ధి చెందలేదు. 1638 లో స్వీడన్, డెలావేర్ నది తీరంలో [ఇప్పటి విల్మింగ్‌టన్ ఉన్నచోట], ఉన్ని వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకొని, ఒక వలసను నిర్మించింది. కాని, 1655 లో డచ్చివారు దీనిని ఆక్రమించి, న్యూనెదర్‌లాండ్ లో చేర్చారు. స్వీడిష్‌వారు కొయ్య దుంగల ఇళ్లను (Log cabins) కట్టే పద్ధతిని, వలసల్లో ప్రవేశపెట్టారు.

ఇట్లా, మిగిలిన ఐరోపా జాతులు, దేశాలు, ఉత్తర అమెరికాలో వలసలను స్థాపించే ప్రయత్నాల్లో, అనేక కారణాలవల్ల పూర్తిగా సఫలీకృతులు కాలేని సమయంలో, పదిహేడో శతాబ్ది ప్రారంభంలో, ఇంగ్లాండ్‌నుండి అత్యధిక సంఖ్యలో ఇంగ్లీష్‌వారు తమ మాతృ దేశాన్ని విడిచి, ఉత్తర అమెరికాలోని వలసల్లో స్థిరపడ్డారు. దీనికి, పైన పేర్కొన్నట్లు, భూమి కొరత, జీవనాధారంలేక పోవడం మాత్రమే కారణాలు కావు. ఎలిజబెత్ రాణి తర్వాత రాజ్యానికి వచ్చిన స్టూవర్ట్ వంశ రాజుల మత, రాజకీయ విధానాల పట్ల ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి కూడా, ఒక ప్రధాన కారణం. 1642 లో ఇంగ్లాండ్‌లో అంతర్యుద్ధం ప్రారంభమయ్యేనాటికి, 65,000 ఇంగ్లీష్‌వారు, అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో సగానికి పైగా, అమెరిగా ప్రధాన భూఖండంలో స్థిరపడగా, మిగిలిన వారు పశ్చిమ ఇండియా దీవుల్లో స్థిరపడ్డారు.

సర్ వాల్టర్ ర్యాలీ వర్జీనియాలో వలసను స్థాపించటానికి చేసిన ప్రయత్నాన్ని, 1607 లో లండన్ 'వర్జీనియా' కంపెనీ (Virginia Company Of London) అనే వ్యాపార సంస్థ పునఃప్రారంభించింది. 34 - 41 అక్షాంశ రేఖల మధ్య, వర్జీనియా ప్రాంతంలో వలసలను స్థాపించటానికి, ఈ కంపెనీ మొదటి జేమ్స్ రాజు (1603-1625) దగ్గర నుండి 1666 లో, "చార్టర్" (అనుమతి పత్రాన్ని)ను పొందింది. ఈ కంపెనీ యజమానులు తమ నౌకల్లో పంపించిన 104 మంది ఇంగ్లీష్‌వారు వర్జీనియాలో ఒక నది తీరాన ఒక వలసను స్థాపించి, తమ రాజుపేరు మీద, ఆనదిని జేమ్స్ నది అని, తమ వలసను 'జేమ్స్ టౌన్' అని పిలిచారు. జేమ్స్ టౌన్ వలస అమెరికా దేశ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి అంకురార్పణ గావించిందని చెప్పవచ్చు. అనేక రుగ్మతలకు, రెడ్ ఇండియన్ల దాడులకు గురై, వలసలోని చాలా మంది, త్వరలో నశించిపోయారు. కాని, కంపెనీ దాని అధికారుల ద్వారా వలసను కొనసాగించి, అది నశించకుండా నిలిపింది. 1618 లో ఈ కంపెనీ, కొత్త యాజమాన్యం కిందికి వచ్చింది. అప్పటికే, రెడ్ ఇండియన్ల నుండి కొత్తగా తెలుసుకున్న పంటైన పొగాకును "క్యూరింగ్" ద్వారా నిలువచేసే పద్ధతిని, వలస ప్రజల్లో ఒక ప్రముఖుడైన రోల్ఫ్ (Rolfe) పెంపొందించటంతో, పొగాకును పండించటం, వలస ఆర్థిక ప్రగతికి ఆధారమైంది. అతి త్వరలోనే, వర్జీనియా ఆర్థిక వ్యవస్థ మాత్రమేగాక, దాని రాజకీయ, సాంఘిక వ్యవస్థలు కూడా, పొగాకు పంటమీద ఆధారపడసాగాయి. అప్పటికే ఇంగ్లాండ్‌లో పొగతాగటం అలవాటైంది.

1618లో వర్జీనియా వలస, 50,000 పౌండ్ల పొగాకును ఇంగ్లాండ్‌కు ఎగుమతి చేసింది. 1624 నాటికి ఈ ఎగుమతి 500,000 పౌండ్లకు చేరుకొంది. కొత్త యాజమాన్యం దాని వలస విధానంలో రెండు ముఖ్యమైన మార్పులు తెచ్చి, వలసలకు ఎక్కువ మంది ప్రజలు వచ్చి స్థిరపడటాన్ని ప్రోత్సహించింది. ఈ మార్పులవల్ల, వలసల్లో స్థిరపడ్డ ప్రజలకు, వారి సొంత భూమి ఉంటుంది. అంతేకాక, వలస పాలనలో కూడా, వారికి కొంత అధికార ముంటుంది. నాటికే వలసల్లో స్థిరపడి ఉన్న ప్రతి వ్యక్తికీ, కంపెనీ నూరు ఎకరాల సొంత భూమిని ఇస్తుంది. భవిష్యత్తులో ఇంగ్లాండ్ నుండి తన సొంత ఖర్చులతో వచ్చి, స్థిరపడే వ్యక్తికి, 50 ఎకరాల భూమి నిస్తుంది. దీనికి 'హెడ్ రైట్' (తల హక్కు) అని పేరు. ఆ వ్యక్తి తనతో కూడా ఒక సేవకుని తీసుకొనివస్తే, ఆవ్యక్తికి అదనంగా మరొక యాభై ఎకరాల భూమినిస్తుంది. కంపెనీ ఖర్చుతో ఇంగ్లాండ్ నుండి వచ్చి, స్థిరపడ్డ కంపెనీ సేవకుల (Indentured Servants) కు, ఆ సేవాకాలం పూర్తైయిన తర్వాత, సొంత భూమినిస్తారు. అయితే వారు దాని మీద 'క్విట్ రెంట్' (Quit Rent) అనే శిస్తును కంపెనీకి చెల్లించాలి. అంతేగాక, 1619 లో ఒక ప్రజాప్రతినిధి సభను స్థాపించి, వలస పాలనలో వలస ప్రజలకు ప్రాతినిధ్యాన్ని కల్పించారు. "వర్జీనియా హౌస్ ఆఫ్ బర్జెసెస్" (Virginia House Of Burgesses) అని పిల్వబడ్డ ఈ ప్రతినిధుల సభే, నూతన ప్రపంచంలో మొదటగా రూపొందిన శాసన సభ. దీని మొదటి సమావేశం, 1619 జూలై 30 న జరిగింది. వలసల్లో ఏర్పడ్డ కొంత అరాజక పరిస్థితి కారణంగా, వర్జీనియా కంపెనీకి ఇచ్చిన చార్టర్ ను 1624 లో రాజు రద్దు చేశాడు. నాటి నుండి వర్జీనియా, ప్రభుత్వ వలస (Royal colony) గా మారి, దాని పాలన, నేరుగా బ్రిటీష్ ప్రభుత్వాధీనంలోకి వచ్చింది.

ఉత్తర అమెరికాలో మొదట స్థాపించిన ఇంగ్లీష్ వలసల్లో మరొకటైన మేరీలాండ్‌ను, ఒక కంపెనీ కాక, ఒకే ఒక యజమాని స్థాపించాడు. దీన్ని స్థాపించినవాడు, రెండో లార్డ్ బాల్టిమోర్ (Lord Baltimore II). వర్జీనియాకు ఉత్తరంగా ఉన్న ప్రదేశంలో వలసను స్థాపించి, కొన్ని భూస్వామ్య వ్యవస్థా హక్కులతోపాటు, దాన్ని పరిపాలించడానికి లార్డ్ బాల్టిమోర్, రాజైన మొదటి ఛార్లెస్ (1625-1649) నుండి, 1632 లో అనుమతి పత్రాన్ని (Charter) పొందాడు. 1634 లో వలసను స్థాపించాడు. బాల్టిమోర్ రోమన్ కాథలిక్; ఇంగ్లాండ్‌లో మత పరంగా అసహనానికి, అనేక ఇబ్బందులకు గురౌతున్న ఇంగ్లీష్ కాథలిక్కులందరూ, తాను స్థాపించిన వలసలకు వచ్చి స్థిరపడతారని ఆశించాడు. కాని, ఆయన ఆశించిన విధంగా కాథలిక్కులు వచ్చి స్థిరపడనందువల్ల, బాల్టిమోర్ వలసలో మత సహనవిధానాన్ని అవలంబించి, ప్రొటెస్టంట్లు కూడా స్థిరపడటానికి అవకాశాన్ని కల్పించాడు. లార్డ్ బాల్టిమోర్ తాను స్థాపించిన వలసకు, తన భార్య మేరీ పేరుమీద, మేరీలాండ్ అని పేరుపెట్టాడు. దాని ముఖ్య పట్టణాన్ని, తన పేరు మీద బాల్టిమోర్ అని పిలిచాడు. మేరీలాండ్‌లో ప్రొటస్టెంట్లే అధికంగా స్థిరపడి, కాథలిక్కులు అల్పసంఖ్యాకులైనారు. కాథలిక్కులకు రక్షణ కల్పించటానికై, బాల్టిమోర్ 1649 లో మతసహనాన్ని చట్టబద్ధం చేశాడు. 1691 లో మేరీలాండ్, బ్రిటీష్ రాజపాలనలోనికి వచ్చింది. తర్వాత, ఆంగ్లికన్ క్రైస్తవ శాఖను ప్రతిష్ఠించారు.

న్యూయార్క్‌కుపైగా, నేటి అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో తీరాన్ని వెంబడించి ఉన్న ఈశాన్య ప్రాంతాన్ని 'న్యూ ఇంగ్లాండ్' (New England) అనీ, ఆ ప్రాంతంలో రూపొందిన ఇంగ్లీష్ వలసలను, న్యూఇంగ్లాడ్ వలసలనీ పిలిచారు. అవి, మెసాచూసెట్స్ (Massachusetts) కనెక్టికట్ (Connecticut), రోడ్ ఐలాండ్ (Rhode Island), న్యూహ్యాంప్‌షైర్‌లు (New Hampshire). న్యూఇంగ్లాండ్ వలసల స్థాపనకు కారణాలు, ప్రధానంగా ఆర్థిక సంబంధమైనవి కావు. న్యూఇంగ్లాండ్ వలసలను ప్రారంభించినవారు మేఫ్లవర్ (May Flower) అనే నౌకలో మెసాచూసెట్స్ సింధు శాఖను చేరి, పిల్‌గ్రిమ్ ఫాదర్స్ (Pilgrim Fathers) గా ప్రసిద్ధులైనవారు. వీరు ప్యూరిటన్

BRAOU

మతశాఖకు చెందిన ఇంగ్లీష్‌వారు. వీరు 1608 లో మతస్వేచ్ఛకై, ఇంగ్లాండ్ నుండి హాలండ్‌లోని లెయిడన్‌కు, కాందిశీకులుగా వెళ్లారు. వీరిని వేర్పాటువాదులు (Separatists) అని పిలిచారు. కాని, వీరిలో 35 మంది అక్కడ ఉండలేక, నూతన ప్రపంచంలో స్థిరపడాలనే ఉద్దేశంతో, ఇంగ్లాండ్‌కు తిరిగివచ్చారు. వారు లండన్‌లోని కొందరు వ్యాపారులతో చేరి, 'ప్లిమౌత్' రేవు నుండి వర్జీనియాకు 'మేఫ్లవర్' అనే నౌకలో బయలుదేరారు. కాని ఈనౌక, గాలివాటాన వర్జీనియా చేరక, మెసాచూసెట్స్ రాష్ట్రంలోని కేప్‌కాడ్‌ను చేరింది. అక్కడ వారు ఏర్పరచిన వలసకు 'ప్లిమౌత్' అని పేరు పెట్టారు. అక్కడ వలసను స్థాపించటానికి, వారికి బ్రిటీష్ ప్రభుత్వ అనుమతి లేదు. అందుచేత, వలసలో ఒక క్రమ శిక్షణ ఏర్పరచటానికిగాను, నాయకులు ఒక రాజకీయ సంఘంగా ఏర్పడి, మెజారిటీ పాలనను అంగీకరిస్తూ, మేఫ్లవర్ ఒప్పందాన్ని (May Flower Compact) రూపొందించారు. జేమ్స్‌టౌన్ స్థాపకుల్లో ఒకడైన కెప్టెన్ జాన్‌స్మిత్, న్యూ ఇంగ్లాండ్ అనే పేరు పెట్టాడు. న్యూ ఇంగ్లాండ్‌లో వ్యవసాయం ద్వారా సుఖజీవనం సాగించటం సాధ్యమౌతుందని, తమ ప్రయత్నం ద్వారా మొదటగా తెల్పినవారు, 'మేఫ్లవర్ పిల్‌గ్రిమ్స్'.

ఇంగ్లాండ్‌లో స్టూవర్ట్ పాలకుల మతపరమైన వేధింపు చర్యల నుండి విముక్తి పొందటానికై, ప్యూరిటన్ క్రైస్తవ శాఖకు చెందిన కొంత మంది పెద్ద మనుషులు, మెసాచూసెట్స్ వలసను స్థాపించారు. వీరి నాయకుడు, భూస్వామి, నీతిమంతుడు, ఔదార్యవంతుడు, మానవతావాది, పరిపాలనా సమర్థుడైన జాన్ విన్‌త్రాప్ (John Winthrop). వీరు 1628 లో బ్రిటీష్ రాజునుండి అమెరికాలో కొంత భూమికి హక్కును సంపాదించి, 1629 లో 'మెసాచూసెట్స్ బే కంపెనీ' అనే పేరుతో వలస స్థాపనకు అనుమతి పత్రాన్ని పొంది, వలసను స్థాపించారు. మెసూచూసెట్స్ వలస స్థాపనలోని ప్రత్యేకత, వలస స్థాపకులంతా చార్టర్‌తోపాటు ఇంగ్లాండ్‌ను వదలి, వలసలో స్థిరపడటం. దీనివల్ల, వలస మీద చట్టబద్ధమైన అధికారానికి, వలస మీద పాలనాధికారానికి, లండన్ కేంద్రం కాకుండా, వలస ముఖ్య పట్టణమైన బోస్టన్ కేంద్రమైంది. ఫలితంగా, చాలాకాలం మెసాచూసెట్స్ మీద బ్రిటీష్ ప్రభుత్వానికి ఎట్టి అజమాయిషీ లేకుండా పోయింది. ఈ వలసను స్థాపించిన వారు, వ్యాపార సంస్థగా ఏర్పడి వలసను స్థాపించినా, లాభాలను దృష్టిలో ఉంచుకోక, తమ ఆశయాలను ఆచరణలో పెట్టడం ప్రధానంగా భావించారు. విన్‌త్రాప్ నాయకత్వంలో, చాలాకాలం మెసాచూసెట్స్‌లో స్థిరపడటానికి, ప్యూరిటన్ మత శాఖలో, ఆచార సంప్రదాయాల్లో విశ్వాసమున్న వారికే రాజకీయ హక్కులిచ్చారు. ఈ వలసలో 1630 నాటికి 2,000 మంది స్థిరపడ్డారు. 1640 నాటికి ఈ సంఖ్య 20,000లకు పెరిగింది. అయితే, మతస్వేచ్ఛ కోసం ఇంగ్లాండ్ వదలి వచ్చిన మెసాచూసెట్స్ వలస స్థాపకులు, తమ వలసలో ఆ మత స్వేచ్ఛను నిరాకరించటం; గమనించదగ్గ విషయం. అమెరికన్ జీవన విధానంలో ప్యూరిటన్ సంప్రదాయ ప్రభావం గణనీయంగా ఉందని చాలామంది చరిత్రకారుల అభిప్రాయం. మెసాచూసెట్స్ వలసలో మతస్వేచ్ఛ లేకపోవటాన్ని నిరసించిన కొందరు నాయకులు, స్వతంత్రించి, మెసాచూసెట్స్ పరిసర ప్రాంతాల్లో కొత్త వలసలను స్థాపించారు. 1635 లో రోజర్ విలియమ్స్ (Roger Williams) రోడ్ ఐలాండ్ (Rhode Island) అనే చిన్న వలసను స్థాపించాడు. దీనికి 1663 లో రెండో చార్లెస్ (1660-1685) ఛార్టర్‌ను ప్రసాదించాడు. ఇదే పద్ధతిలో 1636లో కనెక్టికట్ (Connecticut) వలసను, కనెక్టికట్ నది తీరంలో, రెవరెండ్ థామస్ హూకర్ స్థాపించాడు. 1639 లో రెవరెండ్ జాన్‌డేవన్‌పోర్ట్ (Rev. John Devenport) న్యూ హావెన్ (New Haven) వలసను స్థాపించాడు. ఈ వలస స్థాపకులు అక్కడ స్థిరపడ్డ వారికి చాలావరకు మత స్వేచ్ఛను ఇచ్చారు. కాల క్రమంలో, ఇవి అన్నీ ప్రభుత్వ వలసలైనాయి. 17వ శతాబ్దం చివర, ప్యూరిటన్లు కాని వారు కొందరు మెసాచూసెట్స్‌లో స్థిరపడ్డారు. వీరు తెచ్చిన కొన్ని వ్యాజ్యాల ఫలితంగా, మెసాచూసెట్స్‌లోని తీరప్రాంతం, న్యూహ్యాంప్‌షైర్ (New Hampshire) అనే పేరుతో వేరై, 1679లో ఆంగ్లేయ ప్రభుత్వ పాలనలోకి వచ్చింది.

BRAOU

1642 లో ఇంగ్లాండ్‌లో ఏర్పడ్డ అంతర్యుద్ధం వల్ల, వలసల స్థాపనకు అంతరాయమేర్పడింది. తర్వాత రెండో ఛార్లెస్ (1660 - 1685) కాలంలో, మరలా వలసల స్థాపనకు ప్రోత్సాహం లభించింది. 1663 లో రెండో ఛార్లెస్, వర్జీనియాకు దక్షిణంగా ఉన్న విశాల ప్రాంతాన్ని, వలసల స్థాపనకై ఎనిమిది మంది యజమానులకు ఇచ్చాడు. ఈ ప్రాంతంలో ఛార్లెస్ పేరుమీద దక్షిణ కెరోలినా, ఉత్తర కెరోలినా వలసలు రూపొందాయి. దక్షిణ కెరోలినా పెద్ద భూస్వాముల వలసగా, ఉత్తర కెరోలినా చిన్నతరహా రైతుల వలసగా రూపొందాయి. దక్షిణ కెరోలినా 1719 లో, ఉత్తర కెరోలినా 1728 లో ప్రభుత్వ వలసలయ్యాయి. కనెక్టికట్, మేరీలాండ్ వలసల మధ్య ఉన్న భూమిని ఇంగ్లాండ్ రాజు సోదరుడైన డ్యూక్ ఆఫ్ యార్క్ (Duke of Yoke) కు ఇచ్చారు. కానీ, ఈ ప్రాంతమంతా తమదని డచ్చివారు వివాదపడ్డారు. వ్యాపారపరమైన పోటీలు చివరకు ఇంగ్లాండ్, హాలాండ్‌ల మధ్య, 1664 యుద్ధానికి దారితీశాయి. ఆంగ్లేయ నౌకాబలం న్యూనెదర్‌లాండ్‌ను ఆక్రమించింది. దీనిలో దక్షిణ భాగాన్ని డ్యూక్ ఆఫ్ యార్క్ , క్వేకర్ (Quaker) మత శాఖకు చెందిన ఇద్దరు పెద్ద మనుషులకు అమ్మి, మిగిలిన ప్రాంతంలో తన పేరున న్యూయార్క్ (New York) వలసను స్థాపించాడు. డ్యూక్ ఆఫ్ యార్క్ అమ్మిన భూభాగంలో క్వేకర్ పెద్దమనుషులు న్యూజెర్సీ (New Jersey) వలసను స్థాపించారు. న్యూయార్క్, న్యూజెర్సీ, 1702 లో ఆంగ్లేయ ప్రభుత్వ పాలనలోకి వచ్చాయి. ఇంగ్లాండ్ రాజు తాను అడ్మిరల్ విలియమ్ పెన్ వద్ద చేసిన అప్పుకు బదులుగా, అతని కుమారుడైన విలియమ్ పెన్‌కు 1681 లో, డెలావర్ నదికి పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్ని ఇచ్చాడు. దీన్ని 'పెన్సిల్వేనియా' (Pennsylvania) అనే పేరుతో, పెన్ ఆదర్శవంతమైన వలసగా రూపొందించాడు. దానికి ముఖ్యపట్టణంగా తాను రూపొందించిన నగర ప్రణాళిక (Plan) మేరకు, 1682 లో పెన్, డెలావేర్ ప్రాంతాన్ని కూడా ప్రభుత్వాన్నుండి పొంది, దానికి 1703 లో ప్రత్యేకమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, డెలావేర్ (Delaware) వలసను రూపొందించాడు.

చివరగా స్థాపించిన ఆంగ్లేయ వలస జార్జియా (Georgia). 1732 లో కెరోలినాకు దక్షిణంగా ఉన్న ప్రాంతాన్ని బ్రిటిష్ రాజు రెండో జార్జి (1727 -1760) కొంతమంది యజమానులకు ఇచ్చాడు. వీరి నాయకుడు జనరల్ జేమ్స్ ఓగల్‌థార్ప్ (Gen. James Oglethorpe). ఓగల్‌థార్ప్, రాజు గౌరవార్థం జార్జియా అని పెట్టి, ఈ వలసను మానవతా దృష్టితో స్థాపించాడు. అప్పటి చట్టాల ప్రకారం, అప్పులు చెల్లించని వారికి జైలు శిక్షను విధించేవారు. ఇట్టివారు చాలామంది ఇంగ్లాండ్‌లో జైళ్లలో మగ్గుతుండేవారు. వీరికి, ఇంగ్లాండ్‌లోని ఇతర నిర్భాగ్యులకు పునరావాసాన్ని కల్పించే ఉద్దేశంతో, ఓగల్ థార్ప్ జార్జియా వలసను స్థాపించాడు. జార్జియా వలస స్థాపన మరో ధ్యేయం, జార్జియాకు దక్షిణ సరిహద్దున స్పెయిన్ అధికారంలో ఉన్న ఫ్లోరిడా నుండి స్పెయిన్ దాడులను, దురాక్రమణలను అడ్డుకోడం. ఓగల్ థార్ప్, వలసల్లో స్థిరపడే కొంతమందితో అట్లాంటిక్ సముద్రాన్ని దాటివచ్చి, సవన్నా (Savannah) పట్టణాన్ని ఏర్పర్చి, వలసను స్థాపించాడు. 1751 లో జార్జియా, ప్రభుత్వ వలస అయింది.

ఈ విధంగా, 17వ శతాబ్దం చివరకు ఆంగ్లేయులు అట్లాంటిక్ తీరం వెంబడి పదమూడు వలసలను స్థాపించి, అమెరికా ఖండంలో దృఢంగా తమ ఆధిపత్యాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్ నుండి ఈ వలసలకు తరలివచ్చిన ప్రజలందరూ, ఆర్థిక స్వేచ్ఛ, లేదా మతస్వేచ్ఛ మొదలుగా, ఏదో ఒక స్వేచ్ఛను ఆర్జించివచ్చిన వారే. వీరందరూ వలసలకు తరలివచ్చి స్థిరపడేనాటికే, కొన్ని రాజకీయ హక్కులకు, స్వేచ్ఛలకు అలవాటుపడి ఉన్నారు. ఈ వలసలు మాతృదేశమైన ఇంగ్లాండ్‌తో విభేదించి, దాంతో స్వాతంత్ర్య పోరాటం జరిపి, తమను 1776 లో స్వతంత్ర దేశంగా ప్రకటించుకోడానికి గల కారణాలను విశ్లేషించడానికి ముందు, ఈ వలసలు స్వాతంత్ర్య పోరాట కాలానికి, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, రంగాల్లో సాధించిన గణనీయమైన ప్రగతిని తెలుసుకోవాల్సిన అవసరముంది. మొదటి పదమూడు వలసల స్థాపనా ధ్యేయాల తర్వాత, అవి వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి నేపథ్యంలోనే, మనం స్వాతంత్ర్య పోరాట కారణాలను సమగ్రంగా అవగాహన చేసుకోగలం.

## పట్టిక

**మొదటి 13 వలసలు (Thirteen Original Colonies) - స్వాతంత్ర్య పోరాట కాలం (1775) నాటికి వాటి పరిస్థితి**

| క్ర.సం. | పేరు | స్థాపించిన కంపెనీ/ యజమానులు | స్థాపించిన కాలం | ఛార్టర్‌ను పొందిన కాలం | ప్రభుత్వ(Royal) కాలనీ అయిన కాలం | 1775 నాటి పరిస్థితి |
|---|---|---|---|---|---|---|
| 1. | వర్జీనియా<br>(ప్లిమత్)<br>(మెయిన్) | లండన్ కంపెనీ<br>ప్యూరిటన్ శాఖవారు<br>యఫ్. జార్జెస్ | 1607<br>1620<br>1623 | 1606<br>--<br>1639 | 1624 | ప్రభుత్వ (Royal) కాలనీ<br>1691లో మెసాచూసెట్స్‌లో చేరిపోయింది.<br>1677 లో మెసాచూసెట్స్ కొనివేసింది. |
| 2. | న్యూహాంప్‌షైర్ | జాన్ మేసన్,<br>మరికొందరు | 1623 | 1679 | 1679 | 'రాయల్'-1641-79, మెసాచూసెట్స్‌లో కలసిపోయింది. |
| 3. | మెసాచూసెట్స్<br>(మె.సా.) | ప్యూరిటన్లు | 1628 | 1629 | 1691 | "రాయల్" |
| 4. | మేరీలాండ్ | లార్డ్ బాల్టిమోర్ | 1635 | 1662 | – | 'ప్రొప్రయిటరీ' (యాజమాన్యం) |
| 5. | కనెక్టికట్ | మె.సా. వలసలోనివారు | 1635 | 1662 | – | స్వయంపాలితం(Self- governing) |
| 6. | రోడ్ ఐలాండ్<br>(న్యూహావెన్) | రోజర్ విలియమ్స్<br>మె.సా. వలసలోనివారు | 1636<br>1638 | 1644<br>1663 | –<br>– | స్వయంపాలితం<br>1668 లో కనెక్టికట్‌లో చేరింది. |
| 7. | ఉత్తర కెరోలినా | వర్జీనియా వలసలోనివారు | 1653 | 1663 | 1729 | 'రాయల్' (1691లో దక్షిణ కెరోలినా నుండి వేరైంది.) |

BRAOU

| క్ర.సం. | పేరు | స్థాపించిన కంపెనీ / యజమానులు | స్థాపించిన కాలం | ఛార్టర్‌ను పొందిన కాలం | ప్రభుత్వ(Royal) కాలనీ అయిన కాలం | 1775 నాటి పరిస్థితి |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| 8. | న్యూయార్క్ | డచ్చివారు<br>డ్యూక్ ఆఫ్ యార్క్ | 1613<br>1664 | 1664 | 1685 | 'రాయల్' |
| 9. | న్యూజెర్సీ | బెర్క్లీ, కార్టరైట్ (క్వేకర్లు) | 1664 | – | 1702 | 'రాయల్' |
| 10. | దక్షిణ కెరోలినా | 8 మంది యజమానులు | 1670 | 1663 | 1729 | రాయల్ (ఉత్తర కెరోలినా నుండి 1712లో చట్టరీత్యా వేరైంది). |
| 11. | పెన్సిల్వేనియా | విలియం పెన్ | 1681 | 1681 | - | యాజమాన్యం |
| 12. | డెలావేర్ | స్వీడన్ | 1638 | -- | – | యాజమాన్యం. [పెన్సిల్వేనియా నుండి వేరై, శాసన సభను 1703లో ఏర్పర్చుకుంది] |
| 13. | జార్జియా | ఒగల్‌థార్ప్, మరికొందరు | 1773 | 1732 | 1752 | 'రాయల్' |

## 8.5 స్వాతంత్ర్య పోరాట కాలం (1775) నాటికి వలసల ప్రగతి

### 8.5.1 రాజకీయ పరిణామాలు

స్వాతంత్ర్య పోరాట కాలం నాటికి, వలసలన్నీ రాజకీయ విషయాల్లో చాలావరకు స్వయం పాలితంగా ఉండేవి. బ్రిటీష్ ప్రభుత్వం అనుమతి ప్రకారం ఇవి స్వయంపాలితం కాలేదు. అవి వహించిన స్వయంపాలిత అధికారాలను బ్రిటీష్ ప్రభుత్వం అడ్డుకోలేక పోయింది.

వలసలన్నిటిలో విధాన సభలు ఏర్పడ్డాయి. బ్రిటీష్ నమూనాలో, ఈ విధాన సభల్లో ఎగువసభ, దిగువసభ లుండేవి. సామాన్యంగా, 'అసెంబ్లీ' అని పేర్కొన్న దిగువ సభకు ప్రతినిధులను, అర్హత గలిగిన ఓటర్లు ఎన్నుకొనేవారు. ఆస్తిలేని వారికి ఓటు చేసే అర్హత ఉండేది కాదు. 'కౌన్సిలర్'లు లేక 'అసిస్టెంట్'లు' అని పిల్వబడ్డ ఎగువ సభ సభ్యులను, ప్రముఖులైన పేర్లలో నుండి గవర్నర్ నియమించేవాడు. కనెక్టికట్, రోడ్ఐలాండ్ వలసల్లో మాత్రమే, వాటి ఛార్టర్‌లల్లో పేర్కొన్న విధంగా గవర్నర్లను ఎన్నుకొనేవారు. మిగిలిన అన్ని వలసల్లో, బ్రిటీష్ ప్రభుత్వమో, లేదా కంపెనీల యజమానులో, గవర్నర్లను నియమించేవారు. మేరీలాండ్, పెన్సిల్వేనియా, డెలావేర్‌ల్లో మాత్రం, 1776 వరకు యాజమాన్య పాలన కొనసాగింది. మిగిలిన సామ్రాజ్యంతో పాటు, అమెరికన్ వలసలకు కూడా బ్రిటీష్ పార్లమెంట్ అత్యున్నత శాసన సభాధికారాలను వహించింది. వలసలకు సంబంధించి, నేరుగా శాసనాలు చేసి, అమలుపర్చే అధికారాలు పార్లమెంట్‌కున్నాయి. వలసల్లోని శాసన సభలు చేసిన చట్టాలను, సాధారణంగా బోర్డ్ ఆఫ్ కంట్రోల్ సలహా మీద ప్రీవీ కౌన్సిల్ రద్దు చేయవచ్చు.

18వ శతాబ్ది వలస రాజకీయ పరిణామంలోని ప్రధాన ధోరణి, శాసన సభలు అధికారాన్ని గవర్నర్ల నుండి, కౌన్సిలర్‌ల దగ్గర నుండి క్రమక్రమంగా తమ హస్తగతం చేసుకోడం. గవర్నర్లను పరాయి అధికారానికి ప్రతినిధులుగా భావించి, వలసలు సామాన్యంగా వారిని శంకించేవి. చాలా సన్నివేశాల్లో వాటి శంకలు నిరాధారమని చెప్పటానికి వీలులేదు. గవర్నర్లలో ఏ కొద్దిమందో సమర్థులు, నిజాయితీ పరులు; చాలామంది చిన్న తరహా రాజకీయవాదులు; ఎవరి పలుకుబడి వల్లనో వారికాపదవులు లభించాయి. వారు తమ దురహంకారంచేత, లంచగొండి విధానాలచేత, వలస ప్రజలను దూరం చేసుకున్నారు. ఇంగ్లాండ్‌లో కామన్స్ సభ, దాని హక్కుల, అధికారాల రక్షణకై స్టూవర్ట్ రాజులతో జరిపిన పోరాట సంప్రదాయాన్ననుసరించి, వలసల్లోని శాసన సభలు ఆర్థిక అధికారాలను తమ వశంలో ఉంచుకోవలసిన అవసరాన్ని, అతి త్వరలోనే గ్రహించాయి. పన్నులను విధించటానికి, గవర్నర్ల జీతాలతో సహా అన్ని ఆర్థిక బిల్లులను ఆమోదించటానికి, తమకు మాత్రమే హక్కు ఉందని, శాసన సభలు వాదించాయి. ప్రభుత్వ ఆర్థికావసరాలను ప్రతి ఏటా తాము ఆమోదించాలని పట్టుబట్టాయి. ఈ సమస్యలమీద గవర్నర్లు శాసన సభలతో అనేక సంఘర్షణలకు దిగారు. కాని, వారు తమ జీతభత్యాలకు ఆర్థికంగా శాసన సభల ఆమోదం మీద ఆధారపడినందువల్ల, సామాన్యంగా ఈ ఘర్షణల్లో పరాజయాన్ని పొందేవారు. వీరికి బిల్లులను 'వీటో' చేసే, లేక నిరాకరించే అధికారం, శాసన సభలను రద్దుచేసే అధికారం ఉండేది. ఈ విధంగా ఆర్థికాధికారాలు సంపాదించిన శాసన సభలు వలసల్లోని అనేక సమస్యలకు సంబంధించిన విధానాలను రూపొందించటంలో, తమ ప్రమేయం ఉండాలన్నాయి.

వలసల్లో శాసన సభల అధికారానికి సంబంధించి, ఒక విషయం ప్రత్యేకించి చెప్పాల్సి ఉంటుంది. అమెరికా రాజకీయ వ్యవస్థల పరిణామంలో, శాసన సభల అధికారాలు పెరగడమనేది, చాలా ముఖ్యమైన

BRAOU

అంశం. కాని, గుర్తుంచుకోవాల్సిన విషయమేమంటే, ఈ శాసన సభలు ప్రజాస్వామ్య సూత్రాలను పాటించాయనుకోటం పొరపాటు. గవర్నర్లనుండి శాసన సభలు సంగ్రహించిన అధికారాలు, వలస ప్రజలకు చెందలేదు. వాటిని వలసల్లోని ధనిక వర్గాలు వహించాయి. ఈ లోగా, ఈకులీన, ధనిక వర్గాలకున్న ఈ అధికారాలను, వృత్తిపనివారల, రైతుల ప్రతినిధులు ప్రశ్నించడం ప్రారంభించారు. ఫలితంగా, 18వ శతాబ్దంలో అమెరికాలోని రాజకీయ సంఘర్షణలు ముక్కోణ సంఘర్షణ లయ్యాయి. అవి: 1) వలస ప్రజలు తమ హక్కులకై బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడటం, 2) వలస శాసన సభలకు గవర్నర్లతో ఏర్పడ్డ సంఘర్షణ, 3) వలసల్లోని శాసన సభలను తమ చెప్పుచేతల్లో ఉంచుకొన్న ధనిక వర్గాలకు, సామాన్య ప్రజలైన వృత్తిపనివారు, రైతులు మొదలైన వారికి మధ్య, ఏర్పడ్డ సంఘర్షణ.

### 8.5.2 సాంఘిక సిద్ధాంతాలు

అమెరికాలో రూపొందిన సాంఘిక సిద్ధాంతాలు, వలస ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసి, అమెరికన్ విప్లవానికి దారితీశాయి.

ప్రభుత్వం దైవ సృష్టి అని, అందువల్ల వలస ప్రజలు బ్రిటీష్ ప్రభుత్వ అధికారానికి సంపూర్ణ విధేయత కనపరచాలని, దాని అధికారం వ్యక్తుల హక్కులను అధిగమిస్తుందనీ, ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని, వలసల్లో ఏ కొద్దిమందో ప్రభుత్వాధికారులు, మతాధికారులు మొదలైన వారు మాత్రం విశ్వసించారు. ఐరోపాలో విశేష ప్రచారంలో ఉన్న ఈ సాంఘిక సిద్ధాంతాన్ని, విప్లవానికి ముందుకాని, తర్వాతకాని, చాలామంది అమెరికన్లు ఆమోదించ లేదు. వ్యక్తులకు కొన్ని అనన్యసంక్రమిత హక్కులు (inalienable rights), ఉన్నాయని, ప్రభుత్వం మానవ నిర్మితమని, వ్యక్తి క్షేమాన్ని సాధించటమే దాని ప్రయోజనమని, అమెరికన్లు విశ్వసించారు. ఈ సిద్ధాంతం ఆంగ్ల రాజకీయ సంప్రదాయంలోని ఉదారవాదం నుండి, ప్యూరిటన్ ఒప్పంద సిద్ధాంతంనుండీ, ఉత్పన్నమైంది. 'మేఫ్లవర్ ఒప్పందం' వంటి ఒప్పందాలు, మానవులు తమ రక్షణకై ప్రభుత్వాలను ఏర్పరచుకొంటారనే సిద్ధాంతాన్ని, అమెరికన్లకు స్పష్టం చేశాయి. అందువల్ల, వలస ప్రజల్లో మొదటినుండి ఏర్పడ్డ ఈ ఆలోచనా విధానానికి అనుగుణంగా, జాన్‌లాక్ (John Locke) ప్రతిపాదించిన సహజ హక్కుల సిద్ధాంతం (The Doctrine of Natural Rights), రాజకీయ సిద్ధాంతం, వలసల్లో ఆమోదయోగ్యాలైనాయి. 18 వ శతాబ్దం మొదట్లోనే, వలసల్లో, చర్చి అధికారులైన జాన్‌వెస్, జొనాథన్‌మేహ్యూ (Jonathan May hew) తమ గ్రంథాల్లో, ప్రచారంలో, సహజ హక్కుల సిద్ధాంతాన్ని సమర్థించారు. బోస్టన్‌కు చెందిన మేహ్యూ, అధర్మంతో కూడిన ప్రభుత్వంపై తిరుగుబాటు చేయటం, ప్రజల హక్కు మాత్రమేగాక, వారి ధర్మమని ప్రచారం చేశాడు. అందువల్ల, విప్లవానికి ముందు కాలంలో, అమెరికాలో, సామాన్యుల నుండి మేధావుల వరకు గల అన్ని వర్గాల ప్రజల రాజకీయ ఆలోచనా విధానాన్ని సహజ హక్కుల సిద్ధాంతం ప్రభావితం చేసింది. ఈ హక్కులు బ్రిటీష్ రాజ్యాంగంలో నిబద్ధమైనాయనీ, బ్రిటీష్ ప్రభుత్వం ప్రసాదించిన వలసల ఛార్టర్లలో ఆ ప్రభుత్వం వలస ప్రజలకు ఈ హక్కుల రక్షణకు హామీ ఇచ్చిందని, ఆ ప్రభుత్వ అధికారాలు మౌలిక న్యాయం (Fundamental Law) చేత పరిమితమని, వలస ప్రజలు విశ్వసించారు. ఈ విషయంలో అమెరికా రాజకీయ సిత్ధాంతం, ఆంగ్ల రాజకీయ సిద్ధాంతం నుండి మౌలికంగా విభేదించింది. ఆంగ్లేయులు పార్లమెంట్ అధికారాలకు పరిమితాలు లేవని విశ్వసించారు.

దాదాపు అందరు అమెరికన్లకు సహజ హక్కుల సిద్ధాంతంలో విశ్వాసం ఉంది. కాని, దాని ఆచరణ విధానంలో వివాదానికి చాలా అవకాశమేర్పడింది. ప్రజలు వారి ప్రభుత్వాలను అదుపులో ఉంచడమేగాక, అందరి ప్రజలకు రాజకీయాల్లో పాల్గొనే హక్కు ఉందనీ, దాని అంతరార్థంలో,

BRAOU

ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. కాని, సహజ హక్కుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన లాక్ (Locke), అతని శిష్యులు, ధనిక, కులీన వర్గాల వారితో రూపొందిన ప్రభుత్వమే, అధిక సంఖ్యాక ప్రజా ప్రభుత్వాల కన్నా ఎక్కువగా ఈ హక్కులకు రక్షణ కల్పిస్తుందని భావించారు. ఎక్కువగా ఆస్తి ఉన్నవారే సమాజ శ్రేయస్సులో, శాంతి భద్రతల్లో ఎక్కువ ఆసక్తి కల్గి, పరిపాలనలో వివేకాన్ని, సంయమనాన్ని కనబరచగలరు. ఇట్టి విశ్వాసమే అమెరికన్ వలసల్లో ప్రముఖంగా ఉండింది. అందువల్ల, వలసల్లో ప్రజాస్వామ్య సిద్ధాతం ఆచరణలో ఉన్నప్పటికీ, రోజర్ విలియమ్స్, జాన్‌వెన్ వంటి ఒకరిద్దరు రచయితల రచనల్లో తప్ప, ప్రజాస్వామ్య సిద్ధాంతానికి బాహాటంగా ప్రచారం జరగలేదు.

### 8.5.3 ఆర్థిక దృక్పథాలు

వ్యాపార కార్యకలాపాలను ప్రభుత్వం అదుపులో ఉంచాలనే సిద్ధాంతం, మధ్యయుగం నుండి ఐరోపాలో ప్రచారంలో ఉంది. అమెరికన్లు వారి ఆర్థిక ఆలోచనా విధానంలో, ఈ సిద్ధాంతాన్ని ఆమోదించలేదు. ప్రతి వ్యక్తికి తన ఆస్తికి సంబంధించిన విషయాల్లో స్వేచ్ఛ ఉండాలని వారు విశ్వసించారు. మొదటగా వలసలు స్థాపించిన 17వ శతాబ్దంలో, మధ్యయుగ ధోరణులు కొంత ప్రచారంలో ఉండి, ప్రభుత్వం ధరలను, వేతనాలను నిర్ణయించి, అక్రమ లాభాలను ఆర్జించే వ్యాపార స్తులను శిక్షించాలని, న్యూఇంగ్లాండ్‌లోని మతాధికారులు ప్రచారం చేశారు. పద్దెనిమిదో శతాబ్దంలో ఈ ధోరణి ఉన్నప్పటికీ, దాని కన్న మిన్నగా, ప్రభుత్వం వ్యాపార సంస్థలకు సహాయసహకారాలందించాలనే ధోరణి ప్రబలింది.

అమెరికన్ విప్లవ ఆరంభ కాలం దాకా, బ్రిటీష్ ప్రభుత్వం వలసల వ్యాపారాన్ని అదుపులో పెట్టటాన్ని, అమెరికన్లు సాధారణంగా ఆమోదించారు. అయితే, కొంతమంది రచయితలు వ్యాపారానికి సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలని వాదించారు. అట్టి వారిలో ప్రముఖుడు బెంజమిన్ ఫ్రాంక్లిన్. ఫ్రాంక్లిన్ 1751 నాటికే ఈ వాదనను ప్రతిపాదించి, సమర్థించాడు. వలసల కాలంలో, ఈ వ్యాపార స్వేచ్ఛా ఆర్థిక సిద్ధాంతాన్ని సమర్థిస్తూ బెంజమిన్ ఫ్రాంక్లిన్ రచించిన వ్యాసాలు మౌలికమైనవీ, ప్రతిభావంతమైనవి. బంగారు, వెండి నాణేల చెలామణి మాత్రమే ఆర్థిక భద్రతను కలిగిస్తుందనే ప్రతిపాదనను ఎదిరించి, ద్రవ్యం, (డబ్బు) కాగితనోట్ల రూపంలో విస్తారంగా చెలామణి ఉంటేనే కాని, ఆర్థిక ప్రగతిని సాధించలేమని ఫ్రాంక్లిన్ వాదించాడు. భూమి మాత్రమే సంపదకు మూల కారణమని, రైతులు మాత్రమే యదార్థంగా సంపదను ఉత్పత్తి చేసేవారని, వ్యాపారులు పరాన్నభుక్కులనే ఫ్రెంచి రాజకీయ ఆర్థికవేత్త (Political Economists) లయిన 'ఫిజియోక్రాట్స్' (Physiocrats)ల ఆర్థిక సిద్ధాంతాలను ఫ్రాంక్లిన్ సమర్థించాడు. ఈ సిద్ధాంతాలు అమెరికా ప్రజల్లో ఎక్కువ మందిని ఆకట్టుకొన్నాయి. వలసల్లోని ధనిక వర్గాలను, వారి ప్రయోజనాలను గ్రామీణ ప్రజలు ఎదిరించటాన్ని, ఈ సిద్ధాంతాలు సమర్థించాయి.

## 8.6 సంగ్రహంగా

1. 1607-1733 మధ్య కాలంలో ఇంగ్లీష్‌వారు అనేక కారణాలచేత ప్రేరితులై, ఉత్తర అమెరికా ఖండంలో అట్లాంటిక్ తీరం వెంబడి 13 వలసలను స్థాపించారు.

2. 1775 (స్వాతంత్ర్య పోరాట కాలం) నాటికి, ఈ వలసల్లో అంతటా శాసన సభలు ఏర్పడ్డాయి. రాజకీయ హక్కులను పరిరక్షించుకోవాలనే సంకల్పం వాటికి ఉంది. సాంఘిక సిద్ధాంతపరంగా, దాదాపు అందరు అమెరికన్లకు సహజ హక్కుల సిద్ధాంతంలో విశ్వాసం ఉంది. ప్రతి వ్యక్తి-

తన ఆస్తికి సంబంధించిన విషయంలో స్వేచ్ఛ ఉండాలని విశ్వసించారు. అట్లే, వ్యాపార స్వేచ్ఛా ఆర్థిక సిద్ధాంతాన్ని గూడా బెంజమిన్ ఫ్రాంక్లిన్ మొదలైన నాయకులు ప్రచారం చేసి, సమర్థించారు.

## 8.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. నూతన ప్రపంచ ఆవిష్కరణ, స్పెయిన్, ఫ్రెంచి వలసల స్థాపనా ప్రక్రియలను, వాటి ప్రాముఖ్యతను వివరించండి.

2. ఉత్తర అమెరికా ఖండంలో వలసలను స్థాపించటంలో ఆంగ్లేయులు అనుసరించిన విధానాలను పరిశీలించండి.

3. స్వాతంత్ర్య పోరాట కాలం నాటికి వలసలు సాధించిన ప్రగతిని విశ్లేషించండి.

II. క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.

1. స్వాతంత్ర్య పోరాట కాలం నాటికి వలసల్లో రాజకీయ పరిణామాలు

2. స్వాతంత్ర్య పోరాట కాలం నాటికి వలసల సాంఘిక సిద్ధాంతాలు

## 8.8 ఉపయుక్త గ్రంథాలు


Andrews C. M. : The Colonial Period of American History, 1934

Andrews C. M. : Our Earliest Colonial Settlements, 1973

Boorstin D. J. : The Americans: The Colonial Experience, 1958

Osgood H. L. : The American Colonies in the Seventeenth Century.

Osgood H.L. : The American Colonies in the Eighteenth Century.


BRAOU

# భాగం-9 : అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ కారణాలు

**విషయక్రమం**


9.0 లక్ష్యాలు

9.1 ఫ్రెంచి వలస యుద్ధాలు : సప్తవర్ష సంగ్రామం

9.2 ఆంగ్లేయ, ఫ్రెంచి వలస యుద్ధాలు : సప్తవర్ష సంగ్రామం

9.3 వలసల వైఖరి

9.3.1 బ్రిటీష్ నౌకా శాసనాలు - మర్కంటైల్ విధానం

9.3.2 మూడో జార్జి రాజు విధానాలు

9.3.3 రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్ (Writs of Assistance)

9.3.4 1763 ప్రకటన

9.4 ప్రధాన మంత్రి జార్జి గ్రెన్‌విల్ చర్యలు

9.4.1 పంచదార చట్టం, 1764

9.4.2 కరెన్సీ చట్టం, 1764

9.4.3 స్టాంప్ చట్టం, 1765; క్వార్టరింగ్ చట్టం, 1765

9.5 టౌన్‌షెండ్ పన్నులు

9.6 బోస్టన్ హత్యాకాండ

9.7 కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్ (Committees of Correspondence)

9.8 బోస్టన్ టీ పార్టీ, 1773

9.9 దుస్సహ శాసనాలు (శిక్షా శాసనాలు)

9.10 క్విబెక్ చట్టం, 1774

9.11 మొదటి కాంటినెంటల్ కాంగ్రెస్, 1774

9.12 లెక్సింగ్‌టన్ కంకార్డ్ : అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రారంభం, 1775 ఏప్రిల్, 19

9.13 రెండో కాంటినెంటల్ కాంగ్రెస్, 1775


BRAOU

9.14 'కామన్ సెన్స్' (Common Sense)

9.15 సంగ్రహంగా

9.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

9.17 ఉపయుక్త గ్రంథాలు

## 9.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- సప్తవర్ష సంగ్రామం తర్వాత, వలసల రాజకీయ, సాంఘిక, ఆర్థిక హక్కులకు సంబంధించి, ప్రయోజనాలకు సంబంధించి, వలసల వైఖరిలో, బ్రిటీష్ ప్రభుత్వ వైఖరిలో వచ్చిన మార్పులు, అవి స్వాతంత్ర్య పోరాటానికి మూలకారణాలైన తీరు.
- స్వాతంత్ర్య పోరాటానికి మూడో జార్జి రాజు విధానాల బాధ్యత
- వలస ప్రజల సహనాన్ని పరీక్షించిన వివిధ బ్రిటీష్ ప్రభుత్వ చట్టాలు, వలస ప్రజల ప్రతిస్పందన
- లెక్సింగ్‌టన్, కంకార్డ్ సంఘటనలు; అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రారంభం, 1775 ఏప్రిల్, 19.

## 9.1 ఆంగ్లేయ, ఫ్రెంచి వలస యుద్ధాలు : సప్తవర్ష సంగ్రామం

ఉత్తర అమెరికా ఖండంలో తమ రాజకీయ ఆధిక్యత నిలుపుకోటానికి, వలసల స్థాపనకై, వ్యాపార ప్రయోజనాలు సాధించుకోటానికై, నూతన ప్రాంతాలను ఆక్రమించుకొనేటందుకు, 1688-1763 మధ్య కాలంలో ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌ల మధ్య నాలుగు యుద్ధాలు జరిగాయి. అయితే, ఉత్తర అమెరికాలో ఈ రెండు దేశాల మధ్య జరిగిన వలస యుద్ధాలు, ఐరోపాలో అధికార ప్రాభవానికై, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం మొదలైన దేశాల్లో తమ వ్యాపార వలసలను విస్తరింపచేసి, తమ రాజకీయ పలుకుబడిని పెంపొందించుకోడానికి, ఈ రెండు దేశాల మధ్య, సంభవించిన యుద్ధాలకు ప్రతిబింబాలు. ఐరోపాలో ఈ రెండు దేశాల మధ్య జరిగిన నాలుగు ప్రఖ్యాత యుద్ధాలు, వాటికి సమాంతరంగా అమెరికాలో ఆంగ్లేయ, ఫ్రెంచి వలసల మధ్య జరిగిన యుద్ధాలను, ఈ క్రింద ఉదహరించడం జరిగింది.

| ఐరోపాలో యుద్ధం పేరు | వలసల్లో యుద్ధం పేరు |
|---|---|
| 1. 1688-1697 లీగ్ ఆఫ్ ఆగ్స్‌బర్గ్ యుద్ధం (War of the League of Augsburg) | 1689-1697 కింగ్ విలియమ్స్ యుద్ధం (King William's War) |
| 2. 1701-1713 స్పెయిన్ వారసత్వ యుద్ధం (War of Spanish Succession) | 1702-1713 ఆనీ రాణి యుద్ధం (Queen Anne's War) |
| 3. 1740-1748 ఆస్ట్రియన్ వారసత్వ యుద్ధం (War of Austrian Succession) | 1744-1748 కింగ్‌జార్జి యుద్ధం (King George's War) |
| 4. 1756-1763 సప్తవర్ష సంగ్రామం (Seven Years' War) | 1754-1763 ఫ్రెంచి, ఇండియా యుద్ధం (French and Indian War) |

BRAOU

పైన పేర్కొన్న యుద్ధాల్లో, మొదటి మూడు యుద్ధాల్లో రెండు దేశాల మధ్య గెలుపు ఓటములు, లాభనష్టాలు దాదాపు సమానమే. వాటిని ఇక్కడ వివరంగా చర్చించనవసరం లేదు. కాని, అమెరికాలో ఫ్రెంచి - ఇండియా యుద్ధమనీ, ఐరోపాలో సప్తవర్ష సంగ్రామం (1756 - 1763) అనీ, పేర్కొన్న యుద్ధం, దీన్ని పరిసమాప్తిచేసిన 1763 ప్యారిస్ సంధి, ఆంగ్లేయ వలసల చరిత్రలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించాయి. పరోక్షంగా, 1763 ప్యారిస్ సంధి షరతులు అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి దోహదం చేశాయి. ప్యారిస్ సంధి ఫలితంగా, ఫ్రెంచివారు ఉత్తర అమెరికా ఖండాన్ని దాదాపు ఖాళీచేసి వెళ్లారు. ఉత్తర అమెరికాలో కెనడా, బ్రిటీష్ వారి వశమైంది. యుద్ధానికి ముందు, మిసిసిపి నదికి తూర్పుగా, ఫ్రెంచివారి అధీనంలో ఉన్న ప్రాంతమంతా, (న్యూఆర్లియన్స్ మినహా) బ్రిటన్‌కు ఇచ్చివేయడం జరిగింది. యుద్ధంలో తనవైపు చేరిపోరాడిన స్పెయిన్‌కు, ఫ్రాన్స్ న్యూ ఆర్లియన్స్‌ను, మిసిసిపి నదికి పశ్చిమంగా ఉన్న లూసియానాను ఇచ్చివేసింది. బ్రిటన్ స్పెయిన్ నుండి గెల్చిన క్యూబా, ఫిలిప్పైన్స్ దీవులను స్పెయిన్‌కు తిరిగి ఇచ్చివేసి, వాటికి బదులుగా ఫ్లొరిడాను పొందింది. పశ్చిమ ఇండియా దీవుల్లో చెరకు పండే కొన్ని దీవులు, సెయింట్ లారెన్స్ సింధు శాఖలో చేపలు పట్టే స్థావరాలుగా రెండు చిన్న దీవులను ఫ్రెంచి వారికి వదిలారు. ఈ విధంగా, ఉత్తర అమెరికాలో ఫ్రెంచి వారి అధికారం అంతరించింది. బ్రిటన్ తన రాజకీయ ప్రాభవాధిక్యతను నిలబెట్టుకుంది.

సప్తవర్ష సంగ్రామం, దాని ఫలితాలు, వలస ప్రజల దృక్పథంలో, ఆలోచనా విధానంలో, మౌలికమైన మార్పులను తెచ్చాయి. యుద్ధంలో వలస ప్రజలు బ్రిటీష్ సైనికులతో కలసి, సాయుధులై ఫ్రెంచి వారితో పోరాడారు. యుద్ధం చివరి రోజుల్లో దాదాపు 20,000 మంది అమెరికన్ సైనికులు బ్రిటీష్ సైనికులతో కలసి పోరాడారు. వలస సైనికులను బ్రిటీష్ సేనాధిపతులు హీనంగా చూచినప్పటికీ, ఆ సైనికులు బ్రిటీష్ సైనికులతో సమానంగా ప్రతి యుద్ధరంగంలో పోరాడారన్నది నిర్వివాదాంశమని తేలింది. ఇది, సైనికపరంగా, వలస ప్రజలకు, వారి బలంలో విశ్వాసాన్ని కల్పించి, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించింది. యుద్ధంలో వివిధ వలసలకు చెందిన సైనికులు ఒకచోట కలవడానికి అవకాశం ఉంది. వలసల ప్రజలంతా ఒక్కటే అనే భావం పెంపొందసాగింది. ఉత్తర అమెరికాలో ఫ్రెంచివారి ఉనికి ఇంగ్లీష్ వలసలకు పక్కలో బల్లెం లాగే ఉండింది. బ్రిటీష్ సైన్య సహాయం లేకుండా, ఫ్రెంచివారి దాడుల నుండి, దురాక్రమణల నుండి తమను తాము రక్షించుకోలేమనే భయం, వలసలకు ఉండింది. 1763 ప్యారిస్ సంధి ద్వారా, అక్కడ నుండి ఫ్రెంచి వారికి ఉద్వాసన చెప్పడంతో, ఆంగ్లేయ వలసలకు మాతృదేశ సైనిక సహాయావసరం తీరిపోయింది. అటువంటి అవసరమేర్పడితే, మాతృదేశాన్ని ఎదిరించి నిలబడగలమనే ధైర్యం, ఆత్మస్థైర్యం ఏర్పడినాయి. వలసలన్నీ క్రమంగా వృద్ధిచెందుతున్న తమ శక్తిసామర్థ్యాలను ఆకళింపు చేసుకొని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొన్నాయి. వలసలు స్వయంపాలన కోసం, తమ హక్కులను, ప్రయోజనాలను సాధించుకోటం కోసం, ఉద్యమాన్ని లేవదీయడానికి, అనుకూల వాతావరణ మేర్పడింది.

## 9.2 వలసల వైఖరి

1763 ప్యారిస్ సంధి తర్వాత, వలస ప్రజల, బ్రిటీష్ ప్రభుత్వ దృక్పథాల్లో వచ్చిన మార్పులే, అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి మూలకారణాలై, చివరకు ఆ పోరాటానికి దారితీశాయి. బ్రిటీష్ సామ్రాజ్యంలో బ్రిటీష్ ప్రభుత్వ ఆదేశాలను, ఆజ్ఞలను పాటిస్తూ, పారతంత్రమైన రాజకీయ మనుగడను సాగించటానికి అమెరికన్ వలసలు గొప్ప విముఖతను కనపరచసాగాయి. అదే సమయంలో, 1763 తర్వాత వచ్చిన బ్రిటీష్ ప్రభుత్వాలు, అంతకు ముందుకన్న ఎక్కువ పటిష్టంగా వలసలను

అధీనంలోకి, అదుపులోకి తెచ్చుకోటానికిగాను, నూతన రాజనీతి విధానాలను ప్రవేశపెట్టి, అమలు పరచసాగాయి. ఈ విభిన్న దృక్పథాల మధ్య ఏర్పడ్డ సంఘర్షణే, చివరకు అమెరికా స్వాతంత్ర్య యుద్ధంగా రూపుదాల్చింది.

పద్దెనిమిదో శతాబ్ది మధ్య కాలానికి వలసలు ఆర్థిక, సాంఘిక రంగాల్లో, సాధించిన ప్రగతిని పైన క్లుప్తంగా పేర్కొన్నాం. ఈ ప్రగతి ఫలితంగా, వలస ప్రజల్లో నూతనమైన ఒక ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం చోటుచేసుకున్నాయి. తమ భవిష్యత్తును తామే రూపొందించుకోగలమనే ఆత్మవిశ్వాసం, తమను తాము పాలించుకోగలమనే ఆత్మస్థైర్యం ఏర్పడినాయి. తమదైన ఒక నూతన జీవిత విధానాన్ని తాము మలచుకుంటున్నామనే ఒక భావన ఏర్పడింది. నూతన ప్రపంచంలో ప్రతిష్ఠించిన ఐరోపా జాతులుగా మాత్రమే వారిని పరిగణించటానికి, వారు ఇష్టపడలేదు. వలస ప్రజల్లో వెల్లివిరిసిన ఈ నూతనోత్సాహం, ఆలోచనా విధానం, 1740, 1750 ల మధ్య వచ్చిన వార్తాపత్రికల్లో, రాజకీయ రచనల్లో చక్కగా గోచరిస్తుంది.

వలస ప్రజల్లో ఏర్పడ్డ ఈ నూతన దృక్పథంలో, బ్రిటన్‌తో రాజకీయ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలనే కోరికగాని, బ్రిటిష్ వారసత్వాన్ని కాదనాలనే కోరికగాని, ప్రారంభ దశలో లేదు. భావపరమైన కారణాలవల్ల, ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా, దాదాపు వలస ప్రజలందరూ బ్రిటిష్ సామ్రాజ్యం లోనే ఉండాలని కోరుకున్నారు. అయితే, వీరిలో కొందరు తమకు పూర్తి స్వయం పరిపాలనాధికారం ఉండాలనీ, బ్రిటిష్ ప్రజల హక్కులతో సమానమైన హక్కులు తమకూ ఉండాలనీ, సామ్రాజ్య వ్యవహారాలు ఇంగ్లాండ్ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే నెరపరాదనీ, భావించడం ప్రారంభించారు. దూరదృష్టి గల, బెంజమిన్ ఫ్రాంక్లిన్ వంటి మేధావులు, ఇంగ్లీష్ భాష మాట్లాడే ప్రజల మధ్య ఒక శాశ్వతమైన భాగస్వామ్యం ఏర్పడగలదని, ఈ భాగస్వామ్యంలో నాయకత్వం అట్లాంటిక్ సముద్రం పడమటి వైపు వారికి చెందగలదనీ, కలలు కన్నారు.

వలస ప్రజల్లో కొన్ని వర్గాలకు ఈ నూతన దృక్పథం, ఆలోచనా విధానం, నూతనోత్సాహాన్ని, ఆశలను రేకెత్తించాయి. ఉదాహరణకు, వలసలకు స్వయంపరిపాలన లభిస్తే, బ్రిటిష్ వ్యాపారులకు ఇవ్వాల్సిన భారమైన అప్పుల నుండి బయటపడవచ్చునని, అపలేషియన్ పర్వతాల ఆవల సారవంతమైన భూములను ఆక్రమించి, తాము ఇతోధికంగా సంపన్నులు కావచ్చునీ, దక్షిణాది భూస్వామ్యవర్గం ఆలోచించసాగారు. బ్రిటిష్ ప్రభుత్వ వ్యాపార నిబంధనల నుండి, వలసల్లో ఉత్పత్తులపై బ్రిటిష్ ప్రభుత్వ ఆంక్షల నుండీ, తమకు విముక్తి లభిస్తుందనీ, ఉత్తరాదిలోని ఔత్సాహిక వ్యాపారులు తలచారు. 1760లకు ముందు, ఈ వ్యాపార సమస్యలపై బ్రిటిష్ ప్రభుత్వంతో సంఘర్షణ ఏర్పడలేదంటే దానికి కారణం, అంతవరకు వ్యాపారం మీద బ్రిటీష్ ప్రభుత్వం విధించిన నిబంధనలను, ఆంక్షలను, చట్టాలను పటిష్ఠంగా అమలు చేయకపోవటం, వాటిని ఉల్లంఘించినా, వ్యాపారులు శిక్షలకు గురికాకపోవటాన్ని గమనించవచ్చు.

ఇదే సమయంలో మధ్య తరగతి రైతులు, పట్టణాల్లోని కార్మిక వర్గం, ఇతోధికమైన రాజకీయ హక్కులను, విస్తృతమైన ఆర్థిక అవకాశాలను కోరసాగారు. వలసల్లోని పాలక వర్గం, లేక ధనిక వర్గం ప్రత్యేక హక్కులను అంతమొందించి, విస్తృతమైన రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టాలని వారు కోరసాగారు. వలసల్లోని పాలకవర్గాన్ని, ధనిక వర్గాన్ని, వారి ప్రయోజనాలను, వలసల్లోని బ్రిటీష్ ప్రభుత్వాధికారులు, లండన్‌లోని బ్రిటిష్ పార్లమెంట్ సమర్థిస్తున్నట్లు, వారు గమనించారు. అందు వల్ల, వలసల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మాత్రమేగాక, స్వతంత్ర పరిపాలనకు కూడా పోరాటం చేయాల్సి ఉంటుందని వారు భావించారు.

BRAOU

పైవిధంగా, వలసల్లోని వివిధ వర్గాల ప్రజలు, 1763 తర్వాత, వారి వారి ప్రయోజనాల ననుసరించి, హక్కుల సాధనకు, చివరకు స్వాతంత్ర్య స్థాపనకు కృషి చేశారు. అందువల్ల, అమెరికన్ విప్లవం ప్రధానంగా రెండు ధ్యేయాలతో నడచిన పోరాటం: (1) కొంతవరకు అది, అమెరికా ఆర్థికాభివృద్ధిపై, అమెరికన్ వ్యాపారంపై కొనసాగింది. బ్రిటీష్ మర్కంటైల్ (Mercantile వ్యాపార నిబంధనా) విధానం విధించిన చట్టపరమైన నిబంధనలకు, ఆంక్షలకు ప్రతిగా, వలసల్లోని భూస్వాములు, వర్తకులు జరిపిన పోరాటం అది. (2) మరో వైపు, అది ధనిక, కులీన వర్గాల ప్రత్యేక హక్కుల మీద, కార్మికులు, కర్షకులు జరిపిన పోరాటం. చాలవరకు, ఈ రెండు వర్గాల ఉద్యమాలు, రెండు విభిన్న దశల్లో పయనించాయి. అమెరికన్ విప్లవ కాలంలో, వలసల్లోని కులీన సంపన్న వర్గానికి, ప్రజాస్వామ్య భావాలు గల సామాన్యులకు మధ్య, నిరంతర సంఘర్షణలు ఉండేవి.

అయితే, వలస ప్రజలందరిలో పైభావాలు వ్యాప్తి చెందినట్లు చెప్పలేం. బహుశా, రైతుల్లో చాలామంది, రాజకీయల్లో ఎటువంటి ఆసక్తిలేని వారుగా ఉండేవారు. సంపన్న వర్గాల్లో చాలామంది ఎటువంటి మార్పును ఇష్టపడని వారుగా ఉండేవారు. వీరికి బ్రిటీష్ పాలనకన్నా, ప్రజాస్వామ్యం ఎక్కువ భీతిని కొల్పేది. యదార్థంగా, స్వాతంత్ర్య యుద్ధం సంభవించినపుడు, వలస ప్రజల్లో ఎక్కువ భాగం ప్రజలు ఉదాసీనంగా ఉండేవారు. చాలామంది బహిరంగంగా బ్రిటీష్ ప్రభుత్వాన్నే సమర్థించారు కూడా. చరిత్రకారుడు హెచ్. బి. పార్క్స్ చెప్పినట్లు, అమెరికన్ విప్లవం మొత్తం ప్రజల్లో అల్ప సంఖ్యాకులు (Minority) నడపిన ఉద్యమం. అయితే, వీరిలో చక్కని సామర్థ్యం, ధైర్యోత్సాహాలు, ఔదార్యం కలవారుండేవారు. "The American Revolution was the work of a minority of the total population; but this minority included the men of superior ability, courage, liberality and dynamic enthusiasm" -- H.B. Parks, 'A History of the USA.'

## 9.3 బ్రిటీష్ ప్రభుత్వ వైఖరి

వలస ప్రజల్లో ఒక నూతన చైతన్యం వెల్లివిరుస్తున్న సమయంలో, బ్రిటన్ వలసల పట్ల అప్పటికే చాలాకాలం నుండి అనుసరిస్తున్న వ్యాపార (Mercantile) సిద్ధాంతాన్ని అనుసరించడం జరిగింది. 17,18 శతాబ్దాల్లో ఈ మర్కంటైల్ వ్యాపార విధానానికి అనుగుణంగా వలసల వ్యాపారాన్ని క్రమబద్ధం చేస్తూ, బ్రిటీష్ పార్లమెంట్ కొన్ని చట్టాలను అమలుపరచింది. వీటిని నౌకా చట్టాలని పిలిచారు. వీటిని, మొదట్లో, వ్యాపారంలో డచ్చివారి పోటీని ఎదుర్కోటానికిగాను, ప్రవేశపెట్టారు. అవి:

1. నౌకా చట్టాల్లో మొదటి చట్టాన్ని 1650 లో ప్రవేశపెట్టారు. దీని ప్రకారం వలసల్లోని సరకుల ఎగుమతులను, దిగుమతులను ఆంగ్లేయ, లేదా వలసల నౌకల మీదనే రవాణా చేయాలి. అంతేకాక, ఈ నౌకలలో పనిచేసేవారు ఎక్కువమంది ఆంగ్లేయ పౌరులుకాని, లేదా వలస పౌరులుకాని అయి ఉండాలి.

2. నిర్దేశించిన వస్తువులు (enumerated articles) గా పేర్కొన్న వలసల్లోని కొన్ని రకాల ఉత్పత్తులను, ఐరోపాలోని దేశాలకు ఇంగ్లాండ్ మీదుగానే ఎగుమతి చేయాలి. వీటిలో, వలసలు ఎగుమతి చేసే ఉత్పత్తుల్లో ప్రధానమైన వస్తువులన్నీ దాదాపు ఉన్నాయి. ఉదా॥ మృదు రోమాలతోకూడిన జంతు చర్మాలు (ఉన్ని లేక Furs), ఓడల తెరచాప కొయ్యలు, తారు, నౌకా నిర్మాణంలో వాడే బంక (Ditch), కర్పూర తైలం, పొగాకు మొదలైనవి.

3. ఐరోపానుండి వలసలకు చేరే దిగుమతులన్నీ, ఇంగ్లాండ్ మీదుగానే దిగుమతి కావాలి.

4. నౌకా చట్టాలకు అనుబంధంగా, ఇంగ్లాండ్‌లోని పరిశ్రమలకు పోటీలేకుండా చేయటానికి, వలసల్లోని పరిశ్రమల మీద కొన్ని ఆంక్షలు విధించారు. ఉదా॥ 1750 ఇనుము చట్టం (Iron Act) అమెరికాలో ఇనుప వస్తువుల ఉత్పత్తిని పరిమితం చేయడానికి ప్రయత్నించింది. 1733 మొలాసస్ చట్టం (Molasses Act) ద్వారా, ఫ్రెంచి పశ్చిమ ఇండియా దీవుల నుండి వలసలు దిగుమతి చేసుకొనే మొలాసస్ మీద, ఒక గ్యాలన్‌కు ఆరు పెన్నీల పన్ను విధించారు. దీని ఉద్దేశం, బ్రిటీష్ పశ్చిమ ఇండియా దీవులనుండి దిగుమతి అయ్యే మొలాసస్‌ను వలస ప్రజలు కొనేటట్లు చేయటమే.

ఈ నౌకా చట్టాల్లో కొన్ని వలసల వ్యాపారాభివృద్ధికి, సంపన్న స్థితికి, కొంత మేలును చేకూర్చాయి. ఉదాహరణకు, బ్రిటన్ వర్జీనియాలో ఉత్పత్తి అయిన పొగాకును మాత్రమే కొనుగోలు చేసేది. ఈ విధంగా ఏదో కొన్ని విషయాల్లో నౌకా చట్టాలు కొంత మేలు చేకూర్చినా, ఈ మేలు కంటే ఈ చట్టాలు వలసలకు ఇతర దేశాలతో గల వ్యాపార సంబంధాల్లో అసౌకర్యం కలుగచేసి, అభివృద్ధి నిరోధకాలయ్యాయి. న్యూఇంగ్లాండ్ వలసల్లోని వ్యాపారస్తులు మొలాసస్ చట్టాన్ని ప్రత్యేకంగా నిరసించారు. న్యూ ఇంగ్లాండ్‌లోని ప్రధాన పరిశ్రమల్లో 'రమ్' అనే మద్యాన్ని తయారు చేయడం ఒకటి. ఈ మద్యాన్ని తయారు చేయటానికి 'మొలాసస్' (చెరకు పిప్పి) విస్తారంగా అవసరం. న్యూ ఇంగ్లాండ్‌లోని సారాయి బట్టీలకు వలసినంత విస్తారంగా మొలాసస్‌ను బ్రిటీష్ పశ్చిమ ఇండియా దీవులు ఎగుమతి చేయలేకపోయాయి. అందువల్ల, ఈ మద్య పారిశ్రామికులు తమకు కావలసిన మొలాసెస్‌ను, ఫ్రెంచి పశ్చిమ ఇండియా దీవుల నుండి దిగుమతి చేసుకొనేవారు. 1733 మొలాసస్ చట్టం ఈ దిగుమతుల మీద గ్యాలన్‌కు 6 పెన్నీల పన్ను విధించింది. ఈ సుంకం చాలా ఎక్కువ; దీనివల్ల, ఫ్రెంచి పశ్చిమ ఇండియా దీవుల నుండి దిగుమతి అయ్యే మొలాసెస్ ధర న్యూఇంగ్లాండ్ వ్యాపారస్తులు దాన్ని కొనలేనంతగా పెరిగిపోయింది. అందువల్ల, వారు దాన్ని దొంగతనంగా దిగుమతి చేసుకోసాగారు. న్యూఇంగ్లాండ్ తీరంలో ఉండే అనేక సింధుశాఖలు ఈ దొంగ వ్యాపారాన్ని సులభం చేశాయి; దొంగ వ్యాపారం విస్తారంగా పెరిగిపోయింది. ఉదాహరణకు, రోడ్ ఐలాండ్ వలసకు దిగుమతి అయ్యే మొలాసస్‌లో, 80 శాతం దొంగతనంగా దిగుమతి చేసినట్లు అంచనా వేశారు. వలస వ్యాపారస్తుల్లో మర్యాదస్తులుగా, సంపన్నులుగా పరిగణింపబడే వ్యాపారస్తులు, ఈ దొంగ వ్యాపారం ద్వారా సంపన్నులైన వారే. సరిగా అమలు చేయని ఈ మొలాసెస్ చట్ట ఫలితం, చట్టోల్లంఘనాన్ని ప్రోత్సహించడమైంది. తమకు అనువుగాని బ్రిటీష్ ప్రభుత్వ చట్టాలను అనుసరించే ఉద్దేశం తమకు లేదని, వాటిని భంగం చేయటానికి వెరవమని, వలస వ్యాపారులు స్పష్టం చేశారు.

1763 కు పూర్వం, పై వ్యాపార నిబంధనలు స్వాతంత్ర్యోద్యమానికి దారితీయలేదు; కాని, అవి వలసల్లో తీవ్రమైన అసంతృప్తిని, సంతాపాన్ని కలిగించాయి. 1763 తర్వాత సంభవించిన సంఘటనలు, ఈ నేపథ్యంలో జరిగాయి.

మర్కంటైల్ (వ్యాపార) సిద్ధాంత ప్రకారం, వలసలు ఉండేది ప్రధానంగా మాతృదేశ (బ్రిటన్) సౌభాగ్యం కోసం. అందుచేత, వాటిని అదుపులో ఉంచాల్సిన అవసరం ఉంది. వాటికి సంబంధించి ఎట్టి చట్టాలైనా చేయటానికి, పార్లమెంట్‌కు సంపూర్ణాధికారం ఉంది. ఏదో ఒక మౌలికమైన న్యాయం (Fundamental Law) పార్లమెంట్ అధికారాన్ని పరిమితం చేస్తుందనే అమెరికన్ల నమ్మకాన్ని, బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరించలేదు. వలసల యెడ బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించాల్సిన మౌలిక విధానాలను, సిద్ధాంతాలను గూర్చి, బ్రిటీష్ రాజకీయ వేత్తల్లో ఎలాంటి భేదాభిప్రాయం లేదు. కాని,

BRAOU

వారిలో, ఎడ్మండ్ బర్క్, ఎర్ల్ ఆఫ్ చాథామ్ (విలియం పిట్) మొదలైన కొందరు రాజకీయవేత్తలు, బ్రిటన్‌కు వలసలతో 1763కు ముందుగల సంబంధాల్లో ఎట్టి మార్పుగాని చేయటం అభిలషణీయం కాదని భావించారు. మరి కొందరు, వలసల మీద బ్రిటీష్ ప్రభుత్వ పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని భావించారు.

సప్తవర్ష సంగ్రామ యుద్ధాన్ని అంతం చేసిన ప్యారిస్ సంధి ఫలితంగా, ఉత్తర అమెరికాలో బ్రిటీష్ ప్రభుత్వ రుణాలు కూడా పెరిగాయి. అందువల్ల, చాలా మంది బ్రిటీష్ అధికారులు వలసల్లో బ్రిటీష్ పాలనను పునర్వ్యవస్థీకరించి, సామ్రాజ్య రక్షణకు అయ్యే ఖర్చులో కొంతైనా వలసల నుండి వసూలు చేయడం అవసరమని భావించారు. యుద్ధ కాలం (1756-63) లో రక్షణకై వలసలు ఒక దానితో ఒకటి సహకరించటానికి విముఖత చూపినందువల్ల, అదనపు పన్నులను విధించే విషయంలో అసంతుష్టి కనపరచినందువల్ల, సామ్రాజ్య రక్షణకు అయ్యే ఖర్చును వసూలు చేసే విషయంలో వలసల మీద ఒత్తిడి తేక తప్పదని బ్రిటీష్ ప్రభుత్వం భావించింది. అంతేకాక, చాలాకాలంగా బ్రిటీష్ ప్రభుత్వ వ్యాపార నిబంధనలను ఉల్లంఘించి, ఎట్టి శిక్షలకు పాత్రులు కాకుండా ఉండటం, వలసల్లోని వ్యాపారస్తులకు అలవాటైపోయింది. వలస వ్యాపారులనుండి తాము ఎదుర్కొంటున్న తీవ్రమైన పోటీని గురించి, యుద్ధ కాలంలో వారు అధిక లాభాలకై శత్రు దేశాలతో వ్యాపారం చేయడాన్ని గురించి, బ్రిటీష్ వర్తకులు తమ ప్రభుత్వానికి మొరపెట్టసాగారు. వలస వర్తకుల దొంగ వ్యాపారాన్ని అరికట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకోవలసిన సమయం ఆసన్నమైనట్లు, బ్రిటీష్ ప్రభుత్వం భావించింది.

వలసల యెడ, 1763 తర్వాత, బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన నూతన విధానాలను, వాటి ఫలితాలను సమీక్షించటానికి ముందు, ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వంలో ఏర్పడిన రాజకీయ మార్పులను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

## 9.3.2 మూడో జార్జి రాజు విధానాలు

1760 కి ముందు చాలాకాలం, గ్రేట్‌బ్రిటన్‌ను, కామన్స్ సభలోని మెజారిటీ పార్టీ ఏర్పాటుచేసిన మంత్రివర్గాలు పాలిస్తుండేవి. రాజు నామమాత్ర ప్రభుత్వాధినేతకాని, 1760 లో ఇంగ్లాండ్‌కు రాజైన మూడో జార్జి (1760-1820) యువకుడు, అతడు నామమాత్ర ప్రభుత్వాధినేతగా ఉండటానికి ఇష్టపడలేదు. ఒక సామ్రాజ్యాన్ని పాలించటానికి కావసిన సామర్థ్యం, గుణాలు అతనిలో లేకపోయినా, అతనిలో గల స్థైర్యం, కృషి, మరికొన్ని వ్యక్తిగత గుణాలు అతనిని ప్రజలకు చేరువ చేశాయి. అతడు పార్లమెంట్‌లో ప్రబలంగా ఉన్న 'విగ్' (Whig) పార్టీని కూలదోసి, తన చుట్టూ కొంత మంది అనుయాయులను చేర్చుకొని, పార్లమెంట్‌ను తన చెప్పుచేతల్లో ఉంచుకోగలిగాడు. పార్లమెంట్ అతని చేతిలోని రబ్బర్ ముద్ర అయింది. అతని పాలనలోని మొదటి పదేళ్ల కాలంలో, ప్రభుత్వం అనిశ్చిత స్థితిలో ఉండిపోయింది. రాజు పన్నిన పన్నాగాల ఫలితంగా, ప్రభుత్వాలు తరచూ మారడం జరిగింది. ఫలితంగా, ఏ ప్రభుత్వం కాని వలసల యెడల ఒక సక్రమమైన, నిలకడైయున విధానాన్ని రూపొందించడం కాని, అనుసరించడం కాని, జరుగలేదు. 1770 నాటికి పార్లమెంట్ పూర్తిగా మూడో జార్జి వశమైంది. తర్వాత, పన్నెండేళ్ల పాటు మూడో జార్జి బ్రిటీష్ ప్రభుత్వ యదార్థ అధినేత అయ్యాడు. ప్రధాన మంత్రిగా ఉండిన నార్త్ ప్రభువు (1770-82) అతని సలహామేరకు పోయేవాడు. కామన్స్ సభ రాజు గారి వశమైంది. మూడో జార్జి అనుసరించిన విధానాలే చాలావరకు అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి దారితీశాయని, ఒక చారిత్రకాభిప్రాయం ఉంది. కాని, ఇది పూర్తిగా యదార్థం కాదు. ఎందువల్లనగా, అమెరికా వలస ప్రజలపై కొత్త పన్నులు వేయటానికి చేసిన మొదటి ప్రయత్నాలకు మూడో జార్జి



BRAOU

బాధ్యుడు కాడు. అంతేకాక, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన మౌలిక సమస్యలు ఒక వ్యక్తికి సంబంధించినవిగాక, అంతకన్నా ప్రగాఢమైనవి.

### 9.3.3 రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్ (Writs of Assistance)

సప్తవర్ష సంగ్రామం అంతం కావడానికి ముందే, వలసలను అదుపులోకి తెచ్చే ప్రయత్నాలను బ్రిటీష్ ప్రభుత్వం ప్రారంభించింది. చాలా మంది వలస వ్యాపారులు వ్యాపార నిబంధనలను ఉల్లంఘించి, నిషిద్ధ సరకుల్లో శత్రు దేశాలతో వ్యాపారం చేస్తున్నందువల్ల, వారి వ్యాపార నౌకలను, వారి గిడ్డంగులను, దొంగచాటుగా చేరవేస్తున్న సరకులను, వెదకటం కోసమై, రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్ (Writs of Assistance) అనే అధికార పత్రాల ద్వారా, సుంకాధికారులకు అధికారాలిచ్చారు. వ్యాపార చట్టాలను ఉల్లంఘిస్తే, నేరస్థులను విచారించి శిక్షించటం కోసం, వైస్ అడ్మిరాలిటీ న్యాయస్థానాలను (Vice Admirality Courts) ఏర్పాటు చేశారు. రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్‌ను వలస వ్యాపారులు, ముఖ్యంగా బోస్టన్ నగరంలోని వ్యాపారులు, తీవ్రంగా నిరసించారు. బోస్టన్‌లో వారి న్యాయవాది అయిన జేమ్స్ ఓటిస్, రిట్స్ ఆఫ్ అసిస్టెన్స్‌ను తన వాదనా పటిమతో తీవ్రంగా ప్రతిఘటించాడు. ఓటిస్ ప్రకారం, ఈ రిట్స్ బ్రిటీష్ పౌరులైన వలస ప్రజల ప్రాథమిక హక్కులను భంగపరుస్తున్నాయి. అందువల్ల, అవి న్యాయ విరుద్ధమైనవి. బ్రిటీష్ ప్రభుత్వ అధికారాలు మౌలిక న్యాయం (Fundamental Law) వల్ల పరిమితం అయినాయనే అమెరికన్ల దృఢాభిప్రాయానికి, ఈ వాదం ప్రతిబింబం.

### 9.3.4 1763 ప్రకటన

సప్తవర్ష సంగ్రామం అంతం కాగానే, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొన్న సమస్య, 1763 పారిస్ సంధి ద్వారా ఫ్రాన్స్ నుండి లభించిన అపలేషియన్ పర్వతశ్రేణి ఆవలి భూముల పంపకాన్ని గూర్చి తీసుకోవలసిన నిర్ణయం. ఒక వైపు, ఈ భూముల మీద తమకు హక్కు ఉందని చాలా వలసలు ప్రకటించాయి. వర్జీనియా, తనకు ఈ భూముల మీద గల హక్కును ప్రత్యేకంగా నొక్కి చెప్పింది. మరొకవైపు, భూముల్లో వ్యాపారం చేసే స్టాక్ వ్యాపారస్తులు (Speculators), కంపెనీలు, పరస్పరం పోటీపడి, ఈ ప్రాంతంలోని భూముల్లోని కొన్ని భాగాలపై హక్కులను సంపాదించి, అక్కడ నూతన స్థావరాలను ఏర్పరచాలని ఆశించారు. ఇంకోవైపు ఉన్నిలో వ్యాపారం చేసే బ్రిటీష్ వ్యాపారులు, ఈ ప్రాంతంలో వ్యవసాయదారులు స్థిరపడకుండా చేసి, అక్కడి భూములను తమ కార్యకలాపాలకు ఉపయోగించుకోవాలని ఆశించారు. ఈ ప్రాంతంలో అనేక రెడ్ ఇండియన్ జాతులు ఉండేవి. వారు అంతకుముందే పాంటియాక అనే నాయకుని ఆధిపత్యంలో తిరుగుబాటు సాగించి, డెట్రాయిట్, పశ్చిమ పెన్సిల్వేనియాల మధ్య ఉన్న కొన్ని ప్రాంతాలపై దాడిచేసి, క్షోభ పెట్టారు. బ్రిటీష్ సైన్యాలు వలస ప్రజల సహాయంతో పాంటియాక తిరుగుబాటును అణచి వేశారు. అందువల్ల, రెడ్ ఇండియన్లతో ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉండింది. ఇట్లా, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సమన్వయపరచి, ఈ భూముల పంపకం విషయంలో ఒక నిర్ణయానికి రావటం, ప్రభుత్వానికి క్లిష్ట సమస్య అయింది. అందువల్ల, ఈ అపలేషియన్ పర్వతాల ఆవలి ప్రాంతంలో ఎవరు కాని స్థిరపడటాన్ని నిషేధిస్తూ, బ్రిటీష్ ప్రభుత్వం 1763లో ఒక ప్రకటన చేసింది. వలసల్లోని అన్ని వర్గాలవారు ఈ ప్రకటనను నిరసించారు.

## 9.4 ప్రధానమంత్రి జార్జి గ్రెన్‌విల్ చర్యలు

1763లో బ్రిటీష్ ప్రభుత్వం ఉత్తర అమెరికాలో 10,000 సైన్యాన్ని నిలువదలచింది. ఈ సైన్యాన్ని నిలపడంలో ఉద్దేశం, అపలేషియన్ పర్వతాల ఆవలి ప్రాంతాలను ఫ్రెంచి వారు, రెడ్



BRAOU

ఇండియన్లు తిరిగి దురాక్రమణ చేసే ప్రయత్నాలను ఆపడం. ఈ సైన్యాన్ని ప్రధానంగా కెనడాలో, నోవాస్కోషియాలో, న్యూయార్క్‌లో నిలుపదలచారు. బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిలో, ఈ సైన్యం వలసల రక్షణకు అవసరం, కాబట్టి, ఈ సైన్యానికి అయ్యే ఖర్చులో కొంతైనా వలస ప్రజల నుండి పన్నుల రూపంలో రాబట్టాలని బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయానికి బాధ్యుడు, అప్పటి ప్రధాన మంత్రి అయిన జార్జి గ్రెన్‌విల్ (George Grenville). గ్రెన్విల్ నిజాయితీపరుడు. శ్రమించి పనిచేసేవాడు. కాని, అతనికి వలస ప్రజల మానసిక స్థితిని అవగాహన చేసుకొనే సంకల్పం, ఊహాశక్తి లోపించాయి. గ్రెన్విల్ నూతనంగా కొన్ని పన్నులను వలస ప్రజలపై విధించి, వారిలో తిరుగుబాటు ధోరణులను రేకెత్తించాడు.

## 9.4.1 పంచదార చట్టం, 1764

ఫ్రెంచి, స్పానిష్ పశ్చిమ ఇండియా దీవుల నుండి వలస వ్యాపారులు దిగుమతి చేసుకునే మొలాసెస్ మీద, 1733 మొలాసెస్ చట్టం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వం గ్యాలన్‌కు 6 పెన్నీల దిగుమతి సుంకాన్ని విధించిందనీ, కాని ఈ సుంకాన్ని వసూలు చేసే అధికార యంత్రాంగం పటిష్ఠంగా లేనందువల్ల, వలస వ్యాపారులు దొంగచాటుగా మొలాసెస్‌ను దిగుమతి చేసుకొని బ్రిటీష్ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుండేవారనీ, పైన పేర్కొన్నాం. విదేశీ మొలాసెస్ మీద ఉన్న ఈ పన్నును తగ్గించి, ఆ విధంగా తగ్గించిన పన్నును ఖచ్చితంగా వలసల నుండి వసూలు చేయటం, ఆదాయాన్ని పెంచటానికి ఒక మార్గంగా గ్రెన్విల్ భావించాడు. ఈ ఉద్దేశంతో గ్రెన్విల్ 1764 లో పంచదార చట్టాన్ని ప్రవేశపెట్టాడు. పంచదార చట్టం వలసలు దిగుమతి చేసుకొనే విదేశీ మొలాసెస్ మీద సుంకాన్ని, ఆరు పెన్నీల నుండి మూడు పెన్నీలకు తగ్గించింది. ఈ సుంకాన్ని ఖచ్చితంగా వసూలుచేసే అధికార యంత్రాంగాన్ని, గ్రెన్విల్ ఏర్పాటు చేశాడు. ఇంతేకాక, మద్యం, పట్టు, మొదలైన విలాస వస్తువుల మీద కొత్త పన్నులను విధించాడు. అమెరికా వ్యాపారస్తులు పంచదార చట్టాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ చట్టం వల్ల, వలసల వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుందని భావించారు.

## 9.4.2 కరెన్సీ చట్టం, 1764

పంచదార చట్టానికి తోడు, 1764 లోనే బ్రిటీష్ ప్రభుత్వం కరెన్సీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం, వలస ప్రజలకు అప్పులిచ్చిన బ్రిటీష్ శ్రీమంతులు పార్లమెంట్‌పై తీసుకవచ్చిన ఒత్తిడికి ఫలితం. ఈ చట్టం, వలసలు వెండి, బంగారాల వత్తాసు (Backing) లేకుండా, కేవలం కాగితపు కరెన్సీని జారీచేయడాన్ని నిషేధించింది. దీంతో, వలసల్లో అప్పు లభించడం కష్టమై, వందల కొద్దీ వర్తకులు దివాలా తీసే పరిస్థితి నెదుర్కొనవలసి వచ్చింది.

## 9.4.3 స్టాంప్ చట్టం, 1765, క్వార్టరింగ్ చట్టం, 1765

1765 లో గ్రెన్విల్ స్టాంపుల చట్టాన్ని, (Stamp Act) ప్రవేశపెట్టాడు. చట్టం మేరకు, వార్తా పత్రికలమీద, వ్యాపార పత్రాలమీద, వ్యవహారపత్రాల మీద స్టాంప్ డ్యూటీని విధించారు. ఈ పన్నులు, సుంకాలన్నిటి ద్వారా, అమెరికాలో నిలిపిన సైన్యానికయ్యే ఖర్చులో మూడోవంతు ఖర్చును వలసల నుండి రాబట్టవచ్చునని, గ్రెన్విల్ లెక్క కట్టాడు. స్టాంప్ డ్యూటీ ప్రత్యక్ష పన్ను (Direct tax). వలసల వ్యాపారాన్ని క్రమబద్ధం చేయటంలో, కొన్ని పరోక్ష పన్నులు విధిస్తుం డినప్పటికీ, బ్రిటీష్ ప్రభుత్వం వలసల మీద ప్రత్యక్ష పన్ను విధించటం, స్టాంప్ డ్యూటీతోనే మొదలైంది. స్టాంప్ చట్టం బిల్లు రూపంగా పార్లమెంట్‌లో చర్చలో ఉన్న సమయం (1765 ఫిబ్రవరి) లోనే, వలసల శాసన సభలు దాన్ని ఆమోదించరాదంటూ, చట్టం అమల్లోకి వచ్చింది.

BRAOU

దీనికి తోడు 1765, మే నెలలో గ్రెన్విల్, క్వార్టరింగ్ చట్టాన్ని (Quartering Act) ప్రవేశపెట్టాడు. ఈ చట్టం ప్రకారం, అమెరికాలో ఉన్న బ్రిటిష్ సైనికులకు వలస ప్రజలు గృహ వసతి కల్పించి, వారి నిత్యావసరాలు, కొవ్వొత్తులు, ఉప్పు, మద్యం మొదలైనవి సరఫరా చేయాలి.

స్టాంపుల చట్టాన్ని గూర్చిన వార్త వలసలకు చేరగానే, అవి ఏక కంఠంతో తమ ఉద్వేగాన్ని వ్యక్తం చేశాయి. అమెరికన్ల ఉద్దేశంలో బ్రిటిష్ సైన్య రక్షణ వారికి అవసరం లేదు. నాటికే, వారు యుద్ధానంతరం ఏర్పడ్డ ఆర్థిక మాంద్యంతో, కరెన్సీ కొరతతో సతమతమౌతుండినారు. స్టాంపు చట్టం వలసల్లోని ద్రవ్యాన్ని బ్రిటన్‌కు తరలించి, తాము బ్రిటిష్ వర్తకులకు చెల్లించాల్సిన రుణ భారాన్ని ఇతోధికం చేస్తుందని, అమెరికన్లు భావించారు. ప్రాతినిధ్యంలేని పన్ను విధింపును, వారు నిరంకుశత్వంగా భావించారు. తమకెట్టి ప్రాతినిధ్యంలేని ఆంగ్ల పార్లమెంట్ వ్యాపార నిబంధనలను విధించటాన్ని చట్ట సమ్మతమని అంగీకరించినా, అది ప్రత్యక్ష పన్నులను విధించటం సహజ హక్కులకు, మౌలిక న్యాయానికి భంగకరమని భావించారు.

స్టాంప్ చట్టానికి ప్రతిఘటన అనేక రూపాల్లో వ్యక్తమైంది. వలస శాసన సభలు ఈ చట్టాన్ని అధిశంసిస్తూ, తీర్మానాలు చేశాయి. వర్జీనియా శాసన సభలో ప్రతినిధి అయిన ప్యాట్రిక్ హెన్రీ స్టాంపుల చట్టాన్ని నిరసిస్తూ, అతి తీవ్రమైన ఉపన్యాసాన్ని చేశాడు. మొట్టమొదటిగా వర్జీనియా శాసన సభ స్టాంపుల చట్టాన్ని అధిశంసిస్తూ, తీర్మానాన్ని చేసింది. మెసాచూసెట్స్ శాసన సభా సభ్యుడైన జేమ్స్ ఓటిస్ ప్రతిపాదన మీద, వలసలన్నీ ఒకచోట సమావేశమై, స్టాంపుల చట్టం పట్ల తాము అనుసరించాల్సిన విధానాన్ని చర్చించటానికై, 1765 అక్టోబర్ 7న న్యూయార్క్‌లో స్టాంప్ యాక్ట్ కాంగ్రెస్ సమావేశమైంది. దీనికి తొమ్మిది వలసల ప్రతినిధులు హాజరయ్యారు. వీరు స్టాంపుల చట్టాన్ని మాత్రమే గాక, అడ్మిరాలిటీ న్యాయస్థానాలను, పార్లమెంట్ ఇటీవల ప్రవేశపెట్టిన చక్కెర చట్టం మొదలైన చట్టాలను రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. వలస శాసన సభలకు తప్ప, వలసలపై పన్నులు వేయడానికి పార్లమెంట్‌కు అధికారం లేదని ఉద్ఘాటించారు. ఈ తీర్మానాలు చేస్తూనే, రాజు పట్ల, పార్లమెంట్ పట్ల తమకుగల విశ్వాసాన్ని, విధేయతను ప్రకటించారు.

అయితే, అందరికీ ఆశ్చర్యం కొలిపిన విషయం స్టాంపు చట్టానికి ఏర్పడ్డ ప్రతిఘటనలోని హింసా ధోరణి. వలసల్లో అంతా అల్లర్లతో కూడిన ప్రజాప్రదర్శనలు జరిగాయి. గుంపులు హింసా ధోరణిని వ్యక్తంచేసి, స్టాంపు ఏజెంట్ల, సుంకాధికారుల, బ్రిటిష్ అధికారుల జీవితాన్ని దుర్భరం చేశాయి. బోస్టన్‌లో ధనిక, కులీన వర్గాల నాయకుడు, మెసాచూసెట్స్ వలస ప్రధాన న్యాయమూర్తి అయిన థామస్ హచిన్‌సన్ ఇంటిని ఒక గుంపు ధ్వంసం చేసింది. ఈ ప్రజాప్రదర్శనలు బ్రిటిష్ ప్రభుత్వానికేగాక, వలసల్లోని 'కన్సర్వేటివ్స్' (సంప్రదాయవాదులు)ల్లో కూడా, కొందరికి భీతిని కలిగించాయి. 'స్వేచ్ఛాపుత్రులు' (Sons of Liberty) అనే పేరుతో, విప్లవ సంఘాలుగా ఏర్పడి, విప్లవకారులైన కర్షకులు, కార్మికులు తర్వాతి పదేళ్లలో జరిగిన సంఘటనల్లో ప్రముఖ పాత్ర వహించారు. వీరికి, బోస్టన్‌లో శ్యామ్ ఆడమ్స్; న్యూయార్క్‌లో ఐసాక్ సేర్స్, జాన్‌ల్యాంబ్; ఫిలడెల్ఫియాలో ఛార్లెస్ థామ్‌సన్; బాల్టిమోర్‌లో శామ్యూల్ చేస్; ఛార్లెస్‌టన్‌లో క్రిస్టఫర్ గాడ్సెన్ మొదలైన యువ నాయకులు నాయకత్వం వహించారు. స్టాంప్ చట్టాన్ని ప్రతిఘటించటానికి వలసలు వాడిన అత్యంత శక్తివంతమైన ఆయుధం, బ్రిటిష్ సరకులను వలసలు దిగుమతి చేసుకోరాదనే సామాన్య అంగీకారం. ఫలితంగా, బ్రిటిష్ వర్తకులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. స్టాంప్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందిగా, బ్రిటిష్ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. నాటికి జార్జి గ్రెన్విల్ స్థానంలో మార్క్విస్ ఆఫ్ రాకింగ్‌హామ్ (Marquess of Rockingham) ప్రధాన మంత్రి అయ్యాడు. 1766 మార్చిలో రాకింగ్‌హామ్ ప్రభుత్వం స్టాంపు చట్టాన్ని రద్దు చేసింది. మొలాసస్ మీద

పన్నును ఒక పెన్నీకి తగ్గించింది. ఈ పన్ను బ్రిటీష్ పశ్చిమ ఇండియాదీవుల నుండిగాని, ఇతర విదేశీ దీవుల నుండిగాని, దిగుమతి చేసుకొన్న అన్ని మొలాసస్ మీదా చెల్లించాలి. స్టాంప్ చట్టాన్ని రద్దు చేయటంతో పాటు, పార్లమెంట్ తన ప్రతిష్ఠను కాపాడుకోటానికి, 'డిక్లరేటరీ' చట్టాన్ని ప్రకటించింది. ఈ చట్టం, వలసలకు సంబంధించి చట్టాలు చేయటానికి పార్లమెంట్‌కు గల సార్వభౌమాధికారాన్ని పునరుద్ఘాటించింది. స్టాంప్ చట్టం రద్దైన విజయానందంలో, వలసలు డిక్లరేటరీ చట్టాన్ని గూర్చి పట్టించుకోలేదు. అవి అమితోత్సాహంతో మాతృదేశం యెడల తమ విశ్వాసాన్ని పునరుద్ఘాటించాయి.

వలస ప్రజలు తమ రక్షణ కయ్యే ఖర్చులో మూడో వంతు పన్నుల రూపంలో చెల్లించటానికి ఎందువల్ల నిరాకరిస్తున్నారో, వలసల రక్షణకై బ్రిటన్‌లోని ప్రజలు భారమైన పన్నులు ఎందుకు చెల్లించవలెనో, చాలామంది బ్రిటీష్ పార్లమెంట్ సభ్యులకు అర్థం కాలేదు. వలసల ఆలోచనా సరళిని గూర్చి సరైన అవగాహన బ్రిటన్‌లో లేనందువల్లనే, తర్వాతి విపరీత పరిణామాలు ఏర్పడ్డాయి.

## 9.5 టౌన్‌షెండ్ పన్నులు

ఈ తరుణంలో బ్రిటన్‌లో విజ్ఞతతో కూడిన నాయకత్వం ఉండి ఉంటే, స్టాంప్ చట్టం రద్దు తర్వాత, వలసలు మాతృదేశం యెడల పునరుద్ఘాటించిన విశ్వాసాన్ని సరిగా ఉపయోగించుకొని, వలసల్లో పేరుకొని ఉండిన అసంతృప్తిని తొలగించడానికి, తగిన విధానాలను చేపట్టి ఉండేది. కాని, దురదృష్టం కొద్దీ, రాకింగ్‌హామ్ స్థానంలో విలియం పిట్ ('ఎర్ల్ ఆఫ్ చాథామ్)' ప్రధాన మంత్రి అయ్యాడు. అతడు రోగగ్రస్తుడై, తన మంత్రివర్గాన్ని అదుపులో పెట్టలేక పోయాడు. ఆర్థిక మంత్రి (ఛాన్సలర్ ఆఫ్ ది ఎక్స్‌చెకర్) అయిన చార్లెస్ టౌన్‌షెండ్, నిలకడలేనివాడు. అప్పట్లో పార్లమెంట్ ఇంగ్లాండ్‌లో పన్నులు తగ్గించినందువల్ల, ఆర్థికంగా ఏర్పడ్డ లోటును భర్తీ చేయడానికి, వలసల పై పన్నులు వేయ నిశ్చయించాడు. 1767లో అతడు వలసల్లోని దిగుమతుల మీద కొత్త సుంకాలను విధించాడు. వలసల్లోకి దిగుమతి అయ్యే గ్లాస్, సీసం, రంగులు, కాగితం, తేయాకుల మీద ఈ సుంకాలను విధించాడు. ఈ సుంకాలను ఖచ్చితంగా వసూలు చేయడానికి తగిన నూతన అధికార యంత్రాంగాన్ని ఏర్పరచాడు. ఈ సుంకాలను విధించటంలో, తాను విధించినవి పరోక్ష పన్నులే (Indirect taxes) కాని, ప్రత్యక్ష పన్నులు (Direct taxes) కావని, వలసలు ప్రత్యక్ష పన్నులు విధించటానికి అభ్యంతరం తెలిపాయి కాని, పరోక్ష పన్నులు విధించటానికి కాదని, టౌన్‌షెండ్ వాదించాడు. అంతేగాక, న్యూయార్క్ శాసన సభ, 1765లో ప్రవేశపెట్టిన క్వార్టరింగ్ చట్టం ప్రకారం, ఆవలసలో నిలిపిన సైనికులకు కావాల్సిన నిత్యావసర పదార్థాలు అందచేయటానికి నిరాకరించినందువల్ల, టౌన్‌షెండ్ ఆ శాసన సభను రద్దు చేయించాడు.

టౌన్‌షెండ్ సుంకాలు మూడు సంవత్సరాలు అమల్లో ఉన్నాయి. టౌన్‌షెండ్ వాదనకు బదులుగా, వలసల వాదనను పెన్సిల్వేనియా న్యాయవాది అయిన జాన్ డికిన్‌సన్ మిక్కిలి పటిష్ఠంగా 'Letters From A Farmer' ('లెటర్స్ ఫ్రెం ఎ ఫార్మర్') అనే గ్రంథంలో వ్యక్తం చేశాడు. పార్లమెంట్‌కు వలసల వ్యాపారాన్ని క్రమబద్ధం చేసే అధికారం ఉందని అంగీకరించాడు; కాని దానికి, పన్నులు, అవి ప్రత్యక్షమైనవైనా, పరోక్షమైనవైనా, విధించే అధికారం లేదన్నాడు. బ్రిటన్ నుండి దిగుమతులను చేసుకోరాదని, వలసలు ఒప్పందం చేసుకున్నాయి. అనేక రేవుల నుండి చట్ట విరుద్ధమైన వ్యాపారాన్ని చేస్తున్న వ్యాపారులను, సుంకాధికారుల నుండి "స్వేచ్ఛాపుత్రులు" (Sons of Liberty) రక్షించసాగారు. ఇట్టి సంఘటనలు తరచూ బోస్టన్‌వద్ద జరిగేవి. అక్కడ చట్ట విరుద్ధ వ్యాపారం చేసే

వారిలో అతి సంపన్నుడైన జాన్‌హ్యాన్‌కాక్, శ్యామ్ ఆడమ్స్ నాయకత్వంలో ఉన్న స్వేచ్ఛాపుత్రులతో కలిసి పనిచేస్తుండేవాడు.

## 9.6 బోస్టన్ హత్యాకాండ

దొంగచాటు వ్యాపారాన్ని అరికట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం బోస్టన్‌లో 1768లో రెండు దళాల సైన్యాన్ని నిలిపింది. స్వేచ్ఛాపుత్రులు ప్రజలను, ఈ సైనిక దళాలపై రెచ్చగొట్టారు. 1770 మార్చి 5న మూకలు పెట్టే అల్లరిని సహించలేక, కొందరు సైనికులు ఒక మూకపై తుపాకులు పేల్చారు. మూకలో నలుగురైదుగురు చనిపోయారు. దీన్ని 'బోస్టన్ హత్యాకాండ' (Boston Massacre) గా స్వేచ్ఛా పుత్రులు వలసల్లో ప్రచారం చేశారు. ఈ సంఘటన తర్వాత ఇరు పక్షాలు సంయమనంతో వ్యవహరించిన తీరు మిక్కిలి గమనించదగ్గది. బోస్టన్ గవర్నర్ బోస్టన్ నుండి సైన్యాలను ఉపసంహరించాడు. తుపాకులు ప్రయోగించిన సైనికులపై న్యాయవిచారణ జరిపారు. ఇద్దరికి తప్ప, మిగిలిన అందరికీ తేలిక శిక్షలు విధించారు.

ఇంతలో, మరలా బ్రిటీష్ ప్రభుత్వం వలసల యెడ తన విధానాన్ని సడలించింది. విలియం పిట్ ('ఎర్ల్ ఆఫ్ చాథామ్') స్థానంలో నార్త్ ప్రభువు ప్రధాన మంత్రి అయ్యాడు. బోస్టన్ హత్యాకాండ జరిగిన రోజుననే, అతడు టౌన్‌షెండ్ సుంకాల రద్దును ప్రతిపాదించాడు. పార్లమెంట్‌కు వలసల మీద పన్ను విధించే అధికారానికి సూచనగా, తేయాకు మీద మాత్రం చిన్న సుంకాన్ని అట్లే ఉంచారు. అమెరికన్లు ఈ సుంకాన్ని చెల్లించడానికి కూడా నిరాకరించారు. హాలాండ్ నుండి దొంగచాటుగా దిగుమతి చేసుకొన్న తేయాకునే వాడసాగారు. టౌన్‌షెండ్ సుంకాలకు ప్రతిఘటనగా, బ్రిటన్ నుండి దిగుమతులు చేసుకోరాదని చేసుకొన్న ఒప్పందాన్ని, వలసలు వదిలివేశాయి. స్వేచ్ఛాపుత్రులు (Sons of Liberty) దినదినాభివృద్ధిగా జరుపుతున్న ఆందోళన, వర్తకులకు భీతిని కలిగించింది. అట్టి ఆందోళనలను సాధ్యమైనంతవరకు అరికట్టడానికి వారు ప్రయత్నించారు.

## 9.7 'కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్' (Committees of Correspondence)

టౌన్‌షెండ్ సుంకాలు రద్దైనప్పటికీ, శ్యామ్ ఆడమ్స్ వంటి ప్రజానాయకులు, వలసలకు సంబంధించి, మౌలికమైన సమస్యలేవీ పరిష్కారం కాలేదని భావించారు. ఈ సమయంలో ఏర్పడ్డ శాంతియుత పరిస్థితిని, తర్వాత ఏర్పడవచ్చని భావించిన క్లిష్టపరిస్థితిని ఎదుర్కోటానికి తగిన ఏర్పాట్లను చేసుకోడానికి వారు ఉపయోగించుకొన్నారు. ప్రచారం చేయడంలో శ్యామ్ ఆడమ్స్ ఆరితేరినవాడు. బ్రిటీష్ ప్రభుత్వమూ, మెసాచూసెట్స్ వలసలోని బ్రిటీష్ అధికారులు, ముఖ్యంగా ఆ వలస గవర్నర్‌గా ఉన్న థామస్ హచిన్‌సన్, అమెరికన్ల స్వేచ్ఛలన్నిటినీ హరించడానికి అన్ని రకాల కుట్రలు పన్నుతున్నారని, బోస్టన్ పట్టణ సమావేశాల్లో, అనేక పత్రికల్లో ప్రచురించిన అతని వ్యాసాల్లో శ్యామ్ ఆడమ్స్ ప్రచారం చేశాడు. 1772 లో ఆడమ్స్ బోస్టన్‌లో జరిగిన ఒక సమావేశంలో 'కమిటీ ఆఫ్ కరస్పాండెన్స్' ( Committee of Correspondence)ను స్థాపించాడు. తర్వాత అతడు, అతని సహచరులు మెసాచూసెట్స్ వలసంతటా, కరస్పాండెన్స్ కమిటీలను స్థాపించారు. బ్రిటీష్ ప్రభుత్వం వలసల యెడ జరుపుతున్న అన్యాయాలను గూర్చి పరస్పరం తెలుసుకొని, వాటిని గూర్చి అన్ని వలసల్లో ప్రచారం చేయడమే, ఈ కమిటీల ధ్యేయం. వర్జీనియాలో ప్యాట్రిక్ హెన్రీ, థామస్ జఫర్‌సన్, ఇట్టి కమిటీలను ప్రతి వలసలో స్థాపించాలనే ఉద్యమాన్ని లేవదీశారు. ఈ 'కమిటీ'ల సభ్యులు బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుగా ఆందోళన కొనసాగిస్తారు. అవసరమైతే ఆ ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తారు. ప్రతి

BRAOU

వలసలో అక్కడి నాయకులు ఈ కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్‌ను స్థాపించటంతో, ఇవి వలసలన్నిటికీ కలిసి ఒక యదార్థ రాజకీయ సంస్థగా రూపొందాయి.

## 9.8 బోస్టన్ టీ పార్టీ, 1773

1773లో బ్రిటీష్ ప్రభుత్వం రాజకీయంగా, మిక్కిలి పెద్ద పొరపాటును చేసింది. ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీ (తూర్పు ఇండియా కంపెనీ) ఆర్థిక ఇబ్బందుల్లో ఉండింది. మిక్కిలి పలుకుబడి గల దాని వాటాదారులు బ్రిటీష్ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయాన్ని అర్థించారు. కంపెనీ వద్ద 1,70,00,000 పౌన్ల తేయాకు అమ్ముడు పోకుండా నిలువ ఉండిపోయింది. కంపెనీ దాని ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కడానికిగాను, దాని దగ్గర నిలువ ఉన్న తేయాకును, ఒక చిన్న సుంకాన్ని చెల్లించి, వలసలకు ఎగుమతి చేయడానికి బ్రిటీష్ ప్రభుత్వం అనుమతించింది. దీనివల్ల, అమెరికన్లకు తేయాకు తక్కువ ధరకు లభిస్తుంది. కంపెనీ తన ఆర్థిక కష్టాల నుండి గట్టెక్కుతుంది. కాని, అమెరికన్లకు ఈ ఏర్పాటు నచ్చలేదు. వలసల్లో తేయాకు వ్యాపారాన్నంతా గుత్తాధికారంగా కంపెనీకి అప్పగించడాన్ని వారు ఆమోదించలేదు. దీనివల్ల వలసల్లోని వ్యాపారస్థులు, వారు దొంగచాటు వ్యాపారులైనా, చట్టబద్ధంగా వ్యాపారం చేసేవారైనా, కంపెనీతో పోటీపడి, అది అమ్మే ధరకన్నా తక్కువ ధరకు టీని అమ్మలేరు. ఫలితంగా, మరలా చాలామంది వ్యాపారులు బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించటానికి స్వేచ్ఛాపుత్రులతో చేతులు కలిపారు.

వివిధ వలసల్లోని నాయకులు, ప్రజల మద్దతుతో, తూర్పు ఇండియా కంపెనీ తేయాకు వలసల్లోని రేవుల్లో దిగకుండా ప్రతిఘటించటానికి సిద్ధమయ్యారు. ఈస్టిండియా కంపెనీ తేయాకు నౌకలు ఫిలడెల్ఫియా, న్యూయార్క్ రేవులను చేరినప్పుడు, తేయాకు నౌకల నుండి దిగకుండా ప్రతిఘటించారు. చార్లెస్‌టన్‌లో, దించిన తేయాకునంతా ఒక గిడ్డంగిలో దాచివేశారు. తేయాకుతో బోస్టన్ రేవుకు మూడు నౌకలు చేరాయి. మెసాచూసెట్స్ వలస గవర్నర్ అయిన థామస్ హచిన్‌సన్ నౌకల్లోని తేయాకును రేవులో దించాలని పట్టుబట్టాడు. దాని మీద, శామ్ ఆడమ్స్ ఆదేశాలమీద, కొందరు అమెరికన్లు రెడ్ ఇండియన్ కూలీల వలె మారువేషాలు ధరించి, నౌకల్లో ప్రవేశించి, వాటిలోని తేయాకు నంతా సముద్రంలోకి తోసివేశారు. ఈ సంఘటన అమెరికా సంయుక్తరాష్ట్రాల చరిత్రలో బోస్టన్ టీ పార్టీగా ప్రసిద్ధమైంది. 342 పెట్టెలలోని దాదాపు 25,000 వేల పౌన్ల విలువచేసే తేయాకు నష్టమైంది. ఈ ఆస్తి నష్టాన్ని, మిగిలిన వలసలు తీవ్రంగా ఖండించాయి. కాని, దీని మీద, మెసాచూసెట్స్ వలసను శిక్షించడానికిగాను బ్రిటీష్ ప్రభుత్వాలు తీసుకొన్న తీవ్ర ప్రతీకార చర్యలను గూర్చి వలసలకు తెలిసిన తర్వాత, అవి ఒకటై, బ్రిటన్‌ను ప్రతిఘటించాల్సిన అవసరాన్ని గుర్తించాయి.

## 9.9 దుస్సహ శాసనాలు (శిక్షా శాసనాలు)

బ్రిటీష్ రాజు మూడో జార్జి, అతని ప్రధాన మంత్రి నార్త్ ప్రభువు తమ అధికారాన్ని సవాలు చేసిన అమెరికన్ల చర్యను తీవ్రంగా నిరసించి, వారిమీద కఠిన చర్యలు తీసుకొని వారికి గుణపాఠం నేర్పడానికి నిర్ణయించారు. 1774 మొదట్లో పార్లమెంట్ నాలుగు శిక్షాస్మృతులు లేక శాసనాలను (Coercive Laws) జారీ చేసింది. వీటిని అమెరికన్లు దుస్సహ శాసనాలు (Intolerable Acts) అని పిలిచారు. వీటిలో బోస్టన్ రేవు చట్టం (Boston Port Act, 1774) ద్వారా, తేయాకుకు నష్ట పరిహారం చెల్లించే వరకు బోస్టన్ రేవును మూసివేశారు. మిగిలిన శాసనాల ద్వారా, మెసాచూసెట్స్

వలస చార్టర్‌ను రద్దు చేశారు. గవర్నర్ అనుమతి లేకుండా సమావేశాలను ఏర్పాటు చేయడాన్ని నిషేధించారు. పెద్ద నేరాలు చేసిన వ్యక్తులను మెసాచూసెట్స్‌లో గాక, బ్రిటన్‌లో విచారించి శిక్ష విధించవచ్చు. ఇతోధికంగా, నాలుగు దళాల సైన్యాన్ని బోస్టన్‌కు పంపి, సివిల్ గవర్నర్‌గా ఉన్న హచిన్‌సన్ స్థానంలో, జనరల్ గేజ్ (General Gage) ను మిలిటరీ గవర్నర్‌గా నియమించారు.

## 9.10 క్విబెక్ చట్టం, 1774

దురదృష్టం కొద్దీ, దుస్సహ శాసనాలను జారీచేసిన సమయంలోనే పార్లమెంట్, 1774లో, క్విబెక్ చట్టాన్ని (Quebec Act, 1774) జారీ చేసింది. దీని ప్రకారం, (కెనడా లోని) క్విబెక్ రాష్ట్ర సరిహద్దులను దక్షిణాన ఒహియో నది వరకు పొడిగించారు. ఇట్లా పొడిగించినందువల్ల, ఇంగ్లీష్ వలసల వారికి, ఒహియో నదికి ఉత్తరంగా ఉన్న భూముల మీద ఎటువంటి హక్కు లేకుండా పోయింది. క్విబెక్ రాష్ట్రంలోని ఫ్రెంచి రోమన్ కాథలిక్కులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ మతాన్ని, సంప్రదాయాలను ప్రచారం చేయవచ్చు. అమెరికన్లు ఈ క్విబెక్ చట్టాన్ని అన్నిటి కంటె 'దుస్సహ'మైన చట్టంగా భావించారు. భూములతో వ్యాపారం చేసే వ్యాపారులు (Land Speculators) దీన్ని తమ వ్యాపారానికి భంగకరమని తలచారు. 13 వలసల మొత్తం విస్తీర్ణానికి దాదాపు సరిపోయే ఈ ప్రాంతాన్ని రోమన్ కాథలిక్కుల అధికారం కిందికి తేవడాన్ని, వలసల్లోని ప్రొటెస్టంట్‌లు సహించలేక పోయారు. ఫలితంగా, మెసాచూసెట్స్ బ్రిటన్‌కు ఇచ్చే ప్రతిఘటనను వలసలన్నీ సమర్థించ నిర్ణయించాయి.

## 9.11 మొదటి కాంటినెంటల్ కాంగ్రెస్, 1774

వలస ప్రజల రాజకీయ హక్కులనుగాని, చట్టపరమైన హక్కులనుగాని, బ్రిటీష్ పార్లమెంట్, తన అభీష్టం, లేదా అభిప్రాయం మేరకు, రద్దుచేయవచ్చనే బ్రిటీష్ ప్రభుత్వ దృక్పథాన్ని, దుస్సహ శాసనాలు సుస్పష్టం చేశాయి. వలసల మీద పార్లమెంట్‌కు గల అధికార స్వభావం ఎటువంటిదనే మౌలిక సమస్య, వలసల్లో చర్చనీయాంశమైంది. ఈ సమస్యను సమగ్రంగా చర్చించి తెలుసుకోవటానికి, వర్జీనియా శాసనసభ (Virginia House of Burgesses) వలస ప్రతినిధులందరితో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేయాలని తీర్మానించింది. 'కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్' మిక్కిలి శ్రమపడి, ఈ తీర్మానాన్ని వలసల్లో అంతా ప్రచారం చేశాయి. ఒక్క జార్జియా తప్ప, మిగిలిన వలసలన్నీ ఈ సమావేశానికి ప్రతినిధులను ఎన్నుకొన్నాయి. ఇట్లా ఎన్నికైన 56 మంది ప్రతినిధులు, 1774 సెప్టెంబర్ 5న పెన్సిల్వేనియా వలస రాజధాని అయిన ఫిలడెల్ఫియాలో సమావేశమయ్యారు. ఈ సమావేశాన్ని 'ఫస్ట్ కాంటినెంటల్ కాంగ్రెస్' (First Continental Congress, మొదటి ఖండాంతర కాంగ్రెస్) అని, క్లుప్తంగా కాంగ్రెస్ అని పిలిచారు.

మొదటి కాంటినెంటల్ కాంగ్రెస్ లోని ప్రతినిధులు రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒక వర్గంలో అతివాదులు ఉండేవారు. బ్రిటన్‌తో పోరాటానికి సమయమైందని వీరు భావించారు. మెసాచూసెట్స్ ప్రతినిధుల్లో శ్యామ్ ఆడమ్స్, జాన్ ఆడమ్స్, వర్జీనియా ప్రతినిధుల్లో ప్యాట్రిక్ హెన్రీ, రిచర్డ్ హెన్రీలీ మొదలైనవారు, ఇట్లు భావించిన వర్గంలో ప్రముఖులు. ఈ అతివాదుల్లో చాలామంది అంతకు పూర్వం, వలసల్లో కులీన వర్గాల పాలనను ప్రతిఘటించిన వారు. మరోవర్గం మితవాదులు. వీరిలో పెన్సిల్వేనియాకు చెందిన జాన్ డికిన్‌సన్ మొదలైన వారున్నారు. వీరు బ్రిటన్‌తో ఏదో ఒక విధమైన రాజీ ఏర్పరచుకోవాలని ఆశించినవారు. వీరిలో చాలామంది ధనిక వర్గానికి చెంది, లోగడ

BRAOU

వలస రాజకీయాల్లో మితవాద ధోరణులను బలపరచినారు. ఈ రెండు వర్గాల్లో అతివాద వర్గానికే కొంత మెజారిటీ ఉండింది. కాని, ఐక్యతను దృష్టిలో ఉంచుకొని, వీరు జాగ్రత్తగా వ్యవహరించాల్సి వచ్చింది.

కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశానికి కొంత ముందు, బోస్టన్ నగరం ఉన్న సఫోక్ మండలం (Suffock County) లో జరిగిన ఒక సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. వీటికి సఫోక్ తీర్మానాలని (Suffolk Resolves) పేరు. బ్రిటీష్ పార్లమెంట్ జారీచేసిన శిక్షా శాసనాలను లేక దుస్సహ శాసనాలను అమెరికా ప్రతిఘటించాలని, అవి అమలు కాకుండా చూడాలని, ఈ తీర్మానాలు పేర్కొన్నాయి. కాంటినెంటల్ కాంగ్రెస్ ఈ సఫోక్ తీర్మానాలను ఆమోదించటంతో, అతివాదులకు మొదట విజయం లభించినట్లైంది. కాంగ్రెస్ ఈ తీర్మానాలను ఆమోదించటంతో, బ్రిటన్‌తో సాయుధ ప్రతిఘటనను ఆమోదించినట్లు, మెసాచూసెట్స్ ప్రతినిధివర్గం భావించింది. కాని, సమావేశంలోని సభ్యుల్లో చాలామంది బ్రిటన్‌తో యుద్ధం తప్పనిసరి అని భావించలేదు. బ్రిటన్‌తో వలసలు వ్యాపారం చేయకూడదని మరలా నిషేధించి, దానిపై ఆర్థికంగా దెబ్బతీస్తే, బ్రిటీష్ ప్రభుత్వం తగ్గివస్తుందని వారి అభిప్రాయం. 1774 సెప్టెంబర్ 27న మాతృదేశం (ఇంగ్లాండ్) తో వ్యాపారాన్ని నిషేధిస్తూ చేసిన తీర్మానాన్ని కాంగ్రెస్ ఆమోదించింది. ఇట్టి నిషేధాన్ని వలసల్లోని వ్యాపారులు ఉల్లంఘించకుండా ఉండేటందుకై, భద్రతా - పర్యవేక్షక కమిటీల (Safety and Inspection Committes) ను ప్రతి నగరంలో, మండలం (County) లో ఏర్పాటు చేయాలని ఒప్పందం చేసుకొన్నారు. ఈ ఒప్పందానికి 'కాంటినెంటల్ అసోసియేషన్' (Continental Association) అని పేరు. కాంగ్రెస్ మితవాదులను సంతృప్తి పరచటానికై, ఒక హక్కుల దోషారోపణల ప్రకటన (Declaration of Rights and Grievances)ను రూపొందించి, బ్రిటీష్ రాజుకు ఒక వినతి పత్రాన్ని పంపింది. ఈ పత్రాల్లో వ్యాపారాన్ని నియమబద్ధం చేయటానికి పార్లమెంట్‌కు కల హక్కును ఒప్పుకోవడం జరిగింది. మితవాదులు కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన ఒక రాజీ తీర్మానం ఒక్క ఓటు తేడాతో వీగిపోయింది. ఈ రాజీ తీర్మానాన్ని, 'జోసెఫ్ గ్యాలోవే సమాఖ్య ప్రణాళిక' ('Joseph Galloway's Plan of Union') అని పిలిచారు. ఈ ప్రణాళిక ప్రకారం ఒక ఖండాంతర ప్రభుత్వాన్ని ఏర్పరచాలి. బ్రిటీష్ రాజు నియమించిన ఒక ప్రెసిడెంట్ జనరల్‌తో, వలసల శాసన సభలు పంపిన ప్రతినిధులతో కూడిన ఒక గ్రాండ్ కౌన్సిల్, ఈ ప్రభుత్వాన్ని నిర్వహిస్తుంది. వలసల మీద అధికారాన్ని, గ్రాండ్ కౌన్సిల్, పార్లమెంట్‌ల మధ్య, విభజిస్తారు.

వలసలకు గల స్వయంపరిపాలనా ప్రతిపత్తిని గూర్చి బెంజమిన్ ఫ్రాంక్లిన్ క్రితంలో ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం, మాతృదేశంలో వలసలకు గల సంబంధం, బ్రిటీష్ రాజరికం పట్ల వలసలు తమ విశ్వాసాన్ని ప్రకటించడానికి మాత్రం పరిమితమై ఉండాలి. మిగిలిన అన్నివిషయాల్లో వలసలకు సంపూర్ణమైన స్వయంపరిపాలనా హక్కులు ఉండాలి. ఇటువంటి సిద్ధాంతాన్నే ప్రతిపాదిస్తూ, 1774, 1775 లో పెన్సిల్వేనియాకు చెందిన జేమ్స్ విల్సన్, వర్జీనియాకు చెందిన థామస్ జెఫర్‌సన్, మెసాచూసెట్స్‌కు చెందిన జాన్ ఆడమ్స్, కరపత్రాలను ప్రచురించారు. ఈ సిద్ధాంతాల, వాదనలచేత ప్రభావితమై, కాంగ్రెస్ సమావేశం చివరి దశలో, వలసలకు గల స్వయం పాలనాధికార ప్రతిపత్తిని గూర్చి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

వలసల అధికార స్వయంపరిపాలనా ప్రతిపత్తిని గూర్చిన ఈ నూతన దృక్పథాన్ని, బ్రిటన్‌లో మూడో జార్జి రాజు కాని, పలుకుబడి గలిగిన యే రాజకీయ నాయకుడుకాని ఆమోదించే అవకాశం ఎంతమాత్రం లేదు. వలసల ఆందోళన పట్ల కొంత సానుభూతిగల ఎడ్మండ్ బర్క్, ఛాథామ్ వంటి రాజకీయ నాయకులకు కూడా, పార్లమెంట్ అధికార సార్వభౌమత్వంలో నమ్మకం ఉండేది.

మూడో జార్జి రాజు కూడా, ఈ విషయంలో వలసలకు ఎట్టి అవకాశం ఇవ్వగూడదని, నిర్ణయించాడు. రాజీలకు సమయం మించి పోయిందనీ, వలసల విషయంలో, 'ఓటమో, విజయమో' తేల్చుకోవాలనీ, ప్రకటించాడు. 1775 మొదట్లో లార్డ్ నార్త్ ఒక ప్రతిపాదన చేశాడు. ఏ వలసకాని సామ్రాజ్య రక్షణకై బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని చెల్లిస్తే, ఆ వలస మీద పార్లమెంట్ పన్నులు విధించదు. కాని ఇందులో, వలసలకు ఇచ్చిన రాయితీ ఏమీలేదు.

## 9.12 లెక్సింగ్‌టన్, కంకార్డ్ : అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రారంభం; 1775 ఏప్రిల్, 19

దుస్సహ శాసనాలను ప్రతిఘటించటంలో తమకు ఇతర వలసల సంపూర్ణమైన మద్దతు ఉంటుం దనే గట్టి విశ్వాసంతో, మెసాచూసెట్స్ ప్రతినిధులు కాంటినెంటల్ కాంగ్రెస్ నుండి తిరిగివచ్చారు. కాని, తర్వాత అతి కొద్ది కాలంలోనే, వలసలకు, బ్రిటన్‌కు మధ్య యుద్ధ పరిస్థితి ఏర్పడుతుందని ఎవ్వరూ ఊహించలేదు. మిలిటరీ గవర్నర్‌జనరల్ గేజ్, అతని సైన్యం బోస్టన్‌ను ఆక్రమించిన సమయంలోనే, మెసాచూసెట్స్ శాసన సభ తనను రాష్ట్ర కాంగ్రెస్‌గా ప్రకటించుకొంది. కార్యనిర్వాహక అధికారాన్ని వహించటానికి, ప్రతిఘటనా చర్యలు తీసుకోటానికి, జాన్ హ్యాన్‌కాక్ (John Hancock) అధ్యక్షుడుగా ఒక భద్రతా కమిటీని నియోగించింది. మొదట్లో గేజ్ బోస్టన్ పట్టణాన్ని మాత్రం వశం చేసుకున్నాడు. ఎట్టి జాప్యం చేయకుండా వలసల్లో తిరుగుబాటును అణచటానికి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందని, బ్రిటీష్ ప్రభుత్వం గేజ్‌కు ఆదేశాలు పంపింది. ఈ ఆదేశం గేజ్‌కు, ఏప్రిల్ 14, 1775 న అందింది. బెంజమన్ ఫ్రాంక్లిన్ మాటల్లో, ఐదు రోజుల తర్వాత ఏప్రిల్ 19న, గేజ్, "కత్తిదూసి యుద్ధాన్ని ప్రారంభించాడు". ("drew the sword and began the war"). ఈ లోపల, బోస్టన్ పరిసర గ్రామీణ ప్రాంతంలో ప్రజలు యుద్ధానికి ఆయత్తమై, తుపాకులను, మందుగుండు సామాగ్రిని సమకూర్చుకొని, ఒక్క నిమిషంలో యుద్ధానికి రాగలిగిన "నిమిష వీరులు" ("Minute men") గా శిక్షణ పొంది ఉన్నారు. సాయుధ సంఘర్షణ తక్షణమే జరగగలదని స్పష్టమైంది.

1775 ఏప్రిల్ 19 ఉదయం సంఘర్షణ ప్రారంభమైంది. బోస్టన్‌కు 30 కి.మీ. దూరంలో కంకార్డ్ వద్ద గల మందుగుండు పాతరను ధ్వంసం చేయాలనీ, వీలైతే హ్యాన్‌కాక్‌ను, శామ్యూల్ ఆడమ్స్‌ను బంధించాలనీ ఆదేశించి, ఏప్రిల్ 18 రాత్రి జనరల్ గేజ్ బోస్టన్ నుండి ఒక సైనిక దళాన్ని పంపించాడు. బోస్టన్ నగరంలోని స్వేచ్ఛాపుత్రుల్లో విల్‌డాన్, పాల్‌రెవర్స్ అనే ఇద్దరు, ఆ రాత్రంతా అశ్వారూఢులై పయనించి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను జనరల్ గేజ్ పంపుతున్న సైనికదళాన్ని గూర్చి హెచ్చరించారు. బ్రిటీష్ సైన్యం బోస్టన్, కంకార్డ్‌ల మధ్య ఉన్న లెక్సింగ్‌టన్‌కు చేరే సమయానికి, "నిమిష వీరులు" (ప్రజా సైన్యం) అక్కడ వారిని ఎదుర్కోటానికి కాచుకొన్నారు. రెండు దళాల మధ్య పోరాటం జరిగింది. నిమిష వీరుల్లో 8 మంది మరణించారు. పదిమంది గాయపడ్డారు. అమెరిన్ కవి ఎమర్సన్ (Emerson) మాటల్లో, 'Here was fired the shot heard round the world'. బ్రిటీష్ సైనిక దళం లెక్సింగ్‌టన్ వద్ద నిమిష వీరులను ఓడించి, కంకార్డ్ చేరుకొని, అక్కడి మందుగుండు సామాగ్రిని ధ్వంసం చేయగలిగింది. కాని, బ్రిటీష్ సైనిక దళం బోస్టన్‌కు వెనుదిరిగిపోతున్నప్పుడు, ప్రజా సైన్యం (నిమిష వీరులు) మాటున ఉండి, బ్రిటీష్ సైనిక దళం పై తుపాకులను ప్రయోగించారు. బ్రిటీష్ సైనిక దళంలో 200 మందికి పైగా మరణించారు. ఈ సంఘటనల తర్వాత, న్యూ ఇంగ్లాండ్ వలసలన్నిటినుండి సుమారు రెండు వేల మంది, బోస్టన్ సమీపంలోని కేంబ్రిడ్జ్ వద్ద చేరారు. బ్రిటీష్ వారు బోస్టన్‌లో చిక్కుకొనిపోయారు. 1775 ఏప్రిల్ 19న అమెరికా స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైంది.

## 9.13 రెండో కాంటినెంటల్ కాంగ్రెస్, 1775

లెక్సింగ్‌టన్, కంకార్డ్ సంఘటనల తర్వాత, 1775 మే నెల్లో రెండో కాంటినెంటల్ కాంగ్రెస్ (Second Continental Congress) ఫిలడెల్ఫియాలో సమావేశమైంది. దీనిలో, మొదటి కాంగ్రెస్‌లో కన్నా ఎక్కువ మంది అతివాదులున్నారు. బెంజమన్ ఫ్రాంక్లిన్, థామస్ జెఫర్‌సన్ ఈ సమావేశానికి హాజరైనారు. మెసాచూసెట్స్ కు పూర్తి సహాయం అందచేయటానికి, యుద్ధ ప్రయత్నాలను నిర్దేశించటానికి, కేంద్ర ప్రభుత్వ బాధ్యతలు వహించటానికి కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇస్తూ, ప్రతినిధులు ఏకగ్రీవంగా ఓటు చేశారు. న్యూఇంగ్లాండ్ ప్రజా సైన్యాన్ని (Militia) ఖండాంతర (వలసల, Continental) సైనిక దళంగా రూపొందించారు. 1775 జూన్ 15న జాన్ ఆడమ్స్ సూచనల మీద, దక్షిణ రాష్ట్రాలను యుద్ధ ప్రయత్నంలో కూడగట్టుకొనిరావాలనే ఉద్దేశంతో, వర్జీనియాకు చెందిన జార్జి వాషింగ్టన్‌ను వలస సైన్యానికి సర్వసైన్యాధిపతిగా కాంగ్రెస్ నియమించింది.

ఇటువంటి తరుణంలో కూడా, అమెరికన్లలో చాలాకొద్ది మంది మాత్రమే స్వాతంత్ర్యం వైపు మొగ్గు చూపారు. కాని, యుద్ధం ప్రారంభమైన తర్వాత, వలసల్లో బ్రిటీష్ అధికారం త్వరగా అంతర్హితం కాసాగింది. బ్రిటీష్ గవర్నర్లను తొలగదోసి, వివిధ వలసల్లోని శాసన సభలు రాష్ట్ర కాంగ్రెస్సులుగా మారి, అధికారాలను వహించాయి. కార్యనిర్వాహక అధికారాన్ని వహించటానికి భద్రతా కమిటీల (Committes of Safety) ను నియమించాయి. ఈ భద్రతా కమిటీలు, రాష్ట్ర కాంగ్రెస్సుల ఆదేశాలను, మొదటి కాంటినెంటల్ కాంగ్రెస్ ఏర్పరచిన పట్టణ, స్థానిక కమిటీలు, మండల (County) కమిటీలు అమలుపరచాయి. ఈ విధంగా పదమూడు వలసల్లో నూతన విప్లవ ప్రభుత్వం ఏర్పడింది.

## 9.14 'కామన్‌సెన్స్' (COMMON SENSE)

రెండో కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశమైన తర్వాత రెండు నెలలలోగా, బ్రిటన్‌తో సాయుధ పోరాటం జరపడానికిగల కారణాలను వివరిస్తూ, ఒక ప్రకటనను రూపొందించి, 1775, జూలై, 6న ఆమోదించింది. కారణాలను వివరిస్తూ ఈ ప్రకటన, నాటికి కూడా బ్రిటన్‌తో కలసి ఉండాలనే వలసల ఆకాంక్షను వెలిబుచ్చింది. కాని, యుద్ధం ముందుకు సాగిన కొద్దీ, బ్రిటీష్ ప్రభుత్వ అధికారుల ప్రవర్తనను బట్టి, వారినుండి వలసలకు గల హక్కులకు సంబంధించి ఎట్టి రాయితీలను పొందలేమని స్పష్టం కావడంతో, వలసల్లో సంపూర్ణ స్వాతంత్ర్య భావానికి బలం చేకూరసాగింది. ఈ భావానికి 1776 జనవరిలో టామ్ పెయిన్ ప్రచురించిన ('Common Sense') ('కామన్‌సెన్స్') అనే ప్రచార పత్రం ఎనలేని బలాన్ని చేకూర్చింది. స్పష్టమైన, పటిష్టమైన భాషలో, వలసలు బ్రిటీష్ వారికన్నా సమర్థవంతగా తమను తాము పరిపాలించుకోగలవని, టామ్ పెయిన్ నొక్కి వక్కాణించాడు. స్వాతంత్ర్యంలో వారు ఒక నూతన సమాజాన్ని రూపొందించటానికి ఒక మహోన్నత అవకాశం ఏర్పడుతుందని, ఆసమాజంలో ఐరోపా దేశాల్లోని నిరంకుశత్వం, దోపిడి ఉండవని, పెయిన్ 'కామన్ సెన్స్' లో ఉద్ఘాటించాడు. పెయిన్ రచనకు 'కామన్ సెన్స్' (సామాన్య లోకజ్ఞానం) అనే పేరు మిక్కిలి సార్థకమైంది. ఈ ప్రచార పత్రం లక్షల సంఖ్యలో అమ్ముడుపోయింది. వలసల్లో చదువనేర్చిన ప్రతిపౌరుడు దాన్ని చదివి, దాని చేత ప్రభావితుడయ్యాడు.

## 9.15 సంగ్రహంగా

1. సప్తవర్ష సంగ్రామం తర్వాత, వలస ప్రజల రాజకీయ, సాంఘిక, ఆర్థిక హక్కులకు సంబంధించి, వలస ప్రజల, బ్రిటీష్ ప్రభుత్వ దృక్పథాల్లో వచ్చిన మార్పులు, స్వాతంత్ర్య పోరాటానికి మూల కారణాలైనాయి. వలస ప్రజల్లోని అన్ని వర్గాలవారి ఆలోచనా విధానంలో మార్పు ఏర్పడింది. వారి హక్కులపై బ్రిటీష్ ప్రభుత్వం విధించిన వివిధ ఆంక్షలను నిరసించి, ప్రతిఘటించి, స్వాతంత్ర్య పోరాటానికి కృషిచేశారు.

2. బ్రిటీష్ ప్రభుత్వం, వలసల వ్యాపారానికి సంబంధించి, మర్కంటైల్ సిద్ధాంతాన్ని అనుసరించింది. ఈ సిద్ధాంతం ప్రకారం, వలసలు ఉండేది ప్రధానంగా మాతృదేశ (బ్రిటన్) సౌభాగ్యం కోసం. ఈ సిద్ధాంతానికి అనుగుణంగా, సప్తవర్ష సంగ్రామం తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం వలసలకు సంబంధించి, అనేక చట్టాలను చేసింది. ఈ చట్టాలను వలస ప్రజలు ప్రతిఘటించారు.

3. 1760లో ఇంగ్లాండ్ రాజైన మూడో జార్జి విధానాల ఫలితంగా, బ్రిటన్‌లో ప్రభుత్వాలు తరచూ మారడం జరిగింది. ఫలితంగా, ఏ ప్రభుత్వంకాని వలసల ఎడ, ఒక సక్రమమైన, నిలకడైన విధానాన్ని రూపొందించడం కాని, అనుసరించడం కాని, జరగలేదు. మూడో జార్జి రాజు కాలంలో అధికారంలో ఉన్న బ్రిటీష్ ప్రభుత్వాలు, స్టాంప్ చట్టం ద్వారా విధించిన స్టాంప్ డ్యూటీ మొదలైన ప్రత్యక్ష పన్నులను, అట్లే టౌన్‌షెండ్ విధించిన పరోక్ష పన్నులను, వలస ప్రజలు నిరసించి, ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనల పర్యవసానంగా వచ్చిన బోస్టన్ హత్యాకాండ, బోస్టన్ టీ పార్టీ వంటి సంఘటనలు, థామస్ పెయిన్ రచించిన 'కామన్‌సెన్స్' చేసిన ప్రబోధం, స్వాతంత్ర్య పోరాటానికి దారితీశాయి.

BRAOU

## 9.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి దారితీసిన కారణాలను సమీక్షించండి.

2. అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి మూడో జార్జి విధానాలు ఎంతవరకు బాధ్యత వహిస్తాయో చర్చించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. సప్తవర్ష సంగ్రామం తర్వాత వలసల వైఖరిలో ఎటువంటి మార్పు వచ్చింది?

2. మొదటి కాంటినెంటల్ కాంగ్రెస్ కార్యకలాపాలను విశ్లేషించండి.

## 9.17 ఉపయుక్త గ్రంథాలు


Adams R. G. : **The Political Ideas of the American Revolution, 1992**

Alder J. R. : **The American Revolution, 1953**

Gipsen C. H. : **The Coming of the Revolution, 1763-1775, 1954.**

Green Everts : **Revolutionary Generation, 1763-1790, 1943.**

Miller, John C : **Origins of the American Revolution, 1943.**

Miller, John C : **Triumph of Freedom, 1775-1783, 1949.**

Shy, John : **The American Revolution, 1973**

Van Tyne C. H : **American Revolution, 1776-1783, 1905**

Van Tyne C. H. : **The Causes of the War of Independence, 1922.**


BRAOU

# భాగం-10 : అమెరికా స్వాతంత్ర్య ప్రకటన : ఫలితాలు

విషయక్రమం


10.0 లక్ష్యాలు

10.1 స్వాతంత్ర్య ప్రకటనా ప్రతిపాదన : ఆమోదం

10.2 స్వాతంత్ర్య ప్రకటనలోని ప్రధానాంశాలు : ప్రాముఖ్యం

10.3 యుద్ధ గమనం

10.3.1 దేశభక్తులు : రాజభక్తులు

10.3.2 యుద్ధ స్వభావం : బలాబలాలు

10.3.3 జార్జి వాషింగ్టన్ సైన్యాధిపత్యం : ఇతర సేనా నాయకులు

10.3.4 ఫ్రాన్స్, తదితర దేశాల సహాయసహకారాలు

10.3.5 యుద్ధ ముఖ్య ఘట్టాలు : సారటోగా, యార్క్‌టౌన్

10.3.6 శాంతి సంప్రదింపులు : ప్రాథమిక సంధి (1782); పారిస్ సంధి (1783)

10.4 విప్లవకాల సంస్కరణలు

10.5 సంగ్రహంగా

10.6 పరీక్షా నమూనా ప్రశ్నలు

10.7 ఉపయుక్త గ్రంథాలు


## 10.0 లక్ష్యాలు

ఈ భాగ అధ్యయనం ద్వారా, ఈ క్రింది విషయాలను గూర్చి తెలుసుకోగలుగుతాం.

- 1776 జూన్‌లో, రెండో ఖండాంతర కాంగ్రెస్‌లో, వర్జీనియా ప్రతినిధి రిచర్డ్ హెన్రీలీ, స్వాతంత్ర్య ప్రతిపాదనను ప్రవేశపెట్టాడు. థామస్ జఫర్‌సన్ అధ్యక్షుడుగా ఉన్న అయిదుగురు సభ్యుల కమిటీ స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించింది.

- స్వాతంత్ర్య ప్రకటన ప్రధాన రచయిత జఫర్‌సన్. అమెరికన్లు విశ్వసించిన రాజకీయ భావాలను జఫర్‌సన్ స్వాతంత్ర్య ప్రకటనలో చక్కగా రూపొందించాడు. ప్రాణ రక్షణ, స్వేచ్ఛ, సుఖాన్వేషణ (Life, Liberty and the pursuit of happiness) అనే సహజ హక్కుల సంరక్షణకై, ప్రజలు ప్రభుత్వాలను ఏర్పరచుకొంటారని, ఉద్ఘాటించాడు. 1776 జూలై 4న, కాంగ్రెస్ స్వాతంత్ర్య ప్రకటనను ఆమోదించింది.



B R A O U

• యుద్ధ గమనంలోని వివిధ దశలు, 1783 పారిస్ సంధితో యుద్ధ సమాప్తి, యుద్ధ ఫలితాలు.

## 10.1 స్వాతంత్ర్య ప్రకటనా ప్రతిపాదన : ఆమోదం

1775 చివరక్కూడా వలసల్లో అయిదింటి రాష్ట్ర కాంగ్రెస్సులు స్వాతంత్ర్యాన్ని ఆమోదించలేదు. మధ్య వలసల్లోని ప్రముఖ వర్గాలు స్వాతంత్ర్యాన్ని చివరి వరకు ప్రతిఘటించాయి. 1776 జనవరిలో కూడా, అంటే స్వాతంత్ర్య ప్రకటనకు అయిదు నెలల ముందు కూడా, తమ భోజనాగారంలో బ్రిటీష్ రాజు ఆరోగ్యాన్ని కోరుతూ, ద్రాక్షాసవం సేవించారు. కాని, 1776 మే నెల్లో, కాంటినెంటల్ కాంగ్రెస్, స్వతంత్ర ప్రభుత్వాలను చట్టపరంగా స్థాపించమని వలసలకు సలహా ఇచ్చింది. 1776 జూన్‌లో, అంటే, రెండో కాంగ్రెస్ సమావేశమై ఒక సంవత్సరం గడచిన తర్వాత, వర్జీనియా ప్రతినిధైన రిచర్డ్ హెన్రీ లీ, అతని రాష్ట్రం ఇచ్చిన ఆదేశాల మేరకు, "These united colonies are, and of right, ought to be, free and independent States" ('ఈ ఐక్య వలసలు సాధికారికంగా స్వతంత్ర రాజ్యాలుగా ఉంటాయి') అని ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. వలసలు సమ్మేళనగా రూపొందాలనీ, విదేశాలతో మైత్రిని కూడా ఏర్పరచుకోవాలనీ, మరి రెండు తీర్మానాలను కూడా ప్రవేశపెట్టాడు. కాంగ్రెస్, హెన్రీ లీ ప్రవేశపెట్టిన స్వాతంత్ర్య ప్రతిపాదనను చర్చించసాగింది. ఈ స్వాతంత్ర్య ప్రతిపాదనకు బలమైన వాదం, స్వాతంత్ర్యం ప్రకటిస్తే, బ్రిటన్‌తో పోరాడటానికి ఫ్రాన్స్ నుండి సహాయం పొందడం సులభమవుతుందనే వాదం. స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించటానికి, థామస్ జెఫర్‌సన్ అధ్యక్షుడుగా, జాన్ ఆడమ్స్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, రోజర్ షెర్మాన్, రాబర్ట్ ఆర్. లివింగ్‌స్టన్ సభ్యులుగా, అయిదు మందితో కూడిన ఒక కమిటీని నియమించారు. స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించినవాడు, దాని ప్రధాన రచయిత జెఫర్సన్. 1776 జూలై 2న, ఒక్క న్యూయార్క్ వలస తప్ప, మిగిలిన వలసలన్నీ రిచర్డ్ తీర్మానాన్ని ఆమోదించాయి. 1776 జూలై 4న, కాంగ్రెస్, జఫర్‌సన్ రూపొందించిన స్వాతంత్ర్య ప్రకటనను (Declaration of Independence) ఆమోదించి, ఆచరణలో పెట్టింది.

## 10.2 స్వాతంత్ర్య ప్రకటన లోని ప్రధానాంశాలు : ప్రాముఖ్యం

అమెరికన్లు విశ్వసించిన రాజకీయ భావాలను జఫర్‌సన్ స్వాతంత్ర్య ప్రకటనలో చక్కగా ప్రతిబింబించాడు. ఉదాత్తమూ, సౌలభ్యమూ అయిన పదజాలంతో స్వాతంత్ర్య ప్రకటన, 18వ శతాబ్దం లోని ఎన్‌లైటెన్‌మెంట్ (Enlightenment) తత్వవేత్తల హేతువాద సిద్ధాంతపరమైన రాజనీతి భావాలకు చక్కని రూపకల్పన నిచ్చింది. మానవులకు సృష్టికర్త కొన్ని అనన్యసంక్రమిత (Inalienable) హక్కులను ప్రసాదించాడు. అవి ప్రాణ రక్షణ, స్వేచ్ఛ, సుఖాన్వేషణ (Life, Liberty And Pursuit Of Happiness). ఈ హక్కుల రక్షణకై ప్రజలు ప్రభుత్వాలను ఏర్పరచుకొంటారు. ఏ ప్రభుత్వం కాని ఈ హక్కులను రక్షించలేనప్పుడు, ప్రజలకు ఆ ప్రభుత్వాన్ని తొలగించి, దాని స్థానంలో ఈ హక్కులను సమర్థవంతంగా రక్షించగల మరొక ప్రభుత్వాన్ని ఎన్నుకొనే హక్కు ఉంది. అమెరికా స్వాతంత్ర్య ప్రకటన లోని ఈ ప్రధాన భావాలు చాలవరకు జాన్‌లాక్ (John Locke) రచించిన 'సెకెండ్ ట్రీటైజ్ ఆన్ గవర్నమెంట్' (Second Treatise On Government) నుండి గ్రహించారు. 1688 ఇంగ్లీష్ విప్లవం సంభవించిన తర్వాత, దాన్ని సమర్థించటానికి ('ex post facto justification') లాక్ తన గ్రంథాన్ని రచించినట్లే, స్వాతంత్ర్య ప్రకటన (The Declaration of Independence) రూపుదిద్దుకొందని, చరిత్రకారుడు R.B. పెర్రీ (R. B. PERRY, 'Puritanism and Democracy') భావించాడు.

BRAOU

జాన్‌లాక్ పేర్కొన్న సహజ హక్కుల్లో, జెఫర్‌సన్ ఒక మౌలికమైన మార్పు చేశాడు. ప్రాణ రక్షణ, స్వేచ్ఛ, ఆస్తి, సహజ హక్కులని జాన్‌లాక్ పేర్కొన్నాడు. జెఫర్‌సన్ ఆస్తి (Property) స్థానంలో ఆనందాన్వేషణ (Pursuit of Happiness) ను పేర్కొని, విప్లవాన్ని అట్టి అన్వేషణకై చేస్తున్న పోరాటంగా సమర్థించాడు. స్వాతంత్ర్య ప్రకటనలో గమనించాల్సిన మరో విశేషం, అది వలసల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను పేర్కొంటూ, బ్రిటీష్ రాజైన మూడో జార్జిని మాత్రం పేర్కొంది. పార్లమెంట్ పేరే ఎత్తలేదు. కాంటినెంటల్ కాంగ్రెస్ అభిప్రాయంలో, పార్లమెంట్‌కు ఎన్నడు కాని, వలసలపైన చట్టబద్ధమైన అధికారం లేదు. వలసలు బ్రిటీష్ రాజరికం పట్ల ప్రకటించిన విశ్వాసమొక్కటే వలసలకు, గ్రేట్ బ్రిటన్‌కు మధ్యగల చట్టబద్ధమైన సంబంధం.

ఈ విధంగా 1776 జూలై 4న, మూడో జార్జి రాజు వలసల పట్ల చేసిన నేరాలన్నిటినీ ఏకరవుపెట్టి, "సమైక్యమైన ఈ వలసలన్నీ, సాధికారికంగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన రాజ్యాలు" ('These united colonies are, and of right, ought to be free and independent States') అని, 'స్వాతంత్ర్య ప్రకటన' సర్వ ప్రపంచానికి చాటడంతో, అమెరికా సంయుక్త రాష్ట్రాలనే నూతన రాజ్యం రూపొందింది. ఈ నూతన రాజ్యం మానవ హక్కుల్లో తన విశ్వాసాన్ని ప్రకటించింది. స్వాతంత్ర్య ప్రకటన సృష్టిలో మానవులందరూ సమానులని చెప్పి, ప్రజల అంగీకారం మీదనే ప్రభుత్వాలకు అధికారాలు ఏర్పడతాయని, ప్రజాస్వామ్య మౌలిక సిద్ధాంతాన్ని ఉద్ఘాటించింది. సాంప్రదాయ సాంఘిక అసమానతలను, నిరంకుశ ప్రభుత్వాధికారాన్ని, నిరసించింది. ఒక్క అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రే కాక, మానవ చరిత్ర అంతా కూడా, స్వాతంత్ర్య ప్రకటనలోని ఈ ఆశయాలను ఆచరణయోగ్యమైన యదార్థాలుగా చేయటానికి జరిగే నిరంతర పోరాటమే.

## 10.3 యుద్ధ గమనం

స్వాతంత్ర్య ప్రకటనా కాలం (1776 జూలై 4) నాటికే వలస సైన్యాల, బ్రిటీష్ సైన్యాల మధ్య, కొన్ని యుద్ధాలు జరిగాయి. కాని, మనం ఈ యుద్ధ గమనాన్ని క్లుప్తంగా సమీక్షించేదానికి ముందు, అమెరికా సంయుక్తరాష్ట్రాల్లోని వివిధ వర్గాల ప్రజలకు యుద్ధం పట్లగల ఆసక్తిని, అభిప్రాయాలను సమీక్షించడం అవసరం.

### 10.3.1 దేశ భక్తులు : రాజభక్తులు

యుద్ధం ప్రారంభమైన తర్వాత వలసల్లోని ప్రతివ్యక్తి తను అమెరికా దేశభక్తుడో (Patriot), బ్రిటీష్ రాజభక్తుడో (Loyalist) ప్రకటించాల్సిన అగత్యమేర్పడింది. కాని, ప్రజల్లో చాలామందికి తాము ఏ పక్షం వహించాలో తేల్చుకోవటం, సులభమైన పని కాదు. సాధారణంగా ఉత్తరాదిలో కర్షకులతో, కార్మికులతో కూడిన ప్రజాస్వామ్య సంఘాలు, బ్రిటీష్ ప్రభుత్వ వ్యాపార విధానాన్ని (Mercantilist Policy) నిరసించిన ఉత్తరాది వ్యాపారులు, దక్షిణాది భూకామందులు, అమెరికన్ విప్లవాన్ని సమర్థించారు. కాని, ఉత్తరాదిలో కులీన వర్గాలకు చెందిన పౌరులు విప్లవ కమిటీల పాలన కన్నా, మూడో జార్జి రాజు పాలన మేలని భావించారు. మధ్య వలసల్లో ధనికులైన వ్యవసాయదారులకు బ్రిటీష్ పరిపాలనను తోసిరాజనడానికి కారణం కనిపించలేదు. కాని, దక్షిణాదిలో భూకామందులు, దేశభక్తులైన కారణంచేత, వారికి ప్రతిగా పడమట భూముల్లోని రైతులు తాము రాజభక్తులమని ప్రకటించుకొన్నారు. అందువల్ల, వలసల ప్రజల్లో దేశభక్తులు, రాజభక్తులు అనే విభజన, వర్గపరంగా జరగలేదు. కాని, మొత్తంమీద దేశభక్తులు ప్రజాస్వామ్యాన్ని అభిమానించగా, రాజభక్తులు కులీన వర్గపాలనను అభిమానించారు.

ప్రజల్లో ఎంతమంది రాజభక్తి వైపు మొగ్గారో ఖచ్చితంగా చెప్పలేం కాని, దాదాపు మూడో వంతు ప్రజలు రాజభక్తి వైపు మొగ్గు చూపారని చెప్పవచ్చు. 70 లేదా 80 వేల మంది గాఢమైన రాజభక్తి కలవారు. వీరు స్వాతంత్ర్య సమరం ముగిసిన తర్వాత, కెనడాకు వలసపోయారు. కాని, వీరు దేశభక్తుల లాగా యుద్ధ సమయంలో చురుకైన పాత్ర వహించక, శక్తిసామర్థ్యాలు, చొరవ, లోపించడంతో, తటస్థంగా ఉండిపోయారు.

రాజభక్తులు, ముఖ్యంగా మధ్య వలసల్లో ఎటువంటి హింసకు గురికాలేదు. కాని, యుద్ధం మొదలైన తర్వాత, విప్లవ కమిటీలు, గాఢ రాజభక్తుల మీద చర్య తీసుకోక తప్పలేదు. కొన్ని సమయాల్లో వారిని ఖైదుచేశారు; లేదా, మూకలను వారిపై రెచ్చగొట్టారు. యుద్ధం ప్రారంభమై కొంత కాలం సాగిన తర్వాత, రాజభక్తుల్లో కొందరు బ్రిటీష్ సైన్యాధిపతులకు వార్తలు అందచేస్తున్నారని అనుమానించారు. అటువంటి వారి రాజకీయ హక్కులను శాసన సభలు రద్దుచేయడం, వారి ఆస్తులను జప్తుచేయడం జరిగింది. రాజభక్తులమీద ఇటువంటి కఠినమైన చర్యలు తీసుకోడం అవసరమని, దేశభక్తులు భావించారు. అయితే, తర్వాత వచ్చిన ఫ్రెంచి, రష్యన్ విప్లవాల్లో లాగే, అమెరికన్ విప్లవంలో 'తీవ్రవాద పరిపాలన' (Terrorist rule) ఏర్పడలేదు. చాలా కొద్దిమంది రాజభక్తులను ఉరిదీశారు. కాని, ఎవ్వరినీ సరైన కారణం లేకుండా ఉరితీయలేదు.

## 10.3.2 యుద్ధ స్వభావం : బలాబలాలు

అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం ఏడేండ్లు (1776-1782) కొనసాగింది. యదార్థానికి, 1775 ఏప్రిల్ 19న లెక్సింగ్‌టన్, కంకార్డ్ సంఘటనలతో ప్రారంభమైన ఈ పోరాటం, 1782 ప్యారిస్ సంధితో ముగిసింది. ఈ యుద్ధం ఇంత సుదీర్ఘకాలం జరగడానికి ఒక ముఖ్య కారణం, 1781 వరకు ఏ పక్షం కాని, ఎదుటి పక్షంపై నిశ్చయమైన గెలుపు సాధించటానికి తగినంత సైనిక బలాన్ని చేకూర్చుకోలేక పోవటమే. ఇరు పక్షాల మధ్య జరిగిన యుద్ధాల్లో, బ్రిటన్ చాలా వాటిలో గెలుపు సాధించినప్పటికీ, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అతి కొద్ది ప్రాంతాన్ని మాత్రమే ఆక్రమించగలిగింది. అల్లే, జార్జి వాషింగ్టన్ సైన్యాన్ని కూడా అంతం చేయలేక పోయింది. అమెరికన్లకు చాలినంత సైన్యం, సైన్య సామాగ్రి లేనందువల్ల, వారు బ్రిటీష్ వారిపై దాడులు చేయక, బ్రిటీష్ దాడుల నుండి తమను రక్షించుకోటంలో చాలాకాలం గడచిపోయింది. యుద్ధ గమనంలో బ్రిటన్, అమెరికా సంయుక్తరాష్ట్రాలు వాటికి ప్రత్యేకమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

బ్రిటీష్ ప్రభుత్వం యుద్ధాన్ని సమర్థమైన రీతిలో నడపలేకపోయింది. లండన్‌లోని మంత్రివర్గ సభ్యులకు యుద్ధాన్ని సరిగా నడిపే సామర్థ్యం లేకపోయింది. అమెరికాకు వచ్చిన బ్రిటీష్ సేనా నాయకుల్లో, ఉత్సాహం లోపించింది. కొంతమంది సుఖానికి అలవాటుపడి, సైన్యాలను శీఘ్రగతిన నడపించలేకపోయారు. జనరల్ హొవె (Howe) వంటి మరికొందరు సైన్యాధిపతులు, ఈ యుద్ధం రెండు పక్షాల మధ్యా మంతనాల ద్వారా తొందరగా ముగిస్తుందనే భ్రమలో, అమెరికన్ల పట్ల కఠినమైన యుద్ధ చర్యలకు పూనుకోలేదు. బ్రిటన్‌లో చాలామంది ఇంగ్లీష్‌వారు వలసలతో యుద్ధం చేయటం పట్ల ఉత్సాహాన్ని ప్రదర్శించలేదు. కొంతమంది ఇంగ్లీష్ ఉదారవాదులు, మూడో జార్జి వ్యక్తిగత పాలన అంతం కావటానికి ఒక మార్గంగా, వలసల విజయాన్ని కాంక్షించారు.

అమెరికన్లతో పోరాడటం ఇష్టంలేక, బ్రిటీష్ ప్రజలు సైన్యంలో చేరటానికి విముఖత కనపరచారు. అందువల్ల మూడో జార్జి, హెస్సె మొదలైన జర్మనీ రాష్ట్రాల నుండి 30,000 మంది సైనికులను

BRAOU

వేతనం మీద తీసుకోవాల్సి వచ్చింది. వీరు మిక్కిలి నిరుత్సాహంతో యుద్ధంలో పాల్గొన్నారు. వీరు ఎటువంటి ప్రలోభానికైనా పాల్పడి, సైన్యం నుండి పారిపోయేవారు. యుద్ధ గమన కాలంలో 30,000 నుండి 50,000 వరకు అమెరికన్లు (రాజభక్తులు) బ్రిటీష్ సైన్యంలో పనిచేశారు. అయితే, వీరు కొద్ది కాలం మాత్రమే, సైన్యంలో ఉంటూవచ్చారు. బ్రిటీష్ సైన్యాధిపతులు వీరిని విశ్వసించ లేదు. యుద్ధంలో వీరి సహకారాన్ని పొందటానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

బ్రిటీష్ సైన్యాధిపత్యం మిక్కిలి నిర్వీర్యంగా ఉన్నప్పటికీ, అమెరికన్లు త్వరగా యుద్ధాన్ని పరిసమాప్తి గావించలేకపోవటం విస్మయాన్ని కలిగిస్తుంది. వలస ప్రజల నుండి పన్నులు వసూలు చేయగల, వారిని క్రమశిక్షణలో ఉంచి, యుద్ధాన్ని సక్రమంగా నడపగల ప్రభుత్వం లేదు.

కాంటినెంటల్ కాంగ్రెస్ కేంద్రప్రభుత్వ విధులను నిర్వర్తించటానికి ప్రయత్నించింది. కాని, 1781 లో సమ్మేళన ప్రభుత్వం (Confederate Government) రూపొందేదాకా, కాంగ్రెస్ చట్టబద్ధంగా అధికారాన్ని వహించటానికి వీలులేకపోయింది. కాంగ్రెస్‌కు పన్నులు వేసే అధికారం లేదు. సైనికులను, యుద్ధ సరఫరాలను శాసించి, సమకూర్చుకొనే అధికారం లేదు. రాష్ట్రాలకు అభ్యర్థనలు పంపేది. రాష్ట్రాలు తమకు తోచినంత ధనాన్ని, సైన్యాన్ని సమకూర్చి పంపేవి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత ఆర్థిక సమస్యలతో, బ్రిటీష్ వారి దాడులతో సతమతమవుతూ, ధనానికి, సైన్యానికి కాంగ్రెస్ చేసే అభ్యర్థనల పట్ల శ్రద్ధ చూపేవికావు.

కాంగ్రెస్‌ను ఆంతరంగిక రాజకీయ విభేదాలు కూడా పీడించసాగాయి. స్వాతంత్ర్య సంగ్రామం ప్రజాస్వామ్య సాధనకై చేసేదని, అందువల్ల బలమైన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి దోహదం చేయదని, అమెరికన్లలో ఒక వర్గం వాదించసాగారు. వ్యాపారుల, ధనిక వర్గం ప్రయోజనాలను పరిర క్షించటానికై బలిష్ఠమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని, మరో వర్గం వారు వాదించారు. రిచర్డ్‌లీ, జాన్ ఆడమ్స్ మొదలైన వారు మొదటి వర్గానికి నాయకత్వం వహించగా, రెండో వర్గానికి న్యూయార్క్‌కు చెందిన జాన్‌జే, ఫిలడెల్ఫియా ధనిక వ్యాపారి రాబర్ట్ మారిస్, నాయకత్వం వహించారు. ఈ వర్గాల మధ్య విభేదాలు, యుద్ధాన్ని నడిపే విధానంలో, సైన్యాధిపతుల, దౌత్యాధికారుల ఎన్నికలో ఏకాభిప్రాయం లేకుండా చేశాయి.

BRAOU

కాంగ్రెస్ ఎదుర్కొన్న తీవ్ర సమస్య ధన లోపం. అమెరికాలో వెండి, బంగారం లేనందువల్ల, కాగిత కరెన్సీని అచ్చొత్తించాల్సి వచ్చింది. ఫలితంగా, త్వరలోనే అదుపులేని ద్రవ్యోల్బణం ఏర్పడింది. 1780 నాటికి కాంగ్రెస్ 250 మిలియన్ డాలర్ల, 'కాంటినెంటల్' కాగితపు కరెన్సీని జారీచేయగా, రాష్ట్ర ప్రభుత్వాలు 200 మిలియన్ డాలర్లకు మించిన కాగితపు కరెన్సీని జారీచేశాయి. అతి త్వరలో ఈ కాగితపు కరెన్సీ విలువ పడిపోయింది. 1781 లో కాంగ్రెస్ జారీచేసిన కాంటినెంటల్ డాలర్ విలువ, ఒక వెండి సెంట్ విలువకు దిగజారింది. 'Not Worth a Continental' అనేది, దూషణ వాక్యమైంది. ఈ విలువలేని కాగితపు డాలర్లను ఒక మంగలి తన అంగడి గోడలకు అలంకారంగా అతికించాడు. చివరకు ఈ కాగితపు నోట్లు ఎటువంటి విలువలేక, చెలామణీ లేకుండా అదృశ్యమైపోయాయి. రాష్ట్రాలకు ధనానికై, సరఫరాలకై అభ్యర్థనలు పంపి, ప్రజల నుండి రుణాలు తీసుకొని, ఫ్రాన్స్, స్పెయిన్, హాలాండ్ దేశాల నుండి రుణాలు తీసుకొని, కాంగ్రెస్ యుద్ధాన్ని కొనసాగించాల్సి వచ్చింది.

ధనాభావం వల్ల చెప్పుకోదగ్గ సైన్యాన్ని సమకూర్చుకొని, దాన్ని పోషించడం అమెరికన్లకు కష్టమైంది. విలువపడిపోయిన కాగితపు ద్రవ్యాన్ని సైనికులకు జీతాల కింద చెల్లించారు. 1780 తర్వాత సైనికుల్లో

చాలామందికి జీతాలే చెల్లించలేదు. ఫ్రెంచివారి సహాయంవల్ల తుపాకులు, మందుగుండు సామగ్రి సమకూరినప్పటికీ, ఆహారానికి, దుస్తులకు, నిరంతరం కొరత ఉండింది. చుట్టుపక్కల వ్యవసాయ క్షేత్రాలను దోచి, సైనికులు తమ ఆహారావసరాలను గడుపుకోవాల్సి వచ్చింది. చాలామంది సైనికులు, సైనిక దుస్తులు లేక, తమ సొంత దుస్తులనే అవి చినిగిపీలికలయ్యే దాకా వాడుకోవాల్సివచ్చింది. సైనికులు చల్లటి నేల మీద దుప్పట్లు లేక నిద్రించాల్సి వచ్చింది. బూట్లు లేని కాళ్లతో దీర్ఘ ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. అమెరికాలో సమృద్ధంగా ఆహారం, వస్త్రాలు లేక, ఈ పరిస్థితి ఏర్పడలేదు. బ్రిటీష్ సైన్యానికి ఎప్పుడూ సమృద్ధమైన ఆహారం ఉండేది. దీనికి కారణం లేకపోలేదు. బ్రిటీష్ వారు తమ అవసరాలను, ఆహార పదార్థాలను, విలువైన నాణేలిచ్చి కొనుగోలు చేసేవారు. అమెరికన్లు వీటిని విలువలేని కాగితపు నోట్లతో కొనాల్సివచ్చేది.

ఈ పరిస్థితుల్లో ఖండాంతర సైన్యం (Continental army)లో చేరి దీర్ఘకాలం పనిచేయటానికి ప్రజలను ప్రోత్సహించటంకాని, వారు వేసవి చివరలో సైన్యాన్ని వదలి పారిపోకుండా చేయటంకాని, అసాధ్యమైపోయింది. రాష్ట్రాలు తమ వంతు సైన్యాలను పూర్తిగా పంపడం అరుదైన విషయం. వాషింగ్టన్ సైన్యం ఎప్పుడూ సంఖ్యలో మిక్కిలి తక్కువగా ఉండి, కొన్ని సమయాల్లో పూర్తిగా అంతమైపోతుందన్నట్లు ఉండేది. మొత్తం మీద అమెరికన్ ప్రజల్లో రెండు లక్షల మంది, ఎప్పుడో ఒకప్పుడు సైన్యంలో చేరి, పనిచేశారు. కాని, వాషింగ్టన్ నాయకత్వంలో ఏ ఒక్క సమయంలోకాని, 16,000లకు మించి సైన్యం ఉండలేదు. ఒక చలికాలంలో ఈ సైన్యం 3,000 కన్నా తక్కువై పోయింది. అమెరికాలో బ్రిటీష్ సైన్యబలం సామాన్యంగా 30,000 కు మించి ఉండేది.

మొత్తం మీద స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో, అమెరికన్ ప్రజలు యుద్ధంలో చెప్పుకోదగ్గ ఉత్సాహాన్ని కనపరచలేదు. ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ, పౌర జనంలో చాలామంది సుఖ జీవనం గడిపారు. చాలా మంది అదే అవకాశంగా, విశేష ధన మార్జించారు. అమెరికన్ వ్యాపారులు బ్రిటీష్ వ్యాపార నౌకలపై సొంత సాయుధ నౌకలను పంపి, వాటిని దోచారు. కొంతమంది వ్యాపారులు ఎట్టి సంకోచం లేకుండా అధిక ధరలకు సైన్యానికి కావాల్సిన సరకులను ప్రభుత్వానికి అమ్మారు. ప్రభుత్వ కాంట్రాక్టులు అవినీతికి, లంచగొండితనానికి ఆలవాలమయ్యాయి. సంగ్రామ కాలంలోని చివరి సంవత్సరంలో, యుద్ధం జరగని ప్రాంతాల్లో వ్యాపారం విస్తరించి, విస్తారంగా సంపద పెంపొందింది. అమెరికా స్వాతంత్ర్యం కోసం పోరాటంలో పాల్గొన్న కొద్దిమందికి మాత్రమే, చాలినంత ఆహారం అందకుండా పోయింది.

## 10.3.3 జార్జి వాషింగ్టన్ సైన్యాధిపత్యం : ఇతర సేనా నాయకులు

ఖండాంతర సైన్యానికి (Continental Army) సైన్యాధిపతిగా జార్జి వాషింగ్టన్ ఎన్నిక, అత్యంత అదృష్టకరమైంది. వాషింగ్టన్ యుద్ధ కాలంలో చేసిన గొప్ప సేవ, ఏదో ఒక విధమైన సైన్యాన్ని కొనసాగించడం. వాషింగ్టన్ సైన్య సంబంధమైన విషయాల్లో అత్యంత ప్రతిభాశాలికాకపోయినా, మంచి విచక్షణా శక్తి కలవాడు. క్రమశిక్షణను కఠినంగా అమలుపరచేవాడు. శక్తివంతమైన అతని వ్యక్తిత్వం, అందరిలో విశ్వాసాన్ని, విధేయతను ప్రోత్సహించేది. నిజాయితీ, దృఢ నిశ్చయం, ధైర్యం, అతనిలో మిక్కుటంగా ఉండేవి. అతనికి గణతంత్ర రాజ్య విధానం (Republican Form of Government) మీద ఎనలేని గౌరవం. అతడు సైనిక నియంత అయ్యే ప్రమాదం ఎన్నడూ లేదు. అమెరికన్ సైన్యాలను నడిపిన మిగిలిన సేనా నాయకులు, ఛార్లెస్‌లీ, హొరేషియోగేట్స్, నెథేనియల్‌గ్రీన్. వీరిలో ఛార్లెస్‌లీ, గేట్స్ అసమర్థులు. ఛార్లెస్‌లీని దేశద్రోహిగా కూడా అనుమానించారు. కాని,

BRAOU

చివరకు అమెరికన్ సేనానాయకుల్లో సమర్థులైనవారు, బ్రిటీష్ సేనానాయకులకన్నా మిక్కిలిగా శక్తియుక్తులను ప్రదర్శించారు.

ఫ్రాన్స్ నుండి సహాయం లభించక పోతే, చివరకు అమెరికా విజయం అసాధ్యమై ఉండేది. 1763 లో తాను పొందిన పరాజయానికి బ్రిటన్ మీద ప్రతీకారం తీర్చుకోటానికి, ఫ్రెంచి ప్రభుత్వం ఎనలేని ఆసక్తిని కనపరచింది. అంతేగాక, అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలోని భావాల పట్ల, ఫ్రెంచి మధ్యతరగతివారు సానుభూతిని కనపరచారు. ఫ్రెంచి వారికిగల ఆసక్తిని, సానుభూతిని, 1776 లో ఫ్రాన్స్‌కు దౌత్య ప్రతినిధిగా నియమితుడైన బెంజమిన్ ఫ్రాంక్లిన్ చక్కగా వినియోగించుకొని, అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి ఫ్రాన్స్ సహాయాన్ని పొందగలిగాడు.


## 10.3.4 ఫ్రాన్స్, తదితర దేశాల సహాయసహకారాలు

స్వాతంత్ర్య యుద్ధం ప్రారంభమైన నాటి నుండీ, ఫ్రాన్స్ అమెరికన్లకు రహస్యంగా ఆయుధాలను సరఫరా చేస్తూ ఉండింది. తర్వాతి కాలంలో ఫ్రెంచి విప్లవా (1789,1830)ల్లో ప్రముఖ పాత్ర వహించిన మార్క్వెస్ డి లఫాయెట్ (Marquess De Lafayete) మొదలైనవారు, అమెరికన్ల పోరాటం పట్ల సానుభూతి గల ఫ్రెంచివారనేకులు స్వచ్ఛందంగా అమెరికన్ సైన్యంలో చేరారు. అట్లే, ప్రష్యా, పోలండ్, మరి కొన్ని దేశాల నుండి కూడా, స్వచ్ఛంద సైనికులు కొందరు చేరారు. 1778 లో ఫ్రాన్స్ అమెరికా వైపు చేరి, స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొంటున్నట్లు బహిరంగంగా ప్రకటించింది. 1778 నుండి 1783 వరకు విస్తారమైన ధనాన్ని, సైనిక సామాగ్రిని, తన సేనలలో సగభాగాన్ని, దాదాపు పూర్తిగా తన నౌకాదళాన్ని, ఫ్రాన్స్ అమెరికన్లకు సహాయంగా అందించింది. ముఖ్యంగా స్వాతంత్ర్య యుద్ధంలో చివరి ఘట్టమైన యార్క్‌టౌన్ యుద్ధంలో విలువైన సహాయాన్నందించింది. 1779 లో స్పెయిన్, 1780 లో హాలండ్, అమెరికా వైపు యుద్ధంలో చేరాయి. ఐరోపా లోని మిగిలిన దేశాలు, పోర్చుగల్, పవిత్ర రోమన్ సామ్రాజ్యం, ప్రష్యా, రష్యా, డెన్మార్క్, స్వీడన్, తటస్థ విధానాన్ని అవలంబించాయి. ఈ విధంగా యుద్ధం చివరి దశల్లో బ్రిటీష్ వారు జిబ్రాల్టర్ వద్ద, పశ్చిమ ఇండియా దీవుల వద్ద, ఉత్తర అమెరికాలో, ఒకేసారి యుద్ధం చేయాల్సి వచ్చింది. ఫ్రాన్స్ బ్రిటీష్ వారి సముద్రాధిపత్యాన్ని సవాలు చేసింది.

## 10.3.5 యుద్ధ ముఖ్య ఘట్టాలు : సారటోగా, యార్క్‌టౌన్

1775 జూన్ చివరలో మెసాచూసెట్స్‌లో వాషింగ్టన్ అమెరికన్ సేనల సర్వసైన్యాధిపతిగా పదవీబాధ్యతలను స్వీకరించాడు. అప్పటికే రెండు పక్షాల మధ్య, బంకర్‌హిల్ యుద్ధం (1775 జూన్ 17) ముగిసింది. ఈ యుద్ధంలో బోస్టన్ రేవు సమీపంలోని ఛార్లెస్ టౌన్‌ను, అక్కడి అమెరికన్ సేనలను తరిమివేసి, బ్రిటీష్ వారు తగలబెట్టారు. కాని, బ్రిటీష్ వారు ఈ యుద్ధంలో తీవ్రంగా నష్టపడ్డారు. జనరల్ గేజ్ స్థానంలో హావె, మిలిటరీ గవర్నర్‌గా నియమితుడయ్యాడు. జనరల్ హావె, ఆసంవత్సరాంతం వరకు బోస్టన్‌ను అమెరికన్ల దాడి నుండి రక్షించగలిగాడు. ఈ కాలంలో ఏదో ఒక విధమైన అమెరికన్ సైన్యాన్ని రూపొందించడమనే సమస్యతో, వాషింగ్టన్ సతమతమవుతుండేవాడు.

BRAOU




అ. సం. రాష్ట్రాల ఉత్తర ప్రాంతంలో స్వాతంత్ర్య పోరాటం

ఈ లోపల అమెరికన్లు క్విబెక్ మీద చేసిన దండయాత్రలో ఓడి, వెనుకకు తరమబడ్డారు. (1775 డిశంబర్ 31); ఈ యుద్ధాన్ని అమెరికన్ సేనాని బెనెడిక్ట్ ఆర్నాల్డ్ మిక్కిలి సమర్థవంతంగా నడిపినా, ప్రయోజనం లేకపోయింది. అమెరికన్లు ఆశించినట్లు క్విబెక్ రాష్ట్రంలోని ఫ్రెంచివారు, వారి కెట్టి సహాయం చేయలేదు. 1776 మార్చి నాటికి బ్రిటీష్ వారిపై దాడి చేయడానికి వాషింగ్టన్ ఆయత్తం కావటంతో, అమెరికన్ల ముట్టడికి వెరచి, జనరల్ హోవె బోస్టన్ నగరాన్ని వదలి, బ్రిటీష్ సైన్యాన్ని నోవాస్కోషియాకు తరలించాడు. (1776 మార్చి 17). 1776 జూన్‌లో జనరల్ హోవె, 30,000 సైన్యంతో న్యూయార్క్ చేరుకొన్నాడు. హోవె న్యూయార్క్ చేరుకుంటాడని ఊహించి, వాషింగ్టన్ బోస్టన్ నుండి త్వరిత గతిలో అక్కడికి చేరి, తన సైన్యంలో కొంత మాన్‌హట్టన్‌లో, మరికొంత బ్రూక్లిన్‌లోని ఈస్ట్‌రివర్‌కు అడ్డంగా మోహరించాడు. తర్వాత కొన్ని నెలలు జరిగిన అనేక యుద్ధాల్లో, బ్రిటిష్ వారికి వరుసగా విజయాలు లభించాయి. హోవె, బ్రూక్లిన్ లోని అమెరికన్ సైన్యాలను ఓడించి, మాన్‌హట్టన్‌ను ఆక్రమించి, అమెరికన్లను న్యూజెర్సీ వరకు వెంబడించి తరిమాడు. వాషింగ్టన్ సైన్యం వికావికలై పోయింది. ఆసంవత్సరం చివరలో ట్రెంటన్ (డిశంబర్ 1776) ప్రిన్స్‌టన్ (జనవరి 31, 1777) లవద్దగల బ్రిటీష్ సైన్య దళాలపై దాడిచేసి, వారిని ఓడించి, జనరల్ వాషింగ్టన్ అనుకోని విధంగా, పరిస్థితిని తారుమారు చేశాడు. వాషింగ్టన్ చేసిన ఈ సాహసోపేతమైన, ప్రతిభావంతమైన చర్య, అమెరికన్ల స్థైర్యాన్ని తిరిగి నిలబెట్టింది.

1777 లో జనరల్ హోవె ఫిలడెల్ఫియాను పట్టుకోదలచి, తన సైన్యాన్ని చెసాపీక్ బే (Chesapeake Bay) ముఖద్వారం వద్ద మోహరించాడు. హోవె, వాషింగ్టన్‌ను బ్రాండ్‌వైన్ వద్ద ఓడించి (1776, సెప్టెంబర్ 11), ఫిలడెల్ఫియాను ఆక్రమించి (సెప్టెంబర్ 27), అమెరికన్లను జర్మన్‌టౌన్ వద్ద మరల ఒకసారి ఓడించాడు (అక్టోబర్ 4). ఇంతలో జనరల్ బర్గాయిన్ (General Burgoyne) నాయకత్వంలోని మరో బ్రిటీష్ పటాలం, బ్రిటీష్ ప్రభుత్వం ఆదేశాలమీద, హడ్సన్ నదీలోయను వశం చేసుకోవాలని, కెనడా నుండి బయలుదేరింది. కాని, దీని గమనంలోని అలసత్వం ఫలితంగా, అమెరికన్లు న్యూయార్క్ నుండి, న్యూ ఇంగ్లాండ్ నుండి పెద్ద ఎత్తున ప్రజాసైనికదళాల ('మిలిషియా') ను సమకూర్చుకోటానికి వ్యవధి దొరికింది. సారటోగా వద్ద జరిగిన యుద్ధంలో, బర్గాయిన్ అమెరికన్లకు లొంగిపోయాడు (1777, అక్టోబర్ 17)

అమెరికా స్వాతంత్ర్య పోరాటం తాము సమర్థించతగ్గ ఉద్యమమని, సారటోగా విజయం ఫ్రెంచివారికి ఒక నిశ్చితాభిప్రాయాన్ని కలిగించింది. నాటినుండి వారు బహిరంగంగా పోరాటంలో పాల్గొన్నారు. 1778 లో జనరల్ హోవె స్థానంలో సర్ హెన్రీ క్లింటన్ బ్రిటీష్ సర్వసైన్యాధిపతిగా నియమితుడయ్యాడు. న్యూయార్క్‌ను ఆక్రమించే ఉద్దేశంతో, బ్రిటీష్ సైన్యం ఫిలడెల్ఫియాను వదలి, న్యూజెర్సీ మీదుగా న్యూయార్క్‌కు పోతుండగా, వాషింగ్టన్ వారిని మాన్‌మౌత్ వద్ద ఎదిరించాడు. కాని, వారి మీద దాడిచేయాల్సిందిగా వాషింగ్టన్ ఇచ్చిన ఆదేశాన్ని జనరల్ ఛార్లెస్ లీ పాటించనందువల్ల, వాషింగ్టన్‌కు అక్కడ విజయం లభించలేదు. అప్పుడప్పుడు అమెరికన్ల మీదకు కొన్ని దాడులు పంపడం, చుట్టుపక్కల కొన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడం మినహా, మిగిలిన యుద్ధ కాలంలో న్యూయార్క్ లోని బ్రిటీష్ సైన్యం క్రియాశూన్యంగా ఉండిపోయింది. తర్వాత మూడేండ్ల కాలంలో, వైట్ ప్లెయిన్స్‌ను తన ప్రధాన కేంద్రం చేసుకొన్న వాషింగ్టన్, తన సైన్యానికి తిండి, బట్ట సమకూర్చి, వారు సైన్యాన్ని వదలి పారిపోకుండా కాపాడుకోడంలో సరిపోయింది. సైన్యాధిపతి బెనెడిక్ట్ ఆర్నాల్డ్, తన సేవలకు అమెరికన్ల నుండి తగిన గుర్తింపు రాలేదనే వ్యథతో, 1780 లో బ్రిటీష్ వారికి అమ్ముడుపోయి, వారి వైపు చేరిపోయాడు. 1778లో, వర్జీనియా ప్రభుత్వ ఆదేశంమీద,



BRAOU

జార్జి రోజర్ క్లార్క్ ఇల్లినాయ్ లోని మూడు బ్రిటీష్ సైనిక స్థావరాలను పట్టుకొన్నాడు. ఈ పడమటి ప్రాంతంలో, స్వాతంత్ర్య సంగ్రామ సమాప్తి వరకు పోరాటం కొనసాగింది. బ్రిటీష్ వారు కెనడాకు సమీపంలోని డెట్రాయిట్, మరికొన్ని స్థలాలను తమ వశంలో ఉంచుకొని, కొన్ని ప్రయోజనాలను పొందగలిగారు. కాని, పశ్చిమ ప్రాంతంలో అధిక భాగం, అమెరికన్ల వశంలో ఉండిపోయింది.

స్వాతంత్ర్య సంగ్రామంలోని చివరి యుద్ధాలు దక్షిణంలో జరిగాయి. 1780 మొదట్లో బ్రిటీష్ సైన్యం ఛార్లెస్టన్‌ను పట్టుకొంది (1780 మే 12). దక్షిణ కెరోలినాలో కామ్డెన్ వద్ద జరిగిన యుద్ధంలో, జనరల్ కార్న్‌వాలీస్ అమెరికన్ సైన్యాధిపతి గేట్స్‌ను పూర్తిగా ఓడించాడు (1780 ఆగస్ట్, 16). తర్వాతి రెండేండ్లు కెరోలినా రాష్ట్రాల్లో దేశభక్తుల, రాజ భక్తుల మధ్య, ఘోరమైన అంతర్యుద్ధం జరిగింది. ఉత్తర కెరోలినాలోని దేశభక్తులు (Patriots), రాజభక్తుల (Loyalists) సైన్యాన్ని, 1780 అక్టోబర్‌లో, కింగ్స్ మౌంటెన్ వద్ద తీవ్రంగా ఓడించి, ఆరాష్ట్ర పడమటి ప్రాంతాన్ని వశం చేసుకొన్నారు.


1780 అక్టోబర్‌లో జనరల్ నెథానియల్ గ్రీన్ దక్షిణ సైన్యాలకు సైన్యాధిపతిగా నియమితుడయ్యాడు. అమెరికన్ సైన్యాధిపతులలో గ్రీన్ అత్యంత సమర్థుడు. 1781 మార్చిలో కార్న్‌వాలీస్ అతనిని గ్విల్‌ఫోర్డ్ కోర్ట్ హౌస్ (ఉత్తర కెరోలినా) యుద్ధరంగంలో ఓడించినప్పటికీ, బ్రిటీష్ వారు ఆ యుద్ధరంగంలో అపార నష్టాలకు గురై, కెరోలినాలమీద అన్ని ఆశలు వదులుకున్నారు.

1781 ఆగస్ట్‌లో బ్రిటీష్ సైన్యాధిపతి జనరల్ కార్న్‌వాలీస్, 7000 సైన్యంతో, వర్జీనియాలో సముద్ర తీరాన ఉన్న యార్క్‌టౌన్‌ను తనకు సైనిక కేంద్రంగా ఎన్నుకొన్నాడు. ఇది స్వాతంత్ర్య సంగ్రామంలో చివరి నిశ్చిత ఘట్టానికి దారితీసింది. న్యూ ఇంగ్లాండ్‌లో ఫ్రెంచి సేనలు వచ్చి దిగాయి. అవి, వాషింగ్టన్‌తో కలసి, కార్న్‌వాలీస్ మీద దాడి చేయడానికి ప్రయత్నాలు సిద్ధం చేసుకొన్నాయి. లోగడ, ఫ్రెంచి - అమెరికన్ సహకార ప్రయత్నాలు చాలా కలిసిరాలేదు. కాని, ఈ సారి ఈ సహకారం అన్ని విధాలా విజయవంతమైంది. ఫ్రెంచి, అమెరికన్ సేనలు కలసి, హడ్సన్ నదీ తీరం నుండి ఆగస్ట్ 25న యార్క్‌టౌన్ మీద దండెత్తడానికి బయలుదేరాయి. కార్న్‌వాలీస్‌కు, సహాయంగా వచ్చిన బ్రిటీష్ నౌకలను తరిమివేసి, ఒక ఫ్రెంచి నౌకాదళం, డిగ్రాస్ (De Grasse) నాయకత్వంలో యార్క్‌టౌన్‌ను దిగ్బంధించింది. అదే సమయంలో, ఫ్రెంచి, అమెరికన్ సేనాదళాలు భూమార్గాన పయనించి, దారిలో న్యూయార్క్ వద్ద బ్రిటీష్ సేనాని క్లింటన్‌ను నేర్పుగా తప్పించుకొని, యార్క్‌టౌన్ చేరి, దాన్ని ముట్టడించాయి. 1781 అక్టోబర్ 5 నుండి 19 వరకు, 15 రోజులు యార్క్‌టౌన్ ముట్టడి జరిగింది. నాలుగు వైపుల నుండి ముట్టడికి లోనై, స్వల్ప సైన్యంతో ఉన్న కార్న్‌వాలీస్, లొంగక తప్పలేదు. తన సైన్యం 7,000 మందితో, కార్న్‌వాలీస్ 1781 అక్టోబర్ 19న లొంగిపోయాడు. అప్పటికింకా, న్యూయార్క్ ఛార్లెస్టన్, సవన్నాలు బ్రిటీష్ సైన్యాల అధీనంలోనే ఉన్నప్పటికీ, తర్వాత యుద్ధమేమీ జరగలేదు.

పద్దెనిమిదో శతాబ్దపు ప్రమాణాలను బట్టి చూచినా, యార్క్‌టౌన్ యుద్ధం చిన్న యుద్ధమని చెప్పాలి. కాని, చిన్న యుద్ధమైనా, అది అమెరికన్లతో పోరాటం కొనసాగించటం వృథా ప్రయాస అని, బ్రిటీష్ వారికి స్పష్టపరచింది. ఈ పోరాట ఫలితంగా, ఇంగ్లీష్ ప్రజల్లో ఏర్పడ్డ అసంతృప్తి, ప్రధాని లార్డ్ నార్త్ తన పదవికి రాజీనామా చేసేటట్లు చేసింది. హౌస్ ఆఫ్ కామన్స్ మూడో జార్జి



BRAOU




అ. సం. రాష్ట్రాల దక్షిణ ప్రాంతంలో స్వాతంత్ర్య పోరాటం

అదుపులో లేకుండా పోయింది. నూతన ప్రధాన మంత్రైన లార్డ్ రాకింగ్‌హామ్ అమెరికా సంయుక్తరాష్ట్రాలతో శాంతి సంప్రదింపులు ప్రారంభించాడు. అమెరికాతో యుద్ధం అట్లే కొనసాగితే, ఫ్రెంచి వారికి భారతదేశం, ఇతర బ్రిటీష్ వలసలు వదలుకోవాల్సిన ప్రమాదమేర్పడింది. అంతేగాక, 2000 కు మించిన అమెరికన్ సాయుధ వ్యాపార నౌకలు, అమెరికన్ యుద్ధ నౌకాదళం, బ్రిటీష్ వ్యాపార నౌకల మీద జరిపే దాడుల వల్ల, బ్రిటీష్ వ్యాపారులు తీవ్ర నష్టాలకు గురైనారు. అమెరికన్ల స్వాతంత్ర్యాన్ని గుర్తించటానికి బ్రిటీష్ వారు సిద్ధమయ్యారు.

## 10.3.6 శాంతి సంప్రదింపులు : ప్రాథమిక సంధి (1782); పారిస్ సంధి (1783)

శాంతి సంప్రదింపుల్లో అమెరికా సంయుక్తరాష్ట్రాల తరపున బెంజమన్ ఫ్రాంక్లిన్, జాన్ ఆడమ్స్, జాన్ జే పాల్గొన్నారు. ఈ శాంతి సంప్రదింపులు పారిస్‌లో జరిగాయి. ఫ్రెంచి వారితోగల 1778 మైత్రి ఒప్పందం మేరకు, కాంగ్రెస్ ఆదేశాలమేరకు, ఫ్రాన్స్ అంగీకారం లేకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్‌తో ఎటువంటి ఒప్పందం చేసుకోరాదు. కాని జాన్‌జేకు, ఆడమ్స్‌కు ఫ్రెంచి ప్రభుత్వంలో విశ్వాసం లేదు. ఫ్రెంచి ప్రభుత్వం ప్రతిఘటిస్తుందని వారు అనుమానించారు. అందువల్ల వారు, ఫ్రెంచి ప్రభుత్వ ఆమోదం లేకుండా బ్రిటీష్ ప్రభుత్వంతో ప్రత్యేకమైన సంధి చేసుకోటానికి మంతనాలు జరిపారు. అమెరికన్లకు, ఫ్రెంచి వారికి మధ్య శాశ్వత మైత్రి ఏర్పడుతుందేమోనని భయపడుతున్న బ్రిటీష్ వారు, వారి మధ్య విభేదాలను ప్రోత్సహించి, అమెరికన్ల యెడ ఉదారంగా వ్యవహరించ దలచారు.

1782 నవంబర్ 30 న ప్రాథమిక శాంతి ఒప్పందంపై అమెరికా సంయుక్తరాష్ట్రాల తరపున జాన్ ఆడమ్స్, బెంజమన్ ఫ్రాంక్లిన్, జాన్‌జే, హెన్రీ లారెన్స్, గ్రేట్‌బ్రిటన్ తరపున రిచర్డ్ ఆస్వాల్డ్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలోని షరతులు అమెరికన్లకు చాలా అనుకూలంగా ఉన్నాయి. గ్రేట్‌బ్రిటన్, అమెరికా సంయుక్తరాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని ఆమోదించడమేగాక, మహాసరస్సులకు దక్షిణంగా ఉన్న పశ్చిమ ప్రాంతంమీదంతా తన హక్కులను వదలుకొంది. మిసిసిపీనదిని అమెరికా సంయుక్తరాష్ట్రాల పశ్చిమ సరిహద్దుగా గుర్తించారు. న్యూఫౌండ్‌లాండ్ తీర ప్రాంతంలో, సెయింట్ లారెన్స్ సింధు శాఖలో అమెరికన్ల చేపలు పట్టుకొనే హక్కును గుర్తించారు. ఈ హక్కులకై జాన్ ఆడమ్స్ గట్టిగా పట్టుబట్టాడు. రెండు విషయాల్లో మాత్రమే పరస్పర అంగీకారంలో ఇబ్బంది ఏర్పడింది. అమెరికన్లు బ్రిటీష్ వ్యాపారుల దగ్గర తీసుకొన్న రుణాలు తప్పక చెల్లించాలని, అమెరికాలోని రాజభక్తుల (Loyalists) నుండి పట్టుకొన్న ఆస్తులను వారికి తిరిగి అప్పచెప్పాలని, బ్రిటీష్ ప్రభుత్వం పట్టుబట్టింది. కాని, ఈ విషయాలు అమెరికన్ రాష్ట్రాల అధికార పరిధిలో ఉన్నందువల్ల, కాంగ్రెస్ అధికార పరిధిలో లేనందువల్ల, అమెరికన్ దౌత్య ప్రతినిధులు ఈ విషయాల్లో కట్టుబాటుగా ఎట్టి ఒప్పందం చేసుకోలేదు. చివరకు, అప్పులు ఇచ్చినవారు వారి అప్పులను వసూలు చేసుకోటానికి ఎటువంటి ఆటంకాలు కల్పించరాదనీ, రాజభక్తులకు వారి ఆస్తులను తిరిగిచ్చే విధంగా రాష్ట్రాలకు కాంగ్రెస్ గట్టిగా చెప్పాలనీ, అంగీకారం కుదుర్చుకొన్నారు. అయితే, అమెరికాలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ షరతులను ఏమాత్రం పట్టించుకోలేదు. చివరకు బ్రిటీష్ వ్యాపారులకు చెల్లించాల్సిన రుణాలను జాతీయ ప్రభుత్వమే తీర్చాల్సివచ్చింది. ఈ విషయంలో తుది ఒప్పందం 1802 లో జరిగింది. అట్లే రాజభక్తుల బాగోగులను బ్రిటీష్ ప్రభుత్వం పట్టించుకోవాల్సి వచ్చింది. బ్రిటన్‌తో చేసుకొన్న ఈ ప్రాథమిక సంధిని కాంగ్రెస్ 1783 ఏప్రిల్ 15న ఆమోదించింది.

B R A O U

1783 సెప్టెంబర్ లో అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అన్ని దేశాలకు సంబంధించిన పారిస్ శాంతి సంధి జరిగింది. అమెరికా తరఫున బెంజమిన్ ఫ్రాంక్లిన్, జాన్ ఆడమ్స్, జాన్ జే ఈ సంధి పత్రాలపై సంతకాలు చేశారు. దీనిలో అమెరికన్లకు సంబంధించి ఆసక్తి కలిగించే విషయం, గ్రేట్ బ్రిటన్ ఫ్లొరిడాను స్పెయిన్‌కు ఇచ్చి వేయడం. కెనడా బ్రిటీష్ వారి స్వాధీనంలో ఉండి పోయింది. మిసిసిపి నదిని అ.సం.రాష్ట్రాలు కూడా నౌకాయానానికి ఉపయోగించవచ్చు.

ఈ విధంగా అమెరికన్లు స్వాతంత్ర్యాన్ని, తమ భవిష్యత్తును తామే రూపొందించుకొనే హక్కును సాధించుకొన్నారు. అమెరికన్ల విజయానికి బ్రిటీష్ ప్రభుత్వ అసమర్థత, ఫ్రెంచి వారి సహాయం, జార్జి వాషింగ్టన్ నాయకత్వం ప్రధాన కారణాలని చెప్పవచ్చు. స్వాతంత్ర్య సంగ్రామం అంతం కావడంతో, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో నిర్మాణాత్మక అధ్యాయం ప్రారంభమైంది.

## 10.4 విప్లవకాల సంస్కరణలు

**రాజకీయ సంస్కరణలు:-** స్వాతంత్ర్య సంగ్రామ తొలి దినాల్లో ప్రజాస్వామ్య ధోరణులు అధికం కాసాగాయి. రాష్ట్ర కాంగ్రెసుల్లో, స్థానిక కమిటీల్లో నాయకత్వం వహించిన వారు, ప్రజాహక్కులకై గట్టిగా వాదించసాగారు. కులీన వర్గాలకు చెందిన వారిలో చాలామంది రాజభక్తులు (Loyalists) కావటంవల్లనో, లేక వారికి స్వాతంత్ర్యం పట్ల ఆసక్తి లేకపోవటం వల్లనో, కొన్ని రాష్ట్రాల్లో కులీన వర్గాల స్థానం సంఘంలో బలహీనమైంది. యుద్ధానికి, యుద్ధ ప్రారంభ దశలో, కొన్ని ప్రాంతాల్లో మూకలు రాజ్య మేలుతున్నాయా అని సంప్రదాయవాదులు భావించటం జరిగింది. న్యాయస్థానాలు పనిచేయడం మానివేశాయి. రుణాలు వసూలు చేసుకోటం అసాధ్యమైంది. విప్లవ సంఘాల నాయకుల మాట శాసనమై కూర్చుంది. రాజభక్తుల్లో చాలామందిని, తారుపూసి, ఈకలు కట్టి, ఊరేగించి, జైళ్లలో పెట్టి, అనేక విధాలుగా హింసించారు. కాని, ఈ విపరీత ధోరణులవల్ల, ప్రజల్లో అనేకులు విప్లవవాదులను ఏవగించుకోసాగారు. యుద్ధం సాగుతున్న కాలంలో కొందరు సంప్రదాయవాదుల వైపు మొగ్గడం కూడా జరిగింది.

అమెరికా సంయుక్త రాష్ట్రాల మీద విప్లవం శాశ్వత ప్రభావాన్ని చూపింది. అది ప్రజాస్వామ్య పథంలో ముందుకు సాగిపోవటమే. కొన్ని రాష్ట్రాలు ఈ పథంలో మిగిలిన రాష్ట్రాల కన్నా త్వరగా ముందుకు పోయాయి. కాని, అట్లని, కులీన వర్గ పాలనా సంప్రదాయం పూర్తిగా అంతమైపోలేదు. దక్షిణాదిలో విప్లవోద్యమాన్ని నడపిన నాయకుల్లో చాలామంది కులీన, ధనిక వర్గానికి చెందినవారు. వారు సంస్కరణల్లో విపరీత ధోరణులను ప్రతిఘటించారు. అంతేగాక, నాటి రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా ఉండింది. ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించిన రాజకీయ పక్షాలు లేవు. నాయకులకు ఇదమిత్థమైన రాజకీయ సిద్ధాంతాలు లేవు.

విప్లవానికి ముందు, కనెక్టికట్, రోడ్ ఐలాండ్ రాష్ట్రాల్లో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాల్లో బ్రిటీష్ ప్రభుత్వమో, లేదా వలస యజమానులో నియమించిన గవర్నర్లు ఉండేవారు. అందువల్ల, విప్లవం ప్రారంభమైన తర్వాత, గవర్నర్లు ఉన్న ఈ రాష్ట్రాలన్నీ, తమ రాజ్యాంగాలను మార్చుకో వాల్సిన అవసరమేర్పడింది. రాజ్యాంగాన్ని మార్చటానికి మెసాచూసెట్స్ అవలంబించిన పద్ధతిని, తర్వాత సర్వసామాన్యంగా మిగిలిన రాష్ట్రాలు అనుసరించాయి. మెసాచూసెట్స్ కొత్త రాజ్యాంగాన్ని రూపొందించటానికి గాను, ప్రత్యేకమైన రాజ్యాంగ పరిషత్తును ఎన్నుకొంది. రాజ్యాంగ పరిషత్తు రూపొందించిన నూతన రాజ్యాంగానికి ప్రజలు ఓటు చేయడం ద్వారా తమ ఆమోదాన్ని తెలిపేవారు.

BRAOU

ఆస్తిపరులకే ఓటు హక్కు ఇవ్వాలనీ, పశ్చిమ ప్రాంతాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలనీ, సాంవత్సరిక ఎన్నికలు జరపాలనీ, అధికారం ప్రధానంగా కార్యవర్గానికిగాక శాసన సభలకు చెందాలనీ, ప్రాథమిక హక్కులను రాజ్యాంగాల్లో నిబంధించి ప్రభుత్వ అధికారాలను పరిమితం చేయాలనీ, ప్రజాస్వామ్య నాయకులు సామాన్యంగా కోరసాగారు. వీరి భావాలు చాలావరకు, 1776 లో పెన్సిల్వేనియా రాష్ట్రం రూపొందించిన నూతన రాజ్యాంగంలో ప్రతిఫలించాయి. న్యూహ్యాంప్‌షైర్, డెలావేర్, ఉత్తర కెరోలినా, జార్జియా తమ రాజ్యాంగాల్లో ఇటువంటి మార్పులను చేశాయి. కులీన వర్గాల అధికారం ఇంకా పటిష్ఠంగా ఉన్న మెసాచూసెట్స్, న్యూయార్క్, వర్జీనియా, దక్షిణ కెరోలినా రాష్ట్రాల్లో ఈ మార్పులు పరిమితంగా జరిగాయి. ఈ రాష్ట్రాలు ఓటింగ్ హక్కును పరిమితం చేశాయి. శాసన సభల్లో సముద్ర తీర ప్రాంతాలవారు, తమకు న్యాయంగా చెందాల్సిన దానికన్నా ఎక్కువ సభ్యత్వం ఉంచుకొన్నారు.

ఈ శాసన సంస్కరణల కన్నా ప్రధానమైన విషయం సామాన్యులను కూడా ఉన్నత పదవులకు ఎన్నుకోవాలనుకోటం. రాజకీయ నాయకత్వం కులీన వర్గాలకు మాత్రమే పరిమితమైన గుత్తాధికారం కాకుండా పోయింది. వర్జీనియాకు మొదటగా ఎన్నికైన గవర్నర్ ప్యాట్రిక్ హెన్రీ, న్యూయార్క్‌కు మొదటగా ఎన్నికైన గవర్నర్ జార్జి క్లింటన్, వీరిద్దరు వెనకబడ్డ ప్రాంతాలకు చెందిన, ఉన్నత వంశాలకు చెందని సామాన్య న్యాయవాదులు.

**యాజమాన్యంలో మార్పులు:-** అమెరికన్ విప్లవం వ్యక్తిగత ఆస్తులకు సంబంధించి, కొన్ని మార్పులను తెచ్చింది. రాజభక్తులు (Loyalists) అయిన కుటుంబాలవారి పెద్ద వ్యవసాయ క్షేత్రాలను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొన్నాయి. వీటి నంతా తిరిగి భూవ్యాపారులు (Land speculators) కొనడం వల్ల, భూమి పంపకంలో ప్రజాస్వామ్య సూత్రమేమీ అమలు కాలేదు.

వారసత్వపు చట్టాల్లో పెద్ద ఎత్తున మార్పులు జరిగాయి. అంతకు పూర్వం, న్యూయార్క్‌లో, దక్షిణాదిలో భూస్వామ్య విధాన సూత్రాలైన, ఆస్తి కంతా జ్యేష్ఠ పుత్రుని వారసత్వం (Primogeniture), ఆస్తిని అమ్మే హక్కు ఆస్తి సొంత దారుకు లేకపోవడం (Entail), అమలులో ఉండేవి. సొంతదారు ఆస్తిని అమ్మే హక్కు లేకుండా పోవటాన్ని, చాలా రాష్ట్రాలు రద్దు చేశాయి. అట్లే భూస్వామి (యజమాని) చనిపోతే, అతని ఆస్తి అందరి కుమారులకు చెందుతుందనే చట్టాన్ని చేశాయి. ఈ మార్పులవల్ల, అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో భూస్వామ్యకులీన వర్గం రాజకీయాధికారంలో శాశ్వతంగా ప్రతిష్ఠితం కావడానికి, అవకాశం లేకుండా పోయింది.

**రాజ్యానికి, మతానికి మధ్య వేర్పాటు:-** అమెరికన్ విప్లవం సంపూర్ణ మత స్వేచ్ఛను ప్రేరేపించి, మతాన్ని రాజ్యం నుండి వేరు చేసేటట్లు చేసింది. ఒక్క న్యూఇంగ్లాండ్ రాష్ట్రాల్లో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాలు మతాన్ని రాజ్యం నుండి వేరు చేశాయి. మేరీలాండ్‌కు దక్షిణంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లో, న్యూయార్క్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో, 'ఎపిస్కోపలియన్ చర్చి' (Episcopalian Church), ప్రజలు దానికి కట్టే పన్నులతో నిర్వహించబడేది. కాని, ఆ చర్చికి బ్రిటిష్ ప్రభుత్వంతో ఉన్న సంబంధాలు, దాని మతాచార్యులకు రాజభక్తుల పట్ల ఉన్న సానుభూతి, దాని స్థానాన్ని బలహీనం చేశాయి. దాని ప్రత్యేక హక్కులను తీసివేయటానికి బయలుదేరిన ఉద్యమాలు, ప్రతి రాష్ట్రంలో విజయవంతమయ్యాయి. 1786లో వర్జీనియా శాసన సభ ఆమోదించిన వర్జీనియా మత స్వాతంత్ర్య చట్టం (Virginia Statute of Religious Liberty), ఈ మత స్వేచ్ఛకు, భావ స్వాతంత్ర్యానికి, చక్కని రూపకల్పన నిచ్చింది. దీన్ని 1779లో జెఫర్‌సన్ రచించాడు.

BRAOU

న్యూ ఇంగ్లాండ్‌లో కాంగ్రిగేషనలిస్ట్ (Congregationalist) మత శాఖకు ప్రజల మద్దతు ఉండింది. దాని మతాచార్యుల్లో చాలా కొద్ది మంది మాత్రమే రాజభక్తులు. అందువల్ల, చర్చి నిర్వహణకై అక్కడి ప్రజలు పన్నులు కట్టడాన్ని ప్రభుత్వాలు ఆపుచేయలేదు. ఇతర క్రైస్తవ మత శాఖలకు చెందినవారు చెల్లించే పన్నులు, ఆ మత శాఖలకు చెందిన ఆచార్యులకే చెందేటట్లు ఏర్పాటు చేశారు. న్యూహ్యాంప్‌షైర్‌లో 1817 వరకు, కనెక్టికట్ లో 1818 వరకు మెసాచూసెట్స్‌లో 1833 వరకూ మతాన్ని, రాజ్యం నుండి వేరుచేయటం జరగలేదు.

**బానిస వ్యవస్థ:-** విప్లవ కాలంలోని ఉదార ఆదర్శాలు బానిస వ్యవస్థా నిర్మూలనానికి విస్తృతంగా తోడ్పడి, ఉద్యమాల్లో ప్రతిబింబించాయి. బానిసలు పరిమిత సంఖ్యలో ఉండి, వారి వల్ల ఆర్థికంగా ప్రయోజనంలేని ఉత్తర రాష్ట్రాలు, ఒకటి వెంబడి ఒకటి, తక్షణంగానో, లేదా కాలక్రమంలోనో, బానిస వ్యవస్థా నిర్మూలనానికి చట్టాలు చేశాయి. ఉదాహరణకు, మెసాచూసెట్స్‌లో 1781 లో, న్యాయస్థానం ఇచ్చిన ఒక తీర్పు మేరకు, బానిస లందరూ విముక్తిని పొందారు. ఉత్తర రాష్ట్రాల్లో, న్యూజెర్సీ, మిగిలిన రాష్ట్రాలన్నిటికంటే చివరగా, కాలక్రమంలో 1804 లో బానిస విమోచనకు ఒక చట్టాన్ని చేసింది.

దక్షిణంలో బానిస వ్యవస్థ పరిస్థితి క్లిష్టమైంది. జెఫర్‌సన్ వంటి ఉదారవాదులు కూడా, అక్కడ తక్షణమే బానిస విమోచనకు వీలులేదని భావించారు. కాని, పొగాకు పండించే వలసల్లో, అంతకు ముందు ఉన్నంతగా, బానిస వ్యవస్థ మీద ఆధారపడి దానికి దోహదం చేసే ఆర్థిక ప్రయోజనాలు లేకుండా పోయాయి. అందువల్ల, ఆ వలసల్లో చాలా కొద్దిమంది మాత్రమే బానిస వ్యవస్థను, స్వాత్రప్రాయంగా సమర్థించారు. బానిసత్వ విమోచన మీద చర్య తీసుకోడం, తర్వాత కొంత కాలం వరకు వాయిదా వేసినా, దక్షిణ కెరోలినా, జార్జియా తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాలు, విదేశాల నుండి బానిసలను దిగుమతి చేసుకోవటాన్ని నిషేధించాయి.

BRAOU

## 10.5 సంగ్రహంగా

1. 1776 జూన్‌లో, రెండో కాంగ్రెస్ సమావేశంలో, వర్జీనియా ప్రతినిధైన హెన్రీలీ స్వాతంత్ర్య ప్రతిపాదనను ప్రవేశపెట్టాడు. థామస్ జెఫర్‌సన్ అధ్యక్షుడుగా, అయిదుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీ, స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించింది. దాని ప్రధాన రచయిత జెఫర్‌సన్. 1776 జూలై 4న, కాంగ్రెస్, అమెరికా స్వాతంత్ర్య ప్రకటన (Declaration of Independence) ను ఆమోదించి, ఆచరణలో పెట్టింది.

2. ప్రాణ రక్షణ, స్వేచ్ఛ, ఆనందాన్వేషణ (Life, Liberty and Pursuit of Happiness) అనే అనన్య సంక్రమిత (Inalienable) హక్కుల సంరక్షణకై ప్రజలు ప్రభుత్వాలను ఏర్పరచుకొంటారని, స్వాతంత్ర్య ప్రకటనలో ఉద్ఘాటించబడింది. ఈ భావాలను చాలావరకు జాన్‌లాక్ (John Locke) నుండి గ్రహించారు.

3. యుద్ధ గమనంలో కాంగ్రెస్, ధన లోపం, మొదలైన తీవ్ర సమస్యల నెదుర్కొన్నది. ఫ్రాన్స్, ఇతర దేశాల సహాయం, సహకారం, అన్నిటికీ మించి, సర్వసైన్యాధ్యక్షుడుగా జార్జి వాషింగ్టన్ వ్యక్తిత్వ బలం, అతడు ఇచ్చిన స్ఫూర్తి, ఉత్తేజం, చివరకు అమెరికన్లకు విజయాన్ని చేకూర్చాయి. యుద్ధం లోని ముఖ్య ఘట్టాలు - సారటోగా, యార్క్‌టౌన్. 1783 పారిస్ శాంతి

సంధితో, యుద్ధం సమాప్తమైంది. గ్రేట్ బ్రిటన్, అమెరికా సంయుక్తరాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని ఆమోదించింది.

## 10.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. అమెరికా స్వాతంత్ర్య యుద్ధ గమనాన్ని విశ్లేషించండి.

2. విప్లవకాల సంస్కరణలను పరిశీలించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలోని ప్రధానాంశాలను, వాటి ప్రాముఖ్యతను చర్చించండి.

2. ప్రాథమిక సంధి, పారిస్ సంధి షరతులను సమీక్షించండి.

## 10.7 ఉపయుక్త గ్రంథాలు


Becker, Carl : **The Declaration of Independence, A Study in the History of Political Ideas, 1922.**

Burnett E.C : **The Continental Congress, 1941**

Dumbauld E : **The Declaration of Independence and What It Means Today, 1950**

Furneau R : **The Pictorial History of the American Revolution, 1905**

Van Tyne : **The Loyalists in the American Revolution, 1905**


BRAOU

# భాగం-11 : రాజ్యాంగ నిర్మాణం

విషయక్రమం

11.0 లక్ష్యాలు

11.1 వలసలన్నిటికీ కలిపి, ఒకే ప్రభుత్వాన్ని ఏర్పరచటానికి చేసిన ప్రయత్నాలు

11.2 కాన్ఫెడరేట్ (సమ్మేళనా) ప్రభుత్వం

11.2.1 కాన్ఫెడరేట్ ప్రభుత్వం సాధించిన విజయాలు, 1785, 1787 భూ చట్టాలు

11.2.2 కాన్ఫెడరేట్ ప్రభుత్వ వైఫల్యాలు : నూతన రాజ్యాంగ నిర్మాణ ప్రయత్నాలు

11.3 షేస్ తిరుగుబాటు

11.4 జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి ప్రచారం, ప్రయత్నాలు

11.5 ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు : ధ్యేయాలు

11.6 నూతన ప్రభుత్వ స్వరూపం : సంఘర్షిత దృక్పథాలు, రాజీలు

11.7 రాజ్యాంగానికి ఆమోదం

11.8 అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం : ప్రధాన లక్షణాలు

11.8.1 లిఖిత రాజ్యాంగం

11.8.2 సమాఖ్య రాజ్యాంగం

11.8.3 సమాఖ్య ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య అధికార విభజన

11.8.4 కాంగ్రెస్

11.8.5 అధ్యక్షుడు

11.8.6 ప్రధాన న్యాయస్థానం

11.8.7 ప్రత్యేక అంశాలు

11.9 రాజ్యాంగ స్వభావం : విమర్శ

11.10 సంగ్రహంగా

11.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.12 ఉపయుక్త గ్రంథాలు

B R A O U

## 11.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగల్గాలి.

- ఆంగ్లేయ వలసలు ఏర్పడినప్పటినుండీ, వాటన్నిటికీ కలిపి ఒక ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవాలని చేసిన ప్రయత్నాలు, 1777 దాకా ఫలించలేదు. చివరగా విప్లవ కాలంలో, వలసలన్నీ కలిసి 1777 లో కాన్ఫెడ్‌రేట్ (సమ్మేళనా) ప్రభుత్వాన్ని ఏర్పరచుకొన్నాయి. దాని విజయాలు, వైఫల్యాలు, 1785, 1787 భూ చట్టాలు;
- శాశ్వత ప్రాతిపదిక మీద బలిష్ఠమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచటానికి అవసరమైన రాజ్యాంగ రూపకల్పనకు తగిన వాతావరణాన్ని, దోహదాన్ని కాన్ఫెడరేట్ ప్రభుత్వం సమకూర్చింది. ఈ నేపథ్యంలో నూతన రాజ్యాంగ నిర్మాణానికైన ప్రయత్నాలు, ప్రచారం;
- ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగాన్ని రూపొందించటంలో ఎదుర్కొన్న సమస్యలు, సంఘర్షిత దృక్పథాలు, రాజీలు, రాజ్యాంగ ఆమోదం;
- అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ ప్రధాన లక్షణాలు.

## 11.1 వలసలన్నిటికీ కలిపి, ఒకే ప్రభుత్వాన్ని ఏర్పరచటానికి చేసిన ప్రయత్నాలు

ఆంగ్లేయ వలసలు ఏర్పడినప్పటినుండీ, వాటన్నిటినీ కలిపి ఒక ప్రభుత్వాన్ని ఏర్పరుచుకోవాల్సిన అవసరాన్ని, వలసలు గుర్తిస్తూ వచ్చాయి. కాని, 1777 నవంబర్‌లో కాన్ఫెడరేట్ (సమ్మేళనా) ప్రభుత్వాన్ని రూపొందించేదాక, అటువంటి ప్రభుత్వాన్ని రూపొందించడానికి చేసిన ప్రయత్నాలేవీ విజయవంతం కాలేదు. 1777 కు ముందు, వలసలు వాటన్నిటికీ కలిపి ఒక ప్రభుత్వాన్ని ఏర్పరచాలని చేసిన రెండు, మూడు ప్రయత్నాలు విఫలమయ్యాయి.

రెడ్ ఇండియన్ల దాడుల నుండి రక్షించుకోటానికి, నేటి న్యూయార్క్ ప్రాంతం (న్యూహాలాండ్, న్యూఆమ్‌స్టర్‌డామ్) లో వలస ఏర్పరచి ఉండిన డచ్చివారి దాడుల నుండి రక్షించుకోటానికి, 1643 లో న్యూ ఇంగ్లాండ్ వలసలైన మెసాచూసెట్స్, ప్లిమత్, కనెక్టికట్, న్యూహావెన్, వాటన్నిటికీ కలిపి, న్యూ ఇంగ్లాండ్ కాన్ఫెడరేషన్‌ను ఏర్పరచాయి. యుద్ధాలకు సైన్యాలను, ఖర్చులను అన్ని వలసలు కలిసి భరించాలని, ఆపదల్లో ఒకదాని కొకటి తక్షణ సహాయం అందించుకోవాలనీ, ఈ కాన్ఫెడరేషన్ సూత్రాలు పేర్కొన్నాయి. ఒక్కొక్క వలసకు ఇద్దరు కమీషనర్ల చొప్పున కాన్ఫెడరేషన్ వ్యవహారాలను చూడటానికి ఎనిమిది మంది కమీషనర్లను నియమించారు. వలసలు యుద్ధాలు ప్రారంభించటానికి, వీరిలో ఆరుగురి ఆమోదం కావాలి. యుద్ధాలు చేయటానికి, రక్షణకై ఏర్పాటైన ఈ కాన్ఫెడరేషన్‌ను, శాశ్వత మైత్రి కూటమిగా వర్ణించారు ("a firm and perpetual league of friendship and amity for offence and defence, mutual advice and succor"). కాని, ఈ న్యూఇంగ్లాండ్ కాన్ఫెడరేషన్ 1675 నాటికి క్షీణించిపోయింది.

1754 లో ఇండియన్ల దాడులను, వెంటనే ప్రారంభంకానున్న ఫ్రెంచి వారి దాడులను ఎదుర్కొని, రక్షణ ఏర్పరచుకోవాలనే ఉద్దేశంతో, పెన్సిల్వేనియా, మేరీలాండ్, న్యూయార్క్, న్యూఇంగ్లాండ్ వలసల

BRAOU

ప్రతినిధులతో ఆల్బనీ పట్టణంలో జరిగిన ఒక సమావేశంలో, అన్ని వలసలకు కలిపి ఒక ప్రభుత్వాన్ని రూపొందించటానికి, బెంజమిన్ ఫ్రాంక్లిన్ 'ఆల్బనీ ప్రణాళిక' (Albany plan) ను రూపొందించాడు. కాని, ఈ ఆల్బనీ ప్రణాళిక, వలసల శాసన సభల ఆమోదాన్ని పొందలేక పోయింది. అట్లే పైన పేర్కొన్నట్లు, మొదటి కాంగ్రెస్ (1774)లో జోసెఫ్ గ్యాలోవే ప్రతిపాదించిన వలసల కూటమి కూడా, ఒక్క ఓటు తేడాతో వీగిపోయింది.

చివరగా, విప్లవ కాలంలో, వలసలన్నీ కలసి 1777లో ఏర్పరచిన కాన్ఫెడరేట్ (సమ్మేళనా) ప్రభుత్వం చాలవరకు విజయవంతమైంది. తర్వాత, శాశ్వత ప్రాతిపదిక మీద బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచటానికి అవసరమైన రాజ్యాంగ రూపకల్పనకు తగిన వాతావరణాన్ని, దోహదాన్ని కాన్ఫెడరేట్ ప్రభుత్వం సమకూర్చింది.

## 11.2 కాన్ఫెడరేట్ (సమ్మేళన) పభుత్వం

విప్లవ కాలంలో అమెరికన్లు బ్రిటీష్ ప్రభుత్వ స్థానంలో సుస్థిరమైన కేంద్రాధికారాన్ని నెలకొల్పగలరనే నమ్మకం లేకుండా పోయింది. అమెరికన్ జాతి అరాజకంతో అంతమౌతుందని చాలామంది నిరాశాజనకమైన భవిష్యత్తును తెలిపారు. కాని, అమెరికన్లు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న తర్వాత అనతి కాలంలోనే, స్వేచ్ఛను శాంతిభద్రలతో, జాతీయ ఐక్యతను స్వయంపరిపాలనతో సమన్వయించిన ప్రభుత్వాన్ని ఏర్పరచుకోగలిగారు.

అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో ఏర్పడ్డ మొదటి కేంద్ర ప్రభుత్వాన్ని, కాన్ఫెడరేట్ (సమ్మేళనా) ప్రభుత్వమని పిలిచారు. ఈ ప్రభుత్వం, జాన్ డికిన్‌సన్ రచించిన కాన్ఫెడరేట్ రాజ్యాంగ సూత్రాలాధారంగా ఏర్పడింది. రాష్ట్రాల అధికారాలు పటిష్ఠంగా ఉండే విధంగా, వీటిని ఎన్నోసార్లు సవరించి, 1777 నవంబర్ 15 న, కాంటినెంటల్ కాంగ్రెస్ వీటిని ఆమోదించింది. వాటి చివరి రూపంలో, ఈ రాజ్యాంగంలోని ప్రకరణాలు కేంద్రాధికారాన్ని గూర్చి రాష్ట్రాలకు గల అనుమానాలను ప్రతిబింబించాయి. ఈ సూత్రాల ననుసరించి, కాన్ఫెడరేట్ ప్రభుత్వానికి విదేశాంగ విధానం, రక్షణ సైన్య, నౌకాదళాలను రూపొందించటం, ధనం రుణంగా పొందటం, రాష్ట్రాల మధ్య తగాదాలను పరిష్కరించటం, మొదలైన అధికారాల నిచ్చారు. సార్వభౌమత్వాధికారానికి (Sovereignty) మౌలిక లక్షణాల్లో ప్రధానమైన పన్నులు విధించే హక్కు, రాష్ట్రాల మధ్య వ్యాపారాన్ని క్రమబద్ధం చేసి, అదుపులో ఉంచే అధికారం, కాన్ఫెడరేట్ ప్రభుత్వానికి లేవు. కాన్ఫెడరేట్ ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగాన్ని నడపడానికి అయ్యే ఖర్చును, వివిధ రాష్ట్రాలకు అభ్యర్ధనల ద్వారా పొందాలి. ప్రభుత్వానికి ముఖ్యాంగాలైన శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వాహకశాఖ, న్యాయశాఖ విడిగాకాక, ఒక కాంగ్రెస్‌లోనే నిక్షిప్తమైనాయి. ప్రతి రాష్ట్రం ఈ కాంగ్రెస్‌కు ఒక ప్రతినిధిని ఎన్నుకొని పంపుతుంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవటానికి, తొమ్మిది రాష్ట్రాల ప్రతినిధులు అనుకూలంగా ఓటు చేయాలి.

రాష్ట్రాలు కాన్ఫెడరేట్ రాజ్యాంగాన్ని ఆమోదించే విషయంలో, సంయుక్త రాష్ట్రాల్లో కొత్తగా కలిపిన పశ్చిమ ప్రాంత భూముల సమస్య వల్ల, 1781 వరకు జాప్యం జరిగింది. వర్జీనియా మొదలైన రాష్ట్రాలు పశ్చిమ ప్రాంతంలోని భూముల్లో భాగాలు తమకు రావాలని కోరాయి. పెన్సిల్వేనియా మొదలైన రాష్ట్రాలు పశ్చిమ ప్రాంతాన్ని జాతీయ ప్రాంతంగా, సంయుక్త రాష్ట్రాల కేంద్ర ప్రభుత్వాధికారంలోనే ఉండాలని పట్టుబట్టాయి. పడమటి భూములను కాన్ఫెడరేట్ ప్రభుత్వానికి రాష్ట్రాలు వశం చేసే దాకా, మేరీలాండ్ కాన్ఫెడరేట్ రాజ్యాంగానికి తన ఆమోదాన్ని తెలుపలేదు (1781 మార్చి). నాటికి

న్యూయార్క్, వర్జీనియా రాష్ట్రాలు పడమటి భూములను కాన్ఫెడరేట్ ప్రభుత్వం వశం చేయడానికి అంగీకరించాయి. 1781 మార్చి 1న పదమూడు రాష్ట్రాల ఆమోదం లభించడంతో, కాంగ్రెస్, కాన్ఫెడరేట్ రాజ్యాంగం అమల్లోకి వచ్చినట్లు ప్రకటించడంతో, కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఏర్పడింది. సమాఖ్య రాజ్యాంగాన్ని సవరించటానికి 13 రాష్ట్రాలు అంగీకరించాలి. కాన్ఫెడరేషన్ ఒక మిత్ర కూటమిగా మాత్రమే పనిచేసింది. అధికారాలన్నీ రాష్ట్రాలకే చెందుతాయి. ("The Union as the Articles themselves declared, was a league of friendship entered into by Sovereign States" -- Hockett.)

## 11.2.1 కాన్ఫెడరేట్ ప్రభుత్వం సాధించిన విజయాలు : 1785, 1787 భూ చట్టాలు

కాన్ఫెడరేట్ ప్రభుత్వం 1781 నుండి 1789 వరకు కొనసాగింది. సాధారణంగా, చరిత్రకారులు ఈ కాలాన్ని అర్థికమాంద్యం, అంతర్గత పోరాటాలు, నాయకత్వ లోపంతో కూడిన కాలంగా పేర్కొన్నారు. కాని, యదార్థానికి, కాన్ఫెడరేట్ ప్రభుత్వం చెప్పుకోదగ్గ ఘన కార్యాలను సాధించింది. ఈ కాలంలో అ.సం. రాష్ట్రాలు చాలా రంగాల్లో ప్రగతిని సాధించింది.

స్వాతంత్ర్య యుద్ధ పరిసమాప్తి ఆర్థిక రంగంలో కొన్ని ఒడుదుడుకులను కల్పించింది. యుద్ధం అంతమైన తర్వాత బ్రిటన్ నుండి భారీ ఎత్తున చేసుకొన్న దిగుమతులు, 1784, 85ల్లో అ. సం. రాష్ట్రాల్లో ఆర్థిక మాంద్యాన్ని కల్పించాయి. కాని, ఔత్సాహికులైన వర్తకులు విదేశాల్లో అమెరికాలోని వస్తూత్పత్తులకు నూతన విపణుల (మార్కెట్ల)ను కనుక్కొన్నందువల్ల, ఆర్థిక మాంద్యం నుండి దేశం త్వరగా కోలుకుంది. యుద్ధ సమాప్తి తర్వాత ఒక దశాబ్దం తిరగకముందే, విదేశ వ్యాపారం సంపూర్ణంగా వర్ధిల్లింది. చైనాతో, తూర్పు ఇండియా దీవులతో, నూతనంగా వ్యాపార సంబంధాలు పెంపొందాయి.

దేశంలో కూడా అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించారు. పరిశ్రమలు, వస్తూత్పత్తులు త్వరితంగా పెరిగాయి. అనేక రాష్ట్రాలు విదేశ సరకుల దిగుమతుల మీద సుంకాలను విధించాయి. రోడ్ల, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతిని పొందిన చాలా కంపెనీలు రూపొందినాయి. ఫిలడెల్ఫియా, న్యూయార్క్, బోస్టన్‌ల్లో, మొదటిసారిగా వ్యాపార బ్యాంకులను స్థాపించారు.

1781 మార్చి నాటికి, కాన్ఫెడరేట్ రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ముందు, రాష్ట్రాలన్నీ పశ్చిమ ప్రాంతంలోని భూములను గూర్చి ఒక అంగీకారానికి వచ్చాయి. దీని ప్రకారం ఒహియో నదికి ఉత్తరంగా ఉన్న ప్రాంతమంతా, కాన్ఫెడరేట్ ప్రభుత్వాధీనంలో ఉండాలి. క్రమేణా ఈ ప్రాంతాన్ని రాష్ట్రాలుగా రూపొందించాలి. ఒహియో నదికి ఉత్తరంగాను, మిసిసిపి నదికి తూర్పుగాను ఉన్న పశ్చిమ ప్రాంతాన్ని, వాయువ్య ప్రదేశం (North-West Territory) అని పేర్కొన్నారు. సమ్మేళనా ప్రభుత్వం విజయవంతంగా పరిష్కరించిన మరో సమస్య, ఈ వాయువ్య ప్రదేశం లోని భూములను ఏ విధంగా రాష్ట్రాలుగా రూపొందించాలనే సమస్య.

పశ్చిమ ప్రాంతాల ఆక్రమణ విషయంగా, కాంగ్రెస్ ఒక నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించడానికి ముందే, అక్కడ స్థిరపడదలచిన అమెరికన్ పౌరులు (Settlers) తండోపతండాలుగా తరలివెళ్లి, ఆ ప్రాంతాలను ఆక్రమించుకొన్నారు. 1784 లో కాంగ్రెస్, జెఫర్సన్ రూపొందించిన ఒక పథకాన్ని అనుసరించి, ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. దీని ప్రకారం, వాయువ్య ప్రాంతంలో స్థిరపడ్డవారు, వెంటనే స్వయంపాలనను రూపొందించుకోవచ్చు. వాయువ్య ప్రాంతాన్ని, పది, లేదా అంతకంటె

ఎక్కువ రాష్ట్రాలుగా రూపొందించాలని, ఆర్డినెన్స్ పేర్కొనింది. కాని, భూవ్యాపారులైన చట్టా వ్యాపారుల (Speculators) ఒత్తిడి ఫలితంగా, 1785 లో వేరొక ఆర్డినెన్స్‌ను (Land Ordinance of 1785) జారీ చేసింది. దీని ప్రకారం, వాయవ్య ప్రాంతాన్ని సర్వేచేసి, చిన్న చిన్న పట్టణాలుగా విభజించాలి. ఒక్కొక్క పట్టణంలో తొంభై రెండు చ. కి. మీ విస్తీర్ణం ఉంటుంది. ఈ విస్తీర్ణంలో సమాన కొలతలు గల ముప్పై ఆరు దీర్ఘ చతురస్ర విభాగాలు ఉంటాయి. ఒక్కొక్క పట్టణంలో 10.24 చ. కి. మీ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వానికి, 2.56 చ.కి.మీ ప్రాంతాన్ని విద్యాలయం కోసం కేటాయించాలి. ఇది పోగా మిగిలిన ప్రాంతాన్ని, ఎకరానికి ఒక డాలర్‌కు తక్కువ గాకుండా బహిరంగ వేలంలో అమ్మాలి. కొనుగోలుదారు ఒక విభాగం (640 ఎకరాల) కంటె తక్కువ భూమిని కొనడానికి ప్రభుత్వం అంగీకరించదు. ఈ నిబంధన వల్ల, అక్కడ స్థిరపడదలచిన ప్రజల (Settlers) కంటే, చట్టా వ్యాపారస్తులే (Speculators) ఎక్కువ భూమిని కొనే అవకాశం ఏర్పడింది.

1785 భూ చట్టాన్ని జారీచేసిన వెంటనే, ప్రభుత్వం వాయవ్య ప్రాంతాన్ని సర్వే చేయించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. కాని, 'స్పెక్యులేటర్ల' ఒత్తిడివల్లా, ప్రభుత్వానికి ధనం అవసరమైనందువల్లా, సర్వే జరగని 15 లక్షల ఎకరాల భూమిని, ప్రభుత్వం, ఎకరం తొమ్మిది సెంట్ల కన్నా తక్కువ ధరకు, పలుకుబడిగల వర్తక సంఘాలకు ('కంపెనీ') అమ్మింది. ఈ అమ్మకమైన వెంటనే, అమెరికన్ పౌరులు పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతానికి తరలి వెళ్లారు. వర్తక సంఘాలు ఈ ప్రజల పట్ల తమ బాధ్యతలను నిర్వర్తించలేక పోయాయి. ఫలితంగా, అక్కడ ఏదో ఒక విధమైన పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరమేర్పడి, కాన్ఫెడరేట్ ప్రభుత్వం 1787 వాయవ్య ప్రాంత ఆర్డినెన్స్ (North - West Land Ordinance , 1787)ను జారీచేసింది. ఈ ఆర్డినెన్స్ (చట్టం) ప్రకారం, వాయవ్య ప్రాంతంలో ఒక గవర్నర్, ముగ్గురు న్యాయమూర్తులు నియమితులైనారు. అక్కడ 5000 మంది వయోజనులు చేరినప్పుడు, వారు పరిమిత అధికారాలున్న శాసన సభను ఎన్నుకోవచ్చు. ఆ ప్రాంతంలోని ఏ భాగంలో కాని, 60,000 మంది ప్రజలు చేరినప్పుడు, ఆభాగం రాష్ట్రంగా రూపొందుతుంది. దానికి అ. సం. రా.ల కాంగ్రెస్‌లో, తొలి రాష్ట్రాలతో సమానమైన ప్రతిపత్తి ఉంటుంది. ఈ వాయవ్య ప్రాంతంలో మూడుకు తక్కువ గాకుండా, అయిదుకు మించకుండా, రాష్ట్రాలను ఏర్పాటు చేయాలి. ఈ ప్రాంతానికి తరలివెళ్లిన వారందరికీ, రాజకీయ, మత స్వాతంత్ర్యాలు ఉంటాయి. ప్రభుత్వ వ్యయంతో ఉచిత విద్య లభిస్తుంది. చట్టం ఈ ప్రాంతాల్లో బానిసత్వాన్ని నిషేధించింది.

వాయవ్య ప్రాంతానికి సంబంధించి చేసిన 1785, 1787 వాయవ్య ప్రాంత భూ చట్టాలు (North-West Land Ordinances, 1785, 1787), కాన్ఫెడరేట్ ప్రభుత్వ పాలన లోని విజ్ఞతకు నిదర్శనాలు. ఈ చట్టాల మూలంగా అమెరికన్ ప్రభుత్వం, అమెరికా పశ్చిమ దిశావ్యాప్తిలో, వలస స్థాపనా విధానంలో, చక్కని ఒరవడిని ఏర్పరచింది. నూతన వలసల స్థాపన జాతి విస్తరణ మాత్రమే. ప్రతి కొత్త వలస చివరకు ఒక రాష్ట్రంగా, తొలి రాష్ట్రాలతో సమాన ప్రతిపత్తి గలిగి, జాతిలో కలుస్తుంది. కొత్త వలసలను, రాష్ట్రాలను నీచంగా చూడటంగాని, ఆర్థికంగా పీడించటంకాని జరగదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదటి కాలం నుండి ప్రభుత్వం ఇట్టి విధానాన్ననుసరించినందువల్లనే, భవిష్యత్తులో అ. సం. రాష్ట్రాల పశ్చిమ దిశావిస్తరణ (West - ward expansion) క్రమబద్ధంగా జరిగింది. ("In the years to come, the Land Ordinance of 1785 and the Ordinance of 1787 remained the basis for the sale and government of the national domain" -- Merrill Jensen, **The Articles of Confederation**). ఈ చట్టాలు కాన్ఫెడరేట్ కాంగ్రెస్‌కు గల జాతీయ సార్వభౌమత్వాధికారానికి ప్రతీకలుగా నిల్చాయి.



BRAOU

### 11.2.2 కాన్ఫెడరేట్ ప్రభుత్వ వైఫల్యాలు : నూతన రాజ్యాంగ ప్రయత్నాలు

కాని, పశ్చిమ దిశలో, అ. సం. రాష్ట్రాలు ఎదుర్కొన్న సమస్య, ఐరోపా దేశాలు పశ్చిమ ప్రాంతాలను ఆక్రమించకుండా చూడటం. కెనడా, గ్రేట్ బ్రిటన్ వశంలో ఉంది. ఫ్లొరిడా, లూసియానా (మిసిసిపీ నది, రాకీ పర్వతాల మధ్య ప్రదేశం) స్పెయిన్ వశంలో ఉన్నాయి. ఈ రెండు దేశాలు, అమెరికా పశ్చిమ దిశలో విస్తరించటాన్ని ప్రతిఘటించాయి. మహాసరస్సులకు దక్షిణంగా ఉన్న డెట్రాయిట్ మొదలైన కొన్ని అమెరికన్ స్థావరాలను వదలి వెళ్లడానికి బ్రిటన్ నిరాకరించింది. అమెరికన్లను ప్రతిఘటించడానికిగాను బ్రిటీష్‌వారు రెడ్ ఇండియన్లతో మైత్రి నెరపసాగారు. అదే విధంగా, న్యూ ఆర్లియన్స్‌లోని స్పానిష్ అధికారులు కూడా, రెడ్ ఇండియన్లతో స్నేహం చేయసాగారు. అంతేకాక, పశ్చిమ ప్రాంతాల్లో స్థిరపడ్డ అమెరికన్లు, తమ సరకులను మిసిసిపి నది మీద రవాణా చేయడానికి అనుమతించలేదు. మిసిసిపి నది మీద స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే హక్కు, న్యూఆర్లియన్స్ రేవు నుండి వారి ఉత్పత్తులను ఐరోపా దేశాలకు ఎగుమతి చేసే సౌకర్యం, పశ్చిమ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అత్యంతావశ్యకం.

ఇట్టి పరిస్థితుల్లో విదేశ వ్యవహారాలను నిర్వహిస్తున్న జాన్ జే (John Jay), 1786 లో స్పెయిన్ ప్రభుత్వంతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. దీని ప్రకారం, స్పెయిన్‌తో వర్తకం సాగిస్తున్న అమెరికన్లకు కొన్ని సదుపాయాలను స్పెయిన్ ఏర్పర్చినప్పటికీ, అమెరికన్లు మిసిసిపి నదిని వ్యాపార ప్రయోజనాలకు వాడటాన్ని అనుమతించలేదు. ఈ ఒప్పందం అ. సం. రాష్ట్రాల దక్షిణ రాష్ట్రాల్లోను, పశ్చిమ రాష్ట్రాల్లోను, అలజడిని లేవదీసింది. పశ్చిమ ప్రాంతం వారు కాన్ఫెడరేషన్ నుండి విడిపోతామని, స్పెయిన్ దేశీయులను న్యూఆర్లియన్స్ ప్రాంతం నుండి వెళ్లగొడ్తామని, లేదా స్వతంత్రంగా స్పెయిన్‌తో ఒప్పందాలు చేసుకొంటామని, రహస్య సమాలోచనలు జరిపి స్పెయిన్ సామ్రాజ్యంలో విలీనమయ్యే విధంగా మాట్లాడసాగారు. ఐరోపా దేశాల ప్రభుత్వాలతో మంతనాలు జరిపి, ఈ సమస్యలను పరిష్కరించగల స్తోమత, సామర్థ్యం, కాన్ఫెడరేట్ ప్రభుత్వానికి లేవు.

BRAOU

కాన్ఫెడరేట్ ప్రభుత్వం ఆంతరంగికంగా కూడా అనేక సమస్యల నెదుర్కొని, వాటిని పరిష్కరించలేకపోయింది. ప్రభుత్వ అధీనంలోని, అదుపులోని, ఇంకా పూర్తిగా రాకుండా ఉన్న వాయవ్య ప్రాంత ప్రజలు, ప్రభుత్వానికి పెద్ద సమస్యగా తయారయ్యారు. ప్రజాస్వామ్యం సాధించుకునే లక్ష్యానికన్నా, చట్టా వ్యాపారస్తుల (Speculators) చేత వారు ఎక్కువగా ప్రేరితులై, స్వయంపరిపాలన కోసం ఉద్యమాలను లేవదీశారు. 1787 లో వెర్మాంట్ ప్రాంత ప్రజలు వారి ప్రదేశాన్ని రాష్ట్రంగా ప్రకటించి, రాజ్యాంగాన్ని ఏర్పరచుకొన్నారు. వెర్మాంట్ భూభాగంలో కొంత ప్రాంతం మీద న్యూయార్క్‌కు హక్కు ఉండేది. న్యూయార్క్ ఆ హక్కును వదులుకోడానికి సమ్మతించక, వెర్మాంట్‌ను రాష్ట్రంగా గుర్తించడాన్ని వ్యతిరేకించింది. వెర్మాంట్ యూనియన్‌లో ఒక రాష్ట్రంగా గుర్తింపు పొందటానికి 1791 వరకు వేచి ఉండాల్సి వచ్చింది. కెంటకీ, టెన్నెసీ ప్రాంతాల్లో కూడా ఇట్లాంటి ఉద్యమాలు బయలుదేరాయి. ఈ ప్రాంతాల్లోకూడా చట్టా వ్యాపారస్తుల జోక్యం ఉండింది.

ఆంతరంగిక సమస్యలను పరిష్కరించటంలోకాని, విదేశాల బెదిరింపులను ఎదుర్కొనటంలో కాని, సమ్మేళనా ప్రభుత్వ వైఫల్యాన్ని అమెరికన్లు గుర్తించారు. పదమూడు రాష్ట్రాలు వాటి సరిహద్దులను గూర్చి కలహించుకొంటూ ఉండేవి. ఆర్థిక పరిస్థితి క్లిష్టమై, ప్రభుత్వం తాను తీర్చాల్సిన రుణాలను తీర్చలేకపోయింది. దేశమంతటా ఒకే కరెన్సీ లేనందువల్ల, రాష్ట్రాల మధ్య వ్యాపారం దెబ్బతినింది. జాతి ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించి, దాని ప్రయోజనాలను రక్షించగల

పటిష్టమైన కేంద్ర ప్రభుత్వాన్ని రూపొందించటం అవసరమని, అమెరికన్లు గుర్తించారు. అనేక ప్రాంతాల్లో నూతన రాజ్యాంగాన్ని కోరుతూ, సభలు, ప్రచారాన్ని ప్రారంభించారు. వర్జీనియాకు చెందిన జేమ్స్ మాడిసన్, న్యూయార్క్‌కు చెందిన అలెగ్జాండర్ హామిల్టన్, నూతన రాజ్యాంగాన్ని రూపొందించే ఈ ఉద్యమానికి, తమ ఉపన్యాసాల ద్వారా, రచనల ద్వారా ప్రచారాన్ని కల్పించారు.

## 11.3 షేస్ తిరుగుబాటు (Shays' Rebellion)

ఈ సమయంలోనే ఆలోచనాపరులైన అమెరికన్లను, దేశ శాంతిభద్రతల విషయంలో ఆందోళనకు గురిచేసిన ఒక సంఘటన జరిగింది. రాష్ట్రాల్లో, పశ్చిమ ప్రాంతాల్లోని రైతులు తూర్పు తీరంలోని వ్యాపారుల నుండి ఎక్కువగా రుణాలు చేశారు. స్వాతంత్ర్య యుద్ధం తర్వాత, పశ్చిమ ఇండియా దీవులతో అమెరికా వ్యాపారం చేయటాన్ని నిషేధించటంతో, అమెరికన్ రైతులు తమ వ్యవసాయో త్పత్తులను అమ్ముకోలేక, తాము చేసిన రుణాలను తీర్చలేకపోయారు. చాలామంది వారి వ్యవసాయ క్షేత్రాలను అమ్ముకోవాల్సి వచ్చింది. మరి కొంతమంది జైళ్ల పాలైనారు. మెసాచూసెట్స్‌లో ఈ పరిస్థితి దారుణమైంది. ఫలితంగా, డేనియల్ షేస్ అనే మాజీ సైనికోద్యోగి నాయకత్వంలో, రైతులకు విరుద్ధంగా తీర్పులు ఇవ్వకుండా, న్యాయస్థానాలపై రైతులు బల ప్రయోగం చేశారు. ప్రభుత్వం న్యాయస్థానాలను రక్షించటానికి చర్యలను తీసుకోవటంతో, రైతులు తిరుగుబాటు చేసి, స్ప్రింగ్‌ఫీల్డ్‌లోని ప్రభుత్వ ఆయుధాగారంపై దాడిచేశారు. 1786-87 లో జరిగిన ఈ ఉద్యమాన్ని, షేస్ తిరుగుబాటు (Shays' Rebellion) అని పిలిచారు. ఈ ఉద్యమాన్ని చివరకు జాతీయ సైన్యం అణచివేసింది. కాని, చరిత్రకారుడు మెక్‌లాఫ్లిన్ పేర్కొన్నట్లు, షేస్ తిరుగుబాటు, శాంతి భద్రతలను రక్షించటానికి పటిష్టమైన కేంద్ర ప్రభుత్వ అవసరాన్ని, అమెరికన్లలో, మేధావుల నుండి వ్యాపారులు, ఆస్తిపరుల వరకు గల దాదాపు అన్ని వర్గాల ప్రజలకు, స్పష్టం చేసింది. ("Shays' rebellion broke out and aroused the anxieties of the Conservatives from one end of the Continent to the other. Its chief interest to us lies in the fact that it unquestionably had the effect of prompting men of mind as well as men of property to strengthen the Union and to create self-respecting government" -- A.C. Mclaughlin, **A Constitutional History of the United States.**

## 11.4 జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి ప్రచారం, ప్రయత్నాలు

కాన్ఫెడరేట్ ప్రభుత్వ కాలంలోనే, జేమ్స్ మాడిసన్, అలెగ్జాండర్ హామిల్టన్, జాన్ మార్షల్ నాయకత్వం వహించిన ఒక పలుకుబడి గల వర్గం, పటిష్టమైన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలను ప్రారంభించింది. వీరిని ఫెడరలిస్ట్‌లని పిలిచారు. వీరిని వర్తకులు, పెద్ద భూస్వాములు సమర్థించారు. స్వేచ్ఛ కంటే క్రమశిక్షణ, జాతి ఐకమత్యం దేశానికి అవసరమని వీరు భావించారు. కాన్ఫెడరేట్ రాజ్యాంగాన్నే ప్రాతిపదికగా తీసుకొని, వీరు పటిష్టమైన సమాఖ్యను (Union) రూపొందించాలని మొదట యోచించారు. కాని, యుద్ధం ముగిసిన తర్వాత, ప్రజల్లోని చాలా వర్గాల్లో బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే విషయంలో, ఉత్సాహం తగ్గిపో యింది. పైగా, యుద్ధం సమాప్తమైన రెండు, మూడు సంవత్సరాల్లోనే, కాంగ్రెస్‌లో ఫెడరలిస్ట్‌లకు పలుకుబడి తగ్గింది. అందుచేత, కాన్ఫెడరేట్ రాజ్యాంగాన్ని సవరించి, పటిష్టమైన కేంద్ర ప్రభుత్వాన్ని నిర్మించడం సాధ్యం కాదని, భావించారు. నూతన రాజ్యాంగాన్ని రూపొందించి, నూతన ప్రభుత్వాన్ని సృష్టించడానికి నిశ్చయించారు.

యుద్ధ కాలంలో జీతానికి బదులుగా సైనికులకు బాండ్లను ఇచ్చారు. ఈ బాండ్ల మీద కొంత శాతం పైకం మినహాయించి, సైనికులకు చెల్లించి, ధనికులు ఈ బాండ్లను సైనికుల వద్దనుండి కొన్నారు. పన్నులు విధించి ధనాన్ని రాబట్టే అధికారం లేనందున, కాన్ఫెడరేట్ ప్రభుత్వం బాండ్ల రూపంలో ఉన్న ఈ రుణాలను ప్రజలకు చెల్లించలేకపోయింది. మరో ముఖ్య ఆర్థిక సమస్య, కరెన్సీ (ద్రవ్య) సమస్య. స్వాతంత్ర్య యుద్ధం చివరి రోజుల్లో ఏ రాష్ట్రాని కారాష్ట్రం, అడ్డు, అపు, లేకుండా, ఇష్టమొచ్చినట్లు కాగితపు నోట్లను అచ్చువేసి, విలువలేని డబ్బును సృష్టించాయి. ఫలితంగా, ఆర్థిక వ్యవహారాల్లో వెండి, బంగారం మాత్రమే ఆమోదయోగ్యాలయ్యాయి. డబ్బు కొరతవల్ల రుణాలు పుట్టక, 1784-1785 ఆర్థిక మాంద్య సంవత్సరాల్లో, వ్యవసాయదారులు చెప్పరాని కష్టాలకు గురయ్యారు. ఈ పరిస్థితులే, పైన పేర్కొన్న షేస్ తిరుగుబాటుకు దారితీశాయి.

ఇట్టి పరిస్థితుల్లో అంతర్ రాష్ట్రీయ వాణిజ్య సంబంధమైన సమస్యలను చర్చించడానికి, ప్రభుత్వం 1786 సెప్టెంబర్‌లో, అన్నాపోలిస్‌లో ఒక మహాసభను ఏర్పాటుచేసి, అన్ని రాష్ట్రాల ప్రతినిధులను ఆహ్వానించింది. ఈ ఆహ్వానాన్ని అయిదు రాష్ట్రాలు మాత్రమే అంగీకరించాయి. వాణిజ్య వ్యవహారాలనే గాక, ప్రభుత్వ స్వరూపాన్ని గురించి కూడా చర్చించడానికి, 1787లో ఫిలడెల్ఫియాలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో మరో సమావేశాన్ని ఏర్పాటుచేయడం మంచిదని, ఈ ప్రతినిధుల్లో ఒకడైన అలెగ్జాండర్ హామిల్టన్ ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదనను కాన్ఫెడరేట్ కాంగ్రెస్ ఆమోదించి, పదమూడు రాష్ట్రాలకు ఆహ్వానాలు పంపి, ఫిలడెల్ఫియా సమావేశానికి కావల్సిన ఏర్పాట్లను చేయసాగింది.

## 11.5 ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు : ధ్యేయాలు

ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు 1787 మే 25 న ప్రారంభమైంది. ఒక్క రోడ్ ఐలాండ్ తప్ప, మిగిలిన రాష్ట్రాలన్నీ ఈ పరిషత్తుకు తమ ప్రతినిధులను పంపాయి. ఈ పరిషత్ సభ్యులను, 'రాజ్యాంగ పితలు' (Founding Fathers) అని పిలిచారు. వీరిలో, నాటి మేటి నాయకులు, మేధావులు, రాజనీతిజ్ఞులు ఉండేవారు. ఈ పరిషత్తు నాలుగు నెలల్లో నూతన రాజ్యాంగాన్ని రూపొందించింది. (1787 మే 25 - 1787 సెప్టెంబర్ 7).

ఫిలడెల్ఫియా పరిషత్తు సమావేశాలకు వివిధ రాష్ట్రాలు వివిధ సమయాల్లో తమ ప్రతినిధులను పంపారు. హాజరైన మొత్తం 55 మందిలో చాలామంది, ధనిక, కులీన వర్గానికి, వర్తక వర్గానికి చెందినవారు. హాజరైన ప్రతినిధుల సరాసరి వయస్సు 42 సంవత్సరాలు. విప్లవ కాలం నాటి తీవ్ర వాదులెవ్వరూ వీరిలో లేకపోవటం, గమనించదగ్గ విషయం. రాజ్యాంగ పరిషత్తుకు జార్జి వాషింగ్టన్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారు. వర్జీనియా నుండి జేమ్స్ మాడిసన్, జార్జి మేసన్, పెన్సిల్వేనియా నుండి బెంజమిన్ ఫ్రాంక్లిన్, విల్సన్, మారిస్, డెలావేర్ నుండి జాన్ డికిన్‌సన్, న్యూయార్క్ నుండి అలెగ్జాండర్ హామిల్టన్ ఈ సభకు ప్రతినిధులుగా వచ్చారు. ఈ సభకు హాజరుకాలేని మేధావి ప్రముఖుల్లో థామస్ జెఫర్‌సన్, జాన్‌జే ఉన్నారు. వివిధ రకాలైన ప్రభుత్వాల స్వరూప సిద్ధాంతాలను గూర్చి తనకు గల విశేష చారిత్రక పరిజ్ఞానంతో, మాడిసన్ రాజ్యాంగాన్ని రూపొందించటంలో నిర్మాణాత్మకమైన పాత్ర వహించాడు.

ప్రతినిధుల్లో చాలామందికి వారి ధ్యేయాన్ని గూర్చి చాలావరకు ఏకాభిప్రాయం ఉంది. పటిష్ఠమైన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నదే, ప్రతినిధుల్లో అధికుల ముఖ్యాశయం. దేశంలో శాంతిభద్రతలను కాపాడి, రుణాలను తీర్చగలిగి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలిగి, విదేశాల్లో అమెరికా

BRAOU

గౌరవ ప్రతిష్ఠలను నిలవగలిగే ఒక కేంద్ర ప్రభుత్వాన్ని రూపొందించాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్రాల సర్వసత్తాక అధికారాన్ని నిర్మూలిస్తేకాని, పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వాన్ని రూపొందించటం సాధ్యంకాదని హామిల్టన్ వాదించాడు. కాని, రాష్ట్రాల హక్కులను కాపాడాలనే ప్రజాభిప్రాయాన్ని విస్మరిస్తే, వారి ప్రతిపాదనలు ఆమోదం పొందలేవని కూడా వారు గ్రహించారు. అందువల్ల, సర్వ సత్తాక అధికారాన్ని కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య విభజించిన ఒక సమాఖ్య విధానాన్ని (Federal System), రాజ్యాంగాన్ని, రూపొందించాల్సిన అవసరాన్ని వారు గ్రహించారు. అయితే, ఇది చాలా సున్నితమూ, క్లిష్టమూ అయిన విషయమని కూడా వారు భావించారు.

అధిక సంఖ్యాకుల పాలన (Majority rule) కు పరిమితులను ఏర్పరచాలని పరిషత్తు భావించింది. వారి అభిప్రాయంలో పరిమితులు లేని ప్రజాస్వామ్యం, ఆస్తి హక్కులకు భంగం కలిగించి, ప్రాజ్ఞనాయకత్వాన్ని అంతం చేస్తుంది. ప్రజాస్వామ్య విధానంలోని ఒడుదుడుకులను రూపు మాపాలని వారు ఆశించినారేకాని, దాని స్థానంలో అధికారవాద (Authoritarian) ప్రభుత్వాన్ని నిల్పటం, వారి ఆశయం కాదు. వివిధ ఆర్థిక ప్రయోజనాల మధ్య సమతౌల్యాన్ని సాధించాలని, దాని ద్వారా అందరి హక్కులను కాపాడటం సాధ్యమౌతుందని, మాడిసన్ తన ప్రసంగాల్లో, 'ది ఫెడరలిస్ట్' పత్రికలో రచించిన వ్యాసాల్లో, వ్యక్తం చేశాడు. ఈ నూతన రాజ్యాంగాన్ని రూపొందించటాన్ని, దాన్ని ఆమోదించటాన్ని, తీవ్రంగా ప్రతిఘటించిన వారిలో, ప్యాట్రిక్ హెన్రీ ప్రముఖుడు.

## 11.6 నూతన ప్రభుత్వ స్వరూపం : సంఘర్షిత దృక్పథాలు, రాజీలు

నూతన ప్రభుత్వ నిర్మాణాన్ని గూర్చి రాజ్యాంగ పరిషత్తు ప్రతినిధుల్లో ఏకాభిప్రాయముండింది. అందరూ అధికార పృథక్కరణ, లేక అధికార విభజన సూత్రాన్ని, (Separation of Powers) , దానికి అనుబంధమైన నిరోధసమతుల్య పద్ధతి (System of Checks and Balances) ని అంగీకరించారు. శాసన నిర్మాణ శాఖ, (Legislature), కార్యనిర్వాహక శాఖ ( Executive), న్యాయశాఖ (Judiciary), దేనికది స్వతంత్రంగా ఉండాలని, ప్రతినిధులు కోరారు. వలసల కాలంలో ఇటువంటి అధికార విభజనకు అలవాటు పడ్డారు. కాన్ఫెడరేట్ ప్రభుత్వ కాలంలో కార్యనిర్వాహకశాఖ స్వతంత్రమైందిగా, బలమైందిగా ఉండాల్సిన అవసరాన్ని అమెరికన్లు గుర్తించారు. దీనికి వీలుగా, అధ్యక్ష పదవికి, కాంగ్రెస్‌కు వేర్వేరు ఎన్నికల పద్ధతులను ప్రవేశపెట్టారు. అట్లే, న్యాయమూర్తులు వారి ప్రవర్తన సరిగా ఉన్నంత వరకు, వారి జీవిత కాలమంతా పదవులు నిర్వహించవచ్చనే సూత్రం ద్వారా, న్యాయశాఖ స్వాతంత్ర్యాన్ని అమలుపరచారు.

శాసన నిర్మాణ శాఖలో ప్రాతినిధ్యం ఏ ప్రాతిపదిక మీద ఉండాలనే విషయంలో, ప్రతినిధులు విభిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలు జనసంఖ్యను బట్టి ప్రాతినిధ్య నిర్ణయాన్ని చేయాలన్నాయి. కొద్ది జనాభా ఉన్న రాష్ట్రాలు దీనికి అక్షేపణను తెలిపాయి. ఇటువంటి ప్రాతినిధ్య నిర్ణయంవల్ల, పెద్ద రాష్ట్రాలు ఎప్పుడైనాకాని చిన్న రాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఓటు చేసి, ఆ ప్రయోజనాలను భంగపరచే అవకాశం ఉందని, చిన్న రాష్ట్రాల ప్రతినిధులు తమ భయాన్ని వ్యక్తం చేశారు. అందువల్ల, వారు, అన్ని రాష్ట్రాలకు, జనాభా ప్రసక్తి లేకుండా, సమానమైన ప్రాతినిధ్యం ఉండాలని కోరారు. పెద్ద రాష్ట్రాల తరఫున వర్జీనియా ప్రతినిధులు, తమలో ఒక ప్రతినిధి అయిన ఎడ్మండ్ రాండాల్ఫ్ (Edmund Randolph) ద్వారా, ఒక రాజ్యాంగ ప్రణాళికా ముసాయిదాను రాజ్యాంగ పరిషత్తు పరిశీలనకు సమర్పించారు. దీన్ని వర్జీనియా ప్రణాళిక, లేక రాండాల్ఫ్ ప్రణాళిక అని పిలిచారు. అట్లే చిన్న రాష్ట్రాల తరఫున, విలియం పేటర్ సన్ ద్వారా, న్యూజెర్సీ ప్రతినిధులు మరో ముసాయిదాను, పరిశీలనకు సమర్పించారు. దీన్ని న్యూజెర్సీ



BRAOU

ప్రణాళిక, లేక పేటర్‌సన్ ప్రణాళిక అని పిలిచారు. వీటి మీద చర్చలు జరిగిన తర్వాత, చివరకు కనెక్టికట్ రాష్ట్రం ఒక రాజీ మార్గాన్ని సూచించగా, దాన్ని రెండు పక్షాలు ఆమోదించాయి. ఈ రాజీ ప్రణాళిక ప్రకారం, 'కాంగ్రెస్' (శాసన నిర్మాణ శాఖ) లో, హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్' (ప్రజాప్రతినిధుల సభ), 'సెనేట్' అనే రెండు సభలు ఉంటాయి. ప్రజా ప్రతినిధుల సభలో, రాష్ట్రాల్లో జనాభాను బట్టి ప్రాతినిధ్యాన్ని నిర్ణయిస్తారు. సెనేట్‌లో ప్రతి రాష్ట్రానికి సమాన సంఖ్యలో సభ్యత్వం ఉంటుంది.

ఇట్లే ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య, మరికొన్ని వివాదాలు ఉండేవి. ఉత్తర రాష్ట్రాలకు వ్యాపారంలో ఆసక్తి మెండు; దక్షిణ రాష్ట్రాలకు వ్యవసాయంలో ఆసక్తి. జాతీయ (సమాఖ్య) ప్రభుత్వం ఉత్తర రాష్ట్రాల ప్రయోజనాల ననుసరించి నౌకా చట్టాలను జారీ చేయవచ్చని అంగీకరించింది; అట్లే, దక్షిణ రాష్ట్రాల ప్రయోజనాల ననుసరించి, ఎగుమతి సుంకాలు విధించరాదనీ, కనీసం 20 ఏళ్లు బానిసలను దిగుమతి చేసుకోవడం అనుమతించాలని అంగీకరించారు. అట్లే, నీగ్రో జనాభాను లెక్కలోకి తీసుకోవాలా లేదా అనే సమస్యపై వాదోపవాదాలు జరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లో నీగ్రో బానిసలు చాలమంది ఉన్నందువల్ల, నీగ్రో జనాభాను లెక్కలోకి తీసుకుంటే ఆరాష్ట్రాలకు ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తుంది. చివరకు, నీగ్రో బానిసల్లో 3/5 వంతును జనాభా కింద చేర్చి, లెక్కకట్టి ప్రాతినిధ్యం నిర్ణయించడానికి ఒప్పుకొన్నారు. ఇవిగాక మరికొన్ని చిన్న వివాదాలు ఉండేవి.

ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు ప్రతినిధులు రాజ్యాంగ ముసాయిదాను రూపొందించే కార్యాన్ని, 1787 సెప్టెంబర్ 17న పూర్తిచేశారు. పూర్తిచేసిన రాజ్యాంగం ప్రతినిధుల్లో ఎవ్వరికీ సంపూర్ణమైన తృప్తి నివ్వలేదు. దానికి కారణం, అది అనేక రాజీలతో రూపొందించిన రాజ్యాంగం కావడమే. " The Constitution, 'a bundle of Compromises ' " -- Prof. Farrand, **The Framing of the Constitution.** ఎడ్మండ్ రాండాల్ఫ్, మరి కొందరు ప్రతినిధులు దాని మీద సంతకాలు చేయటానికి నిరాకరించారు. 39 మంది ముసాయిదా మీద సంతకాలు చేయడానికి అంగీకరించారు. అన్ని రాష్ట్రాలు ఈ రాజ్యాంగాన్ని ధృవీకరించి ఆమోదించాలంటే, అది ఆరాజ్యాంగాన్ని విఫలం చేయడమేనని, రాజ్యాంగ పరిషత్తు భావించింది. అందువల్ల, వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఎన్నుకొన్న పరిషత్తులు నూతన రాజ్యాంగాన్ని ధృవీకరించాలనీ, ఈ విషయంలో తొమ్మిది రాష్ట్రాల ఆమోదం రాజ్యాంగాన్ని అమలు పరచడానికి చాలని, రాజ్యాంగ పరిషత్తు నిర్ణయించింది.

## 11.7 రాజ్యాంగానికి ఆమోదం

ప్రత్యేక పరిషత్తుల ద్వారా రాజ్యాంగానికి ఆమోదాన్ని తెల్పటానికై, కాంగ్రెస్ రాజ్యాంగ ముసాయిదాను రాష్ట్రాలకు పంపింది. నూతన రాజ్యాంగాన్ని రూపొందించటాన్ని మొదటి నుండీ ప్రతిఘటించిన ప్యాట్రిక్ హెన్రీ, రిచర్డ్ హెన్రీలీ మొదలైనవారు, ఈ రాజ్యాంగం కేవలం, 'పేద వారిపై ధనవంతుల నిరంకుశపాలన ఏర్పాటు చేయడానికి పన్నిన కుట్ర' అని ప్రచారం చేశారు. ప్రజలకు ఉండాల్సిన వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం మొదలైన ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో చేర్చలేదని తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని ఆమోదించటాన్ని ప్రతిఘటించి, దాన్ని విమర్శించిన వారిని 'యాంటి-ఫెడరలిస్టస్' (Anti-Federalists) అని పిలిచారు. రాజ్యాంగాన్ని సమర్థించిన వారిని 'ఫెడరలిస్టస్' (Fedaralists) అని పిలిచారు. ఫెడరలిస్ట్ వర్గంలో కీర్తిప్రతిష్టలు గడించిన నాటి మేటి నాయకులు, మేధావులు ఉండేవారు. వీరిలో వాషింగ్టన్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, హామిల్టన్, మాడిసన్, జాన్ జే మొదలైన ప్రముఖులుండేవారు. ఫెడరలిస్ట్‌లు తమ ప్రసంగాల ద్వారా, ప్రచారం ద్వారా, రచనల

ద్వారా రాజ్యాంగాన్ని ఆమోదించటానికి తగిన వాతావరణాన్ని, సదభిప్రాయాన్ని సృష్టించారు. వీరు నూతన రాజ్యాంగాన్ని సమర్థిస్తూ రచించిన రచనలన్నీ, 'ది ఫెడరలిస్ట్' (The Fedaralist) అనే గ్రంథంగా వెలువడ్డాయి. రాజ్యాంగ స్వరూపం మీద చర్చతో రూపొందిన ఈ ఫెడరలిస్ట్, ఫెడరలిస్ట్ వ్యతిరేక వర్గాలు, రాజ్యాంగాన్ని నిర్ణయించటమేగాక, చరిత్రకారుడు ప్యారింగ్టన్ పేర్కొన్నట్లు, కాలక్రమంలో గణతంత్ర రాజ్యాంగ విధానం కొనసాగడానికి అవసరమైన రాజకీయ పక్షాలుగా రూపొందాయి. ['From the strident debate emerged not only the Constitution, but political parties, no longer to be spoken of as factions, but eventually to be accepted as necessary agencies in republican government' -- Vernon L. Parrington, **Main Currents of American thought.]**

1787 డిశంబర్‌లో డెలావేర్ మొదటగా రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1788 జూలై నాటికి, ఉత్తర కెరోలినా, రోడ్ ఐలాండ్ తప్ప, మిగిలిన రాష్ట్రాలు పది, అంటే మొత్తం పదకొండు రాష్ట్రాలు, తమ ఆమోదాన్ని తెలిపాయి. తర్వాత, రాజ్యాంగం ఎట్లాగైనా అమల్లోకి వస్తుంది కాబట్టి, ఉత్తర కెరోలినా, రోడ్‌ఐలాండ్ కూడా తమ ఆమోదాన్ని తెలిపాయి. వీటిలో ఐదు రాష్ట్రాలు, రాజ్యాంగానికి సవరణల రూపంలో ప్రాథమిక హక్కులను (Bill of Rights) చేర్చే ఒప్పందం మీద రాజ్యాంగాన్ని ఆమోదించాయి. మూల రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరచక పోవటం, తీవ్ర లోపం. అది, రాజ్యాంగ నిర్మాతల్లో అధిక సంఖ్యలో ఉన్న కులీన, ధనిక వర్గాల వారి మనస్తత్వాన్ని, వారికి ప్రజల హక్కుల యెడగల నిరాసక్తతను ప్రతిబింబిస్తుంది. ఐదు రాష్ట్రాలు కోరిన ప్రకారం, 1791 లో రాజ్యాంగానికి చేసిన మొదటి పది సవరణల్లో మొదటి తొమ్మిది ద్వారా, మత స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, వాక్‌స్వాతంత్ర్యం మొదలైన ప్రాథమిక హక్కులను, రాజ్యాంగంలో రూపొందించారు. పదో సవరణ, రాజ్యాంగం పేర్కొనని అవశేషాధికారాలన్నీ రాష్ట్రాలకు చెందుతాయని చెప్పి, రాజ్యాంగ జాతీయ స్వభావాని (Nationalism) కన్నా, సమాఖ్య స్వభావాన్ని (Federalism) ఎక్కువగా స్పష్టం చేసింది.

BRAOU

## 11.8 అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం : ప్రధాన లక్షణాలు

ప్రభుత్వ సంవిధానాన్ని తెలిపేది రాజ్యాంగం. 13 రాష్ట్రాలు స్వాతంత్ర్య యుద్ధ కాలంలో తాత్కాలికంగా కాన్ఫెడరేట్ రాజ్యాంగం ద్వారా ఏర్పరచుకొన్న మైత్రీకూటమిని శాశ్వతం చేసి, దాన్ని బలపరచే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించటమే, రాజ్యాంగ పితల (Founding Fathers) ధ్యేయం. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగంలోని ప్రధానాంశాలను, వాటిలోని కొన్ని ప్రత్యేకతలను, ఈ క్రింద క్లుప్తంగా సమీక్షిస్తాం.

### 11.8.1 లిఖిత రాజ్యాంగం

మొట్టమొదటగా, అమెరికన్ రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం. బ్రిటీష్ రాజ్యాంగం అలిఖిత రాజ్యాంగం; లిఖిత చట్టాలు, అలిఖిత సంప్రదాయాలు అన్నీ బ్రిటీష్ రాజ్యాంగంలో చేరి ఉంటాయి. అమెరికన్ రాజ్యాంగంలో, రాజ్య సంవిధానానికి సంబంధించిన అన్ని అంశాలు, వీలైనంత స్పష్టంగా, ఒకే గ్రంథంలో చేర్చారు. అయినప్పటికీ, అమెరికన్ రాజ్యాంగంలోని వివిధాంశాలను సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులు వివిధంగా వ్యాఖ్యానించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

## 11.8.2 సమాఖ్య రాజ్యాంగం

అమెరికన్ రాజ్యాంగం 'ఫెడరల్' లేక సమాఖ్య రాజ్యాంగం. రాష్ట్రాలు తమ అధికారాలను చాలా పరిమితంగా మాత్రమే కేంద్రానికి దత్తం చేయడానికి ఇచ్చగించాయి. అ. సం. రాష్ట్రాల్లో రాష్ట్రాలు తమ ఆమోదం మీద జాతి పరిరక్షణ కోసం తమకున్న అధికారాల్లో కొన్ని కేంద్రానికి దత్తం చేసి, సమాఖ్య ప్రభుత్వాన్ని రూపొందించాయి. భారత రాజ్యాంగం రూపొందించిన సమాఖ్య, దీని కంటే విభిన్నమైంది. ఇక్కడ కేంద్రం రాష్ట్రాలను సృష్టించి, వాటికి కొన్ని అధికారాలను అప్పచెప్పింది. ఈ రెంటికీ భేదం ఒక్క విషయంలో అర్థమౌతుంది. భారత రాజ్యాంగం ప్రకారం, దానిలో చెప్పక శేషించిన అదికారాలన్నీ కేంద్రానికి చెందుతాయి. అమెరికన్ రాజ్యాంగం (1791, 10వ సవరణ) ప్రకారం, రాజ్యాంగంలో పేర్కొనని అవశేషాధికారాలన్నీ రాష్ట్రాలకు చెందుతాయి.

అమెరికన్ రాజ్యాంగ ప్రవేశిక (Preamble) ఆ రాజ్యాంగ ధ్యేయం, 'ఇంకా పరిపూర్ణమైన సమాఖ్యను ఏర్పరచటం' ('to form a more perfect union') అని పేర్కొనింది.

## 11.8.3 సమాఖ్య ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య అధికార విభజన

అ.సం.రాష్ట్రాల రాజ్యాంగంలో మిక్కిలిగా గమనించదగ్గ లక్షణం, సమాఖ్య ప్రభుత్వానికి, రాష్ట్రాలకు మధ్య చేసిన అధికార విభజన. దాని అధికార పరిధిలో సమాఖ్య ప్రభుత్వానికి సార్వభౌమాధికారం ఉంటుంది. దేశ ప్రజలపై కేంద్రానికి సర్వంసహాధికారం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ శాసనాలకు, ఒడంబడికలకు, అన్ని న్యాయస్థానాలు, రాష్ట్రోద్యోగులు బద్ధులై ఉండాలి. కేంద్ర ప్రభుత్వ చట్టాల ఉల్లంఘన జరిగితే, దానికి రాష్ట్రాల్లోని అధికారులు వ్యక్తిగతంగా బాధ్యులు ఔతారు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని అమలు జరిపేటందుకు, కేంద్రం, రాష్ట్ర సైన్యాల (State Militia) సహాయాన్ని పొందవచ్చు. దీన్నిబట్టే, అమెరికన్ యూనియన్ (సమాఖ్య) కేవలం కొన్ని రాష్ట్రాల కూటమి మాత్రమే కాదని స్పష్టమౌతుంది. వివిధ రాష్ట్రాల్లోని న్యాయస్థానాలు కేంద్ర శాసనాలను అనుసరించి, తీర్పులు చెప్పాలి. రాష్ట్ర రాజ్యాంగం కాని, శాసనాలు కాని, వాటికి భిన్నంగా ఉన్నప్పుడు, కేంద్ర శాసనాలే చెల్లుతాయి. అంతర్‌రాష్ట్రీయ, విదేశ వాణిజ్య వ్యాపారాలను క్రమబద్ధం చేసి, పన్నులు విధించటానికి, కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే అధికారం ఉంది. దేశ రక్షణ, విదేశ వ్యవహారాల శాఖలను, సమాఖ్య ప్రభుత్వం నిర్వహిస్తుంది. దాని అధికారాన్ని అమలుపరచటానికి వీలుగా, చట్టాలు చేయటానికి సమాఖ్య ప్రభుత్వానికి అధికారం ఉన్నందువల్ల, తర్వాతి తరాల్లో ఉత్పన్నమయ్యే అవసరాలను, సమస్యలను ఎదుర్కోటానికి తగిన చట్టాలను చేయడానికి, దానికి వీలు ఔతుంది.

రాజ్యాంగం మొదటి ప్రకరణంలోని పదో భాగం (Article I Section 10) సమాఖ్య అధికారాన్ని కాని, జాతీయ ఐక్యతను కాని భంగపరచే విధంగా, రాష్ట్ర ప్రభుత్వాలు చేయకూడని విషయాలను గూర్చిన నిబంధనలను, పేర్కొంటుంది. ఉదాహరణకు, రాష్ట్రాలు సొంత నాణేలను, నోట్లను జారీ చేయరాదు. ఒప్పందాలను (Contracts) భంగపరచే ఏ చట్టాలను చేయరాదు. రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల ఉత్పత్తులపై పన్ను విధించరాదు. కాని, ఈ నిబంధనలవల్ల, రాష్ట్రాలు ఫెడరల్ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మలు కాలేదు. రాష్ట్రాలకు కాంగ్రెస్‌లో ప్రాతినిధ్యం ఉంది కనక, ఫెడరల్ ప్రభుత్వం చేసే శాసనాలను ఆమోదించడంలోను, నిరాకరించడంలోను, తమ శక్తిని ఉపయోగించుకోవచ్చు. పైగా, పౌరుల ప్రాణాలకు, ఆస్తిపాస్తులకు రక్షణ కల్పించటం, వ్యాపారాలకు, రాష్ట్ర బ్యాంకులకు లైసెన్స్‌లు ఇచ్చి, వాటిని అదుపులో ఉంచటం, వివాహాలకు, విడాకులకు సంబంధించిన శాసనాలను చేయటం, ప్రాథమిక విద్యాబోధనకు ఏర్పాట్లు చేయడం, రోడ్లు రహదార్లను నిర్మించటం, మొదలైన అనేకానేక స్థానికావసర విషయాలు, రాష్ట్ర ప్రభుత్వాల అధికార పరిధిలో ఉన్నాయి.

BRAOU

### 11.8.4 కాంగ్రెస్

శాసన నిర్మాణాధికారం కాంగ్రెస్‌కు ఉంది. కాంగ్రెస్‌లో రెండు సభలున్నాయి. ఎగువ సభను 'సెనేట్' అని పిలిచారు. చిన్న రాష్ట్రమైనా, పెద్ద రాష్ట్రమైనా, సెనేట్‌లో రాష్ట్రానికి ఇద్దరు సెనేటర్‌లు ఉంటారు. సెనేటర్‌లను రాష్ట్ర శాసన సభలు ఎన్నుకొంటాయి. ప్రతి సెనేటర్‌కు ఒక ఓటు ఉంటుంది. సెనేటర్ల పదవీకాలం ఆరేండ్లు. దిగువ సభను 'హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్' (House of Representatives, ప్రతినిధుల సభ) అని పిలిచారు. రెప్రెజెంటేటివ్స్ (ప్రతినిధుల)ను, రాష్ట్ర జనాభా నిష్పత్తిలో, ప్రజలే ఎన్నుకొంటారు. కాంగ్రెస్ ఉభయ సభల సభ్యుల జీతాలన్నీ, ఫెడరల్ ప్రభుత్వమే భరిస్తుంది. రాష్ట్రాలకు ఈ ఖర్చుతో నిమిత్తం లేదు. ఈ ఏర్పాటు కూడా, కేంద్ర ప్రభుత్వాన్ని పటిష్టపరచేందుకు ఉద్దేశించిందే. రెండేళ్ల కొకసారి సెనేట్ సభ్యుల్లో మూడో వంతు స్థానాలకు, ఎన్నిక జరుగుతుంది. దీనివల్ల, అనుభవజ్ఞులైన సభ్యులు ఎప్పుడూ సెనేట్‌లో ఉంటారు. పరోక్ష ఎన్నికల వల్ల, దీర్ఘకాల సభ్యత్వంవల్ల, 'సెనేట్' కు 'హౌస్' కంటె ఎక్కువ అధికార ప్రాబల్యముంటుంది.

### 11.8.5 అధ్యక్షుడు

కార్యనిర్వాహక శాఖకు అధినేత, అధ్యక్షుడు (President). అతనిని నాలుగేండ్ల పదవీ కాలానికి ఎన్నుకొంటారు. పదవీ కాలం ముగిసిన తర్వాత, అదే వ్యక్తి మరలా ఆ పదవికి పోటీ చేయవచ్చు. రాజ్యాంగం కింద మొదటి అధ్యక్షుడుగా ఎన్నికైన జార్జి వాషింగ్టన్, రెండు సార్లు మాత్రమే పోటీకి నిలిచిన తర్వాత, ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ ఎన్నిక (1933) వరకు, ఒక సంప్రదాయంగా ప్రతి అధ్యక్షుడు రెండు సార్లే పోటీకి నిలవడం జరిగింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అధ్యక్షుడుగా ఉన్న ఎఫ్. డి. రూజ్వెల్ట్ నాలుగు సార్లు పోటీచేసి, 1933 నుండి 1945 వరకు అధ్యక్షుడుగా ఉన్నాడు. 1951 లో రాజ్యాంగ సవరణ ద్వారా, ఎవరుకాని రెండు సార్లకు పైగా అధ్యక్ష పదవికి పోటీ చేయకూడదని నిర్దేశించారు. ప్రతి రాష్ట్రంలోని శాసన సభ, నియోజక గణానికి (Electroal College) సభ్యుల నెన్నుకోవటానికి ఏర్పాట్లుచేస్తుంది. ప్రతి రాష్ట్రానికి చెందిన మొత్తం ఎంతమంది ప్రతినిధులు కాంగ్రెస్‌లో ఉన్నారో, అంతమందిని నియోజకగణ సభ్యులుగా ఎన్నుకొంటారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులకు, నియోజక గణ సభ్యులు ఓట్లు వేస్తారు. ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తే, అతనిని అధ్యక్షునిగా, తర్వాతి హెచ్చు సంఖ్య ఓట్లుగల అభ్యర్థిని, ఉపాధ్యక్షునిగా ప్రకటిస్తారు. 1804 లో 12 వ సవరణ ద్వారా ఈ ఎన్నిక విధానాన్ని మార్చి, ప్రెసిడెంట్‌కు, వైస్ ప్రెసిడెంట్‌కు వేర్వేరుగా ఓట్లు వేసి, ఎన్నుకొనే పద్ధతిని ప్రవేశపెట్టారు. [అమెరికన్ రాజ్యాంగంలో రాజకీయ పార్టీల ప్రసక్తిలేదు. రాజకీయ పార్టీలు దేశ క్షేమానికి దోహదం చేయవని, రాజ్యాంగ పితలు భావించారు. కాని, కాలక్రమంలో, పైన పేర్కొన్నట్లు, కొన్ని రాజకీయ వర్గాలే, రాజకీయ పక్షాలుగా రూపొందాయి.] అధిక సంఖ్యాక పాలనను (Majority rule) అదుపులో పెట్టటానికై ఒక మార్గంగా, రాజ్యాంగ నిర్మాతలు సెనేట్ ఎన్నికకు, కార్యనిర్వాహక శాఖ అధినేతైన అధ్యక్షుని ఎన్నికకు, పరోక్ష ఎన్నిక పద్ధతిని అవలంబించారు.

కాంగ్రెస్ ఆమోదించిన శాసనాలను సక్రమంగా అమలు జరపటం, అధ్యక్షుని ప్రథమ కర్తవ్యం. అధ్యక్షుడు సైన్యానికి, నౌకాదళానికి సర్వసైన్యాధికారి ("Commander-in-chief of the army and navy"). అవసరమనుకొన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉండే మిలీషియా దళాన్ని కూడా, అధ్యక్షుడు తన అధికారం కిందికి తెచ్చుకోవచ్చు (Article II Section 4). కాంగ్రెస్ ఆమోదించిన ప్రతి

BRAOU

చట్టం, అధ్యక్షుని ఆమోదానికి వెళ్లుతుంది. అతడు ఆమోదించి, సంతకం చేసిన తర్వాతనే, అది శాసనంగా అమలుకువస్తుంది. అధ్యక్షుడు ఆమోదించ దలచని చట్టాలను, వాటిలోని విషయాన్ని, పునరాలోచించాల్సిందిగా కాంగ్రెస్‌కు తిప్పి పంపవచ్చు. అప్పుడు కాంగ్రెస్ 2/3 ఓట్ల మెజారిటీతో దాన్ని తిరిగి ఆమోదిస్తే, అధ్యక్షుని సంతకం అవసరంలేకుండా అది శాసనం ఔతుంది. అధ్యక్షుడు దేశ స్థితిని గురించి కాంగ్రెస్‌కు సందేశాలు పంపుతూ ఉండాలనీ, తాను అవసరమనీ, ఆవశ్యకమనీ భావించిన చర్యలను, కాంగ్రెస్‌కు సిఫార్స్ చేయాలనీ, రాజ్యాంగం నిర్దేశిస్తుంది. ఈ నిబంధనల నుండే, ప్రతి సంవత్సరం అధ్యక్షుడు దేశ స్థితిని గురించి కాంగ్రెస్‌కు సందేశం పంపించే సంప్రదాయం ఏర్పడింది.

విదేశాలతో సంధులు చేసుకోడానికి గల అధికారం ద్వారా, రాజ్యాంగం అధ్యక్షునికి విదేశాంగ నీతిని నిర్దేశించే అధికారాన్నిచ్చింది. అట్లే, విదేశాంగ మంత్రి (కార్యదర్శి)ని, విదేశాల్లో అమెరికా రాయబారులను, మంత్రులను, సుప్రీం కోర్ట్ న్యాయాధిపతులను, అనేక ఉన్నతోద్యోగాలకు అభ్యర్థులను నియమించే అధికారం అధ్యక్షునికి ఇచ్చి, అతనికి అధికార యంత్రాంగం లోని వివిధ శాఖల మీద ఎనలేని అధికారాన్ని రాజ్యాంగం ఇచ్చింది. సంధులను, అధ్యక్షుడు చేసే అధికార నియామకాలను, సెనేట్ ఆమోదించాల్సి ఉంది. అయినప్పటికీ, ఈ విషయాల్లో అధ్యక్షునికే ఎక్కువ చొరవ ఉంటుంది. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారాన్ని సమతూకంలో ఉంచాలనే రాజ్యాంగ నిర్మాతల ఆలోచనకు అనుగుణంగా, ఈ విధమైన అధికార పరిమితుల ఏర్పాటు జరిగింది. అమెరికన్ రాజ్యాంగం కాంగ్రెస్‌కు ఒక విశిష్టమైన అధికారాన్ని ఇచ్చింది. అధ్యక్షుడు లంచగొండితనం, దేశద్రోహం, లేదా ఇతర అపరాధాలకు, దుష్ప్రవర్తనలకు పాల్పడినపుడు, అతనిపై మహాభియోగం (Impeachment) ద్వారా, కాంగ్రెస్ అతనిని పదవిలో నుండి తొలగించవచ్చు.

BRAOU

## 11.8.6 ప్రధాన న్యాయస్థానం (Supreme Court)

న్యాయాధికారమంతా సుప్రీం కోర్ట్‌లో నిక్షిప్తమై ఉంటుంది (Article III). న్యాయమూర్తులు వారి ప్రవర్తన సరిగా ఉన్నంతకాలం (అంటే జీవితాంతం), పదవిలో కొనసాగుతారు; ఇది, వారు తమ తీర్పుల్లో స్వతంత్రంగా, నిర్భయంగా వ్యవహరించటానికి అవకాశమిస్తుంది. జాతీయ, అంతర్ రాష్ట్రీయ వివాదాల విషయంలో, సుప్రీం కోర్ట్ తీర్పులను చెబుతుంది. ఈ తీర్పులు తిరుగులేని తుది నిర్ణయాలు. ఒక్క మహాభియోగానికి (Impeachment) తప్ప, మిగిలిన అన్ని నేరాలకు జ్యూరీ విచారణ ఉంటుంది. కాంగ్రెస్ నెలకొల్పే ఇతర న్యాయస్థానాలు కూడా, సుప్రీం కోర్ట్ న్యాయవిచారణాధికార పరిధిలోకి వస్తాయి. న్యాయశాఖ విషయంలో కూడా, నిరోధ సమతౌల్య పద్ధతిని అనుసరించారు. సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులుకాని, కింది కోర్టుల న్యాయమూర్తులుకాని, అవినీతితో ప్రవర్తించినప్పుడు, వారిని శిక్షించడానికి రాజ్యాంగంలో అవకాశముంది. అధ్యక్షుడు సెనేట్ ఆమోదంతో, సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను నియమిస్తాడు.

## 11.8.7 ప్రత్యేక అంశాలు

అధ్యక్షుని మంత్రివర్గ (Cabinet) మని పేర్కొన్న అతని కార్యదర్శులు (Secretaries), కాంగ్రెస్‌లో కూర్చోడానికి వీలులేదు. అధ్యక్ష పదవికి ప్రతి నాలుగేండ్లకు, 'హౌస్' కు ప్రతి రెండేండ్లకు ఎన్నికలు జరిపినందువల్ల, అధ్యక్షుడు ఒక పార్టీకి చెందినవాడై, 'హౌస్'లో మెజారిటీ సభ్యులు మరో పార్టీకి చెందినవారై ఉండవచ్చు. పన్నుల విషయంలో తనకున్న అధికారాన్ని ఉపయోగించి, కాంగ్రెస్,

ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావచ్చు. కాంగ్రెస్ లోని రెండు సభల మధ్య తగాదాలు ఉత్పన్నమైతే, వాటిని పరిష్కరించటానికి రాజ్యాంగంలో వీలు కల్పించలేదు. అధ్యక్షునికి, సెనేట్‌కు మధ్య భేదాభిప్రాయాలు వస్తే, విపత్కర పరిణామాలు వచ్చే అవకాశముంది. అ. సం. రాష్ట్రాల చరిత్రలో సెనేట్ అనేక సంధులను నిరాకరించింది.

కాలక్రమంలో ఏర్పడ్డ రాజకీయ పరిణామాలవల్ల, రాజ్యాంగంలోని అనేక అంశాలు రాజ్యాంగ నిర్మాతలు అనుకొన్న విధంగా ఆచరణలోకి రాలేదు. అధ్యక్షుని ఎన్నిక విషయంలో నియోజక గణ (Electoral College) సభ్యులు తమ బుద్ధికి యోగ్యమని తోచిన రీతిగా వ్యవహరిస్తారని, రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. కాని, ఇంచు మించు మొదటి నుండి కూడా, వాళ్లు రాజకీయ వేత్తల ఆదేశాల ప్రకారం నడచుకోసాగారు. రాజ్యాంగ నిర్మాతలు అనుకోని విధంగా, ఫెడరలిస్టులు, ఫెడరలిస్ట్ వ్యతిరేకులైన రాజకీయ వర్గాలు, 1796 నాటికి రాజకీయ పక్షాలుగా రూపొందాయి. ఆ పార్టీలకు అనుబంధంగా, రాజకీయవాదులు ఏర్పడ్డారు. ఫలితంగా, ఎన్నికల్లో మొదట్లో రాష్ట్రాల విభజనకుగల ప్రాముఖ్యం లేకుండా పోయింది. అట్లే, సంధులను ఏర్పరచుకోవటం, విదేశాంగ నీతిలోని అవసరాలు, ఆచరణలో పూర్తిగా అధ్యక్షుని (కార్యనిర్వాహకశాఖ) బాధ్యతగా మారాయి.

## 11.9 రాజ్యాంగ స్వభావం : విమర్శ

ఫిలడెల్ఫియా పరిషత్తులో రాజ్యాంగ పితలు రూపొందించిన రాజ్యాంగ స్వభావాన్ని గూర్చి, చరిత్ర కారులు విభిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలో ప్రవచించిన ప్రజాస్వామిక ఆశయాలను, సిద్ధాంతాలను, 1787 రాజ్యాంగం ఎంతవరకు పునరుద్ఘాటించింది, లేదా ఎంతవరకు వాటిని నిరాకరించిందనేది, ఆ రాజ్యాంగ స్వభావానికి సంబంధించిన ప్రధాన చర్చనీయాంశం.

రాజ్యాంగం ధనిక, కులీన వర్గాలు తమ ప్రయోజనాలను సాధించుకోవటానికి రూపొందించబడిందేకాని, సామాన్య ప్రజల ప్రయోజనాలను, ప్రజాస్వామ్య ఆశయాలను సాధించటానికిగాను చేసింది కాదని, జాన్ సి. మిల్లర్, మెరిల్ జెన్‌సన్, ఛార్లెస్ ఎ. బియర్డ్ మొదలైన చరిత్రకారులు భావించారు. ఛార్లెస్ బియర్డ్ రాజ్యాంగ నిర్మాతల ఆర్థిక నేపథ్యాన్ని విశ్లేషించి, రాజ్యాంగ పరిషత్తుకు హాజరైన 55 మంది సభ్యుల్లో 40 మందికి తగ్గకుండా, స్వకీయ ఆర్థిక ప్రయోజనాలు ఉన్నవారుగా లెక్కగట్టాడు. వీరు ప్రభుత్వ సెక్యూరిటీల్లో తమ ధనాన్ని మదుపు పెట్టినవారు. చట్టా వ్యాపారస్తులు, పెద్ద మొత్తాల్లో రుణాలు ఇచ్చినవారు, వ్యాపారస్తులు, బానిస యజమానులై ఉన్నారు. రాజ్యాంగం వీరి ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోవటానికి, వాటిని రక్షించుకోవటానికి రూపొందించబడిందేనని, ఛార్లెస్ బియర్డ్ అభిప్రాయం. కాని, ఎడ్వర్డ్. యస్. కార్విన్, ఛార్లెస్ వారెన్ మొదలగు రచయితలు, బియర్డ్ ఆర్థిక విశ్లేషణను నిరాకరించారు. పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరుచుకోవాలనే ఉద్దేశం, 1787కు ముందే చాలా కాలం నుండి అమెరికన్లకు ఉండిందని, అందువల్ల రాజ్యాంగ నిర్మాతలు వారి సొంత ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోవటానికి రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పటం భావ్యం కాదని, వీరు చెప్పారు. రాల్ఫ్ బార్టన్ పెర్రీ, ఎ.సి. మెక్‌లాఫ్లిన్‌లు కూడా, తమ రచనల్లో రాజ్యాంగం చాలావరకు స్వాతంత్ర్య ప్రకటనలో ప్రవచించిన ప్రజాస్వామ్య ఆశయాలను, సిద్ధాంతాలను, ప్రవచించిందని భావించారు.

కాని, మొత్తం మీద, రాజ్యాంగ పితలు (Founding Fathers) రాజ్యాంగాన్ని నిర్మించటంలో చాలావరకు కృతకృత్యులయ్యారు. అది, నాటి నుండి నేటివరకు, రెండు వందల ఏండ్లలో, కాలం



BRAOU

తెచ్చిన మార్పులకు తట్టుకొని, శాశ్వతత్వాన్ని సమకూర్చుకొంది. దీనికి కారణం, రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగంలో సారభూతమైన మౌలిక విషయాలను మాత్రం ప్రస్తావించి, కాలానుగుణమైన మార్పులకు, అభివృద్ధికి, అవకాసమేర్పరచారు. ["To call into being a Constitutional system which has lasted for over a century, a system which has withstood perplexing diversities and conflicting sectional interests, the development of democracy, the increase of population from four million to thirty times that number, is a notable achievement" – A. C. Mclaughlin, **A Constitutional History of the United States** (1935), P. 197.]

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అత్యున్నత చట్టం, అమెరికన్ రాజ్యాంగం.

## 11.10 సంగ్రహంగా

1. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఏర్పడ్డ మొదటి కేంద్ర ప్రభుత్వాన్ని, కాన్ఫెడరేట్ (సమ్మేళనా) ప్రభుత్వమని పిలిచారు. ఇది, 1777 లో జాన్ డికెన్‌సన్ రచించిన కాన్ఫెడరేట్ రాజ్యాంగ సూత్రాలాధారంగా ఏర్పడింది. ఇది సాధించిన విజయాల్లో, 1785, 1787 భూ చట్టాలు పేర్కోదగ్గవి. కాని, ఇది సమర్థవంతంగా విదేశ వ్యవహారాల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించలేక పోయింది. అట్లే, కొన్ని ఆంతరంగిక సమస్యలను కూడా పరిష్కరించలేక పోయింది. షేస్ తిరుగుబాటు, దేశ శాంతి భద్రతలను రక్షించే విషయంలో, ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమైంది. ఈ తిరుగుబాటు, శాంతి భద్రతలను రక్షించటానికి పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వ అవసరాన్ని, అమెరికన్లలో దాదాపు అన్ని వర్గాల ప్రజలకు స్పష్టంచేసింది.

2. షేస్ తిరుగుబాటు పర్యవసానంగా, జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి ప్రచారం, ప్రయత్నాలు జరిగి, ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు ఏర్పడింది. అ. సం. రాష్ట్రాల రాజ్యాల రూపకల్పనలో, అది అనేక సమస్యలను ఎదుర్కొనింది. వీటిని అధిగమించి, విభిన్న దృక్పథాలను సమన్వయించి, రాజ్యాంగ పరిషత్తు అ. సం. రాష్ట్రాల రాజ్యాంగాన్ని నిర్మించటంలో కృతకృత్యమైంది. (1787)

3. ఫిలడెల్ఫియా పరిషత్తులో, రాజ్యాంగ పితలు రూపొందించిన 1787 రాజ్యాంగం, అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలో ప్రవచించిన ప్రజాస్వామిక ఆశయాలను, సిద్ధాంతాలను ఎంతవరకు పునరుద్ఘాటించింది, లేదా ఎంతవరకు వాటిని నిరాకరించిందనేది, ఆరాజ్యాంగ స్వభావానికి సంబంధించిన ప్రధాన చర్చనీయాంశం. రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగంలో సారభూతమైన మౌలిక విషయాలను మాత్రం ప్రస్తావించి, కాలానుగుణమైన మార్పులకు, అభివృద్ధికి, అవకాశమేర్పరచారు.

## 11.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. కాన్ఫెడరేట్ ప్రభుత్వ విజయాలు, వైఫల్యాలను విశ్లేషించండి.

2. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ ప్రధాన లక్షణాలను తెల్పండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. వలసలన్నింటికీ కలిపి, ఒకే ప్రభుత్వ ఏర్పాటుకు జరిగిన ప్రయత్నాలెవ్వి?
2. ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రూపకల్పనలో ఎదుర్కొన్న సమస్యలను సమీక్షించండి.
3. షేస్ తిరుగుబాటును గురించి నీకు తెలిసినదేమి?
4. జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి జరిగిన ప్రచార, ప్రయత్నాలను తెల్పండి.
5. అమెరికన్ రాజ్యాంగ స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

## 11.12 ఉపయుక్త గ్రంథాలు


Bernett E. C. : **The Continental Congress, 1941**

Jensen M : **The Articles of Confederation, 1940**

Jensen M : **The New Nation : A History of the United States during the Confederation, 1781-1789, 1950**

Bancroft G : **History of the Formation of the Constitution.**

Beard C. A. : **An Economic Interpretation of the Constitution**

Farrand, Max : **Framing of the Constitution and What It Means Today, 1913**

Hackett H.C. : **The Constitutional History of the United States, 1776-1826**

Mclaughlin A. C : **A Constitutional History of the United States, 1935**

Schyuler R. L. : **The Constitution of the United States, 1923**

Warren C : **The Making of the Constitution, 1929; Reprint 1947**


BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

పాఠ్యప్రణాళిక

**కోర్స్ - 3 :** ఆధునిక విప్లవాలు

**ఖండం - I : తొలి స్టూవర్ట్‌లు, ప్యూరిటన్ విప్లవం, తదనంతర పరిణామాలు (1603-1688)**

భాగం - 1 : స్టూవర్ట్‌లు : ఒకటో జేమ్స్, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు

భాగం - 2 : ఒకటో ఛార్లెస్ : దీర్ఘకాలిక పార్లమెంట్

భాగం - 3 : అంతర్యుద్ధం : కామన్‌వెల్త్ సంరక్షక రాజ్యం

భాగం - 4 : రెండో ఛార్లెస్, పార్లమెంట్ సంబంధాలు

**ఖండం - II : మహోజ్వల విప్లవం, 1688**

భాగం - 5 : రెండో జేమ్స్ పాలనా విధానాలు

భాగం - 6 : పార్లమెంట్ పాత్ర : విలియం, మేరీల పాలన (1688-1702)

భాగం - 7 : హక్కుల చట్టం : మహోజ్వల విప్లవ ఫలితాలు

**ఖండం - III : అమెరికా స్వాతంత్ర్య సమరం**

భాగం - 8 : వలసలు

భాగం - 9 : అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ కారణాలు

భాగం - 10 : అమెరికా స్వాతంత్ర్య ప్రకటన : ఫలితాలు

భాగం - 11 : రాజ్యాంగ నిర్మాణం

**ఖండం - IV : ఫ్రెంచి విప్లవం (1789-1799)**

భాగం - 12 : ఫ్రాన్స్‌లో విప్లవ పూర్వరంగం

భాగం - 13 : ఫ్రెంచి విప్లవ కారణాలు

BRAOU

భాగం - 14 : జాతీయ సభ : కార్యకలాపాలు

భాగం - 15 : జాతీయ కన్వెన్షన్

భాగం - 16 : నెపోలియన్ బోనాపార్ట్ : విజృంభణ, పతనం

భాగం - 17 : ఫ్రెంచి విప్లవ ఫలితాలు

**ఖండం - V : రష్యన్ విప్లవం (1917)**

భాగం - 18 : జార్ చక్రవర్తుల పరిపాలనలో రష్యా

భాగం - 19 : రష్యన్ విప్లవ కారణాలు

భాగం - 20 : 1917 విప్లవ గమనం

భాగం - 21 : రష్యన్ విప్లవ ప్రాధాన్యత

**ఖండం - VI : చైనా విప్లవం (1911-1949)**

భాగం - 22 : అంతర్యుద్ధకాలం నాటి చైనా పరిస్థితులు

భాగం - 23 : కొమింగ్‌టాంగ్ - కమ్యూనిస్ట్ ఘర్షణ

భాగం - 24 : కమ్యూనిస్ట్ విజయం : కారణాలు, ఫలితాలు, ప్రాముఖ్యత

**ఖండం - VII: వియత్నాం విప్లవం (1946-1975)**

భాగం - 25 : వియత్నాం : ఫ్రెంచి సామ్రాజ్యవాద విముక్తి పోరాటం (1946-1954)

భాగం - 26 : ఐక్య వియత్నాంకై పోరాటం : క్రమం, ఫలితాలు, ప్రాముఖ్యత (1961-1975)

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

మాదిరి పరీక్షా పత్రం

కోర్స్ - 3 : ఆధునిక విప్లవాలు

సమయం : 3 గంటలు

మార్కులు 100

భాగం - A

4 x 15= 60

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. స్టూవర్ట్ రాజుల రాజకీయ సిద్ధాంతాలను విశ్లేషించండి.

లేదా

ఒకటో జేమ్స్, ఆయన పార్లమెంట్ మధ్య నెలకొన్న సంబంధాలు, వాటి రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించండి.

2. అంతర్యుద్ధానికి ముందు, దీర్ఘకాలిక పార్లమెంట్ కార్యకలాపాల రాజ్యాంగ ప్రాముఖ్యతను తెల్పుతూ, అవి అంతర్యుద్ధానికి ఎంతవరకు దోహదమైనాయో పరిశీలించండి.

లేదా

అంతర్యుద్ధానంతరం ఆలివర్ క్రాంవెల్ ఇంగ్లాండ్‌లో స్థాపించిన కామన్వెల్త్ రాజ్యాంగ ప్రాముఖ్యతను చర్చించండి.

3. మహోజ్వల విప్లవానికి దారితీసిన పరిణామాలను పేర్కొనండి.

లేదా

హక్కుల చట్టంలోని ప్రధాన అంశాలను తెల్పి, అవి దేశ చరిత్రలో ఎట్టి మార్పులకు దారితీశాయో పరిశీలించండి.

4. ఉత్తర అమెరికా ఖండంలో వలసలను స్థాపించడంలో ఆంగ్లేయులు అనుసరించిన విధానాలను పరిశీలించండి.

లేదా

అమెరికా సంయుక్తరాష్ట్రాల రాజ్యాంగ ప్రధాన లక్షణాలను తెల్పండి.

భాగం - B

5 x 8=40

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

5. తుపాకి మందు కుట్ర (Gun powder plot) అంటే ఏమిటి?

లేదా

BRAOU

హక్కుల పత్రం (Petition of Right) అంశాలు, రాజ్యాంగ ప్రాముఖ్యతను తెల్పండి.

6. రంప్ పార్లమెంట్ కార్యక్రమాలను విశ్లేషించండి.

లేదా

రాజరిక పునరుద్ధరణ స్వభావం, రాజ్యాంగ ప్రాముఖ్యతలను పరిశీలించండి.

7. రెండో జేమ్స్ అనుసరించిన కాథలిక్ విధానాలను వివరించండి.

లేదా

మూడో విలియం కాలంలో పార్లమెంట్ చేసిన నూతన శాసనాలు, వాటి అంశాలను పేర్కొనండి.

8. అమెరికా స్వాతంత్ర్య పోరాట కాలం నాటి (1775) సాంఘిక సిద్ధాంతాలను వర్ణించండి.

లేదా

బోస్టన్ టీ పార్టీ ప్రాముఖ్యత ఏమిటి?

9. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనలోని ప్రధానాంశాలు, వాటి ప్రాముఖ్యతను తెల్పండి.

లేదా

ఫిలడెల్ఫియా రాజ్యాంగ పరిషత్తు, దాని ధ్యేయాల గురించి నీకు తెలిసిందేమిటి?

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - 3 : ఆధునిక విప్లవాలు

## అభ్యాసం - 1

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. తొలి స్టూవర్ట్‌లు, వారి పార్లమెంట్‌ల మధ్య ఘర్షణకు దారితీసిన పరిణామాలను సమీక్షించండి.
2. అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి దారితీసిన కారణాలెవ్వి?

### భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మహోజ్వల విప్లవ ఫలితాలు, ప్రాముఖ్యతను విశ్లేషించండి.
2. అమెరికన్ రాజ్యాంగ స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - 3 : ఆధునిక విప్లవాలు

## అభ్యాసం - 2

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూక్కు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

B R A O U

### భాగం - A

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రష్యాలో అక్టోబర్ విప్లవానికి దారితీసిన సంఘటనలను సమీక్షించండి.
2. ఫ్రాన్స్‌లో జాతీయ సభ ప్రవేశపెట్టిన సంస్కరణలను పరిశీలించండి.

### భాగం - B

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. రష్యాలో డిసెంబరిస్ట్ తిరుగుబాటెలా వచ్చింది? ఎందుకు విఫలమైంది?
2. ఫ్రెంచి విప్లవ గమనంలో మిరాబు, రాబస్పియర్‌లు ఎటువంటి పాత్రను నిర్వహించారు?

BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

కోర్స్ - 3 : ఆధునిక విప్లవాలు

## అభ్యాసం - 3

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

B R A O U

భాగం - A

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. అంతర్యుద్ధం నాటి చైనా దేశ పరిస్థితులను విశ్లేషించండి.
2. వియత్నాం ఏకీకరణ పోరాటానికి దారితీసిన పరిస్థితులను సమీక్షించండి

భాగం - B

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. కమ్యూనిస్ట్‌ల సుదీర్ఘ యాత్ర ఫలితాలు, ప్రాముఖ్యతను తెల్పండి.
2. జెనీవా ఒప్పందం (1954) షరతులు, ప్రాధాన్యతను వివరించండి.

BRAOU

BRAOU

BRAOU